# Rayalaseema Adhunika Kavitvam - Prantiya Chaitanyam

**(1986-2015)**

*A disseratation submitted to the Univerisity of Hyderabad*
*in Partial fulfilment of the requirements for the*
*award of the Degree of*

**Doctor of Philosophy**

in **Telugu**

*by*

**Nagesh Babu.G**
*Regd.No.*14HTPH07

*Under Supervision*

**Prof. Pillalamarri Ramulu**

**Department of Telugu**

**School of Humanities**
**University of Hyderabad**

Hyderabad-500046
Telangana, India
2022

# రాయలసీమ ఆధునిక కవిత్వం - ప్రాంతీయ చైతన్యం
## (1986-2015)

( హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖకు సమర్పించిన

పిహెచ్.డి. పరిశోధన సిద్ధాంత గ్రంథం )


పరిశోధన

నాగేష్ బాబు.జి

పర్యవేక్షణ

ఆచార్య పిల్లలమర్రి రాములు

తెలుగు శాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు -500046

తెలంగాణ, ఇండియా


2022

# అంకితం

అమ్మా నన్ను కని పెంచి, పెద్ద చేసి ఇంత వాడిని చేసిన మీకు అక్షరాభివందనాలు సమర్పిస్తూ పాదాభివందనాలతో నా స్వహస్తాలతో గీసిన చిత్రం అంకితం.............. !


Scanned with CamScanner

# అంకితం

నాన్నా నా ఆలనా పాలనా చూసి, నా మీద ప్రేమాభిమానాలు పంచి

కీర్తిశేషులైన మా నాన్న గారికి అక్షరాభివందనాలు సమర్పిస్తూ

పాదాభివందనాలతో, నా స్వహస్తాలతో గీసిన చిత్రం మీకు అంకితం........!



# DECLARATION

I, Nagesh babu G, hereby declare that this Thesis entitled **"Rayalaseema Adhunika kavitvam – Prantiya Chaitanyam" (1986 – 2015)** Submited by me under the guidance and supervision of **Prof. Pillalamarri Ramulu** is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institutions for the award of any degree or diploma. I hereby agree that my thesis can be deposited in Shodganga/INFLIBNET

Date:

Place: Hyderabad

**Nagesh babu G**

Regd. No. 14HTPH07

# CERTIFICATE

This is to certify that Thesis entiteled "**Rayalaseema Adhunika kaivtvam – Prantiya chaitanyam"(1986 – 2015)** submitted by Mr. Nagesh babu G, bearing Regd. No. 14HTPH07 in partial fulfilment of the requirement for the award of Doctor of Philosophy in the School of Humanities, Department of Telugu is a bonafied work carried out by him under supervision and guidance.

The thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this university or any other university or institution for the award of any degree or diploma.

**A. Published in the following publication:**

1. **"Rayalaseema vachana kavitvam – prantiya astitvam" (**ISBN No: 978-93-5300-753-9), Vol-III. 2&3 APRIL, 2018. ANDHRA BHARATHI. International Seminar Research Papers.

2. **"Rayalaseema vachchana kavitvam - Samajika parivartana"** (ISSN NO: 2456 – 4702) Vol.13. Issue No.8 August 2017. BHAVAVEENA Special edition

**B. Presented papers & participated in the following conferences:**

1. **"Rayalaseema adhunika kavitvam - prantiya astitvam"** (Natinal seminar) by dept of Telugu SVGM Govt Degree college, Kalyanadurgam, AP.

2. **"Samakalina Rayalaseema vachana kavitvam – Prantiya spruha"** (National seminar) by the Dept of Telugu, Dravidian University, Kuppam, AP.

Further, The Student has passed the following courses towards fulfilment of coursework requirement for Ph.D. was exempted from doing coursework (recommended by Doctoral Committee) on the basis of the following courses during his M.Phill., program and the M.Phill, degree was awarded.

| **Course Code** | **Name** | **Credits** | **Pass/fail** |
|---|---|---|---|
| 1. HT - 700 | Research Methodology | 4.00 | PASS (B+) |
| 2. HT - 701 | History of Telugu Research | 4.00 | PASS (B+) |
| 3. HT - 702 | Studies in Specialized area | 4.00 | PASS (A) |
| 4. HT - 703 | Broad field | 4.00 | PASS (A+) |

**Research Supervisor** **Head, Telugu** **Dean, Humanities**

# విషయ సూచిక


I. కృతజ్ఞతలు i

II. ముందుమాట iv

<u>మొదటి అధ్యాయం</u> పుట

**1. రాయలసీమ భౌగోళిక, చారిత్రక నేపథ్యం (1 - 23)**

1.1. రాయలసీమ భౌగోళిక స్వరూపం 1

1.1.1. భౌగోళిక స్వరూపం 1

1.1.2. శీతోష్ణస్థితులు 2

1.1.3. నదులు 2

1.1.4. వర్షపాతం 3

1.1.5. వ్యవసాయం 3

1.1.6. పంటలు 3

1.1.6.1. ఆహార పంటలు 3

1.1.6.2. వ్యాపార పంటలు 4

1.1.7. నీటిపారుదల 4

1.1.7.1 తుంగభద్రానది 4

1.1.7.2. పెన్నానది 5

1.1.7.3. కె.సి.కెనాల్ 5

1.1.7.4. శ్రీశైలం కుడిగట్టు కాలువ(ఎస్.ఆర్.బి.సి) 5

1.1.7.5. హంద్రీ-నీవా ప్రాజెక్టు 6

1.1.7.6. గాలేరు-నగరి ప్రాజెక్టు 6

1.1.8. ఖనిజ సంపద 6

1.1.8.1. ఆస్‌బెస్టాస్(రాతినార) 6

1.1.8.2. బైరెటీస్(ముగ్గురాయి) 6

1.1.8.3. లైమ్‌స్టోన్(సున్నపురాయి) 7

1.1.8.4. బంకమన్ను 7

1.1.8.5. ఇనుప ఖనిజం(ఐరన్ ఓర్) 7

1.1.8.6. గ్రానైట్ 7

1.1.8.7. పులరిన్ 7

1.1.8.8. యురేనియం 7

1.1.8.9. పరిశ్రమలు 8

1.2. రాయలసీమ చారిత్రక నేపథ్యం 8

1.2.1. రాయలసీమను పాలించిన రాజులు 8

1.2.1.1. నందులు 8

1.2.1.2. మౌర్యులు 9

1.2.1.3. శాతవాహనులు 9

1.2.1.4. రేనాటి చోళులు 9

1.2.1.5. చాళుక్యులు 9

1.2.1.6. బాణులు 10

1.2.1.7. వైదుంబులు 10

1.2.1.8. విజయనగర కాలం నాటి రాయలసీమ 10

1.3. రాయలసీమ పదం 12

1.4. రాయలసీమ నామకరణం 14

1.5. రాయలసీమలో తిరుగుబాట్లు - స్వాతంత్ర్యోద్యమం 16

1.6. జాతీయోద్యమం - రాయలసీమ పాత్ర 17

1.7. మద్రాస్ రాష్ట్రం - రాయలసీమ 18

1.8. ఆంధ్ర మహాసభ ఉద్యమం 18

1.9. రాయలసీమ మహాసభ 18

1.10. శ్రీబాగ్ ఒప్పందం - కోస్తావారి హామీలు - ఉల్లంఘనలు 19

1.11. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం - ఒక డిమాండ్ 20

## రెండవ అధ్యాయం

**2.రాయలసీమ ఆధునిక కవిత్వం - పరిచయం (26 - 84)**

2.1. రాయలసీమ ఆధునిక కవిత్వ నేపథ్యం 26

## మూడవ అధ్యాయం

**3.రాయలసీమ ఆధునిక కవిత్వం - వస్తు వైవిధ్యం(1986-2015) (86 - 213)**

3.0. సాహిత్యం - సమాజం 86

3.1. వస్తువు - వివరణ 86

3.2. రాయలసీమ కవిత్వం - వస్తువు 87

3.2.1. రైతులు 87

3.2.2. వ్యవసాయం 96

3.2.3. కరువు 102

3.2.4. రైతులు - ఆత్మహత్యలు 112

3.2.5. రైతులపై దోపిడీలు 114

3.2.6. వలసలు 117

3.2.7. ఫ్యాక్షనిజం 121

3.2.8. నీటి సమస్య 127

3.2.9. స్త్రీ సమస్యలు 130

3.2.10. దళితులు 139

3.2.11. కుల వృత్తులు 146

3.2.11.1. చేనేత కార్మికులు 146

3.2.11.2. విశ్వకర్మ 149

3.2.11.3. కుమ్మరి 150

3.2.11.4. యాదవులు 152

3.2.11.5. మంగలి 153

3.2.11.6. మాదిగ వృత్తి 154

3.2.12. కపిల 155

3.2.13. బాల్యం - అనాథ బాలలు 157

3.2.14. స్మృతి కవిత్వం 161

3.2.15. పల్లెలు 165

3.2.16. సీమ – మాండలికం 173

3.2.17. సీమ – ప్రాదేశికత 179

3.2.18. వర్గ – ముఠా కక్షలు 181

3.2.19. ఉగ్రవాదం – తీవ్రవాదం 183

3.2.20. నదులు 187

3.2.21. ప్రేమోన్మాదులు 190

3.2.22. మృత శిశువులు 192

3.2.23. ప్రపంచీకరణ ప్రభావం 195

## నాల్గవ అధ్యాయం

**4.రాయలసీమ ఆధునిక కవిత్వం – ప్రాంతీయ చైతన్యం(1986-2015) (215 – 326)**

4.1. ప్రాంతం అర్థం – నిర్వచనం 215

4.2. ప్రాంతీయవాదం 216

4.2.1. ప్రాంతీయవాద లక్షణాలు 218

4.2.2. ప్రాంతీయవాద రకాలు 218

4.2.3. ప్రాంతీయవాద కారణాలు 219

4.2.4. ప్రాంతీయవాదం – అభివృద్ధి మూలాలు 220

4.3. ప్రాంతీయ చైతన్యం 221

4.4. రాయలసీమ కవిత్వం – ప్రాంతీయ చైతన్యం 223

4.4.1. వ్యవసాయం – చైతన్యం 229

4.4.2. రైతులు – రైతుల ఆత్మహత్యలపై చైతన్యం 236

4.4.3. కరువు – చైతన్యం 245

4.4.4. వలసలు – చైతన్యం 258

4.4.5. ఫ్యాక్షన్ నిర్మూలన – చైతన్యం 260

4.4.6. నీటి సమస్యలు – చైతన్యం 262

4.4.7. కుల వృత్తుల చైతన్యం 275

4.4.7.1. చేనేత వృత్తి చైతన్యం 275

4.4.7.2. కుమ్మరి వృత్తి చైతన్యం 278

4.4.7.3. కంసాలి వృత్తి చైతన్యం 279

4.4.7.4. రజకుల వృత్తి చైతన్యం 280

4.4.7.5. బెస్తలు వృత్తి చైతన్యం 281

4.4.8. రాజకీయ నాయకులు - ప్రభుత్వాల నిర్లక్ష్యం పట్ల చైతన్యం 284

4.4.9. దళితుల వివక్షపై చైతన్యం 295

4.4.10. ఉగ్రవాదం వ్యతిరేకత పట్ల చైతన్యం 299

4.4.11. ప్రపంచీకరణ వ్యతరేక కవిత్వం చైతన్యం 302

## <u>ఐదవ అధ్యాయం</u>

**5.రాయలసీమ ఆధునిక కవిత్వం -రూప(ప్రక్రియ) పరిణామ వైవిధ్యం(1986-2015)**

**(328 - 442)**

5.1. పద్య కవిత్వం 328

5.2. గేయ కవిత్వం 340

5.3. ఖండ కావ్యం 350

5.4. శతకం 351

5.5. పాట 356

5.6. వచన కావ్యం 363

5.7. వచన కవిత 368

5.8. దీర్ఘ కవిత 377

5.9. మినీ కవిత 394

5.10. నానీలు 401

5.11. హైకూలు 408

5.12. రుబాయిలు 413

5.13. క.చ.ట.త.ప(త్రిపదలు) 417

5.14. ఎస్జీడీలు 420

5.15. బాలీలు 422

5.16. కోయిలమ్మ పదాలు 424
5.17. చిలుక పలుకులు 427
ముగింపు 443
పరిశోధన ఫలితాలు 445
అనుబంధాలు 448
ఉపయుక్త గ్రంథసూచి 456
ప్రచురణ పొందిన పరిశోధన వ్యాసాలు
సదస్సులలో పొందిన ప్రశంసా పత్రాలు

# కృతజ్ఞతలు

నాకు జన్మనిచ్చి నా జీవితానికి బతుకునిచ్చి సమాజంలో నాకొక మంచినడవడికను, ఒక గుర్తింపును పొందేలా తీర్చిదిద్ది అలాగే తాముపడే కష్టాలు, శ్రమ, బాధలు పిల్లలు పడకూడదని భావించి, నన్ను బాగా చదివించి, ఉన్నత విద్యవైపు ప్రోత్సహించి, నన్ను ఇంతవాన్ని చేసి, ఈ స్థాయికి తెచ్చిన అమ్మానాన్నలకు ఋణపడి వుంటూ పాదాభివందనాలు.

నాకు పిహెచ్.డి. పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన తెలుగుశాఖకు మరియు పరిశోధనకు అన్ని రకాల వసతులను, ఉన్నతమైన అవకాశాలను కల్పించి నా విద్యాభివృద్ధికి ముందడుగు వేయించిన హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వారికీ,

నా పరిశోధనకు పర్యవేక్షణ బాధ్యతను వహించి, పరిశోధనలో సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చి, పరిశోధన మెలకువలు, సలహాలు, సూచనలు ఇస్తూ మా కుటుంబ పరిస్థితులను, మా ప్రాంత స్థితిగతులను చర్చిస్తూ, ఈ పోటీ ప్రపంచంలో ఎలా నిలదొక్కుకోవాలో ఆ స్ఫూర్తిని నింపి, కుటుంబ సభ్యునిగా నన్ను భావించి, మాటల్లోనూ మాధుర్యం, మనసులో సునిసిత మంచితనం కలగలసిన ఆత్మీయతను పంచి, సకాలంలో ఈ పరిశోధన సిద్ధాంత గ్రంథం పూర్తి కావడానికి ప్రోత్సహించిన మా గురువు ఆచార్య పిల్లలమర్రి రాములు గారికీ.

నా పరిశోధనకు డాక్టోరల్ కమిటి సభ్యులుగా వ్యవహరించిన వారు ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికీ, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి గారికీ,

ఎప్పుడు కనిపించినా ఆప్యాయతతో పలకరించి, మా బాగోగులను, పరిశోధన వివరాలు అడిగి తెలుసుకునే ఇప్పటి తెలుగుశాఖ అధ్యక్షులైన ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారికీ,

తెలుగుశాఖలోని ఆచార్యుల బృందం ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికీ, ఆచార్య గడ్డ అరుణకుమారి గారికీ, ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికీ, ఆచార్య గోనా నాయక్ గారికీ, ఆచార్య పమ్మి పవన్‌కుమార్ గారికీ, ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి గారికీ, డా.బాణాల భుజంగరెడ్డి గారికీ, డా.దాసరి విజయకుమారి గారికీ,

నా చదువులకు ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలిగించకుండా నన్ను ముందుకు పంపి ఈ స్థాయికి తెచ్చిన మా కుటుంబ సభ్యులైన అన్నయ్య చిరంజీవి, అక్కయ్యలు శ్రీదేవి, మాధవి అలాగే బావ ఆదినారాయణ, రమేష్‌లకు,

మా చిన్నప్పటి నుంచి మా కుటుంబానికి తోడు నీడగా ఉంటూ అండగా నిలిచి ఆదుకొంటూ అలాగే నేను ఎక్కడ వున్నా నా బాగోగులను అడుగుతూ నా అభివృద్ధిని ఆకాంక్షిస్తూ మమకారంతో పలక రించే మామయ్య వన్నప్ప, అత్తయ్య లక్ష్మీదేవి అలాగే ఆప్యాయంగా స్నేహభావంతో కలిసి మెలిసి నా ఉన్నతిని కోరుకున్న అల్లుడు ఉమేష్‌చంద్ర మరియు బావమరిది గోపికృష్ణలకు,

నా చిన్నప్పటి నుంచి నేను చదువుకునే రోజుల నుండీ నన్ను నా వ్యక్తిత్వాన్ని గౌరవిస్తూ, నా ఆలోచనలను పంచుకొంటూ తనదైన సలహాలు ఇస్తూ సమాజంలో నేను ఒక ఉన్నతమైన స్థానంలో ఉండాలని పరితపించి ఎల్లప్పుడు నా శ్రేయస్సును, అభివృద్ధిని కోరుకొంటూ నా వెంట నడిచి నన్ను ముందుకు నడిపిస్తూ ప్రోత్సహిస్తూ సంపూర్ణ సహకారం అందించిన నా సహచరి శ్రీమతి కోమలకు కృతజ్ఞతలు, మా వెచ్చిని ప్రపంచంలోకి అడుగుపెట్టిన కోమలిపుత్రకు ఆశీస్సులు,

నన్ను, మా కుటుంబాన్ని ఆదరించి ఆప్యాయతలను పంచుతున్న అన్నదమ్ములకు, బంధువు లందరికీ,

నా చిరకాల ఆప్తమిత్రుడు నాకు మా కుటుంబానికి సన్నిహితంగా, ఆసరాగా వుంటూ, నా ప్రతి విషయంలోనూ తోడ్పాటును అందిస్తూ నా వెన్నంటి వుంటూ ప్రోత్సహించిన చిత్రకళాకారుడు, స్నేహశీలి అయిన నాగరాజుకు,

నా సహ పరిశోధక మిత్రులు ధీరవత్ లక్షణ్, గంద్ర మహేష్‌లకూ,

పరిశోధన కాలంలో యు.జి.సి-జె.ఆర్.ఎఫ్ ఫెలోషిప్ అందించిన న్యూఢిల్లీ యు.జి.సి బృందం మరియు సెంట్రల్ యూనివర్సిటీ ఫైనాన్స్ సిబ్బందికీ,

పరిశోధనలో పుస్తకాల సేకరణలో సహకారం అందించిన సుందరయ్య విజ్ఞానభవన్, సి.పి.బ్రౌన్ పరిశోధన గ్రంథాలయం, ఇందిరాగాంధీ మోమోరియల్ లైబ్రరీ నిర్వాహకులకు, సిబ్బందికీ,

రాయలసీమ నాలుగు జిల్లాలలోని కవులు, రచయితలను గుర్తించి వారిని చరవాణి ద్వారా సంప్రదించి వారి అనుమతితో వారి దగ్గరకు వెళ్ళినపుడు వారి విలువైన సమయాన్ని నాకు కేటాయించి, అమూల్యమైన కవిత్వ విషయాలను తెల్పి కవిత్వ పుస్తకాలను అందించిన సహృదయ కవులు, రచయిత లందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు,

నన్ను ఇంటికి రమ్మని పిలిచి ఆత్మీయంగా ఆదరించి ముఖాముఖి ఇంటర్వ్యూకు అనుమతి నిచ్చి రాయలసీమ ఆధునిక కవిత్వం, ప్రాంతీయ చైతన్యంపై తమ అభిప్రాయాలను నాకు వివరించి ప్రాపంచిక దృక్పథాన్ని కలిగించిన వారు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ విమర్శకులు, కవి అయిన విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారికీ,

కర్నూలుకు చెందిన ప్రముఖ కవి మరియు కథా రచయిత అయిన జి.వెంకటకృష్ణ గారిని ప్రత్యక్షంగా కలిసినపుడు వారు రాయలసీమ కవిత్వం గురించి ఎన్నో విషయాలను విశదపరిచారు. ముఖాముఖిలో విలువైన సమాచారాన్ని అందించినందుకు వారికీ,

తెలుగు శాఖ బోధనేతర మరియు కార్యాలయ సిబ్బంది అందరికీ,

నా శ్రేయస్సును ఆకాంక్షిస్తూ చిరునవ్వుతో పలకరించే మృదుస్వభావి అయిన రాయదుర్గం ఆదర్శ పాఠశాల మరియు కళాశాల ప్రిన్సిపాల్ బి.సి.ఆదినారాయణప్ప అలాగే నా పరిశోధన వివరాలు అడుగుతూ పరిశోధనను త్వరగా పూర్తి చెయ్యాలని సలహాలు ఇచ్చిన నా సహ అధ్యాపకులైన యాదవ మూర్తి, తిమ్మయ్య, గంగయ్య యాదవ్, విజయుడు, చంద్రశేఖర్, ఇమ్రాన్, బసవరాజు, రవికుమార్, శాంతకుమార్ రెడ్డి గార్లకు, మిగతా అధ్యాపకురాళ్ళకీ, బోధనేతర సిబ్బందికీ,

ఈ పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని అనుకున్న సమయానికే అందంగా డి.టి.పి చేసి ఇచ్చిన వేపరాల కిరణ్‌కుమార్ అన్నకు,

ఇంకా ఈ సిద్ధాంత గ్రంథ సమగ్రతకు, నాకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయ సహకారాలందించి తోడ్పాటు నందించిన సహృదయులందరికి పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**జి.నాగేష్ బాబు**

# ముందు మాట

## 1. ఉపోద్ఘాతం:

తెలుగు భాషా సాహిత్యాలకు దాదాపు రెండు వేల సంవత్సరాలకు పైగా చరిత్ర వుంది. ప్రాఙ్ఞన్నయ యుగకాలం మొదలుకొని నన్నయ యుగం నుంచి ఆధునిక యుగం నేటి కాలం వరకు తెలుగు సాహిత్యంలో కవిత్వం శక్తివంతమైన పాత్ర పోషించింది. ఆధునిక యుగం ప్రారంభమైన తర్వాత ఆధునిక తెలుగు సాహిత్యంలో ఉద్యమాలు, ధోరణులు, వాదాలు వచ్చాయి. అస్తిత్వ వాదాలు ప్రారంభమైన తర్వాత అది మరింత విస్తృతమై ఉద్యమ రూపాన్ని సంతరించుకుంటోంది. సాహిత్యంలో అస్తిత్వ వాదాలు బలమైన ముద్రను వేశాయని చెప్పవచ్చు. ఆ అస్తిత్వ వాదాల్లో భాగంగా స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీ, ప్రాంతీయ వాదాలు ముందుకు వచ్చాయి. ప్రస్తుతం తెలుగు సాహిత్యంలో ప్రాంతీయవాదం ఉద్యమ స్ఫూర్తిని అందుకొని విస్తృతంగా వెలువడుతోంది. ప్రాంతీయ అస్తిత్వవాదం మొదట కవిత్వంలోనే రూపుదిద్దుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలుగా విభజించబడి ఉండేది.

## 2. పరిశోధన నేపథ్యం:

తెలుగు నేలలో విభాజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్షిణాన ఉన్న 'రాయలసీమ' ప్రాంతానికి విశిష్టమైన సాహిత్య చరిత్ర, సంస్కృతులు ఉన్నాయి. ఈ ప్రాంతానికి దాదాపు రెండు వేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. రేనాటి చోళులు రాయలసీమను పరిపాలించిన ప్రధాన రాజవంశం. ఆ తర్వాత దక్షిణాపథాన్ని ఏకంచేసి పాలించిన వారు విజయనగర రాజులు. మొట్టమొదటి తెలుగు శాసనం క్రీ.శ. 6వ శతాబ్దానికి చెందిన 'ఎర్రగుడిపాడు' దాన శాసనం కడప జిల్లా కలమళ్ల గ్రామంలో వెలుగు చూసింది. ఈ శాసనాన్ని రేనాటి చోళులు వేయించారు. ఆ తర్వాత విజయనగర రాజుల కాలంలో కన్నడ, సంస్కృతాంధ్ర భాషల్లో శాసన, భాషా కావ్య సాహిత్యం వచ్చింది. రాయలసీమలో కన్నడ, తెలుగు, సంస్కృత భాషల్లో సాహిత్యం విరాజిల్లింది.

చరిత్రలో ఈ ప్రాంతం 'దత్తమండలాలు' అన్న పేరుతో పిలువబడింది. చారిత్రక పరిణామ క్రమంలో ఆంధ్రరాష్ట్ర ఉద్యమాలు జరుగుతున్న కాలంలో దత్తమండలాలు అనే పేరు బానిస బతుకులకు చిహ్నంగా ఉందని నాయకులు భావించి ఈ పేరుకు ప్రత్యమ్నాయంగా తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఆంధ్రమహాసభలలో 'రాయలసీమ' అన్న పేరును నాయకులందరూ ఏకగ్రీవంగా ఆమోదించుకున్నారు. ప్రస్తుతం రాయలసీమలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలు వున్నాయి.

ప్రాచీన సాహిత్యంలో నన్నెచోడుడు, నాచన సోమన, అల్లసాని పెద్దన, ధూర్జటి, పింగళి సూరన, రామరాజ భూషణుడు, మాదయగారి మల్లన, అయ్యలరాజ రామభద్రుడు, తాళ్ళపాక అన్నమయ్య, తాళ్ళపాక తిమ్మక్క, పాలవేకరి కదరీపతి, అయ్యలరాజు నారాయణామాత్యుడు, పోతులూరి వీరబ్రహ్మం, వేమన మొదలైన కవులు రాయలసీమ ప్రాంతం నుండి ప్రాచీన సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఆధునిక కాలంలో సంప్రదాయ సాహిత్యాన్ని అనుసరిస్తున్న వారు దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకటశేషశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, కట్టమంచి రామలింగా రెడ్డి, పుట్టపర్తి నారాయణా చార్యులు, విద్వాన్ విశ్వం లాంటివారు ప్రసిద్ధులు. 19వ దశాబ్ది ప్రథమార్థం నుంచి పద్యకావ్యాలు, అవధాన కవిత్వం, గేయకావ్యాలు, ఖండకావ్యాలు, పద్య ఖండికలు వెలువడిన తర్వాత వచన కవిత్వం వెలువడింది. స్వాతంత్ర్యానంతరం రాయలసీమలో ఆధునిక కవిత్వం విస్తృతంగా వెలువడుతూ 1980 నుండి ప్రాంతీయ స్పృహతోనూ, చైతన్యవంతంగా కవిత్వం రావడం ప్రారంభమైంది.

జూపల్లి ప్రేంచంద్, కెరె జగదీష్, యక్కలూరి శ్రీరాములు, మల్లెల నరసింహమూర్తి, రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, సడ్లపల్లె చిదంబర రెడ్డి, ఎస్.మునిసుందరం, వేంపల్లి అబ్దుల్ ఖాదర్, రఘుబాబు, జి.వెంకటకృష్ణ, కెంగార మోహన్, రాధేయ, కాణిపాకం లింగన్న, నాగప్పగారి సుందర రాజు, ఎన్.రామచంద్ర, ఎస్జీడీ చంద్రశేఖర్, పి.నరసింహా రెడ్డి, లోసారి సుధాకర్, పాణి, ముక్తాపురం స్నేహలత, డి.శిరీష, కల్పన రెంటాల, నిర్మలారాణి, శశిశ్రీ, ఎన్.ఈశ్వర రెడ్డి, నూకా రామ్ ప్రసాద్ రెడ్డి తవ్వా ఓబుల్ రెడ్డి, బిక్కి కృష్ణ మొదలైన వారు వచన కవిత్వాన్ని విస్తృతంగా రాస్తున్నారు.

రాయలసీమ ప్రాంతం భౌగోళికంగా మిగతా ప్రాంతాలకంటే భిన్నమైనది. భారత దేశంలోనే రాయలసీమ కరువు పీడిత ప్రాంతంగా గుర్తించబడి వెనుకబడిన ప్రాంతాల జాబితాలో చేరిపోయింది. రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, సామాజిక రంగాలపై ప్రభావం చూపింది. సాహిత్యంలో మాత్రం ప్రాచీన సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యం వరకు రాయలసీమ విశిష్టమైన పాత్ర పోషించింది. నేను రాయలసీమలోని అనంతపురం జిల్లాకు చెందిన వాడిని. సాహిత్యంలో కవిత్వం పట్ల ఇష్టం, అభిరుచి, ఆసక్తి ఉన్నవాడిని. నేను ఎం.ఎ. చదువుతున్నపుడు మా విశ్వవిద్యాలయ తెలుగువిభాగం పాఠ్యప్రణాళికలో ఆధునిక సాహిత్యంలో ప్రాంతీయవాద కవిత్వం ఒక పాఠ్యాంశంగా ఉండేది. విద్యార్థి స్థాయిలో ప్రాంతీయవాద కవిత్వాన్ని చదివి కవిత్వం మీద వున్న అభిరుచితో రాయలసీమ ఆధునిక కవిత్వం మీద పరిశోధన చేయాలనే అభిలాష కలిగింది. రాయలసీమ ఆధునిక కవిత్వాన్ని నా కోణంలోంచి పరిశీలించి అధ్యయనం చేయాలనే దృష్టితో పరిశోధన రంగంవైపు అడుగులు వేసి ఈ పరిశోధన రచనకు పూనుకున్నాను.

## 3. పరిశోధన ఆవశ్యకత:

కాలంతో పాటు సమాజం, సమాజంతో పాటు సాహిత్యం మార్పుకు లోనవుతూ నూతన దృక్పథాన్ని, ఆలోచనలను అందిస్తాయి. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా వచ్చిన ఉద్యమాలు, జరుగుతున్న పోరాటాలు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. ఆ ప్రభావంతో అస్తిత్వవాద ఉద్యమాలు రూపుదిద్దుకొని ముందుకు వచ్చాయి. సాహిత్యంలో కులం, మతం, జెండర్ మాత్రమే కాదు 'ప్రాంతం' కూడా ప్రధానమైన పాత్రను పోషిస్తోంది. నేడు ప్రాంతీయ అస్తిత్వ దృక్పథంతో కవిత్వం విస్తృతంగా వెలువడుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్త రాంధ్ర ప్రాంతాలలో కోస్తాంధ్ర తప్ప మిగిలిన ప్రాంతాలు నిర్లక్ష్యానికీ, వివక్షకూ గురయ్యాయి. వీటిలో రాయలసీమ తర్వాత తెలంగాణ ప్రాంతం మరింత అన్యాయానికి గురైంది. తెలంగాణా మినహా మిగతా ప్రాంతాలలో ముందుగా కథల్లోనే జీవితం వ్యక్తమైందని గుర్తించవచ్చు. కనుక ప్రాంతీయ చైతన్య కవిత్వమంటే తెలంగాణ కవిత్వమనే భావన ఏర్పడింది. తెలుగుదేశంలో ప్రాంతీయవాద ఉద్యమాలకు తెలంగాణ ప్రజలే శ్రీకారం చుట్టారు.

రాయలసీమలో ప్రాంతీయ చైతన్యానికి సంబంధించిన కవిత్వం విస్తృతంగా వెలువడింది. ప్రాంతీయత పట్ల గత ఆంధ్రరాష్ట్ర ఉద్యమ కాలం నుంచి సీమ వాసులకు తమ అస్థిత్వం, తమ భవిష్యత్ మనుగడ, ప్రాంత స్పృహ, ప్రాంతీయతా చైతన్యం పట్ల బలంగా నాటుకుని పోయి అది నేటికి కూడా కొనసాగుతూ బలపడింది. కట్టమంచి రామలింగా రెడ్డి నూతన ప్రయోగంగా కొత్త వస్తువుతో రాసిన 'ముసలమ్మ మరణం' నవ్య కవిత్వానికి నాంది పలికింది. రాయలసీమలో ఆధునిక కవిత్వానికి ప్రారంభకులు కట్టమంచివారే. ఆ తర్వాత రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారి పెనుగొండ కొండ పాటతో ప్రాంతీయ చైతన్యం ప్రారంభమైందని విమర్శకులు గుర్తించారు. పుట్టపర్తి నారాయణచార్యుల వారి పెనుగొండ లక్ష్మీ, ఆ తర్వాత విద్వాన్ విశ్వం గారి 'పెన్నేటిపాట'(1955)తో ప్రాంతీయ స్పృహ, చైతన్యం, ప్రాంతీయ వేదన బలంగా వ్యక్తమైంది.

1980ల నుంచి వచన కవిత్వం వెలువడుతోంది. రాయలసీమ ప్రాంతంలోని విభిన్న సామాజికాంశాలను ప్రస్తావించారు. రాయలసీమలో నిత్యం సంభవించే కరువులు, ఆ కరువు వల్ల తీవ్రంగా నష్టపోయే వ్యవసాయం, రైతుల ఈతిబాధలు, ఆత్మహత్యలు, వలసలు, పంటపొలాలకు నీటి సమస్యలు, ఫ్యాక్షన్ గొడవలు, వర్గ, కుల, కక్షలు, రాజకీయాలు, ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడుతూ చైతన్య దృక్పథంతో కవితలు రాశారు. కవులు వ్యక్తీకరించిన కవిత్వంలో ప్రాంతీయ చైతన్యాన్ని వివేచించి విశ్లేషించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

**4.పరిశోధన పరిధి:**

తెలుగు సాహిత్యంలో కవిత్వం చాలా విస్తృతమైనది. కవిత్వం ఆలోచనాత్మకమైన ఆవేశ ప్రక్రియ. రాయలసీమ ఆధునిక సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో సాహిత్యం వచ్చింది. పద్య కవిత్వం, ఖండ కావ్యాలు, గేయ కావ్యాలు, అవదాన కవిత్వం, కథ, నవల, నాటిక, శతకం మొదలైన వాటన్నింటిని పరిశోధించడం చాలా కాల పరిమితితో కూడినది. అలాగే వీటన్నింటినీ పరిశీలించడం సంస్థాగతంగా చేయవలసిన పని. ఈ సిద్ధాంత గ్రంథ పరిధి పరిమితుల దృష్ట్యా రాయలసీమ ఆధునిక కవిత్వంలోని (1986-2015 సం॥ల మధ్యలో వచ్చిన) వచన కవిత్వాన్ని మాత్రమే నా పరిశోధనాంశానికి ఎన్నుకొని ఈ పరిశోధనకు పూనుకున్నాను.

**5. పూర్వ పరిశోధనలు:**

నా పరిశోధనాంశం "రాయలసీమ ఆధునిక కవిత్వం-ప్రాంతీయ చైతన్యం(1986- 2015) అనే అంశంపై ఇప్పటి వరకు పరిశోధన జరగలేదు (ఆధారం: విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన, 2013) అయితే ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రాంతీయ చైతన్యం, ప్రాదేశికత, కరువు, అస్తిత్వాల మీద పరిశోధనలు జరిగాయి. రాయలసీమ కవిత్వంపై ఇప్పటి వరకు విశ్వవిద్యాలయాలలో జరిగిన పరిశోధన వివరాలను కింద పేర్కొంటున్నాను.

**పి.హెచ్.డి.గ్రంథాలు:**

1. నరేష్.కొక్కు, "రెండుదశాబ్దాల రాయలసీమ ఆధునిక కవిత్వం- ఒక అధ్యయనం (1981-2000)", కడప: యోగివేమన విశ్వవిద్యాలయం, 2020.
2. నారాయణ సుబ్బన్న. వి, "ఆధునికాంధ్ర కవిత్వానికి సీమ కవుల దోహదం", తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 2008.
3. శ్రీదేవి.వి, "రాయలసీమ వచన కవిత్వం-ఒక పరిశీలన, తిరుపతి: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, 2005.

**6. అధ్యాయ విభజన:**

ఈ పరిశోధనను ప్రాంతీయ అస్తిత్వంలో భాగంగా ప్రాంతీయ స్పృహతోనూ, ప్రాంతీయ చైతన్య దృక్పథంలో నుండి పరిశీలించి విశ్లేషించాను. నా పరిశోధనాంశాన్ని కింది విధంగా అధ్యాయ విభజన చేశాను.

మొదటి అధ్యాయం: రాయలసీమ భౌగోళిక, చారిత్రక నేపథ్యం

రెండో అధ్యాయం: రాయలసీమ ఆధునిక కవిత్వం - పరచయం

మూడవ అధ్యాయం: రాయలసీమ ఆధునిక కవిత్వం - వస్తు వైవిధ్యం(1986-2015)

నాల్గవ అధ్యాయం: రాయలసీమ ఆధునిక కవిత్వం - ప్రాంతీయ చైతన్యం(1986-2015)

ఐదవ అధ్యాయం: రాయలసీమ ఆధునిక కవిత్వం-రూప పరిణామ(ప్రక్రియ) వైవిధ్యం(1986-2015)

ముగింపు: పరిశోధనా ఫలితాలు,

అనుబంధం: రాయలసీమ కవులు, విమర్శకులతో ముఖాముఖీ

**మొదటి అధ్యాయం:** రాయలసీమ భౌగోళిక స్వరూపంలోని శీతోష్ణస్థితులు, నదులు, వర్షపాతం, వ్యవసాయం, పంటలు, నీటి పారుదల వ్యవస్థలోని నదులు, ప్రాజెక్టులు గూర్చి, ఖనిజ సంపదలో భాగంగా వివిధ రకాల ఖనిజాలను వాటి విశేషాలను తెలిపాను. రాయలసీమ చారిత్రక నేపథ్యంలో భాగంగా రాయలసీమను పాలించిన రాజవంశాల వివరాలు, అలాగే రాయలసీమ పదం ఎలా వచ్చింది, రాయలసీమ నామకరణం ఎలా జరిగందీ, రాయలసీమలో పాలెగాళ్ళ తిరుగుబాట్లు, స్వాతంత్రోద్యమం, జాతీయోద్యమ పరిస్థితులు, రాయలసీమ పాత్ర, మద్రాస్ రాష్ట్రంలోని రాయలసీమ స్థితిగతులు, ఆంధ్రమహాసభల ఏర్పాటు ఉద్యమాలు, శ్రీబాగ్ ఒప్పందం-ఉల్లంఘనలు, ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కోసం సీమ నాయకుల డిమాండ్‌లు వాటి పరిస్థితులను తెలిపాను. ఒక ప్రాంత చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, నాగరికతలను తీర్చిదిద్దడానికి వాటిని అధ్యయనం చేయడానికి భౌగోళిక, చారిత్రక పరిస్థితులు ఎంతగానో ఉపకరిస్తాయి. ఆ దృష్టితోనే ఈ మొదటి అధ్యాయంలో రాయలసీమ భౌగోళిక, చారిత్రక నేపథ్యాన్ని వివరించాను.

**రెండవ అధ్యాయం:** రాయలసీమలో ఆధునిక కవిత్వం ఎప్పటి నుంచి మొదలైంది. ఈ ఆధునిక కవిత్వానికి ప్రారంభకులు ఎవరు అని తెలిపాను. నా పరిశోధన 'రాయలసీమ ఆధునిక కవిత్వం-ప్రాంతీయ చైతన్యం(1986-2015)' అనే అంశానికి పూర్వ నేపథ్యంగా 1900 సం॥ నుంచి 1985 వరకు రాయలసీమలో వెలువడిన ఆధునిక కవిత్వాన్ని పరిచయం చేశాను. కట్టమంచి రామలింగారెడ్డి గారు ముసలమ్మ మరణం కావ్యం ద్వారా రాయలసీమ ఆధునిక కవిత్వానికి నాంది పలికి ఒక మార్గం చూపాడని చెబుతూ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, పుట్టపర్తి నారాయణాచార్యుల ప్రాంతీయ చైతన్య స్పృహను తెలిపాను. ఆ తర్వాత బెళ్ళూరి శ్రీనివాసమూర్తి, బైరపురెడ్డి నారాయణ రెడ్డి, కుంటిమద్ది శేషశర్మ, పాలా వెంకట సుబ్బయ్య కవుల రచనల్లోని సీమ సమకాలీన జీవితం, కరువు పరిస్థితులను తెలిపాను. విద్వాన్ విశ్వం గారి పెన్నేటి పాట కావ్యం ద్వారా సీమ వాస్తవ జీవిత చిత్రణ, భావం, భాష, రైతుల జీవితం, కరువు ప్రభావ దీనగాథలను వివరించాను. దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకటశేష శాస్త్రి, వై.సి.వి.రెడ్డి, గజ్జెల మల్లారెడ్డి, నారు నాగనార్య, ఎ.ఎన్.నాగేశ్వర రావు, మేడసాని మోహన్, నరాల రామారెడ్డి మొదలైన కవుల రచనల్లోని ఆధునిక కవితా పరిణామాన్ని విశ్లేషించాను. 19వ దశాబ్ది ప్రథమార్థం

నుంచి కవులు మొదట ప్రాచీన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ పద్య, ఖండ కావ్యాలు, శతకాలు, గేయ కావ్యాలు, గేయ నాటికలు ఆ తర్వాత అవధాన కవిత్వం రాశారు. కొంతమంది వచన పద్యంలోనూ, పద్యాన్ని మాత్రా ఛందస్సుతో కలిపి కొత్త బాటలు వేశారు. పద్య కవిత్వం రాస్తూనే వచన, గేయ కవిత్వాన్ని రాస్తూ వచ్చారు. ఇలా ఆధునిక కవిత్వ ప్రక్రియ రూపాల్లోని వైవిధ్యాన్ని, కవుల కవితా వస్తువుల సామాజిక పరిణామ రూపాన్ని, కవితా వికాసాన్ని విశ్లేషించే ప్రయత్నం చేశాను.

**మూడవ అధ్యాయం:** ఈ అధ్యాయంలో సాహిత్యం, సమాజం మధ్య సంబంధాన్ని, వస్తువు అంటే ఏమిటో తెలుపుతూ నిర్వచనాలను పొందుపరిచాను. నా పరిశోధనా కాల పరిధికి పరిమితమై వచన కవిత్వాన్ని వస్తువుపరంగా విభజించి విశ్లేషించాను. రాయలసీమ కవిత్వంలోని వస్తువు ప్రాదాన్యాన్ని వివరించాను. రాయలసీమ వ్యవసాయం, రైతులు, కరువు, రైతు ఆత్మహత్యలు, రైతులపై దోపిడీలు, ప్రజల వలసలు, నీటి సమస్యలు, ఫ్యాక్షనిజం, దళితుల కుల వివిక్ష, స్త్రీ సమస్యలు, కులవృత్తుల ప్రాధాన్యం, కపిల తోలు విధానం, అనాథబాలలు, సీమ పల్లెలు, సీమ మాండలికం, వర్గ–ముఠాకక్షలు, ఉగ్రవాదం–తీవ్రవాదం, నదులు, ప్రపంచీకరణ ప్రభావం మొదలైన అంశాలను వస్తుపరంగా విభజన చేసుకొని ఈ అంశాల మీద కవులు కవిత్వీకరించిన కవిత్వపు వైవిధ్యాన్ని, కవితా ప్రాముఖ్యాన్ని విశ్లేషించాను.

**నాల్గవ అధ్యాయం:** ఈ అధ్యాయంలో ప్రాంతం, ప్రాంతీయత అంటే ఏమిటో తెలిపాను. ప్రాంతీయ వాదం గూర్చి తెల్పుతూ ప్రాంతీయ వాదం తలెత్తే విధానాన్ని వివరిస్తూ ప్రాంతీయవాదం రకాలు, ప్రాంతీయ వాదాలు రావడానికి గల కారణాలు, ప్రాంతీయ వాదంలోని అభివృద్ధి మూలాలను గూర్చి వివరించాను. ప్రాంతీయ చైతన్యం అంటే ఏమిటో తెల్పి రాయలసీమ ప్రాంతీయ జీవిత చైతన్యం రాయలసీమ కవిత్వంలో ఎలా ప్రతిఫలించిందో వివరంగా తెలిపే ప్రయత్నం చేశాను. 1980 దశకం ప్రారంభంలో సీమ దీర్ఘకాలిక సమస్యలైన కరువు, నీటి సమస్యలు లాంటి వాటిపై రైతులు, ప్రజలు, ప్రజా సంఘాలు చైతన్య ఉద్యమాలు ప్రారంభించిన తర్వాత కవులు, రచయితలు, మేధావులు, యువ, నవతరం కొత్త కవులు భాగస్వామ్యులై తమ ప్రాంత అస్తిత్వాన్ని చాటుకొన్నారు. 1985ల నుంచి వచన కవిత్వాన్ని రాయలసీమ కవులు రాస్తూ వున్నప్పటికీ మునిసుందరం, జూపల్లి ప్రేంచంద్, యక్కలూరి శ్రీరాములు లాంటి కవులు తమ కవిత్వంలో సీమ అస్తిత్వాన్ని చాటుకొంటూ సీమను పలికించారని తెలిపాను. ఆ తర్వాత 2001లో 'సీమకవిత' కవితా సంకలనం రాయలసీమ చైతన్యాన్ని, ప్రాదేశికతను, ఉద్యమ ఆకాంక్షను కలగలిపి చెప్పినటువంటి సీమ మొదటి కవితా సంకలనంగా తెలిపాను. సీమ కవులు ఈ ఒరవడిని కొనసాగిస్తూ ప్రాంతీయ స్పృహతోనూ, చైతన్య దృక్పథంతోనూ కవిత్వం రాస్తూ వచ్చారు. సాహితీ సౌరభం, వొరుపు లాంటి కవితా సంకలనాలు సీమ జీవిత చైతన్యాన్ని వ్యక్తం చేశాయి. రాయలసీమలోని నాలుగు జిల్లాల నుంచి కవులు కవితా సంపుటాలను,

కవితా సంకలనాలను వెలువరించారు. సీమ ప్రాంత పూర్వాపరాలు, నైసర్గికత, ప్రకృతి వైపరిత్యాలైన కరువులు, వెనుకబాటుతనం, సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, ఫ్యాక్షన్, రాజకీయాలు, నీటి సమస్యలు, కరువు ప్రభావం వల్ల విధ్వంసం అయ్యే వ్యవసాయం, రైతులు, ప్రజల ఈతిబాధలు, రైతుల అప్పులు, ఆత్మహత్యలు, వలసలు, ప్రభుత్వపాలకుల నిర్లక్ష్యాలు, సీమ ప్రాంతంపై వివక్షత మొదలైన వాటిన్నింటి పట్ల ప్రాంతీయ స్పృహతో వ్యక్తం చేస్తూ ఒక దిక్కార స్వరాన్ని వినిపిస్తూ తిరుగుబాటు ధోరణిని అనుసరిస్తూ ప్రాంతీయ చైతన్యాన్ని వచన కవిత్వంలో కవులు, రచయితలు బలంగా వ్యక్తీకరించారని విశ్లేషించాను.

**ఐదవ అధ్యాయం:** ఈ అధ్యాయంలో రాయలసీమ ఆధునిక కవిత్వాన్ని రూప పరిణామాన్ని ప్రక్రియ పరంగా విభజించి కవిత్వ వైవిధ్యాన్ని ప్రదర్శించాను. 1986–2015 సం॥ల మధ్యకాలంలో రాయల సీమలో వెలువడిన ఆధునిక కవిత్వం ప్రక్రియ పరంగా ఎలాంటి పరిణామం చెందిందో రాయలసీమ కవుల కవితా స్వరూపాలలోని వైవిధ్యాన్ని తెలిపాలనే ఉద్దేశంతో ప్రక్రియ పరంగా విశ్లేషించాను. పద్య కవిత్వంతో మొదలుకొని ఖండకావ్యాలు, పాట, గేయ కావ్యం, శతకాలు, వచన కావ్యం, వచన కవిత, దీర్ఘకవిత, మినీ కవిత, నానీలు, హైకూలు, రుబాయీలు, త్రిపదలు, బాలీలు, ఎస్జీడీలు, కోయిలమ్మ పదాలు, చిలుక పలుకులు లాంటి కవితా రూపాల్లోని విశిష్టతలను తెలిపాను.

ఈ పరిశోధన సిద్ధాంత గ్రంథాన్ని సహృదయ సాహిత్య పాఠకులు చదివిన తర్వాత సముచిత సూచనలు, సలహాలను ఇచ్చినట్లయితే వాటిని సహృదయంతో స్వీకరించి సవరించుకోగలను అని మనవి చేస్తున్నాను.

# మొదటి అధ్యాయం

# రాయలసీమ భౌగోళిక, చారిత్రక నేపథ్యం

# మొదటి అధ్యాయం

# 1.రాయలసీమ భౌగోళిక, చారిత్రక నేపథ్యం

సువిశాలమైన మన భారతదేశం ప్రాదేశికంగా ఎన్నో విశిష్టతలను కలిగివుంది. భారతదేశం ప్రపంచ జనాభాలో రెండవ స్థానంలో, వైశాల్యంలో ఏడవ స్థానంలో వుంటూ 28 రాష్ట్రాలు, 9 కేంద్రపాలిత ప్రాంతాలు కలిగిన అతిపెద్ద స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్యంగల దేశం. భారతీయ సమాజం వైవిధ్యభరితమైన, విభిన్న సంస్కృతులు గల దేశం. మన దేశం విభిన్న జాతులు, మతాలు, సంస్కృతులు, ఆచార వ్యవహారాలకు, సంప్రదాయాలకు నిలయం. భారతదేశం మొత్తం విభిన్న కులాలు, వర్గాలు, కట్టుబాట్లు, వేడుకలు, భాషలు కలిగి వున్నప్పటికి మన భారతదేశం "భిన్నత్వంలో ఏకత్వం" కలిగి వుంది. ఉత్తరాన జమ్ముకాశ్మీర్ నుంచి దక్షిణాన కన్యాకుమారి వరకు, పశ్చిమాన గుజరాత్ నుంచి తూర్పున అరుణాచల్ ప్రదేశ్ వరకు భారతదేశం ప్రాదేశికమైన కొన్ని వైశిష్ట్యాలను కలిగివుంది.

## 1.1 రాయలసీమ భౌగోళిక స్వరూపం:

తెలుగు నేలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్షిణాన నైఋతి భాగంలో రాయలసీమ ప్రాంతం వుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జన వ్యవహారంలో తెలంగాణ, కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలుగా పిలువబడుతూ విభజించబడి వుండేది. తెలంగాణ ప్రాంతం ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడడంతో ఆంధ్రప్రదేశ్‌లో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలున్నాయి. ప్రస్తుతం అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలను కలిపి రాయలసీమగా వ్యవహరిస్తున్నాం.

### 1.1.1 భౌగోళిక స్వరూపం:

ఏ ప్రాంత చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, నాగరికతలనైనా తీర్చిదిద్దడానికి భౌగోళిక లక్షణాలు ఎంతగానో తోడ్పడతాయి. భౌగోళిక పరిస్థితులు ఆ ప్రాంత ప్రజల జీవన విధానాన్ని రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితుల్ని ప్రభావితం చేస్తాయి. భౌగోళిక పరిస్థితులకు, చరిత్రకు విడదీయరాని సంబంధం వుంది. రాయలసీమకు పడమర మరియు నైఋతి, వాయువ్య దిక్కున కర్ణాటక, ఉత్తరాన తెలంగాణ, తూర్పున కోస్తా ప్రాంతం, దక్షిణాన తమిళనాడు రాష్ట్రాలు సరిహద్దుగా వున్నాయి. రాయలసీమ మైసూర్ పీఠభూమికి ఆనుకొని వుంది. సముద్ర మట్టానికి దాదాపు 700 అడుగుల ఎత్తులో వుంది. రాయలసీమ వైశాల్యం దాదాపు 67,400 చ॥కి॥మీ. భౌగోళికంగా రాయలసీమ ఎత్తుపల్లాలు గల భూమి, రాళ్ళురప్పలు, గుట్టలతో కూడి వుంది. తూర్పు కనుమలలోని నల్లమల, వెలిగొండ, శేషాచలం, పాలకొండ, ఎర్రమల శ్రేణులు, నగరి, కంచకం, ఆవులపల్లి, హార్సిలీ లాంటి కొండలను కలిగి వుంది. ఈ కొండ

ప్రాంతాలన్నీ అడవులకు ప్రసిద్ధి. రాయలసీమలో ఎక్కువ భాగం ఎర్రనేలలు, ఆ తర్వాత నల్లరేగడి నేలలు, ఇసుక నేలలు, బంజరు భూములున్నాయి.

### 1.1.2. శీతోష్ణస్థితులు:

రాయలసీమలో సమశీతోష్ణ వాతావరణం వుంటుంది. $12^{0}37-16^{0}18$ ఉత్తర అక్షాంశం నుండి $76^{0}\,47-79^{0}55$ ల తూర్పు రేఖాంశాల మధ్య వున్నది. ఉష్ణోగ్రత మార్చి నుండి మే నెల వరకు $37^{0}$C నుండి $45^{0}$C వరకు వుంటుంది. అనంతపురం, కడప జిల్లాలలో వేసవి ఎండలు అధికంగాను కర్నూలు, చిత్తూరు జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో వేసవి ఉష్ణోగ్రతలు తక్కువగాను వుంటాయి. పీఠభూమి ప్రాంతమైన రాయలసీమలో పగటిపూట ఎక్కువ వేడిగా వుండి రాత్రి వేళల్లో చల్లగా వుంటుంది. చిత్తూరు జిల్లాలో శేషాచలం కొండలు, ఆవులపల్లి కొండలు, హార్సీలీ హిల్స్(ఏనుగు ఎల్లమ్మ కొండలు), అనంతపురంలో మల్లప్పకొండ, మడకశిర, గుత్తి, పెనుకొండ కొండలు, కడపలో శేషాచలం, పాల కొండలు కర్నూలులో నల్లమల కొండలు వున్నాయి. సీమలో అడవులన్నీ చాలాభాగం కొండలతో నిండి వున్నాయి.

### 1.1.3 నదులు:

రాయలసీమలో ప్రవహించే నదులన్నీ వర్షాధారిత నదులే ఎక్కువగా వున్నాయి. పెన్నా, తుంగభద్ర, పాపాఘ్ని, చిత్రావతి నదులు ప్రధానమైనవి. అనంతపురం జిల్లాలో పెన్నానది ప్రధానమైనది. పెన్నానదికే 'పినాకిని' అనే మరో పేరు గలదు. కర్ణాటకలోని నందిదుర్గ కొండల్లో చెన్నకేశవగిరి వద్ద జన్మించి హిందూపురం తాలూకాలోని చౌటుప్పల్ వద్ద ప్రవేశించి కడప, నెల్లూరు మీదుగా ప్రవహించి ఉటుకూరు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నదికి జయమంగళ, చిత్రావతి, కుందేరు, పాపాఘ్ని, చెయ్యేరు, సగిలేరు, వేదవతి(హగరి) మొదలైన ఉప నదులున్నాయి.

చిత్తూరు జిల్లాలో పాపాఘ్ని, పింఛా, కౌండిన్య, పొన్న, ఆరణి, స్వర్ణముఖి, కళ్యాణి, కుశస్థితి లాంటి వర్షాధార నదులు ప్రవహిస్తాయి. స్వర్ణముఖి నది తిరుపతి–చంద్రగిరి మధ్య తొండవాడ సమీప కొండ ప్రాంతంలో పుట్టి భీమ, కళ్యాణి నదులలో సంగమించి త్రివేణి సంగమంగా ఏర్పడి బంగాళాఖాతంలో కలుస్తుంది. ఈ నది ఒడ్డున ప్రముఖ శైవ క్షేత్రాలు వెలిశాయి.

కడప జిల్లాలో పెన్నా, కుందేరు, పాపాఘ్ని, చెయ్యేరు, సగిలేరు, మాండవ్య, గుంజన, చిత్రావతి నదులు ప్రవహిస్తాయి. పెన్నానది ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మీదుగా, చిత్రావతి పార్నపల్లి మీదుగా, కుందేరు నది గండికోట మధ్యగా, చెయ్యేరు రాయచోటి ప్రాంతం మీదుగా, సగిలేరు నది పోరుమామిళ్ళ మీదుగా ప్రవహిస్తున్నాయి. పాపాఘ్ని నది కమలాపురం మీదుగా ప్రవహించి పెన్నానదిలో కలుస్తుంది.

కర్నూలు జిల్లాలో ప్రవహించే ప్రధాన నదులు తుంగభద్ర మరియు దాని ఉపనదులైన వేదవతి, హగరి, హంద్రీ, వరద లాంటి నదులు. తుంగభద్ర కర్ణాటకలోని పశ్చిమ కనుమల్లో వరాహ పర్వతాల్లో పుట్టి కర్నూలులోకి ప్రవేశిస్తుంది. కుందేరు నదిని కుందూ లేదా కుముద్వతి అని పిలుస్తారు. ఇది ఎర్రమల కనుమల్లో పుట్టి కడప మీదుగా కమలాపురం వద్ద పెన్నానదిలో కలుస్తుంది. గుండ్లకమ్మ నది నల్లమల కొండల్లో పుట్టి గుంటూరు, ప్రకాశం మీదుగా ప్రవహిస్తుంది.

### 1.1.4 వర్షపాతం:

ఋతుపవనాల ద్వారా సరాసరి వర్షపాతం లభిస్తుంది. రాయలసీమలో వర్షపాతం సరాసరి 672 మి.మీ. కురుస్తుంది. ఈ వర్షపాతం కూడా క్రమబద్ధంగా కురియనందున రాయలసీమ కరువుకు పుట్టినిల్లుగా మారింది. రాయలసీమలో కొన్ని ప్రాంతాలలో అతి తక్కువ వర్షపాతం నమోదవుతుంది. అనంతపురం జిల్లాలో అతి తక్కువ వర్షపాతం (545.0 మి.మీ) కురుస్తూ నిత్యం కరువులు సంభవించే జిల్లాగా మారిపోయింది. నైఋతి ఋతుపవనాల ఆగమనంతో రాయలసీమలో సగటు వర్షాలు కురుస్తూ ఈశాన్య ఋతుపవనాల వల్ల ఎక్కువ వర్షపాతం కురుస్తుంది. సకాలంలో వర్షాలు రాయలసీమలో కురవక పోవడం వల్ల అనావృష్టి ఏర్పడి కరువు కాటకాలకు నిలయమైంది.

### 1.1.5 వ్యవసాయం:

రాయలసీమ ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయము. ఈ వ్యవసాయం చాలా ప్రాంతాల్లో అధిక భాగం వర్షాధారంపై ఆధారపడి వుంది. నీటి సదుపాయంగల భూమి కేవలం 10 శాతం మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కాలువలు, బోరుబావులు, చెరువుల ద్వారా ప్రజలు వ్యవసాయం చేస్తున్నారు. సీమలో ఎక్కువగా ఎర్ర నేలలు, నల్లరేగడి నేలలు, ఇసుక నేలలు, పొడి నేలలు, బంజరు నేలలు, చిత్తూరు జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో అల్యూమినియం నేలలు వున్నాయి. సీమలో చాలా ప్రాంతాల్లో సరైన వర్షాలు కురవక పోవడం, అధిక ఎండ తీవ్రత వల్ల బావులు, చెరువులు నీళ్ళు లేక ఎండి పోయాయి. నేటి ఆధునిక యుగంలో వ్యవసాయం నిర్లక్ష్యానికి గురవుతున్నది. ప్రభుత్వాలు, పాలకులు రైతు సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదు. సీమలో జీవ నదులు లేనందున భూగర్భ జలాలు తరిగిపోతున్నందున సేద్యం వట్టిపోతున్నది.

### 1.1.6 పంటలు:

#### 1.1.6.1 ఆహార పంటలు:

రాయలసీమలో గోధుమలు, జొన్న, రాగులు, కొర్రలు, సామలు, సజ్జ మొదలైన ప్రధాన ఆహారపంటలు. గోధుమ, ఉలవలు పంట విస్తీర్ణం, ఉత్పత్తిలో అనంతపురం మొదటి స్థానంలో వుంది.

సెనగలు, జొన్న పంట విస్తీర్ణం, ఉత్పత్తిలో కర్నూలు మొదటి స్థానంలో కలదు. కొర్రలు అనంతపురంలోను, రాగులు, సామలు చిత్తూరు, అనంతపురంలోనూ పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు కర్నూలులోనూ అధికంగా పండిస్తారు.

### 1.1.6.2 వ్యాపార పంటలు:

అక్టోబరు, నవంబరు మాసాల్లో రబీ కాలంలో పండే పంటలు వ్యాపార పంటలు. పత్తి, వేరుశనగ, ఉల్లి, ఆముదాలు, ప్రొద్దు తిరుగుడు, నువ్వులు మొదలైనవి ప్రధాన పంటలు. ఉల్లి మరియు ఆముదాలు సాగు విస్తీర్ణం, ఉత్పత్తిలో కర్నూలు మొదటి స్థానంలో వుంది. వేరుశనగ సాగు విస్తీర్ణం, ఉత్పత్తిలో అనంతపురం మొదటి స్థానంలో కలదు. చెరకు ఉత్పత్తిలో చిత్తూరు, ఉత్పాదకతలో కర్నూలు అగ్రస్థానంలో వున్నాయి. పత్తి విస్తీర్ణంలోను, ప్రొద్దుతిరుగుడు ఉత్పత్తిలోను కర్నూలు మొదటి స్థానంలో వుంది. భారతదేశంలోనే పేరుపొందిన కదిరి-9,7,5 రకం వేరుశనగను కదిరి వ్యవసాయ పరిశోధన కేంద్రంలో తయారు చేస్తున్నారు.

ఫల సంపదలో మామిడి సాగు విస్తీర్ణంలో చిత్తూరు మొదటిస్థానంలో వుంది. ద్రాక్ష తోటలు ఎక్కువగా అనంతపురం, చిత్తూరులోను నారింజ, బత్తాయి తోటలు కడప, అనంతపురంలోను బెండకాయల ఉత్పత్తిలో కర్నూలు, జామతోటలు అనంతపురం జిల్లాలలో ప్రధానమైనవి.

### 1.1.7 నీటిపారుదల:

రాయలసీమ ప్రధాన సమస్య నీటిసమస్య. సాగు, తాగునీరు కోసం సీమ ప్రజానీకం ఎన్నో అవస్థలు పడుతున్నారు. కాలువలు, చెరువులు, బావుల ద్వారా సీమలో నీటిపారుదల జరుగుతున్నది. నదులన్నీ వర్షాదారం కావడం, సరైన వర్షాలు కురవక పోవడం, ప్రాజెక్టులు ప్రభుత్వాలు నిర్మించక పోవడం వల్ల నీటి సదుపాయం సరిగా జరగడం లేదు. సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వాలు ఎన్నో పథకాలు ప్రారంభించినప్పటికీ వాటి అమలు విషయంలో జరుగుతున్న జాప్యం, నిర్లక్ష్యం వల్ల సాగు నీరందని పరిస్థితి నెలకొంది.

### 1.1.7.1 తుంగభద్రానది:

తుంగ, భద్ర అనే రెండు చిన్న నదుల కలయిక తుంగభద్రానది. ఈ నదిపై తుంగభద్ర ప్రాజెక్టు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు. కర్ణాటక ప్రాంతాలకు, కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీటిని అందించేందుకు వీలుగా ఈ ప్రాజెక్టు నుంచి LLC కెనాల్‌ను తాగునీరు అందించేందుకు నిర్మించారు. తుంగభద్ర కెనాల్ ద్వారా సీమలో కొన్ని ప్రాంతాలు సస్యశ్యామలం కావలసివున్నా దానికి ఆచరణ అమలు కాలేదు. శ్రీబాగ్ ఒడంబడిక, బచావత్ కమిటీలు దీనిపై కృషి చేసినా అమలు కాలేదు.

### 1.1.7.2 పెన్నానది:

రాయలసీమలో ప్రవహించే ప్రధాన వర్షాధార నది. అనంతపురం, కడప, నెల్లూరు మీదుగా ప్రవహిస్తుంది. అనంతపురానికి ప్రధాన నది అయినప్పటికీ ఎప్పుడు ఎడారి నదిగానే కనిపిస్తుంది. విద్వాన్ విశ్వం పెన్నానది యొక్క విశ్వరూపాన్ని పెన్నేటిపాటగా లిఖించాడు.

" ఇంత మంచి పెన్నతల్లి ఎందుకెండి పోయెనో ?

ఇంత మంది కన్నతల్లి ఎందుకిట్ల మారెనో " [1]

నాటి బ్రిటిష్ ఇంజనీరు మెకంజీ 75 TMC జలాల రిజర్వాయర్‌ను గండికోట వద్ద నిర్మించే పథకాన్ని రూపొందించాడు. కాని అది అమలు కాలేదు. క్రిష్ణా-పెన్నార్ ప్రాజెక్టు అమలు జరిగి వుంటే సీమ మాత్రమేగాక ఎన్నో ప్రాంతాలకు లాభముండేది. ఆర్థర్ కాటన్, మెకంజీ వంటి మేధావుల కృషి ఫలితంగా రూపకల్పన అయిన క్రిష్ణా-పెన్నార్ ప్రాజెక్టు వల్ల 36 లక్షల ఎకరాలు సస్యశ్యామలం కాకుండా రాజకీయాల కారణంగా నిలిచి పోయింది.

'సిద్దేశ్వరం అలుగు' నిర్మాణం కోసం ప్రస్తుతం "రాయలసీమ జలసాధన సమితి" వారు ఉద్యమాలు చేస్తున్నారు. "కర్నూలు జిల్లా సిద్ధేశ్వరం వద్ద క్రిష్ణానదిపై 279 TMC ల సామర్థ్యం గల ఒక ప్రాజెక్టు, నెల్లూరు జిల్లా సోమేశ్వరం వద్ద పెన్నానదిపై మరో ప్రాజెక్టు (276 TMC ) ను నిర్మించి మిట్ట కందాల డీప్‌కట్ కాలువతో 116 మైళ్ళ పొడవు గల కుందునది ద్వారా రెండు ప్రాజెక్టులను కలపడమే క్రిష్ణా-పెన్నార్ "[2] ప్రాజెక్టు.

### 1.1.7.3 కె.సి.కెనాల్:

సీమలో బ్రిటీషువారు 1863లో సరుకుల రవాణా మరియు నీటిపారుదల కోసం కాలువను నిర్మించారు. కాటన్ దొర సూచన మేరకు నీటిపారుదలను పెంచి 1933 నాటికి రవాణాను నిలిపేశారు. తుంగభద్ర డ్యాంకు 200 కి.మీ. దిగువన కాలువ ప్రారంభమై కర్నూలు, కడప జిల్లాలకు సాగునీరు అందిస్తుంది. తుంగభద్ర, గాలేరు, కుందు, పెన్నా నదుల మీద నాలుగు ఆనకట్టలు కట్టి ఒక వినూత్న పద్ధతిలో దీన్ని రూపొందించారు. దీని పొడవు 306 కి.మీ.లు. సుంకేసుల ఆనకట్ట నుండి ప్రారంభమై సంతజూటూరు, రాజోలి, ఆదినిమ్మాయపల్లి ఆనకట్టల ద్వారా ప్రయాణించి కడప చెరువులో కలిసి ఆగిపోతుంది.

### 1.1.7.4 శ్రీశైలం కుడిగట్టు కాలువ(SRBC):

1981లో 19 TMC ల నికర జలాలతోను, 1.90 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే పథకం ఇది. దీని పొడవు 199 కి.మీలు. ఈ కాలువ నిర్మాణంలో 7 ముఖ్య భాగాలున్నాయి. కర్నూలులోని

నంద్యాల, పాణ్యం, బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, ఉయ్యాలవాడ, జమ్మలమడుగు మండలాలకు తాగు, సాగు నీరు అందిస్తుంది.

### 1.1.7.5 హంద్రీ - నీవా ప్రాజెక్టు:

1988లో బాగా వెనకబడిన ప్రాంతాలకు తాగు, సాగునీరు సరఫరా చేయడానికి ఉద్దేశించిన ఎత్తిపోతల పథకం. శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్స్ నుంచి కృష్ణానది నీళ్ళు లిఫ్ట్ చేసే ఈ పథకం కర్నూలులోని మల్యాల గ్రామం వద్ద (40 TMC ల మిగులు జలాలు) ప్రారంభం అవుతుంది. కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల మీదుగా 740 కి.మీ. ప్రయాణించి ఈ కాలువ నీవా నది వరకు ప్రతిపాదించబడింది. 8 రిజర్వాయర్లు, 9 ఎత్తిపోతలతో ఈ పథకం ఇంకా నిర్మాణ దశలోనే వుంది. ప్రస్తుతం అనంతపురం జిల్లా గొల్లపల్లి వరకు నీరు అందుతోంది.

### 1.1.7.6 గాలేరు- నగరి ప్రాజెక్టు:

కృష్ణదేవరాయ గాలేరు-నగరి సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం 1988లో 38 TMC ల మిగులు జలాలతో 2.6 లక్షల ఎకరాలకు ఉద్దేశించబడిన ప్రాజెక్టు ఇది. దీని పొడవు 338 కి.మీ.లు శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్స్ నుంచి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా కడప, నెల్లూరు, చిత్తూరు, జిల్లాలలో రబీ సాగుకు కృష్ణా నది నీళ్ళను రెండు దశలలో తీసుకుపోయె పథకం ఇది. ఎప్పుడో 1954లోనే క్రిష్ణా-పెన్నార్ పథకంలో రూపాంతరం చెందిన కొంత భాగమే ఇప్పటి గాలేరు-నగరి ప్రాజెక్టు. ఇది నిర్మాణ దశలోనే వుంది.

### 1.1.8 ఖనిజ సంపద:

రాయలసీమ ప్రాంతంలో అత్యంత విలువైన, ఖరీదయిన ఖనిజ సంపద లభిస్తుంది. దాదాపు 64 రకాల ఖనిజాలు ఉన్నట్టుగా శాస్త్రీయ సర్వేలు అంచనా వేస్తున్నాయి.

### 1.1.8.1 ఆస్‌బెస్టాస్(రాతినార):

కడప జిల్లాలో 30 లక్షల టన్నుల రాతినార నిక్షేపాలున్నాయని అంచనా. ఈ ఖనిజం అరుదయింది. పులివెందుల, వేంపల్లి, బ్రాహ్మణపల్లి, వెలిదండ్ల, గాజుపాళెం గ్రామాల్లోను, అనంతపురం ప్రాంతాల్లోను లభిస్తుంది. ఈ రాతినారతో బ్రేక్ లైనింగ్‌లు, ఆయిల్ ఇంజన్లు, పెట్రోలు పంపు గాస్కెట్లు తయారు చేస్తారు.

### 1.1.8.2 బెరైటీస్(ముగ్గురాయి):

చమురు వెలికితీతలో ఈ ముగ్గురాళ్ళ పొడి తప్పనిసరి. ఆసియా ఖండంలోనే అత్యధికంగా కడపలోని మంగంపేటలో వెయ్యి టన్నుల నిక్షేపాలున్నట్లు అంచనా. ఈ ముగ్గురాళ్ళు రంగులు, రబ్బరు,

టైర్లు, కాగితం, లినోలియం గాజు, ఎనామిల్ మొదలైన రసాయనిక పరిశ్రమల్లో బాగా ఉపయోగపడుతాయి.

**1.1.8.3 లైమ్‌స్టోన్( సున్నపురాయి):**

సిమెంట్ తయారీకి ఉపయోగించే సున్నపు రాయి కర్నూలు, కడప, అనంతపురం జిల్లాలలో దొరుకుతుంది. దాదాపు 2000 కోట్ల టన్నుల సున్నపురాయి నిల్వలున్నాయని లెక్క. ఈ సున్నపు రాయితో ప్రధానంగా సిమెంట్ పరిశ్రమలు ఏర్పడి చాలా మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. అనంతపురంలోని తాడిపత్రి ప్రాంతాల్లో కడపలోని కోడూరు, జమ్మలమడుగు, ఇప్పట్ల కర్నూలులోని అవుకు, పాణ్యం, బనగానపల్లె, బేతంచర్ల లాంటి ప్రాంతాల్లో ఈ రాయి లభిస్తుంది.

**1.1.8.4 బంకమన్ను:**

పింగాణి పరిశ్రమల్లో ప్రధాన వనరుగా ఉపయోగపడుతుంది. కడపలోని కోడూరు, నందలూరు, పోరుమామిళ్ల అనంతపురంలోని ఉరవకొండ, కళ్యాణదుర్గంలోను లభిస్తుంది. ఈ బంకమన్నుతో జాడీలు, పింగాణి పాత్రల తయారీలోను, సిరామిక్ పరిశ్రమలోను, టివి సెట్టు తయారీలోను, ఇటుకల తయారీలోను ఉపయోగిస్తారు.

**1.1.8.5 ఇనుప ఖనిజం (ఐరన్ ఓర్):**

ఇనుము తయారీలో ప్రధాన ముడిసరుకు ఇది. ఓబులాపురం, సిద్దాపురం, రాజంపేట, వెల్దుర్తి లాంటి ప్రాంతాల్లో లభిస్తుంది.

**1.1.8.6 గ్రానైట్:**

భవన నిర్మాణాలకు, కార్యాలయాలకు విరివిగా వాడుతున్నారు. కుప్పం, పలమనేరు, బేతంచర్ల, తాడిపత్రి లాంటి ప్రాంతాలలో లభిస్తుంది.

**1.1.8.7 పులరిన్:**

ఇది ఇటీవల కనుగొన్న ఖనిజం. ఇది కడపలోని రాజంపేట, మంగంపేట ప్రాంతాల్లో దొరుకును. ఇది దూదికన్నా తేలికైనది. ప్లాటినం కన్నా విలువైంది. స్టీలు కన్నా గట్టిది. పులరిన్ కంప్యూటర్ తయారీకి, పవన విద్యుత్‌కు, నానో పరిజ్ఞానానికి ఉపయోగపడుతుందని చెబుతున్నారు. బుల్లెట్ ప్రూఫ్, జాకెట్స్ తయారీకి ఉపయోగిస్తారు.

**1.1.8.8 యురేనియం:**

ప్రపంచంలోనే అత్యదిక యురేనియం నిల్వలు కడపలోని తుమ్మలపల్లె గ్రామం చుట్టు పక్కల ఉన్నాయి. న్యూక్లియర్ పవర్ ఉత్పత్తిలో ఉపయోగిస్తారు. తుమ్మలపల్లె సమీపంలో యురేనియం ప్రాజెక్టును ప్రభుత్వం నెలకొల్పింది.

అనంతపురంలోని వజ్రకరూరు వజ్రాలకు రామగిరి బంగారానికి ప్రసిద్ధి. వజ్రకరూరు పరిసర పొలాల్లో వర్షాలు కురిసినప్పుడు ఇప్పటికీ ప్రజలు వజ్రాల కోసం వెతుకుతారు. గోల్డ్ ఫీల్డ్ కంపెనీవారు రామగిరిలో తవ్వకాలు జరిపి బంగారాన్ని వెలికి తీసారు.

రాయలసీమలో విలువైన అటవీ సంపద కూడా వుంది. నల్లమల అడవులు, శేషాచలం కొండలు, కదిరి, కుప్పం గుట్టలలో అపారమైన ఎర్రచందనం, శ్రీగంధం, టేకు, ఔషద మొక్కలకు నిలయనాయి.

### 1.1.8.9 పరిశ్రమలు:

రాయలసీమలో స్థానికంగా దొరికే ముడిసరుకులు ఆధారంగా కొన్ని పరిశ్రమలు ఏర్పడినాయి. అందులో సిమెంట్ పరిశ్రమ ఒకటి. అనంతపురంలోని తాడిపత్రి, కడపలోని ప్రొద్దుటూరు, ముద్దనూరు, యర్రగుంట్ల, కమలాపురంలోను కర్నూల్‌లోని డోన్ పరసర ప్రాంతాల్లో సిమెంట్ పరిశ్రమలు బాగా అభివృద్ధి చెందాయి. గాజుల పరిశ్రమ అనంతపురంలోను, శ్రీకాళహస్తి లాంటి ప్రాంతాల్లో వెలిశాయి. అనంతపురంలోని రాయదుర్గం బట్టల జీన్స్ పరిశ్రమ ఎంతో మందికి ఉపాధిని కల్పిస్తుంది. పెనుకొండ ప్రాంతంలో వెలసిన 'కియా' కార్ల పరిశ్రమ అతి పెద్దది. స్థానికంగా ఎంతో మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. నూనె మిల్లులు, పైపులు, కాగితం పరిశ్రమలు ఈ ప్రాంతాలలో వున్నాయి.

## 1.2 రాయలసీమ- చారిత్రక నేపథ్యం:

రాయలసీమ ప్రాంతానికి విశిష్టమైన చరిత్ర, సంస్కృతిని కలిగి వుంది. భౌగోళికంగాను, చారిత్రకంగాను కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో సరిహద్దులను, పరస్పర సంబంధాలను, సంస్కృతిని కలిగి చరిత్రలో విశిష్ట స్థానాన్ని పొందింది. ఈ ప్రాంతాన్ని ఒక అధ్యయన వేదికగా పరిగణించవచ్చు.

### 1.2.1 రాయలసీమను పాలించిన రాజులు:

రాయలసీమకు భారతదేశ చరిత్రలో ప్రత్యేక స్థానం వుంది. తెలుగు ప్రజల ఆదిమ నివాస స్థలం రాయలసీమ అని చరిత్రకారుల భావన. మగద సామ్రాజ్య రాజులు మొదలుకొని విజయనగర చక్రవర్తుల వరకు ఈ ప్రాంతం పాలించబడింది.

### 1.2.1.1 నందులు:

క్రీ.పూ. 5వ, 4వ శ॥ల మధ్య నంద రాజులు పాలించారు. ఉత్తరాపథం నుండి దక్షిణంగా వింధ్య పర్వతాల వరకు సామ్రాజ్యాన్ని విస్తరించారు. కర్ణాటక ప్రాంతం, రాయలసీమలోని నందలూరు, మహానంది, నందిమండలం, నంద్యాల ప్రాంతాలను పాలించినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది.

### 1.2.1.2 మౌర్యులు:

రాయలసీమ మగద సామ్రాజ్యంలో భాగంగా వుండేదని నిరూపించటానికి ఆధారాలున్నాయి. క్రీ.పూ. 274-36 సం॥ల మధ్య మగదను పాలించిన అశోక చక్రవర్తి వేయించిన శాసనాలు కర్నూలు జిల్లా ఎర్రగుడిలోనూ, రాజుల మందగిరిలోనూ లభించాయి. అనంతపురంలోని గుత్తి కోటలో దొరికిన శిలా శాసనాలు కూడా అశోకుని పాలనలో సీమ వున్నట్లు తెలుస్తోంది.

### 1.2.1.3 శాతవాహనులు:

మౌర్య సామ్రాజ్య పతనానంతరం రాయలసీమ శాతవాహన రాజ్యంలో భాగమైంది. "గౌతమి బాలశ్రీ తన నాసిక్ శాసనంలో తన్నుతాను 'ములకనాటి ప్రభువు' అని అభివర్ణించుకున్నాడు. కడప జిల్లాలోని పడమటి తాలూకాను, కర్నూలు జిల్లాలోని తూర్పు తాలూకాలను 'ములకనాడు' అని పిలుస్తారు."[3] దీన్ని బట్టి కడప, కర్నూలు ప్రాంతాలను శాతవాహనులు పాలించారని తెలుస్తుంది. వీరి నాణాలు సీమలో చాలా చోట్ల దొరికాయి.

### 1.2.1.4 రేనాటి చోళులు:

రాయలసీమను పాలించిన ప్రధాన రాజవంశం ఇది. కొంత కాలం పల్లవుల కిందా మరికొంత కాలం చాళుక్యుల కిందా సామంతులుగా వుండి సీమను పాలించారు. వీరు నాటిన రాతి స్తంభాలు ఇప్పటికీ రాయలసీమ గ్రామాలలో వున్నాయి. క్రీ.శ. 6వ శ॥ చెందిన మొదటి తెలుగు శాసనం కలమళ్ళలో బయటపడింది. " కడప, కర్నూలు, జిల్లాలు రేనాటి(తెలుగు) చోళుల ఆధీనంలో వుండేవి. క్రీ.శ. ఐదు, ఎనిమిది శతాబ్దాల మధ్య రేనాటి చోళులు రాజ్యాధికారంలో వున్నారు."[4] రేనాడు ప్రాంతాన్ని పాలించడం వల్ల వీరికి రేనాటి చోళులు అనే పేరు వచ్చిందని తెలుస్తుంది.

### 1.2.1.5 చాళుక్యులు:

వీరిని ప్రధానంగా బాదామి, తూర్పు, కళ్యాణి చాళుక్యులు అని పిలుస్తారు. దక్షిణ భారతంలోని కర్ణాటక, కడప, కర్నూలు ప్రాంతాలను పాలించారు. రెండవ పులకేశి మారుటూరు శాసనములో 'చాళుక్య విషయము' ప్రశస్తి గలదు. ఈ చాళుక్య విషయము సీమలోని కడప-కర్నూలు ప్రాంతము. చాళుక్యుల జన్మస్థలం కడప అని ప్రాచీన కాలంలో ఈ జిల్లాను హిరణ్య రాష్ట్రం అని పిలిచేవారని చరిత్ర ద్వారా తెలుస్తుంది. "రాయలసీమ క్రీ.శ. 3,4 శ॥ల్లో హిరణ్యక రాష్ట్రంగా పిలువబడింది. హిరణ్యక రాష్ట్రాన్ని రేమణక అనే సేనాని పాలించాడు. రేమణక క్రీ.శ. 200-250లో సీమను పాలించినట్లు తెలుస్తున్నది. చాళుక్య వంశానికి రేమణక మూల పురుషుడు. దక్షిణాదిలో బలమైన రాజ్యాన్ని స్థాపించిన చాళుక్యుల జన్మస్థలం రాయలసీమ"[5] అని మైనాస్వామి విశ్లేషించాడు.

### 1.2.1.6 బాణులు:

బాణులు కర్నాటకలోని కోలారు జిల్లా చిక్కబళ్లాపురం తాలూకా నందగిరి ప్రభువులని, పరవిపురం అంటే అనంతపురం జిల్లాలోని హిందూపురం తాలూకా పరిగిని కేంద్రంగా చేసుకొని పాలించారని తెలుస్తోంది.తర్వాత చిత్తూరు, కాళహస్తి, పుంగనూరు ప్రాంతాలను ఆక్రమించారని తెలుస్తుంది. వీరు మొదటి నుండి సామంత రాజులుగానే రాజ్యపాలన చేశారు.

### 1.2.1.7 వైదుంబులు:

వైదుంబులు లేక ఔదుంబులు అని శాసనాల్లో చెప్పబడినట్లుగా రాయలసీమ ప్రాంతంలో దక్షిణ భాగంలో క్రీ.శ. 7వ శ॥లోనే వున్నట్లు తెలుస్తోంది. వీరు అనంతపురం, చిత్తూరు, కడప, కోలారు ప్రాంతాల్లో పాలించారని తెలుస్తుంది. గండ తినేత్రుడు వైదుంబులలో శక్తివంతమైన రాజు.

క్రీ.శ. 6వ శ॥లోనే రాష్ట్రకూటులు వీరి తర్వాత చోళులు 'పొత్తపి' రాజధానిగా పాలించారు. కాకతీయులు ఓరుగల్లు కేంద్రంగా తెలంగాణా ప్రాంతాన్ని పాలించినప్పటికీ కర్నూలులోని త్రిపురాంతకం, కడపలోని కొన్ని ప్రాంతాలు ప్రతాపరుద్రుని సామ్రాజ్యంలో వుండేదని తెలుస్తోంది. రెడ్డి రాజులు కూడా శ్రీశైలం, అహోబిలం, కడపలోని టంగుటూరు మొదలైన ప్రాంతాల్లో దాన శాసనాలను వేయించి పాలించారని చరిత్ర ద్వారా తెలుస్తోంది.

### 1.2.1.8 విజయనగర కాలం నాటి రాయలసీమ:

కాకతీయుల పతనానంతరం రాయలసీమ విజయనగర రాజుల పాలనలోకి వచ్చింది. హరిహర బుక్కరాయలు విద్యారణ్యస్వామి ఆశీస్సులతో క్రీ.శ. 1336లో హంపి రాజధానిగా పాలించారు. రాజధాని హంపికి విజయనగరం, ఆనెగొంది, పంపానగరం అని పేర్లు కలవు. రాయలసీమ శాసనాల్లో క్రీ.శ. 14వ శ॥ నుండి 17వ శ॥ వరకు ప్రస్తుత రాయలసీమ ప్రాంతం పాలించబడిందని కటకం నుంచి కన్యాకుమారి వరకు గల ప్రాంతాన్ని వీరు పాలించినట్లు చరిత్రలో పేర్కొనబడింది. "విజయనగర సామ్రాజ్యంలో కన్నడ, తమిళ, మలయాళ ప్రాంతాలతోబాటు కృష్ణా నదికి దక్షిణంగా సువిశాల ఆంధ్ర భూభాగం చేరి వుండేది. రాజ్యం చివరి దశలో సైతం ఉదయగిరి, పెనుగొండ, చంద్రగిరి ప్రాంతాల్లో రాయల అధికారం చెల్లింది."[6] విజయనగర రాజులు దక్షిణాపథాన్నంతా ఏకం చేసి రాజ్య పాలన చేసినట్లు తెలుస్తోంది. వీరు తమ సామ్రాజ్యాన్ని రాజ్యం, రాష్ట్రాలు, సీమలు, స్థలాలు, గ్రామాలుగా విభజించారు. రాజ్యంలో ముఖ్య విభాగం 'సీమ'. కొన్ని స్థలాల సముదాయాన్నే సీమ అని పిలిచేవారు. సీమకు అధికారి పారుపత్యంగారు. వీరి పాలనా కాలంలో 'సీమ' అనే పదం వ్యవహారంలోకి వచ్చింది. ఈ గ్రామాలలో కరణం, రెడ్డి, కమ్మరి, మంగలి, కంసాలి, చాకలి మొదలైన 12 మంది ఆయగాండ్రు లేదా వృత్తుల

వాళ్ళు ఉండేవారు. రాజ్యంలో వ్యవసాయం ప్రధాన వృత్తి. భూమిశిస్తు ప్రధాన ఆదాయ వనరు. వ్యవసాయ అభివృద్ధి కోసం బంజరు భూములను సాగులోకి తెచ్చి అడవులను నరికి వ్యవసాయానికి అనుకూలం చేసి నీటిపారుదల కోసం విశేష కృషి చేశారు. బుక్కరాయ సముద్రం చెరువు, పరిగి చెరువు, అనంతపురం చెరువు, రాయల చెరువు, శింగనమల, ధర్మవరం చెరువులు, కంభం, పోరుమామిళ్ల చెరువు లాంటివెన్నో ఆ కాలంలో నిర్మించినవే. "విజయనగరం చుట్టూ 72 మైళ్ళ పొడవుగా కొండల వరస వుంది. ఆవరణలో పండ్లతోటలు, సారవంతమైన భూములు విస్తారంగా ఉన్నాయి. సమృద్ధిగా నీరుగల చెరువులు అనేకం ఉన్నాయి. వర్తకులు నివసించే వీధుల్లోని అంగళ్ళలో వజ్రాలు, కెంపులు, పచ్చలు, ముత్యాలు కుప్పలు కుప్పలుగా రాసులు పోసి ఉన్నాయి. నేనొక కొండెక్కి పట్టణంలోకి చూశాను. రోమ్ నగరమంత పెద్దదిగానూ సుందరమైనదిగాను నాకు అనిపించింది" అని పేస్ చరిత్రకారుడు రాయల కాలం నాటి విశేషాలను వర్ణించాడు. అందుకే రాయలసీమ 'రాయలేలిన రతనాలు సీమ మన రాయలసీమ' అనే నానుడి వ్యవహారంలోకి వచ్చిందని తెలుసుకోవచ్చు. విజయనగర రాజుల కాలంలో కూడా కరువులు సంభవించేవని ఆ కరువు కాలంలో ప్రజలు వలసలు వెళ్ళేవారని కొందరి రచనల వల్ల తెలుస్తోంది. చెరువులు, కాలువలు, కుంటలు, ఆనకట్టలు, నదులు ఉన్నప్పటికీ వర్షాధారిత వ్యవసాయం ఎక్కువగా వుండటం వల్ల అప్పుడప్పుడు కరువులు వచ్చేవని విదేశీ యాత్రికులు చెబుతున్నారు. ఇలా కాలక్రమంలో వైభవాల రాయలసీమ రానురాను రాళ్ళసీమగా, కరువు కాటకాల సీమగా మారుతూ వచ్చింది. విజయనగర కాలం నాటి వ్యవసాయాన్ని గూర్చి బార్బోసా అనే చరిత్రకారుడి కథనంలో "ఆ దేశంలో జనులు కనబడరు. వరి అలుకుతూ ఉంటారు. ఎడ్లను కట్టి గొర్రుతో విత్తుతూ ఉంటారు. మెట్ట పొలాల్లో విత్తనాలు చల్లి పాయలు పాయలుగా చేస్తుంటారు" అని విదేశీ యాత్రికుడు వర్ణించాడు. విజయనగర సామ్రాజ్యంలో ఆదాయం కూడా ఎక్కువగా వుండేదని విదేశీ యాత్రికులు పేర్కొన్నారు. విజయనగర రాజ్యం మొత్తం ఆదాయం లూయిరైస్ 81 కోట్ల రూపాయలని[7], వార్తమా అనే పాశ్చాత్య బాటసారి రాయలను భారతదేశంలోని రాజులందరిలో ఐశ్వర్యవంతుడని, అతని ఆదాయం రోజు 12,000 అని[8] వ్రాసాడు. ఆదాయంతో పాటు వీరు తమ రాజ్యంలో విద్య, వైద్య, సైన్యపోషణ, దేవాలయ, చెరువుల నిర్మాణం, కళా సాహిత్య పోషణకు, దాన ధర్మాల వినియోగానికి ఖర్చు చేసేవారు. రైతాంగానికి నీటి సదుపాయం కోసం అనంతపురంలోని బుక్కపట్నం చెరువు, బుక్కరాయ సముద్రం చెరువు మొదలగు వాటిని నిర్మించి కాలువల నిర్మాణం చేపట్టారు. కర్నూలు, గుత్తి, వజ్రకరూర్‌లో వజ్రాల పరిశ్రమలను, రాయదుర్గంలో నూలువస్త్రాలు, వెంకటగిరిలో జరీ వస్త్రాల పరిశ్రమలను నెలకొల్పారని తెలుస్తుంది. ఆంధ్ర, తమిళ, కన్నడ ప్రాంతాలలో స్థానిక పాలన విధానంలో వ్యత్యాసాలుండేవని తెలుస్తుంది. " ఆంధ్ర ప్రాంతంలో  రాష్ట్రాలను రాజ్యాలు అని వ్యవహరించినారు. పెనుగొండ, గుత్తి, కందనవోలు,

శ్రీశైలం, ఉదయగిరి, చంద్రగిరి, కొండవీడు రాజ్యాలకు కేంద్రాలు."[9] ఈ ప్రాంతాల్లో రాజ్యపాలన చేస్తూ సైనిక అవసరాలకనుగుణంగా రూపొందించారని తెలుస్తుంది. రాజ్య రక్షణ కోసం సిద్ధసైన్యం, అమరనాయక సైన్యాన్ని పటిష్ఠంగా రెండు భాగాలుగా రూపొందించారు.

దక్షిణ దేశ చరిత్రలో విజయనగర రాజుల పోషణలో సాహిత్య పరిశ్రమ విశేషంగా జరిగింది. సంస్కృత, తమిళ, కన్నడ, మలయాళ, తెలుగుభాష సాహిత్యాలకు వీరు విశేష కృషి చేశారు. ఆంధ్ర భాషా చరిత్రలో స్వర్ణయుగంగా కీర్తించారు. శ్రీకృష్ణ దేవరాయలు రాజ్యపాలకుడు, కవితా ప్రవీణుడు, సాహితీ సార్వభౌముడు, ఆంధ్రభోజుడు. భువన విజయ సభలో అష్టదిగ్గజ కవులు వున్నారు. ఈ అష్టదిగ్గజ కవుల్లో ప్రధాన కవి పండితులు రాయలసీమ ప్రాంతానికి చెందినవారే వున్నారు. సాహిత్యానికి తోడు సంగీత, నాట్య, నాటక కళలను రాజులు ప్రోత్సహించారు.

దక్షిణదేశంలో ఆలయ నిర్మాణం విరివిగా జరిగింది. ఆంధ్రదేశంలో పుష్పగిరి, తాడిపత్రి, లేపాక్షి, చంద్రగిరి, పెనుగొండ మొదలగు చోట్ల విజయనగర రాజుల ఆలయాలున్నాయి. తిరుపతి, శ్రీశైలం, కాళహస్తి ఆలయాలకు గోపురాలు, అహోబిలం, మర్కాపురం, సింహచలాలలో మండపాలు నిర్మించారు. విజయనగర రాజుల పాలనలో రాయలసీమ ప్రాంతం అన్ని విధాలుగా అభివృద్ధి చెందింది.

1565లో తళ్లికోట యుద్ధం(రక్కసి–తంగడియుద్ధం)లో విజయనగర రాజులపై బహుమనీ సుల్తానులు విజయం సాధించటంతో విజయనగర రాజులు రాజధానిని మార్చారు. పడమర ప్రాంతం సీమలోని పెనుగొండ, తూర్పుభాగం చంద్రగిరి, దక్షిణభాగం శ్రీరంగపట్నం రాజధాని నగరాలు అయ్యాయి. రాజ్యంలో అంతర్యుద్ధాలు, కుట్రలు, కుతంత్రాలు పెరిగి పోయాయి. బీజాపూర్ గోల్కొండ నవాబులు సీమ పై కన్నేశారు. 1650లో వీరు పెనుగొండ మీద దాడి చేసి రాజ్యాన్ని ధ్వంసం చేశారు. సీమ బీజాపూర్ రాజ్యంలో కలిసి పోయింది. శివాజి బీజాపూర్ రాజులను ఓడించి 1674లో సీమను తన పాలనలోకి తెచ్చుకున్నాడు. ఆ తర్వాత హైదరాబాద్ నిజాం ఆదిపత్యాన తర్వాత మైసూరు రాజ్యం హైదరాలీ కింద, 1792లో జరిగిన ఒప్పందంతో నిజాం కిందకు వచ్చింది. 1800ల సంవత్సరంలో జరిగిన ఒప్పందంతో నిజాం సీమ ప్రాంతాలను తూర్పు ఇండియా కంపెనీ వారికి ధారాదత్తం చేశాడు. కర్నూలు, అనంతపురం, బళ్ళారి, కడప, చిత్తూరు జిల్లాలు దత్తమండలాలు(సీడెడ్) అని ఆ తర్వాతి కాలక్రమంలో ఈ ప్రాంతం రాయలసీమగా పిలువబడింది.

**1.3 రాయలసీమ పదం:**

'రాయలసీమ' అనే పారిభాషిక పదంతో పిలువబడుతున్న ఈ ప్రాంతానికి ప్రాచీనమైన చరిత్ర వుందని తెలుస్తుంది. రాయలసీమ అనే పద ప్రయోగం సుమారు రెండు, మూడు శతాబ్దాల

కిందటి సాహిత్య కృతుల్లో లభించింది. ఆ పేరు ఎప్పుడు ఎలా వచ్చిందో దీని చరిత్ర ఏమిటో కొంత తెలుసుకోవడం అవసరం.

విజయనగర రాజుల ప్రారంభ కాలం నుంచి 16,17 శ॥ల్లో 'మట్లిరాజులు' వారికి సామంతులుగా ఉండేవారు. సిద్ధవట సీమ పాలకుడు మట్ల వెంకట రామభూపాలుని ఆశ్రమంలో వుండిన నడిమింటి వెంకటపతి అనే కవి తన 'అభిషిక్త రాఘవం' అనే ప్రభందంలో మట్లి అనంతరాజు పౌరుషాన్ని వర్ణించే సందర్భంలో 'రాయలసీమ' అనే పదం ప్రయోగించటం కనిపిస్తుంది. బహుశ 'రాయలసీమ' పేరును పద్యగతంగా పేర్కొనడం ఇదే మొదటిసారి కావచ్చు. ఆ పద్యం పూర్తి రూపం ఇలా వుంది.

**" గాయకులశ్వ రాయబల భానులు మట్లి యనంతరాజకౌ**
**క్షేయక ధారఁ ద్రెవ్విరని చెప్పెదరింతయ కాక వేలుపున్**
**రాయలసీమలోన చతురంగ బలంబుల తోడ వైరముల్**
**పాయకనున్నవారు సరిపాళెము వైచినయట్ల జ్రస్రమున్"** [10]

రాయలసీమ ప్రాంతాన్ని మట్లి సంస్థానాధీశులు పాలించడం వల్ల కృతి కర్త అనంత భూపాలుడిని సహజంగా వర్ణిస్తూ రాయలసీమ పదాన్ని పద్యంలో వర్ణించి వుండవచ్చు. ' రాయలసీమ' పద ప్రయోగం దేశీ వాడంకగా ఉండేదని తెలుస్తుంది. విజయనగర సామ్రాజ్య రాజ్య విభాగాల్లో 'సీమ' ప్రధానమైనది. సీమను స్థలాలుగా విభజించారు. కొన్ని స్థలాల సముదాయమే సీమ అన్నారు. సీమకు అలాగే స్థలాలకు అధికార్లను కూడా రాజులు నియమించారు. "కన్నడ భాషలో సీమ తెలుగులో నాడు అయినది. నాడు సీమకు మధ్యలో ముత/ వలితం అని పిలిచే భూభాగం వుండి నాటి కాలంలో ఉదయగిరి, పెనుగొండ, హంపి రాష్ట్రాలను వలితాలుగా విభజించారు."[11] హరిహర బుక్కరాయలచే ఏర్పడ్డ విజయనగర సామ్రాజ్యం ప్రస్తుతం మనం పేర్కొంటున్న రాయలసీమ ప్రాంతానికి విస్తరించింది. సుదీర్ఘకాలం విజయనగర రాజుల పాలన కింద వుండడం వల్ల ఈ ప్రాంతం రాయలసీమగా వ్యవహరింపబడుతు వచ్చిందని చరిత్రకారుల భావన. రాయలేలిన సీమ రతనాల సీమ మన రాయలసీమ అనే నానుడి కూడా ప్రజల్లో వ్యాపించింది. అయితే రాయలు యేలిన ప్రాంతం కనుక రాయలసీమ అని పేరు వచ్చిందన్న అభిప్రాయం సరైనది కాదంటూ మైనాస్వామి ఇలా విశ్లేషించాడు. "శ్రీకృష్ణ దేవరాయలు లేదా ఆయన వంశీయులు ప్రస్తుత నాలుగు జిల్లాలనే గాక దాదాపు దక్షిణ భారతదేశాన్నంతా పాలించారు. ఆ ప్రకారం దక్షిణాపథమంతా రాయలసీమగా పిలువబడాలి. రాయలు అనేది వంశపు గుర్తుకాదు. రాజుకు పర్యాయ పదం. తెలుగులో రాయలు, కన్నడంలో రాయరు, తమిళంలో రాయన్ అనే పదాలు రాజు నుంచి వచ్చినవే. ఎక్కువ మంది రాజులు ఈ ప్రాంతంలో నివసించి నందువల్ల రాజుల దేశంగా, రాజుల సీమగా పేరు గాంచింది. దానిననుసరించే 'రాయలసీమ' అనే పదం

పుట్టింది."[12]

'రాయ' అనే పదం రాట్ నుండి రాజ్, రాయల్‌గా పరిణామం చెందింది. రాజః అనే సంస్కృత రూపం తెలుగులో రాజు, రాయలుగా నిలిచింది. సీమ అంటే ప్రదేశం లేదా ప్రాంతమని అర్థం. రాజులు వున్న ప్రాంతమనే అర్థంలో 'రాయలసీమ' పదం ధ్వనిస్తోంది."[13] నంద రాజులు, మౌర్యులు, పల్లవులు, చాళుక్యులు, చోళులు, విజయనగర రాజులు మొదలగు అనేక మంది రాజులు ఈ ప్రాంతాన్ని పాలించారు. "ప్రాచీన కాలంలో రాయలసీమ రేనాడుగా పిలువబడింది. రేడు అంటే రాజు అని అర్థం. నాడు అంటే రాజ్యం. రేడునాడు రేనాడు అయింది. రేనాడు అనగా రాజుల దేశం దానినే మహారాజనాడు అని కూడా అనేవారు."[14] క్రీ.శ. 6వ శ॥ నుంచి సీమ వివిధపేర్లతో పిలువబడింది. మొట్టమొదటి తెలుగు శాసనం కలమళ్ళ శాసనంలో 'రేనాణ్డు' పేర్కొనబడింది. "పాలకొండలు, నల్లమల, ఎర్రమల అనే కొండల మధ్య తుంగభద్ర వరకు విస్తరించిన భూభాగం కడప, కమలాపురం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు తాలూకాలు 'రేనాడు' అని, నేటి పులివెందుల తాలూకా చిత్రావతీ, పినాకినీ నదీ పరివాహక ప్రాంతం 'పలుగునాడు, ములికినాడు' అని, రాయచోటి, మదనపల్లి, వాయిల్పాడు ప్రాంతాలు 'వైదుంబవాడి' అని, రాజంపేట, సిద్ధవటం, బద్వేలు తాలూకాలు 'పొత్తపినాడు' అని నాటి వ్యవహారం."[15] సీమ ప్రాంతాల్లో అనేక మంది రాజులు, సామంతులు, పాలెగాళ్ళు పాలించడం వల్ల చారిత్రక, సాంఘిక, సాంస్కృతిక నేపథ్యంలోంచి ఈ ప్రాంతం 'రాయలసీమ'గా వ్యవహరించడం జరిగిందనిపిస్తోంది.

## 1.4 రాయలసీమ నామకరణం:

భౌగోళికంగా చారిత్రకంగా రాజకీయంగాను రాయలసీమకు కొంత చరిత్ర వుంది. ఈ ప్రాంతాన్ని రాయలసీమ అని పిలిచెందెవరు? ఆ నామకరణం ఎట్లా జరిగింది? ఈ ప్రశ్నలకు సమాధానం 'దత్తమండలాలు' అనే పేరుతో కొంత చరిత్ర ముడిపడి వుంది. నేటి రాయలసీమ 1790 నాటికి టిప్పుసుల్తాన్ ఆధీనంలో వుండేది. మైసూరు యుద్ధంలో టిప్పుసుల్తాన్ ఓడిపోయి చనిపోవడంతో తిరిగి సీమ ప్రాంతం నిజాం ఆధీనంలోకి వచ్చింది. హైదరాబాద్ నిజాం 1800 సం॥ అక్టోబరులో బ్రిటీష్ వారితో 'సైన్యసహకార ఒప్పందం' షరుతుల ప్రకారం సైనిక పోషణ నిమిత్తం తన అధీనంలో వున్న సీమ ప్రాంతాలను బ్రిటీష్ వారికి దత్తత ఇచ్చాడు. ఈ ప్రాంతాలనే 'దత్తమండలాలు' అని పిలుస్తారు. ఈ విధంగా బ్రిటీష్ వారు తమకు లభించిన కొత్త భూభాగాలను 'సీడెడ్ డిస్ట్రిక్స్' పేరుతో కొనసాగించారు.

కాలానుగుణంగా దత్తమండలం నుంచి రాయలసీమగా వ్యవహారంలోకి వచ్చింది. దేశంలో జాతీయాభిమానం రగులుతున్న రోజుల్లో తెలుగువారిలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమిస్తున్న రోజులవి.

1913లో మద్రాస్ రాష్ట్రం నుండి ఆంధ్రరాష్ట్రం విడిపోవాలనే లక్ష్యంతో ఆంధ్రమహాసభ ఏర్పడింది. 1928లో నంద్యాలలో జరిగిన ఆంధ్రమహాసభలలో సీమ ప్రాంత సమస్యలు, 'ప్రథమ దత్తమండల సమావేశం' వంటివి జరపాలని నిర్ణయించారు. కడప కోటిరెడ్డి అధ్యక్షతన దత్తమండల  సమావేశంలో సీమ ప్రజల ఆత్మగౌరవం, వ్యక్తిత్వం కాపాడుకోవడానికి దాస్య చిహ్నముగా దత్తమండలం అనే పేరు కాకుండా మరో పేరు ఏదైనా వుండాలని చర్చ జరిగింది. చిలుకూరి నారాయణరావు ఈ సమావేశంలో పాల్గొని 'రాయలసీమ' అనే పేరును ప్రతిపాదించాడు. చిలుకూరి వారు అనంతపురం వచ్చేనాటికి సీమ వాసుల్లో దత్త అనే మాట ఏవగింపు కలిగి వుండటాన్ని గమనించి 1928 లో 'దత్త' అనే పేరుతో 128 పంక్తుల 'మంజరీ ద్విపద'లో గేయాన్ని రాసి కళాశాల మ్యాగజైన్‌లో ప్రచురించారు.

**" మారాష్ట్రి నామాట మరచినావమ్మా**
**కర్ణాటి నాపాటు కన్నావటమ్మా**
**దత్తనందురు నన్ను దత్తనెట్లగుదు**
**రిత్త మాటల చేత చిత్తమ్ము కలగె**
**ఇచ్చిన దెవ్వరో పుచ్చిన దెవరో**
**పుచ్చు కొన్నట్టియా పురుషులు నెవరో**
**తురక బిడ్డండిచ్చె దొరబిడ్డ పట్టె**
**మరదలా యనియిటు మరియాదమీరి"**[16]

అని గేయాన్ని రాస్తూ సీమ ప్రాశస్త్యాన్ని కొనియాడారు. ఈ ప్రాంతాన్ని మిగతా ఆంధ్ర దేశీయులు తమ ప్రాంతంలో భాగంగా చూడాలని, సీమ క్షేమాన్ని కోరుకోవాలని, ఆంధ్రభాష ప్రజలందరు ఐక్యతతో వుండాలని చిలుకూరి వారు గేయంలో తెలియజేశాడు.

చిలుకూరి వారి సూచనను సభలో అందరు ఆమోదం తెలిపారు. పప్పూరి రామాచార్యులు ఆ తీర్మానాన్ని ప్రతిపాదించారు. గుత్తి కేశవపిళ్ళె, కడప కోటిరెడ్డి, గాడిచెర్ల హరిసర్వోత్తమరావు, కల్లూరు సుబ్బారావు, టి.ఎన్.రామకృష్ణారెడ్డి మొదలైన వారు సమర్థించగా సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, గడియారం వేంకట శేషశాస్త్రి, పుట్టపర్తి నారాయణచార్యులు, విద్వాన్‌విశ్వం, తిరుమల రామచంద్ర మొదలైన కవులు, పండితులు, పరిశోధకులు, విధ్వాంసులు 'రాయలసీమ' అన్న పేరుకు విస్తృతమైన ప్రచారాన్ని తెచ్చిపెట్టారు.

"రాయలేలిన రతనాల సీమగా గొప్ప సాంస్కృతిక వారసత్వం, ఉన్నతమైన స్థానంలో కొనసాగిన ఈ ప్రాంతం దత్త మండలం(1800) నుండి రాయలసీమ(1929)గా నామకరణం జరగడానికి

129 సం॥ల కాలం పట్టింది. అంటే ఇప్పటికి 89 సం॥ల క్రితం రాయలసీమ సమాజం తన ఆత్మ గౌరవాన్ని నిలుపుకునే ప్రయత్నంలో భాగంగా గొప్ప అడుగు వేసింది. అందుకే ఈ రోజును 'రాయలసీమ ఆత్మగౌరవ దినోత్సవం'గా జరుపుకోవాలి. 1937 నవంబర్ 16 నాటి శ్రీబాగ్ ఒప్పందంలో సీమ తన హక్కులకు ఆమోద ముద్ర వేయించింది. అందుకే ఆ రోజును 'రాయలసీమ హక్కుల దినోత్సవం'గా జరుపుకోవాలి".[17] గత 90 సం॥లుగా రాయలసీమ ప్రజానీకం తమ పూర్వీకులు అందించిన స్ఫూర్తితో అభ్యుదయం, ప్రగతిపథం వైపు నడవాల్సిన అవసరం ఎంతైనా వుంది. రాయలసీమ అభివృద్ధి కోసం సీమ హక్కుల కోసం పోరాటాలు చేయలవలసిన అవసరం వుంది.

## 1.5 రాయలసీమలో తిరుగుబాట్లు- స్వాతంత్ర్యోద్యమం:

19వ శ॥ ప్రారంభంలో రాయలసీమలో పాలెగాళ్ళ తిరుగుబాట్లు చాలా జరిగాయి. 1766 సం॥ నాటికి కోస్తా సర్కారులను, 1800లో రాయలసీమ జిల్లాలను, 1802లో కర్ణాటక నవాబు నుండి నెల్లూరు, చిత్తూరు జిల్లాలను బ్రిటీష్ వారు పొందారు. వీరిలో కొందరు నియంతలుగా పాలిస్తూ ఈ ప్రాంతాలను ముడి సరుకులు లభించే మార్కెట్‌గా భావించి పన్నులు అధికంగా వసూలు చేయడం, ఆర్థిక దోపిడి చేస్తూ జాతి వివక్షత ప్రదర్శించారు. బ్రిటీష్ వారి పాలనా విధానాల వల్ల స్థానిక పాలెగాళ్ళలో అసంతృప్తి ప్రబలింది. సీమ ప్రాంతాల్లో దాదాపు 80 మంది పాలెగాళ్ళు వుండేవారు. థామస్ మన్రో ఈ ప్రాంతానికి కలెక్టర్‌గా నియమించబడటంతో స్థానిక పాలెగాళ్ళను అణిచివేతకు కఠిన చర్యలు చేపట్టాడు. కర్నూలులోని కోయిలకుంట్ల తాలూకా ఉయ్యాలవాడ పాలెగాడు అయిన నరసింహారెడ్డి బ్రిటీష్ వారిని ఎదురించాడు, తిరుగుబాటు చేశాడు. 1847లో కోవెలకుంట్ల జుర్రేరువాగు వద్ద నరసింహారెడ్డిని బహి రంగంగా ఉరితీసారు.

కర్నూలు నవాబు గులాం రసూల్‌ఖాన్ బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా నిలిచి పోరాటాలు చేశాడు. 1839లో బ్రిటీష్‌వారు రసూల్‌ఖాన్ పై దాడులు చేయగా రసూల్‌ఖాన్ బంధించబడి చంపబడ్డాడు. చిత్తూరు పాలెగాళ్ళలో బంగారుపాళ్యానికి చెందిన చంద్రశేఖర్ నాయుడు, మొగిరాల పాలకుడు కుమార రఘునాథ నాయుడు, పాకాల శేషమనాయుడు, పలిచెర్ల తిమ్మనాయుడు, వదరుకొండ ముద్దురామప్ప నాయుడు మొదలగు వారు బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. పాలెగాళ్ళలో చాలామంది బ్రిటీష్ వారి నిరంకుశత్వాన్ని, అణచివేతను వ్యతరేకిస్తూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం తిరుగుబాట్లను లేవదీసి పోరాటాలు చేస్తూ అమరులైనారు. పాలెగాళ్ల తిరుగుబాట్లు తెలుగు చరిత్రలో స్వాతంత్ర్యోద్యమానికి నాంది పలికి భారత స్వాతంత్ర్యానికి పునాదిగా ఏర్పడ్డాయి.

## 1.6 జాతీయోద్యమం – రాయలసీమ పాత్ర:

1885లో భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనతో దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమానికి బలం చేకూరింది. జాతీయ సభలకు కేశవపిళ్లై, యం. సభాపతి మొదలియార్ మొదలైన చాలామంది నాయకులు హజరయ్యారు. పి.ఆనందచార్యులు రాయలసీమ వాసి నాగపూర్ సమావేశానికి అధ్యక్షులుగా నియమించ బడ్డారు. ఆంధ్రలో కాంగ్రెస్ జిల్లా సంఘాలను ఏర్పాటు చేసి ప్రజలను జాగృతం చేశారు. అనంతపురంలోని పెనుగొండలో వ్యవసాయ, రాజకీయ సమస్యలు చర్చించడానికి 1903లో వ్యవసాయ సంఘాన్ని ఏర్పాటు చేసుకొని సమైక్యతకు సీమ వాసులు దోహదపడ్డారు. జాతి అభివృద్ధికి, జాతీయతా భావాన్ని విస్తృతం చేయడంలోను రైల్వే, రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేసారు. వార్తా పత్రికలు ప్రజల అభిప్రాయాలను జాతీయ భావన వైపు మలిచాయి.

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా 1921లో గాంధీజీ కర్నూలు, చిత్తూరు జిల్లాలలో పర్యటించి స్వదేశీ ఉద్యమం, సహాయ నిరాకరణ, అహింసను బలపరచాలని కోరుతూ ప్రజల నుండి విరాళాలు సేకరించాడు. హెూంరూల్ ఉద్యమంలో భాగంగా మదనపల్లెలో పర్యటించిన అనీబిసెంట్ 1915లో నేషనల్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఆమె ప్రజలకు 'స్వేచ్ఛలేని జీవితం జీవచ్ఛవం లాంటిదని' భోదించారు. హెూంరూలు ఉద్యమంలో సీమ ప్రజలు పాల్గొన్నారు. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు హెూంరూల్ ఉద్యమంలో పాల్గొని ప్రచారం చేశారు.

1905 వందేమాతరం ఉద్యమంలోను గాడిచర్ల వారు పాల్గొన్నారు. కడపలోని జమ్మల మడుగులో విదేశీ వస్తు బహిష్కరణ సభ జరిగింది. కర్నూలులోని యునైటెడ్ నేటివ్ క్లబ్ స్వదేశీ ఉద్యమ కాలంలో కీలక పాత్ర వహించింది. అనంతపురంలోని బర్మా ఆయిల్ కంపెనీ గుమాస్తా తన వస్త్రాలను బహిరంగంగా తగులబెట్టాడు. సీమలో చాలా ప్రాంతాలలో నిరసన కార్యకలాపాలను కొనసాగించారు.

సహాయనిరాకరణోద్యమంలో భాగంగా గాంధీ సిద్ధాంతాలు, ఉపన్యాసాలు సీమ ప్రజలను ఆకర్షించాయి. సీమ నాయకుల ప్రోద్భలంతో ఈ ఉద్యమం బలాన్ని పుంజుకొని మద్యపాన నిషేధం, ఖాదీ ఉద్యమాలకు బలం చేకూరాయి. గాంధీ ఉప్పు సత్యాగ్రహ ప్రభావం కడప, బళ్ళారి ప్రాంతాలపై ప్రభావం చూపింది. తెలుగు ప్రాంతాలలో ఉద్యమాన్ని తీవ్రతరం చేయడానికి శిక్షణా శిబిరాలు ఏర్పడ్డాయి. గాంధీజి క్విట్ ఇండియా ఉద్యమంలో రాయలసీమ యువత చురుగ్గా పాల్గొనింది. ఈ ఉద్యమంలో సీమలో చాలా ప్రాంతాలలో విప్లవ కార్యకలాపాలు సాగాయి. నీలం సంజీవరెడ్డి, సర్దార్ నాగప్ప, అమరావతమ్మ మొదలగు నాయకులు జైలు పాలయినారు. జాతీయోద్యమ సంగ్రామంలో రాయలసీమ తన వంతు కృషి చేసి చరిత్రలో తన పేరును నిలుపుకొంది.

## 1.7 మద్రాస్ రాష్ట్రం – రాయలసీమ:

క్రీ.శ. 1800 నాటికి హైదరాబాద్ నిజాం నుండి కోస్తా సర్కారులు, రాయలసీమ జిల్లాలు బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ ఆధీనంలోకి వచ్చాయి. తెలంగాణా మాత్రం హైదరాబాద్ నిజాం ఆధీనంలోనే ఉండిపోయింది. మద్రాస్ రాష్ట్ర పాలనలో కోస్తా సర్కారులు, రాయలసీమ జిల్లాలు తమిళ ప్రాంతంతో కలిసి ఉండవలసి వచ్చింది. మద్రాస్ రాష్ట్రంలో తెలుగు ప్రాంతం 58 శాతం విస్తీర్ణంతోనూ జనాభాలో 2 కోట్లు వుండగా విద్య, ఉద్యోగ, వ్యవసాయం, పరిశ్రమలు, సైన్యంలో తెలుగువారికి అన్యాయం జరిగింది. తెలుగువారిపై తమిళీయుల ఆధిపత్యం వుండేది. బ్రిటీష్ వారి మద్రాస్ రాష్ట్రంలో తెలుగువారు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఉద్యమాలు చేయడం ప్రారంభించారు. రాయలసీమ ప్రాంతం పై బ్రిటీష్ వారి నిర్లక్ష్య ధోరణి సీమ వెనుకబాటుతనానికి కారణమైంది. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ఉద్యమించే రోజుల్లోనే సీమ వాసులు కోస్తా వారితో కలిసి వుండడానికి వ్యతిరేకత చూపారు.

## 1.8 ఆంధ్ర మహాసభ ఉద్యమం:

మద్రాస్ రాష్ట్రం నుండి తెలుగు వారు విడిపోయి ఆంధ్రరాష్ట్రం ఏర్పడాలనే లక్ష్యంతో ఆంధ్ర మహాసభలను ఏర్పాటు చేశారు. “ఆ రోజుల్లోనే రాయలసీమ వారు తమ హక్కులు, అవసరాల కోసం సంఘటితమవుతున్నారు. బాపట్లలో జరిగిన మొదటి ఆంధ్ర మహాసభలో పాల్గొన్న గుత్తి కేశవ పిళ్లై ప్రత్యేక రాష్ట్రం ఏర్పడం వల్ల తమ ప్రాంతానికి వచ్చే లాభమేమిటని ప్రశ్నించారు?. రాయలసీమ అవసరాలను గూర్చి ఆలోచన ఆనాడు మొదలయింది.”[18] బ్రిటీష్ వారి వలస పాలనలోనూ, తమిళీయుల ఆధిపత్యంలోనూ, కోస్తా వారి నిర్లక్ష్య ధోరణి వల్లనూ సీమవాసులు చాలా వెనుకబాటుతనానికి గురైనారని తెలుస్తుంది.

కోస్తా ప్రాంత నాయకులు రాయలసీమ వారిని కలుపుకొని ఆంధ్ర మహాసభల ఉద్యమాన్ని కొనసాగించారు. 1913లో బాపట్లలో ‘ఆంధ్రమహాసభ’ అనే సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సభకు బయ్యా నరసింహేశ్వర శర్మ అధ్యక్షత వహించాడు. ప్రత్యేకాంధ్రపై విస్తృతంగా చర్చ జరిగింది. సీమ ప్రాంత నేతలు ఆంధ్రరాష్ట్ర నిర్మాణంపై సముఖత చూపలేదు.

## 1.9 రాయలసీమ మహాసభ:

రాయలసీమ ప్రాంత ప్రయోజనాల పరిరక్షణ పేరుతో 1934 జనవరి 27 జస్టిస్‌పార్టీ ప్రముఖులు సి.హెచ్. నరసింహరెడ్డి, కె.సుబ్రహ్మణ్యం వంటివారు మద్రాసులో రాయలసీమ మహాసభను ఏర్పాటు చేశారు. ఈ సభకు నెమలి పట్టాభి రామారావు అధ్యక్షత వహించారు. 1935 సెప్టెంబర్‌లో కడపలో రెండవ మహాసభ జరిగింది. ఈ సమావేశానికి టి.ఎన్. రామక్రిష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చర్చకు వచ్చింది. కాని సీమ నాయకులు హాజరైనట్లు కనబడదు.

## 1.10 శ్రీబాగ్ ఒప్పందం - కోస్తా వారి హామీలు- ఉల్లంఘనలు:

రాయలసీమ నాయకుల అసంతృప్తిని గ్రహించిన ఆంధ్ర నాయకులు 1937న బెజవాడ ఆంధ్రసభలలో సీమ నేతలకు పెద్దపీట వేశారు. పప్పూరి రామాచార్యులు సీమకు జరిగిన అన్యాయాల గురించి, సమస్యల గురించి ప్రసంగిస్తూ సీమ భాషపట్ల ఆంధ్రులకున్న చిన్నచూపును, సీమ గ్రంథాల్ని పాఠ్యాంశాలుగా తొలగించడాన్ని, కళాశాల ఉద్యోగాలలో ఉన్న అసమానతలను వివరించారు. ఈ వాదన మీద సరైన నిర్ణయం తీసుకునేందుకు ఇరు ప్రాంతాల నాయకులతో పట్టాభి సీతారామయ్య ఒక కమిటీని నియమించారు. ఇది జరిగిన రెండు నెలల తర్వాత రెండు ప్రాంతాల నాయకులు 1937 నవంబర్ 16న మద్రాస్ నగరంలోని కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారి నివాస గృహం'శ్రీబాగ్' లో సమావేశమై ఒప్పందం చేసుకున్నారు. దీనినే 'శ్రీబాగ్ ఒప్పందం' అంటారు. రాయలసీమ నేతల డిమాండ్లు ఈ ఒప్పందంలో వున్నాయి. అవి.

1. విశ్వవిద్యాలయాలకు సంబంధించి ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోనే వాల్తేరుతో పాటు అనంతపురంలో కూడా విశ్వవిద్యాలయ కేంద్రం స్థాపించాలి.
2. నీటిపారుదలకు సీమ ప్రాంతాలు వ్యవసాయికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు నీటిపారుదల ప్రణాళికలలో కనీసం 10 సం॥లు లేదా మరింత ఎక్కువ కాలం ఈ ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కృష్ణ, తుంగభద్ర, పెన్నానదీ జలాల వినియోగంలో అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
3. శాసన సభ విషయంలో సాధారణ స్థానాలు జిల్లాల వారీగా సమాన నిష్పత్తిలో వుండాలి.
4. విశ్వవిద్యాలయం, హైకోర్టు, రాజధాని స్థాపన ఒక చోట కేంద్రీకృతం కాకుండా అన్ని ప్రాంతాలకు ఉపయోగకరంగా ఉండేటట్లు నిర్ణయించాలి. హైకోర్టు, రాష్ట్ర రాజధానిని మాత్రం సరైన ప్రదేశాలలో ఒకటి రాయలసీమలో మరొకటి కోస్తాలో నెలకొల్పాలి. ఈ రెండింటిలో దేనినైనా కోరుకునే అవకాశం రాయలసీమకు మొదట ఇవ్వాలి.
5. నదీ జలాల పంపిణీ విషయంలో భవిష్యత్‌లో ఏదైన వివాదం తలెత్తితే పరిష్కారంలో రాయలసీమ అవసరాలను ముందు తీర్చేవిధంగా ఉండాలి.

శ్రీబాగ్ ఒప్పందం అనంతరం సీమ నేతలు ఆంధ్రరాష్ట్రం కోసం ఉద్యమాలలో పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వల్ల 1953లో కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం, ఆ తర్వాత విశాలాంధ్ర పేరుతో 1956లో హైదరాబాద్ రాజధానిగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది.

కాలానుగుణంగా శ్రీబాగ్ ఒప్పందంలోని అంశాలు అమలుకు నోచుకోలేదు. ఈ ఒప్పందం కొందరి నేతల స్వార్థ ప్రయోజనాల కోసం నిలిచిపోయి చివరికి నిరాశగానే మిగిలిపోయింది. నదీ జలాల

పంపకం వాటాలోను, రాజధాని, హైకోర్టు స్థాపనలోనూ, నిధుల వాటాలోనూ, ఉద్యోగాల కల్పనలోనూ ఇంకా అనేక అంశాల పట్ల రాయలసీమ వాసులకు అందని ద్రాక్షగానే మిగిలిపోయింది.

### 1.11 ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం – ఒక డిమాండ్:

భారతదేశంలోని రాజ్యాంగ, ఫెడరల్ చట్రంలో ప్రత్యేక రాష్ట్రం కోసం భారతదేశంలోని వివిధ ప్రాంతాలు, ఉపప్రాంతాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ డిమాండ్లు సాంస్కృతిక విభేదాలు, ప్రాంతీయ అసమానతలు, వెనుకబాటుతనం, రాజకీయ నిర్లక్ష్యాల ఫలితంగా ఏర్పడుతున్నాయి. ప్రత్యేక రాష్ట్రం కోసం కొన్ని ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి ఉద్యమాలు దశాబ్దాల తరబడి పోరాడుతున్నాయి.

"రాయలసీమ రాష్ట్ర ఉద్యమ చరిత్రకు ఒక విశిష్టత వుంది. ఇది ఒక సుదీర్ఘ పోరాటంగా వుంది. ఎన్నో ఆటుపోట్లు, నమ్మకాలు, వంచనలు, ద్రోహాలను తట్టుకొని ముందుకొస్తున్నది. రాయలసీమ రాష్ట్ర ఉద్యమ చరిత్రకు 90 ఏళ్ళ వయసొచ్చింది. 90 ఏళ్ళ ఉద్యమ బాధ్యతలను నేటి యువతరం భుజ స్కందాలపై పెడుతున్నది."[19] ప్రత్యేక రాయలసీమ నినాదం సీమ జిల్లాలలో బలంగా వినిపిస్తోంది. రాయలసీమ రాష్ట్ర నినాదం తెలుగువారు మద్రాస్ రాష్ట్రంలో భాగంగా వున్నప్పటి నుంచే సీమ వాసుల్లో వుంది. క్రీ.శ. 1800 నుండి బ్రిటీష్ పాలనలో కోస్తావారితోను, 1956 నుండి సమైక్యాంధ్రప్రదేశ్‌లో కోస్తా, తెలంగాణా వారితోను రాయలసీమ కలిసి వుంది. కాని సీమ ప్రాంతానికి ఒరిగిందేమి లేదు. మిలిగింది వెనుకబాటుతనం, కరువులు, రైతుల ఆత్మహత్యలు, చీత్కారాలు, మోసాలు, చిన్నచూపులు.

1931 జూన్ 21న కడప కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పప్పూరి రామాచార్యులు తొలిసారిగా రాయలసీమ రాష్ట్ర ఆవశ్యకతను గురించి స్పష్టపరిచారు. "భాషా ప్రయుక్త రాష్ట్రాలు అక్కరలేదనను, అందువల్ల లాభాలు అనేకం వున్నాయి. కానీ మదరాసు నుంచి ఆంధ్రరాష్ట్రము విడివడుట లాభదాయకమయినచో ఆంధ్రరాష్ట్రము నుంచి రాయలసీమ విడివడుట మరింత లాభదాయకము గదా! ఉత్తరాది వారిని, మనలను ఎర్రమల కొండలు వేరు చేయుచున్నవి. వారి భాష, ఆచార వ్యవహారాలు వేరు. ప్రకృతి సిద్ధమైన విషయము కావున పొత్తు కుదరదు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మాకు అనుభవ మైనది.....కావున ఉత్తరాది వారితో చేరుట కన్నను వేరు రాష్ట్ర స్థాపనకు గడంగుట మేలు."[20] మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్రరాష్ట్రం విడిపోవక ముందే సీమ వాసులకు ఎదురైన అనుభవరీత్యా రామాచార్యుల వారు స్పష్టంగా విశదీకరించారు. ప్రత్యేక రాష్ట్రంగా రాయలసీమకు గల అర్హతలను వారే ఇలా చెబుతున్నారు. "రాయలసీమలో 80 లక్షల జనాభా వుంది. ప్రకృతి సంపద, ఖనిజ అటవీ సంపదలున్నాయి. ఐరోపాలోని డెన్మార్కు మొదలైన చిన్న దేశాలకన్నా తిరువాన్కూరు, మైసూరు వంటి సంస్థానాల వలె రాయలసీమ ప్రత్యేకంగా అభివృద్ధి చెందగలదు."[21] అభివృద్దికి చిన్న పెద్ద అనే పరిధులను గురించి మాట్లాడటం

పక్కన  పెడితే రాయలసీమ విస్తీర్ణ పరంగానూ జనాభా ప్రాతిపదికంగానూ దేశంలోని 12 రాష్ట్రాల కన్నా పెద్దది. ప్రపంచంలోని 40 దేశాల కన్నా పెద్దది. రాయలసీమ ప్రత్యేక రాయలసీమ రాష్ట్రంగా ఏర్పాటు కావడానికి అన్ని సదుపాయాలున్నాయని భావించవచ్చు.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణం కోసం తెలుగువారు చేస్తున్న ప్రయత్నాల్లో సీమ నేతలు 'రాయలసీమ మహాసభల'ను ఏర్పాటు చేసి ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం కావాలని డిమాండ్ చేశారు. 1947లో రాయలసీమ మహాసభలలో నీలం సంజీవ రెడ్డి గారు అధ్యక్షులుగా వుంటూ ఇలా ఉపన్యసించారు. "మనకు రాజ్యం రాముడేలినా, రావణుడేలినా మనకు ఒకటేననే భావం కలగడానికి కారణం కోస్తావారి స్వార్థపూరిత విధానాలు. ఒక వేళ మద్రాస్ రాష్ట్రం నుండి 'తెలుగు రాష్ట్రం' వచ్చినా మనకు మోక్షం కలుగుతుందనే ఆశ ఇప్పటి మన ఉత్తరాది(కోస్తా) సోదరుల ఉపేక్ష భావాన్ని చూస్తే ఏమాత్రం లేదు. సీమకు శాసన బద్ధమైన రక్షణలు, హక్కులు లభించని పక్షంలో మనం రాయలసీమ రాష్ట్రాన్ని ప్రత్యక్షంగా కోరవలసిందే"[22]నని స్పష్టం చేశారు.

రాయలసీమ రాష్ట్రం సాధనతోనే మనకు విమోచన కలుగుతుంది అని రాయలసీమ నాయకులు, మేధావి వర్గం, పరిశోధకులు భావించి 1980 దశకం నుంచి పోరాటాలు, ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

1. డా॥ యం.వి. రమణా రెడ్డి మానవతావాది, అభ్యుదయ వాది. 'రాయలసీమ విమోచన సమితి'ని ఏర్పాటు చేసి ఉద్యమిస్తున్నారు. కరువు, దారిద్ర్యాన్ని నిర్మూలించుటకు నిరాహార దీక్ష చేపట్టారు. రాయలసీమ విమోచన రథంలో సీమ ప్రాంతాలను పర్యటిస్తూ జన జాగృతికి కృషి చేస్తూ ప్రజలను చైతన్యం చేశారు.
2. టి.జి. వెంకటేష్ 'రాయలసీమ హక్కుల ఐక్య వేదిక'ను 2004లో ఏర్పాటు చేశాడు. రాయలసీమ ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు మరియు ప్రాంతం అభివృద్ధి, హక్కుల గురించి తన గళాన్ని వినిపిస్తున్నారు.
3. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన కుంచం వెంకటసుబ్బారెడ్డి 2008లో ' రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ'ని ఏర్పాటు చేసి గ్రేటర్ రాయలసీమ రాష్ట్రం కోసం ఉద్యమించారు. 2010 నవంబర్18లో 2 వేల కి.మీ.ల మహా పాదయాత్రను ప్రారంబించారు.
4. కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ సభ్యుడు బైరెడ్డి రాజశేఖర రెడ్డి సీమలో మేల్కొలుపు యాత్రలు చేశాడు. 2013లో 'రాయలసీమ పరిరక్షణ సమితి పార్టీ'ని ఆవిష్కరించారు. రాయలసీమ రాష్ట్రం ఏర్పాటు చేయాలని ప్రధానికి, రాష్ట్రపతికి వినతి పత్రాలు సమర్పించాడు.

5. 'రాయలసీమ విద్యావంతుల వేదిక'ను కర్నూలుకు చెందిన యువ మేధావి వర్గం ఏర్పాటు చేసి సీమ వెనుకబాటుతనం, అన్యాయాలను, జల దోపిడి గూర్చి, ప్రత్యేక రాష్ట్ర నిర్మాణ ఆవశ్యకతలను గూర్చి కరపత్రాలు, బుక్‌లెట్లు, నివేదికలను ప్రచురిస్తూ ఎప్పటికప్పుడు ప్రజలకు, పాలకులకు తెలియజేస్తున్నారు. రాయలసీమలో ప్రజాసంఘాల జె.ఎ.సి. ఉద్యమాలు నిర్వహిస్తోంది.
6. అనంతపురం జిల్లా నుండి అప్పిరెడ్డి హరినాథ రెడ్డి 'రాయలసీమ సాంస్కృతిక వేదిక'ను ఏర్పాటు చేసి సీమ ప్రాంత సమస్యలు, సీమ సంస్కృతులు, సీమ సాహితీ సంపదను వెలుగులోకి తెస్తున్నాడు. వేమన అభివృద్ధి కేంద్రం ద్వారా సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతపుర ప్రాంతంలో సీమ సమస్యలపై కవిసమ్మేళనాలు, సాహితీ సభలు, చర్చలు నిర్వహించారు. జలసాధన సమితి ఆధ్వర్యంలో సిద్దేశ్వరం అలుగు నిర్మాణంలాంటి నీటి సమస్యలపై పోరాడుతున్నారు.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రంలో రాయలసీమ ప్రాంతం కలవకూడదని సీమ నేతలు ఆ రోజుల్లోనే బలంగా కోరుకున్నారు. నీలం సంజీవరెడ్డి గారి ఆనాటి మాటల్లో " ఈ పరిస్థితిలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడితే మన గతి ఏమిటో అర్థం చేసుకోవాలి. మనం ప్రత్యేక రాష్ట్రంలో చేరినట్లయితే ముందు తరాలలో మనం తలెత్తుకుని బతికే పరిస్థితి వుండదు. అందువల్ల మనం మన హక్కులు తెలుసుకుని ఆ దిశగా పనిచేయాలి. ప్రత్యేక రాయలసీమ రాష్ట్రాన్ని సాధించుకోవాలి. లేకుంటే మోక్షం లేదు."[23] కాబట్టి ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు నుంచి ఇప్పటి వరకు రాయలసీమలో జరిగిన అభివృద్ధి అయితేనేమి, నీళ్ళు వాటా పంపకం, నిధుల ఖర్చు ఇతరత్రా సదుపాయాల గూర్చి ఆలోచిస్తే ఆనాటి సీమ నేతల అభిప్రాయం సరైనదే అనిపిస్తుంది. "మన ప్రాంతం ఖనిజాలకు పుట్టినిల్లయినా అపారమైన దరిద్రంలో ఉన్నాము. ఇంత వరకు విదేశాల క్రింద నలిగాము. ప్రస్తుతం స్వతంత్రులం. ఇంత కూడు, గూడు, నీడ ఆశిస్తున్నాము. ఇటువంటి సందర్భంలో వారు ఆంధ్రరాష్ట్రం పేరిట కొత్త సంకెళ్లు బిగించాలనుకుంటున్నారు. అందువల్ల సోదరులారా మత్తు వదలండి, కళ్ళు తెరవండి, హక్కుల కోసం పోరాడుదాం. మనకు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుందాం."[24]

ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ ఇప్పుడున్న రాజ్యాంగ పరిధిలోనే చేస్తున్న ప్రజాస్వామిక డిమాండ్. దేశంలో కొన్ని రాష్ట్రాలలో ప్రత్యేక స్వయం ప్రతిపత్తి కోసం చేసే పోరాటాలలో భాగంగానే అనిపిస్తుంది. గత 90 సం॥ల అనుభవం వల్ల రాయలసీమ వాసులు కోస్తా పాలక వర్గాల దోపిడి నుండి విముక్తి పొందలేమని అంతవరకు ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం లేదని గ్రహించారు. "సీమ తన గొంతును సవరించుకుంటున్నది. తనదైన అస్తిత్వం కోసం గళం విప్పుతున్నది. అభివృద్ధికి, ఆత్మగౌరవానికి విడదీయరాని సంబంధం ఉంది. గత చరిత్రను తిరగరాయాల్సిన అవసరమూ ఇప్పుడు సీమ ప్రజలు

గుర్తెరుగుతున్నారు. దేబరిస్తే దక్కేది పిడికెడు మెతుకులే. పోరాడితే స్వయం పాలన. అపారమైన ప్రకృతి వనరులతో అద్భుతమైన అభివృద్ధికి రాయలసీమ రాష్ట్ర లక్ష్య సాధనే దారి అదే పోరుదారి."[25] ప్రత్యేక రాష్ట్ర నిర్మాణం రాజకీయ అంశాలతో ముడిపడి వుంది. కాబట్టి రాయలసీమ రాష్ట్రం కోసం పోరాడటమంటే రాజకీయ ఉద్యమానికి సిద్ధం కావాలి. రాయలసీమ ఉద్యమం ప్రజల్లోకి వెళ్ళాలి. అన్ని వర్గాల నుంచి చైతన్యం రావాలి. చరిత్రకారులు, సాహితీవక్తలు ఉద్యమ స్వరూపాలను వివరించాలి. కవులు, రచయితలు, పండితులు, మేధావులు, పరిశోధకులు అందరూ భాగస్వాములై సీమగళాన్ని వినిపించాలి. నాయకులు ముందుండి నడిపించాలి. యువతరం, నవతరం ముందుకు రావాలి. అప్పుడే మనం కోరుకున్న ప్రత్యేక రాయలసీమ రాష్ట్ర కల నెరవేరుతుంది.

## పాదసూచికలు - మొదటి అధ్యాయం

1. విద్వాన్ విశ్వం, పెన్నేటి పాట, పుట-05
2. మైనాస్వామి, ఎన్నాళ్ళీ కన్నీళ్ళు, పుట-71
3. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, పుట-5
4. మైనాస్వామి, ఎన్నాళ్ళీ కన్నీళ్ళు, పుట-16
5. మైనాస్వామి, ఎన్నాళ్ళీ కన్నీళ్ళు, పుట-16
6. హనుమంతరావు. బి.ఎస్.ఎల్, ఆంధ్రుల చరిత్ర, పుట-322
7. హనుమంతరావు. బి.ఎస్.ఎల్, ఆంధ్రుల చరిత్ర, పుట-325
8. హనుమంతరావు. బి.ఎస్.ఎల్, ఆంధ్రుల చరిత్ర, పుట-325
9. హనుమంతరావు. బి.ఎస్.ఎల్, ఆంధ్రుల చరిత్ర, పుట-330
10. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-1
11. జోగినాయుడు.పి, ఆంధ్రప్రదేశ్ చరిత్ర, పుట-211
12. మైనాస్వామి, ఎన్నాళ్ళీ కన్నీళ్ళు, పుట-22
13. హరినాథ రెడ్డి. అప్పిరెడ్డి, ఆత్మగౌరవానికి ప్రతీక రాయలసీమ నామకరణం(వ్యాసం), పెన్నేరు పక్షపత్రిక, డిసెంబరు, 2016, పుట-14.
14. మైనాస్వామి, ఎన్నాళ్ళీ కన్నీళ్ళు, పుట-21
15. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-1
16. హరినాథ రెడ్డి, అప్పిరెడ్డి, శ్రీ సాధన పత్రిక, పుట-63
17. హరినాథ రెడ్డి. అప్పిరెడ్డి, ఆత్మగౌరవానికి ప్రతీక రాయలసీమ నామకరణం(వ్యాసం), పెన్నేరు పక్షపత్రిక, డిసెంబరు, 2016, పుట-16
18. ఆచార్య. సి.హెచ్, రాయలసీమ స్వాతంత్ర్య సమర చరిత్ర, పుట-217,218
19. భూమన్, రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్, పుట-12
20. భూమన్, రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్, పుట-13
21. భూమన్, రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్, పుట-13
22. అరుణ్, ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం, పుట-18
23. భూమన్, రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్, పుట-08
24. భూమన్, రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్, పుట-09
25. అరుణ్, సీమ గొంతుక వినండి, పుట-16

# రెండవ అధ్యాయం

# రాయలసీమ ఆధునిక కవిత్వం
# - పరిచయం

# రెండవ అధ్యాయం

# 2. రాయలసీమ ఆధునిక కవిత్వం - పరిచయం

తెలుగు సాహిత్యానికి వేయి సంవత్సరాలకు పైగా చరిత్ర వుంది. ప్రాఙ్నన్నయ యుగం క్రీ.శ. 1000 మొదలుకొని క్షీణ యుగం క్రీ.శ.1875 వరకు గల సాహిత్యాన్ని ప్రాచీన సాహిత్యం అని ఆధునిక యుగం క్రీ.శ. 1875 మొదలుకొని ప్రస్తుత కాలం వరకు గల సాహిత్యాన్ని ఆధునిక సాహిత్యం అని పిలుస్తున్నాం. భారత, రామాయణ, భాగవతాల ఆంధ్రీకరణ యుగం గడచిపోయింది. దేశీవాఙ్మయం, కావ్యానువాదాలు, ప్రబంధాలు, యక్షగానాలతో ప్రాచీన సాహిత్యం సుసంపన్నమైంది. ఆధునిక యుగం ప్రారంభమైన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన పరిణామాలు, పాశ్చాత్య సాహిత్య రీతుల ప్రభావం వల్ల ఆధునిక తెలుగు సాహిత్యం కొత్త పుంతలు తొక్కింది. తెలుగు కవిత్వం నన్నయ కాలం మొదులు కొని నేటి ఆధునిక కవులదాకా సాహిత్యంలో శక్తివంతమైన పాత్రను పోషిస్తోంది. ఆధునిక యుగారంభంలో కట్టమంచి రామలింగారెడ్డి, రాయప్రోలు సుబ్బారావు, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు మొదలైన వారు ఆంగ్లవిద్య ప్రభావం వల్లనూ భారతీయ సాహిత్యంలో వస్తున్న నూతన పోకడలను అందిపుచ్చుకొని నవ్య కవితారీతులకు శ్రీకారం చుట్టారు.

## 2.1 రాయలసీమ ఆధునిక కవిత్వ నేపథ్యం-పరిచయం:

తెలుగు సాహిత్య చరిత్రలో రాయలసీమ సాహిత్యం ఒక ప్రత్యేక స్థానం కలిగి వుంది. ఈ ప్రాంతం అనేకమంది ప్రాచీన,ఆధునిక కవులకు నిలయమైంది. ఈ ప్రాంతానికి చెందిన ఎందరో కవులు, కవిపండితులు, సాహితీ మూర్తులు ప్రకృతి రమణీయతను, సామాజిక చిత్రాన్ని కవితారూప దర్శనం చేశారు. నాచన సోమనాథుడు, అల్లసాని పెద్దన, నంది తిమ్మన, పింగళి సూరన, ధూర్జటి, బద్దెన, రామరాజభూషణుడు, చదలవాడ మల్లన, తాళ్ళపాక అన్నమయ్య, తిమ్మక్క మొదలగు తాళ్ళపాక కవులు, తరిగొండ వెంగమాంబ, పోతులూరి వీరబ్రహ్మం, వేమన మొదలగు కవులు, కవయిత్రులు రాయలసీమ ప్రాంతానికి చెందినవారు. వీరంతా సంప్రదాయ సాహిత్యంలో తమ కావ్యాల ద్వారా సుప్రసిద్ధులైనారు. ఆధునిక యుగారంభంలో కట్టమంచి రామలింగారెడ్డి, గడియారం వేంకటశేషశాస్త్రి, దుర్భాక రాజశేఖర శతావధాని, పుట్టపర్తి నారాయణచార్యులు, రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ, కోలాచలం శ్రీనివాసరావు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, విద్వాన్ విశ్వం, బెళ్ళూరి శ్రీనివాసమూర్తి, భూతపురి సుబ్రహ్మణ్యం, తిరుమల రామచంద్ర, సర్దేశాయి తిరుమలరావు, కె.వి.నారాయణ రావు మొదలగు ఎందరో కవులు, పండితులు, పరిశోధకులు రాయలసీమ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించారు.

రాయలసీమ ఆధునిక కవిత్వం-పరిచయం అన్న అధ్యాయానికి పరిధిని కట్టమంచి రామలింగారెడ్డి గారి ముసలమ్మ మరణం కావ్యం ప్రచురితమైన కాలం అంటే 1900 సం॥ నుంచి 1985 మధ్యకాలాన్ని పరిధిగా నిర్ణయించాను. నా పరిశోధనాంశ కాల పరిధి(1986-2015)కి నేపథ్యంగా రాయలసీమ ఆధునిక కవిత్వాన్ని పూర్వ పరిచయం చేయాలనే ఉద్దేశంతోనూ రాయలసీమ ఆధునిక కవుల కవితా స్వరూపాలను, వైవిధ్యాలను తెలపాలనే ఆశయంతోనూ ఈ కాలాన్ని(1900- 1985) పరిధిగా నిర్ణయించుకున్నాను.

ఈ అధ్యాయం రాయలసీమ ఆధునిక కవిత్వం- పరిచయంలో 'ఆధునిక కవిత్వం' అంటే సీమలో ఆధునిక కాలంలో వచ్చిన కవిత్వం. ఇంకా చెప్పాలంటే 20వ శతాబ్ది ప్రారంభం నుంచి వచ్చిన కవిత్వం అని అర్థం చేసుకోవాలి. రాయలసీమలో ఆధునిక కవిత్వం 19వ శతాబ్దం చివరలోనూ 20వ శతాబ్దం ప్రారంభం తర్వాత మొదలైందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో గురజాడ, రాయప్రోలు, కందుకూరి లాంటి మహాకవుల నవ్య కవితా సంప్రదాయాలను రాయలసీమ ప్రాంతం అందిపుచ్చుకోలేక పోయిందని భావించవచ్చు. "ఆధునిక సాహిత్యం రాయలసీమలో ప్రారంభం కాకపోవడానికి కాని, కోస్తా జిల్లాలలో ప్రారంభమయ్యాక కూడా అది రాయలసీమకు విస్తరించక పోవటానికి కానీ రాయలసీమ కవి పండితుల ప్రతిభా రాహిత్యం ఎంత మాత్రమూ కారణం కాదు. కొత్తదనాన్ని గురించి అలోచించ గల వాతావరణం రాయలసీమలో నిర్మాణం కాకపోవటమే అందుకు నిస్సందేహమైన కారణం."[1] రాయలసీమలో ఆనాటి పరిస్థితులను గమనించినట్లయితే సీమ ప్రాంతంలో నెలకొన్న సామాజిక పరిస్థితులు, ఇతర ప్రాంతాలతో పోలిస్తే సీమలో కరువు కాటకాలు, సరైన సదుపాయాలు లేకపోవడం, ప్రజల ఆలోచన విధానాలు, కవులు, పండితులు, రచయితలు, సాహిత్యం, సామాజికాంశాల పట్ల చలనశీలంగా లేకపోవడం ఈ ప్రాంతంలో ఆధునిక సాహిత్యం రాకపోవడానికి గల కారణం అయి వుండవచ్చు.

19వ శతాబ్దం చివరి దశలో ఆధునిక సాహిత్యం తెలుగు కవిత్వంలో నూతన భావాలు ఆవిష్కృతమయ్యాయి. మద్రాస్ క్రిస్టియన్ కళాశాలలో విద్యార్థిగా వున్న కట్టమంచి రామలింగారెడ్డి తన 18వ ఏట 'ముసలమ్మ మరణం' అనే పద్య కావ్యాన్ని 1899లో రాశాడు. 1900 సం॥లో దానిని ప్రచురించాడు. ఈ కావ్య వస్తువును సి.పి.బ్రౌన్ ప్రకటించిన 'అనంతపురం చరిత్ర' అనే గ్రంథం నుండి స్వీకరించినట్లు చెప్పుకున్నారు. ఈ కావ్యంలో కథ సామాజిక ఇతివృత్తంతోనూ అక్కడక్కడ తెలుగు పదాలతో కూడి వున్నప్పటికీ పద ప్రయోగంలో, వర్ణనల్లో, ఛందస్సులోనూ, శైలిలోనూ ప్రబంధ సాంప్రదాయాన్నే అనుసరించింది. ఊరి బాగు కోసం, సమాజం కోసం ఒక స్త్రీ ఆత్మ బలిదానం చేసుకోవడమే ఇందులోని కథ. పాత, కొత్తల మేలు కలయికతో కట్టమంచి వారు ఈ కావ్యాన్ని రచించారని తెలుస్తోంది. నాయిక

అయిన ముసలమ్మ పాత్రను పరిచయం చేస్తూ ఇలా వర్ణించాడు.

సీ. "లేగయై నాకుచు లీలమై యెడ మలం
చిన గోవుఁబిండెడు వనరుహాక్షి
బొండుమల్లెల తోడ బువ్వులు గోయుచు
వనలక్ష్మి యన నొప్పు వనజ గంధి
బీదసాధలనెల్ల నాదరించుచుఁ గూడు
గడుపారఁ బెట్టెడు కన్నతల్లి
వ్యాధి బాధల నెవరైన నడల ఱెప్ప
వేయక కాచెడు వినుతచరిత

గీ. బిడ్డలెల్లరుఁ దమవారి విడిచి చేర
జంక నిడికొని ముద్దాడు సదయహృదయ
అమ్మ! నీకిట్లు వ్రాయంగా నౌనె బ్రహ్మ
కనుచు నూరి వారందఱు నడలి యడలి."[2]

ముసల్మ సహజ లక్షణాలను, మంచితనాన్ని, ఆమెకి వచ్చిన కష్టాన్ని పాతకొత్తల మేలుకలయికతో సహజ సిద్ధంగా వర్ణించాడు. కట్టమంచి రామలింగారెడ్డి చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తి. పండిత వంశంలో జన్మించాడు. ప్రతిభావంతుడైన సాహితీవేత్త, పండితుడు, రచయిత, హేతువాది. ఒకవైపు తెలుగు కవితను మరోవైపు కవితా విమర్శను నూతన శోభతో కొత్తకాంతులతో ఆవిష్కరించిన సాహితీమూర్తి.

బుక్కరాయ సముద్రం ప్రాంతంలోని చెఱుకు తోటలను పాడుచేసే పందులు, చెఱువు లోని ఎంద్రకాయలు, పీతలను తినడానికి వచ్చే గుంటనక్కల దృశ్యాలను క్రింది విధంగా వర్ణించాడు.

"చెఱకుఁ దోఁటలఁ జొచ్చి కొఱికి పాడొనరించి
దొరలట్లఁబోవు పందుల గణంబు
నెంద్రకాయల కొఱ కేతెంచి గుంటిపై
మెక్కి కూసెడు గుంట నక్కగములు
బడుగు బక్కలు గాక కడుపారఁదిని పంది
గున్నలతో రాయు గొఱియ పిండుఁ
బొలముల లేఁ బచ్చికల మేసి చియ్యచే

నిగనిగ లాడు గో నికరములనుఁ

గలకలారావములు మీఱఁ గలిసి జొన్న

చేలపై వ్రాలు గువ్వల చెలువుఁ, గలిగి

పైరుపచ్చల నొప్పు నా పల్లె, చెఱువు

నిండి నీరంబు లొసఁగుచు నుండ నెపుడు"[3]

అంటూ ఆ చెరువు నీటివల్ల పండించిన చెరుకు తోటలు, జొన్న చేలలు పచ్చని పొలాలతో నిండిన ఆ పల్లెలో పక్షుల కిలకిలారావాలు, నీటితో నిండిన చెరువు దృశ్యాలను కవి వర్ణించారు. కట్టమంచి వారు బుక్కరాయ సముద్రాన్ని వర్ణించారు. ఆ చెరువు వర్ణనలో ప్రబంధ మార్గాన్ని అనుసరించినట్లు పదాల కూర్పు, సమాసనిర్మాణం వంటి వాటి ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. ఆ పద్యాన్ని చూడండి.

"చలదుత్తుంగ మహోగ్రభంగపటలీ సంఘట్టనారావ,ము

జ్జ్వల కూలాగ్రనటత్తరంగరవ, మంచన్మధ్యభాగస్భూమి భృ

త్కుల సంపాతి మహోర్మికానికర నిర్ఘోషంబునుం, గూడఁగా

నలరున్ ఘోర సరస్సు దిగ్విదళన వ్యాపార పారీణమై"[4]

పై పద్యంలో కట్టమంచి వారు బుక్కరాయ సముద్ర చెరువును నదీ సముద్రాలతో సమానంగా వర్ణించారు. సాధారణంగా చెరువులలో అలల తాకిడి, తీవ్రత ఉండదు. కానీ ఈ అలలు ఉత్తుంగ తరంగంలా మహోగ్ర రూపం దాల్చాయని ఆ చెరువు తీరంలోని భూమిని ముంచెత్తుతున్నాయని నీటితో నిండిన ఆ చెరువు శబ్దాలతో ఘోషిస్తోందని కవి వర్ణించాడు. బుక్కరాయ సముద్రం చెరువు ఆపదలో చిక్కుకోవడానికి కారణం విపరీతమైన వర్షాలు. ఆ గ్రామాన్ని ముంచెత్తిన వర్షాలను కవి ఇలా చిత్రించారు.

"కడవల ముంచి వంచిన ప్రకారము, మన్నును, మిన్ను నేక మ

య్యెడు గతి, రేవగళ్లు నొకటే విధమొప్పఁగ, నాకసంబు తూఁ

టిడెనొ యనంగ, బల్పిడుగు లెక్కడజూచిన రాలుచుండగా

సుడిగొని గాలియున్ విసర, జోరని వాన లొకప్డువచ్చినన్"[5]

అంటూ వర్షాలు కురుస్తున్నందున భూమి, ఆకాశం ఏకమై రాత్రి, పగలు ఒకటే అయినట్లు ఆకాశానికి తూట్లు పడ్డాయేమో అనేవిధంగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయని గాలులు వీస్తూ వర్షాలు ముంచెత్తాయని కవి వర్ణించారు.

ముసలమ్మ ఆత్మబలిదానానికి సిద్ధమై నీటిలోకి ప్రవేశిస్తున్నప్పుడు కవి వర్ణించిన హృదయ విదారకర దృశ్యం ఇది.

"కన్నెఱ్ఱవారిన ఖరకరోదయకాల

మల్లన మ్రింగు జాబిల్లియనఁగ

జ్వలదగ్ని శిఖలపై నెలనవ్వుతోఁబోవు

ధాత్రీ మహాదేవి తనయ యనఁగ

కెందామరలబారు సుందరమగు లీల

నల్లనల్లనఁ జొచ్చు నంచయనఁగ

కాల మహాస్వర్ణ కారకుండగ్నిలోఁ

గరగిఁంచు బంగారు కణికయనఁగ

ప్రళయ కాలానల ప్రభాభాసురోగ్ర

రంగ దుత్తుంగ భంగ సంవ్రాతములకుఁ

గలక నొందక, దరహాస మలర, మంద

మందగతిఁబోయి, చొచ్చెనమ్మగువ నీట"[6]

అంటూ ఎర్రగామారిన ఆకాశాన ఉదయకాలంలో చందమామను మ్రింగుతున్నట్లుగా మండుతున్న అగ్ని శిఖలపై నవ్వులు చిందిస్తూ దూకుతున్న ఆ సీతాదేవిలా ప్రళయకాలాన ఆ ముసలమ్మ నీటిలోకి ప్రవేశించిందని కవి వర్ణించిన దృశ్యం.

కట్టమంచి రామలింగారెడ్డి తెలుగులో తొలి సాహిత్య విమర్శ గ్రంథాన్ని రచించి విమర్శకు మార్గదర్శి అయ్యాడు. ముసలమ్మ మరణం కావ్యం రచించి రాయలసీమ ఆధునిక కవిత్వానికి ఒక దారిదీపం చూపాడని చెప్పవచ్చు. స్థానిక కథా వస్తువును స్వీకరించి సాంఘిక, సామాజిక ఇతివృత్తాలతో నిండిన వీర రసాత్మక కావ్యం ఇది. పింగళి లక్ష్మీకాంతం ఈ కావ్యాన్ని నవ్యకాంతులతో ఆవిర్భవించిన నూతనాంధ్ర కావ్యమనీ, సి.నా.రె. గారు నవ్య కవిత్వ మహా ప్రభాతానికి ఉషోరేఖ అని వాఖ్యానించారు. ఈ కావ్య రచనతో కట్టమంచివారు ఆధునికాంధ్ర కవిత్వానికి ఆధ్యుడుగా చెప్పవచ్చు. కట్టమంచి ప్రారంభించిన నవ్య కవితా పద్ధతిని రాయలసీమలో తర్వాతి తరం కొనసాగించ లేదని తెలుస్తోంది.

19వ శ॥ ప్రారంభకాలం నుంచి రాయలసీమ సాహిత్యంలో పద్యకావ్యాలు, ఖండ కావ్యాలు, శతకాలు, ఆధ్యాత్మిక, గేయకావ్యాలు, వచన కవితలు, గీతాలు, కథ, నవల, నాటికలు, వ్యాసాలు వెలువడ్డాయి. సీమ సాహితీ వాతావరణం చాలాకాలంగా గ్రాంథిక భాషామయంగా సంప్రదాయక సాహితీ వాతావరణంలోనే వుండిపోయింది. " ఎక్కడ జూచినన్ కవులె, ఎక్కడ జూడ శతావధానులె, ఎక్కడ జూడ నాశుకవులెక్కడ జూడ ప్రబంధకర్తలె....నీ కడపు పండినదమ్మ తెలుగు దేశమా" అంటూ వేలూరి శివరామ

శాస్త్రి గారు ఒక సందర్భంగా వెలిబుచ్చిన అభిప్రాయం ప్రకారంగా ఆలోచిస్తే సీమ కవులు సంప్రదాయ రచనా ధోరణిలోనే కావ్యాలు రాసారని ముఖ్యంగా అవధాన విద్యను బాగా ఆకళింపు చేసుకొని అవధానాల మీద అవధానాలు నిర్వహించారని తెలుస్తోంది. రాయలసీమ కవిత్వం అంటే ఒకప్పుడు అవధాన కవిత్వమే అని చాలా మంది భావించారు. "సామాజిక చైతన్యానికి, ప్రజాస్వామ్య లౌకిక దృక్పథానికీ, మనసును ఉర్రూతలూపే భావోద్రేకాలకూ, సంవేదనా శీలతకూ, సహజమైన పద ప్రయోగానికీ, వాక్య నిర్మాణానికీ, తాత్విక భావజాలానికీ స్థానం లేని అవధానం సాహిత్యాభిరుచికి ఏకైక నిదర్శనంగా రాయలసీమలో కొన్ని వర్గాలలో గౌరవించబడుతూ ఉంది. ఇది కొంత వరకూ స్థానిక జీవిత చైతన్యమూ, భాషా చైతన్యమూ, భావ చైతన్యమూ అభివృద్ధి చెందటానికి ప్రతిబంధకంగా కూడా పరిణమించింది."[7] అవధాన విద్యపై చాలామంది కవులు మక్కువ పెంచుకొని అవధానాలు నిర్వహించారు ఇది ఒకరకంగా సాంస్కృతికంగానూ, సామాజికంగానూ వెనుకబాటుకు గురై సాహిత్యంలోని మిగతా ప్రక్రియల గురించి ఆలోచించనట్లు తెలుస్తోంది.

19వ శతాబ్ది ప్రారంభంలో గురజాడ, రాయప్రోలు లాంటి యుగకర్తల నవ్య సంప్రదాయ ఒరవడిని రాయలసీమ వాసులు అందుకోలేక పోయారని భావించవచ్చు. రాయలసీమలో ఆధునిక జీవితం చాలా ఆలస్యంగా ప్రారంభమైందని చెప్పవచ్చు. "పారిశ్రామిక వాతావరణం, ఆధునిక విద్య, భాష, రాజకీయాలూ, ఉద్యమాలూ క్రమంగా చోటుచేసుకుంటున్న దశలోనే ఆధునిక భావజాలం, ఆధునిక జీవితం పరివ్యాప్తమౌతాయి. నదీ జలాలు సమృద్ధిగా ఉండడం, వాటి వినియోగం, వ్యవసాయం కూడా పరిశ్రమగా పరిణమించటం, స్త్రీ విద్య, పత్రికలు, రవాణా సౌకర్యాలు ఈ క్రమంలో ఆధునికత ప్రారంభమౌతుంది. కోస్తాంధ్ర ప్రాంతంలో 19వ శతాబ్ది మధ్యభాగం నాటికే కృష్ణా బ్యారేజీ నిర్మాణం, నదీ జలాల వినియోగం, వ్యవసాయ సంబంధాలలో మార్పులూ ఈ క్రమంలో తెలుగుదేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆ ప్రాంతం అభివృద్ధి శీఘ్రతరమై ఉండటాన్ని గమనించవచ్చు! ఆ కారణంగానే ఆధునిక విద్య, సంఘ సంస్కరణోద్యమాలు, రాజకీయాలూ, చిన్నపాటి పరిశ్రమలు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల కంటే ముందుగా నెలకొన్నాయి. గిడుగు, గురజాడలు వ్యావహారిక భాషోద్యమాన్ని నడుపుతున్న కాలంలో రాయలసీమ వాసులకు వ్యావహారిక భాష అంటే ఏమిటో తెలియదు. గురజాడ కన్యాశుల్కం రాసే నాటికి రాయలసీమలో ఇంకా సంప్రదాయ కవితే రాజ్యమేలుతుంది. గురజాడ ముత్యాలసరాలు కూర్చేనాటికి రాయలసీమ కవులకు మాత్రాబద్ధ ఛందస్సులో గేయకవితా ప్రక్రియే తెలియదు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే పత్రికలూ, ఆధునిక విద్య బాగా అందుబాటులోకి రావటం వల్ల రాయలసీమ ప్రాంతంలో ఆధునిక సాహిత్య సంచలనం మెల్లగా ప్రారంభమైంది."[8]ఆధునికాంధ్ర కవిత్వం తెలుగుదేశంలో వివిధ కవిత్వోద్యమ రూపాలలో అది విస్తృత రూపం దాల్చుకుంది. సాహిత్యోద్యమాలు బలం పుంజుకుంటున్న దశలో రాయలసీమ ప్రాంతంలో

వావికొలను సుబ్బారావు, జనమంచి శేషాద్రిశర్మ, దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకట శేషశాస్త్రి, నారు నాగనార్య, భూతపురి సుబ్రహ్మణ్య శర్మ, బెళ్ళూరి శ్రీనివాసమూర్తి మొదలగు సంప్రదాయ, ఆధ్యాత్మిక కవి పండితులు పురాణ, ఆధ్యాత్మిక, జాతీయత, చరిత్ర సంబంధమైన కావ్యాలను రచిస్తూ వచ్చారు. వీరి కావ్యాలలో రాయలసీమ ప్రాంతీయ జీవితము, ఇతర సామాజికాంశాలు, కోస్తాంధ్ర కవుల దృక్పథాలు, తెలంగాణా కవుల ఉద్యమపోరాట స్వరూపాల పట్ల దృష్టి పెట్టలేదని తెలుస్తోంది.

"భారత జాతీయోద్యమం, తెలంగాణా ప్రజాపోరాటం, ప్రపంచ పరిణామాలు రాయలసీమను కూడా తాకడం వల్ల తక్కువగానే అయినా ఆధునిక సాహిత్యం స్వాతంత్ర్యానికి ముందే పుట్టుకొచ్చింది. స్వాతంత్ర్యానంతరం అది విస్తృతమౌతున్నది."[9] భారతదేశ వ్యాప్తంగా సంఘసంస్కరణోద్యమం, జాతీయో ద్యమాలు తీవ్రతరం అవుతున్న సమయంలో వీటి ప్రభావం రాయలసీమ కవులపైన చూపింది. ఆధునికాంధ్ర కవిత్వ ఉద్యమాలైన భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ కవిత్వాలలోనూ అస్థిత్వవాద ఉద్యమాలైన స్త్రీవాద, దళిత, మైనారిటీ, ప్రాంతీయవాద ఉద్యమాలలోనూ రాయలసీమ ప్రాంత కవులు వాటిపట్ల ప్రభావితులై తమ వంతు పాత్రను పోషిస్తూ వచ్చారు. దేశీయంగానూ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా ఆధునికంగా వ్యాప్తి చెందిన సామాజిక, సాహిత్యోద్యమాలు మాత్రమే కాకుండా ప్రాంతీయ జీవిత చైతన్యం కూడా రాయలసీమ ప్రాంత కవుల కలాల్లోకి అడుగు పెట్టడానికి చాలా ఆలస్యం జరిగిందని చెప్పవచ్చు. ప్రారంభ దశలో ఈ చైతన్యం బలహీనంగా వ్యక్తమైనప్పటికీ ఆ తర్వాతి కాలాలలో అది విస్తృతరూపం దాల్చుకొని ఇతర ప్రాంతాలను దాటిపోయింది. కోస్తా, తెలంగాణా ప్రాంతాలతో సరిసమానంగా మెరుగైన సాహిత్యం, ప్రాంతీయ అస్థిత్వం రాయలసీమకు ఉంది.

20వ శ॥ ప్రారంభంలో రాయలసీమ ప్రాంతంలో ఆధునిక కవిత్వం ప్రాంతీయ చైతన్య స్పృహతో ప్రారంభమైంది. సమకాలీన జీవితం, గత సాంస్కృతిక సాహిత్య వైభవం, వర్తమాన స్థితులు గురించి సీమ కవులు సంస్మరిస్తూ కవిత్వ రచన చేయుట ప్రారంభించారు. అనంతపురానికి చెందిన సాహితీ పండిత విమర్శకులు రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ రాసిన 'పెనుగొండ' గేయాన్ని సాహిత్య విమర్శకులు సీమ ప్రాంతీయ చైతన్యం, స్పృహతో రచించిన తొలి రచనగా పేర్కొన్నారు.

" పెనుగొండ కొండ – ఈ పెనుకొండ కొండ
చవిన నాళుల దెనుగు కత్తులు
సానబెట్టిన బండ మా పెనుకొండ కొండ
రంధ్రముల ప్రహరించు శత్రుల
రక్తధారలు త్రావి త్రేచిన

ఆంధ్ర కన్నడ రాజ్యలక్ష్ముల
కరతి నీలపురండ మా పెనుకొండ కొండ

.........................................

తిరుమలేంద్రుని కీర్తి తేనెలు
బెరసి దించిన కాపు కవనపు
నిరుపమ ద్రాక్షా రసంబులు
నిండి తొలికెడు కుండ మా పెనుకొండ కొండ"[10]

అనంతకృష్ణ శర్మ పెనుగొండలో పుట్టి పెరగడం వల్ల జన్మ స్థలం మీదున్న అభిమానంతో గత వైభవాన్ని కీర్తిస్తూ స్థానిక పెనుగొండ కొండను గూర్చి కవితాగానం చేశాడు. ఈ గేయంలో వర్తమాన జీవన నేపథ్యం కనపడదు. గత వైభవాన్ని కీర్తించడమే కాకుండా వర్తమాన స్థితిగతులు, పెనుగొండ పాలనలోని చీకటి కోణాలు, ప్రజా జీవనంలోని దయనీయ జీవితాలను చిత్రించిన వారు పుట్టపర్తి నారాయణాచార్యుల వారి కావ్యం 'పెనుగొండ లక్ష్మీ'. పెనుగొండ రాజ్యపాలనలో రాజుల హత్యలను గూర్చి కవి చిత్రించాడు.

" మసకపు బాము కాటువలె, మచ్చర మాత్మను జీల్చివైచి, కై
వస మొనరించుకొన్న, గరువమ్మున, నన్నలుదమ్ములెల్ల, వ
క్కసమున మొత్తులాడిరట! గాంచి యభాగ్యపు జీవరాశి, ని
శ్వసితము వీడి యేడ్చు, భగవంతుడటంచును, నెంచ జాలిరా".[11]

అని రాజ్యంలో రాజులు ఒకరినొకరు చంపుకొనుటను కవి చిత్రించాడు. అనంతపురం జిల్లాకు చెందిన పుట్టపర్తి వారు కవిపండిత తపశ్వి, బహుభాషా కోవిధుడు, సరస్వతీ పుత్రుడు. పెనుగొండ లక్ష్మీ, షాజీ, సిపాయి పితూరీ, మేఘదూతము, శివతాండవము, పండరీ భాగవతం, జనప్రియ రామాయణం మొదలగు కావ్యాలన్నీ భారతీయ సంస్కృతికి నిలువుటద్దాలే. 'మేఘదూతము' కావ్యంలో మొట్టమొదటి సారిగా సమకాలీన రాయలసీమ ప్రజా జీవితం చిత్రించబడింది. ఈ గేయకావ్య నిర్మాణంలో కాళిదాసుని మేఘ సందేశంతో పోలి వున్నప్పటికీ వస్తువు సమకాలీనమైంది. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో తెల్లదొరలపై తిరుగు బాటు చేసిన ఒక దళితుడిని బ్రిటీష్ వారు బళ్ళారి ప్రాంతం కారాగారంలో బంధించి ఖైదు చేస్తారు. కొత్తగా వివాహం అయిన అతడు తన భార్యకు జైలు నుంచి మేఘం ద్వారా శ్రీకాకుళం ప్రాంతానికి సందేశం పంపించడం ఇందులో కథ. మేఘం పయనించే మార్గంలోని ప్రాంతాలనూ, వాటితో ముడిపడిన చారిత్రకాంశాలనూ, సంస్కృతి పరిమళాలను, సమకాలీన సంఘటనలను వర్ణించడం ఇందులో చూడవచ్చు.

ఆ మేఘానికి దారిలో కంకరను కొట్టే కూలివాని బిడ్డడు ఆకలితో ఏడుస్తూ వుంటే మహిళా కూలీ వేదనను చిత్రించాడు.

" తెలి నవ్వులందముల జిలికింప మొగముపై
పాలకై యేడ్చుచున్నాడూ బుడతండు
పట్టుదలకెత్తి కొన్నాడూ ఆ తల్లి
చనుబాల నిచ్చునో! దనయురయు జీల్చిర
క్తంబులే ద్రాపునో! ధనికులే మెఱుగుదురు?"[12]

బిడ్డకు ఆకలై గుక్కపట్టి ఏడుస్తుంటే మహిళ తన పాలిండ్లలో పాలు లేక ఆ తల్లి మనోవేదనకు గురైన దయనీయ స్థితిని ద్రవీభూతమైన హృదయంతో కవి దృశ్యమానం చేశాడు. సీమలో ధారుణమైన కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు సమాజంలో స్త్రీలు తమ ఆకలిని తీర్చుకోవడానికి ఒకానొక సందర్భంలో తమ మానాలను కూడా అమ్ముకున్నారని కవి చిత్రించాడు.

" కూటికై తనువమ్ముకున్నారు – తన తిండియే యున్న
వారు పాతివ్రత్యభావంబు బలికేరు"[13]

మనిషి ఆకలి ముందు ఏ నీతులు, కట్టుబాట్లు పనిచేయవని అన్ని ఉన్నవారికే నీతి, రీతి, సంస్కృతి తోడు నిలుస్తాయనే చేదు నిజాన్ని ఈ పంక్తులు తెలియజేస్తాయి.

సీమ పల్లెల్లో ప్రజలపై భూస్వామ్యుల ఆధిపత్య, అరాచకాలను చెప్తూ,

" ప్రతి పల్లెలో నీకుఁ బాళెగానిది కోట
పాళెగాఁడై నట్టి రెడ్డీ గనుపించు
ప్రజల బ్రదుకులు సౌఖ్యమడ్డీ రచ్చ బం
డలపైనిఁ నేఁడు'పంచాయతులు' లేవురా
'పులిజీతములు' రంగు పేకలాటలె గాని"[14]

సీమలో ప్రతి పల్లెల్లో కనిపించే భూస్వామ్య పాలెగాళ్ళే నేటి ఆధునిక ఫ్యాక్షనిస్టులు. వీరి ఇళ్ళల్లో పనిచేసే పాలేరుల జీవన వ్యధలను చెబుతూ,

" పల్లెపట్టుల యందుఁ బయనించు సమయాల
పాలేరువాఁడు గన్పించూ మిడి యెండ
బ్రద్దలుగ గొట్టి పండించూ వాడెంత

గష్టించినా మిరపకారమే సంగటికి

కలఁడోయి ఖామందు, కలిమి వానికిఁజెందు"[15]

పాలేరులు ఎంత కష్ట పడినప్పటికీ తినేకి తిండి కూడా దొరకదు. వారి కష్టార్జితం, లాభాలను పొందేది యజమానులే అని కవి వ్యక్తం చేశాడు. పండరీ భాగవతంలో గుణకర్మలనను గురించి వర్ణవ్యవస్థ సైతం మారుతుందని చెబుతూ,

" అతని పంచముడందురే గాని

పాతిత్య రహితుండు బ్రాహ్మణుండతడు

ఆతడే జ్ఞాని యంచందురే గాని

యాతత బ్రహ్మ విద్యావేత్తయతడు

ఆతడనాచారి యందురే గాని

వీత కాంతుడు యోగ విత్తముండతడు

అతడు మలినుడంచందురే గాని

పూత మానసుడైన పుణ్యడతండు"[16]

అంటూ చొకామీళుని గుణగణాలను వర్ణిస్తూ అతడు పంచముడెలా అవుతాడని ప్రశ్నిస్తాడు.

రాయలసీమ ఆధునిక కవిత్వంలో సమకాలీన సామాజిక జీవితాన్ని చిత్రించిన వారిలో బెళ్ళూరి శ్రీనివాస మూర్తి ముఖ్యులు. 1954లో 'తపోవనము' అనే ఖండ కావ్యాన్ని రాశాడు. శుకపిక శారికలు, కర్షకులు, కాపు కన్యలు, పచ్చని పైరులు, శ్రామికులు ఇతని కవితా వస్తువులు. 'కర్షక రుతువు' శీర్షిక కింద రైతు జీవితం గురించి కరుణ రసాత్మకంగా చిత్రించాడు.

" తనువెల్ల చెమరింప దినమెల్ల శ్రమియింప

అవని నాగలిబట్టి అవని దున్నే నీకు

ఎన్ని గ్రీష్మర్తువులు హృదయమున దోచెనో

ఎన్ని యెండలు గాచి నిన్ను రాపాడెనో" [17]

సీమలో రైతుల వ్యవసాయ శ్రమను, జీవన గాథల్ని చెప్పాడు. శరదృతువు ఎలా ఉందో కవి ఇలా చెప్పాడు.

" శాలి ధాన్యము దెచ్చి యొలి గాదెల బోసి

ఆలు బిడ్డల తోడ లీల కాలము ద్రోయ

ఎన్ని శారద రాత్రులెలిమి చేకూర్చెనో

ఎన్ని పున్నెములు నీ యింటనే దోచెనో"[18]

శరదృతువు కాలంలో రైతులు పండిన పంటల ధాన్యము తమ ఇంటికి వచ్చిన దృశ్యాన్ని చెప్పాడు. తర్వాత శిశిర ఋతువు కాలంలోని రైతుల స్థితిని చెబుతూ,

" కూటి గింజలు లేమి కుమిలి పోయ్యేవేళ
దారిద్ర దేవి నీ తలుపు దట్టే వేళ
ఎన్ని శశిర్తువులు ఎడద పొడసూపెనో
ఎండి రాలిన యాకు లెన్ని యిలదాగెనో"[19]

రైతులు కష్టపడి సేద్యం చేసి పంటలు పండినా ఒక్కోసారి కూటికి కూడా నోచుకోలేని దారిద్ర్యాన్ని తెల్పాడు. సీమలో 1948–1953 మధ్య కాలంలో తీవ్రమైన కరువు వచ్చినపుడు సామాన్య, పేద, మధ్య తరగతి, భూస్వామ్య కుటుంబాలు కూడా తిండి కోసం అవస్థలు పడ్డారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిస్ట్ వంటి రాజకీయ పక్షాలు గంజి కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ఆకలిని తీర్చారు. గంజి కరువును మొదటిసారిగా సాహిత్యంలోకి తీసుకు వచ్చిన ఘనత బెళ్ళూరి శ్రీనివాస మూర్తికి దక్కుతుంది.
'గంజి కేంద్రం' శీర్షిక కింద ఇలా చిత్రించాడు.

" కనుడోయీ యిటు గంజికేంద్ర మిటులాకర్ణింప డాక్రందన
ధ్వని హస్తంబుల మట్టి పాత్రలు వహియింపన్ దీనభావంబు లా
నన సీమన్ వహియింపగా ముసురుచున్నారెంత దారిద్ర్యమీ
జనతన్ మ్రింగగవేచి యున్నయది దుష్కాలంబు ప్రాప్తింపగన్"[20]

గంజికేంద్రం వద్ద గల దృశ్యాలను ఒకసారి చూడండి. ఆకలితో అల్లాడిపోయే ప్రజల ఆక్రందనల్ని వినండి. గంజి పాత్రల చుట్టూ జనాలు ఈగల్లా ముసురుతున్నారు. ఎంతటి దారిద్ర్యము ప్రజలలో దాపురించిందని కవి వాస్తవ దృశ్యాలను చిత్రించాడు.
గంజి కేంద్రం వద్ద దృశ్యాన్ని, ప్రజల దారిద్ర్యాన్ని చెబుతూ ఇలా అంటున్నాడు.

" ముదసళ్ళు, స్త్రీలు, పురుషులు
పెదవులు తడియారు చంటి బిడ్డలు, మెయిప
య్యదలేమి సిగ్గు మరచిన
సుదతులు గలరిందు, క్షుదకు సోలి నడుచుచున్"[21]

ప్రజల యొక్క ఆకలి వికృత రూపాన్ని ఆర్ద్రంగా కవి చూపించాడు. 'శిల్పవాణి' కావ్యంలో కృష్ణదేవరాయల సాహితీ కొలువు కూటాన్ని వర్ణిస్తూ,

“ రూపుగొన్న కవిత్వ రోచిస్సువలె పెద్ద
నామాత్యుడొక్కచో నధివసించె,
అమృత గంగా ప్రవాహము వోలె నందితి
మ్మన వచ్చి నిజ పీఠమున వసించె
పదగుంభన ప్రౌఢి పాటించు రామకృ
ష్ణ కవీంద్రుడు చితాసనమున జేరె
గాంధర్వ కలనేర్పి కవితా కుమారిని
కై సేయు భూషణ కవియు వచ్చె
సాహితీ పుత్రుడల్ల దూర్జటి కవీశు
డపర తిక్కన పింగళి యరుగుదేర
వచ్చె నయ్యల రాజు, సభా స్థలంబు
యల్లనయు జేరె సభ్యుల యుల్ల మలర”[22]

అష్టదిగ్గజ కవుల అధిష్టాన ప్రవాహాన్ని అలంకారమయంగా వర్ణించాడు. గంజి కరువు మీద ఒక సంపూర్ణమైన కావ్యాన్ని బైరపు రెడ్డి రెడ్డి నారాయణ రెడ్డి ‘రాయలసీమ రైతు’ అన్న కావ్యాన్ని 1976లో రాశాడు. ఇతను సంప్రదాయ మార్గానికి చెందిన కవి మరియు భాష, ఛందస్సు, అలంకారాల మీద సాధికారత కలవాడు. ఇతను స్వయాన రైతు. సేద్యపు గొప్పతనం, కష్టాలు, కడగండ్లు తెలుసుకున్న వాడు. వ్యవసాయం చేయడం ఒక గొప్పకళ అని భావించి ఈవిధంగా కీర్తించాడు.

“ గంటమ్ముతో తీర్చు కావ్యమ్ము నా భూమి
పుష్టిగా హలముతో పొందొనర్చి
పద్య గణంబులు పరగ తీర్చిన రీతి
బీజ గణంబుల నోజ తీర్చి
ప్రాస పొందిక నొందు పద్య పద్ధతి మాడ్కి
నీటగు నారుల నాటొనర్చి
అతుల నిబంధన యతుల గూర్చిన బాగు
నియతి తప్పక పాటు నీటొనర్చి
బావ పరిపుష్టి గాథల పైరొనర్చి
రస పరిష్కార కుల్యల రాణతీర్చి

పంట పండించు కృషిలోక ప్రభువతండు

రస పరిష్కృతి కవిలోక ప్రభుని పగిది"[23]

కవి స్వయాన రైతుకావడం సేద్యం చేయడం వల్లనేమో భావ పొందికమైన కళాత్మక ఛందస్సుతో పద్యాన్ని రాశాడు. ఆ తర్వాత కరువు ప్రభావం వల్ల వ్యవసాయం ఎలా వుందో కళ్ళకు కట్టినట్లు చిత్రించాడు.

" గుబురు జొంపంబుల గొనబైన వన్నెల

వర్ధిల్లు సస్యముల్ వాడుదోచె

వాడు దోచిన వెంట వరుసగా జిగిరించి

యెసగిన పత్రమ్ము లెండిపోయె

ఎండిపోయిన యాకు లించు కించుకచచ్చి

సాగి మొదళ్లకు సమసిపోయె

సమయు చుంబోవు నచ్చపు కాండ వితానముల్

మొట్ట మొదట కాగి మ్రోడు పడియె

దినదినమ్మును వృద్ధియై ననల కొనల

పసిమి ఛాయల విలసిల్లు పైరులకట

దిన దినమ్మును కృశియించి తీవ్రభంగి

నామ మాత్రావశిష్టమై నష్టమైన" [24]

ఈ పద్యంలో కరువు ప్రభావం వల్ల క్రమంగా పంటలు ఎలా నాశనం అవుతున్నాయో కళాత్మకంగా చిత్రించాడు. కరువు కాలంలో మనుషుల మధ్య మానవ సంబంధాలు, ప్రవర్తనలు, కుటుంబాలలోని భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు దూరం కావడం కవి చక్కగా చిత్రించాడు.

" కొప్పున ముడువంగ కుసుమముల్ కొనలేక

కులకాంత కుందినఁ గుందె నొకడు

కేశ సంస్కార తైలాశక శక్తయై

ఇల్లాలు నేడ్చిన నేడ్చెనొకడు

పసుపు కుంకుమ కొన పైకమ్ము లేమికై

వల్లభ వగచిన వగచెనొకడు

గాజులు తొడుగగా కాసులు లేనిదై

తెఅవ చింతింప చింతించెనొకడు

మంగళ ప్రదమైన సుమంగళీ వి
కాస విభవ సంపత్ప్రభా భాసములగు
మహిత వస్తువుల్ గనలేక మగువ లేడ్వ
వారి భరియింప జాలమిన్ పతులు నేడ్వ"[25]

ఇలా మంగళ ప్రదమైన సుమంగళి చిహ్నాలను భార్యలు కొనలేక కరువు కాలంలో ఏడ్చితే నిస్సహాయులైన భర్తలు కూడా ఏడ్చారట. భార్యా భర్తల అనురాగాలను కరువు ఛిన్నాభిన్నం చేసిన సంఘటనలను కవి చిత్రించాడు.

"రాయలసీమలో ఆధునిక కవిత్వ చైతన్యం 20వ శ॥ తొలి, మలి పాదాలలో ఆనాటి సంప్రదాయ కవులను సైతం ప్రేరేపించింది. ప్రబంధ కావ్యాలకు ఇక కాలం చెల్లిపోయిందని సనాతన కవులు కూడా గుర్తించక తప్పలేదు. ఆధునిక కవిత్వ చైతన్యంతో సమకాలీన జీవితాల్లోంచే ఇతివృత్తాలు విధిగా తీసుకోవాలనే కాల నియమం, కాల అవసరాన్ని గుర్తించారు. ఆ కోవలో 'సాహిత్య శిరోమణి'గా గౌరవం పొందిన కుంటిమద్ది శేషశర్మ ప్రస్తావన ఇక్కడ అవసరం."[26] కుంటిమద్ది శేషశర్మ గొప్ప పండితుడు. అలంకార శాస్త్రవేత్త. సమకాలీన ఇతివృత్తాన్ని వస్తువుగా స్వీకరించి సీమ గ్రామాల్లోని ప్యూడలిజం గురించి రాసిన సంప్రదాయ ఛందోబద్ధ కావ్యం 'రామిరెడ్డి'. అనంతపురం జిల్లాలో ఒక పల్లెలో భూస్వామి అయిన రామిరెడ్డి అనే ధర్మకర్త ఆ ఊరిలోని కోమటి సెట్టిగారి కొత్త కోడలి అందం చూసి ఆమెను మోహించి ఆమె మీద కన్ను పడింది. ఒకసారి ఆ ఊరి వనభోజనాల దగ్గర వున్న ఆమెను అపహరించుకుపోయి తన పొలం వద్ద వున్న ఒక గదిలో బంధిస్తాడు. సెట్టి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు వచ్చి ఆమెను రక్షిస్తారు. రామిరెడ్డి దగ్గర పనిచేసే జీతగాడు చెప్పిన సాక్ష్యంతో రెడ్డికి శిక్ష పడుతుంది. రామిరెడ్డి చేసిన దురాగతాలను కవి ఇలా చెప్పాడు.

" రాజ్యపాలన, దేవతారాధనముల
గవుల పోషణమున వాసికన్న రెడ్డి
కులము చెడబుట్టినాడు కర్కోటకుండు
తులసి వనమున గంజాయి మొలకవోలె"[27]

రామిరెడ్డిని గంజాయి మొక్కతో పోల్చి రెడ్డి కులంలో చెడబుట్టినాడని చెప్పాడు.

రాయలసీమ నుంచి ఎన్ని కావ్యాలు వచ్చినా వాస్తవ జీవిత చిత్రణలోనూ, భాషలోనూ, భావ వ్యక్తీకరణలోనూ సీమకు ప్రాతినిధ్యం వహించే కావ్యం విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట'. "ప్రాంతీయ

జీవిత చైతన్యం తెలుగు కవిత్వంలో పెన్నేటిపాట(1956)తోనే ప్రారంభమైంది. తూర్పు కోస్తా, తెలంగాణా ప్రాంతాల నుంచీ అంతటి ప్రాంతీయ జీవిత చైతన్యమూ, కవితాశక్తి ఉన్న ప్రాతినిధ్య కావ్యాలు ఇంకా రాలేదు. పెన్నేటిపాట ప్రాంతీయ జీవిత చైతన్యం నుంచి పుట్టిన సమగ్ర తెలుగు సంస్కృతీ కావ్యం."[28] అని వల్లంపాటి స్పష్టం చేశారు. సీమ గత వైభవాన్ని గుర్తు చేస్తూ ఆ తర్వాత సమాజంపై ప్రభావం చూపిన కరువు, క్షామ పరిస్థితులకు సజీవ సాక్ష్యంగా నిలిచి రచించిన పెన్నేటిపాట రాయలసీమ ప్రజల ఆత్మఘోషగా ప్రసిద్ధి చెందింది. గత వైభవాన్ని స్మరిస్తూ కావ్యాన్ని ప్రారంభించినప్పటికీ 'ఇది గతించిన కథ' అని దాన్ని పక్కకు పెట్టి కవి ఇలా అంటాడు.

" వినిపింతునింక రాయలసీమ కన్నీటిపాట
కోటిగొంతుల కిన్నెర మీటు కొనుచు
కోటి గుండెల కంజరి కొట్టుకొనుచు"[29]

అని వర్తమాన సంఘటన దృశ్యాన్ని పలికిస్తాడు. నేటి రాయలసీమకు పెన్నానది ఒక సంకేతంలాంటిది.

" అదే పెన్న అదే పెన్న నిదానించు నడు
విచారించు నెదన్ వట్టి ఎడారి తమ్ముడు"[30]

అని నీళ్ళు లేక ఎడారిగా మారిన పెన్నానదిని గూర్చి చెబుతూ నది సరే నీరు ఎక్కడ అని కవి ప్రశ్నిస్తున్నాడు.

" ఏదీ నీరు? ఏదీ హెూరు? ఏది నీటిజాలు?
ఇదే నీరు ఇదే హెూరు ఇదే ఇసుక వాలు"[31]

పెన్నానదిలో నీళ్ళు లేవు. ఆ సవ్వడులు, నీటి జాడలు కూడా లేని కేవలం ఇసుక తిన్నెలు మాత్రమే దర్శన మిచ్చాయి.

పెన్నేటిపాట ఐదు సర్గల కావ్యం. అనంత జిల్లాలోని ఒక పల్లెలో భూస్వామి నారపరెడ్డి. నారపరెడ్డి కొడుకు రంగారెడ్డి కథ ఇది. ఊరందరికి పెద్ద దిక్కు అయిన భూస్వామి నారపరెడ్డి అప్పుల పాలై చివరకు తన ఆస్తినంతా పోగొట్టుకోవడం, నారపరెడ్డి చనిపోవడం, కొడుకు రంగారెడ్డి రంగడుగా మారి సేద్యగానిగా, ఇంటికూలి పనివానిగా మారడం, రంగడు భార్య గంగమ్మ ఇద్దరు కష్టాలను ఎదుర్కోవడం లాంటి హృదయ విదారక సంఘటనలు ఈ కావ్యంలో వున్నాయి. రాయలసీమ కరువు మనుషుల జీవితాలు, మానవ సంబంధాల మీద అది చూపే ప్రభావం, ప్రభుత్వ విధానాలు, సామాజిక వ్యవస్థలోని అంశాల ఆధారంగా రాయబడిన పెన్నేటిపాట రాయలసీమ ప్రజా జీవితాల కన్నీటి గాథ. రాయలసీమ నుంచి వచ్చిన అభ్యుదయ దృక్పథం గల కావ్యం అని రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి విశ్లేషించారు. రాయలసీమలో ప్రధాన నది పెన్నానది. సరైన వర్షాలు కురవక పోవడం వల్ల ఆ నది నీళ్ళు లేక ఎండిపోయి ఎడారిగా

మారింది. పెన్నానది పరివాహక ప్రాంత ప్రజల జీవన వ్యథల్ని కవి చిత్రించాడు. ఒకనాటి పెన్నానది నీటిని గూర్చి చెబుతూ,

" ఈ ఏటి నీటిలో
కమ్మదనము లూరుచుండును
దోసిట నొక్కమారు పుక్కిలించిన జాలు
నీ పుట్టువునకు సార్థకత్వము నిష్కల్మషత్వమబ్బు"[32]

పెన్నానది నీటి యొక్క మహిమను చెబుతూ అలాంటి పెన్నానది ఎందుకెండిపోయెనో అని కవి ఆశ్చర్యం, ఆవేదన చెందుతాడు.

" ఇంతమంచి పెన్నతల్లి ఎందుకెండిపోయెనో?
ఇంతమంచి కన్నతల్లి ఎందుకిట్లు మారెనో?
వంతలతో, చింతలతో కంతలువడి పోయెనో!
సంతుకోస మేడ్చి ఏడ్చి, గొంతు కారిపోయెనో![33]

సీమ ప్రజానికానికి సాగు, తాగు నీరు అందించాల్సిన తల్లి లాంటి పెన్నా నదీమ తల్లి దుస్థితిని చూసి కవి చిత్రించాడు.

" నాగకన్యలిచట కన్పడరు గాని
నాగుబాములు చకచక సాగునిచట
గరుడ గంధర్వ కామినుల్ కానబడరు గాని
బొంత గద్దలు గుంపుగట్టు నిచట"[34]

నీళ్ళు లేని పెన్నానదిలోని వాస్తవ దృశ్యాలను తెలిపాడు. పెన్నేటిపాట రాయలసీమ ప్రజల గుండె చప్పుళ్ళను వినిపిస్తుంది. సీమ ప్రజల కన్నీటి రుచుల్ని చూపిస్తుంది.

రాయలసీమ కరువును వస్తువుగా స్వీకరించి పద్యకావ్యం రాసిన కవి పాలా వెంకట సుబ్బయ్య. "అనిలసందేశము" కావ్యంలో నాయకుడు మేఘుడు. కథానాయిక భూదేవి. వార్తాహరుడు వాయుదేవుడు. భూదేవి సీమలో కరువు పరిస్థితులను తెలియజేస్తూ భర్తయిన మేఘునికి గాలిద్వారా సందేశం పంపుతూ తన్ను త్వరగా చేరుకోమని ప్రార్థించటం ఈ కావ్యంలోని వస్తువు. ఈ కావ్యం సీమ కరువు పరిస్థితులకు అద్దం పట్టిన సాంప్రదాయక ఛందోబద్ధ కావ్యం.

" కోటాను కోట్లు నీ కొమరులు నిలువున
గూలిపోయి రనుమ, కూడులేక,

లక్షోపలక్షలు భిక్షాధికారులై

దుఃఖానఁగుములుచు దూలి రనుమ

వేలకువేలు వస్త్రాలకు హీనులై

చింపి పాతలనెఁగై సేసిరనుమ

పచ్చని వల్వ నిప్పచ్చరంబుననీదు

దయితయు మాలిన్యధామయనుమ"[35]

సీమ ప్రాంతాల ప్రజల కష్టాలు, వారి దీనత్వ జీవితాలను కవి అక్షరబద్ధం చేశాడు. స్థానిక జీవిత గాథలు, వాస్తవిక సంఘటనలు, సీమపై ప్రభావం చూపే కరువును సీమ కవులు కావ్య వస్తువులుగా స్వీకరించడం ప్రారంభించారు. "పుట్టపర్తి, బెళ్ళూరి ప్రారంభించిన స్థానిక చైతన్య కవిత్వం భైరపురెడ్డి నారాయణ రెడ్డి, కుంటిమద్ది శేషశర్మ, పాలా వెంకట సుబ్బయ్య, కల్లూరి అహోబలరావు మొదలైన కవులలో ఒక నిశ్చిత రూపాన్ని సంతరించుకుంది. విద్వాన్ విశ్వంతో రాయలసీమ ఆత్మఘోష తెలుగు దేశపు నాలుగు చెరుగులనూ చేరి చాలామంది తెలుగువారి కళ్ళకున్న గంతల్ని విప్పింది."[36]

పప్పూరి రామాచార్యులు 'కల్లుపెంట' నాటికను 1931 సాధన పత్రికలో ప్రచురించారు. మద్యపాన నిషేధాన్ని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆ నాటికలో కల్లు సారా త్రాగే వారి ప్రవృత్తిని చెబుతూ...,

" సారాకల్లు సల్లగవుంటే రొక్కండబ్బులు రొంటిని వుంటే

లోకంతో నాకేమి పని

కాలువలన్ని కల్లే అయితే సముద్రమంతా సారా అయితే

కరువొస్తే నాకేమి భయం, కాటకమొస్తే యేమి భయం"[37]

అంటూ మద్యం తాగే వారి ఆలోచన రీతుల్ని పాట ద్వారా తెలియచేశాడు. ఎన్నికల నేపథ్యంలో 'ఒక ఓటరు' అనే గేయంలో ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ,

" బావులు చెరువులు బయలై పోగా

వానలు కురవక పంటపండక

క్షామములో మేం చస్తావుంటే

చాలక వోటని పీక్కొతింటా

పన్నులు హెచ్చును పదవులు సున్న

కష్టాలెక్కువ మునుపటి కన్న

వోటేకుండా వుందామంటే

ఉణ్ణీయక బలుపీడిస్తున్న"[38]

ఆ రోజులలో ఇంతటి చైతన్యవంతమైన గేయం ఒక ఓటరు ద్వారా కవి వ్యక్తం చేయడం రాజకీయ చైతన్యాన్ని తెలియజేస్తుంది.

కె.శేషశర్మ అనే కవి 'మేఘమా' అనే కవితలో సీమలో రైతులు వ్యవసాయంలో ఎదుర్కొనే విపత్కర దుస్థితిని చెబుతూ,

" ఇంటిలో నుండు గింజలు మంటిలోన

కొల్ల బోసిరి పేదలు కోర్కిమీఱ

మేఘమిదెయంచు మెఱుపులు మించెనంచు

నుఱిమెనంచును తుంపర లురిలెనంచు

నేడు తప్పక చెఱువులు నిండునంచు

నాసఁజూచిరి నవియెల్ల మోసమయ్యె"[39]

మేఘాలను చూసి రైతులు వర్షమొస్తుందనే ఆశతో ఎదురు చూసే సందర్భంలోనిది కవిత.

మన తెలుగు తేటైన తెలుగు మాటలతో మనమంతా అనునిత్యం ఆమెను స్మరించే రీతిలో 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' అని అంటూ మల్లెపూదండల్ని, మంగళ హారతుల్ని సమర్పించిన కవి శ్రీ శంకరంబాడి సుందరాచారి. ఈయన కవిత్వం సరళంగా వుంటుంది.

" ఆంధ్రుఁడనఁగ, జెల్లి యక్కరంబులు నేర్పి

నంత దీనిఁ జేతనంది చదువ

వచ్చునంచు సరళ పదములు మృదులమౌ

నడకఁ గూర్చి నడిపినాడ నింతె"[40]

తన కవిత్వం మృదు మధురమైన కవిత్వంతో తెలుగు పదాల పొహళింపులతో సుందరమైందిగా వుంటుందని పేర్కొన్నాడు. రంగిసుద్దులు, సుక్కరోరం, పచ్చిరసం లాంటి గేయాల్లో నండూరి ఎంకిపాటలు దర్శనమిస్తాయి.

" సుక్కరోరపు యాళ

సుద్దిగా మునిగేసి

ముద్దు మాలచ్చిఁవికి

మొక్కల్లు పెడుతుంటె తాకుతానంటావ్? నా మాఁవ

తంటాలు పెడుతుంటవే!"[41]

ఎంకిపాటల్లోని నాయుడుబావ, మరదలు పాడుకునే గీతాల్లా సుందరాచారి పాటలు వుంటాయి.

దుర్భాక రాజశేఖర శతావధాని గారి 'రాణప్రతాప సింహ చరిత్ర' 5 ఆశ్వాసాల సంపూర్ణ పద్యకావ్యం. ఇది వీరరస ప్రధాన కావ్యం. హిందూ మహమ్మదీయ రెండు మతాలను దృష్టిలో పెట్టుకొని కావ్యరచన సాగించాడు. ఒక్క సీస పద్యంలో రెండు ప్రధాన పాత్రల్ని తలతూచిన విధానం అద్భుతం.

" అక్బరు విశ్వంభరాధీశ మౌళిది
    ధనసేవ నీయది దైవసేవ
యాతని దెల్లప్పుడాత్మ వైభవము నీ
    యది నిరంతరము నాత్మావబోధ
మతని కుండిన దెల్ల నైహిక బలముని
    న్నాశ్రయించిన దెల్ల నాత్మబలము
నతని దండఱ కన్నులలరించు భోగంబు
    నీది జగము మెచ్చు నిండు త్యాగము"[42]

రాణప్రతాప సింహుడు, అక్బరు ఇద్దరి మధ్య గుణగణాలను, స్వభావాలను తీర్చిదిద్దాడు.

గడియారం వేంకట శేషశాస్త్రి గారి 'శివభారతం' దేశభక్తితో కూడిన జాతీయోద్యమ ప్రేరణతో వచ్చింది. ఆధునిక తెలుగు పంచకావ్యాల సరసన జేరింది. శివాజి దగ్గర సైన్యాధిపతి అయిన సర్దారు ఒక రాణివాస అంతఃపుర స్త్రీని బంధీగా శివాజి రాజ్యానికి తీసుకొని వచ్చినపుడు అది తెలుసుకున్న శివాజి సర్దార్ మీద కోపగ్రస్తుడై అతడు చేసిన తప్పును తెలియజేస్తాడు.

" హరిహర బ్రహ్మలఁ బురిటిబిడ్డలఁజేసి
    జోలబాడిన పురీంధ్రీలలామ
యమధర్మరాజు పాశముఁ ద్రుంచి యదలించి
    పతిబిక్ష గొన్న పావనచరిత్ర
ధగధగద్దహన మధ్యము పూలరాసిగా
    విహరించియున్న సాధ్వీమతల్లి
పతినిమిత్తము సూర్యభగవానును దయంబు
    నరికట్టి నిలుపు పుణ్యములపంట
అట్టియెందఱో భారతాంబ యాఁడుబిడ్డ
లమల పతిదేవతాత్వ భాగ్యములు వోసి

పుట్టినిలు మెట్టినిలుఁ బెంచు పుణ్యసతులు

గలరు, భారతావని భాగ్యకల్పలతలు"[43]

అని భరతమాత సంతానమైన స్త్రీలు ఎందరో తమ పాతివ్రత్యంతోనూ, సత్యంతోనూ నిలిచిన పుణ్య స్త్రీలు వున్నారని కీర్తించాడు.

పుట్టపర్తి కనకమ్మ కవయిత్రి, పండితురాలు. ఆమె భక్తిపారవశ్యంలో ఎంత పరవశించి పోయినా సామాజికాంశాలను కవిత్వీకరించారు.

" సంఘశక్తియు మానవశక్తి, దైవ

శక్తి యొకటైనచో గాని, ముక్తిలేదు

కట్నమను బ్రహ్మరాక్షసి గళము వట్టి

నార్తుడైన కన్నాపిత నాదుకొనగ"[44]

వరకట్న దురాచారాన్ని సంఘం నుంచి బహిష్కరించాలని, రూపుమాపాలని ఆశించారు.

పాణ్యం లక్ష్మీనరసింహయ్య హరిభక్తులు, వేదాంత వేత్త. ఉయ్యాలవాడ నరసింహరెడ్డి చరిత్రను 'స్వాతంత్ర్య వీరుడు' అనే కావ్యంగా రాశాడు. రెడ్డి ఉగ్ర నరసింహుని రూపమును ఇలా వర్ణించాడు.

" కఱకఱ పండ్లనూరి, చెడుగా! యిటురమ్మని, పట్టిఈడ్చిని

ర్భరమగు, నక్కసమ్ముమెయి, వాని శిరమ్మును నేలదన్ను చుం

గఱకు కటారు గేలకొని గ్రక్కునవైన, శిరంబు మొండెముం

ధరణి పయింబడెన్ రుధిర ధారలు మందిరమెల్ల జిమ్ముచున్" [45]

నరసింహారెడ్డిని బంధించాలని బ్రిటీష్ వారు దాడి చేసినపుడు ఆ పోరాటంలో నరసింహుని కోపాన్ని, పోరాట పటిమను చిత్రించాడు. కవిశేఖర, కవిత్వవేది, తత్త్వవేత్త అయిన కల్లూరి వేంకట నారాయణ రావు గొప్ప పాండిత్యము గలవారు. 'శాంతి సామ్రాట్టు- అశోక చరిత్రము' అద్భుత కావ్యము. ఈ కావ్యంలో రాయలసీమ గ్రామ జీవితాన్ని వర్ణించిన తీరు రమ్యంగా వుంది.

" మా తుమ్మకొమ్మల – మారేగు కంపల

మా ఊలచేల సంసార పోళవు

మా కుందు వరదలో – మాకుంజరార్భటి

మా పెన్నధాటిలోఁ జేపుఁచలువ

మా తరీకయ్యల – మా నల్లరేనాట

మా చౌడునేలలో– నేఁచుకలిమి

మా గండ శిలలపై- మాగండు గుండెల

కాంపులలోని విక్రమపు బలిమి

మా తనకలాట, కపిలెల మాఱుమ్రోగు

గీతములలోని వేదాంత మూతనీకు

ఎసంగె దెప్పుడు నీవుమా- కేడుగడగ

సుంకమంకితం బిదియె శ్రీ వేంకటేశ!"[46]

సీమ ప్రాంతంలోని నదులు, చెట్లు, నేలలు, అలాగే కపిల మొదలగు వాటిని సాధారణ పదాలతో పొందికగా వర్ణించాడు.

మన్నవ భాస్కర నాయుడు గొప్ప కవితా పాండిత్యం గల కవి. పద్యాలలో తెలుగు పదాల పొందికను రమ్యంగా కూర్చి రాయడం ఇతనికే సొంతం. సీసపద్యంలో తెలుగు పదాల విరుపు పొందికను గమనిస్తే,

" పనిచేయి చేతుల పల్కరింపుల గుబా

ళించిన చెలిమి లాలించి నడుప

వడిసెల రెక్కవ సడిసవ్వడుల నివా

ళించిన చెలువ బేలించి నడుప

కపిల పాటల ఊట కమ్మదనము పిసా

ళించిన మధువు స్నేహించి నడుప

గూడు కట్టే గువ్వ గుండెలోపల నిగా

రించిన చనవు ప్రేమించి నడుప

మూలపల్లిని చుట్టిన రాలదారి

నడకలో అలసట అచ్చు పడకముందె

పడకంటింటికీ వీడ్కోలు పలికి, కోట

వాకిటి తలుపులును తట్టె భానుమూర్తి"[47]

తెలుగు నుడికారపు సోయగం, దానికి గుబాళించు, నివాళించు, పిసాళించు, నిగారించు అనే క్రియలు వాడిన తీరు ఆకట్టుకొంటుంది.

ఎ.సి. దస్తగిరి కమనీయ కావ్యాల సృష్టకర్త. పద్యకావ్యాలలో సామాజిక విలువలను జోడించి కావ్యరచన చేశాడు. 'కర్షకుడు' కావ్యంలోని పద్యం,

“ ప్రొద్దు పొడిచినది మొదలు ప్రొద్దుక్రుంకు
దాక చెమటోడ్చి కృషి చేయు త్యాగమూర్తి
పరులశ్రమ మింత దోచక బ్రతుకు నీవు
ధరణి జనులకు నెల్ల ఆధారమయ్య!”[48]

రైతు సేద్యంలో పడే కష్టం ఆ కష్టార్జితాన్నే నమ్ముకుని బ్రతుకుతాడని కవి తెల్పాడు.

నరాల రామారెడ్డి బాగా చదువుకున్న వ్యక్తి. అవధానంలోనూ గొప్ప పండితధారణ కలవాడు. గుంటూరులో జరిగిన అవధానంలో ఎస్.ఆర్.జోగారావు దత్తపది ఇచ్చారు. వినుకొండ, తరిగొండ, పెనుగొండ, గోలకొండ. ఈ నాలుగు పదాలను ఊర్ల పేర్లు కాకుండా మీకు నచ్చిన వృత్తంలో మీ ఇష్టం వచ్చిన ఇతివృత్తంతో వర్ణించమని అడిగారట. అప్పుడు రామారెడ్డి పూరించిన పద్యం ఇది.

“ కోమలి! నాదుమాట విను, కొండవలెన్ మన పొలగుండెలో
ప్రేమ పటిష్ఠ రూపమున వెల్గెడి యిత్తఱిఁ గొండటంచు,నీ
కోమల చిత్తమిమ్ము, పెనుగొండగ దానిని దాచుకొందు, నీ
నామది గోల, కొండవలె నాయన నిల్చిన నేమి చేసెదేన్?”[49]

పరవస్తు ధనుంజయ గారు కవి, అష్టావధాని, రచయిత. ఒక అవధానంలో వారికి “తల్లికి ముక్కుగోసి పినతల్లికి ముక్కెపెట్ట నేర్తురే” అనే సమస్యనిచ్చి పూరింపమన్నారు.

“ మల్లెలవంటి యీ తెలుగు మాటలనాడుట లోటటంచు తా
మెల్లపుడాంగ్ల భాషపయి హెచ్చుగు మోజును చూపుచున్ దమిన్
బిల్లలగూడ తద్విముఖ వీక్ష్యుల జేతురు కొంద రాంధ్రులే
తల్లికి ముక్కు గోసి పినతల్లికి ముక్కెర పెట్టనేర్తురే”[50]

కవికి ఇచ్చినటువంటి సమస్య లోకంలో ప్రసిద్ధి చెందిన సామెత. దేనికి ప్రాధాన్యం ఇవ్వాలో దానికి ఇవ్వకుండా మరొక దానికి ఇవ్వడం వల్ల ఆ సందర్భంలో ఈ సామెతను ఉపయోగిస్తారు. మల్లెపువ్వుల వంటి తెలుగు పదాలను మాట్లాడడం లోటుగా భావించి వారు ఎల్లప్పుడు ఆంగ్ల భాషపై ఎక్కువ ప్రీతిని ప్రదర్శిస్తూ మోజుతో పిల్లలకు కూడా తెలుగుపై అయిష్టము కలిగే దృష్టి కొందరు ఆంధ్రులు కలుగజేస్తారు. ఆ సందర్భంలోనిది ఈ పద్యం.

ముద్దులపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి సంస్కృతాంధ్ర పండితులు. ఆంధ్రదేశంలో 1941లో నెలకొన్న కరువు క్షామ పరిస్థితుల ఆధారంగా ‘అమృత సందేశము’ కావ్యాన్ని రాశాడు.

" నిల్కడగ నిల్చి నిముసమేన్ గురియవే
నీ యబ్బ సొమ్మేమి పోయెనయ్య!
ఆ రీతి గురిసిన నంతట గురియవే
నీతాతా గంటేమి నీల్గెనయ్య!
అంతట గురిసిన నదను దప్పింతువే
నీవారి సొత్తేమి నిలిచెనయ్య
అదను దప్పించిన నావల గనరావే
నీముల్లె ముడుపేమి నీగెనయ్య
కానవచ్చిన యట్టులే కానవత్తు
కురియ వచ్చిన యట్టులే యురిమి మెరతు
చిట్ట చినుకుండ బోవ దిక్కట్టులందు
ఏమి చిత్ర విచిత్రాల స్వామివయ్య"[51]

సరైన కాలంలో వర్షాలు కురవకపోవడం వల్ల దేవున్ని నిందించినట్లు కొల్చి సాగిన పద్యసరళి ఇది. ఎలక్షన్‌లలో ఓట్లకోసం రాజకీయ నాయకులు పడే పాట్లను, వారి విచిత్ర ప్రవర్తనను చెబుతూ....

" యిడవరు, యింటిసుట్టు వలవేత్తురు, సూత్తురు, వంక దణ్ణముల్
పెడతరు, మేలు నేస్తమని పెగ్గెలు బల్కుత, రాపనైన వెం
బడి తిరిగైన సూడ, రిసుమంటి పెబుద్దులు రాజ్యమేలితే
కుడిసి కుకుండ నిస్తర? మొగండ్లయి సూస్తనె గొంతు గోయరా"[52]

రాజకీయ నాయకులు పడే పాట్లను పామరులు తెలుసుకొన్న రీతిని కవి చక్కగా చిత్రించాడు.

వనం శంకర శర్మ కర్నూలుకు చెందిన కవి, నాటకకర్త, హరికథా రచయిత. 'సంసార యాత్ర' అనే సాంఘిక నాటకంలో ఆస్తికోసమై తండ్రి బలవంతపు పెళ్ళికి తల ఒగ్గినా ప్రేమించిన ప్రియుని కోసం ఆజన్మాంతం బ్రహ్మచర్యను అవలంబించి ప్రాణాలు కోల్పోయిన కమల పాత్ర చాలా ఉదాత్తమైనది. కమల తండ్రి రామావధాని ఇలా అంటాడు.

" ఒకనిని ప్రేమించి, యొకనిని చేబట్టి
బలుకీర్తి గన్న ద్రౌపతియు లేదె
ఒకనిని మది నమ్మి, యొకనితో సుఖమంది
యవనిలో వెలసి నహల్య లేదె

ఒకనిపై యాసిడి, యొకనిని ప్రేమించి
తగురీతి సల్పిన తార లేదె
ఒకనిని మదిగోరి, యొకనిని పెండ్లాడి
తగు బల్మిసలుప చిత్రాంగి లేదె
యెందరెందరో గలరు వారెందునైన
నపశయంబును బొందిరె యవని వారి
చర్య లతిపావనంబయి సతతముగను
వెలయుచున్నవి కన్గొను వేగ కమల"[53]

డబ్బుకోసం స్వంత బిడ్డల శీలాన్ని బలి చేయటానికైనా సిద్ధపడే తల్లిదండ్రులు ఈ సమాజంలో వున్నారని, కూతురు మనస్తత్వాన్ని తండ్రి గుర్తించక పోవడాన్ని కవి చిత్రించాడు.

కరణం అన్నమరాజశర్మ విశిష్ట కవి. వీరి 'కవి విపంచి' చక్కని కావ్య సృష్టి. ఒక కఠినాత్ముడు గంగిగోవును కసాయి వాని ఇంటికి పంపునపుడు దాని రోధన నేటి సామాజిక పరిస్థితులకు దర్పణం పడుతుంది.

" ఇంతకాలంబు బ్రీతి బాలించి, కడకు
ముసలి తనమున నట్టేట ముంపదలతో
మృత్యు ముఖమున బడ విచారింప గాని
దయయు ధర్మంబు నొక యింత దలపవలదొ!
క్షీరములగ్రోలి స్తనముల జెండెనన్న
కీరితికి మించె నీదు రక్కె సతనంబు
కటిక వానికి నన్ను విక్రయ మొనర్ప
నర్థలోభమ్ము చిత్తము నలమి కొనెనో" [54]

ఈ గంగిగోవు పాత్ర ద్వారా కవి నేడు పుత్రులు తమ తల్లిదండ్రులను ఎలా చూసుకుంటున్నారో యువతరానికి చక్కని సందేశాన్ని అందించారు.

పాణ్యం నరసరామయ్య ప్రాచీన కావ్యధోరణిలో ఆధునిక చరిత్ర రచనకు పూనుకున్న విశిష్ట కవి పండితులు. 'ఉయ్యాలవాడ నరసింహరెడ్డి' అనే పద్యకావ్యంలో నరసింహరెడ్డిని జానపదులు పాడుకొను రీతిలో చిత్రించాడు.

" రాజారావు, రాజబహదురు నారసింహరెడ్డి
రెడ్డి కాదు, బంగారపు కడ్డి నారసింహ రెడ్డి

ములుకోల కట్టె చేతిలో వుంటే ముమ్మాటికి మొనగాడు

కరువు వచ్చినా కాటక మొచ్చిన ఆదరించె రెడ్డి"[55]

అంటూ నరసింహారెడ్డి గొప్పతనాన్ని చెప్పాడు.

అందలం కృష్ణమూర్తి పారశీక మహాకవి ఉమర్‌ఖయ్యాం రుబాయిలను తెలుగు రుబాయీలుగా మార్చి 'మధుగీతి' అనే కృతిని రచించాడు. అచ్చమైన తేటతెలుగు పదాలతో రుబాయీలను రచించాడు.

" తెల్లవారిన తోడనే

మల్లెపూలు వేలకొలదిగ

తోటలో విరియ బూయు

నిన్న నవ్విన పువ్వులు

నేడు లేవు

వాని కనుగొని

నవ్వినవారు లేరు!"[56]

అంటూ భావ నిగూఢత, కవితాశిల్పము, సరళీయతను జోడించి కవిత్వీకరించాడు.

షేక్ హుస్సేన్ సాహెబ్ గారు చిన్నతనము నుండే సాహిత్యంపై మక్కువ పెంచుకున్న ఉర్దూకవి. మాతృభాష ఉర్దూ అయినప్పటికి అందమైన తెలుగు పదాలతో కావ్య రచనలు చేశాడు. 'భావ ముద్రలు' అనే ఖండకావ్యం రచించారు. శిల్పి ఖండికలో కవి కవితా శిల్పం చూడండి.

" ఒక నల్లఱాతిలో నులి చక్కిలింతల

నేన్గు గున్నల మంద లెడల నడిపి

యొక కల్లుబండపై నొయ్యారమున దూలు

కుచకుంభ రమణుల రచన సల్పి

యొక ఱాతి దూలాన పికిలి పిట్టల వంటి

పక్షి జాతుల రక్తి బర్వులార్చి

యొక గుండులో వీర ప్రకట దుర్గని లేపి

మిటమిట గ్రుడ్లు ఱిమింపజేసి

కాలగర్భాన నెన్నడో కలిసియున్న

పాండు కురువీర రామ రావణుల దండు

గుప్పతిప్పలుగా జాల గ్రుమ్మరించి

అద్భుతానందముల జాటెనవని శిల్పి"[57]

అంటూ శిల్పి యొక్క అద్భుత కళా నైపుణ్యాన్ని, అతని ప్రతిభను కవి చిత్రించాడు.

" రాయిరప్పల నందు ప్రత్యహంబును దివ్య

రతనంబు లెగజల్లు రాయసీమ

గోదావరీ నిర్మ లోదకంబుల ద్రాగి

కొమరు బుక్కిట వోయు కోనసీమ

పౌరుష జ్వలితాగ్ని పసిగుండియల గూడ

రాపి రేపించు పల్నాటి సీమ

ధనధాన్య లక్ష్ములు తాండవంబులు సల్పు

సాటికందని పాక నాటి సీమ

చెన్ను మీఱెడు నీయరచేతి పరుస

వేదిరేకలు గాగ సమ్మోదగతుల

బ్రతుకు చుండిన బంగారు బరిణివమ్మ

చెల్లు ముక్కోటి బిడ్డల తల్లివమ్మ" [58]

అంటూ ఆంధ్రదేశాన్ని మధురమైన తెలుగు పదజాలంతో కీర్తి గానం చేశాడు.

సయ్యద్ మహమ్మద్ ఆజం గారు 'సూక్తిసుధ' అను శతకంతో ప్రసిద్ధులైనారు. నేటి చదువుల గూర్చి చెబుతూ,

" పుస్తకాల బరువు జాస్తియయ్యెను గాని

మస్తకాల పటిమ నాస్తినాస్తి

నేతి బీరలోని నెయ్యి నేటి చదువు

సయ్యదయ్య మాట సత్యమయ్య"[59]

పిల్లల పుస్తకాల బరువు, వారి చదువులను గూర్చి తెల్పాడు.

"మహానంది కవులు"గా ప్రసిద్ధి చెందిన వారిలో ఒకరు భూమా రామయ్య. వీరు 'మహానంది క్షేత్రము' అనే వచన రచనను రచించాడు. 'ఏరువాక సాగారో' అన్న పాట శైలిలో మహానంది పాటను రచించాడు.

" మహానందికి పోదమురో రన్నో చిన్నన్నా

మన పాపమంతా బోవునురో రన్నో చిన్నన్నా

ఓంకారమునకు– యోజనంబట

గాజుల పల్లెకు– యోజన సగమంట

కందనూలుకు – నైదు క్రోసులట

నందియాలకును– పదిమైళ్ళేనట"[60]

అను చక్కని గేయ రూపంగా మహానందికి పోవుటను చిత్రించాడు.

శిష్టు కృష్ణమూర్తి గారు గొప్ప రచయిత. జానపద గీతాల ధోరణిలో 'లచ్చిపాటలు' రచించాడు. ఇందులో 'లచ్చి' చలాకి పిల్ల.

" కళ్ళాన తూర్పారనే బోసుతా యుంటె

సూటిగా నను సూసి కబళించె నారూపు

సిగ్గుతో తనువంత కుంగిపోయింది"[61]

పొలం పని చేస్తున్న లచ్చిని భావ తొంగి చూస్తే సిగ్గుతో మురిసిపోయింది.

" ఈ కులుకు లీ పలుకు లెటువచ్చెనే! లచ్చి!

ఆ వాగు ఆ సిల్క నాకు నేర్పెను బావ

ఈ వంపు లీ సొగసు లెక్కడివి? నీకు

ఆ విరులు ఆరేడు నాకిచ్చిరయ్యా!"[62]

లచ్చి నడకలో వాగువంకరలు, పలుకుల్లో తియ్యదనం, పరువంలో పరిమళమూ వున్నాయి. భావనా సౌష్ఠవాన్ని లచ్చి అంగ సౌష్ఠవాన్ని పై పంక్తులు తెలియజేస్తున్నాయి.

కర్నూలు జిల్లాకు చెందిన కె.ఎన్.ఎస్. రాజు ప్రముఖ కవి, సంపాదకులు. 'కర్నూలు జిల్లా రచయితల చరిత్ర'ను రాసి కర్నూలు ప్రాంతంలోని అనేక మంది కవులు, రచయితలను వారి సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చాడు. వీరు అనేక రచనలు చేశారు. 'వరకట్న గ్రహణం' అనే కవితలో వరకట్న సమస్యను గురించి చెబుతూ స్త్రీలు చైతన్యవంతులు అవ్వాలని తెలుపుతున్నాడు.

" వరకట్న సమరంలో యువతులు

ద్రుపదులై నీ వరకట్న కంచుకోట

పునాదులే పెకలిస్తారు

వీర ఝాన్సీ లక్ష్మీలే అవుతారో

రాణి రుద్రమ్మలే అవుతారో

వీర మాంచాలలే అవుతారో

విజయవాడ కనకదుర్గలే అవుతారో

కలకత్తా కాళులే అయి నీ అంతు చూస్తారో

సమ్మెట పోటులతో చితికి కరిగిన కన్నె

ఎదురు తిరగక ముందె ఒళ్ళు జాగ్రత్త సోదరా" [63]

అంటూ ఆడపిల్లల క్రోదాగ్ని, ఆవేశాన్ని చూపించాడు.

ఆర్. రంగస్వామిగౌడ్ ప్రముఖ కవి. 'గుండెలోని నాదాలు' అనే కవితా సంపుటిని ప్రచురించాడు. 'శిథిల సౌందర్యం' అనే కవితలో గండికోట యొక్క చారిత్రక అవశేషాలను తెల్పాడు.

" గండికోట మొండి గోడపై

మొలచిన మర్రిచెట్టు

మరీమరీ చెబుతోంది

తన రెమ్మలపై రెక్కలు

విదుల్చుకుంటూ

వొగురుస్తున్న కాకమ్మలతో

..............................

గండికోటలో

వీరి కంట బడేదేమిటి?

తలలు వాల్చిన కోట బురుజులు

బీటలు వారిన కోట గుమ్మములు

నడుం విరిగిన మరఫిరంగులు

చరిత్ర కెక్కని అమర వీరుల సమాధులు"[64]

గండికోట శిథిలావస్థ దుస్థితిని కవిత్వీకరించాడు. 'మరోమజిలీ' కవితలో బిక్షగాని ఆకలి కన్నీళ్ళను, అతని దీనావస్థను వ్యక్తం చేస్తున్నాడు.

" గుక్కెడు నీళ్ళతో

గతరాత్రి కడుపు నింపుకున్న

ముసలి బిచ్చగాని

మాటలకర్థం వెతుక్కుంటూ

అర్థంకాని యీ లోకాన్ని

తలచుకుంటూ

కారే కన్నీటిని తుడుచుకుంటూ

దోగాడుతూ వెళ్తున్నాడు

కుంటి బిచ్చగాడు

మరో మజిలి వెతుక్కుంటూ”[65]

బిక్షగాని వేదనను కవితలో చూడవచ్చు.

గన్నమరాజు సాయిబాబ ‘మేలుకొలుపు, జీవన మార్గం’ అనే కవితా సంపుటాలను ప్రచురించాడు. ‘బోర్డు మిగిలింది’ అనే కవితలో ఇలా అంటాడు.

“ సంస్కృతిని సాని యింట్లో కుదువపెట్టి

పైటలేని సభ్యతను

రవికె లేని సంస్కారాన్ని రంగరించి

శృంగారించి తెరపై ఆడిస్తున్నాడు

ప్రేక్షక మహాశయుల అలరిస్తున్నాడు

కనుల మబ్బుతెరలు కమ్మిస్తున్నాడు

సెన్సార్ బోర్డులో

సెన్స్ పరారయింది

బోర్డు మాత్రం మిగిలింది”[66]

నేటి సినిమాలలో హీరోయిన్‌ల వేషధారణ, సినిమా సంస్కృతిని, సెన్సార్ బోర్డుల బాధ్యతను చిత్రించాడు.

కీర్తి నాగరాజు వచన కవిత్వాన్ని రాస్తున్న కవి. ‘గుండెసెగలు’ అన్న కవిత్వంలో సమాజంలో జరిగే అల్లర్లను తెల్పుతున్నాడు.

“ మతాన్ని మందుగుండు లాగా

పేల్చుకొంటున్నాం

కులాన్ని మారణాయుధాలుగా

ప్రయోగిస్తున్నాం

రాజకీయాలను రంకుల పథక సాధనకు

వినియమ శాఖగా మార్చు కొంటున్నాం

అధికారాన్ని అవినీతి సముద్రంలో

అవలీలగా సాగిపోయే ఆధునిక వాహనంగా

వాడుకొంటున్నాం."[67]

అంటూ సమాజంలో కొందురు వ్యక్తులు కులాలు, మతాలు, రాజకీయాల ముసుగులో దాడులు, అల్లర్లను సృష్టించే ప్రమాదముందని కవి హెచ్చరిస్తున్నాడు.

జెట్టి జైరాం గారు విప్లవ దృక్పథం కలవారు. తన 'ఎర్రగాలి' కవిత్వం ద్వారా 'ఎర్రగాలి జైరాం' గా పేరు తెచ్చుకున్నారు. పేద, మధ్యతరగతి జీవనాంశాలను కవిత్వీకరించారు.

" మండే ఎండల్లో జడివానల్లో

రేబవళ్ళూ కండలు కరగించి

కటిక నీళ్ళను పంట సీమలుగా మార్చి

శ్రమ జీవుల సృష్టించిన ధాన్యరాసుల

కణజాల్లో బంధించి

కూలీ గింజలతో

ధాన్యరాసుల సృష్టికర్తలను

ఇళ్ళకు సాగనంపడమా ప్రజాస్వామ్యం"[68]

పేదరైతుల కష్టఫలాన్ని దళారులు, వ్యాపారస్తులు అనుభవించడం ఇది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది అని ప్రశ్నిస్తున్నాడు.

" కష్టాలు చేసీ చేసీ రైతూలు ఏడ్చిరన్న

వడ్డీలు కట్టీ కట్టీ పేదోల్లు ఏడ్చీరన్న

కారిన కన్నీరంతా కసిబట్టి లేచిందన్నా

కన్నెర్ర జేసిరన్న కూలోల్ల నాయకులంతా

కన్నెర్ర జేసిరన్న రైతూల నాయకులంతా

నిప్పులు చిమ్మిరన్న ఊరూరి కూలీలంతా

భూస్వామ్ల శిరసుల్ పైన గొడ్డళ్లై వచ్చీరన్నా"[69]

సేద్యం చేసే రైతులు, కూలీలు భూస్వాములు, దళారీలు, వ్యాపారస్తులపై తిరుగుబాటు చేసే సందర్భాన్ని కవి ఒక జానపదులు పాడుకునే పాట రూపంగా రచించాడు.

రాయలసీమలో కడప జిల్లా అభ్యుదయ కవిత్వోద్యమానికి కేంద్రంగా నిలిచింది. వై.సి.వి.రెడ్డి, గజ్జల మల్లారెడ్డి ప్రముఖ అభ్యుదయ కవులు. ఎమ్మనూరు చిన వెంకటరెడ్డి వై.సి.వి. రెడ్డిగా ప్రసిద్ధులు. 1960లో

'దక్షిణా నిలయం' , 'రాయబార్యం' అనే రెండు గేయ కావ్యాలను రచించాడు.

" కలకంఠ కూజితమ్ముల రక్తిమలు నించి
సెలయేళ్ళ సుడులలో కలగాన మూటించి
నీనకారు పుప్పొళ్ళ నాగుబ్బుగ ధరించి
యలసముగ దక్షిణా నిలము మా గడ్డపై వీచెనమ్మా! యిపుడె"[70]

తెలుగు సీమలోని ప్రకృతిసౌందర్యం, దానిలోని గాలి చలన సౌందర్యంతో ప్రకృతిని ఎలా పరవశింప చేసిందో కవి భావుకతతో వర్ణించాడు.

" తరతరమ్ముల భావదాస్యమ్ము దొలగించి
పరపీడనా దురాచరణములు మాయించి
దళితజీవుల యెదల ధైర్యమ్ము లెలయించి
అలసముగ దక్షిణానిలము మాగడ్డపై
వీచెనమ్మా! యిపుడె!" [71]

తరతరాల దాస్యం, పరపీడనం పోయి దళితులకు ధైర్యం, నమ్మకం ఎలా కలిగిందో కవి తెలిపాడు. 'రాయబార్యం' ఒక దీర్ఘ గేయకావ్యం. ఇందులో 'గాసగాడు' రైతుల ఇండ్లలోను, పంటపొలాల్లోను పనిచేసే కూలీ శ్రమను ఆవిష్కరించారు.

" కోడికూత వినగానే కోపగాడు రెడ్డేరని
కొంపలోని రొంపంతా ఊడిపారేయలని
వచ్చినాడు మాదిగోడు వంగినాడు పనిపాట్లకు
గాడి పాటలాడుస్తూ గంజుకుండ పగిలిందని
గంజుతోడు టెట్లాయని అడుగలేక మిడికినాడు
పాపం మీ గాసగాడు ఆ మాటే చెబుదామని
నీకెందుకు చెప్పాలని చెప్పలేక పోతున్నా"[72]

ఇలా గాసగాడు తెల్లవారు ఝామున కోడికూతతో లేచింది మొదలు భూస్వాముల ఇళ్ళలో పనిచేసే విధానాన్ని కవి చిత్రించాడు. సీమ రైతు కూలీల బ్రతుకులు, వారి జీవన విధానానికి అక్షర రూపం రాయబారం కావ్యం.

విద్వాన్ విశ్వంగారి 'పెన్నేటి పాట కావ్యం'లో రంగన్న తండ్రి నారపురెడ్డి నలుగురికి దానం చేసే భూస్వామి. ఆయన కొడుకు రంగారెడ్డి కాలం చెడిపోయి రంగారెడ్డి రంగన్నగా మారిపోతాడు. కూలీ సేద్యం చేసుకుంటూ

చివరికి రంగన్న కూలోనిగా, సేద్యగానిగా మారిపోవడంతో 'రంగాడు'గా మారిపోతాడు. పెన్నానది గతకాలపు దృశ్యాన్ని ఇలా వర్ణించాడు.

" ఈ డొంక పెండ్లిండ్ల కెగువారల
నెన్నితూరులు దొంగలు దోచుకొనిరో?
ఈ డొంక నిండు బండ్లెన్ని మారులు
బరువెక్కుట యిరుసు పుటుక్కుమనెనో
ఈ డొంక నెన్ని సార్లెందరు మొనగాండ్లు
కాలుసేతులు యెముకలు విఱిగెనో
ఈ డొంక మంచి నీళ్లెత్తుక వచ్చు
కొంగ్రొత్త కోడండ్రెంత కుళ్లు కొనిరో!
ఇచట నెండ ప్రొద్దుల పసులెన్నియెన్ని
ఇంత విశ్రాంతికై తపియించినవి యొ"[73]

పెన్నా పరివాహక ప్రాంతంలోని ఆ డొంక ఎందరికి ఎన్ని రకాలుగా కష్టాలు పెట్టిందో ఆ నది వల్ల ఎన్ని సుఖాలను పొందారో కరువుల్లో సామాన్యుల జీవితాలు ఎంతగా చిన్నాభిన్నం అవుతాయో కవి వర్ణించిన సందర్భం అది. రంగన్న జీవితంలోకి గంగమ్మ రాక ఒక వసంతాగమనం. ఆమె వయసు చిన్నది. ఆమె యవ్వనరూప లావణ్యాన్ని ఎలా వర్ణించాడో చూడండి.

" గంగమ్మ పదారేండ్లది
కొంగు నిలుచునంత వయసు గూడలేని, దా
సింగారపు బొమ్మే మన
రంగన్నకు బ్రతుకులో చిరత్న రత్నమౌ"

........................................

తిప్పలెన్ని పడిన ముప్పుల మున్గిన
ఉప్పు పప్పు లేని యునికియైన
కప్పు రంపు టెడద కమ్మని తలపులు
నిప్పు వంటి బ్రదుకు గొప్పనిచ్చె"[74]

గంగమ్మ పేద పడుచురాలైనప్పటికీ ఆమె నిప్పువంటి బ్రతుకు గడపడంతో అదే గొప్ప తృప్తినిచ్చిందని కవి చెప్పారు. పెన్నా నది పరివాహక ప్రాంతంలో ఒకప్పుడు భయంకరమైన కరువు వచ్చి వ్యవసాయం దెబ్బ

తిన్నప్పటికీ ఆ ప్రాంతంలోని కొండకోనలు మాత్రం ఆ గ్రామ ప్రజలను పండ్లు, పూలు మొదలగు అటవీ ఉత్పత్తులతో ఆదరించేవని కవి వర్ణించిన దృశ్యం.

" కాసేపు రాల్చిన గంపల కొలదిగా
కమ్మని కలివి పండ్లమ్మ వచ్చు
కొంతసేపు చాలు కొల్లలు కొల్లలు
బలసకాయలు గంప బట్టవచ్చు
ఇంతసేపే చాలు నెన్నైన రేణగా
యలు కోసుకొని అమ్మనైనవచ్చు
ఒక యింత సేపు నోపిక గోసుకొన్న చాల్
సీమ చింతలు వడి జేర్చవచ్చు"[75]

పెన్నేటి తీర ప్రాంతం అలాగే ఆ పరిసర పొలాలలో దొరికే పళ్ళను గూర్చి వాస్తవ పరిస్థితులను కవి వర్ణించాడు.

కడప జిల్లాకు చెందిన గజ్జెల మల్లారెడ్డి అభ్యుదయ కవి. మల్లారెడ్డి గేయాలు ప్రశంసనీయమైనవి. శ్రీశ్రీ గారు సైతం వీటిని చదివి మల్లారెడ్డిని అభినందించాడు. మల్లారెడ్డి గేయాలు, శంఖారావం లాంటి రచనలు చేశాడు. మల్లారెడ్డి అభ్యుదయ గేయాలలో సామాజిక సమస్యలు, పాలక వర్గాల తీరు తెన్నులు లాంటి వాటిని చర్చిస్తాయి. స్వాతంత్ర్యానంతరం సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత రంగాల మీద యుద్ధం ప్రకటించిన కలం యోధుడు మల్లారెడ్డి.

" కళ్లెదుట నిరుపేద పట్టెడన్నము లేక
ఆకలోయని చావు కేక లేస్తుండగా
కలకాల మిలలోన శిలలాగ నిలువగల
భూరి కావ్యము రోసి పొంగి పోతావా
గండ పెండారాల గంతు లేస్తావా"[76]

అంటూ ఫ్యూడల్ సమాజాన్ని ఉద్దేశించి ప్రశ్నిస్తున్నాడు.

" వర్గ వ్యత్యాసాల దుర్గ మారణ్యాలు
వర్ణ విద్వేషాలు వన్య మృగతత్వాలు
కుల మతోన్మాదాల విలాపప్రకోపాలు
నరజాతి జీవితము నరకమ్ముగా మార్చు

టెన్నాళ్ళు? ఇంకెన్నాళ్ళు? ఇంకెన్నాళ్ళు?"[77]

అని సమాజంలో అసాంఘిక శక్తుల విజృంభణను కవి ప్రతిఘటించాడు. దళితుల పూరి గుడిసెలను ఎవరో బలవంతంగా తగుల బెట్టించినపుడు మాల్లారెడ్డి గారు అశువుగా చెప్పిన గేయం ప్రసిద్ధి పొందింది.

" నిప్పుతోడ చెలగాటమాడితే
ముప్పులు తిప్పలు తప్పవురా
పల్లేరు గాయలు చల్లిన చోటను
మల్లెలు జాజులు పూయవురా
పడగ విప్పి బుస కొట్టకురా
చలిచీమల్లా శ్రామిక బలగం
చీల్చి చీల్చి చెండాడునురా
పూరి గుడిసెలకు అగ్గిపెట్టితే
మేడలు, మిద్దెలు మిగలవురా
కష్టజీవి ముక్కంటి మంటలో
కాలి బూడిదై పోవురా
తరతరాల మీ దోపిడీ మీదను
తిరుగుబాటు చెలరేగెనురా
వెట్టి చాకిరీ దౌర్జన్యాలూ
యికపై చెల్లవు చెల్లవురా"[78]

అంటూ ధనిక, భూస్వామ్య వర్గాలు పేద ప్రజలు, దళితులపై దౌర్జన్యాలు, అక్రమాలు చేయడం వల్ల ఆ పేద ప్రజల్లో వచ్చిన తిరుగుబాటు ధోరణిని కవి ఆగ్రహంగా వ్యక్తం చేశాడు.

నూతలపాటి గంగాధరం వచన కవిత్వాన్ని రాస్తున్న కవి. 'చీకటి నుంచి వెలుగులోకి' అనే వచన కవిత్వ సంపుటిని వెలువరించాడు. 'నిండనికుండ' కవితలో సృష్టిలో జరిగే సత్యాన్ని స్పష్టం చేస్తున్నాడు.

"నిండని కుండ తొణుకుతుంది, నిజం;
ఎప్పుడు?
ఎవరైనా కదిపినప్పుడు
నిండుకుండ మాత్రం తొణకదా?
నిశ్చలంగా ఉంచేస్తే

ఏది మాత్రం ఎందుకు తొణుకుతుంది?
దిక్కు దిక్కులూ తిరిగి
తెచ్చి పెట్టుకున్న తేనెపట్టుని
తింటుంటాయి - తమ కష్టం
తిన్నగా- తేనెటీగలు
ఎప్పుడు
ఎవరూ కదపనప్పుడు
ఎందుకు మ్రోగుతాయ్ గంటలు మాత్రం
గోవు-సాధు జంతువే
కాదని ఎవరన్నారు?
పాలు పితుకబోతే
కుండ పగులదంతుంది, ఒకప్పుడు
ఎప్పుడు?
తిండిపెట్టకుండా, కడుపు కాల్చినపుడు"[79]

అంటూ నిత్యం సమాజంలో జరిగే సంఘర్షణలను వాటి నేపథ్యంలోంచి కవిత్వీకరించాడు. 'శ్రమజీవి' కవితలో శ్రామికుల కష్టనష్టాలను తెలియపర్చాడు.

"తనువునే ఒక చెమట బొట్టుగా
బ్రతుకునే ఒక కన్నీటి చుక్కగా
నీ కోసంగాక, ఇతరులకోసం
తృణప్రాయంగా
వెచ్చించకలిగే- ఓ త్యాగీ!
కష్టనష్టాల భోగీ!
భోగభాగ్యాల త్యాగీ!
త్యాగీ!రాగీ!విరాగీ!
నష్టానికైనా, అదృష్టానికైనా
చలించక- జ్వలించక
ఎప్పుడూ ఒక రీతిగానే

రెంటినీ ఒక బుద్ధితోనే

ఒక చిరునవ్వుతో

స్వీకరించగలిగే

ఉదాత్తుడా! ధీరోదాత్తుడా!!

ఉదారుడా! నిరాధారుడా!!"[80]

అంటూ ఈ సమాజంలోని శ్రామికుల జీవితాలను వారి ఓర్పును, సహనాన్ని తెల్పాడు. 'ఈ ఊరు మా ఊరు' కవితలో గ్రామం యొక్క ఉనికి స్వరూపాన్ని, పేద ప్రజల ఇళ్ళను గూర్చి తెలుపుతున్నాడు.

"ఈ ఊరు

నింగి రాతితో చేసింది

నేల ఉక్కుతో నిర్మించింది

ఒక్క చుక్క వర్షం పడదు

ఒక్క గింజ ధాన్యం పండదు

చెరువు మాత్రం ఉంది, పేరుకు!

కప్పలుండగా ఇంతవరకు చూడలేదు

తెప్పలమాట వేరే చెప్పాలా?

ఈ వూరు మా ఊరు!

ఈ వైపు ఒక మేడ

ఆ వైపు ఒక మేడ– ఆకాశాన్నంటేవి!

మధ్య మా యిల్లు– పూరిల్లు!

రెండుపిల్లుల నడుమ

ఎలుక లాంటిది– మా యింటి ఉనికి!"[81]

అని గ్రామంలోని పరిస్థితులను తెల్పుతున్నాడు. ఇంకా ఆ గ్రామం చుట్టుపక్కల వాతావరణాన్ని చిత్రిస్తున్నాడు.

"సూర్యచంద్రులు విధిలేక

మా వూరు చూచి పోతున్నారు

దీని చుట్టూ చూద్దామన్నా

కనుచూపు మేరలో పర్వతాలు కనిపించవు

ఊరి పొలిమేరల్లో ఎక్కడా

పచ్చచెట్టుకానీ, పచ్చిక గట్టుకానీ

కనిపిస్తే ఓట్టు!

దూరం నుంచి వచ్చిన చల్లగాలి

మా ఊరిని చూడగానే నిప్పులుమిసిపోతుంది

శ్రామికులందరికీ చివరకు మిగిలేది

స్వేద బిందువులూ, రక్తపు చుక్కలూ!

పాలిచ్చే పశువులు లేవు

ఉన్నవి కూడా గడ్డిలేక శల్యావశిష్టాలై

పడి ఉన్నాయి – ఈ ఊరు వదలలేక!

తెల్లవారిందని చెప్పడానికి కూడా

ఒక్క కోడి లేదు!

ప్రకృతికీ మా వూరికీ ఎప్పుడూ పడదు!"[82]

అని గ్రామ స్వరూపాన్ని చిత్రించాడు. 'అభ్యుదయం' అనే కవితలో ఇలా అంటాడు.

"పెరిగేది పెరగనీ విరిగేది విరగనీ

అంతకన్న ఏమి అయ్యేనులోకాన!

మారేటి కాలమే మనకంటి బాష్పాలు

రాలేటి పూవులే రక్తంపు చుక్కలూ!

అడగకే అప్పిచ్చు అంబుధే ఈనాడు

అయిపోయె కొసిరేటి అంగట్లో కోమటీ!

మిగుల దానము చేయు

మేఘమ్మె ఈనాడు

బదులివ్వ కుంటేను

పత్రాలు చూపెట్టు"[83]

అని ఈ సమాజంలో జరిగే దోపిడి స్వభావాలను వాటి అంతర్యాలను తెల్పుతున్నాడు.

ఆశావాది ప్రకాశరావు సంపాదకత్వంలో 'ఆర్కెస్ట్రా' అనే కవితా సంకలనం 1979లో వెలువడింది. ఈ సంకలనంలో కేతు బుచ్చిరెడ్డి, భూషి కృష్ణదాసు, బులుసు వేంకట కామేశ్వరరావు, యం.సి. నాగన్న, తూములూరు కార్తికేయ శర్మ ఈ ఐదుమంది కవుల కవితలు ఉన్నాయి. వీరందరిలో

సామాజిక స్పృహ, నిశిత పరిశీలనా దృష్టి, నానాటికీ దిగజారిపోతున్న మానవ సమాజాన్ని గూర్చి ఆందోళన పడుతూ జీవితాన్ని అనేక కోణాల్లో దర్శించడం మనం గమనించవచ్చు.

భూషి కృష్ణదాసు 'ఆరోజు కోసం' కవితలో మానవ జీవితమంటే ఇంతేనా అని ఒక నిట్టూర్పును వ్యక్తం చేస్తున్నాడు.

"ఇంతేనా జీవితం
చేతికంది నోటికందక పోవడమేనా
రోటికి రోకలికి మధ్యనలిగి పోవడమేనా
ఇంతేనా జీవితం
............................................
బ్రతుకంతా బాధల్ని తిని కన్నీళ్ళు త్రాగి
కష్టాల్ని ప్రసవించడమేనా జీవితం
ఒక్కసారైనా ఈ బ్రతుకు బండలపై
ప్రసరించదా సూర్యకాంతి
జీవితం మంచినీళ్ళ బావిలోంచి
చల్లని నీళ్ళన్ని త్రాగాలని
ఎంత తపనపడ్డా- చివరకు
చేద చిరిగి పోవడమో లేక
తాడు అందక పోవడమేనా జీవితం?"[84]

అంటూ మానవుని జీవితంలోని సాధక బాధకాలను, కష్టనష్టాలను తెల్పుతూ నిరాశా పూరిత జీవితాన్ని తెల్పాడు. బులుసు వేంకట కామేశ్వర రావు'చలం' కవితలో చలం కవి మీద స్మృతి కవిత్వాన్ని రచించాడు.

" 'స్త్రీ' జనోద్ధరణే
నీ 'జీవితాదర్శం'గా
పెట్టుకున్నావు
స్త్రీని స్వేచ్ఛా 'మైదానం'లో
విహరింప జెయ్యాలని ప్రయత్నించావు
వారి జీవితాలలో
'మ్యూజింగ్స్' పలకాలని

ప్రేమతో నిండిన 'ప్రేమలేఖలు'

ఎన్నో, ఎన్నెన్నో రాశావు

వారికి 'బిడ్డల శిక్షణ' నేర్పించావు

'బ్రాహ్మణీకం' కట్టుబాట్లకు

ఎదురు నిలిచావు

కలం ఆయుధంగా ధరించి

బూజు పట్టిన ఈ సమాజంపై

యుద్ధాన్ని ప్రకటించావు

తుదిశ్వాస పీల్చేవరకు పోరాడావు

పూర్తి విజయం సాధించక మునుపే

అరుణాచలేశ్వరునిలో ఐక్యమయ్యావు"[85]

అంటూ చలం సాహిత్య జీవితాన్ని స్మరించాడు.

యం.సి. నాగన్న 'ఈ లోకం' కవితలో ఈ సమాజం మానవుడిని ఎలా మోసం చేస్తుందో చెబుతూ, అలాంటి మోసాన్ని, అన్యాయాన్ని అంతం చేసి రామ రాజ్యం తేవాలని ప్రభోదిస్తున్నాడు.

"ఈ లోకం

మనిషిలోని మంచిని గుర్తించక

పిచ్చివానిగా లెక్కించి వెక్కిరిస్తోంది

నీతిని నిజాయితీగా మనిషి బ్రతుకుతోంటే

విషపు గుటకలు మ్రింగుతూ కక్ష సాధించి

కసి తీర్చుకోవాలంటుంది

మంచి అంటే ఎప్పుడూ గిట్టదు లోకానికి

మానవత్వంపై క్రూరత్వం

న్యాయంపై అన్యాయం విరుచుకుపడి

చేస్తున్నాయి....స్వారి

.........................

అందుకే...

లోకాన్ని మరమ్మత్తు చేసి

నీతికాముకల మనుగడకు

కొంగ్రొత్త లోకాన్ని సృష్టించాలి

కావాలి మన ధ్యేయం అదే

అప్పుడే లోకం ఆనందనిలయం

గాంధి కలలు గన్న కమ్మని రామరాజ్యం”[86]

అంటూ ఈ లోకంలో మనిషిపై చేసే మోసాలు, అన్యాయాలు, దోపిడి, దౌర్జన్యాలను తెలియజేస్తున్నాడు. ‘నా ప్రయాణం’ కవితలో కవి ఈ సమాజం నుంచి మరో ప్రపంచానికి ప్రయాణం చేయాలని చెబుతూ తన ఆలోచనను స్పష్టపరుస్తాడు.

“నా ప్రయాణం...

మరో ప్రపంచానికి

..................

కష్టసుఖాలు

సమంగా పంచుకొని

సహ జీవనం సాగించే లోకానికి

వీడు తురక, వీడు కిరస్తాని, వీడు హిందూ

అనే కులమత భేదం పాటించక

కలిసి మెలసి నివసించే లోకానికి

ఇది నీది నాది తనదని

స్వార్థంతో భేదం పాటించని

విశాల భావం నివసించే లోకానికి

..............................

ఉన్నవాడు లేనివాడు

అందరూ సమానంగా

సుఖశాంతులు పంచుకొనే లోకానికి”[87]

అంటూ కవి సమసమాజ నిర్మాణం కోసం ఆశిస్తున్నాడు.

భూషి కృష్ణదాసు ‘వీళ్ళంతా నా వాళ్ళు’ అనే కవితలో పేద ప్రజల గూర్చి ఇలా అంటాడు.

“వీళ్ళంతా నా వాళ్ళు

ఎన్నిక జాతరలో వోట్లిచ్చి
కష్టాల్ని కొనుక్కున్న వాళ్ళు
పగలంతా కష్టాల్లో తలదూర్చి
రాత్రికాగానే కలల కౌగిళ్ళలో
కునుకు తీసేవాళ్ళు
ప్రణాళికలు పథకాలు
ఉద్బోధలు ఉపన్యాసాలు
వీళ్ళనుద్ధరించలేని వట్టి
బండెద్దు మార్కు బడ్జెట్టులు
ఉత్తి వాగ్దానాల మూటలు
ఎవరు మళ్ళిస్తారు
వీళ్ళ కన్నీళ్ళను కలల పొలాల్లోకి
ఎవరు పండిస్తారు
..................................
వీళ్ళంతా నా వాళ్ళు
భూస్వాముల కాళ్ళ దగ్గర
బ్రతుకులమ్ము కొన్నవాళ్ళు
భగవంతుని జాబితాలో
పేర్లు కొట్టేసిన వాళ్ళు"[88]

అంటూ రాజకీయ నాయకుల వాగ్దానాల వల్ల, ప్రభుత్వ పథాకాలు, బడ్జెట్ వల్లనూ ఏ ప్రయోజనం పొందని పేద ప్రజల జీవిత గాథల్ని చిత్రించాడు.

తూములూరు కార్తికేయ శర్మ 'నీకే ఎఱుక' కవితలో వర్షాలు పడని సందర్భాన్ని గుర్తుచేస్తున్నాడు.

"చీకటి కడుపున
కాంతినిద్దరోతోంది
భోరున ఏడుస్తున్నాయి మేఘాలు
వరుణ దేవుని కరుణ హస్తం
కత్తిబట్టింది

ప్రకృతి నర్తిస్తోంది

పైశాచికంగా

సెలయేరు రోదిస్తోంది"[89]

అంటూ మేఘాలు కక్షగట్టి వర్షం పడకుండా వున్న దృశ్యాన్ని, నీళ్ళు లేని వాగుల దీనావస్థలను తెల్పాడు. పుట్టపర్తి కనకమ్మ కవయిత్రి, విధుషీమణి. భక్తిపారవశ్యంతో భక్తి రచనలు చేశారు. భక్తి పారవశ్యంలో మునిగిపోయినా సామాజిక అంశాలను కూడా కవిత్వీకరించారు. 'ఆకాశవాణి'లో ప్రసారమైన స్వీయకవితా గానంలో వరకట్న దురాచారానికి బలైపోతున్న స్త్రీ జాతిని చూసి ఆక్రోశించారామె! ఆ పద్యం చూడండి.

"దేశ చరిత్రలో పుటలు ద్రిప్పుచు, మా ఘనతింతయంత, యం

చాశలు, గ్రుమ్మరించెడి మహాత్ములకీ, వరకట్నముల్ సమా

జాశర రూపమున్న తలపందదొ, రిక్తము రిక్తమైనచో

గాసట బీసటే బ్రదుకు కన్నెకు యోగ్యతలెన్ని యుండినన్"[90]

అని వరకట్న సమస్య ఈ సమాజంలో ఎలా పాతుకుపోయిందో తెలుపుతున్నారు. వివిధ యుగాలలో స్త్రీల ప్రాతినిధ్యం సమాజంలో ఎలా వుండేదో ఆమె మాటలలో దర్శిద్దాం.

"ఆది కాలమ్మున నతివలు స్మృతులలో

పాల్గొని రన్నట్లు ప్రథలుగలవు

పౌరాణిక యుగాన ప్రమదలు సాధ్యులై

పతిగూడి యిడుములు బడుట గలదు

చారిత్రక జగాన నారీమణులు రాజ్ఞ

లై రాజ్యమేలిన యట్లు గలదు

యీ కాలమున స్త్రైణ మేకార్యములనైన

సామర్థ్యమున దీర్చు శ్రద్ధగలదు

పెద్దలన్నట్లు ముద్దియల్ బుద్ధిగాను

నేర్వ రానట్టి విద్యలెన్నేని గలవె?

సర్వకాలములందున శక్తియుతలు

అతివలగుటయే, నిర్వివాదాంశమరయు!"[91]

అని యుగయుగాల్లోనూ స్త్రీలు ఎంతటి ప్రాధాన్యత పొందారో తెల్పుతూ ఈ సమాజంలో ఎన్నో విద్యలను నేర్చుకొని సర్వకాలాలలోనూ శక్తిమణులుగా నిలిచారని కొనియాడింది. ఈ సమాజంలో స్త్రీలను కించపరుస్తూ

మాటలాడే పురుష జాతికి బుద్ధి చెబుతూ ఇలా అంటుంది.

"పురుషునితో సమానయుగ ముగ్ధలు గూడ క్రియాకలాపముల్
పరుగున జేయుచున్నను విపక్షులు కొందరు అజ్ఞులైసదా
తరుణుల బుద్ధికౌశలము తక్కువ జేసి విపర్యయంబుగా
నరమలలెన్ను చుందు రిదియా మరియాద సమాజమందునన్"[92]

అని కవయిత్రి ప్రశ్నిస్తారు. ఆధునిక సమాజంలో స్త్రీ పురుషులిద్ధరూ సమాజాభివృద్ధిలో సగభాగం అంటూ గృహాన్ని సైతం రెండు చక్రాల్లా యిరువురూ చక్కటి అవగాహనతో నడుపుకుపోవాలనీ ఎన్ని కష్టాలనైనా జంటగానే ఎదుర్కొనాలని యిరువురికీ హితవు చెబుతున్నారు.

'మధురకవి'గా గుర్తింపు పొందిన బెళ్ళూరి శ్రీనివాసమూర్తి అమృతాభిషేకము, తపోవనము, కావ్యగంగ, శిల్పవాణి, వివేకానందము మొదలైన రచనలు చేశాడు. కావ్యగంగ ఖండకావ్యంలో లేపాక్షి దేవాలయ విశేషాలను తెల్పుతున్నాడు.

"తరుణీ తప్పకపోయి చూడదగు నందంబైన లేపాక్షియె
వ్వరు నిర్మంచిరో దేవతాయతన మబ్బా, యేమి శిల్పంబు, మ
త్సరమున్ గాంతురు భిన్నదేశ జనులా సౌందర్యమున్ జూచి, ఆ
శిరసుల్ విప్పిన సర్పమో, వృషభమో, స్త్రీ మూర్తులో యచ్చటన్"[93]

అంటూ లేపాక్షి దేవాలయ శిల్ప సౌందర్యాలను, వాటిని చూచిన వారికి కలిగే అనుభూతులను అక్షరీ కరించారు. బైరపురెడ్డి రెడ్డి నారాయణ రెడ్డి 'రాయలసీమ రైతు' కావ్యంలో రైతుల విషాద సంఘటనలను చిత్రించాడు.

"మూడు జగలములు మేఘుండు మోపనీక
తొలగ దోలిన కఱవెందు మెలగలేక
దత్త మండలమందు తానెత్తువడియె
గాక యుండిన యిట్లేల కలతవెట్టు?
కసవు పొసగదు; నీరైన నొసగలేక
మేపనడవికి తోలిన గోపవరుల
కను కొలంకుల జొచ్చిన కరుణజలము
గ్రోలగను జూచినట్లుండె గోచయంబు"[94]

అంటూ సీమలో కరువుకాలాన్ని కళ్ళారా చూచిన కవి కావడం వల్ల కవితలో ఆర్తి స్పష్టంగా కనిపిస్తుంది.

వాడేల వేంకట శేషగిరిరావు 'శ్రీకృష్ణాభ్యుదయము' అనే కావ్యాన్ని రచించారు. ఇందులో గోపికల తన్మయత్వం ఎలా ఉందో కవి వర్ణన చూడండి.

"సరిగంచు చీరను సవరించు కొనలేమ
మైజారు పయ్యెద మఱచిపోయె
బిగుతు కంచుకమును బిగియించు కొనుభామ
ముడివేసి కొనుమాట విడిచి చనియె
నంగరాగముదిద్దు మంగళాంగి చెలంగి
పరిపూర్తి సేయగా నరయదయ్యె!
భూషణములదాల్పు పొన్నికొమ్మ యెకర్తు
తలక్రిందులుగ వాని దాల్ప దొడగె
గనుల గాటుక దిద్దెడు కనకగాత్రి
సగములో నిల్పి పయనమై సాగిపోయె
గట్టికట్టని చీరతోఁగదలె నొకతె
కుతుకమున రెచ్చియన్య సంగతులు మఱచి"[95]

అంటూ గోపికల యొక్క ముగ్ధమనోహర సౌందర్యం, వారి లాలిత్యం, వారి అల్లరి పనులను చక్కని పదాలతో పొందుపరిచాడు. గోపికలు గోపాలకృష్ణుని చిలిపి చేష్టలను ఇలా వర్ణించాడు.

బిడియమా? కౌగిట బిగియించి, వగద్రుంచి
సొగసించి కరుణింప సుందరాంగ
తలవంపులా? ముద్దులొలికించి వలపించి
లలిముంచి పరికింప లలితగాత్ర!
సరిపోలమా? నిన్ను మరుబంతులాడించి
మురిపించి, మెఱపించ మోహనాంగ!
పనికి రామా? సేవలొనరించి తనయించి
మనసు దీరి సుఖించ మదనమూర్తి!
ఇంత బలవంతమేలనో?కంతుకేళి
యంతుభాతరలాడి మెప్పింతువనుచు
వలచి పిలుచుట చేన? గోపాలబాల!

చాలు జాలింక బిగువులు జక్కనయ్య!"[96]

అంటూ గోపాలకృష్ణుని అల్లరి పనులను ముగ్ధ మనోహరంగా కవి వర్ణించాడు.

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ గారు గొప్ప కవి పండితులు. శ్రీమదాంధ్రాభ్యుదయము, శ్రీకృష్ణ భారతము, శ్రీశైల మహాత్మ్యము లాంటి బృహత్ గ్రంథాలను రచించాడు. శ్రీ మదాంధ్రాభ్యుదయము ఒక మహాకావ్యము. ఇందులో హరిహర రాయలు, బుక్కరాయలు దర్శించిన విద్యారణ్య మహర్షి ఆశ్రమ వర్ణనను రమ్యంగా వర్ణించిన విధానం చూడండి.

"చల్లని నీడల శాంత సౌఖ్యము లీను
లలిత జాతీ పుష్పలతల తోడ
బ్రాబల్కు నెత్తావి, బార్చ్వ భూములఁ జల్ల
బూచిన గేదంగి పూలతోడఁ
బిల్లగాలియలల వేదశిఖలనూపు
తెలిమల్లెపూ యొక్క తెగలతోడ
నాశ్రమపథతతి కందచందముఁగూర్చు
వింతచేమంతి తీవియల తోడ
వివిధ ఫలిత మహిత తరువితతితోడ
ధన్య తుంగభద్రా నదీ తటమునందు
వెలయుచున్న విద్యారణ్య విమల మునిజ
నేశ్వరుని పవిత్రాశ్రమం బెదుటఁదోచె"[97]

అంటూ బుక్కరాయలకు ఆశ్రమ పరిసర దృశ్యాలు కంటపడిన వాటిని చిత్రించాడు.

భూతపురి వారి పాండిత్యము సామాన్యమైనది కాదు. రామస్తుతిని భావించిన ఈ కందపద్యం చూడండి. ఎంత శబ్దాధికార ప్రభావాన్ని ప్రదర్శిస్తుందో చూడండి.

కం॥ "కోద్భవ, కోద్భవ, భవభవ
కోద్భవ, కోద్భవ భవభవ, కోద్భవభవ, సత్
కోద్భవ, కోద్భవనుతది
వ్యాద్భుత పరిపూత చరిత! అబ్దిగభీరా![98]

అంటూ కేవలం రెండు అక్షరాలతో పద్యాన్ని నడిపించిన తీరు అద్భుతమైనది.

కల్లూరు అహోబలరావు భావతరంగము, పూదోట లాంటి ఖండకావ్యాలు, శతకాలు రచించారు.

పూదోట కావ్యంలో రాట్నంపై వీరి పద్యం చూడండి.

"రాటమా! కాదు- పోరాటంబు లుడిగించు
విష్ణుచక్రం బిది పృథివియందు
రాటమా! కాదు- ఆరాటంబు బోకార్పు
కల్పవృక్షంబిద్ది ఖండితముగ
రాటమా! కాదుపో! కాటకంబుల ద్రోలి
కడుపు నిండించెడి కన్నతల్లి
రాటమా! కాదుపో - రమణీయ సుస్వర
సంగీతముల బాడు- శారదాంబ!
కట్టగా మేలిరకముల బట్టలొసగి
పొట్టనింపగఁ బట్టెడు బువ్వవిచ్చి
కడుపు చల్ల కదలనీక కాచిబ్రోచు
రాట్న లక్ష్మిని సేవింప రాదె మనకు?"[99]

అంటూ భారత స్వాతంత్రోద్యమంలో రాట్నం ఎంతటి పోరాట స్ఫూర్తిని నేర్పిందో దాని ప్రాముఖ్యతను కవి వర్ణించాడు.

జోస్యం జనార్ధన శాస్త్రి విద్వత్ కవి. కన్నతల్లి, కన్నీటిచుక్కలు, పసిడిపంట లాంటి కావ్యాలను రచించాడు. కన్నతల్లి కావ్యాన్ని రచించి తన తల్లిగారికే అంకితమిచ్చారు. కడుపు పంటకై తల్లి పడే కష్టాలు, కన్న తరువాత సంతాన పోషణకు పడెడి కడగండ్లు, కొడుకునొక యింటివానిని జేసి కోడటి రాపిళ్ళకు గురిఅగుట, కొడుకును జూచికొని కొండంత సంతోషముతో కాలము వెళ్ళదీస్తున్న తల్లి గాంభీర్యమును మొదలైన వాటి పట్ల శాస్త్రిగారు మిక్కిలి తన్మయత్మముతో స్వానుభవమును వెల్లడించిరి.
బిడ్డలపై మోహము తల్లికెప్పుడు ఒకేరీతిగా ఉంటుందనడానికి శాస్త్రిగారీ పద్యం చూడండి.

"తనయుడ్రెంతటి బిడ్డల తండ్రియైన
దనదు పాలికిఁ బసికూన యనియె దలఁచి
వేళ కన్నము బతిమాలి పిలిచిపెట్టు
కన్నమోహము విడలేక కన్నతల్లి"[100]

అంటూ కొడుకులు ఎంత ఎదిగినా పెద్దవారైన తల్లి దృష్టిలో వారు పసిబాలుల వలె కనపడతారని కవి తెల్పాడు. శాస్త్రి గారు కన్నతల్లితో బాటు ప్రకృతి కన్నతల్లిని కూడా ఆరాధించారు. వారి దృక్పథములో

యిరువురు సమానమే.

"ఎలిమి సంజెకొమ్మలు తెరలెత్తిదింప
లీలcగోయిల కలరాగ మాలపింప
శ్రావ్యముగc జిల్క పదcతి వర్ణములు పల్క
కుల్క పురివిప్పుకొని నెమ్మి గొండ్లి సలుప
హాయి బిడ్డల నొడినిడి యలర జేయు
ఘన వినోద, మోద ప్రకృతి కన్నతల్లి"[101]

అని ప్రకృతిమాత ఒడిలో బిడ్డలు పొందే హాయిని చక్కగా అభివర్ణించాడు.

మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము శ్రీకృష్ణతాండవము, గోపికాలాస్యము అనే కావ్యాలను రచించాడు. శ్రీకృష్ణతాండవము కావ్యంలోని కవి రచనావైశిష్ట్యాన్ని తెలిపే క్రింది గేయాన్ని పరిశీలించండి.

"ఆకారమై త్రిగుణ సాకారమైని
రాకారమై నిలిచి శ్రీకారమై వినని
హుంకారమై కదలి భాంకారమై వెలయ
టంకారమై వెడలి ధంకారమై తెలియ
హుంకారమై కలభ ఘీంకారమై యళుల
ఝుంకారమై కేకి క్రేంకారమై సిరుల
ప్రాకారమై కలికి హ్రీకారమై చెలగు
ణాకారమై లలిత క్లీకారమై వెలుగు
అంకారమై రసాలంకారమై పలికి
శంకారమై నిత్యమోంకారమై కులికి
ఆడెనమ్మా! కృష్ణుడు
పాడెనమ్మా! విష్ణువు"[102]

తేట తెనుగు పదములు కొన్నిచోట్ల సమాసభూయిష్ట సంస్కృతీ పదములు కొన్నిచోట్ల రసానుకూలముగా భావానుగుణముగా వాడబడినవి. శ్రీకృష్ణుని యొక్క అవతార రూపాన్ని అక్షరాల ప్రాకారాల్లో ప్రాసాలంకార మయంగా వర్ణిస్తూ శ్రీకృష్ణుడు ఆడిపాడిన విధానాన్ని అక్షరబద్ధం చేశాడు.

లంకా కృష్ణమూర్తి అనంతపురం జిల్లాలోని పెనుగొండ ప్రాంతానికి చెందినవారు. దానయజ్ఞము, త్యాగశిల్పము, శ్రీవిలాసము లాంటి కావ్యాలను రచించారు. ధనము కొరకు బండచాకిరి చేసెడి పేదలను,

నిశ్శక్తుల కష్టాలను చూడమని కవిగారు శ్రీలక్ష్మికి ఇలా నివేదించుకొంటున్నాడు.

ఎప్పుడో విధిలేక నప్పుసేసిన నద్ది
పెరుగుచుండగఁ దీర్ప వెరవులేక
ఋణదాత కోరినరీతిఁ బత్రంబుల
వ్రాసియిచ్చుచు వాని దాసులగుచు
కొనకు వాడాస్తులెల్లను దోచుకొని పోవ
నాలుబిడ్డల సాక వీలుగాక
కలవర మందు కంకాళ రూపులఁజూడ
మమ్మలక్షల కొద్ది యగపడెదరు
మేని చెమటలూడ్చి పూనికసేవింప
గూలి యివ్వ తిట్టు కొనెడి వారి
యడుగు లాశ్రయించి కడుపుకై మానంబు
వీడి బ్రతుకు వారిఁజూడు తల్లి!"[103]

అంటూ పేద ప్రజలు తీసుకొన్న అప్పు క్రమంగా అది పెరుగుతూ చివరికి ఆ ప్రజల ఆస్తులన్నీ వడ్డీ వ్యాపారస్థుల వశమైతే అలాంటి పేద ప్రజల కుటుంబాలు పూట గడవక పోయిన బ్రతుకులను చూడు తల్లీ అని నివేదించాడు.

కోడూరు ప్రభాకర రెడ్డి వృత్తిరీత్యా వైద్యులు. ప్రవృతి రీత్యా కవిత్వం రాయడం. రాగవిపంచి, పల్నాటి భారతం, ద్రౌపది లాంటి కావ్యాలను రచించాడు. పల్నాటి భారతం 1063 తేటగీతుల పద్యాలున్న జాతిచరిత్రకు నిదర్శనం. భారత, భాగవత కథలు చెప్పిన తండ్రికి పల్నాటి భారతం అంకితమిస్తూ,

"చిన్నతనమున నీయంక సీమలోన
వాటి నద్భుత భారత వీరగాథ
నాటి సంస్కార మెదలోన నాటుకొనగ
వ్రాయగల్గితి 'పల్నాటి భారతమ్ము' "[104]

అంటూ తన కావ్యంలో చెప్పుకున్నాడు. తను నమ్మిన గొల్లబంటు చెవుల గోపన్న యుద్ధంలో తన కోసం ప్రాణాలర్పించినప్పుడు బ్రహ్మనాయుడు ఇలా వాపోతాడు.

"కోడిపందెము నేనేల కోరుకొంటి
పోరు చేయంగ నేనేల పూనుకొంటి

గాజు ముక్కను పొందంగ మోజుపడుచు
జాతి రత్నము నిపుడు జేజార్చు కొంటి"[105]

అంటూ తేటగీతిలో చక్కగా వ్యక్తీకరించాడు. ప్రభాకర రెడ్డి గారిలోని నిరంతర ప్రేమోపాసి అయిన భావకవి 'హృదయరాగం'లో బలమైన ముద్ర వేశాడు.

"కటికి చీకటి రాతిరి కాంతినొసగి
హస్తమందించి నడుపు స్నేహమ్మె ప్రేమ
అడుగకుండనె వరములు వడిగనిచ్చి
అమృత వర్షిణి యనిపించు అమ్మె ప్రేమ"[106] అంటూ వ్యక్తీకరించారు.

వెల్లాల వేంకటేశ్వరాచారి 'తెలుగు తేజము' అనే కృతిలో తెలుగు భాష కనుమరుగవుతున్న పరిస్థితిని తెలుపుతున్నాడు.

"కమ్మని తెల్గుభాష కిలకాలము చెల్లెనొ ఆంగ్ల యోజలో
కమ్మదనాల భాషలలో కమ్మని తెల్గదె మేటి దీటెటన్?
అమ్మల నాన్నలన్ బిలుతు రాంధ్రుల సంతతి మమ్మి డాడిగా
అమ్మలు అయ్యలందరును ఆంధ్రమునే మన మాదరించెదమ్"[107]

అంటూ కమ్మనైన తెలుగుభాషను మాట్లాడకుండా ఆంగ్లం మోజులో పడి తెలుగు కమ్మదనాన్ని ఆస్వాదించ లేకపోతున్న ఆంధ్రుల గురించి తెలుపుతున్నాడు. సీమలో వర్షాలు రాక అల్లాడిపోయే స్థితిని చెబుతున్న దృశ్యం,

"ముసిరినా మేఘాలు మురిపించి కురువ
పసలేని వానల్లు పగలంత కురువ
ఎసరుకే సరిపోని యెందుకీ వాన
కొసమెరుపుతో మాకు కులుకు జూపించి
కసిదీర మమ్మెల్ల కాటేయు కొరకు
పిసరంత వానకూ ఫెళఫెళ ధ్వనుల
సిసలైన మానేది సేలెండి పోగ
కసిరెనా సూరీడు కదలబోకనుచు
కదిలింది కదిలింది కదిలింది పెన్న
కదిలీ కదలగానే కరిగింది పెన్న"[108]

ఆకాశంలో మేఘాలు వర్షం వచ్చేలా ముసురుకొని కాసింత వర్షాన్ని కురిపిస్తే అది ఎసరుకు కూడా సరిపోలేదని కొద్దిపాటి వర్షానికే పెళపెళ మంటూ శబ్దాలు వచ్చి వర్షం కురిసిన కొద్దిసేపటికే పెన్నానదిలో నీరు పారి అంతలోనే ఆ నీరు ఇంకిపోయిందని వాస్తవదృశ్యాన్ని అక్షరబద్ధం చేశాడు.

ఎర్రగాలి జైరాంగా ప్రసిద్ధి చెందిన జెట్టిజైరాం 'ఎర్రగాలి' కవితా సంపుటిని వెలువరించారు. 'మేలుకోరా' గేయంలో రైతుల కష్టాన్ని తెలుపుతున్నాడు.

"మడకల్తో ఎర్నేల్ల, రేగళ్లదున్నీ
గొర్రుతో ఇత్తనాలేస్తివీ
పంటదెచ్చీ నీవు కల్లాలు జేస్తివి
నెత్తురోడ్చిన నీ కష్టఫలితము దీసి
భూస్వామ్లు కిస్తివి
కూలిగింజలె నీకు శరణాయె కడపటికి
కూటీకి లేక నీ పిల్లా జల్లా ఎడ్సె
ఏమి న్యాయం ఏమి సత్యం
ఏది ధర్మం బేదిరా?"[109]

అంటూ రైతులు కష్టపడి పంటలు పండితే ఆ కష్ట ఫలాన్ని భూస్వాములు అనుభవిస్తున్నారని రైతులకు మాత్రం కూటికి లేమితనాన్ని తెలియజేశాడు.

కీర్తి నాగరాజు 'గుండెసెగలు' అనే వచన రచనను వెలువరించారు. ఎన్నికలు వచ్చినపుడు రాజకీయ నాయకుల హడావుడిని తెలుపుతున్నాడు.

"ఓయీ! మన బాబులారా!
లేవండి! ఎలక్షన్లు వచ్చాయి!
సిద్ధం కండి!
మనం బయలు నాటకం
ప్రారంబించాలి ఇక లేవండి!
మన ఆశల పథకాల స్క్రిప్టు
దుమ్ము దులపండి
మన వాగ్దానాల డైలాగులు
రికార్డులు మోగించండి

మన ప్రచారం పాటల క్యాసెట్లు

'గీ' మని పించండి!

మన ఖద్దరు యూనిఫారం

ధరించండి

గడప గడపకు మనిషి మనిషిని

నమస్కరించి పలుకరించే

మన సాంప్రదాయ కార్యక్రమాన్ని

మొదలెట్టండి"[110]

అంటూ ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యే విధానాన్ని, నాయకులు ఇచ్చే వాగ్దానాలు వారి కపట వేషాలను తెల్పాడు.

ఎ.ఎన్.నాగేశ్వరరావు 'సముద్రం నా స్వప్నం' అనే కవితా సంపుటిని ప్రచురించాడు. 'రెండు ప్రపంచాలు' కవితలో ఈ సమాజంలోని అవినీతిని, దోపిడీని ప్రశ్నిస్తున్నాడు.

"ఎంత విచిత్రమైంది ప్రపంచం

అపార సంపదతో సతమతమౌతూ

యింకా కావాలని అర్రులు చాస్తారు

పట్నాల చివర జీర్ణ బ్రతుకుల వాళ్లు

ఆకలితో తోడేళ్ల లాగా తిరుగాడుతున్నారు

ధాన్యంతో గిడ్డంగులన్నీ నిండుగా వున్నాయి

వాటి తలుపులు తాళం వేశారు

యంత్రాలు పట్టు పీతాంబరాలను

నేలనించి నింగి వరకు పరిచాయి

జనమంతా దిగంబరంగా

వుత్తికాళ్ళతో చరిస్తున్నారు

ఎంత విచిత్రమైందీ ప్రపంచం

చేపలు తేనీరు, బొచ్చుకుక్కలు వేడిమాంసం...

పసిబిడ్డలకు పాలుకరువు

వాళ్ళు మాటలతో కడుపు నింపుతారు

పందులకు మాత్రం ఆలుగడ్డలు...

ఎంత విచిత్రమైందీ ప్రపంచం"[111]

అంటూ ఈ ప్రపంచంలో జరిగే వాస్తవ దృశ్యాలను తెలియపర్చారు. 'విముక్తి' అనే కవితలో అగ్రరాజ్యాల సామ్రాజ్యవాద స్వభావాన్ని ఎండగడుతున్నాడు.

"సీజనల్ స్లోగన్లకీ
ఓట్లముందరి బ్లాక్‌మనీకీ
పదవుల ముందు పడకలకీ
వాగ్దానాలకీ వాయింపులకీ
విధ్వంసకారీ విదేశాలకీ
విద్వేషకారీ ఆయుధాలకీ
వలసవాద దోపిడీకీ
దళారీల తార్పుడికీ సామ్రాజ్యవాద ముఠాలకీ
ఈ దేశం మోసపోయిందనీ, మోసపోతోందనీ
ముప్పై రెండేళ్ళ గతం సాక్ష్యం
నగరం నలుమూలల్లో మంటలంటుకుంటుంటే
నేషనల్ నీరోలెంత కాలం ఫిడేలు వాయిస్తారు?
ఎంతకాలం యుద్ధోన్మాదంలో
ఆయుధ ప్రాకారంలో విషపునవ్వులు రువ్వుతారు?
దోపిడి చావందే విముక్తి లేదు
చుక్కలు తెగందే సూర్యోదయం కాదు
చీకటి చస్తేనే వెలుగుబతికేది"[112]

అంటూ వివిధ దేశాలు చేస్తున్న దోపిడీలు, యుద్ధాలు, దాడులు గూర్చి చాలా స్పష్టంగా తెలియజేస్తున్నారు. 'రాళ్ళు రాపాడితే' కవితలో సీమకు జరిగిన అన్యాయాన్ని తెలుపుతూ చరిత్రను వెలికితీస్తున్నాడు.

"రతనాలు రాజ్యమేలిన నాడు
యిక్కడ నీటికి కరువుండెనా
చరిత్ర తవ్వనుగాక తవ్వను
తవ్వీ ఏం ప్రయోజనం

యిక్కడ నేల తవ్వితే బొమికెలు

యీనేలలో జీర్ణంకాని బొమికెలు

ఆ బొమికెలు ఆర్తనాదాలుగా

యీ గడ్డదాటి గాలిలో ప్రయాణించి

ఏళ్లకేళ్ల విన్నపాలు వినిపించినాయి

నేడవి రక్తస్రావాలు

యిక్కడి రాళ్లు కథలు చెబుతాయి

జీవచ్ఛవాలుగా మారిన రాళ్లు

నిశీథీ కథలు పైశాచీ సంజ్ఞలో

శిలాయుగపు స్వర్ణయుగాన్ని కీర్తిస్తాయి"[113]

అంటూ రతనాల వంటి సీమ చరిత్రను తవ్వను గాక తవ్వను అని ఆ చరిత్రను తవ్వితే ఎన్నో ఏళ్ళ నుంచి దీన గాథలు వినిపించాయని ఇక్కడి రాళ్ళు స్వర్ణయుగాన్ని కీర్తిస్తాయని కవి తన స్పష్టమైన వైఖరిని సీమచరిత్ర మీద తెలియపర్చాడు. ఇదే కవితలో సీమ ప్రజానికాన్ని గూర్చి ఇలా అంటాడు.

"జనం

అవును రాళ్లలాంటి

రాయలసీమ రత్నాలు

నిద్రాణమై పురాగొరిల్లాలయిన వాళ్ళు

జీవితమే సమస్యగా మారినవాళ్ళు

అడవుల్లో ఆటవికులుగా బ్రతికిన వాళ్ళు

జీర్ణవస్త్రాల మలిన దేహాల వాళ్ళు

జీవితాన్ని పంచరంగుల కలలుగా భావిస్తోన్న

అధోజగత్సహొదరులు

వళ్ళు కళ్ళు తగులబడ్డ సున్నితమైన చేతులు

నిన్నుమోసి కన్న యీ దేశపు తల్లులు

చైతన్యాన్ని రక్తంగా పారిస్తున్న వాళ్ళు

రక్తాన్ని పాటలుగా కట్టి నరాల సంగీతాన్ని

కనుగుడ్ల ఎరుపుతో ప్రసరిస్తున్న వాళ్ళు

అంతెందుకు యీ సీమకళ్ళు కాళ్ళు

గుండెలు అణువణువూ అయిన

'పూర్ క్రీచర్సే'...చరిత్రను సృష్టిస్తారు"[114]

అంటూ సీమ ప్రజలు చరిత్రను తిరగరాస్తారని ఒక చైతన్యాన్ని మనకు అందిస్తున్నాడు. ఇదే కవితలో సీమ అస్తిత్వ నేపథ్యంలోంచి మాట్లాడుతూ రాజకీయ వర్గ వ్యవస్థను కూలదోస్తామని చైతన్యవంతమైన కవిత్వాన్ని అందించాడు.

"వీధులు ఎత్తిన పిడికిళ్లతో పైకి లేస్తున్నా

సీమంతా గుసగుసలతో జ్వలిస్తున్నా

నీకది స్తబ్ధతగానే వుంటుంది

నీటిలోని చేపనీ

చాపకింది నీటినీ నీ కళ్ళు చూడలేవు

ఎండిపోయిన చెరువులోని చవిటి పర్రల్లో

విరిగిపోయిన ఫ్యాక్టరీ పునాదిరాయిలో

నెర్రెలు చీలిన పొలం అనబడే రైతు సమాధుల్లో

ఆకుల్లేని చెట్లకింద జీవితాన్ని పోరాడుతున్న

డేగకళ్ల పెదవుల బిగింపుల్లో

ఎన్నెన్ని ప్రపంచయుద్ధాల మరఫిరంగి మ్రోతలు

ఎన్నెన్ని జవసత్వాల ఝంఝా మారుతాలు

కోరస్ కట్టిన అడవి కార్చిచ్చు

గుడిసెల్లో రెపరెపలాడుతూ

వూపిరి పీలుస్తున్న నెత్తుటి కేతనాలు

వీధుల్లో తలలెత్తి నిలబడ్డ నాగళ్లు కొడవళ్లు

ఏ హస్తాలతో ఓట్లు నిన్ను పైకెత్తి నాయో

అవే హస్తాలతో

నీ వర్గ వ్యవస్థని నేలమట్టం చేస్తాయి

అపుడు సముద్రం రాళ్లముందుంటుంది

నదులు గొంతు తడార్చుతాయి

పొలాలు కడుపు నిండుగా నీళ్ళు తాగుతాయి

నాగడ్డ అపుడాకాశం వైపు ఆధారపడదు

తన నరాల సత్తువపై బతుకుతుంది"[115]

అంటూ సీమ ప్రజలంతా సంఘటిత శక్తులై చైతన్యవంతులై ఈ దోపిడీ, నిర్లక్ష్య వర్గాలను అంతుచూసి, సీమను తలెత్తుకునేలా చేస్తారని ఆశాభావాన్ని కవి ప్రకటిస్తున్నాడు.

రాయలసీమ ప్రాంతంలో ఆధునిక కవిత్వం ఎలా పరిణామం చెందిందో తెలపడానికి ఇప్పటివరకు పేర్కొన్న కవుల కవిత్వం దాదాపుగా ప్రముఖమైనది. కట్టమంచి రామలింగారెడ్డి గారి 'ముసలమ్మ మరణం' కావ్యం ద్వారా నవ్య కవితా రీతులు ప్రసరించిన తర్వాత రాయలసీమ ఆధునిక కవిత్వానికి ఒక కవితా మార్గం ఏర్పడింది. కట్టమంచి వారి సంప్రదాయ బాటను సీమ కవులు అందుకోలేక పోయారనే వాదన వున్నప్పటికీ పెనుగొండ కొండ పాటతో ప్రాంతీయ స్పృహ ప్రారంభమైందని విమర్శకులు గుర్తించారు. ఆ తర్వాత సీమ కవులు సంప్రదాయ పద్యకవిత్వం, అవధాన పద్య కవిత్వం, చారిత్రక గేయ కావ్యాలు, కావ్య ఖండికలు, శతకాలు మొదలగు వాటిని వెలువరించారు. 20వ శతాబ్దం ఆఖరి పాదం అంటే 1970 తర్వాత రాయలసీమలో ప్రాంతీయ జీవిత సమస్యలను అందరికి అర్థమయ్యే వచన కవిత, వచన పద్యం ప్రక్రియలలో కవిత్వాన్ని అభివ్యక్తీకరించడం ప్రారంభమైంది. రాయలసీమలో సంభవించే కరువును ఆధారంగా చేసుకొని చాలా మంది కవులు కావ్యాలు రాసారు. అలాగే రైతుల సమస్యలు, దళితులు, స్త్రీ సమస్యలు, జాతీయతతో కూడిన చారిత్రకాంశాలు, నీటి సమస్యలు, కులమత సమస్యలు మొదలగు అంశాలతో పాటు రాయలసీమ ప్రాంతంలో కనిపించే అనేక స్థానిక అంశాలను కవితా వస్తువులుగా స్వీకరించి కవిత్వాన్ని రాశారు. 1980 దశకం ప్రారంభంలో రాయలసీమలో చైతన్య ఉ ధ్యమాలు ప్రారంభ మైనాయి. ఇక్కడ ప్రజలు, ప్రజా సంఘాలు కరువుకు సంబంధించిన ఉధ్యమాలు నిర్వహించారు. సభలు, సమావేశాలు జరిగాయి. దీని కోసం పత్రికలు పుట్టుకొచ్చి ప్రచారం చేయసాగాయి. దీని తర్వాత కొత్తతరం యువకవులు వచ్చారు. ఈ నేపథ్యంలోంచి కొంతమందైనా కవులు, రచయితలు ఉద్యమాలలో పాల్గొని భాగస్వాములైనారు. ఈ ప్రాంతంలో కథ, నవల మాత్రమే కాకుండా కవిత్వం కూడా రాయలసీమ ప్రాంతీయ జీవిత చైతన్యంతో వికసించటం ప్రారంభమైంది.

## పాదసూచికలు - రెండవ అధ్యాయం

1. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, రాయలసీమలో ఆధునిక సాహిత్యం, పుట-52
2. ముసలమ్మ మరణం, పుట-10
3. ముసలమ్మ మరణం, పుట-08
4. ముసలమ్మ మరణం, పుట-07
5. ముసలమ్మ మరణం, పుట-09
6. ముసలమ్మ మరణం, పుట-23
7. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, రాయలసీమలో ఆధునిక సాహిత్యం, పుట-54
8. ఓబుల్‌రెడ్డి.తవ్వా, రాయలసీమ వైభవం, పుట-19
9. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు -సందర్భాలు, పుట-84
10. నారాయణాచార్యులు.పుట్టపర్తి, పద్యకావ్య సర్వస్వం, పుట-29,30
11. వెంకట సుబ్బయ్య.వల్లంపాటి, రాయలసీమలో ఆధునిక సాహిత్యం, పుట-57
12. నారాయణాచార్యులు.పుట్టపర్తి, పద్యకావ్య సర్వస్వం, పుట-270
13. నారాయణాచార్యులు.పుట్టపర్తి, పద్యకావ్య సర్వస్వం, పుట-279
14. నారాయణాచార్యులు.పుట్టపర్తి, పద్యకావ్య సర్వస్వం, పుట-276
15. నారాయణాచార్యులు.పుట్టపర్తి, పద్యకావ్య సర్వస్వం, పుట-275
16. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-255
17. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-21
18. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-22
19. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-22
20. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-23
21. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-23
22. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-306,307
23. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-26
24. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-26,27
25. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-27,28
26. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట-29
27. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, రాయలసీమలో ఆధునిక సాహిత్యం, పుట-65
28. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-203
29. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట-02
30. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట-02
31. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట-02

32. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట-04
33. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట-05
34. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట-06
35. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, రాయలసీమలో ఆధునిక సాహిత్యం, పుట-72,73
36. వెంకట సుబ్బయ్య. వల్లంపాటి, రాయలసీమలో ఆధునిక సాహిత్యం, పుట-73,74
37. హరినాథ రెడ్డి. అప్పిరెడ్డి, శ్రీసాధన పత్రిక, పుట-52
38. హరినాథ రెడ్డి. అప్పిరెడ్డి, శ్రీసాధన పత్రిక, పుట-54
39. హరినాథ రెడ్డి. అప్పిరెడ్డి, శ్రీసాధన పత్రిక, పుట-69
40. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-190
41. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-191
42. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-213
43. తెలుగు వాచకం, పదవతరగతి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పుట-04
44. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-264
45. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-390
46. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-459
47. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-592
48. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-616
49. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-655
50. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-717
51. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట- 45,46
52. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట-44
53. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట-59
54. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట-77
55. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట-95
56. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట-143
57. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట-157,158
58. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట-158
59. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట-162

60. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట–181

61. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట–189

62. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట–190

63. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట–221

64. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట–230

65. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట–231

66. రాజు. కె.ఎన్.ఎస్, కర్నూలు జిల్లా రచయితల చరిత్ర, పుట–246

67. కీర్తి నాగరాజు, గుండె సెగలు, పుట–16

68. జైరాం, ఎర్రగాలి, పుట–10

69. జైరాం, ఎర్రగాలి, పుట–58

70. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట–57

71. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట–58

72. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట–59

73. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట–09

74. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట–27

75. విద్వాన్ విశ్వం, పెన్నేటిపాట, పుట–34

76. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు –సందర్భాలు, పుట–85

77. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు –సందర్భాలు, పుట–85,86

78. శశిశ్రీ, రాయలసీమ సాహిత్యం, పుట–63

79. గంగాధరం.నూతలపాటి, చీకటినుంచి, పుట–18

80. గంగాధరం.నూతలపాటి, చీకటినుంచి, పుట–48,49

81. గంగాధరం.నూతలపాటి, చీకటినుంచి, పుట–93,94

82. గంగాధరం.నూతలపాటి, చీకటినుంచి, పుట–94,95

83. గంగాధరం.నూతలపాటి, చీకటినుంచి, పుట–53

84. ఆర్కెస్ట్రా, పుట–10

85. ఆర్కెస్ట్రా, పుట–11

86. ఆర్కెస్ట్రా, పుట–12,13

87. ఆర్కెస్ట్రా, పుట–18

88.ఆర్క్రెస్ట్రా, పుట-31

89.ఆర్క్రెస్ట్రా, పుట-62

90. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-264

91. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-265

92. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-266

93. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-306

94. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-624

95. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-346

96. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-347

97. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-351

98. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-361

99. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-470

100. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-553

101. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-553,554

102. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-575

103. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-580

104. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-683

105. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-682

106. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-682

107. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-695

108. రామచంద్ర.ఎన్, సీమసంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట-695

109. జైరాం, ఎర్రగాలి(కవిత్వం),పుట-55,56

110. కీర్తినాగరాజు, గుండెసెగలు, పుట-01

111. నాగేశ్వర రావు, సముద్రం నాస్వప్నం, పుట-24

112. నాగేశ్వర రావు, సముద్రం నాస్వప్నం, పుట-39,40

113. నాగేశ్వర రావు, సముద్రం నాస్వప్నం, పుట-67

114. నాగేశ్వర రావు, సముద్రం నాస్వప్నం, పుట-70,71

115. నాగేశ్వర రావు, సముద్రం నాస్వప్నం, పుట-71,72

# మూడవ అధ్యాయం

# రాయలసీమ ఆధునిక కవిత్వం – వస్తు వైవిధ్యం (1986-2015)

# మూడవ అధ్యాయం

# 3. రాయలసీమ ఆధునిక కవిత్వం - వస్తు వైవిధ్యం(1986-2015)

సాహిత్యాన్ని అధ్యయనం చేయడమంటే సమాజాన్ని నిశితంగా పరిశీలించడమే. సమాజంలో నెలకొన్న విభిన్నమైన విషయాల్ని, సంఘటనల్ని సాహిత్యం ప్రతిబింబింప జేస్తుంది. సమాజంలో జరిగే ఏ సంఘటనకైనా సాహిత్యకారులు ప్రతిస్పందించి సాహిత్యాన్ని సృష్టిస్తారు. సమాజంలో సంభవించే ఏ మార్పు అయినా సాహిత్యంలో వచ్చే ఏ వాదమైనా ధోరణి అయినా ముందుగా కవిత్వంలో ప్రతిఫలిస్తుంది. తెలుగు సాహిత్యంలో ఆధునిక కవిత్వానికి విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. సాహిత్యంలో మిగతా ప్రక్రియల కన్నా కవిత్వం శక్తివంతమైన పాత్రను పోషిస్తుంది.

## 3.0 సాహిత్యం - సమాజం:

సాహిత్యం సామాజిక జీవితానికి ప్రతినిధి వంటిది. సమాజానికి సాహిత్యానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. ఒక కాలంలో ఉండే సామాజిక వ్యవస్థను ఆ కాలంలో వచ్చే సాహిత్యం ప్రతిబింబిస్తుంది. సమాజంలో మార్పులు వచ్చినప్పుడల్లా సాహిత్యంలోనూ మార్పులు వస్తాయి. సామాజిక జీవితంలోని నిరంతర మానవ సంబంధాలు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయి. కవులు, రచయితలు తాము నివసిస్తున్న సామాజిక వాతావరణంలో తమ చుట్టూ జరుగుతున్న సంఘటనల పట్ల, సామాజిక అంశాలు, విషయాల పట్ల సామాజిక స్పృహను, భాద్యతను కలిగి ఉంటూ తమ రచనల్ని సమాజానికి అందిస్తారు. ఈ రచనలు సమాజాన్ని మేల్కొల్పడమే కాకుండా సమాజాన్ని చైతన్యపరుస్తాయి."ఇతర విషయాల్లాగానే సాహిత్యం కూడా సామాజిక అవసరాల నుంచే పుట్టింది. భాషలాగ, భాషకు ఉన్నత రూపమైన సాహిత్యం కూడా శ్రమ నుంచీ శ్రమలోనే, శ్రమతో పాటే పుట్టి పెరిగింది. ప్రకృతితో, సమాజంతో ఆవేశంతో కూడిన సంబంధాల ఫలితమే సాహిత్యం."[1] సమాజం ఎప్పుడూ నిత్యం పరిణామ శీలంగా ఉంటుంది. సామాజి కాంశాలు, ప్రకృతి పరిణామాలు కూడా నిరంతరం మార్పుకు లోనవుతూ సాహిత్యాన్ని ప్రభావితం చేస్తాయి.

## 3.1 వస్తువు - వివరణ:

ప్రకృతిలో ఏ సంఘటన జరిగినా మనిషి ఏ పని చేస్తున్నా అందులో రెండు అంశా లుంటాయి. అవి. 1. ప్రకృతిలో ఏమి జరగుతున్నది. 2. ఎలా జరుగుతున్నది. 1. మనిషి ఏమి చేస్తున్నాడు? 2. దానిని ఎలా చేస్తున్నాడు. వీటిలో మొదటి అంశం వస్తువు. రెండవ అంశం రూపం. ఒక రచనలో రచయిత ఏమి చెబుతున్నాడన్నది వస్తువు. 'వస్తువు'ని ఆంగ్లంలో ' Content ' అంటారు. "ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా, నియమబద్ధంగా ఉన్న మూలకాల క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషి,

మానవ సంబంధాలు, సామాజిక జీవితం, దానిలోని సమస్త వైరుధ్యాలు వీటన్నింటి యొక్క కళాత్మక ప్రతిఫలనం సాహిత్యంలో వస్తువు అవుతుంది."[2]

"సాహిత్యంలో వ్యక్తమయ్యే ప్రధాన భావాన్ని వస్తువనవచ్చు. రచయిత సాహిత్యంలో వివరించిన ఆశయాన్ని వస్తువుగా చెప్పవచ్చు."[3] వస్తువులో భావం(Idea), ఇతివృత్తం(Theme), మదింపు (Evaluation) అనే మూడు ప్రధానాంశాలుంటాయి. రచయితకు ఈ మూడు అంశాలు సమాజం నుంచే లభిస్తాయి. "కవి తాను చూచిన లేక వినిన విషయాన్ని కళాత్మంగా తీర్చిదిద్దితే అది వస్తువు అవుతున్నది. ఈ వస్తువునకు తొలిరూపం విషయం(Subject). వస్తువు యొక్క ముఖ్య ప్రయోజనం కవి సందేశాన్ని పాఠకునికి అందించడమే."[4] రచయిత తన ప్రాపంచిక దృక్పథం ద్వారా సమాజాన్ని దర్శించి కళాత్మకంగా విశ్లేషించి సమాజాన్ని చైతన్యవంతం చేస్తాడు. వస్తువును ఆశ్రయించి రూపం, శిల్పం అభివ్యక్తమవుతూ ఉంటాయి.

## 3.2 రాయలసీమ కవిత్వం - వస్తువు:

రాయలసీమలో 1986వ సంవత్సరం నుండి ఆధునిక వచన కవిత్వం విస్తృతంగా వెలువడింది. 1980వ దశకం నుండి రాయలసీమ ప్రాంతంలో స్థానికంగా వచ్చిన రైతు చైతన్య ఉద్యమాలు, పాదయాత్రలు, వివిధ సంఘాల సభలు, సమావేశాల వల్ల రాయలసీమలోని కవులు, రచయితలు ఉత్తేజితులయ్యారు. రాయలసీమలో సంభవించే కరువుపై యుద్ధం ప్రకటించారు. వచన కవిత్వం రాయడంలో సీమ వ్యాప్తంగా కొత్త కొత్త స్వరాలు రంగ ప్రవేశం చేశాయి.

రాయలసీమ కవిత్వాన్ని(1986-2015) వస్తువు పరంగా విభజన చేసి విశ్లేషించడం అవసరం. రాయలసీమలోని విభిన్నమైన అంశాలను ప్రస్తావించాల్సిన ఆవశ్యకత ఉంది. రాయలసీమ కవులు కవిత్వం రాసినా, కథ, నవల, నాటకం రాసినా ప్రధానంగా కరువు, ఆ కరువు ప్రభావం వల్ల పరిణమించే ఇతర అంశాల సమస్యలను ప్రస్తావిస్తారు. సమకాలీన సమాజంలోని ప్రతి అంశాన్ని వస్తువుగా స్వీకరించి కవిత్వాన్ని రాశారు. ఈ ప్రాంత సమస్యల మీద కవిత్వం రాస్తూ అక్షర యుద్ధం చేస్తున్నారు. రాయలసీమ రైతులు, వ్యవసాయం, కరువు, ఆత్మహత్యలు, ఆకలి, పేదరికం, ప్రజల వలసలు, ఎండిపోయిన పొలాలు, చెరువులు, ఫ్యాక్షన్ హత్యలు, ముఠా వర్గాల దోపిడీలు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ సేవల వైఫల్యాలు, వృత్తికులాల అవస్థలు, ప్రపంచీకరణ ప్రభావం, దళిత, స్త్రీ సమస్యలు, నీటి సమస్యలు లాంటి ఎన్నో అంశాలు ఈ ప్రాంతంలో కనబడతాయి.

### 3.2.1 రైతులు:

వ్యవసాయం చేసి ఆహారాన్ని, ముడిసరుకును పండించే వ్యక్తిని రైతు అంటారు. మనిషి

జీవించడానికి గాలి, నీరు, ఆహారం అవసరం. ఇందులో మొదటి రెండింటిని ప్రకృతి ప్రసాదిస్తుంది. ఆహారం ప్రకృతిని ఉపయోగించుకొని మానవుడు స్వయంగా తయారు చేసుకొంటున్నాడు. అలాంటి ఆహారాన్ని ప్రసాదించేవాడు రైతు. రైతు పడే శ్రమ ఈ సమాజానికి తిండి పెడుతుంది. అందుకే ఒక కవి రాజ్యాన్ని పాలించే 'రాజు చేతిలో దండించే గుణం ఉంటే రైతు చేతిలో పండించే గుణం' ఉంది అని కీర్తించాడు. కాబట్టి రైతు భగవంతుడి స్వరూపంగా భావంచవచ్చు.

వ్యవసాయం చేయడంలో రైతు కీలకమైనవాడు. రాయలసీమలో అధిక భాగం రైతులు వ్యవసాయాన్ని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. నేటి సమాజంలో రైతుల సమస్యలు, వారి జీవనగాథలు వ్యథలు చెప్పలేనివిగా వున్నాయి. సమాజానికి అన్నం పెట్టే రైతు నేడు కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చాడు. పులికంటి కృష్ణారెడ్డి 'మట్టిని ముద్దాడుతూ' అనే కవితలో రైతు గొప్పదనాన్ని ప్రకటించాడు.

" ఆ మట్టిలో కలగలిసిన ప్రాణశక్తిని గింజగా మార్చి
లోకానికి ప్రాణబిక్ష పెట్టే పరమాత్మ వాడు
వాడు జీవధాతువు
పేగుకు తడికి మధ్య సేతువు
చరాచర ప్రపంచ చలనానికి హేతువు
గంపల కింద కోళ్ళ శంఖారావాలతో
ఆవులింత రాగాన్ని రంగరించి
కంటిమీద వాలుతున్న నిద్ర తెరలను ఛేదించి
సమస్యల గంప నెత్తి కెత్తు కుంటాడు
కృషి క్షేత్రంలో సమస్యల పద్మవ్యూహంలో
అభిమన్యుడే వాడు!
ఆ తపనలో మౌనమే వాడిభాష
మట్టిలో ఆయువుపట్టును పట్టుకోవడమే
గింజలో చలనాన్ని పదిమందికి పంచడమే
వాడి నిరంతర ఘోష!"[5]

రైతు యొక్క ఉనికిని తెల్పుతున్న గొప్ప కవిత ఇది. రైతు లేచినప్పటి నుండి సేద్యం చేయడమే తన శ్వాసగా జీవిస్తాడు. సమాజానికి అన్నం పెట్టే పరమాత్మవాడు. సేద్యంలో ఎన్ని సమస్యలు, అడ్డంకులు ఎదురైనా వాటిని ఎదుర్కొని పనిచేస్తాడు. రైతు గొప్పతనాన్ని చాటుతూ ప్రతీక భావాలతో పోల్చుతూ కళాత్మకంగా

చిత్రించిన కవిత ఇది.

కడప వీరాంజనేయులు 'నేను రాయలసీమ రైతును' అనే కవితలో నిలువెత్తు రైతు కష్టాన్ని రైతు మాటల్లోనే వ్యక్తం చేస్తున్నాడు.

" కరువుకు ఎండిన భూమిని
వరదకు మునిగిన పంటను
నేను రాయలసీమ రైతును
ఎముకలకు చర్మాన్ని తొడుక్కొని
నాగలి భుజానికెత్తుకొని
భూమిపై నాగటి చాళులు దిద్దాను
ఆశల విత్తులు చల్లాను
మొదటి తడి చెమటతో
రెండవది కన్నీళ్ళతో
మూడవది రక్తంతో
నాల్గవ తడికి నాలో ఏమీ మిగల్లేదు
నా కష్టం చూసి ఆకాశం ఏడ్చిందనుకున్నా
తన కన్నీళ్ళతో నా ఆకలి పూడుస్తుందనుకున్నా
తెల్లారాక తెలిసింది వరదతో పూడ్చింది నన్నని"[6]

నేను రాయలసీమ రైతును అని సగర్వంగా చాటి చెప్పిన కవిత ఇది. రైతు యొక్క అస్థిత్వాన్ని, అతని సేద్యాన్ని, అతని ఆశయాన్ని అలాగే అతను పడ్డ కష్టాలన్ని అడియాశలుగా మారిన వైనాన్ని కవి తెల్పాడు.

టి.రాజారాం 'అతడే' అనే దీర్ఘకావ్యంలో రైతును ఒక కళాకారుడిగా భావించి అతని సేద్యపు కళాసృష్టిని భావచిత్రాలతో బంధిస్తూ ఇలా అంటాడు.

" నేల కాన్వాసుపై నాగలి కుంచెతో
పచ్చని పంటచేల అద్భుత చిత్రాన్ని
గీసే చిత్రకారుడతడు
మట్టిని మాణిక్యపు బంగారుగా
మలచగలిగే ఆల్కెమి తెలిసిన
స్వర్ణకారుడతడు

కోండ్రతో కోటి అనుబంధాల

బంధాల్ని త్రుంచుకోలేని అతడు

.................................

ఇప్పుడిక్కడ నాగలి పట్టే రైతే లేదు

ఈ నేల నిఘంటవులో ఆ పదం తప్పు"[7]

రైతు సేద్యంలో చేసే పనితనాన్ని, అతని ప్రతిభా పాటవాలను గూర్చి చెబుతూ అతనికి అతనే సాటి అని ఈ కవిత ద్వారా తెలుసుకోవచ్చు. సేద్యం చేసే రైతులు తక్కువ అవుతున్నారని చివరికి రైతు అనే పదాన్ని నిఘంటువులలో వెదుక్కోవాల్సిన పరిస్థితి వచ్చే ప్రమాదముందని కవి తెలియజేశాడు.

వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ 'మట్టిమీద మమకారం' కవితలో రైతు సేద్యంలో ఎదురయ్యే విపత్కర పరిస్థితులను ధీటుగా ఎదుర్కొని అతని గుండె నిబ్బరాన్ని ఇలా ప్రకటిస్తాడు.

"రైతా– నా ప్రాణమా

నడిచే చెమటనదీ

కేవలం మనుషులే అనుకున్నా

చివరికి

ప్రకృతివైపరిత్యాలు కూడా

నిన్ను దగా చేస్తున్నాయి

వాడి కింకా మట్టి మీద మమకారం చావలేదు

వర్తమానమంతా చావు దరువుగా మారినా

ఒక బీడీ తుంట దమ్ముతో

చలిని ఎదిరిస్తాడు

కండనూ గుండెనూ పిండి

ఎండన ఆరేస్తాడు

ఒకే ఒక చిరునవ్వుతో రాలే కన్నీటి బొట్టును

ఆపేస్తాడు

కష్టాల్లో ఊడ తడిసిన వాడికి

కడగండ్ల వానేం చేస్తుంది?"[8]

రైతుకు సేద్యం మీద, పొలం మీద చాలా మమకారం వుంటుంది. పంట పండించడమే లక్ష్యంగా అదే ధ్యాసగా బ్రతుకుతాడు. ఈ పొలం పనులలో ఎన్ని కష్టాలు ఎదురైనా వాటికి లొంగిపోడు. ధైర్యంగా పనిచేస్తూ ముందుకు సాగుతాడు.

శాంతినారాయణ 'దప్పిక చూపు' కవితలో రైతును మహాశిల్పిగానూ, దయాహృదయం గల మహాత్మునిగా భావిస్తూ అతని గొప్పదనాన్ని ఇలా కీర్తిస్తున్నాడు.

" నువ్వు సృష్టిలో ప్రతిసృష్టి చేసే మహాశిల్పివి
నీ స్వేద పరిమళమే
ఈ ప్రపంచ నాగరికతా సౌరభం
మట్టి మీద నువ్వు-చల్లిన మమకారం
విశ్వమంతటా రాగమయంగా మొలకెత్తుతుంది
మట్టి నీకు తల్లి, మట్టి నీకు చెల్లి
మట్టి నీకు భార్య, మట్టి నీకు బిడ్డ
మట్టి శరీరాన్నే కాదు
మట్టి హృదయాన్ని కూడా
చైతన్య పులకితను చేయగలిగిన మహాత్మునివి నువ్వు
నీ మెలుకువతో ప్రతి వేకువా చైతన్యమవుతుంది
నీ కదలికతో శ్రమ శక్తి పొద్దు పొడుపు పై విచుకుంటుంది
కోంద్రకు బయలు దేరిన నీ కాడెద్దుల మెడగంటల గణగణలు
నిద్రమత్తులో వున్న మానవాళికి సుప్రభాతం పలుకుతాయి
నువ్వు భుజానికి కెత్తుకున్న నాగలికర్రు
వేగుచుక్కను తోడురమ్మని పిలుస్తుంది
పొలంలో నువ్వు దున్నిన నాగటి చాళ్ళు
ప్రపంచ ప్రగతి సౌధానికి పునాదిరాళ్ళు
నువ్వు వేసిన కోంద్ర - భూ వలయానికి రక్షణ చక్రం
పొలం మీద నీ నడకలు- నేల తల్లి వొడిలో చంటిపాప కదలికలు
నీ కాడెద్దుల కంటి ప్రమిదల్లో నీ చేతి చలువ
కృతజ్ఞతా దీపమై వెలుగును సుమిస్తూ వుంటుంది."[9]

సమాజంలో రైతు విలువను, అతని నైపుణ్యాన్ని ప్రశంసిస్తున్న కవిత ఇది. సమాజ నిర్మాణంలో రైతు ఎంతటి ప్రాధాన్యత వహిస్తాడో పై కవితలో తెలుపబడింది. రైతు నిద్ర లేచి నాగలి భుజాన వేసుకొని కాడెద్దులను తోలుకొని పొలం పనులకు వెళ్ళి దున్నడం వంటి అంశాలను కవి భావుకతతో వర్ణించాడు.

మునిసుందరం 'ఓటరు' కవితలో అన్నదాతగా పిలువబడ్డ రైతుగానూ, రైతే రాజుగా కీర్తిస్తూనే వున్నా అతనికి మాత్రం ఒరిగిన ప్రయోజనం ఏమీ లేదని ఇలా తెలుపుతున్నాడు.

" అన్నదాత బిరుదాంకితుడు
అయినా అర్థాకలి జీవి
ఆరుగాలం చెమటోడ్చినా
ప్రజలే రాజులయినా
ఇది రైతు రాజ్యం అన్నా
వాడికి వొరిగింది అరసున్నా
అదునుకు పదును పడక
పడినా విత్తనాలు అందక
అందినా అవి మొలకెత్తక
మొలకెత్తినా దిగుబడి రాక
వచ్చినా గిట్టుబడి ధర లేక
వత్సరాలుగా శప్పుడై
అప్పుల కుప్పయ్
నిప్పుల్లో కాలుతున్న గుండెవాడు
నింగికి తెలుసు నీటికి తెలుసు
మానుకు తెలుసు ఈ మట్టికి తెలుసు
వాడు ప్రవహించే దుఃఖ ద్రవమని"[10]

అన్నదాతగా పేరు పొందిన రైతులకు ఎన్ని కష్టాలు. ఆ రైతులు తమ పంటనే నమ్ముకొని పంటలు పండినా పండక పోయినా ఆ పంటకు పెట్టుబడులు పెట్టి ఆ పంటను అమ్ముకునే సరికి మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లభించక అనునిత్యం సమస్యల సుడిగుండంలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

డి.కె.చదువుల బాబు 'స్ఫూర్తి' అనే కవితలో సమస్త మానవాళికి తిండిని పెట్టే దేవుని రూపంగా తలుస్తున్నాడు.

" సీమ నిర్జల భూముల్లో
చినుకు చుక్కే కరువైన నేలల్లో
ఆరిన రక్తం మరకల్లో
జొన్నరొట్టె, రాగి సంగటి, గొడ్డుకారం సాక్షిగా
నమ్మకాన్ని ప్రోది చేసుకుంటూ
విశ్వాసానికి ఊపిరి పోసుకుంటూ
కొడవలి పట్టిన వీరుడు
నాగలిని నమ్ముకున్న యోధుడు
చర్నాకోలా ఝులిపిస్తున్న సూరీడు
నీకూ నాకూ బువ్వ పెట్టే హాలికుడు
సమస్త జీవరాశికి స్ఫూర్తి దాయకుడు
మా రైతు మా దేవదేవుడు"[11]

సీమరైతుగా వ్యక్తిత్వాన్ని గూర్చి అలంకార భూషణంగా కవి చిత్రించాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'పొలి' అనే దీర్ఘ కవితలో రైతును అన్నదాతగా, దేశానికి వెన్నెముక పొగడుతూనే ఈ సమాజం అతన్ని అప్పుల ఊబిలోకి నెట్టివేసిందని చెబుతున్నాడు.

" కాడెద్దులతో నేలను దున్నిన వాణ్ణి
ఆవుదూడల్ని ఆలింగనం చేసుకున్నవాణ్ణి
అభయహస్తాలతో అంబేదను చేసింది
భారతీయం వెలిగిపోతోందంటూ
చెవిలో పూలు పెట్టింది
అన్నదాతవనే మూర్ఛబిళ్ళ తగిలించి
దేశానికి వెన్నెముకవనే కుచ్చుటోపి బెట్టి
అప్పుల ఊబిలో దున్నను చేసింది
తన ఉత్పత్తికి
విలువ కట్టలేని మూగను చేసింది
చెట్టంత మనిషిని
రక్తం పిండి పిండి

దిగులు గువ్వగా చేసి

కష్టాల గూట్లోకి నెట్టేసింది”[12]

అని రైతులను ఆదుకోవడానికి మేమున్నామని అభయం ఇచ్చి దేశంలో రైతు గొప్పదనాన్ని చెప్పిన వారే నమ్మకంగా మోసం చేసిన వైనాన్ని చిత్రించాడు. ‘రైతు దేశానికి వెన్నెముక’ అని అంటారు. అలాంటి దేశంలో రైతు యొక్క దుస్థితి ఎలా వుందో గమనించవచ్చు. పంటల పెట్టుబడి కోసం అప్పులు చేసి అతను కష్టాల సుడిగుండంలోకి నెట్టబడుతున్నాడు.

గోపిని కరుణాకర్ ‘ఇదంతా మడకసాలల్లో పుట్టినవాడి మనేద’ కవితలో రైతు మాటల్లో వ్యక్తం చేస్తున్నాడు.

“ కపిలి తోలుతూ

గొర్రెల తాత పాడిన జనపదానికి పల్లవినైయ్యాను

మా నాయనతో పాటు మేడి పట్టుకొని

పొక్కు కట్టిన చేనును దుక్కిదున్నిన వాడ్ని

మాయమ్మ మజ్జిగ చిలికేటప్పుడు

పెరుగు కుండలో కవ్వమైనాను

సద్ది తాగి చొక్కాయితో మూతి తుడుచుకొని

బడికి యలబారడమే నాకు తెలుసు

నేను మట్టిని, ఆకాశాన్ని నిప్పుని నీరుని గాలిని

నేను ప్రకృతిని

రుతువును బట్టి రూపాన్ని మార్చుకోవడం నా తత్వం

నాలుగు చినుకులు పడితేచాలు

మట్టిలో పరిమళిస్తాను”[13]

అంటూ ఒక రైతు తన స్వీయానుభవంలో నుంచి మాట్లాడుకోవడం, తన అనుభూతులను పంచుకోవడం వంటి అంశాలను కవి చెబుతూ ఒక తాత్విక నేపథ్యంలో నుంచి వక్తీకరించాడు.

సడ్లపల్లె చిదంబర రెడ్డి ‘మనకర్తవ్యం’ కవితలో రైతుసేద్యం చేయడాన్ని కర్తవ్యంగా, యజ్ఞంగా భావించి పొలాన్ని దున్ని పంటలు పండే పరమాత్మ స్వరూపంగా స్మరించాలని చిత్రించాడు.

“ పొద్దస్తమానం భూమిని యజ్ఞగుండంగా మలుస్తూ

కాడెద్దుల జతలో అఖండ శక్తిధారల్ని

హెూమద్రవ్యంగా ధారపోస్తాడు

అతని శ్రమ దీక్షా క్రతువులకు చలించి

మట్టి కణం కణంగా ద్రవించి

అతని చెమట చుక్కల్తో తడిసి ముద్దయి

.........................................

ముంగారి వానలకు ముందే అతడు

అదునుల పదునై పొలాలంతా ప్రవహిస్తాడు

ప్రతి కార్తిలో కాళ్లను వేళ్లుచేసి

నాటుకొనే మట్టి మొక్కగా రూపాంతరమౌతాడు

..............................................

రైతు పవిత్ర పాద స్పర్శతోనే

భూమి పచ్చని ముత్తయిదువయ్యింది

మనం తినే ప్రతి కబళం- అతని శ్రమఫలితం

అన్నం తట్ట ముందు అనునిత్యం

అతన్ని స్మరించడం - మన కర్తవ్యం”[14]

రైతు సేద్యం చేయడాన్ని ఒక యజ్ఞంలా భావిస్తాడు. అహర్నిశలు కష్టపడుతాడు. అతని పాదస్పర్శతో పవిత్ర భూమి పులకించిపోతుంది. అలాంటి రైతును ఈ సమాజం మొత్తం స్మరించాలని కవి భావన.

శాంతి నారాయణ ‘నువ్వొక సంఘటిత శక్తివై’ కవితలో రైతు కష్టపడి శ్రమ వల్ల చెమటను చిందించి పంటలను పండించి ఈ సమాజానికి అందివ్వడం వల్లే మానవాళి మనుగడ సాగిస్తుందనే సత్యాన్ని స్పష్టం చేశాడు.

“ నీ చేతి పనులన్నీ

పైరు పచ్చలై- మొక్కలై- మానులై

చిగురిస్తూ చిగురిస్తూ పుష్పిస్తాయి

నేలంతా నీ చెమట పరిమళమే విరబూస్తుంది

ప్రతి పైరూ, ప్రతి మొక్కా, ప్రతిచెట్టూ

నీ ఆశయాల పంటలతో తల్లితనం పొందుతుంది

చిరుగాలికి గలగలపాడే వరివెన్నుల గొంతుల్లో

నీ శ్రమ జీవన గీతం మధురంగా వినిపిస్తుంది.

..................................................

నీ కలలన్నీ కల్లాలలో కళకళలాడుతాయి
కల్లం కచేరిలో పంటరాశి మీద
రూపమెత్తిన చెమట రాజుగా నువ్వు కూర్చుంటావు
నీ చెమట ఫలితం లోకమంతా ప్రాకుతుంది
నీ చెమటే ప్రాణమై
సమస్త మానవాళినీ సంరక్షిస్తుంది.
నీ చెమట మీదే ప్రపంచమంతా నడుస్తుంది."[15]

అంటూ రైతును, ఆ రైతు శ్రమ సౌందర్యాన్ని అందంగా కళాత్మకంగా కవి చిత్రించాడు.

### 3.2.2 వ్యవసాయం:

సామాజిక ఆర్థిక ప్రగతిలో వ్యవసాయం ఒక కీలకాంశము. అనాది కాలం నుంచి మానవుడికి వారసత్వంగా వచ్చిన వృత్తి వ్యవసాయం. వ్యవసాయం ప్రాథమిక రంగము. రాయలసీమలో అధిక శాతం(70 శాతం) మంది ప్రజలు వ్యవసాయం చేస్తున్నారు. ఈ వ్యవసాయం అధికభాగం వర్షాధారితమే. నేటి ఆధునిక కాలంలో వ్యవసాయం చేయడం చాలా ఖర్చుతో కూడుకొన్న పని అని తెలుస్తోంది.

బిక్కి కృష్ణ 'పొలంలో నాన్న' కవితలో రైతుకు–పొలానికి మధ్యనున్న అనుబంధాన్ని వాస్తవిక దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాడు.

" నాన్న పాదాల క్రింద నేత్రాల చూపులెపుడూ
మట్టితల్లి గర్భం పొరలపైనే ప్రసరించేవి
నాన్న మట్టి పెళ్ళను తీసి గెనంకేసి కొట్టినపుడెల్లా
రాగిముద్ద మా నోట్లోకి వెళ్ళినట్టుండేది
నాన్న పొలాన్ని చదును చేసినప్పుడల్లా
మా కడుపులపై చేయి పట్టి నిమిరినట్టుండేది
మా నాన్న మడక మేడిని పట్టినపుడెల్లా
మా భుజాలపై అభయ హస్తం వాలినట్టుండేది
ఎండల్లో వానల్లో చింతచెట్టులా నాన్న
మా నాన్న దేహంపై నుండి జాలువారిన

ఒక్కొక్క చెమట బిందువు ఒక్కొక్క పైరుగా మారి

పొలమంతటా వరి అన్నం వాసన వేసేది”[16]

అంటూ ఒక రైతుబిడ్డ తన తండ్రి యొక్క సేద్యంలో చేసే పనితనాన్ని, ఆ పనితనంలో దాగిన కష్టార్జితాన్ని రైతుబిడ్డ ఆలోచనలోంచి కవి కవితాత్మకంగా కవితలో అల్లిన విధానం చాలా గొప్పగా ఉంది. ఒక కవి స్వీయానుభవంలో నుంచి వ్యక్తం చేసినట్లు కవితలో కనపడుతుంది.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ‘మా మాల పెద్దాయన’ కవితలో రైతు సేద్యంలో ఎలా పనిచేసేవాడో తెలుపుతున్నాడు.

“ మోటతోలినా మడక దున్నినా

దళవేసినా వొంచి వొంచినా

భూమితో మాట్లాడడమే

ఆకు తొక్కినా మాను తోలినా

పొలి చల్లినా పన గొట్టినా

రైతు పట్ల నిబద్ధతే

ఎద్దులైనా దున్నపోతులైనా

ఆయన లొట్ట వేస్తే చాలు

సైనికుల్లా విధేయంగా కాడికింద దూరేవి

మేడి పట్టు కుంటే చాలు

నాగలి నేలను చీల్చుకుంటూ పోతుంది

బూతులో నీతులో

ఆయన నోరు తెరిస్తే

ఏల పదాలు జలజలా రాలిపడేవి”[17]

అంటూ సేద్యంలో వరి పంట కోసం రైతు పొలాన్ని ఎలా సిద్ధం చేసేవాడో ఆయనతో పాటు ఎద్దులు, దున్నపోతులు ఎలా వినయంగా పని చేసేవో కవి వ్యక్తీకరించాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ‘పొలి’ అనే దీర్ఘకావ్యంలో రైతులు పొలం పనులకు సిద్ధమయ్యే విధానాన్ని తెల్పుతున్నాడు.

“ ఆయన తాడు పేనుతుంటే

తన బతుకు రథాన్ని లాగే

మోకును పేనుకుంటున్నట్లుండేది

కదిలిపోయిన మేడి

సడలిపోయిన నొగ

వంగిపోయిన కఱ్ఱు

విరిగిపోయిన కాడి

అరగిపోయిన పణత

అటక మీది నుంచి కిందికి దిగాయంటే

మా నాయన

కొత్త సేద్య సంరంభానికి

సైన్యాన్ని సమాయత్తం చేస్తున్నట్లే

అది సేద్య సూర్యోదయానికి

తూర్పుపటం"[18]

అంటూ రైతు సేద్యానికి సిద్ధమయ్యే పని గురించి తెల్పాడు. పొలంలో నాగలి దున్నడానికి కావలసిన వస్తువులను సిద్ధం చేయడం ఆ తర్వాత పొలం పనులకు పూనుకోవడం వంటి అంశాలను చక్కగా వ్యక్తీకరించాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'చాడ' శీర్షికలో పొలానికి నీరుపెట్టి మొదటిసారిగా దున్నే విధానాన్ని చిత్రించాడు.

" పొద్దు పొడిచే సరికి

ఎకరం నేల చాడ

ముందు మా నాయన ఎద్దుల మడక

వెనక మా మాల పెద్దాయన, శీనడు

మాదిగ సిద్దడు, గండోడు

నాసిపు రెడ్డి రామచంద్రమామ, రామనాథన్న

చిట్ట చివర

నా దున్నపోతుల మడక

అదొక మడకల రైలుబండి"[19]

అంటూ పొలంలో రైతు నాగలి దున్నడం, ఆ పనిలో కూలీలు నిమగ్నమవడం, దున్నపోతులతో నాగలి

దున్నిన పొలాల దృశ్యాలను కవి వ్యక్తీకరించాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'నీరు' శీర్షికలో గత కాలంలో బావుల్లో నుంచి మోట ద్వారా నీటిని తోడుతూ పనిచేసే విధానాన్ని తెల్పుతున్నాడు.

" వాన నీళ్ళతో నిండిపోయిన బాయి
తనకు తానై మోట తోలుతున్నట్లు
అయాచిత దానంలా
నీళ్ళు కయ్యల్లోకి పారడం
నా కెరుకే
తోలు బానతోనో
రేకు బానతోనో
మోట తోలుతూ
మోకు మీద ఉయ్యాలలూగుతూ
ఏలపదాల శృంగారంతో
మా నాయన బాయి గంగను ఊరించడమూ
నాకు జ్ఞాపకమే
గిలకల శబ్దం కదురుసవ్వడి
మా నాయన పాట
అదొక పల్లెటూరి పాటకచేరి"[20]

రాయలసీమలో గతకాలపు రోజుల్లో నీటిని తోడే పద్ధతిని 'కపిల తోలడం' అని పిలిచేవారు. ఆనాటి రోజుల్లో కపిల తోలుతూ రైతులు మరియు పొలం పని చేసే కూలీలు తమ శ్రమను మర్చిపోవడానికి పాటలు పాడుకొంటూ ఉల్లాసంగా పని చేసేవారని కవి తెల్పినాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'నాట్లు' శీర్షికలో పొలంలో వరిపైరు నాట్లు వేసే పనిని తెల్పుతున్నాడు.

" నాట్లు
వరి మొక్కల వికసనానికి పైలట్లు
రామిరెడ్డి కబురు పంపితే
నేతగిరి కచేలయ్యకు పండగే

మా అవ్వ కన్నెమ్మ వంటల మీద మమతే

నేతగిరి పల్లి ఆడోళ్ళు

దారం పోగులతో చీరలే కాదు

వరి మొలకలతో పొలాలనూ నేస్తారు

వాళ్ళు నాటిన వరిమళ్ళు

రంగులద్దిన చీరలయ్యేవి

వరినాట్లతో వాళ్ళు

వ్రేళ్ళ మీద నాట్యం చేస్తారు

వాళ్ళ చేతి స్పర్శతో

అడుసు నేల అందమైన జానపద కావ్యమయ్యేది

తెల్లని కయ్యల్లో

వాళ్ళు నాట్లు వేస్తే

స్నానం చేసిన పిల్లాడికి

అమ్మ బట్టలు తొడిగినట్లుండేది"[21]

అంటూ కవి పొలంలో వరిపైరు నాటుట గూర్చి తెల్పాడు. వరిపైరు నాటే రోజు పొలంలో ఎంత హడావుడి వుంటుంది. పొలాలు బురదతోనూ, నీటితో నిండి వుండగా వరి పైరు నాట్లు వేయగానే ఆ పొలాలన్నీ ఆకుపచ్చని చీరలా మెరిసేవి. వరినాట్లు వేసే స్త్రీల చేతి వేళ్ళను కవి నాట్యం చేసినట్టుగా వుందని గొప్ప కళా సౌందర్యంతో చిత్రించాడు.

రాచపాళెం కవి 'కోత' శీర్షికలో వరిపంట కోతను తెల్పుతూ,

" ఎడమ చేయి పిడికిలిలో వరిగంట

కుడిచేయి పిడికిలితో కొడవలి

పరపర వరిగంటలు తెగతూంటే

పొలం మీద పనలు

పనస తొనల్లా పరుచుకుంటాయి." [22]

అని వరిపంట కోతకోసే విధానాన్ని వర్ణించాడు. కూలీలు ఒక చేత్తో కొడవలి మరో చేత్తో వరిని పట్టు కొని పంటను కోసిన తర్వాత ఆ వరి కుప్పలు పొలం నిండా పనస తొనల్లా వున్నాయని కవి అలంకారముగా చెప్పాడు.

రాచపాళెం గారు 'కల్లం' శీర్షికలో సేద్యం ఖర్చులు, బాకీలు ఇతరత్రా అంశాల గూర్చి తెల్పుతున్నాడు.

" వడ్లరాశికి
రాత్రిపూట కాపలా పడుకున్నప్పుడు
మా నాయనకు కలలే కలలు
నాది నాకిచ్చెయ్ - మా మేనత్త సరికొత్త పాత డిమాండ్
ఈ సారైనా పుస్తిదారం ఇడిపించు
భయంతో కూడిన మా అమ్మ తీరని కోరిక
ఈ సారైనా బాకీ తీర్చు- తిరుపతి కోమట్ల వత్తిడి
చేబదుళ్ళు చిల్లర బాకీలు
సహకార బ్యాంక్ చక్రవడ్డీలు
అన్నీ వలయాలు వలయాలుగా తిరిగి
దిగులు రేపినప్పుడు
వడ్లరాశి ధైర్యం చెబుతుంది."[23]

అని ఒక రైతు తన పొలానికి పెట్టుబడి కోసం అప్పులు చేయడం, ఆ బాకీ తీర్చమని వ్యాపారస్తులు అడగడం లాంటి అంశాలను కవి చెబుతున్నాడు. పొలం పనుల డబ్బుల కోసం రైతులు బ్యాంకుల్లోనూ, వడ్డీ వ్యాపారస్తులతోనూ అలాగే కొంత మందితో చేతి బదులు తీసుకోవడం మనం సమాజంలో చూస్తూ వుంటాము. ఇలా రైతులు డబ్బులు కోసం పడరాని పాట్లు పడతారు.

బడబాగ్ని శంకర రాజు 'ఆకుపచ్చని మోసం' కవితలో వ్యవసాయంలోని సాధక బాధలను తెల్పుతున్నాడు.

" ఈ ఆకుపచ్చని పైరుల కోసమే కదా
కాయలు కాసేట్లు నాగలి నొక్కిపట్టి
పలుమార్లు చేలను దుక్కి చేసింది
ఆ దుక్కి దుమ్ములో స్నానమాడితేనే కదా
వేలిముద్ర నొక్కి వేయించుకొని
ఋణగ్రస్త రైతుగా గుర్తించింది
ఆ గుర్తింపు రేషన్ కార్డులో ముద్రితమైతేనే కదా
చాలీ చాలని విత్తనాలు, ఎరువులు దొరికింది

పొలం పునరుత్పత్తి వేదిక సారమయింది
ఆ సారాన్ని పీల్చుకొనే కదా
నారుమడి అరువు విత్తనం ఆకు తొడిగింది"[24]

రైతు సేద్యం చేయడానికి ఎన్నెన్ని కష్టాలు పడుతాడు. చదువులేని పేద రైతుల దీనావస్థను కవి వర్ణించాడు.

బడబాగ్ని శంకర రాజు 'రణభూమి' కవితలో సేద్యానికి అనువైన భూమి రకాలను తెల్పుతున్నాడు.

" మట్టి కనబడకుండా ఎక్కితొక్కిన ఎరువు సారం
నారును పైరుగా మార్చలేని చౌడుభూమి
ఊరొదిలి మరో ఊరొచ్చినట్లు
ఇంటినుండి ప్రయాస ప్రయాణం భూమి
.........................................
పొరబాటున తూము డొద్లు పండితే
వారసత్వ తగాదాలలో దద్దరిల్లే భూమి
వెట్టి చేయకపోతే చేజారు 'కట్టడి భూమి'
పలు సమస్యల జాతుల ముళ్ళ చెట్లభూమి
పేదవాని పలు రకాల బీడు భూములు"[25]

ఈ కవితలో భూమి ఎన్ని విధాలుగా ఉందో చెప్పిన కవి వర్ణన ఆయన పరిశీలనకీ భూమి గూర్చిన అవగాహనకీ నిదర్శనం. ఇందులో చెప్పబడిన పలు రకాల భూములు గూర్చి కవికి వాస్తవికతా దృష్టి కవిత నిండా పరుచుకుని వుంది.

### 3.2.3 కరువు:

దేశం మొత్తంలో 16 శాతం భూభాగం కరువు పీడిత ప్రాంతం. ఏటా 50 మిలియన్ల ప్రజలు కరువు సంక్షోభానికి గురి అవుతారు. దేశంలో 33 శాతం వివిధ ప్రాంతల్లో 750 మి.మీ.ల కంటే తక్కువ వర్షపాతం ఉంటుంది. ఇది దీర్ఘకాలికంగా కరువుపీడిత ప్రాంతం. భారతదేశంలో కరువుకు ముఖ్య కారణం నైరుతి ఋతుపవన(జూన్–సెప్టెంబర్) వైఫల్యం అని చెప్పవచ్చు.

ఏదైనా ఒక ప్రాంతంలో సాధారణ పరిస్థితులకు భిన్నంగా కొంతకాలం వరకు పూర్తిగా వర్షపాతం లేకపోవడం లేదా లోటు వర్షపాతం వల్ల సాధారణంగా సమాజం మొత్తం బాధలకు గురయ్యే పరిస్థితులకు దారితీసే స్థితిని కరువు అంటారు. ఈ అల్ప వర్షపాతం కారణంగా నీరు, ఆహారం, పశుగ్రాసం, ఉపాధికి

తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. దీనివల్ల పంటలు పండక ఆహారకొరత ఏర్పడి వేలకోట్ల జీవరాశి నశిస్తుంది. మొక్కలు, వృక్షాలు ఎండిపోయి ఆ ప్రాంతం మొత్తం ఎడారిగా మారుతుంది. దీనిని అనావృష్టిగా పిలుస్తారు. దీన్నే క్షామం, కాటకం అని పిలుస్తారు.

రాయలసీమను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య కరువు. రాయలసీమలో గత చరిత్రను పరిశీలిస్తే చాలాసార్లు ఈ ప్రాంతం కరువు బారిన పడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. 750 మి.మీ. సగటు వర్షపాతం కంటే తక్కువ వుండే ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటిస్తారు. సరాసరి వర్షపాతం కన్నా 25 శాతం తక్కువ వర్షపాతం నమోదైన సంవత్సరాన్ని 'వర్షపు కరువు' సంవత్సరంగానూ, 25 నుండి 50 శాతం వర్షపాతం తక్కువైనపుడు 'తీవ్రకరువు' సంవత్సరంగాను గుర్తిస్తారు. రాయలసీమలో చాలా ప్రాంతాలలో సగటు వర్షపాతం 525 మి.మీ. కన్నా తక్కువగానే వుండడం వల్ల కరువు పరిస్థితులు నెలకొన్నాయి.

జూపల్లి ప్రేంచంద్ 'అనంతలోవాన' కవితలో కరువు కరాళ విశ్వరూపానికి తట్టుకోలేక విసిగిపోయిన ప్రజల బాధలను ఇలా వ్యక్తం చేస్తున్నాడు.

" మా దొడ్లో విస్తరించిన మహావృక్షం జిల్లేడు
పక్కకు ఒరిగింది
ఒగటా రొండా మూడా ఎన్ని సంమచ్చరాలని
ఈ కరువు రాచ్చసితో ఏగేది
చింత చేసే పని తప్పిపాయ ఈ ఏటికి
కంట్లో కారంపడె, కన్నీళ్ళు దిగమింగేకి కాలే
ఔరా! విచిత్రం, దేశమంతా కురస్తాండే
వాన పక్క పొలం మీద కురవలే!
అంత తలరాత గదా
అగ్గి తెగులు తిరగ బెట్టె! చెనిగి చెట్లు మాడబట్టె!
చివరికి మిగిలిందేమో ఉత్త సుడిగాడు!"[26]

అని కవి సీమలో సరైన సమయంలో వర్షం రాకపోవడం వల్ల కరువు ప్రభావాన్ని వర్ణించాడు. కరువు అనే రాక్షసిని ఎదుర్కోవడం ఇంకా ఎన్ని రోజులు అని నిరాశా నిస్పృహల్ని వ్యక్తం చేస్తున్నాడు. వర్షాభావం వల్ల పంటలు కూడా ఎండిపోయాయని కవి వేదన.

జూపల్లి ప్రేంచంద్ 'పదును' కవితలో సీమలో రైతులు, ప్రజలు కళ్ళల్లో వత్తులు వేసుకొని

వర్షాలు కోసం ఎదురు చూసే సందర్భాన్ని ఇలా తెల్పుతున్నాడు.

" జీవితమంతా ఎదురు తెన్నుల్లో ఆకాశంకేసి చూస్తూ
ఉత్తరభాద్ర ఉరుములు లేకుండా వెళ్ళిపోతుంది
అశ్విని మెరుపు గుఱ్ఱాలెక్కి వెళ్ళిపోతుంది
భరణి గాలి దుమారాన్ని వెంట తెస్తుంది
కృత్తిక రోహిణి మృగశిర పుష్యమి
మాఘ పుబ్బ ఒక్కొక్క కార్తిలో నాలుగంటే నాలుగు
చినుకులు కురుస్తాయని వళ్ళంతా కళ్ళు చేసుకొని ఎదురు చూస్తే
ఎదురయ్యేవి చివరికి ఎండమావులే!" [27]

వర్షాలు వివిధ కార్తెలలో సమృద్ధిగా కురుస్తాయి. అయితే సీమలో మాత్రం ఏ కార్తెలోనూ వర్షాలు పడకుండా నిరాశను కలిగించాయని, కనీసం చినుకులు కూడా పడలేదని, ఆ రాని వర్షాల కోసం ప్రజలు ఎదురు చూసే విధానాన్ని కవి ఆర్ద్రంగా చెప్పాడు.

జూపల్లి ప్రేంచంద్ 'కసాయి కరువు' కవితలో సీమలో వర్షాలు కురవాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా అదంతా వ్యర్థమైన స్థితిని తెలియజేస్తూ ఇలా అంటాడు.

" నేలంతా పెనుమాకట్లా కాల్తాంది
నాలుగంటే నాలుగు చినుకులు రాలేదంటా
దిక్కులకు మొక్కితిమి, గంగ జాతర జేస్తిమి
యాగాల్జేస్తే వర్సాలు కురిసేటట్లుంటే
సీమలో పల్లెకొక ఇంద్రసేనారెడ్డి పుట్టక రాడా
మంత్రాలకు సింతకాయలు రాల్తాయా
యగ్నాలకు వాన చినుకులు కురుస్తాయా
అంతా ఉత్తదని తెలిపాయ"[28]

అంటూ కవి వర్షం రాని పరిస్థితిని వర్ణించాడు. వర్షాల కోసం ఎన్ని దిక్కులకు మొక్కినా ఎన్ని జాతరలు చేసినా వర్షాలు రాలేదని అలాగే యాగాలకు, మంత్రాలకు వర్షాలు పడే అవకాశం సీమలో లేదని కవి తెల్పాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'కరువుగడ్డ' కవితలో ఇలా అంటాడు.

" జొన్న రొట్టె, గొడ్డుకారం

రాగిముద్ద, ముద్దపప్పు

సద్దంబలి, ఎండూరగాయ

జాత్యన్నమైన సీమకు

మనిషిని మ్రోడును చేసి

కన్నీటిని పరమాన్నంగా వడ్డిస్తున్నది కరువు

దేశపటంలో

ఒక మూల విసిరి వేయబడ్డ

ఒక బీడుగడ్డ

ఈ కరువు గడ్డ"[29]

అంటూ కవి సీమ కరువు గాథతను చెబుతున్నాడు. కరువు మనుషుల బ్రతుకుల్ని నాశనం చేసిందని, దేశంలోనే నిత్యం కరువులు సంభవించే బీడుగడ్డగా సీమను వర్ణించాడు. ఇదే కవితలో కరువు వికృత రూపాన్ని దానివల్ల జరిగే పరిణామాలను తెలియజేశాడు.

" కరువు

సీమ ముంగిట పెరిగన వింత తరువు

దాని లీలలు అనంతం

బిడ్డలాంటి పశువును అడ్డంగా అమ్మిస్తుంది

గుట్టంత చెట్టును నిలువుగా నరికిస్తుంది

మనసైన మనిషిని మృగంగా మలుస్తుంది

ఎండముఖం ఎరగని కన్నెనైనా

నీళ్ళ కడవ చేతికిచ్చి

మైళ్ళ కొలదీ నడిపిస్తుంది"[30]

అని కరువు అనేది సీమ ప్రాంతంలో ఎంతటి ప్రభావం చూపునో కవి వర్ణించాడు. మనుషులు, పశువులు, పొలాలు, చెట్లు లాంటివి ఎన్నో కరువు బారినపడ్డ దృశ్యాలు కనిపిస్తాయి.

గోపినీ కరుణాకర్ 'పొద్దున్నే వచ్చిన వాన' కవితలో కరువు బారిన పడిన రైతు కుటుంబ దీనగాథల్ని తెల్పుతున్నాడు.

" బతుకు అప్పులపాలై

కండ్ల బావుల్లో కన్నీరుబకతా వుండాది

తల్లిపాలకు నోసుకొని నీకు పాలిచ్చి
నీ ప్రాణాలను నిలబెట్టిన పెద్దావు
బర్రెముకలు బయటబడి
నీ పోటోకల్ల జూస్తా పాణమిడిసిందిరా
కరువు ఎగిసి తన్నితే
బుడ్డలు దింపిన చేను గర్భం చెదిరింది
నల్లగా గడ్డకట్టింది
గొంతెండి వరిపైరు సొమ్మ సిల్లింది
నోటికాడికి వచ్చిన కూడు నేల పాలైందిరా
పూత పిందెతో మలమలా మాడినా
వంకాయ తోట సుట్టకారం
మీ అమ్మ పాణం కొట్టకలాడతా వుండాది"[31]

అని కరువు ఒక రైతు కుటుంబాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేసిందో కవి వర్ణించాడు. రైతు పొలంలోని పంటలు కరువు వల్ల ఎలా నాశనం అయ్యాయో చెప్పాడు.

డి.శిరీష 'అన్నదాత ఆక్రందన' కవితలో ఇలా వ్యక్తీకరిస్తుంది.

" కరువో...ఖర్మో...కాలం చూపే కాఠిన్యమో
తలెత్తి నింగికేసి చూస్తే ఎర్రని ఎండ చుర్రుమంటుంది
ఇసుకమేట వికటాట్టహాసం చేస్తుంది
కబేళాల శిబిరంలో కత్తి వేటుకు మాయమైన ఆవుదూడ
ఆకలికేక ఈదురుగాలుల్లో ప్రతిధ్వనిస్తుంది
మబ్బులు దోబూచలాడి, ఊరించి, ఉడికించి
ఎట్టకేలకు ఉప్పెనై వెల్లువెత్తుతాయి"[32]

అని కరువు అనేది ప్రజల జీవితాలతో ఆడుకొంటుందని కవి చెప్పాడు. ప్రకృతి కూడా సీమపై కక్ష గట్టినట్లు చేస్తుంది. మబ్బులు కూడా వర్షం వచ్చేలాగా ఊరించి ఉసూరుమనిపిస్తాయి.

కంబదూరిషేక్ నబీరసూల్ 'కరువు రక్కసి కాలనాగై కసితీరా కాటేసింది' కవితలో కరువు కాటుకు బలై దీనంగా బ్రతుకులను వెళ్ళదీస్తున్న పేదల ఆర్తనాదాలను తెలియజేస్తున్నాడు.

“ పూరి గుడిసెల్లో బావురమన్న మా అరుపులు కావు

అవి కరువు పొలికేకలు

ఇవి అరణ్యరోదనలై రోదిస్తుంటే

మా మెదళ్ళెప్పుడో మొద్దుబారాయి

కరువు కరువని, కరువు పేరుతో వచ్చిన

కరువు రూకలకు కాళ్ళొచ్చి

ప్రభుత్వ దళారీ గుల్బాజి కబ్జాదారుల జేబుల్లో

గుట్టుగా కునుకు లేస్తుంటే

అరువు తెచ్చుకున్న మా

పరువు ఎప్పుడో మమ్మిడిచి పారిపోయింది”[33]

అంటూ పేద ప్రజల కరువు ఆకలికేకలు, కరువుకు నష్టపరిహారంగా ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు కూడా పేదలకు అందకుండా దళారీ వర్గాలు దోచేశారని కవి ఆవేదన చెందాడు.

జి.వెంకటకృష్ణ ‘ప్రకృతిపాట’ కవితలో సీమరైతుల దుఃఖ జీవితాలు, ఎదురుచూపులు, కరువు వికృత చేష్టల్ని చిత్రించాడు.

“ ఇక్కడ దుఖం పేరు జీవితం

చిట్లిపోయిన కన్నీటి చుక్కలు

పాడుతున్నాయి నేపథ్యగానం

ఇక్కడ వర్తమానం పేరు ఎదురుచూపు

వొక్క వానకో యింత ఆర్ధ్రతకో

కడుపు మాడ్చుకుంటున్నాయి మట్టివేర్లు

ఇక్కడ పంటపేరు కరువు

ఉరియైన వేరుశెనగ వూడకో

అడుగుల కొద్దీ బోర్ల ఆఖాతానికో

పురుగుల మందుల మృత్యు దాహనికో

బలి అవుతోంది చెమట బతుకు

ఇక్కడ చరిత్ర నడుస్తున్న తీతువు పాట”[34]

అంటూ రైతులు కరువు వల్ల ఎలా తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారో తెల్పాడు. వర్షాలు పడక పంటలు పండక బోర్లలో నీళ్ళు పడక రైతు బతుకులు ఛిన్నాభిన్నం అయినాయి.

జి.వెంకటకృష్ణ 'హంద్రీగానం' అనే కావ్యాన్ని రచించాడు. ఇది రాయలసీమ చరిత్రని, వర్తమానాన్ని వివరిస్తూ హంద్రీనదిని ప్రతీకాత్మకంగా తీసుకొని రచించినదే ఈ హంద్రీగానం. 'ఆత్మగానం' శీర్షికలో కవి తన స్వరగానాన్ని ఇలా పలికిస్తున్నాడు.

" నేను వట్టిపోయిన వేల ముంగార్ల
వరద వెల్లువలను తట్టుకొని
కడుపు కాల్చిన కార్తెలను
గొంతు తడిపే పాయలుగా చేసుకొని
ఆత్మలను పీల్చేసే కరాళ కరువులను
మలయ మారుతాలుగా తలచుకొని
నీళ్ళు పొర్లని నేలపై
బీళ్ళు పన్నే వుచ్చులలో
పొలమై నిలిచిన కాలాన్ని
కాలమై నిలిచిన ప్రాణాన్ని
సాక్షమై నిలిచిన దేహాన్ని"[35]

అంటూ కవి తన స్వీయ నేపథ్యంలోంచి కరువును వర్ణించాడు. తొలకరి వర్షాల కోసం ఎదురు చూశాడు. కార్తెలలో వర్షాలు పడుతాయని ఆశపడ్డాడు. వర్షాలు రాలేదు. కరువు ప్రభావాన్ని ఎదుర్కొని కరాళ కరువు కాలంలో సజీవ సాక్ష్యంగా ప్రాణంతో వున్న ఒక దేహన్ని అని కవి స్వీయానుభవంగా వ్యక్తం చేశాడు.

ఎన్.ఈశ్వరరెడ్డి 'గుండె కరువు' కవితలో సీమలో కరువు కరాళ నృత్యం వల్ల ప్రజలకు తిండి కూడా దొరకని స్థితిలో తమ ప్రాణాలను నిలబెట్టుకొని కాలం గడిపిన దీన గాథల్ని చిత్రించాడు.

" నేల తల్లి డొక్కలో నీటినాళం వొట్టి పోయాక
ఎక్కడికక్కడే రాకాసి కరువు విరగబడి నవ్వుతోంది
ఏడేళ్ళ కరువు బుస కొట్టినపుడు
అన్నం మెతుకు అదృశ్యమైపోతే
దేవదారాకు ఉడకబెట్టి ప్రాణాలకు ఉట్టి కట్టుకున్నారట
ఇప్పుడు వొట్టిపోయిన అడవులు దిష్టిబొమ్మలై వెక్కిరిస్తుంటే

మనసు కాలిన పల్లె వలసబోయింది

అంబలి నీళ్ళతో జీవాన్ని ఉగ్గ బడదామంటే

మెట్టచేలు మట్టిపాలై విలపిస్తున్నాయి

నెత్తుటి చుక్కల్ని నారుగా పోసిన రైతుకు

నాగేటి సాళ్ళు స్మశాన గోతులై ఎదురు పడ్డాయి”[36]

అంటూ సీమలో కరువు అనేది ప్రజానీకాన్ని ఎలా నాశనం చేసిందో కవి వర్ణించాడు. సుదీర్ఘకాలం పాటు వర్షాల రాక కరువులు ఏర్పడేవి. ఆ కాలాల్లో ప్రజలకు తినడానికి తిండి కూడా దొరకని పరిస్థితి వుండేది. కరువు కాలాల్లో సీమ ప్రజలు, రైతన్నలు వలసలు పోయిన సందర్భాలెన్నో వున్నాయి.

బిక్కి కృష్ణ ‘కన్నీటిబొట్టు’ కవితలో కరువు వల్ల నీళ్ళులేక ఎండిపోయిన చెట్లు, పగుళ్లు బారిన పొలాల దృశ్యాలను తెల్పుతూ ఇలా అంటాడు.

“ అనంత కరువు ఆమె దేహం

శీలం చెడిన

రాజకీయం ఆమె

ఆమె వేశ్యకాదు

ఆకులు ఎండి, పువ్వులు రాలి

కొమ్మలు మిగిలిన- చింత చెట్టులాగున్న

మా అమ్మ మొఖంలో

అదృశ్యమైన సీమ పచ్చదనాన్ని వెతుకుతున్నా!

ఎండకు ఎండి బీటలు వారిన నల్లరేగడి లాగున్న

మా అమ్మ దేహంలో నీరింకిన సీమ నదుల్ని చూస్తున్నా!

ఎండిన సేదె బావుల్లా ఉన్న నా తల్లి కళ్లల్లో

పగిలిన కడవల కనుగ్రుడ్లు చూస్తున్నా

స్వాతంత్ర్యానికి ముందు మా అమ్మ

పచ్చనైన పంట పొలాల్లో ఎగిరే పక్షిపిల్ల

నేడు కరువు సీమ ఇసుకపై శవమైన కుక్కపిల్ల”[37]

రాయలసీమలో అనంతపురం జిల్లా ఎక్కువ సార్లు కరువు ప్రభావానికి గురైంది. ఆ ప్రభావం ఎలా వుందో స్త్రీతో పోల్చి కవి చెప్పాడు. కరువు వల్ల ఎండిపోయిన చెట్లు, నదులు, పంట పొలాల పచ్చదనం, నీటి

బావులు లాంటి అంశాలను కవితీ్వకరించాడు.

బండ్లమాధవ రావు 'మావూరి దృశ్యం' కవితలో కరువు సృష్టించే విధ్వంసాన్ని తెల్పుతున్నాడు.

" గుప్పెడు మబ్బు తునక కోసం
ఎదురు చూసిన నా కళ్ళ నుండి అశ్రు వాక్షరాలు రాలాయి
నీటి పథకాల నీటి మూటల్ని నెత్తినేసుకొని
దాహార్తినై ఎండమావుల వెంట పరుగు తీస్తున్నాను
దీనంగా చూస్తున్న ఎనుము పలుపు తాడు తెంపేసి
కసాయి వెంట తోలి ఓ పూట కడుపు నింపుకుంటున్నాను" [38]

అంటూ సీమలో కరువు మానవ సంబంధాలనే కాకుండా మనిషికి– పశువులకు మధ్య సంబంధాలను విచ్చిన్నం చేయడం, వానల కోసం ఎదురు చూసే ప్రజా జీవితాలను కవి చిత్రించాడు.

పి.దస్తగిరి 'ఎంతకాలమిలా' కవితలో ఇలా అంటున్నాడు.

" మా మేఘం
భజనలతో పారాయణలతో సంతర్పణలతో
ఎంత మొర పెట్టినా ఎంత తపించినా
గొంతు తడుపు చుక్కలే గాని
కడుపార దయ చేయని కటికరాతి గుండె
మా వ్యవసాయం
ఓ లాటరీ
ఈ సారైనా తగలక పోతుందా
అని ఊహించి ఖర్చుపెట్టింది
తగులనే తగలని లాటరీ" [39]

అంటూ కరువు రాయలసీమ ప్రజా జీవితాలను జూదంగా మార్చటాన్ని, వర్షాల కోసం సీమ జీవితంలో ఆవరించిన మూఢాచారాలను కవి ఎత్తి చూపారు.

మహమూద్ 'వానవస్తదో రాదో' కవితలో వానకోసం ఎదురు చూడడం, ఆ వాన రాక తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడి ఆ తర్వాత పల్లె ప్రజలు ఎలాంటి కష్టాలను అనుభవిస్తున్నారో తెల్పుతున్నాడు.

" మాయదారి కరువు
పానం తీయకుండా నేన్ పోనంటది

వాన కోసం సూసి సూసి

పానం ఉగ్గబట్టి పోయినాది

సిన్నోడికి పాలు పడదామంటే

ఆలి చన్నులు వడబారి యాలబడినాయి

పాలు పితుకుదామంటే

మేకలు ఎండిన కాడలైనాయి

అమ్మ కడుపు కాడ సెర్మం

బీడు పడిన నేల మాదిరి గుండాది

నాయన బీడి కాల్చనీకి పెదాల్లో సత్తువ పోయినాది

ముఖం పీకేసిన గడ్డి వామైపోయినాది"[40]

అంటూ ఒక పేద కుటుంబం కరువు ప్రభావానికి ఎలా చితికిపోయిందో కవి తెల్పాడు. సీమలో చాలా మంది కరువు ప్రభావానికి గురై తినడానికి తిండి లేక పంటలు లేక చనిపోయిన దృశ్యాలెన్నో సీమలో కనిపిస్తాయి. రాయలసీమ యాసలో కవి వ్యక్తీకరించాడు.

కాశీవరపు వెంకటసుబ్బయ్య 'కరువు కార్చిచ్చు' కవితలో రైతులు, కూలీలు కరువు దాష్టీకాన్ని తట్టుకోలేక వలసలు పోవడం, ఎంతటి భయంకర కరువులు దాపురించినా సీమ ప్రజల్లో చెదిరిపోని గుండె నిబ్బరాన్ని వ్యక్తం చేస్తాడు.

" కూలినాలి వాండ్లు పనులు దొరక్క కాందిశీకులై

దేశ్శోమంటూ వలసపోతారు

రైతన్నల చూపులు నింగికేసి నిశ్చల స్థితిలో నిల్చిపోతాయి

మేము ధాత కరువు- ముష్టి కరువు చూశాము

డొక్కల కరువు- వలస కరువు చూశాము

రోళ్ళు పగిలే ఎండలు చూశాము

ఆకలితో కుప్పలు తెప్పలుగా చావడంలో

మాకొక రికార్డు కూడా చరిత్రలో నిక్షిప్తమై వుంది"[41]

అని కరువు వల్ల పేద కూలీ జనాలు వలసలు వెళ్ళే పరిస్థితిని, అలాగే సీమలోని రకరకాల పేర్లుగల కరువులను కవి చిత్రించాడు.

జూటూరు షరీఫ్ 'కరువు దృశ్యం' కవితలో కరువును పాత చుట్టంలా భావించి వెంటాడే భూత నీడలా దాని దార్ష్టీకాన్ని తెలియజేస్తున్నాడు.

" కరువు యిక్కడ పాతుకు పోయిన పాతవింత
కరువు యిక్కడి ప్రజలకు చుట్టం కాదు
చుట్టుకున్న ఉరితాడు
షరా మామూలుగా
వెంటాడే భూతనీడలా
ఈ ప్రాంతంపై మమకారం చూపిస్తుంది
కరువు కరాళ నృత్యానికి ప్రజలు హతాశులు అవుతారు
కరువు కరాళ నృత్యానికి ప్రచండ తాండవానికి
పగల్లు పారిన రేగడిలా రైతుగుండె
పాయలౌతుంది
రైతుల ఆశల మోసులు శుష్కించిపోతాయి
రైతులు విత్తులు విపత్తుకు దాసోహమౌతాయి"[42]

అంటూ సీమలో కరువు ఎలా పాతుకుపోయి ప్రభావం చూపిందో కవి వర్ణించాడు. రాయలసీమలో కరువు పిలిస్తే పలుకుతుంది. అనే నానుడి పై కవిత ద్వారా తెలుస్తుంది.

### 3.2.4 రైతులు – ఆత్మహత్యలు:

రాయలసీమలో ప్రజలు చాలా మంది వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో నీటి సదుపాయాలున్నప్పటికీ చాలా ప్రాంతాల్లో వర్షాధారిత వ్యవసాయమే. ఈ వర్షాన్ని నమ్ముకుని రైతులు పంటకోసం విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చులు, సేద్యం చేయడానికి అయ్యే ఖర్చులు ఇతరత్రా వాటి కోసం చాలా మంది అప్పులు చేస్తారు. పంటలు పండించడానికి వేల రూపాయల పెట్టుబడులు పెడితే పంటలు పండిన తర్వాత ఆ పంటలకు మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధరలు లభించక చేసిన అప్పులు ఎక్కువై ఈ సమాజంలో చాలా మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు, వారి విషాద గాథలు మనకు ఎన్నో కనిపిస్తాయి. రైతుల యొక్క సేద్యపు సమస్యలు వారి కుటుంబ దీన గాథలు ఇంకా ఎన్నో ఇతరత్రా సమస్యలను మనం చెప్పలేనివి. రైతులు సమస్యల సుడిగుండాల నుంచి బయట పడే మార్గం తెలీక ఆత్మహత్యలే పరిష్కారమని భావిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరమైన విషయం. సమాజంలో రైతుల ఆత్మహత్యలు జరగకుండా పాలనా యాంత్రాంగాలు పటిష్ట

చర్యలు చేపట్టి రైతులకు కావాల్సిన సదుపాయాలను కల్పించాలి. సేద్యం చేసే రైతులను ఆదుకొని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన వున్నది.

గుత్తా హరి సర్వోత్తమ నాయుడు 'స్వర్ణాంధ్రకు శవమెత్తు సంతకం' కవితలో రైతు పచ్చగా బతకాల్సిన వాడు ఎండిపోతున్నాడు. వాడు పెంచిన చెట్టే వాడికి ఉరికంబంలా మారుతున్నది. క్రిమికీటకాల కోసం తెచ్చుకున్న విషమందులు రైతులనే చంపుతున్నాయనే దీన విషాదగాథల్ని చిత్రించాడు.

"నాగేటి చాళ్ళలో
తీగై సాగాల్సిన నేలబిడ్డ
పగిలిన బీళ్ళలో
ఎండినమొక్కై విరుగుతున్నాడు
నీడ నిస్తుందని
నీళ్ళు పోసి పెంచిన చెట్టే
వాడికి ఉరికంబమౌతున్నది
చీడకు విరుగుడనుకున్న
మోనోక్రోటోపాస్
పుడమి పుత్రున్నే మింగే
మిత్తవౌతున్నది
మట్టిపిసికి బురదతొక్కి
హరిత సృష్టిని చేసే మట్టి మనిషి
తన గొంతును తానే పిసుక్కుంటున్నాడు"[43]

అంటూ కవి రైతు యొక్క విషాధ గాథను తెల్పాడు. చెట్టుకు ఉరేసుకున్నవారు, పురుగులమందు తాగిన వారు వున్నారని సమాజానికి తిండిని ప్రసాదించే రైతు ఇలా కనుమరుగవుతున్నాడని కవి ఆవేదన చెందాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'అనంతరైతు' కవితలో అనంతపురం జిల్లాలోని రైతు బతుకును చిత్రించాడు.

" శెనక్కాయలు పండుతాయని
శెనిగిత్తనాలు విత్తితే
మొవ్వకుళ్ళు తెగులు మొలిస్తే
వాడేం చేస్తాడు!

మోనోక్రోటోఫాస్పై తేలుతున్నాడు

ఊడలు దిగని

వేరుశెనగ తీగల ఉరితాడుకు

తానే ఊడై వేలాడుతున్నాడు"[44]

అంటూ కవి వేరుశెనగ పంటను పండే రైతును గురించి తెల్పుతున్నాడు. అనంతపురం జిల్లాలో వేరుశెనగ ప్రధాన పంట. సంవత్సరానికి ఒకసారి పండించే వర్షాధారిత పంట వేరుశెనగ. ఎన్నో ఆశలు పెట్టుకొని విత్తనాలు తెచ్చి విత్తి, కలుపులు తీసి, ఎరువులు చల్లితే సరైన వర్షాలు రాక పంటకు రోగాలు పడి, పంట చేతికందలేని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలోంచి కవి కవిత్వీకరించాడు.

### 3.2.5 రైతులపై దోపిడీలు:

మట్టిని నమ్ముకుని సేద్యం చేస్తూ ఈ సమాజానికి, దేశానికి అన్నం పెట్టే రైతులపై రకరకాలుగా దోపిడీలు జరుగుతున్నాయి. దేశానికి రైతు వెన్నెముక అని ఆ వెన్నెముకను విరిచేసి పీక్కొని తింటున్నారు దళారులు, వ్యాపారులు, భూస్వాములు. ఈ సమాజంలో ఎన్నో రకాలుగా రైతులు దోపిడికి గురౌతున్నారు. రైతు వ్యవసాయం చేస్తాడు. విత్తనాల దగ్గర నుంచి ఎరువులు, మందులు లాంటి కొనుగోలులో రైతులు మోసపోతున్నారు. పండిన పంటను మార్కెట్‌లో అమ్మకానికి తీసుకెళ్తే అక్కడ కమీషన్ ఏజెంటులు, మధ్యవర్తులు, దళారులు, వ్యాపారుల మోసాలకు బలైపోతున్నాడు. పంటకు సరైన గిట్టుబాటు ధరలు లభించవు. రైతులకు అప్పులు ఇచ్చిన వడ్డీ వ్యాపారస్తులు అధిక వడ్డీలు, చక్రవడ్డీల పేరుతో మోసాలు, బ్యాంకుల రుణాలు ఇచ్చి రైతుల దగ్గర నుంచి తాఖీదులు పెట్టించుకొని మోసం చేయడం మన సమాజంలో చూస్తూనే వున్నాం. ఇలా రైతులు ప్రతిచోట అడుగడుగున దోపిడీ చేయబడుతున్నాడు.

గుత్తాహరిసర్వోత్తమ నాయుడు 'స్వర్ణాంధ్రకు శవమెత్తుసంతకం' కవితలో రైతు పల్లె నుంచి ప్రపంచం దాకా ఎలా దోపిడి చేయబడుతున్నాడో తెల్పుతున్నాడు.

" ఈ రైతున్నాడే

వీడొక అనవసర హృదయశిల్పి

శిలగా ఉండవలసిన వాడు

శిల్పంగా సానెక్కుతాడు

వీడిదంతా తన్నుమాలిన ధర్మం

తానెండిపోతూ

ఎవడెవడికో పచ్చదనం పంచుతాడు

తానావిరౌతూ

అందరికీ ఆర్ధ్రత పంచుతాడు

వీడొక చాకలిబండ

ఎవడైనా బాదవచ్చు

పంచాయితీ నుండి ప్రపంచ బ్యాంకు దాకా

ప్రతివాడికీ రైతొక ఫిలాసఫీ

వాడి కపాలం జుర్రుకోవడానికి

ప్రతి మాంత్రికుడూ సిద్దమే"[45]

అంటూ రైతు ఎవరికీ కీడును చేయక తన ధర్మం ప్రకారం సేద్యం చేస్తూ అందరికి తిండిని పెడుతున్నాడు. అలాంటి రైతును అడుగడుగున దోపిడీ చేస్తున్నారు.

చంద్రశేఖర శాస్త్రి 'నాయకుడు' అనే కవితలో దోపిడీ స్వభావాన్ని చిత్రించాడు.

" అతని కన్నా వేశ్య నయం

ఆమె వలవేస్తుంది

ఒక పూట తిండికోసం

అతను వల వేస్తాడు

ఒక టర్మ్‌కోసం

ఆమె సర్వం దోచి పెడుతుంది

ఆమె దేహన్ని అమ్ముకుంటుంది

అతను దేశాన్ని కుదువ పెడతాడు"[46]

అంటూ కవి సమాజంలో పడుపు వృత్తి చేసుకొనే స్త్రీకి, రాజకీయ నాయకునికి మధ్య పోల్చి ఎవరు ఎలా దోచుకుంటున్నారో కవి చెప్పాడు. ఒక పూట తిండి కోసం తన శీలాన్ని ఒకరు అర్పిస్తే మరొకరు తరతరాలుగా తిన్నా తరగని ఆస్తిని సంపాదించడానికి దోపిడి చేస్తున్నారని కవి చెప్పాడు.

దస్తగిరి 'ఈ యుద్ధం ఆపొద్దు' కవితలో రైతులపై జరుగుతున్న మోసాన్ని తెలియ జేస్తున్నాడు.

" ఆత్మలు లేని వాళ్ళు

వికృతాత్ములు

ద్రోహబుద్దులు

దేశాన్ని ఏలుతుంటే

రైతుల ఆత్మగౌరవం నిలబడే దెట్లా
కాసిన్ని బాకీ డబ్బుల వసూలు కోసం
బ్యాంకు నోటీసు
ఉరితాడై రైతును చంపిన రోజే
ఈ దేశ చట్ట సభలు
నిసిగ్గుగా ప్రకటిస్తాయి"[47]

అంటూ కవి రైతుల పట్ల నిర్లక్ష్యం, దోపిడీని ఎత్తి చూపాడు. స్వతంత్ర భారతదేశంలో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. బ్యాంకులో పంటరుణం పొంది దానిని తిరిగి బ్యాంకుకు కట్టలేని రైతు బ్యాంక్ నోటీసుతో ఆ రైతు కలత చెంది ఆత్మహత్య చేసుకున్న దృశ్యాన్ని కవి చెప్పాడు.

జి.వెంకటకృష్ణ హంద్రీగానం కావ్యంలో 'సారం పీల్చేసిన పేగు' శీర్షికలో గ్రామంలోని రైతు దోపిడీ చేయబడ్డ వైనాన్ని చిత్రించాడు.

" ఆ గట్టున యీ గట్టున
నీళ్ళకోసం ఎదురు చూస్తున్న
సీమ రైతుకు వొట్టి పోయిన ఆవులా వుంది
ఆ నదిలానే వుంది పల్లె
ఎదుగుదల కిచ్చే నిధుల్లో
దందాలు వసూలు జేసే
నాయకుల చేతుల్లో పల్లె
కాంట్రాక్టర్ దొంగలు తవ్వేసి
తోడి తోలేసిన యిసుకలేని నదిలా వుంది
గట్టు తెగిన చెరువులా వుంది పల్లె
జలవనరులూ జనవనరులూ
తరిలిపోయే దైన్యంలా వుంది పల్లె"[48]

అంటూ రైతులను నాయకులు, కాంట్రాక్టర్లు, బడా భూస్వాములు ఎలా దోచుకొంటున్నారో కవి తెల్పాడు. సమాజంలో రైతును, ఆ రైతులకు ఇచ్చే పంట నష్ట పరిహారాలను, నిధులను ఇంకా నీళ్ళను, ఇసుకను, సర్వ వనరులను దోచుకొంటున్నారని కవి తెల్పాడు.

ఎన్.ఈశ్వర రెడ్డి 'కరువు పాము' అనే కవితలో రైతు ఎలా దోపిడి చేయబడ్డాడో తెల్పాడు.

" అప్పుల వరద జనం మీదికి దూకుతుంది
ఆస్థుల కట్టలు స్విస్ బ్యాంకుల్లో నవ్వుతాయి
సర్కారు వారి సబ్సిడీ నీళ్ళు
అవినీతి బొరియల్లో ఇంకి పోతాయి
పంట పండితే దళారీ గద్దలు
పండకుంటే శవాలపై గద్దలు
వాలడానికి సిద్ధంగా
రైతుల ఇళ్ళపైనే గిరికీలు కొడుతుంటాయి"[49]

అంటూ కవి ఈ దేశంలో అవినీతికి పాల్పడి సంపాదించిన నల్లధనం ఏ విధంగా స్విస్ బ్యాంకుల్లోకి వెళుతుందో చెబుతూ అలాగే సమాజంలోని వ్యాపారస్తులు, దళారులు రైతుల పంటను దోచుకున్న విధానాన్ని ఎండగట్టాడు.

### 3.2.6 వలసలు:

మనిషి తాను నివసిస్తున్న స్థానిక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళడం 'వలస'గా పిలుస్తారు. ఈ వలసలు రకరకాల కారణాలతో జరుగుతున్నాయి. స్థానిక ప్రాంతాలలో మనిషికి ఎలాంటి ఉపాధి అవకాశాలు లభించక పోవడంతో ఆ స్థానిక ప్రాంతంలో జీవించడం కష్టతరమైనపుడు మరో మార్గం లేక పొట్ట చేతబట్టుకొని బ్రతుకు తెరువు కోసం ప్రజలు వలసలు పోతున్నారు. రాయలసీమ జిల్లాలలోని అధిక శాతం మంది ప్రజలు కర్నాటక, కేరళ లాంటి నగరాలకు, పట్టణాలకు వలసపోతున్నారు. సీమలో వర్షాలు సరిగ్గా కురవకపోవడం, నిత్యం కరువులేర్పడడం వల్ల పంటలు పండక పొలం పనులు లేక రైతులు, కూలీలు, ప్రజలు తమ స్వస్థలాలను విడిచి బెంగళూరు లాంటి నగరాలకు వలసపోతున్నారు. వ్యవసాయం, గ్రామీణ వ్యవస్థ ఈ వలసల వల్ల ఛిద్రమైపోయింది. ఈ ప్రజలు తాము నివసిస్తున్న పల్లె వాతావరణాన్ని, ఇల్లు, వాకిలి, పశుసంపదను వదిలి అంతస్తులను, ఆత్మగౌరవాన్ని పక్కనపెట్టి ఎక్కడ పని దొరికితే అక్కడ ఎట్లాంటి పనినైనా చేయడానికి సిద్ధమై వెళుతున్నారు. వలసలు పోయిన చోట ఎలాంటి దుర్భర పరిస్థితులలోనైనా జీవించడానికి సిద్ధమౌతున్నారు.

కేతు బుచ్చిరెడ్డి 'పల్లెచిత్రం! బతుకు ఛిద్రం!!' కవితలో ప్రజలు తమ పుట్టిన గ్రామాన్ని వదిలిపోవడాన్ని దృశ్యమానం చేశాడు.

“ ఎద ఎద ఎడారి
పద పద ఊరు వదిలి
కనుగుంటలో ఎండిన కుంటలు
ఎదలన్నీ ఎండిన దొరువులు
పశువులు కబేళాలకు
మనుషులు వలసలకు
పగిలిన అద్దాలతో పడుతున్న తంటాలు
చూపుల కోసం ముసలి కళ్ళు
అరచేతికి ఊతం కర్ర అందించి
దాన్నే తన్నుగా అనుకోమని
ఊరి పొలిమేర దాటి కనుమరుగైనాడు”[50]

అంటూ కవి సీమలో కరువు ప్రభావం వల్ల ప్రజలు ఉన్న ఊరిని వదిలి బ్రతుకు తెరువు కోసం వలస వెళ్ళే దృశ్యాన్ని చెప్పాడు. ఇదే కవితలో ప్రజలు తమ గ్రామాలను వదిలి పట్టణాలు, నగరాలకు వెళ్తే అక్కడ వారు ఎదుర్కొన్న అవమానాల మూటల్ని విప్పుతున్నాడు.

“ పల్లె పొమ్మంటుంది
పట్నం రారమ్మంటోంది
ముంబై, చెన్నై, బెంగళూరు, బళ్ళారి, ఢిల్లీ
ఊరు వదిలినోడికి అన్నీ ఊళ్లే
అడుక్కోడానికి అరవై ఇళ్ళు
కానీ,
బతుకు తెరువు దొరక్కపోగా
తిట్లు, అవమానాలు, మోసాలు
దగాపడి తిరిగొచ్చిన తమ్ములు
ఒళ్ళమ్ముకొని, ఎయిడ్స్ మృత్యు మహమ్మారితో తిరిగి
ఇళ్ళకొచ్చిన అక్కచెల్లెళ్ళు”[51]

అంటూ పల్లె జనం పట్నానికి వలస వెళ్ళి అక్కడ వారు పడ్డ వేదనను కవి చిత్రించాడు. ఉపాధి కోసం

చాలా మంది ప్రజలు పెద్దపెద్ద పట్టణాలకు వెళతారు. అక్కడ ఎన్నో అవమానాలను భరిస్తారు. తిట్లు పడతారు, మోసపోతారు. స్త్రీలు కూడా తమ పొట్టకూటి కోసం వేశ్యా వృత్తిలోకి దిగి వ్యాధుల బారిన పడిన సందర్భాలెన్నో మనకు కనిపిస్తాయి.

జూపల్లి ప్రేంచంద్ 'దాహం' కవితలో ప్రజలు గ్రామాలను, పచ్చదనం లేని పంటలను, విస్తరిస్తున్న ఎడారి వెంట రాళ్ళు, గుట్టలతో కూడిన ఆ వాతావరణంలోంచి నడచివెళ్ళే దృశ్యాలను చిత్రించాడు.

" నడిచి నడిచి నడిచి కొండలు దాటి కోనలు దాటి
కాళ్ళు బోదకాళ్ళయి రాతి స్తంభాలుగా మారుతున్నా
అచంచల విశ్వాసంతో ముందుకేసి నడుస్తున్నాడు
చుట్టూ పరికించి చూస్తే అంతటా విస్తరిస్తున్న ఎడారి
పలాయనం చిత్తగించిన పచ్చదనం
పర్వతాగ్రాల మీంచి అరణ్యాలు అదృశ్యమై
మిగిలినవి రాతి గుట్టలు"[52]

రైతులు పంటలు పండించడానికి నీళ్ళు లేవు. సరైన సమయంలో వర్షాలు పడవు. ఇలాంటి గడ్డు పరిస్థితులలో రైతులు అన్నీ వదిలి వెళుతున్న దృశ్యాన్ని కవి చిత్రించాడు.

చంద్రశేఖర శాస్త్రి 'గద్దలాడుతున్న దృశ్యం' కవితలో కవి ఈ ప్రపంచీకరణ యుగంలో రైతులు ఆధునిక సేద్యం గూర్చి చెబుతున్న వాస్తవిక దృశ్యం చూడండి.

" పెన్నేటి మలుపుల్లో
పల్లేరు ముళ్లపై రతిఘోష
అనంత రైతు జీవనయాత్ర
వేపపువ్వు డాలర్ ముఖంతో వెక్కిరిస్తుంటే
సింగపూర్ సేద్యం చేయలేక చితికిపోతున్నాడు
రైతు పక్షి వలస పోయాక
ఉగాది గీతం పాడేదెవరు"[53]

అంటూ అనంత రైతు వలస బతుకులను, జీవన గాథల్ని చెబుతున్న దృశ్యం ఇది. ఈనాటి సాంకేతిక ఆధునిక యుగంలో పంటలకు పెట్టుబడులు ఎక్కువై రైతులు వ్యవసాయం చేయలేక పోతున్నారు. అయితే రైతులందరూ వలసెళ్ళిపోతే వ్యవసాయం చేసేవారు ఎవరు అని కవి ప్రశ్నిస్తున్నాడు.

జి.వెంకటకృష్ణ 'రైతుకూలీ' కవితలో గ్రామాలలోని రైతులు, కూలీలకు పనుల్లేక వలస పొమ్మంటున్నదనే చేదు నిజాన్ని చెబుతున్నాడు.

" ఊరు పొమ్మంటుంది
పండని నేలా
ఎండిన బతుకూ
పొగలేవని పొయ్యీ
పైసా లేని చేయీ
వాస్తవం నుంచీ పారి పొమ్మంటుంది
ఊరి పొలిమేర్లలో
బలికోరే క్షుద్రదేవతలా
రమ్మనడానికి మరేమీలేని దారులతో
నగరం పగలబడి నవ్వుతుంది"[54]

అని గ్రామాలలోని ప్రజలకు చేయడానికి పని, తినడానికి తిండి, సేద్యానికి నీరు మొదలైనవి లేకపోతే జీవనం సాగేదెలా అని చెబుతూ ఈ దుర్భర పరిస్థితుల్లో నుంచి ప్రజలు బ్రతుకు తెరువు కోసం నగరాలకు వలసపోతే నగరం వెక్కిరించినట్లు కవి చిత్రించాడు.

రాధేయ 'సౌందర్యరాహిత్యంలోంచి ' అనే కవితలో వలసవెళ్ళిన ఒక మనిషిగాథను చెబుతూ,

"నేనెక్కడికి వచ్చాను?
నేనెక్కడున్నాను?
ఒంటెద్దు బండిలోంచి
నగరం నాగరికతలోకి దొర్లిపోయాక
నా ఊరే నాకు పరాయిదై పోయిందా?
నేను నా ఊరికే పరదేశినయ్యానా?
ఇప్పటికీ
నా శ్వాస నా పల్లెది
నా ప్రాణం మాత్రం పట్నంది
నిజం చెప్పనా
నేనిప్పుడు

ఆత్మను కోల్పోయిన

సౌందర్యవాదిని!!"[55]

అంటూ కవి వలసెళ్ళిపోయిన ఒక మనిషి అంతరంగ ఆలోచనను వ్యక్తీకరించాడు. స్వగ్రామాన్ని వదిలి పెట్టి పరాయి నగరానికి వెళ్ళినప్పుడు ఆ మనిషి తాను పుట్టిన ఊరిని, తన అనుబంధాలను, ఆత్మీయతలను తలచుకొని తన మనస్సులో బాధపడ్డాడు. వేదన చెందాడు. నగరంలో వున్నప్పటికీ అతని ధ్యాస, ఆశ, శ్వాస అన్ని తన స్వగ్రామంపైనే వున్నాయి.

కెంగార మోహన్ 'పొగ చూరిన బతుకులు' కవితలో ప్రజలందరూ వలసెళ్ళిపోతే ఊరు వల్లకాడులా మారిందని చెబుతున్న దృశ్యం.

" వలసెళ్ళిపోయింది ఊరు

వాడవాడలన్నీ నిర్మానుష్యమే

వీధుల్లో స్మశాన సందడి

పొద్దు గడవదు పూట గడవదు

ఏదో వెలితి

తెలిసీ తెలియని వెలితి

అన్నీ అంతరించిపోయి

కాలగర్భంలోకి

చరిత్ర శిథిలాల క్రిందికెళ్ళాయి"[56]

అంటూ కవి ప్రజలందరూ గ్రామాలను వదిలి వెళ్ళితే ఆ గ్రామాలన్నీ నిర్మానుష్యంగా మారి అంతరించి పోతూ చరిత్ర అవశేషాలుగా నిలిచిపోయే ప్రమాదముందని కవి కవిత్వీకరించాడు.

### 3.2.7 ఫ్యాక్షనిజం:

విజయనగర సామ్రాజ్యంలోని రాజుల పాలనలో నాయంకర వ్యవస్థ అమలులో వుండేది. ఈ నాయంకర పాలనలో ఈ ప్రభువుల ప్రతినిధులైన గ్రామాధికారులు, మండలాధికారులు స్వతంత్రులై ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకొని తమ పాలనా పరిధిని పెంచుకొని మరింత సంపదను దోచుకోవడానికి పొరుగు పాలకులతో నిత్యం ఘర్షణ పడేవారు. వీరి పాలనకు అడ్డువచ్చిన వారిని, తమను ఎదురించిన వారిని దారుణంగా హింసించి అణిచి వేశారు. వీరి కాలం నుంచి క్రమంగా క్రీ.శ. 1600 నుండి 1800 సం॥ మధ్య కాలంలో పాలెగాళ్ళ వ్యవస్థ రాయలసీమలో రూపుదిద్దుకొంది. ఈ పాలెగాళ్ళు వీరి వారసులు ముఠా సంస్కృతిని సీమ అంతటా విస్తరించారు. పెత్తందారులు ఆ కులాలవారు ఆ ప్రాంతాల్లో తమ

ఆధిపత్యం కోసం ముఠా సంస్కృతిని పెంచి పోషిస్తున్నారు. ఈ పాలెగాళ్ళ వారసులే నేటి ఫ్యాక్షనిస్టులు అని చెబుతున్నారు. పెత్తందారీల ఆధిపత్యాన్ని ఎదురిస్తే రక్తపాతం జరిగేది. ఆ ఘర్షణలో గ్రామపెద్ద, గ్రామ సర్పంచ్, కరణం, రెడ్డి(మునసబు)లదే ప్రధాన పాత్ర. ఫ్యాక్షనిస్టుల ప్రభావం లేని అంశమే లేదు. రాజకీయాలు, సారా, బ్రాందీ వ్యాపారాలు, కాంట్రాక్ట్ పనులు, మైనింగ్, లీజులు, పంచాయితీలు మొదలగు ఎన్నో ముఠా నాయకుల కనుసైగలలో జరిగేవి. రాయలసీమలో కొన్ని ప్రాంతాలలో భూస్వామ్య కుటుంబాల మధ్య ఆధిపత్యాలు, గొడవలు, కక్ష్యలు పెంచుకోవడం, బాంబు దాడులు, కొడవళ్ళతో నరుక్కోవడాలు ఇలా ఎన్నో రకాలుగా ఆస్తినష్టం, ప్రాణనష్టం జరిగింది.

వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ 'గోడలు లేని జైలు' కవితలో ఫ్యాక్షన్ గొడవల వల్ల జరిగే హింసా ప్రవృత్తిని చిత్రించాడు.

" ఏమో, ఎవరికి తెలుసు?
ఏ గొలుసు హత్య ఎక్కడ ఆగుతుందో
ఏ మగనాలి నల్లపూస
ఏ కత్తి కొనకు వేలాడుతుందో
రాతి గుండెకు తగిలి
ఏ ముత్తైదు చేతిగాజుల శోభ బోసిపోతుందో
కులాల కుళ్ళు చిచ్చుల రొచ్చు
కారుణ్యం లేని కక్షలూ కనికరం లేని శిక్షలు
కసిబట్టిన క్రౌర్యం, మూర్తీ భవించే మూర్ఖత్వం
పొంచి చూచే నాటు బాంబులు
ఎఱ్ఱగా మాట్లాడే వేట కొడవళ్ళు
ఎగిరి పడే తలకాయలు
ఒరిగి పోయే మొండాలు
తరాల తరబడి కుళ్ళిన నాగరికత నుంచి
ఎక్కడిదీ పాడుకంపు?" [57]

కవి ఫ్యాక్షన్ అనేది ఏ నాగరిక సమాజం నుంచి వచ్చింది అని ప్రశ్నిస్తున్నాడు. కొన్ని కుటుంబాల మధ్య గొడవలు, ఒకరి మీద కక్ష పెంచుకోవడం, సమయం చూసి మాటు వేసి కొడవళ్ళతో నరక్కోవడం బాంబు దాడులు చేయడం ఈ దాడుల్లో భర్తలను కోల్పోయిన స్త్రీలు విధవలు అవ్వడం లాంటి అంశాలను కవి చిత్రించాడు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 'పరాధీన సీమ' కవితలో సీమ ప్రజలు ఫ్యాక్షన్ గొడవల్లో, దాడుల్లో నలిగి భయంగా బ్రతుకులు వెళ్ళదీస్తున్న దృశ్యాలను చిత్రించాడు.

"ఇక్కడ
మధ్యయుగ అవశేషాలే
నవీనయుగ విశేషాలు
నరికెయ్యడానికి
మనిషితలైనా
మామిడి చెట్టైనా ఒక్కటే
ఇక్కడ
జీవితాలు నిజంగానే నీటి బుడగలు
పేలుతున్న బాంబులు తెగుతున్న పేగులు
..........................................
ఇక్కడ
భరతమాత బాంబు కిరీటం ధరిస్తుంది
అన్నపూర్ణ నాటు తుపాకి పట్టుకుంటుంది"[58]

అంటూ కవి సీమ ప్రాంతంలో జరిగే పరస్పర బాంబు దాడులు, హత్యల గురించి చెబుతున్నాడు. ఈ నేపథ్యంలో ముందుతరాన్ని గూర్చి చెబుతూ,

" ఇక్కడ
ఏ విత్తనాలు చల్లినా
మొలకెత్తేవి కొడవళ్ళూ గొడ్డళ్ళే
ఇక్కడ
రేపటి బిడ్డ పలికేది
'బి' ఫర్ 'బుక్' కాదు, 'బి' ఫర్ 'బాంబ్'
ఇక్కడ పుట్టిన
చిగురు కొమ్మైనా నాటు తుపాకీయే"[59]

అంటూ సీమలో ఒక నాటి తరం నుండి ఫ్యాక్షన్ ఎలా ఇక్కడ పాతుకు పోయిందో అలాగే ఈ సంస్కృతి ఇలాగే కొనసాగితే రేపటి ముందు తరాల వారు ఫ్యాక్షన్ సంస్కృతిని అలవర్చుకునే ప్రమాదముందని కవి

హెచ్చరిస్తున్నాడు. 'పుట్టు మచ్చ' కవితలో ఇలా అంటున్నాడు.

" మాకు జీవిత మంటే
హత్యకూ హత్యకూ మధ్య విరామమే
జీవనయానమంటే
మరణం నుంచి మరణానికి ప్రయాణమే
మాకు బతకడమంటే
చావును వాయిదా వేసుకోవడమే
పౌరుషమంటే
తాళిబొట్లు తెంచడమే"[60]

అంటూ ఫ్యాక్షన్ ముసుగులో నరుక్కోవడాలు, మనుషలను చంపడం ఎంత దారుణంగా వుండేవో కవి తెల్పుతున్నాడు. ఇంకా ఎదుటి వారి మీద కక్షలు, కుట్రలు పెంచుకునే విధానాన్ని చెబుతూ,

" మాకు
రణం తప్ప రాజీ లేదు
కసి తప్ప క్షమ లేదు
చెట్టంత మనిషి
ఒక్క క్షణంలో
పిడికెడు నెత్తురు ముద్ద కావడం
మా రసవాద విద్య"[61]

అంటూ సాటి మనిషి మీద ద్వేషం, కోపం, కక్షలు పెంచుకొని కుట్రపన్ని, మాటు వేసి, వేటు వేయడమే, చంపడమే మేము నేర్చుకున్న విద్య అని కవి చెప్పాడు.

ఎస్జీడీ చంద్రశేఖర్ 'నేనూ నా రాయలసీమా' అనే కవితలో ఫ్యాక్షన్ సినిమా సంస్కృతిని చెబుతూ,

" ఒకప్పుడు
కత్తులు కటార్లూ శివతాండవాలు చేసిన
నా రాయలసీమలో తెగిన తలల్నీ చూశాను
తలలు తెగిపడ్డ మొండాల్నీ చూశాను
ఇప్పుడిప్పుడే రాయలసీమ ఫ్యాక్షనిజాలు
సినిమా వెండి తెరలపై కెక్కి

తళతళ మెరిసి పోవడాన్ని చూస్తూ ఉన్నాను

"రారా నా ముద్దుల మామా

రాసిస్తా నా రాయలసీమ" [62]

అంటూ సీమ ఫ్యాక్షనిజాన్ని ఆధారంగా చేసుకొని సినిమాలు తీయడం, సీమ సంస్కృతిని ఇప్పుడిప్పుడే వెండితెరలపై చూస్తున్నానని కవి చెబుతున్న దృశ్యం.

జి.వెంకట కృష్ణ 'ఎన్నో ప్రశ్నలు–ఎంతో విషాదం' కవితలో సీమ ఫ్యాక్షన్ నేపథ్యాలు, గొడవలను సినిమాలలో చూపించే దృశ్యాన్ని, అభిమానుల పిచ్చితనాన్ని ఇలా చిత్రించాడు.

" ఆ నట వారసుల

కటౌట్లకు గొర్రెతలల హారాలె

మా వారసులు వేలాడుతున్న

వర్తమాన కళా రసాభాస

చిత్రచలన విషాద తెరాట

సినిమాల కెక్కిన

యీ సీమ పౌరుషాలు

దృశ్యం దృశ్యం రాక్షసాలు

హీరో తొడల కొద్దీ బాదితే

గొంతు కొద్దీ అరిస్తే

సౌండ్ ఎఫెక్ట్‌లో బాక్సాఫీసు బద్దలు

విలన్లు పలికిన యాసలో

మా సంస్కృతంతా వెకిలి వేషాలు"[63]

అంటూ సీమ ఫ్యాక్షన్ నేపథ్యంలో సినిమా తీసిన సందర్భాన్ని కవి గుర్తు చేశాడు. సినిమా హీరోల మీద పిచ్చి అభిమానం పెంచుకొని అభిమానులు సినిమా విడుదల సమయాల్లో జంతుబలులు ఇవ్వడం మనం చూస్తున్నాం. అలాగే సీమ భాష, యాస, మాండలికం, సంస్కృతిని ఫ్యాక్షన్ నేపథ్యాలను కథలుగా తీసుకొని సినిమాలు తీసి ఇక్కడి సంస్కృతిని వెక్కిరించిన దృశ్యాన్ని కవి చిత్రించాడు.

లోసారి సుధాకర్ 'కన్నీటి కరువు' కవితలో పగ, ప్రతీకారాలతో మనుషుల మీద దాడి చేసి చంపే విష సంస్కృతిని చెబుతున్నాడు.

" ఉదయపు పొద్దులోనో

సాయంత్రపు సరిహద్దులోనో
ఊరవతల్నో ఊరివతల్నో
కాకుంటే పల్లె నడిబొడ్డునో
తలలు తాటికాయల్లా తెగుతాయి
వీధులు యుద్ధ భూములవుతాయి
శ్మశానం నడవీధికి నడిచొస్తుంది
ఇక్కడ చావులన్నీ
హత్యలు, అసహజ మరణాలే"[64]

అని మనిషిని హత్య చేయడానికి సమయం చూసి దాడి చేయబోయె దృశ్యాన్ని చెబుతున్నాడు. ఏ స్థలంలో నైనా ఏ సమయంలో నైనా కక్షదారుణ్ణి అంతమొందించడమే లక్ష్యంగా ఫ్యాక్షన్‌దారులు చేసే పని. స్వరూప్ కృష్ణ 'దృష్టి' అనే కవితలో కవి ఫ్యాక్షన్ గొడవలు, మూఠా తగాదాల వల్ల గ్రామాలలో వున్నటువంటి భయానక వాతావరణాన్ని చిత్రించాడు.

" పల్లెలు కాలుతుంటాయ్
ముఠా కక్షల్లో
కాలుతున్న పల్లెల్నే ఏలుతున్న కక్షదారులు
అంతఃపురాల్లో బందూకుల మధ్య
బాంబుల వెనుక నక్కి
భయం భయంగా
బరువుగా బతుకు నీడుస్తూ
ఏ క్షణాన ఏ పల్లె కాలుతుందో
ఏ నిముషానికి ఏ వూళ్ళో తలలు తెగుతాయో
తెలీకుండానే మరణ శాసనాలు రాయబడుతూ
ఇక్కడ మాంగల్యాలు క్షణికాలు
పసుపు కుంకుమలు తాత్కాలికాలు"[65]

అంటూ కవి సీమ పల్లెల్లో ఏ ప్రాంతంలో ఏ హత్య జరుగునో ఎక్కడ బాంబు దాడులు జరుగుతాయో అని చెబుతూ సీమ ప్రజానీకం  బయం బయంగా జీవనం సాగిస్తున్నారని కవి చెబుతున్నాడు.

నందవరం కేశవ రెడ్డి 'సీమ' అనే కవితలో సీమ పౌరుషాన్ని ఇలా చెబుతున్నాడు.

" ఇక్కడ
జీవించడమంటే
మూతి మీద మీసముండడం
తొడగొట్టి ఈల వేయడం
ఎత్తిన తలల్ని యేరేయడం
కరుడు గట్టిన క్రూరత్వం
శివమెత్తిన రాక్షసత్వం
ఈ సీమ వారసత్వం" [66]

అంటూ ఈ సీమలో బ్రతకడం అంటే పౌరుషంతోనూ, పంతాలతోనూ గడిపి కక్షలు పెంచుకొని కుట్రలు చేయడమే ఈ సీమ వారసత్వంగా కవి చెబుతున్న దృశ్యం అది.

### 3.2.8 నీటి సమస్య:

రాయలసీమను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో నీటి సమస్య ఒకటి. జాతి మనుగడకు, సంస్కృతి వర్ధిల్లడానికి, నాగరికత విస్తరించడానికి నీరు ప్రధాన వనరు. సీమలో ప్రవహించే నదులు వాటిలో నీరు లేకపోవడం, సరైన వర్షాలు రాకపోవడం వల్ల లభించే కొద్దిపాటి నీటి వనరులను సరైన ప్రణాళికలతో పటిష్ట చర్యలు చేపట్టి వాటిని సద్వినియోగం చేసుకోలేక పోవడం వల్ల నీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. ప్రధానంగా రైతాంగానికి సాగు చేయడానికి ప్రజలకు దైనందిన కార్యకలాపాలకు నీరు చాలా అవసరం.

జూపల్లి ప్రేంచంద్ 'అష్టావక్ర' అనే కవితలో కవి ఫ్లోరైడ్ నీటి వల్ల కలిగే సమస్యల్ని తెల్పుతున్నాడు.

" తల్లి గర్భంలో నెత్తుడి గడ్డ
జీవం పోసుకుంటూ పోసుకుంటూ కొంచెంగా
విషగ్రస్తమవుతుంటే...ఫ్లోరోసిస్...ఫ్లోరోసిస్
స్లోపాయిజన్...ఫ్లోరోసిస్
అని మాకు చెప్పిందెవ్వరూ?
విష వస్త్రాన్ని విసర్జించినట్టు
తల్లి ప్రేగు తెంచుకొని భూమ్మీద పడినప్పటి నుంచే
జీవితం ఒంకర టింకరగా కుంటుతుంది కదా!"[67]

అంటూ ఫ్లోరైడ్ నీటిని తాగడం వల్ల తల్లి గర్భం నుంచే పిల్లలకు అంగవైకల్య సమస్యలు ఏర్పడుతున్నాయని కవి చెప్పాడు.

“ ప్రాణం పోసే జలం ప్రాణం తీసే జల సర్పమై
పాతికేళ్ళ యవ్వనాన్ని కాటేస్తే
దేహం మూడంకెల గూనిగా బిగుసుకుపోక చస్తుందా!
అ కాలంలో శరీరం అకస్మాత్తుగా బిగుసుకుపోయి
కండరాలు వుండలు వుండలుగా చుట్టుకుపోయి
ఒళ్ళంతా తీపులు తీపులుగా సలుపుతూ
నాడీ మండలం మూత్ర కోసం మూసుకుపోయి
మృత్యువు హటాత్తుగా దాడిచేస్తుంది”[68]

అంటూ కవి ఫ్లోరైడ్ నీటి వల్ల మనుషులకు ఎంతటి ప్రమాదం, సమస్య వుందో కవి వేదన పడ్డాడు. అనంతపురం జిల్లాలో కొన్ని ప్రాంతాలలో నీళ్ళల్లో ఫ్లోరైడ్ అధికం. ఆ నీళ్ళు తాగిన ప్రజల కాళ్ళు, చేతులు వంకరలై అనేక రకాల అంగ వైకల్యాలు, శరీర సమస్యలు సంభవించాయి.

గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ ‘నీళ్ళు’ అనే కవితలో కవి ఎలా అంటున్నాడో చూడండి.

“ ఉంటేనే నీళ్ళు
పల్లె పొలాల గట్లపై పల్లె పడుచుల పకపకలు
గడ్డి వాముల చెంత, ప్రేమ జంటల గుసగుసలు
కర్షక క్షేత్రాల నేత్రాల పంటల కళకళలు
బక్కచిక్కిన డొక్కలకు పిండి వంటల ఘుమఘుమలు
లేకుంటే నీళ్ళు
ఉండవు మానవతా సంబంధాలు
ఉంటాయి ‘పానీ’ పట్టు యుద్ధాలు
ఉండవు పాలకుండలు, పాడి పంటలు
ఉంటాయి, కరువు కాటకాలు, కాలుష్యాలు, వ్యాధులు
ఉంటాయి ఎడారి భూమాత కన్నుల ఉప్పొంగే శోక సముద్రాలు”[69]

అంటూ నీళ్ళు ఉండడం వల్ల కలిగే లాభాలు, లేకపోవడం వల్ల వచ్చే నష్టాలు గురించి కవి చెప్పాడు.

పాలవాయి రాధిక 'అక్షయపాత్ర' కవితలో మనిషికి, రైతుల సేద్యానికి ఒక్క వర్షపు చుక్క నీరు చాలని చెబుతున్నది.

" తడారి పోతున్న గొంతుకకు ఒక్క నీటి చుక్క
మనిషికి ఊపిరి పోస్తే
ఎడారి కాబోతున్న సీమ రైతుల పంటచేలకు
ఒక్క వర్షపు చుక్క
పాబోతున్న రైతన్న ప్రాణాలకు ఆయువు పోస్తుంది"[70]

అంటూ నీటి ప్రాధాన్యతను మనిషికి, రైతు పంటకు ఎంత అవసరమో చెప్పింది.

యక్కలూరి శ్రీరాములు 'మూడు ఎడారులు ఏడు సముద్రాలు ఒకే ఒక్క అనంతపురం' కవితలో సీమలో అన్ని సమస్యలకు నీరే ప్రధాన కారణమని తెలియజేస్తున్నాడు.

" ఆకాశంలో నీటి చుక్క కూడ వుండదు
పాతాళంలో కూడా తేమ ఆచూకే దొరకదు
ఇక్కడ నీటి బిందువే అన్ని సమస్యల సింధువుల
మూల కారణ కేంద్ర బిందువు
మేఘాల నీడ సోకక
ఈ మట్టి మరిచింది పుట్టుక
ఈ నేలలో విత్తిన విత్తనం భూమిపై మొలకెత్తక
రైతునెత్తిన పిడుగైపడి గొంతులోకి జారిన విషపు గుళిక"[71]

అంటూ కవి అనంతపురం జిల్లా ప్రజానికానికి నీరు ఎంత అవసరమో చెబుతూ అన్నీ సమస్యలకు నీరే కేంద్రబిందువుగా మారిందని కవి వేదన పడ్డాడు.

వై.శ్రీరాములు 'జలగండం' అనే కవితలో మట్టికి, నీటికి మరియు మనిషికి మధ్య సంబంధాన్ని తెల్పుతూ,

" మట్టిపై కొలతలు
నీటి అంచులు
ఏ దేశానికైనా సరిహద్దులు
మట్టిని నీటితో కలిపి
మనిషి మనిషీ శ్రమిస్తేనే
ఏ దేశ ప్రజలైనా తినేది ఇన్ని ముద్దలు"[72]

అంటూ మట్టి-నీరు-మనిషి వీటి మధ్య ఒక తాత్విక పునాదిగా ఆలోచించి వ్యక్తం చేశాడు. నదులు, నీరు వున్న చోటనే మానవ సమాజం మనుగడ సాగిస్తుంది. కాబట్టి ఏ ప్రాంతమైనా, రాష్ట్రమైనా, దేశమైనా నీటి వనరులు ఉండి మనిషి కష్ట పడితే అభివృద్ధి చెందే అవకాశం వుంది. ఇంకా ఏమంటున్నాడో చూడండి.

" జలం
శరీరాలకు జీవం
జలం
అన్వేషణలకి మూలం
జలం
మానవాలి మనుగడకు ప్రాణం
జలం
నిర్వికార నిత్య సత్యం
జలం
జననమూల కేంద్రం" [73]

అంటూ ఈ జగత్తు మీద ప్రతిదానికి నీటి ప్రాధాన్యం ఎంత అవసరమో పై కవిత తెలుపుతుంది.

### 3.2.9 స్త్రీ సమస్యలు:

'వెలుగుతున్న మైనం' కవితలో నిర్మలా రాణి ఒక స్త్రీ పనితనాన్ని, ఆమె శరీర కష్టాన్ని సహజంగా చిత్రించింది.

" ఆమె,
ప్రవహించే ఏరులా
పరిగెడుతూ వస్తుంది
వచ్చిందే తడువుగా
యుద్ధానికి సిద్ధమవుతున్న సైనికునిలా
కొంగు బిగించి కుచ్చిళ్ళు చెక్కి
'పొర బొక్కెన' ఆయుధంగా ధరించి
రంగులలోకి దిగుతుంది
ముఖం రుద్ది కుంకుమ బొట్టు పెట్టినట్టు
వాకిలి కడిగి ముగ్గుల దీపం వెలిగిస్తుంది

తన రాకతోనే సూర్యోదయం

అయిందని నిరూపిస్తుంది."[74]

అంటూ కుటుంబంలో స్త్రీ ప్రాధాన్యతను వివరించింది. తెల్లారుఝామున స్త్రీ లేచి ఇంటిని శుభ్రం చేసి కడిగి, కళ్ళాపు జల్లి, వాకిలికి బొట్లు పెట్టి ఇంటి ముందర ముగ్గు పోసి అందంగా తీర్చి దిద్దుతుంది. ఒక స్త్రీ ఉదయానికి స్వాగతం పలుకుతున్నట్లుగా కవయిత్రి చిత్రించింది. ఆమె శ్రమను గూర్చి చెబుతూ,

" ఆమె

ఓ కదిలే యంత్రం

విద్యుత్తు, పెట్రోలుతో

నిమిత్తం లేని ఈ యంత్రానికి

చేతన రేపటి(నెరవేరని) ఆశ!

రెక్కాడడానికేమి కొదవ లేదన్నట్టు

ఏ యింటి కా యింట

అంట్ల గిన్నెలు, మైల బట్టలు

కసువులు- మురికి బండలు

ఇంకా , ఎన్నెన్నో ఎదురు చూస్తుంటాయి."[75]

చాలా మంది పేద స్త్రీలు కుటుంబ పోషణ కోసం ఉన్నత కుటుంబాల ఇళ్ళల్లో ఇంటిపని చేయడానికి వెళ్తారు. అక్కడ వారు పడే శ్రమ వెలకట్టలేనిది. ఇంకా ఆమె దీనత్వాన్ని చెబుతూ,

" ఆమె

చూపుల్ని శూన్యంలో నిలిపి

ఖాళీ గిన్నెల్ని వెదుకుతుంటుంది

పిల్లలు తినగా మిగిలిన రొట్టెముక్క

మరో ఇంట్లో బిక్షగాని పరం కాకుండా

దక్కిన అన్నం ముద్ద

ఆమె ఆకలి నిట్టూర్పులకు

ప్రత్యక్ష సాక్ష్యాలు

రెక్కాడినా, డొక్కాడదని

మరోసారి కఠినంగా

అనుభవంలోకి వస్తుంది
ఆ పూటకు చీకటి కుంపటి
వెలిగే దిక్కు తెలియక
ప్రాణం పోతుంటే
మరో దిక్కు రేపటి పై ఆశ
ఊపిరి పోస్తుంటుంది."[76]

అంటూ స్త్రీ పేదరికాన్ని, ఆమె మనస్తత్వాన్ని చాలా వేదనాభరితంగా కవయిత్రి చిత్రించింది. ఒక స్త్రీ పని మనిషిగా పని చేసి ఎంత సంపాదించినా ఆమె జీవనం గడవదు. తినడానికి తిండి కూడా దొరకని పరిస్థితి ఎదురవుతుంది. ఏ పూటకు ఆ పూట జీవనం గడుపుతూ రేపటి బ్రతుకు జీవితం కోసం ఆమె పడే జీవన పోరాటాన్ని కవయిత్రి ఆర్ధ్రంగా చిత్రించింది.

గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ ' ఆ బమ్మదేవుడు' కవితలో స్త్రీ పై చూపే వివక్ష గూర్చి చెబుతూ, భర్త భార్యను పీడించే దృశ్యాన్ని చిత్రించాడు.

" ఎట్టా ఏగేదబ్బా వీడితో
వీడు నా మగడు కాదు
నా పాలిట యముడై పోయాడబ్బా!
వాడు తాగి నన్ను తంతే- నే బంతిలా గెంతాలి!
వాడు నవ్వు తుంటే- నేనేడుస్తుండాలి!
ఆడదంటే నేనేమో- అణిగి మణిగుండాలి!
సేవలు సేసి వాడికి- నే, శవంలా బతకాలి
కూలికి పోకుండా వాడేమో - కురిసీలో కూకోవాలి
రోగమొచ్చినా నేనెమో పనికి బోయి- దొరనేమో మేపాలి" [77]

అంటూ ఈ సమాజంలో స్త్రీలపై ఎంత వివక్ష, అణచివేత వుందో కవిత ద్వారా తెలుస్తుంది. ఒక భార్యకు తోడుగా, నీడగా , అండదండలుగా ఆమెకు ఏ కష్టం వచ్చినా పంచుకునే వాడు భర్త అవ్వాలి. కాని అతడే కాలయముడై వేదిస్తే ఆమెకు దిక్కెవరు. ఆమెను ఎవరు కాపాడాలి. ఇలాంటి బాధాతప్త సన్నివేశాన్ని కవి చిత్రించాడు.

వెంకట కృష్ణ 'నాట్లు' అనే కవితలో 'మహిళా కూలీ' గూర్చి వారి శ్రమను చెబుతున్నాడు.

" వాళ్ళు పాటలను నాటాలని

మళ్ళలోకి దిగుతారు

పారవశ్యాలు పోతున్న నారును

సుతారంగా మీటుతూ

ఆకాశాలు కన్పిస్తున్న భూ అద్దమ్మీద

ఆనంద వలయాలు సృష్టిస్తారు

సద్దు చేయని ఝామున

చలి ముద్దల్ని హత్తుకుంటూ

నిద్దుర లేచి ముద్దకు పొయి రాజేసింది మొదలు

పాటలకు మేల్కొలుపులు చెబుతారు" [78]

అంటూ కవి మహిళా కూలీ యొక్క వరిపైరు నాటే పని నైపుణ్యాన్ని, ఆమె తెల్లవారు ఝామున లేచి ఇంటిపని, వంట పని చేసి పనికి వెళ్ళే ఆమె పనితనాన్ని చెప్పాడు. ఇంకా ఇలా అంటున్నాడు.

" తట్టలూ బుట్టలూ

నాగళ్ళూ కొడవళ్లూ సర్ది

నారు చేసిన పాటలను జల్లులకెత్తి

సద్ది మూటల్నీ చంకన బిడ్డల్ని

పొలం గట్లకో

చెట్ల కొమ్మకో వేలాడ గట్టి

నాగలి నడిచిన చారల స్వరాల వెంట

మట్టికాళ్ళూ చేతులూ చేసే విన్యాసాల వెంట

వాళ్ళు కన్న పసి పిల్లల్లాంటి

పసిమి నింపుకున్న పాటల్ని

పొలాల నాట్లు వేస్తారు

అవి పంటలై ఎదిగిన పిల్లలై

వాళ్ళ పాట్లను మరిపిస్తే మురిసిపోతారు" [79]

అంటూ కవి ఒక పల్లెటూరి మహిళా కూలీలు గూర్చి చెప్పాడు. బుట్టలు, తట్టలు, కొడవళ్ళు తీసుకొని, చంటి పిల్లాడిని చంకన వేసుకొని పొలాల్లో ఏ చెట్ల కొమ్మలకో ఉయ్యాలలు కట్టి పసి పిల్లలను నిద్రపుచ్చి ఆ మహిళా కూలీలు తమ పొలం పనిని చేసుకున్న సుందర దృశ్యాన్ని కవి చిత్రించాడు.

కల్పనా రెంటాల 'కలలగూడు' అనే కవితలో ఇంటిలోనూ అలాగే సమాజంలోనూ స్త్రీలపై చూపే వివక్షపై అద్భుతమైన కవిత ఇది.

" ఆ ఇల్లు నాది కాదు
ఈ ఇల్లు నాది కాదు
ఔను
ఆ పలుపుతాడు పడ్డ క్షణమే
నేను అత్తింటి ఆస్తిని
మారింది ఇంటిపేరేనా
నా తలరాత కూడా
చట్టాలు, సెక్షన్ల మధ్య పరకాయ ప్రవేశం
నేనంటే ఓ పసుపుతాడు
నేనంటే ఓ ఆవివాహిత
నేనంటే ఓ విధవ
నేనంటే పెళ్లికాని తల్లిని
నేనంటే ఓ డైవర్సీ
ఇన్నింటి మధ్య నేను 'ఆడ' దాన్ని!
ఏ ఆకాశానికి చెందని సగభాగాన్ని
ఏ అనుబంధానికి చెందని అస్తిత్వాన్ని
అందరూ పంచుకునే ఉమ్మడి ఆస్తిని!" [80]

అంటూ స్త్రీ ఏ విధంగా ఎన్ని రకాలుగా ఎక్కడెక్కడ ఆమెపై అణిచివేత ఉందో అలాగే ఆమె ఏ విధంగా దోపిడీకి, వివక్షకు గురౌతుందో చెప్పిన స్వీయానుభవ కవిత ఇది.

'నిజమేదో, కానిదేదో' కవితలో స్త్రీ లైంగికంగానూ, శారీరకంగానూ ఎలా దోపిడి చేయబడుతున్నదో తెలుపుతోంది.

" ఇది వరకూ నేనొక దేహాన్ని మాత్రమే
ఇప్పుడూ అంతే
కాకపోతే
నాది కాని సంతకాన్ని మోస్తున్న దేహాన్ని

నాది కాని వ్యక్తిత్వాన్ని మోస్తున్న సంతకాన్ని
నెత్తురంటని సిరాచుక్కల మధ్య
నా ప్రతి అక్షరం ఓ టెస్ట్‌ట్యూబ్ బేబీ
ఇప్పుడు
నా శిశువుకు గర్భంలోనే
వ్యభిచార వ్యూహాలు నేర్పుతున్నాను
మగవాడి అక్షర కౌగిళ్ళలో నలుగుతూ
శిరసొంచే సిగ్గులేని సంతకాన్ని నేర్పుతున్నాను."[81]

అంటూ ఈ సమాజంలో స్త్రీల మాతృత్వంపై కూడా దోపిడి చేయబడుతోంది. కొంతమంది స్త్రీలు తమ గర్భాన్ని అద్దెకు ఇవ్వడం, అలాగే సంతానం కలగని దంపతులలో స్త్రీకి టెస్ట్‌ట్యూబ్ ద్వారా సంతానం కలిగేటుట్లు చేసే అధునాతన వైద్య సదుపాయాలున్నాయి. వీటన్నింటిని చక్కగా వ్యక్తీకరించారు.

'సంకెళ్ళ గణితం' కవితలో ఈ సమాజం స్త్రీలను తరతరాల నుండి బంధీలుగా చేసిందో దానిని తెలుపుతున్నది.

" నా చుట్టూరా నిల్చున్న ఊచల్ని
లెక్కిస్తూనే వున్నాను
పాత లెక్కే
ఎక్కడి నుండి మొదలెట్టానో
అక్కడికే వస్తున్నాను తప్ప
లెక్క తేలటం లేదు
రేపు నా చిట్టితల్లికైనా
ఈ లెక్క గొడవ తప్పేనా?"[82]

అంటూ ఒక స్త్రీపై అణచివేతను వ్యక్తం చేసింది. ఈ సమాజం స్త్రీని ఎంతకాలం బంధిస్తుంది. ఆమె ఆలోచనలకు, స్వేచ్ఛకు, వ్యక్తిత్వానికి విలువ ఇచ్చి ఆమెను విముక్తం చేయాలి. కవయిత్రి స్త్రీ పై అణచి వేతను అంకెల గణితంలో నుంచి ఆలోచించి ఈ ఊచల్ని, సంకెళ్లను తెంచాలని రేపటి భవిష్యత్ తరాన్ని కాపాడాలని భోదించింది. 'నేను కనిపించే పదం' కవితలో ఆడపిల్లల బాల్య జీవితం ఏవిధంగా అణచివేయబడుతుందో తెలుపుతూ స్త్రీ అస్తిత్వంపై అద్భుతమైన కవిత ఇది.

" అందమైన బాల్యం
నా కెప్పుడూ అందని చందమామే!

నా లోకానికి ఎల్లలేమిటని నువ్వడిగినప్పుడు

నాకు గోడలు తప్ప యింకేమి కన్పించలేదు

నా భాషకు నిఘంటువు ఏమిటని

నువ్వడిగినపుడు

నాకు వెక్కిళ్లు తప్ప యింకేమి విన్పించ లేదు

అమ్మ పొత్తిళ్ళలోని వెచ్చదనం

ఎప్పటికీ తెలియని దాన్ని

అనుమానాల ముళ్ల చూపులతో

వొళ్లంతా ముక్కలైన దాన్ని

చిరునవ్వులకు కూడా లింగభేదం వుందని

ఊయల్లోనే తెలుసుకున్న దాన్ని

నా ఆటపాటల్లో, నా మాటల్లో, చేష్టల్లో

ప్రతి క్షణం, ప్రతి కదలికా

నేను 'ఆడ' పిల్లనేనని

ప్రతిసారీ అందరూ గుర్తు చేస్తూనే వున్నారుగా" [83]

అంటూ ఈ సమాజంలోనూ, కుటుంబాలలోనూ ఆడపిల్లల అస్తిత్వం ఏ విధంగా కనుమరుగవునో చాలా చక్కగా చిత్రించింది. స్త్రీల అస్తిత్వాన్ని రూపు మాపేందుకు పితృస్వామ్యం చేసే రాక్షస ప్రయత్నాల క్రమంలో ఆడపిల్లల బాల్యం ఏ విధంగా మాయమైపోతుందో కవిత్వీకరించింది. పసి ఆడపిల్లలపై కామంతో చూసే వారిపై ఈ కవిత,

" నవ్వొస్తుంది

చిదిమితే

పాల్గారే బుగ్గలపై ముద్దుల్ని తలుచుకుంటే

ముళ్ళ చూపులే తప్ప

ముద్దుల భాష నాకేం తెలుసు?"[84]

అంటూ చిన్న ఆడపిల్లలపై కూడా అఘాయిత్యాలు జరిగే ఈ సమాజంలో అలాంటి కామోద్రేకుల చేష్టలు ఎవరికి తెలుసునని కవయిత్రి చెప్పింది. ఇంకా స్త్రీని గుర్తించి వారికి స్వేచ్ఛను ఇవ్వండని కవయిత్రి చెప్పిన కవిత ఇది.

“ నవ్వొస్తుంది

మీరు కవితలై పదాలై పాడుతుంటే

మగ నిఘంటువుల తెరచాటుగా

నిస్సహాయంగా చూస్తూ వుంటే

కవిత్వమో కథలో కావ్యాల్లో వద్దు

నాకొక పదాన్నివ్వండి

ఊయల ఊహల నుంచి

యౌవన స్వప్నాల వరకూ

యౌవన స్వప్నాల నుంచి వృద్ధాప్యపు

చివరంచు వరకూ

నన్ను ‘ఆడ’ పిల్లగా చూడలేని

ఒకే ఒక్క పదాన్నివ్వండి చాలు” [85]

అంటూ స్త్రీలను గౌరవించి వారిని గుర్తించాలని చెప్పిన సందర్భం ఇది. సమాజంలో మహిళల పాత్ర అద్వితీయమైనది. కుటుంబంలోనూ, సమాజంలోనూ వారి పాత్ర చాలా కీలకమైనది. స్త్రీ లేనిదే సృష్టి నడవదు అని అంటారు. మహిళల పనులు వారి సేవలు విలువకట్టలేని అమూల్యమైనవి. ఒక మహిళ కుటుంబలో తల్లిగానూ, భార్యగానూ, అక్కగానూ, చెల్లిగానూ నడుచుకొంటూ ఇంకా ఎన్నో రకాల పాత్రల్ని పోషిస్తూ విశిష్టమైన సేవలు చేస్తుంది. సమాజంలోని అన్ని రంగాలలోనూ మహిళలు విజయవంతమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. కాబట్టి కవయిత్రి మహిళలను గౌరవించి వారి వ్యక్తిత్వానికి, ఆలోచనలకు, స్వేచ్ఛకు భంగం కలగకుండా ఉన్నత స్థానం ఇవ్వాలని వ్యక్తీకరించింది.

పుట్టపర్తి నాగపద్మిని ‘ఎన్నడు’ అనే కవితలో ఆడపిల్లల నుంచి మొదలుకొని మహిళల వృద్ధాప్యం వరకు లైంగింకంగానూ, ప్రేమపరంగానూ ఇతర రకరకాలుగా వారి వేధింపులు, హింసను గూర్చి చిత్రించింది.

“ కసరు మొగ్గలపై

కామ తృష్ణను తీర్చుకునే కసాయి చేతులు

ప్రణయం సాక్షిగా

బేల జీవితాలను

పరలోకాలకు పంపే అమర ప్రేమలు

ఓల్డేజి హెూం సాక్షిగా

అనురాగ రాగాలకు బదులు

అధికార ధిక్కార స్వరాలను ధ్వనించే

స్వార్థ సంతాన జీవులు

అగ్గిపుల్ల సాక్షిగా

కోడళ్ళ కలల గొంతుల్లో

జ్వాలా సంద్రాలను నింపి

రోదనామోదాన్ని పంచుకునే

అత్తింటి పెద్దరికాలు” [86]

అంటూ ఈ సమాజంలో ఆడపిల్లలపైన అఘాయిత్యాలు, ప్రేమించి ప్రియుడి చేతిలో మోసపోయి చంపబడ్డ స్త్రీలు, అత్తారింటిలో వేధింపులకు బలైన వారు, కుటుంబంలో నిరాదరణకు గురైనవారు ఇలా ఎందరో స్త్రీలు వివిధ రకాలుగా వారిపైన దోపిడీలు, హింసలు జరుగుతున్నాయని రచయిత్రి వ్యక్తం చేసింది. ‘ఆమె’ అనే కవితలో పసుపులేటి పద్మావతమ్మ వరకట్న విషయంలో స్త్రీల ఆలోచన విధానాన్ని తెలుపుతోంది.

“ కన్యగా వరకట్నం పెళ్ళొద్దని

ప్రతిజ్ఞ చేసి

తల్లిగా కట్నం అడిగిన వారిని

దుమ్మెత్తి పోసి

అత్తగా కట్నం ఖచ్చితంగా

వసూలు చేసి

ఆడబిడ్డగా లాంఛనాలు

ఇచ్చేలా చూసి

ఆమె ఈ దేశంలో

ఆమెకు ఆమె

సమస్యగా మిగిలి పోతుంది”[87]

అంటూ సమాజంలో వరకట్న సమస్య ఒకటి. వరకట్న విషయంపై వివిధ సందర్భాలలో మహిళ వివిధ కుటుంబ బాధ్యతలలో ఆమె ఆలోచనా తీరును రచయిత్రి ప్రశ్నించింది.

గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ ‘రాయి నవ్వుతోంది’ కవితలో వివిధ టి.వి. చానళ్ల వ్యాపార ప్రకటనలలో మహిళలను ఎన్ని రకాలుగా ఏ విధంగా చూపిస్తున్నారో కవి తెలుపుతున్నాడు.

" ఆమె నిగనిగల పలువరుస, చిరునవ్వుకు కాదు,

టూత్ బ్రష్-కం-పేస్ట్ అమ్మకం కోసం

ఆమె అందం పూర్తిగా ఆమెకు కనబడదు

డ్రెస్సింగ్ టేబుల్ అద్దం ముందు

పెదవులొక ఛానల్లో

తలనొక ఛానల్లో

జడనొక ఛానల్లో

మెడనొక ఛానల్లో

వేళ్ళొక ఛానల్లో

ఛానళ్ళు మార్చి మార్చి

చూసుకోవాలి టి.వి. ముందు"[88]

అంటూ టి.వి.లలో వ్యాపార ప్రకటనలలో స్త్రీ సౌందర్య ఉత్పత్తులు అలాగే ఇతర ఉత్పత్తుల పబ్లిసిటీ కోసం స్త్రీలచే ప్రకటనలు చేయించి చూపిస్తారు. అలాగే,

" ఆమె నడకల్నీ...నడుమునీ...

నవ్వుల్నీ...నాట్యాల్నీ...

మాటల్నీ...పాటల్నీ...

ముద్దుల్నీ...మురిపాల్నీ...

ఆలింగనాల్నీ...అభ్యంగన స్నానాల్నీ...

బిట్టుబిట్టుగా యాడ్ ఏజెన్సీల్లో...

ఎపిసోడ్స్‌లో...ఎన్నెన్నో చిత్రాల్లో...

అమ్ముకుంటుంది! కరెన్సీ

నోట్లుగా మార్చుకుంటుంది!"[89]

అంటూ నేటి సినిమాలు, టి.వి.లలోనూ హీరోయిన్‌ల వేషధారణ, వస్త్రధారణ, ఇతర రకాల ప్రవర్తనలు లాంటి అంశాలను కవితగా చిత్రించాడు. సినిమా వ్యాపార లాభార్జనలో స్త్రీల సంప్రదాయాలు, కట్టుబాట్లు, వస్త్రధారణలు నేటి సినిమాలలో అంతరించి పోయే దశకు చేరుకొన్నాయి.

### 3.2.10 దళితులు:

జూపల్లి ప్రేంచంద్ 'సర్పపంజరం' కవితలో మనువాద బ్రాహ్మణీయ భావజాలం దళితులపై చూపించిన

వివక్షను తెల్పాడు.

" మంత్రోచ్ఛారణ చేశాను–నాలుక తెగ్గోశారు
మంత్ర శ్రవణం చేశాను–చెవిలో కరిగించిన సీసం పోశారు
తలక్రిందులుగా తపస్సుకు ఉపక్రమించాను
ఖండ ఖండాలుగా ఖండించారు"[90]

అంటూ దళితులపై జరిగిన దాడిని కవి ఖండిస్తూ చిత్రించిన కవిత ఇది. సమాజం నుంచి దళితులను వెలివేసి అంటరాని వారిగా ముద్రవేసి వారిపై ఎన్నో రకాల దాడులు చేశారు. మంత్రాలు చదివినందుకు, ఆ మంత్రాలు విన్నందుకు, తపస్సులు చేసినందుకు దళితులపై ఎలాంటి దాడులు జరిగాయో పై కవిత ద్వారా తెలుస్తుంది. దళితులు మంత్రాలు చదవడానికి అర్హులు కారని వారిని సంఘం నుంచి బహిష్కరించిన సంఘటనలను తెలిపే కవిత ఇది.

యక్కలూరి శ్రీరాములు 'అడుగడుగునా...కారంచేడు' అనే కవితలో చుండూరు, కారంచేడు, పందిరి కుప్పం లాంటి ప్రాంతాల్లో దళితులపై దాడులను ఖండిస్తూ ప్రతిస్పందించి అగ్రవర్ణాలవాళ్ళు దళితులపై కక్షలు గట్టి వారిని హీనంగా చూసే స్వభావాన్ని చిత్రించాడు.

" పంచన బతకాల్సిన వాడు
పంచ కడుతున్నాడని, కసి
నించుని కునుకు తీసే వాడు
మంచాలపై నిదురిస్తున్నాడని, కసి
నేలపై కూలబడే వాడు
కుర్చీలో కూర్చుంటున్నాడని, కసి
గాలికి బతకాల్సినోడు
గాలిలోకి మేడలు లేపుతాడేమోనని కసి
కూలికి రావాల్సినోడు
నేలను దున్నుకుంటున్నాడన్న కసి
పాలేరు సంతతి
పాఠాలు నేర్చుకుంటున్నాడన్న కసి
తలవంచి బతకాల్సినోడు
తల ఎత్తి బతుకుతున్నాడన్న కసి

మనిషిని, మనిషిగా చూడాలంటేనే...కసి"[91]

అంటూ కారంచేదు గ్రామ దళితులపై అగ్ర కులస్థులు, భూస్వామ్యవాదులు పెంచుకున్న కసిని చిత్రించాడు. పై కవిత చదివిన తర్వాత దళితులను ఎన్ని రకాలుగా ఏ ఏ విధాలుగా పైకి ఎదగకుండా అణిచివేయాలనుకుంటున్నారో భూస్వామ్య అగ్రకులస్థుల ఆధిపత్య అహంకార ధోరణి కనిపిస్తుంది. సాటి మనిషిని మనిషిగా గుర్తించక దళితులపై దోపిడీలు, దౌర్జన్యాలు, హింసలు చేస్తున్నారు.

బిక్కి కృష్ణ 'చెప్పులు తిరగబడ్డాయి' కవితలో దళితుల వేదనను చిత్రించాడు.

" మనుషులను బానిసలుగా మార్చి
బానిసలచే పశువుల తోలు వొలిపించి
మీ పాదాలు కంది పోకుండా చెప్పులు కుట్టించుకున్నారు
ఆ చెప్పులను అంటరాని వంటారేమిటి?
ముళ్ళు మీ పాదాలను గ్రుచ్చుకోరాదని
రాళ్ళు మీ పాదాలకు రాపాడరాదని
మల మూత్రాలు మీ పాదాలను తాకరాదని
పులగా పుట్రా మీ పాదాలను కాటేయరాదని
భూమికి మీ పాదాలకు మధ్య ములికల వంతెనపై
నిరంతరం నలిగి పోయింది చెప్పులే గదా!"[92]

అంటూ కవి దళితుల కులవృత్తి నేపథ్యంలోంచి వారి ఆవేదనను కవిత్వీకరించాడు. దళితులు కుట్టిన చెప్పులను సమాజంలో అందరూ ధరిస్తారు. చెప్పులు అంటరానివి కాలేనప్పుడు దళితులు అంటరాని వాళ్లు ఎట్లా అవుతారు అని దళితుల ఆత్మలలోంచి పలికించిన కవిత.

నాగప్పగారి సుందర రాజు 'మాదిగోళ్ళ బోరింగు' అనే కవితలో మాదిగ జాతిని అవమానిస్తున్న తీరును చెబుతున్నాడు.

" పెద్దింటిదానా! నిన్నెవడు చేసుకుంటాడే
బ్యాగారోడు అన్నప్పుడే
బతక రాదు అనుకున్నాను
అప్పటికి కాని నాకు అర్థం కాలేదు
ఈ దేశంలో నేను మనిషిని కానని..
అంటరానితనం ఆఖరి రూపం నేనే" [93]

అంటూ దళిత స్త్రీ ఆత్మవేదన ఇది. మాదిగ కులంలోని స్త్రీల పరిస్థితి చాలా దారుణమైనది. కులాలన్నింటికీ మాదిగ కులం తక్కువ అయితే ఆ కులంలోని స్త్రీల స్థితి వారి సమస్యలు ఎవరికీ తెలియవు.

'పెద్దింటి పిల్ల' అనే కవితలో దళితుల్లోని మాల మాదిగల కులాల మధ్య భేదాలను ఎత్తి చూపాడు.

" ఎవరు పెద్దమనిషి అయినా
పాడేకి నన్నే పిలుచుకుపోయే వాళ్ళు
నేను పెద్ద మనిషి అయినప్పుడు ఎవరు రాలేదు
ఆఖరికి మాల రామన్న బిడ్డ
వస్తుందనుకున్నాను
మాలోళ్ళు కూడా మాకంటే పెద్దోళ్ళేనంట
మాదిగ్గేర్లోకి ఎవరూ రాలేదు
నన్నేమో అందరూ వాడుకున్నారు
నేను పెద్ద మనిషినై కూసుంటే
యాయమ్మా రాలేదు
చూసేకి మావాళ్ళు దండిగుండారు
ఆరున్నర సుతిలో ఎత్తుకున్నారు
నా పాట నేనే పాడుకుంటా
మాదిగ పాటను మధురంగా పాడుకుంటా!" [94]

అని చెప్పడం ద్వారా దళిత కులమైన మాలలకు కూడా మాదిగలు తక్కువ కులం అన్న భావన ఉందని తెలుస్తోంది. 'రాయలసీమలో రంగు పడుద్ది' కవితలో దళితులపై జరిగిన దాడులను చెబుతూ సీమ అస్తిత్వాన్ని చాటుతున్నాడు.

" సందేహం ఎందుకు
నేను తల ఎత్తనంత వరకు
మీ తోలుబొమ్మ ఆటకు తిరుగులేదు
రాలిపడ్డ కారంచేడు తలకాయలు
చెడిపోని చుండూరు నరమాంసం
నాకిప్పుడిప్పుడే మాటలు నేర్పుతున్నాయి
ఫ్యాక్షనిస్టుల పిడికిళ్ళలో రాయలసీమ

మీకు తెలిసింది అంతే

మోకాళ్ళతో నడిచిన 'మొలగవల్లి'

పక్కటెముకలు పీకేసుకున్న 'పెరవలి'

తలపాగలు తీసేసిన 'సందోలి'

మాట్లాడ లేని 'మద్దికెర'– ఆదో 'మయసభ' "[95]

అంటూ రాయలసీమ అంటేనే ఫ్యాక్షనిజం, కరువు మాత్రమే కాదు ఈ ప్రాంతంలో దళితుల ఊచకోతలు, సజీవ దహనాలు, కన్నీటి జీవితాలు, అంటరాని వేదనలు లాంటివి ఎవరికీ తెలియని వాస్తవాలు వున్నాయని చెబుతున్నాడు. చుండూరు, కారంచేడు, పాదిరి కుప్పం లాంటి ప్రాంతాల్లో అగ్రవర్ణ భూస్వాములు దళితుల పై దాడిచేసి సజీవ దహనాలు చేయడం మిగతా ప్రాంతాలలో దళితుల మీద అత్యాచార సంఘటనలు లాంటివి ఎన్నో కనిపిస్తాయని కవి వాటిని చూపించాడు.

'మాదిగోళ్ళ బోరింగు' అనే కవితలో దళిత స్త్రీల ప్రేమ విషయాన్ని చెబుతున్నాడు.

" బూ ప్రెపంచమంతా జరిగిందేనప్పు!

ఈ మాదిగ దాన్ని మోహించినోడే కాని

మనువాడినోడు లేడాయె!

కాలమైపోయినా చావు కదలిరాదు

నాకు తెలుసు

నేను సూపరమ్మను కాను

మీ చూపునకు అందని దాన్ని కాను

అయినా

నా గురించి మాట్లాడాలంటేనే

అగులు బుగులు అవుతుంది!"[96]

అంటూ ఈ సమాజంలో దళిత స్త్రీలు ప్రేమ వ్యవహారాల్లోనూ, లైంగికంగానూ ఎంత దోపిడీ చేయబడు తున్నారో కవి చిత్రించాడు. ప్రేమ పూర్వకంగానూ, ఇష్ట పూర్వకంగాను దళిత స్త్రీలు పురుషులను నమ్మి, మోసపోయి, దగాపడ్డ వారి బతుకులు గూర్చి కవిత తెలుపుతుంది.

'రాయలసీమలో రంగుపడుద్ది' కవితలో కవి తన ఆలోచనల్ని బాణాలుగా సంధించాడు.

" పిక్క మీద ఎంటికను పీకలేని ప్రతి గాడిద కొడుకు

నేనొక పాళెగాణ్ణి అనుకుంటాడు – ఇక్కడ

..........................................

వెయ్యేళ్లు వెనుకున్న రత్నాల సీమను

మూడడుగులు ముందుకు నడిపించడానికి

నూరేళ్లు తోలు తెట్టను వదులుకుంటాను

కంటిలో నలుసే కాదు

కాళ్ళో ముల్లను కూడా గుర్తు పట్టాను

కూలిపోతున్న ఎర్రకోటనే కాదు

కుంటుపడిన తెల్లపులిని చూస్తున్నాను

అరచేతిలోని గీతలే కాదు

వెన్నముకలోని పూస కూడా నాకు కనిపిస్తుంది

చెప్పులు కుట్టిన చేత్తో చరిత్ర రాస్తా

అవమానింపబడ్డ అరికాళ్ళకు అధికారమిస్తా!"[97]

అంటూ తెలుగు రాష్ట్రంలో రాయలసీమ కొందరి నాయకులు, పాలకుల వల్ల అభివృద్ధికి నోచుకోలేక పోయిందో, ఎవరి నిర్లక్ష్యం వల్ల ఈ ప్రాంతం వెనుకబడి పోతుందో కవి ఆలోచించి అటువంటి వారిపై కవి ఒక దళితుడుగా దగా పడ్డ సీమబిడ్డగా తన అభిప్రాయాలను కవిత్వ వేదిక ద్వారా వ్యక్తీకరించాడు. 'డప్పు కొట్టిన చేత్తో డొక్క చీలుస్తా!' అనే కవితలో కవి తాను విశ్వవిద్యాలయంలో చదువుకునే రోజుల్లో పాఠాలను బోధించే అధ్యాపకుల దగ్గర అవమానాల్ని ఎదుర్కొని స్వీయానుభవంలోంచి చెప్పిన కవిత ఇది.

" చంఢాల జీవితాలను

చెండాడుతున్న – 'శ్రీహరి'ని నేను

శూద్రుల శిరస్సులను

శూలానికి గుచ్చుకుని

శివాలయం ముందు

నాట్యం చేసే – 'వీరభద్రుడు' నేను

దళిత చైతన్యానికి

దహన సంస్కారం చేసే

'ద్రోణాచార్యుడు' – నేను

వర్గ విభజనకై మార్గమధ్యన

'అర్ధనారీశ్వరుడి'ని – అమాంతంగా వాటేసుకుని

ముత్తాతల ముల్ల కంచెపై మల్లెలు చల్లి

'మాతృస్వామ్యాన్ని' మానభంగం చేసిన

'ఆర్య సంస్కృతి' నేను

'సవ్యసాచి' సామర్థ్యాన్ని

సకల లోకాలకు చేరవేసే

'శిఖండి' ని నేను – రథ సారథిని నేనే!"[98]

అంటూ తరతరాలుగా అనాదిగా ఈ దేశంలో దళితులు ఎన్ని అవమానాలు పడ్డారో ఎంత క్షోభ, ఆత్మ న్యూనతను అనుభవించారో కుల వివక్షత ఎంతగా ఎదుర్కొన్నారో ఒక దళిత విద్యార్థిగా చదువు చెప్పే అధ్యాపకుల నుంచి కుల వివక్షను ఎదుర్కొని 'దేశద్రోహి'వి నీవు అని అనిపించుకొని ఆ అవమానంలోంచి వ్యక్తీకరించిన కవిత ఇది. అందుకే ఈ దేశ ఆర్య సంస్కృతి మీద, బ్రాహ్మణవాద భావజాలం మీద కవితను ఎక్కి పెట్టి ప్రళయకాల రుద్రుడిలా శివమెత్తాడు. ఇంకా ఇలా అంటాడు.

" నా చేతిలో ఉన్నది 'రంపె'

నా చూపులో ఉన్నది 'ఆరె'

ఒరేయ్!.............

పదును గురించి ప్రశ్నించావా!?!

నా పిక్క సత్తువ చూపిస్తా

పచ్చి నెత్తురు తాగేస్తా!" [99]

అంటూ దళిత వివక్షతకు గురికాబడిన వ్యక్తి ఆ తర్వాత కవిగా తన జాతికి ప్రతినిధిగా నిలిచి కుల వివక్షతకు సమాధానమయ్యాడు.

ఆశావాది ప్రకాశరావు 'అంతరంగ తరంగాలు' అనే కవితా సంపుటిలో దళితులపై ఈ సమాజం చూపే అంటరానితనాన్ని ఎత్తి చూపుతున్నాడు.

" మా నోళ్ళు నొక్కేసి మమ్మల్ని అస్పృశ్యులు గానే చూశావు

మా కుత్తుకల్ని నులిమేసి మమ్మల్ని మూగవాళ్ళని చేశావు

మా కాళ్ళు చేతులు నరికి మమ్మల్ని సజీవ దహనం చేశావు" [100]

అంటూ తరతరాలుగా దళితులను అస్పృశ్యులుగానే చూసి సమాజం నుంచి వెలివేసి కులం పేరుతో దాడులు, సజీవ దహనాలు చేశారని కవి విలపిస్తున్నాడు. దళితులలో వచ్చిన చైతన్యాన్ని వారు ప్రతిఘటించి

ఎదురించే స్వభావాన్ని తెల్పుతున్నాడు.

" మాకు తోలు ఒలిచే సునిశిత జ్ఞానం వుంది
మాకు ఎముకల్ని కంకర కొట్టే నైపుణ్యం వుంది
మీ ప్రేవుల్ని లెక్క పెట్టే వైనం మాకు తెలుసు" [101]

అంటూ తమపై దోపిడీ, దౌర్జన్యాలు చేసే వారిని తోలు తీస్తామని కవి హెచ్చరిస్తున్నాడు.

### 3.2.11. కులవృత్తులు:

#### 3.2.11.1. చేనేత కార్మికులు:

టి.రాజారం 'అతడే' అనే కవితలో మగ్గం నేసే కార్మికుని నేత విధానాన్ని కళాత్మకంగా తెలియజేస్తున్నాడు.

" మగ్గం గుంతలో కాళ్ళుపెట్టి
తొక్కుడు చెక్కల్ని
వాటంగా నొక్కుతూ
కుడిచేత్తో కుచ్చును లాగుతూ
ఇంకో చేత్తో పలకను ఆడిస్తూ
ఈ వారకు ఆ వారకు
లయబద్ధంగా పరుగులు తీసే
కొమ్ము చప్పుళ్ళకీ అనుగుణంగా
తలను కదుపుతూ వుండే
అతడిని చూస్తే
పౌరాణిక నాటక పద్యాల్ని
రాగయుక్తంగా నేర్పే
అపురూప హార్మోనిస్ట్
కళాకారుడే గుర్తుకొస్తాడు"[102]

అంటూ చేనేత కార్మికుడు మగ్గం నేసేటప్పుడు వారి పనిని, శ్రమను తెలియజేస్తున్నాడు.

రాధేయ గారి 'మగ్గంబతుకు' చేనేత కార్మికుల జీవితాలు వారి సాధక బాధకాలను చిత్రించిన యాధార్థ కావ్యం. అందులో తరతరాలుగా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగించే కుటుంబాల జీవితాలను చిత్రించాడు.

" తరతరాల్నుంచీ నమ్ముకున్న వృత్తి
తాతల తండ్రుల వారసత్వ వృత్తి
కాళ్ళొచ్చిన పిల్లాడు మొదులుకొని
పళ్ళూడిన ముసలయ్య దాకా
ఈ బతుకు కష్టంలో
అందరూ సమిష్టి కూలీలే
గజం గుడ్డముక్క సైతం
ఇంటిల్లిపాదీ శ్రమ ఫలితం
మబ్బులు ముసిరితే
మగ్గం ఆడదు మగ్గం ఆడకపోతే
బతుకు సాగదు!
రేయింబవళ్ళు రెక్కాడినా
షావుకారు అప్పుతీరదు
ఎదిగిన ఆడపిల్లకు పెళ్ళి కుదరదు!
ఆకలి పేగుల్ని కొరికేస్తున్నా
చూపుకూ, చేతికీ దారం అందదు
పోగుకూ, పోగుకూ మధ్య పొత్తు పొసగదు
గుండెకూ, కండెకూ జత కుదరదు!
పేదరికం కుమ్మరి పురుగై తొలిచేస్తున్నా
ఉండలుగా బిగిసిన తమ నరాల్ని
కండెలుగా వడుకుతున్నారు
పేగుల్లో మెలికలు తిరిగిపోతున్న ఆకలిని
పొగులుగా అతికేసుకుంటున్నారు"[103]

అంటూ చేనేత కుటుంబాల జీవిత గాథల్ని చిత్రించాడు. తరతరాలుగా వృత్తిని నమ్ముకున్నా ఒడ్డుకు చేరని బతుకు కష్టాలు, కడగండ్లు, పిల్లల పెళ్ళిళ్ళూ, చీరలు నేయడంలో గల ఇబ్బందులు, పేదరికం లాంటి సమస్యల్ని, వారి బతుకు వ్యథల్ని కవి చిత్రించాడు.

" కళ్ళు మసక బారినా
కన్నీళ్ళు మాత్రం తప్పవు
కాలు సేతులు చచ్చుబడినా
రేషం తోడడం తప్పదు
బాలింతకైనా చూలింతకైనా
బోట్లు చుట్టడం తప్పలేదు!
పెళ్ళీడు కొచ్చిన ఆడపిల్లైనా
వయసొచ్చిన యువకుడైనా
పెళ్ళికి అర్హత మగ్గం నేర్వడమే"[104]

అంటూ చేనేత కుటుంబంలో ప్రతి ఒక్కరి పనిని, వారి బాధ్యతను కవి చిత్రించాడు. చీరలు నేయడంలో గల శారీరక శ్రమను చెబుతూ,

" నడుంలోతు గుంతలో
నీరసంగా దిగబడి పోయి
శక్తినంతా కూడ దీసుకొని
మా అమ్మ పావు కోళ్ళను తొక్కుతుంటే
ఓ అనార్కలి ఆకలి గీతం
ఆ పాదాల చుట్టూ ప్రదిక్షణలు చెయ్యడం
నేను చూశాను!
లాకల మధ్య బందీ అయిన
పడుగూ పేకల్నీ చిక్కుతీసి, సాపు చేస్తూ
సుతారంగా కదిలే
ఆ చేతి వేళ్ళ నైపుణ్యానికి
తాజ్‌మహల్ సౌందర్యమే
తలవంచే దృశ్యాన్ని
నేను చూశాను"[105]

అంటూ చీరను నేయాలంటే అందులో ఎంత శ్రమ వుంది, ఎంత ఓర్పు వుండాలి. గుంతలోకి దిగి పావుకోళ్ళు తొక్కుతూ చేతులను కదలాడిస్తూ మధ్య మధ్యలో చీరపు పోగుల్ని అతక బెట్టుతూ ఎంతో

ఓర్పు ,నైపుణ్యం వుండాలి.

“ మీ సిల్క్ బట్టల తళతళలు
ఖద్దరు జుబ్బాల రెపరెపలూ
మీ మూతిని తుడిచే తుండు గుడ్డా
మా శ్రమ ఫలితమే గదా!
వలువల విలువలతో
దేశదేశాల మానాభిమానాలు కప్పుతున్నా
ఈ దేశం మాకేమిచ్చింది!
కడుపునిండా ఆకలి
కళ్ళనిండా చీకటే గదా!”[106]

అంటూ చేనేత కుటుంబాలు ఎంత కష్టపడినా లాభముండదు, అలాగే ప్రభుత్వాలు కూడా ఈ చేనేత రంగాన్ని పట్టించుకోవడం లేదు.

### 3.2.11.2 విశ్వకర్మ:

టి.రాజారాం ‘అతడే’ అనే కవితలో విశ్వకర్మ కుటుంబాల వృత్తి కష్టాలను, వారి పని నైపుణ్యాన్ని చిత్రించాడు.

“ మండే కొలిమి ముందు గొంతు కూర్చొని
ఆరిపోతున్న బొగ్గుల్ని గొంతు గొట్టంతో
ఊపిరి ఆగేలా ఊదీ…ఊదీ
ఊరి ఊరికంతా ఊడిగం
చేసిన విశ్వకర్మ అతడు
………………………
అప్పుడే పుట్టిన బిడ్డ బొడ్డు కోసే కత్తి
చర్మాన్ని సాపు చేసే గూటం
చెప్పులు చేసే ఆరే
చిన్నారులకు తడబడే
అడుగుల నడకను నేర్పే బండి
అమ్మ జోల పాటకు నేపథ్య సంగీతమై
వూగే ఊయల

కర్రని కోసే అంపం

కట్టెల్నీ గొంతుల్లో చీల్చే గొడ్డలి

మట్టి పొరల సారాన్ని అన్నంగా పిండే నాగలి

అలసిన దేహాల్ని ఆప్యాయంగా

ఆలింగనం చేసుకుండే మంచం

చివరకు అన్నం తినే కంచం

ఆఖరి శ్వాస అనంతరం

అంతిమ మజిలీని నిర్మించే

పార...పికాసి...గునపం

అన్నీ...ఇవన్నీ సలాకను పట్టుకున్న

అతని చేతుల శ్రమ సృజించిన

అత్యంతాద్భుత అవ్యక్తానుభూత

ఐతిహాసికాలు" [107]

అంటూ విశ్వకర్మల కుటుంబ జీవితాలు, వారు తయారు చేసే వివిధ రకాల వస్తువులు, పనిముట్లు, వారి శ్రమ నైపుణ్యాలను కవి తెల్పాడు.

### 3.2.11.3 కుమ్మరి:

పాలవాయి రాధిక 'కుమ్మరి' అనే కవితలో వారి జీవితాలను చెబుతూ,

" కుమ్మరి జీవిత చక్రం ఆగిపోబోతుంది

కొత్త బతుకు తెరువు కోసం వెదుకులాట

.............................................

బతుకు భారమై

పేదవాడి ఫ్రిజ్ చతికిల పడిపోతుంది

.........................................

మట్టిని నమ్మిన మట్టికళ

జీవితాలపై మట్టిని కొట్టి

జీవనోపాధిని వెదుక్కునేలా చేస్తోందేమో

నవ నాగరికత తిరగరాసినా

నవ్యత మిన్నంటినా

కుమ్మరి చక్రం తిరుగుతూనే ఉండాలి

కాలచక్రం నిరంతరం

కొనసాగినంత వరకూ

హిమానీ నదీ ప్రవాహంలా"[108]

కుమ్మరి వృత్తి అంతరించిపోయే దశకు చేరుకొంది. సమాజంలో వచ్చిన మార్పులు, పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానం వల్లనూ కుమ్మరి వారు తయారు చేసే వస్తువులకు డిమాండ్ పడిపోయింది.

జి.వెంకటకృష్ణ 'మొదటిపాఠం' కవితలో కుమ్మరి కుటుంబాలతో గల పరిచయాన్ని, ఆ నేపథ్యాన్ని, తన అనుభవాన్ని కవితగా మలిచాడు.

" నా మొదటి స్నేహం కుమ్మరితో

సారె తిప్పేవాడి మట్టి చేతులతో

మట్టి పిసికి గుండ్రంగా చేసే ప్రతిభతో

నా మొదటి అనుభవం

సారెతో పాటు నా కళ్ళూ తిరగడం

సారె మీద నేనే బంకమన్నై

కుండగా మారడం

గిరగిర తిరిగే చక్రం

యిప్పటికీ నా సంభ్రమం

కుమ్మరి చెక్రమై

బండి చెక్రమై

బావి గిలకై

నేత రాట్నమై

గానుగ రోలై

వూరి బతుకును తిప్పే

వివిద నైపుణ్యాల చుట్టూ

తిరగడం ఒక వ్యసనం"[109]

అంటూ కవి కుమ్మరి వారు పని చేసేటప్పుడు పని విధానాన్ని, పని నైపుణ్యాన్ని, ఆ శ్రమను స్వయంగా

చూసి అనుభూతికిలోనై వ్యక్తీకరించిన కవిత ఇది.

టి.రాజారాం 'అతడే' అనే కవితలో కుమ్మరి పనిలోని శ్రమను తెల్పిన విధానం చూడండి.

" మట్టి తొక్కుతూ వుంటే
సారె తిప్పుతూ వుంటే
కమ్మెచ్చు తీసిన ఉక్కుముక్కలా వున్న
అతడి వొంటి కండరాల కదలికలో
వొక లయాత్మక సౌందర్యం
తొణికిస లాడుతుంది
అయిరేణి కుండైనా...బోనం బానైనా
దీపం పెట్టే ప్రమిదే అయినా
చితి చుట్టూ తిరిగే చిల్లు కడవే అయినా
పాడెముందు నడిచే నిప్పుల కుండే అయినా
అవి అప్పుడు అతడి ఆకలిని తీర్చాయి
పెళ్ళి చావు పుట్టుకల్లో అవి
అతడిని వొక సంస్కృతీ ప్రతీకను చేశాయి"[110]

కుమ్మరి వాళ్ళు మట్టిని తీసి నీటితో తడిపి కాళ్ళతో తొక్కుతూ సారె తిప్పుతూ వివిధ రకాల కుండలు, మట్టి దీపాలు, ఇంకా ఎన్నో రకాల ఆకృతుల వస్తువులను తయారు చేస్తారు. ఒక సమాజ సంస్కృతికి కుమ్మరి పనితనం ప్రతీకగా నిలిచింది.

### 3.2.11.4 యాదవులు:

జి.వెంకట కృష్ణ 'పల్లెటూరి పాటగాణ్ణి' అనే కవితలో గొర్రెల్ని కాసే కాపరుల జీవితాలను, వారి ప్రయాణాన్ని చిత్రించిన విధానం చూడండి.

" గొర్ల మందలతో మనం
కలుద్దాం – రా మరి!
నీ లౌక్య ప్రపంచాన్ని వదలి
కుటిల కుత్సిత కుట్రల
వార్తా ప్రపంచాన్ని మరచి
సిక్కంలో యింత ముద్దా పూరిమిండి

యేసుకొని

బుర్ర సొరకాయలో యిన్ని నీళ్ళు నింపుకొని

భుజాన వొక గొంగలి కప్పుకొని

పుట్టల వెంట గుట్టల వెంట

వెన్నంటి నడిచే మందల

పిల్లనగ్రోవి వూదుతున్న కాపరుల వెంట

సంచారం చేద్దాంరా"[111]

అంటూ కవి గొర్రెల కాపరి జీవితాన్ని చెబుతూ ఈ మాయా మోసపు ప్రపంచాన్ని వదిలి గొర్రెల కాపరితో పాటు మనమూ ప్రయాణం చేద్దామని కవి చెబుతున్నాడు.

### 3.2.11.5 మంగలి:

మధురశ్రీ 'పల్లెమంగలి' కవితలో మంగలి వ్యక్తి జీవితాన్ని చెబుతున్నాడు.

" నీరెండ పడగానే

చంకలో పెట్టెతో పల్లె వైపుకు పరుగుతీస్తాడు

సామాన్యుడి మొదలు పెదకాపు దాకా

వాడి రాకకు ఎదురు చూస్తుంటారు

పెరిగిన జుట్టు, కోత కొచ్చిన గడ్డం

వాడి కత్తికి తలవంచాల్సిందే

అమంగళకరమైన వెంట్రుకలకు కత్తెరేసి

ఏపుగా ఎదిగిన గడ్డాన్ని గీసేందుకు

ముడుచుకు పోయిన బ్రష్షు

సబ్బు గిన్నెలో తిప్పి

నురగ వచ్చేలా రుద్దుతున్నప్పుడు

గుబురు పొదలా పెరిగిన చెంపల మీది వెంట్రుకలు

సముద్రపు పొంగై కనిపించేది

ఒక్కసారి అంతా తీసేసాక

బుగ్గలు ప్రశాంత గోదారి తీరంలా

తళతళ లాడేవి!

పెదాలకు సమానంగా మీసాలను కత్తిరిస్తే
మన్మథుని ప్రతిరూపం దర్శనమిచ్చేది
చలువ రాతి పట్టికతో
గొంతు చుట్టూ కదిపితే చాలు
కత్తిగాట్లన్నీ ఇట్టే మాయమవుతాయి” [112]

అంటూ కవి ఒక మంగలి వాని పనితనాన్ని, అందులోని నైపుణ్యాన్ని తెలుపుతూ మనుషులు కటింగ్, షేవింగ్ లు మంగలి వారి దగ్గర చేయించుకున్న తర్వాత వారు ఎలా కనపడుతారో కవిత్వీకరించాడు.

### 3.2.11.6 మాదిగ వృత్తి:

టి.రాజారాం 'అతడే' అనే కవితలో దళితుల వృత్తి అయిన చెప్పులు కుట్టే వారి జీవితాన్ని చెపుతాడు.

“ పిట్ట నింగిలో ఎగిరినంత అందంగా
అతడు నా భావాల ఆకాశంలోకి
ఎగిరొస్తాడు
అతడు
దరిద్రం లాంటి చండ కిరణాల్లో
నిరంతరం మండుతూ
ఎప్పుడన్నా కురిస్తే వాన చినుకుల
చిటపటల్ని భరిస్తూ
గడ్డకట్టే చల్లో కూడా రక్తాన్ని
ఆవిరి చేస్తూ
శక్తినంతా నరాల దారాల్లోంచి లాగిలాగి
పాదాలకు రక్షణ సుఖాల్నిచ్చే సృష్టికర్త
గోనె పట్టా జింక చర్మం మీద
ఆకలి జపం చేస్తూ పారాడే పాదాల్ని
కళ్ళతో వడకట్టి పలకరిస్తాడు” [113]

అంటూ చెప్పులు కుట్టే వారి దైనందిన జీవితాన్ని తెల్పాడు. రోడ్డు పక్కన కూర్చొని ఎండనక వాననక చలి అనక దుమ్ము ధూళిని లెక్క చేయక తన పనేదో తాను చేసుకు పోయే చెప్పులు కుట్టే వారి జీవిత గాథని కళ్ళకు కట్టినట్లు కవి చూపించాడు. ఇంకా వారి జీవితంలోని మరో కోణంలోంచి వచ్చిన కవిత చూడండి.

" వర్ణవ్యవస్థా పద్యం నాలుగోపాదం
కొసలో ఎవరో అతికించిన
అయిదో పాదం అతడు
బ్రతుకు గుడ్డల్ని దిగులు దండెం మీద
ఆరేసి తోళ్ళ తొట్టిలో నానేసిన చర్మాన్ని
సాపు చేయటానికి గూటాన్ని రాటు దేల్చి
పని కత్తికి పదును పెట్టి అతడికి అతడే
వొక పని ముట్టై చర్మంతో సంగీతాన్ని
విన్పించే ఉస్తాదు అవుతాడతడు
మన పాదాలకు సౌఖ్యాన్ని మిగిల్చేందుకు
ఎండ విషాన్ని మింగిన గరళ కంఠుడు
ఆ చర్మ శిల్పి
మన పాదాలకు, చెప్పులు కుట్టిన
నేరానికేమో ఫుట్‌పాత్ మీద ఆకలి
మేఘమై కురుస్తున్నాడు"[114]

అంటూ పంచమ కులస్థులుగా పిలువబడ్డ వాళ్ళు దళితుల వృత్తిలోని సాధక బాధలను వ్యక్తీకరించాడు.

**3.2.12 కపిల:**

బావిలోని నీటిని పైకి తోడి పంటలకు పారించే విధానంలో కపిలి, గూడ, ఏతం లాంటి సాధనాలు ముఖ్యమైనవి. బావుల నుండి 'కపిలి' అనే సాధనం ద్వారా ఎద్దులతో నీటిని పైకి తోడి పంటపొలాలకు నీరు పెట్టే వారు. రాయలసీమ ప్రాంతాల్లో పూర్వం గత రోజుల్లో బావులలో నుంచి నీటిని తోడే విధానాన్ని 'కపిల తోలడం' అని పిలిచే వారు. ఈ పదం రాయల ప్రాంతానికి ప్రసిద్ధి చెందింది. తెలుగు రాష్ట్రాన్ని భాషా మాండలిక ప్రాంతాలుగా భాషా శాస్త్రవేత్తలు విభజించి ఆయా ప్రాంతాలకు సంబంధించిన పదజాలాన్ని సేకరించారు. ఇతర ప్రాంతాల్లో 'మోట' అనే పదంతో ఈ కపిలను పిలుస్తారు.

జి.వెంకటకృష్ణ 'కపిలెబాన' కవితలో కపిలతోలే విధానాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించాడు.

" యంత్ర యుగపు వురుకులతో అటకెక్కిన
అవశేషం కపిలెబాన
మన తాతల తరం రైతు కళ్ళతోనే చూడాలి

దాని సోయగాల నజరానా

రెండు కాండ్ల ఎద్దులు కట్టి

మోకూ మోతా కడుపున బెట్టి

బండి మీద బావి గట్టును చేరి

మోకు కొనను మెడను చుట్టి

వోణి వెంబడి ఎద్దు కలియ తిరిగే బారి వెంబడి

ఎద్దులు విడిచే బుసల వెంబడి

గిరగిర తిరిగే గిలక వెంబడి

జీతగాళ్ళ చెమట ధారలై" [115]

మన తాతల తరంలో సేద్యంలో ప్రధానమైనది కపిల తోలడం. పై కవితలో కవి వర్ణించిన విధానం చూస్తుంటే కపిల తోలిన విధానం మన ముందు సాక్షాత్కరింపబడుతుంది. ఇంకా ఏమని వర్ణిస్తున్నాడో చూడండి.

" పొద్దు పొడిచింది మొదలు కాలం

బారెడెక్కే దాకా

నాగరికతలకు జీవ జలాలను తోడితోడి

పోసిన బానతిత్తి

దానిలాగే ఎద్దుల పెద్దల

ఒలిచిన తోలుతో చేసిన నీటితిత్తి

కిర్రు కిర్రు మను గిలక గొంతుతో

గిలకను కాడిని కలిపే మోకు వూగుతో

కాడిని మోసే గిత్తల నడకతో

కపిల పాటలై అది వేసిన దరవూ

నెలల నిండిన గర్భిణిలా

అది మోసిన బరువూ

ప్రసవమైన ప్రతిసారీ ఆనందాల

గలగలల శ్రావ్యమై

కాలువలు వెంబడి కేరింతలు ప్రవాహమై

పెరిగిన పచ్చని పైర్లను చేసెను

కపిల బానల సంతానము

పండిన గింజల జీవమంతా

కపిల బానల వారసత్వము"[116]

ఒక రైతు కుటుంబంలో పుట్టి స్వయాన కపిలను తోలిన వారు అందులోని నేర్పరితనాన్ని పొందిన వారు ఎంతో అనుభవజ్ఞులైన వారు మాత్రమే కపిల తోలిన విధానాన్ని కవిత్వంగా మలుస్తారు. ఆ వర్ణనలోని పదాల పొందికలోని భావ గాఢత, కపిల యొక్క స్వరూపాన్ని పాఠకుడు చదవగానే ఇట్టే తెలుసుకోవచ్చు.

### 3.2.13 బాల్యం- అనాథ బాలలు:

వై. శ్రీరాములు 'చేయి చాచిన వెన్నెల' అనే దీర్ఘకావ్యం రాశాడు. బాల్యం గురించి, బాల్య స్మృతులు, పిల్లల ఆటలు, పిల్లల మనస్తత్వం, వీధి బాలలు, అనాథ బాలలు, సంఘంలో నిరాదరణకు గురైన పిల్లలు లాంటి ఎన్నో అంశాలను గూర్చి విస్తృతంగా వర్ణించిన దీర్ఘకావ్యం ఇది.

" మూల్యం చెల్లించలేని

అమూల్యం బాల్యం

ఎండా వానా

దుమ్మూ ధూళీ గాలి సమస్తం

బాల్యం ముందు నిస్తేజం

వాన నీరు

ఇంటి ముందు ప్రవహిస్తే

బురద మట్టితో చేసిన వంతెన ఎత్తు ఆనందమే బాల్యం

కాలువలై వాన నీటిలో

కాగితపు పడవలు వదిలితే

చూపుల ముందే అవి నీట మునిగితే

చిన్న బుచ్చుకునే లేత జీవతమే బాల్యం" [117]

అంటూ బాల్య జీవితం వెలకట్టలేని విలువైన జీవితం అని అంటున్నాడు. పిల్లలు వర్షాలు వచ్చినపుడు నీటితోనూ, మట్టితోనూ, పేపర్లతోనూ సరదాగా ఆడుకునే ఆనంద జ్ఞాపకాలు మన ముందుంచాడు కవి. ఇంకా చిన్న పిల్లల ఆట గూర్చి చెబుతూ,

" గగనంలో ఒక ఋతువు
గాలి పటమై ఎగిరేది
వానలో ఒక ఋతువు
కాగితపు పడవై కదిలేది
చిగురు వేసే ఒక ఋతువు
చిల్లాకట్టై చిందు లేసేది
నింగీ నేలా మధ్య ఒక ఋతువు
బొంగరమై గిరగిరా తిరిగేది
చేతి వేలి నుండీ ఒక ఋతువు
గోలీ గుండై పరుగులెత్తేది
కొమ్మల్లో ఒక ఋతువు
కోతి కొమ్మచ్చాదేది
ఇసుకలో దూరిన చేతులకి
చల్లని వెన్నెల తొడిమై కాసిపుల్ల దొరికేది
చొక్కాలో కసుక్కున కొరికిన
బెల్లం వుండ తీయదనం
కాకి ఎంగిలిలో తెలిసేది
బెండు బత్తాసుల రుచి
సంతలో చూపులకే అందేది" [118]

అంటూ పిల్లల ఆటలను గూర్చి సుదీర్ఘంగా కవిత్వీకరించాడు. గ్రామాల్లో పిల్లలు ఆడుకునే ఆటలు ప్రకృతితో మమేకమై ఆడుకుంటారు. సరదాగా చిందులు వేస్తూ పిల్లలందరూ కలిసి మెలసి విహరిస్తూ చిలిపి చేష్టలతో అప్పుడప్పుడు కోప్పడుతూ తిట్టుకుంటూ ఆటలు ఆడుతారు. దాదాపు పిల్లల ఆటలన్నింటినీ వర్ణించాడు.

" అమ్మతో బాల్యం
అందమైన అద్దం
అమ్మ లేని బాల్యం
అసంబద్ధం...అబద్ధం

బాల్యంలో

పాల వెన్నెల కళ్ళల్లో పోసేది

అందని బొమ్మ

అందరి అమ్మ

ఆకాశంలో ఆ జాబిలమ్మ

కనుల ముందు కదిలేది

సజీవ స్వప్నమైన కొండపల్లి బొమ్మ" [119]

అంటూ పిల్లలకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు ఉంటేనే వారి భవిష్యత్తు వుంటుందని అమ్మలేని బాల్యం అది ఎంత విషాధ కరంగా వుంటుందో చెప్తున్నాడు కవి. అలాగే నేటి కాలంలో ఈ సమాజంలోని వీధి బాలలు, అనాథ బాలలు వారి విషాద జీవిత సంఘటనల్ని తెలియజేశాడు.

" నేడు బతుకు బాటలో

మెతుకు వేటలో

కష్టాల అంచులపై

కత్తులతో చేసిన వారధిపై పరుగు పందెం బాల్యం

వధ్య శిల మొదటి మెట్టుపై

అడుగిడిన జీవన రథసారథి బాల్యం"[120]

అంటూ ఈ సమాజంలో కొందరి పిల్లల జీవితాలు వారి బతుకులు కష్టాలలోకి నెట్టేసాయని కవి చెబుతున్న దృశ్యం. పిల్లలపై శ్రమ దోపిడీని చెబుతూ,

" దారి పక్క

జన సంచారం కను సన్నల్లో

ఏ ఆధారమూ లేక

వీధి సర్కస్‌లో

గంతలు కట్టిన కళ్ళు

గాలిలో కదలాడే కాళ్ళు

వెదురు బొంగుతో కడుపు కొలుస్తూ

ఆకలిని తూకమేస్తూ

గరిమ నాభైన చేతులు

దొమ్మరాట విన్యాసాలలో

మాంసం ముద్దగా మారిన

శరీరంలోంచి

కడుపుకు వ్రేలాడిన ఆకలి చేతులు

క్వారీల్లో రాళ్ళు మోస్తూ

గనులో పలకా బలపాలు తీస్తూ

బడికి వెళ్ళని కాళ్ళు

అక్షరం దిద్దని చేతులు" [121]

అంటూ పిల్లలు ఎన్నో రకాలుగా దోపిడీ చేయబడుతూ వారి జీవితాలను ఎలా నాశనం చేస్తున్నారో తెల్పాడు. పొట్టకూటి కోసం ప్రాణాలను పణంగా పెట్టిన కొందరు ఇలా సర్కస్‌ల్లోనూ, విన్యాసాల్లోనూ, గనులు, పరిశ్రమల్లోనూ, గారడీల్లోనూ జీవితాలు బలైపోతున్న విషాధాన్ని కవి తెలుపుతున్నాడు. ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారుల మీద అడుక్కునే వారిని గూర్చి ఇలా అంటున్నాడు.

" ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద

నిముషమాగిన వాహనాల ప్రవాహాల నడుమ

వేగం సుడిగుండం మధ్య

దినదిన గండంగా

దీనంగా చాచే చేతులు

చివరకు చిల్లర కూడా లేని చేతులు

చిన్నచిన్న చేతులు చిల్లర చేతులు

చెల్లని చేతులు" [122]

అంటూ అనాథలైన పిల్లలు పట్టణాలు, నగరాలలో అడుక్కొని బ్రతికే వారి దీన బ్రతుకుల్ని చెబుతున్నాడు. రాధేయ 'కోల్పోతున్న మూల్యం' కవితలో బాలల యొక్క అమూల్యమైన జీవితం వివిధ రకాలుగా ఎలా నాశనం అవుతుందో తెల్పుతున్నాడు.

" పూట గడవని ఇంట్లోంచి

పనిలోకి తోసేసిన విషాదంలో

కారుచౌక కూలీగా మార్పు చెంది

ఇటుకల్ని తల మీద మోస్తుంది

మగ్గం మీద పేగుల్ని ఆరేస్తుంది
మునివేళ్ళతో బీడీలు చుడుతుంది
పూల తేనెలన్నీ చేదెక్కి
వసంతం వలస పోయినట్లు
విద్యా, విజ్ఞానం,మార్కెట్ సరుకులై
వారి దరిద్రంతో పరాచికాలాడితే
వారి కలల ప్రపంచం
కుప్పకూలిపోకేం చేస్తుంది.” [123]

అంటూ పేద పిల్లలు వారి బ్రతుకులు పేదరికం గూర్చి కవి చెప్పాడు. కొన్ని కుటుంబాలలో పెద్దలు పిల్లలను పోషించలేక వారి కుటుంబం గడవక బలవంతంగా పనుల్లోకి పంపిస్తున్నారు. పిల్లల యొక్క ఉ జ్వల భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఈ అంశాలనే కవి చెప్పాడు.

### 3.2.14 స్మృతి కవిత్వం:

ఆచార్య ఎస్. గంగప్ప 'నవయుగ కవిచక్రవర్తి' అనే కవితలో గుఱ్ఱం జాషువ గారిని స్మరించాడు.

“ వెలుగుకు నోచుకొని చీకటిని
తట్టి నిద్రలేపి మేల్కొలిపి
ఆర్తిని, ఆవేదనను నివేదింప గల
హేతువాద పూరిత హితం గబ్బిలానికి నేర్పి
చైతన్యవంతం చేసిన మహాకవీ
.....................................
'స్వప్నలోక' మంటూ చిత్రించినా
ఈ జగత్తులోని
వాస్తవాన్ని, మానవ మనస్తత్వాన్ని
కుళ్ళునీ, కుసిద్ధాన్నీ
దౌష్ట్యాన్ని, దుర్మార్గాన్నీ నిరూపించి
మంచితనం, మానవత్వం
విశ్వమెల్లా విలసిల్లాలని

స్వాగతించిన విశ్వకవి!" [124]

అంటూ జాషువ గారి గబ్బిలం కావ్యం, స్వప్నలోకం లాంటి రచనల్ని పేర్కొంటూ జాషువ గారి సాహిత్య జీవితాన్ని ఆవిష్కరించారు.

రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి 'సుందర రాజు కోసం' అనే కవితలో సుందరరాజు వ్యక్తిత్వాన్ని తెలియజేస్తున్నాడు.

" నువ్వు
ఉద్యమాలకు ఊపిరైన వాడివి
ఉరితాడులో ఊపిరి విడిచావా
నువ్వు
జాతి జనుల సంకెళ్ళు తెంచే వాడివి
ఉరితాడు ముళ్ళకు బిగించుకున్నావా
గండ జోగమ్మ మైసమ్మల
బాధల పల్లవి వినిపించావు
'మాదిగోడు'లో మాదిగ గోడును
దప్పు కొట్టి వినిపించావు
ఎవరెవరివో
డొక్కలు చించి డోళ్ళు కొడతాననాన్నవు
ఆఖరికి
నువ్వే దప్పుల మోతల్లో ఊరేగి పోయావా
నువ్వు చిగురించని జాతిలో
నవ్వుల పాలపుంతవవుతావనుకుంటే
జాతి జాతినే
కన్నీటి కుండగా మిగిల్చి పోయావు"[125]

అని నాగప్ప గారి సుందర రాజును స్మరిస్తూ సుందర రాజు యొక్క ఉద్యమ స్వభావాలను, అతని ధిక్కార స్వరాన్ని దళితజాతికి అతన అందించిన చైతన్యవంతాన్ని కవి కవిత్వీకరించాడు.

ఆశావాది ప్రకాశరావు ' నా సుందర్రాజు' కవితలో నాగప్ప గారి సుందరరాజు సాహిత్య జీవితాన్ని, అతని ఉద్యమ నేపథ్యాన్ని వ్యక్తీకరించాడు.

" అతని 'గుండెడప్పు' ఆంబోతు రంకైతే

పెత్తందార్ల తలపాగాలు మురికి కాల్వల్లోకి పడిపోతాయి

అతని 'చంఢాల చాటింపు' లయకాల ప్రభంజనమైతే

బడా చోరుల మీసాల్లో వణకుళ్లు ప్రారంభమౌతాయి

అతని 'మాదిగచైతన్యం' నిప్పురవ్వై నింగి కెగిసిందంటే

మడుగు మాన్యాలు మాడి మసై పోతాయి

అతని 'మాదిగోడు కథలు' విశ్లేషిస్తే

మానవత్వం మరచిన రాబందుల రెక్కల్ని నేల కొరిగిస్తాయి" [126]

అని సుందరరాజు జీవించిన కాలంలో అతను ఎలా ఒక యువకవిగా, ఉద్యమ కార్యకర్తగా, దళితోద్యమం పట్ల అతను చేసిన పోరాటాల దళిత నేతగా ఎలా కృషి చేశాడో కవి తెల్పాడు. సుందర రాజు రచనలు ముఖ్యంగా అణగారిన దళితుల పట్ల ఎలా ప్రాతినిద్యం వహించాయో, ఎంతటి ప్రభావాన్ని చూపాయో, మనువాద బ్రాహ్మణీయ భావజాలాన్ని ఎలా చెండాడాడో కవి కవిత్వీకరించాడు.

జెట్టి జైరామ్ 'మహాకవి శ్రీశ్రీకి నివాళి' అనే కవితలో శ్రీశ్రీని స్మరించాడు.

" సాహితీ మందిరంలో

ఆధునిక జయభేరిని మ్రోగించిన వాడా!

ప్రపంచాబ్జపు ఎర్రరేకై పల్లవించిన వాడా

భువన భవనపు ఎర్రబావుటాయై ఎగిరిన వాడా!

విశ్వవృష్టికి రక్తాశ్రువులు ధారబోసినవాడా!" [127]

అంటూ శ్రీశ్రీ గారి సాహిత్య ప్రభంజనాన్ని కీర్తిస్తూ ఇంకా ఇలా అంటాడు.

" ఈ శతాబ్దాన్ని ఏలిన సాహిత్య చక్రవర్తీ!

సామ్యవాద మానవుడా

నీ 'మహాప్రస్తానం'తో ఎన్నో గుండెల్ని కదిలించిన వాడా!

నీ 'మహాభినిష్క్రమణం'తో ఎందరో వార్తలకెక్కని

అభిమానుల కన్నీళ్లని కురిపించిన వాడా

అగ్ని సరస్సున వికసించిన వజ్రమా

నీ గళన్మంగళ కళా కాహళ హళాహళిలో

నను కరిగించిన వాడా

భారత సాహితీ వాతావరణంలో వెల్తుర్లనీ,
నిప్పురవ్వల్నీ విడిచి చీకట్లను చీల్చుకుంటూ
రాలిపోయిన ఎఱ్ఱ నక్షత్రమా!" [128]

అంటూ శ్రీశ్రీ గారి సాహిత్య వ్యక్తిత్వ ప్రస్థానాన్ని, అతడు ప్రభావం చేసిన సాహిత్య సామ్రాజ్యాన్ని, మానవ సమూహాన్ని, పోరాటాన్ని కవి అక్షరాభివందనం చేస్తూ కవితా సుమాంజలులు సమర్పించాడు. అలాగే 'కె.వి.రమణారెడ్డి' అనే కవితలో రమణా రెడ్డిని స్మరిస్తూ,

" ఫ్యూడల్ భావ సముద్రంపై
అలయక, సొలయక
పోరాడి పోరాడి
నింగి కెగసిన
విప్లవ కెరటానికి విశ్రాంతి ఈ మరణం
దోపిడీ సమాజంపై
'ఎఱ్ఱపిడికిలి' ఎత్తి పిడి గ్రుద్దులు గుద్దిన
వీరసాహితీ యోధునికి అశ్రు నివాళి
భారత రాజకీయాల్లో 'కులప్రభావం'
నిగ్గు తేల్చిన పరిశోధకుడు
సాహితీ సంస్థలను నడిపించిన పెద్దన్నయ్య
'విరసం'లో రెండు పంథాల మధ్య పోరాటంలో
మానసికంగా నలిగినా, స్థిరంగా, ధృడంగా
నిలబడ్డ సాహితీ యోధుడు" [129]

అంటూ రమణారెడ్డి యొక్క అభ్యుదయ భావాల దృక్పథాలను, ఆలోచనా తీరులను కవి స్మరించాడు. కంబదూరి షేక్ నబీరసూల్ అనే కవి ' గుంటూరు శేషేంద్రశర్మ గారికి నివాళి' కవితలో ఇలా అంటున్నాడు.

" సునిశిత, సుస్పష్ట సహేతుక సాహితీ సంపన్నతకు తోడు
సదా నిర్మల భాషా పరిమళాలు వెదజల్లిన
అభినవ వైతాళికుడిగా అందమైన పద సుందరకారుడిగ
ముగ్ధ మందార మకరంద సమాసాల సృష్టికర్తగా
భాషా సొగసుల గారడి నీ కవితల్లో సింగారించి

అనంత పద సంపదను మేళవించి మూర్తీభవింప జేసి

ఆశువుకు అందాలు దిద్ది అలంకరించి మమ్ము ఘనీభవింప జేసిన

నీ మేధా సంపత్తికి శతకోటి వందనాలతో

అందుకోండి మా భాష్పాంజలి" [130]

అంటూ శేషేంద్రశర్మ గారి రచనల్లోని సాహితీ సంపదను, రచనల్లోని వైశిష్ట్యాన్ని కొనియాడుతూ కవి స్మరించాడు.

జి.వెంకటకృష్ణ 'ఆత్మగానం' అనే కవితలో అష్టదిగ్గజ కవుల్ని మరియు వేమన, వీరబ్రహ్మం వంటి కవుల్ని స్మరిస్తున్నాడు.

" నేను ఒక కావ్య జగత్తులో

పెద్దనకు ప్రవరుడు చేరిన హిమవతాన్ని

తిమ్మనకు దేవలోకపు పారిజాతాన్ని

ధూర్జటికి భక్తిని నేర్పిన మూగ ప్రాణాల్ని

సూరనకు వైభవాన్నిచ్చిన కళాపూర్ణోదయాన్ని

మరొక సామాజిక పరంపరలో

అన్నమయ్యకు జీర్ణమైన తెలుగు పదాన్ని

వేమన పలికిన సమాజ నిష్ఠురాన్ని

వీరబ్రహ్మం నేర్పిన కాలజ్ఞాన తత్వాన్ని"[131]

అంటూ అష్టదిగ్గజ కవుల ప్రబంధ కావ్య మాధుర్యాలు, అన్నమయ్య, వేమన, వీరబ్రహ్మం గార్ల సామాజిక మార్గాలను స్మరిస్తూ కవి కీర్తిగానం చేశాడు.

### 3.2.15 పల్లెలు:

టి.హెచ్. నటరాజన్ అనే కవి 'పాడైపోయిన గూడు' కవితలో గ్రామ జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నాడు.

" సంగటి ముద్దా చింతచిగురు వాసనకొట్టే

మా ఊరి పొలిమేర్రాయి

చిన్నప్పటి నా జ్ఞాపకాల కలికితురాయి

మిట్ట మద్దేన్నం కాడ ఆవుల గంగప్ప

సద్ది 'చిక్కం' విప్పే దక్కడే

‘మావిటింతల’ కాడ గుట్టదిగే ఆవు గిట్టలకు
పాలపిట్టలు నేపథ్య స్వరాలు కూర్చేదక్కడే
కనుచూపు మేర కాలి నడకన
ఇస్కూలు కెల్లబారే చెప్పుల్లేని కాళ్లు
‘ముర్రాల్ల దొంతి’కి చూపుల్నంపే కళ్ల వొడిసెళ్ళు
చేతుల్లోని పుస్తకాలకు
చెమటంటకూడదని ప్రయాసలు!
మా ఊరి జ్ఞాపకాలు
బాల్యం తేనెపట్టు నుండి రాలే తెనెబొట్లు
సీతాకోక చిలకల్ని
పొదల ఎదల్లో దాచిన ‘బేలికి’ పూలు
తొలకరి చినుకును పారాణి పళ్ళమై స్వాగతించే
ఎర్రరేగడి చేలు
ఎటు చూసిన పచ్చగన్నేరు పూలు
స్వాతి వానకు తలంటు పోసుకుని
విప్పీవిప్పని పూరేకుల్ని
కొప్పున తురుముకునే విప్పకొమ్మలు
గాలి యీలతో చెలిమి కట్టే
‘గుండప్ప సెలిమి’ గిజిగాని గూళ్ళు
ఆకుపచ్చని చీరపై ఎర్రని సెనిగి పూల బుటాలు
పంఖాలై తిరిగే సంకేశుకాయల గాలి పటాలు
హంగులెరగని తంగెడు పూల పల్లెదనం
మంచు ముత్యాల పాపిటితో
హేమంత సీమంతినిలా పచ్చిక మైదానం
ఒక మధుర మనోజ్ఞ దృశ్యం
నా చిన్నప్పటి మా వూరు” [132]

అంటూ పల్లె యొక్క మధుర జ్ఞాపకాలను కవి గుర్తు చేశాడు. పల్లెలో తన చిన్నప్పటి జ్ఞాపకాలు పల్లె పరిసర ప్రాంతాల్లోని చెట్లు, పూలు, పంట పొలాల దృశ్యాలు, పక్షులు, పశువులు లాంటి పల్లె వాతావరణం లోని మరచిపోని అందమైన తీపి గుర్తులను కవిత్వీకరించాడు.

ఎన్. ఈశ్వరరెడ్డి 'నాకొక పల్లె కావాలి' కవితలో అచ్చమైన పల్లె వాతావరణాన్ని చిత్రించాడు.

" ఆకాశాన్ని గడియారంగా ధరించిన కోడిపుంజు
నక్షత్రాల కదలికను జాముల్లోకి అనువదించి
వేకువ గొంతుతో ఊరిని నిద్రలేపేది
నిద్రలేచిన ఇళ్ళు
పచ్చటి కళ్ళాపును పారాణిగా అద్దుకొని
ముగ్గల పట్టీలతో ముస్తాబయ్యేవి
పల్లెను ముత్తైదువను చేసేవి
పిడకల పొయ్యి వెదజల్లే పాల పరిమళం
కల్తీ లేని మా పల్లె మనసుకు సాక్ష్యంగా ఉండేది
సద్దేళకంతా గుంపులా అడవికెళ్ళే ఆవు మందలు
సంగిటి చిక్కెంతో మా పుల్లయ్య తాత
పుల్లయ్య తాత గొడ్ల భాష ముందు
మన ప్రౌఢ వ్యాకరణం గుంజీలు తీయాల్సిందే
రాగి సంకటికి
చింతకాయ ఊరిబిండో
ఒట్టి మిరక్కాయ ఎనుపుడో జత కట్టిందంటే
నోళ్ళు లాలా జలాశయాలు కావలసిందే
సంగటా అని నోరెళ్ళ బెట్టకు
మా కరువు గడ్డకు
రాతి కండనిచ్చింది రాగి సంగటే గదా!" [133]

అంటూ కవి ఒక పల్లె చిత్రాన్ని మన కళ్ళ ముందు వుంచాడు. కోడి కూతతో నిద్రలేచే పల్లె పొద్దున్న నుంచి చీకటి పడే వరకు ఆ పల్లెలో దైనందిన కార్యకలాపాలు ఎన్నో జరుగుతాయి. ఇళ్ల ముందర ముగ్గుల స్వాగతాలు, మేతకు వెళ్ళే మేకలు, గొర్రెలు, పశువుల సందడి అలాగే రాయలసీమ రాగి సంగటి, చింతకాయ

పచ్చడి లాంటి ఎన్నో అంశాలను కవి కవిత్వీకరించాడు. అలాంటి పల్లె ప్రస్తుతం ఇప్పుడెలా వుందో కవి చెబుతున్న దృశ్యం.

" ఇపుడు
నీళ్ళింకిపోయి పగుళ్ళు పడ్డ ఊరి చెరువు
పగిలి పోయిన పల్లె గుండెకు సాక్ష్యం అయింది
మా ఊరిని అంబారీలా మోసిన సిద్దప్ప కొండ
గాయపడిన ఏనుగై దిగులు మంచం పట్టింది
కూలి నూకల కోసం
ఎగిరి పోయిన పల్లె పక్షులు
పట్నాల వెంట తారట్లాడుతున్నాయి
ఊరిలో తలదూర్చిన టెలివిజన్
కేబుల్ తోకతో ఊరిని పట్టి బిగించి
పల్లె కళను ఊరవతలకు కక్కించింది
నాకొక పల్లె కావాలి
నాగరికతల అంటు జాడ్యం లేని పల్లె కావాలి
ప్రకృతి ఒడిలో సెలియేటి నవ్వుల్తో తుళ్ళిపడే
పల్లె కావాలి" [134]

అంటూ పల్లెల్లో నెలకొన్న పరిస్థితులను వాస్తవీకరించారు. నీళ్ళు లేని చెరువులు, పొలాలు, అంతరించి పోతున్న పక్షులు, మనుషుల మధ్య ఆప్యాయతలు, పలకరింపులు కరువైన దృశ్యాలు లాంటి వాటిని కవి చిత్రించారు.

మునిసుందరం 'నిజమేనంట్రా' కవితలో గ్రామాలలోని ప్రకృతి సంపదను, పల్లె కుటుంబాల వాతావరణాన్ని చిత్రించాడు.

" మానూసేనూ గుట్టా పుట్టా
కొండా కొనా డొంకా దోన
కండ్ల కింపుగా కళగా వుండె
ఊరూ వాడా నాలుగు పక్కలా
పచ్చని రంగు పులిమినట్టుండె

ఆవులూ ఎనుములు ఎద్దులు

మడకా మేకా గొర్రె

గాదెల నిండా వడ్లూ రాగులూ

పతి యింట్లో పుష్కలంగా వుండె

................................

కరమలోళ్ళు కుమ్మరోళ్ళు కమ్మరోళ్ళు

సాకలయ్యలు డోలు సన్నాయి బాబులు

మాదిగన్నలు మాలక్కలు

వూరి సివర్న పీరూ సాయిబూ

అందరూ ఒక సెట్టు గూటి పచ్చుల్లా

పాలల్లో నీళ్ళు కల్సిపోయినట్లు

పంటకు ఎరువులా ఒకరికొకరు

బందుగుల్లా బతకతా వుండ్రి గద తండ్రీ

పీర్ల పండగొస్తే పీర్లెత్తుకోని

రాగిమాన్ రాగిసేన్ అంటా

అగ్గి గుండంలో దిగిన వైనం

మర్సిపోలేనురా అయ్యా!" [135]

అంటూ పల్లెల్లోని ప్రకృతి సంపదను, పశుపక్షి జాతులను, అన్ని కులాల వారి ముచ్చట్లనూ, హిందువులు ముస్లింల పండుగల ఐక్యతను కవి కళ్ళముందు దర్శింపజేశాడు.

డి.కె.చదువుల బాబు 'బ్రతికించుకోవాలనుంది' కవితలో పల్లెల్లో అదృశ్యమవుతున్న దృశ్యాలను చెబుతూ,

" అన్నీ అదృశ్యం

బతకలేక బలైన బుల్లి పిట్టలు

రెక్కలొచ్చి ఎగిరి పోయిన రాగులు, జొన్నలు

గద్దలెత్తుకెళ్ళిన సొద్దలు, కొర్రలు

ఆచూకీ లేని ఆరికెలు, బరిగెలు

మరణించిన మట్టికుండ

మాయమైన మరచెంబు

చేదయిన వేపపుల్ల
గల్లంతయిన గూటి దీపం
చెయ్యి దాటిన చేతి లాంతరు
హృదయం పగిలిన రుబ్బురోలు
ఊడి పోయిన ఉట్టి
కాలం ఈతలో మునిగి పోయిన ఈత చాప
కాళ్ళు తెగిన మంగలి పెట్టె
చెదలు పట్టిన చేదుడు బావి
చెలిమే లేని చిన్న చెరువు
పడిపోయిన పెద్ద చెరువు
కనిపించని కుమ్మరి చక్రం, కమ్మరి కొలిమి
ఆవిరైన అలనాటి ఆటలు
నేల రాలిన రంగస్థల నాటకాలు
హరికథలు, బుర్రకథలు
కనిపించని కళారీతులు
కొడిగట్టిన కలుపుగోలు కబుర్లు
రద్దయిన రచ్చబండ చర్చలు
ఇంకా చాలా చాలా అనుభూతుల్ని
నాగరికత నల్లచిలువ మింగేసింది
నేడు గ్లోబలైజేషన్ మహమ్మారి బిగికౌగిలిలో
ఆరిన దీపం నా పల్లె
కోట్లు వెచ్చించినా ఆ అనుభవాల
పాలపుంత నాకు అందేనా"[136]

అంటూ పల్లెల్లో కనుమరుగవుతున్న వాస్తవిక దృశ్యాలను చిత్రించాడు. రైతులు పండించే పంటఉత్పత్తులు, వృత్తి కులాల ఉత్పత్తులు, చెరువులు, కుంటలు, వీది కళారూపాలు, మనుషుల అనుబంధాలు, ఆప్యాయతలు ఇంకా చెప్పాలంటే ఎన్నో- ఎన్నోన్నో తల్లి లాంటి పల్లెతనం ఒడిలో నుంచి కళ తప్పి కనుమరుగవుతూ అంతరించిపోతున్నాయి.

లోసారి సుధాకర్ ‘ మా ఊరొక వసుధైక కుటుంబం’ కవితలో పల్లెలపై పడగ విప్పిన సాంకేతిక వాతావరణాన్ని మరియు ఈనాటి పల్లె చిత్రాన్ని మన ముందుంచాడు.

“ స్వరూపం కోల్పోయిన పల్లె
నాగరికత ముసుగులో
అస్థిత్వం కోల్పోయిన
మనిషిలా వుంది
పల్లెదనం, పచ్చదనం
దాని కమ్మదనం పోయింది
‘రియల్ భూమ్’ భూతమేదో పట్టిన పల్లె
పాడి పంటలకు దూరమయింది
రైలు పెట్టెల్లా
ఇరుకు ఇరుకుగా ఉంది
ప్రతి ఇంటికీ రొయ్యల మీసాల్లా
టి.వి. యాంటెన్నాలు,
పగబట్టిన నల్లత్రాచేదో
ఇంటింటిని చుట్టి
చివరికి ఊరంతా ఒడిసి పట్టుకున్నట్టు
కేబుల్ వైరొకటి
పల్లె గొంతులో విషం చిమ్ముతోంది
వీధుల్లో బల్లపరుపు బండల
స్థానంలో సి.సి.రోడ్లు
అందరూ పర్సెంటేజీలు
మింగగా మిగిలిన గతుకులు” [137]

అంటూ పల్లె స్వరూపాన్ని, పల్లె వాతావరణాన్ని చిత్రించాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం, సాంకేతిక పరిజ్ఞానాలు, కాంట్రాక్టర్ల దోపిడీలు లాంటి వాటి వల్ల పల్లెలు అస్తిత్వాన్ని కోల్పోతున్నాయని కవి వేదన. ఇంకా పల్లె చిత్రాన్ని ఇలా చెబుతున్నాడు.

“ బోద గుడిసెలైనా
తాటాకు వసారాలైనా
ప్రతి ఇల్లూ ఒక కుటీరంలా ఉండేది
అక్కడక్కడా గార, సున్నపు మిద్దెలు
వెన్న ముద్దల్లా దర్శనమిచ్చేవి
గిలక బావి చప్పుడు
రైలు కూతలా ఉండేది
కోలాటాలు, చెక్కభజనలు
తంబూర, హార్మోనీ రాగాలతో
మా ఊరు నడిఝామునెప్పుడో
నిద్రపోయేది
రచ్చరుగు, పీర్ల చావిడి
పెద్దోళ్ళ అనుభవాలు
కమ్మని జ్ఞాపకాలు పంచేవి
మనుషులంతా కొబ్బరి నీళ్ళలా
స్వచ్ఛంగా వారి మనసులు
మంచు పూవుల్లా శుభ్రంగా వుండేవి” [138]

అంటూ గ్రామాల్లోని పేదల గుడిసెలు, మిద్దెలు, ఇళ్ళ వసారాలు, వీధి బయలు నాటకాలు, పెద్దోల్ల ముచ్చట్లూ అన్నీ చెబుతూ ఇంకా ఇలా అంటాడు.

“ అనుబంధాలు ఆత్మీయతలు పెనవేసుకొని
ఆనందాలు పంచే మా ఊరిలో
కొలిమి బుడ్డేసాయిబు మామా
చేపల యేసోబన్న రెడ్డమ్మ పిన్నమ్మ
పింజరోల్ల కుల్లాయప్ప తాత
రుక్మాంగదుల రత్తాబాయత్త ఇంకా....ఇంకా...
అసలు సంప్రదాయాలు పద్దతులు
మా ఊరి సొత్తన్నట్టు

వావివరసలు

మా ఊరిలోనే పుట్టాయన్నట్టునిపిస్తుంది

ఓ పూటున్నా లేకున్నా

బువ్వ తిన్నా తినకున్నా

ఒకరి కష్టాన్ని

నాలుగు చేతులూ పంచుకోవడం

ఒకరి భారాన్ని మరొకరు బాధ్యతగా

భావించే మనుషులు

మహా గొప్పగా ఉండేది

గోవిందరాజ స్వామి గుళ్లో

భజనైనా, దర్గా మిట్ట వద్ద

ఖవ్వాలి ఐనా

చర్చిలో సూక్తులైనా

చిన్నాపెద్దా వారూ వీరు

తేడాల్లేకుండా

అందరూ హాజరయ్యేవారు

కులమతాలకతీతమైన

మా ఊరొక

వసుధైక కుటుంబంలా ఉండేది" [139]

గ్రామాల్లోని ప్రజలు ఆత్మీయత, ఆప్యాయతలతో మాట్లాడుకోవడం బంధువుల్లాగా వరుసలు పెట్టి పిలుచుకోవడం, సాధకబాధలు, కష్ట నష్టాలను పంచుకోవడం, పండుగలు, ఉత్సవాలు, జాతర్లలో కుల, మత భేదాల్లేకుండా కలిసి మెలిసి పాల్గొని జరుపుకోవడం లాంటి అద్భుత చిత్రాలను మనముందించి ఆ జ్ఞాపకాలను గుర్తు చేస్తూ కవిత్వీకరించారు.

### 3.2.16 సీమ- మాండలికం:

తెలంగాణా, ఉత్తరాంధ్ర, సీమాంధ్ర ప్రాంతాలలో మాట్లాడే భాష తెలుగే అయినా యాసలో స్పష్టమైన తేడా కనిపిస్తుంది. జన జీవితం నుండి ఈ మాండలికతను వేరు చేసి చూడలేం. ఎందుకంటే అది ఆ ప్రాంతాల జీవద్భాష. నిత్యం జనం నాలుకల మీద నలిగే భాష. ఏ ప్రాంతం మాండలికానికైనా వారి

గుండె గూడుపట్లను తడిమే శక్తి ఉంది. గొప్ప అభివ్యక్తి ఉంది. మాండలికంలో యాసకొక విశిష్టత ఉంది. యాసే మాండలికం కాదు. వస్తువుకు సొగసులు కూర్చేది మాండలికం. పరిమళాలు అద్దేది మాండలికం. వేంపల్లి అబ్దుల్ ఖాదర్ గారు మాండలికం పై ఇలా అంటున్నారు. "గుండెను అరచేత పట్టుకొని పలకరించేది మాండలికం! అభిమానం, అనురాగం, ఆత్మీయత, ఆప్యాయత, కారుణ్యం కలగలసిన పంచామృతం మాండలికం! పాత్రోచిత జీవద్భాషా పరిమళం మాండలికం".

రాయలసీమ మాండలిక యాసలో కవిత్వం రాసిన వారు ఎస్.మునిసుందరం, వేంపల్లి అబ్దుల్ ఖాదర్, యక్కలూరి శ్రీరాములు, మహమూద్, గోపిగాని కరుణాకర్, మల్లెల నరసింహ మూర్తి, పులికంటి కృష్ణా రెడ్డి, నందవరం కేశవ రెడ్డి, సడ్లపల్లె చిదంబర రెడ్డి లాంటివారు ప్రధానమైన కవులు.

మల్లెల నరసింహమూర్తి 'బతుకు దిగులు బావి' కవితలో రాయలసీమలోని అనంతపురం జిల్లా యాసలో పలికించిన కవిత చూడండి.

" ఏం బతుకో...పానాలు బిగబట్టి
ఎదురుసూసి...ఎదురుసూసి సావల్ల
సూసిన దానికేమన్నా ఒరిగినా...
సెప్పా సేయకుండ...ఎగపెట్టె వాన...
సందకాడయితానే...సారాయికి సెవి పీకినట్లే
రెండు సినికులు రాల్తానే...సేద్యంసేసి
సెనిక్కాయ పంట పెట్టే యసనం మాది
యాపొద్దూ యిత్తనాల కెల్లలా
పసలకు మేతకాలా...
అట్ల మెరిసి ఇట్ల మాయమెపొయ్యే
మెరగడపూలు సీమలో సినుకులు
నీల్లులేని సేద్యం...ధర్మరాజు జూదం ఒక్కటే...
నిష్కారణంగా దుడ్లు ఏట్లో పోసొచ్చినట్లాయ
నిరుడు ఇట్లే...పోయిన్నిరుడూ ఇట్లే
ఈసారి ఇంగా అద్దుమానం
సేతికందింది...నోటికందకపాయ
ఏటేట ఏటికెదురీతే...

పెండ్లాం కమ్మలు సైన్నాను నాగరిబిల్లా

ఆక్రీకి గుండెకాయ పిండుకొని

తాలిబొట్టూ కుదువ బెడితిమి

వొడ్డీల మీద వొడ్డీలు కట్టలేక

కన్నోల్లను సాకినట్ల

బ్యాంకుల్లోల నోట్లో పెట్టేకి సరిపాయ

సంపాదించిదంతా సేతిలో దమ్మిడీ లేదు" [140]

అని అనంతపురం జిల్లాలో వేరుశెనగ పంటను పండించే పేద రైతుల బతుకు వ్యథలు, జీవనగాథలు ఇవి. ఈ ప్రాంతంలో మొదట్లో వర్షాలు రావడం రైతులు ఆశలతో పొలాలు దున్నడం విత్తనాలు, ఎరువులు కొని పొలంలో వేయడం పెట్టుబడులకు, కూలీలకు ఇతర ఖర్చులకు వ్యాపారస్తులు, బ్యాంకుల్లోనూ అప్పులు తేవడం చివరకు వర్షాలు ఎగబెట్టడం పంటలు ఎండిపోయి అరకొరగా పంట చేతి కందడం పెట్టుబడులు, కూలీలు, అప్పులు ఎక్కువై గిట్టుబాటు ధరలు లేక అనంత రైతులు నిత్యం సమస్యల సుడిగుండాలలో కొట్టుమిట్టాడుతున్నారు. సీమ మాండలికం, అనంతపురం ప్రజల యాసలో రైతు గాథను కవిత్వీకరించాడు. ఇంకా ఇలా అంటున్నాడు.

" అడిమేత అయిపాయ

సెనిక్కట్టె లేదు

సొప్పుదంటయి పాయ

రాగిదబ్బల్లేవు...పచ్చిగడ్డి పాసే లేదు

కడాకు వొరొగెడ్డి కరువైపాయ

కడుగునీల్లలో

పసులు పానాలు ఎన్నాల్లు నిలబెట్టుకుంటాయి

ఎముకలు కనపడతాంటే

సూల్లేక మొన్ననే గోరంట్ల సంతలో అమ్మేస్తిమి

మొగోల్లం మొండిగా బతుకుతాండాం

కొంపలో ఆడది

అప్పులోల్ల సూటుపోటు మాట్లు పడలేక

ఒకపొద్దు కాడ సప్పిడి కాకుండ ఉరేసుకుండె

ఇండ్లు వల్ల కాడు సేసిపాయె

కొంపలో దీపం పెట్టే దిక్కు లేకుండా పాయ

సేతి కెదిగిండే పిల్లోడు

కేలం పాలమాలి సచ్చిపోయే

నట్టింట్లో ఎదిగి కూకుంది ఆడకూతురు

ఎట్లా సాగనంపాలో ఆయమ్మని

తినేకి ఎసిట్లోకి లేవు

దాన్నెత్తిన నాలుగ్గింజలు సల్లలంటే ఎట్లప్పా...

ఇదో మనోరోగమై పాయె

ఎయ్యాలైనా కంట్లో కునుకు పట్టదు" [141]

అంటూ అనంత రైతు యొక్క కుటుంబ సమస్యల్ని, వాస్తవ జీవితాల్ని చిత్రించాడు. పంటలు పండక తినేకి తిండి గింజలు లేక అప్పుల బాధలు ఎక్కువై పిల్లల పెళ్ళిళ్ళు బాధ్యతలు, సంసార బాధ్యతలు ఎక్కువై అనేక ఇబ్బందులు, కష్టాలు, సమస్యలతో రైతులు కాలం గడుపుతున్నారు. ఇలాంటి విషాద జీవితాలను కవి చిత్రించాడు.

వేంపల్లి అబ్దుల్ ఖాదర్ 'సావుకీ బతుక్కీ మద్దెన!' అనే కవితలో సీమ మాండలికంలో నుంచి వచ్చిన కవిత,

" సీమంటే

ఒక కాయకట్టం

ఒక కైతాచ్చరం

ఒక మొండి దయిర్నం

ఒక నేల మాళిక నిచ్చేపం

ఒక సనుబాల వాచ్చల్లెం

నేను... వొట్టి మొండినా కొడుకుని

బండరాతి పొరల్ని చీల్చుకొని మొలిచిన జువ్విచెట్టుని

మిడతల్ని యారకతినే జముడు కాకిని

సిగుల్లని ఇడిసి పెట్టేసి

ఎండిన మోళ్లని కొరికే రాతికోయిల్ని" [142]

అంటూ సీమ మనుషుల మనస్తత్వాన్ని చెబుతున్నాడు. ఇంకా సీమ జీవిత కష్టాలను తెల్పుతున్నాడు.

“ ఇదో ఇట్నే మొగం సిట్లించకుండా

ఆరు ఋతువులతో అచ్చనగాయలు ఆడతానే ఉండా!

వొంచిన నడుం ఎత్తకుండా

మొన్ను పిసికి చెవట్లు రాల్చుతానే ఉండా!

దలారి టక్కరి నక్కల ఇగితి మాటలకు

ముక్కు మునగా మోసపోతానే ఉండా!

యా ఏటికాయేడు ఎన్ని నష్టాలు వచ్చినా

యవసాయంతో ఎడతెగకుండా జూదమాడతానే ఉండా!

ఎప్పుడు మెరిసినా ఉరిమినా

ఆశిగా ఆకాశిం పక్క ఎగచూస్తానే ఉండా!

నా కండ్ల నీళ్ళని నేనే తాగితాగి

దెగ్గరికి రానే రాకండా

సావుని సావమని సావగొడతానే ఉండా!”[143]

అంటూ సీమ ప్రజల మొండి జీవితాలను చిత్రించాడు. సీమ ప్రజలు కరువులతో పోరాడుతూ కష్టం చేస్తూ ఎదుర్కొంటూ సేద్యాన్ని విడిచిపెట్టకుండా మొండిగా చేస్తూ వర్షాలు రాకపోతాయా పంటలు పండకపోతాయా అని నిరంతరం ఆశ నిరాశల మధ్య బ్రతుకుతూ చావలేక బ్రతికి వున్నట్లు అనుకొని ప్రాణాలను నిలుపుకొంటున్నారు. ఇలాంటి వాస్తవ బతుకు చిత్రాలను కవిత్వీకరించాడు.

మహమూద్ ‘ వాన వస్తదో...రాదో...’ కవితలో సీమలో వాన రాక కోసం రైతులు ఎదురు చూసే సందర్భాన్ని మాండలికంలో పలికిస్తూ,

“ సినుకు రాలితే ముర్సిపోయే మట్టి

ఇడిసే వాసన ముక్కుకు సోకి ఎన్నినాళ్లై నాది

ఎండ పొద్దున నాగలి భూమిని తవ్వుతాంటే

సెమట సుక్క నచ్చత్రం మాదిరి

ఒంటి మీంద పొడిసి ఎన్ని నాళ్లైనాది

వాన కురిస్చే

పల్లె తడిస్చే

కాల్వలు పద్దాలు పాడ్తే

పిల్ల నా కొడ్కులు కాగితప్పడవలవుతే సూస్చామని
పైన గుడ్డి మోడమొస్చే
నా ఆలికి సీరగా సుట్టుదామని
పైరు పసి మెక్కితే
పెద్దదానికి కట్నంగా ఇయ్యాలని
కాసుక్కూచ్చోనుండా
వాన వస్చదో...రాదో..."[144]

అని ఎన్ని రోజులైన సీమలో వర్షాలు రాకపోయే సరికి పొలం దున్నడానికి విత్తనాలు వేయడానికి రైతులు వేయికళ్ళతో ఎదురు చూస్తారు. అలాంటి రైతు ఎదురు చూపులోంచి కవి కవిత్వీకరించాడు.

వై. శ్రీరాములు గారు సీమ ప్రాంతాలలో సరైన సమయంలో వర్షాలు పడితే బంగారం లాంటి పంటలు పండుతాయని తెల్పుతూ అనంతపురం మాండలికంలో వ్యక్తీకరించిన కవిత.

" మా పిల్లప్పుడు వానొత్తే సాలు
సేన్లు దున్నకనే రాల్లో రత్నాలో నేల్లో మొల్సేట్వి
ముక్కుపుడ్కలక్క మిలమిల పొద్దుట్నే మెర్సేట్వి
బంగారం లక్క నాల కదప్పా
వాన్లు రాక, నీళ్ళియ్యక కాకి బంగారమయింది గాని...
ల్యాకపోతేనా
ఎఱ్రన్నేల నల్ల రేగడ్నేలకి వానొత్తే సాలు
పచ్చని పంట వద్దంటే పైకి పీక్కొనొత్తుంది
ఎప్పుడన్నా...ఎన్నడన్నా...పొరపాటుగా
కుండపోతగా వాన కురుత్తే సాలు
నిన్నట్టాకా ఎండి గొడ్డు బోయిన చెర్వు
రాత్రికి రాత్రే అవుతాది నిండు చూలాలు
నీలం నీళ్ళు సుట్టు కొండలు ఎంత బాగుంటుందో
రాయల్సీమ బగమంతుడేసిన బొమ్మలక్క" [145]

అంటూ సీమలో వానలు వచ్చినపుడు ఎఱ్రని నేలలు, నల్లరేగడి నేలల్లో పండే పంటలు గూర్చి చెబుతున్న దృశ్యం ఇది.

**3.2.17 సీమ– ప్రాదేశికత:**

వేంపల్లి అబ్దుల్ ఖాదర్ 'రతనాల సీమ' అనే కవితలో ఇలా అంటున్నాడు.

" ఔను
నాది కరువు సీమే
ఐతే ఏం?
ఆవురావురని అరిచే పేగులున్నాయ్
దిగులు
దిపాలెత్తిన కనుపాపలున్నాయ్
గుబులు
గూడు కట్టుకున్న గుండె కాయలున్నాయ్
చింతకొమ్మల్లో
ఎంగిలి మెతుకుల కోసం ఎదురు చూసే కాకులున్నాయ్
దొరల్ని మొరిగి
దొంగల్ని నాకే కుక్కలున్నాయ్
బొమికల్ని తీరుబడిగా వేలాడ దీసుకున్న ముసలి
పరిసరాలున్నాయ్" [146]

అని ఈ సీమ ప్రాంతంలో పేదరికం, నిరాశ, నిస్పృహల వాతావరణంతో కూడిన పరిసరాలున్నాయని చెబుతూ ఇంకా ఇలా అంటాడు.

" అలసందైనా మొలకెత్తని చవిటిపర్ర ఇది
వాన కోయిల్లు పలకని చోటు ఇది
చలి చీమలు తిరగని నేల ఇది
ఏరువాక ఎరగని ధరణి ఇది
ఎండిన బీళ్ళకు నోళ్ళొచ్చి అరుస్తున్న గడ్డ ఇది
హన్నా!
ఇంకేం కొద వుంది
రాయలంతటి మహానుభావుడేలిన
'రతనాల సీమ' కదా ఇది!" [147]

అంటూ ఈ సీమ నేలలు, పక్షి జీవ జాలాలు, నీళ్ళు మొదలగు వాటి గూర్చి వ్యక్తీకరించాడు. 'స్వర్గసీమ' కవితలో ఇలా అంటాడు.

" గుండెనిండా గాలి పీల్చుకుని గర్వంగ చెబతున్నా
ఇది నా పురిటి గడ్డ
ఈ రాయి రప్పా వంకా వాగూ కొండా కోనలన్నీ
నా చిన నాటి తీపి గురుతులు
ఈ చెట్టూ పుట్టలతోనే నేను
చెట్టపట్టా లేసుకు తిరిగింది
మొండి ఋతువులతో పోరాడే
బండ మనుషుల్నే నేను నిశితంగా చదివింది" [148]

అంటూ రాయలసీమ ప్రాంతంలో పుట్టిన వ్యక్తిగా సీమ ప్రాంత అస్తిత్వాన్ని తెలుపుతున్నాడు.

" ఆ నిశ్శబ్ద చక్రవాగ రాగం
శతాబ్దాలుగా వినవస్తున్నదే
ఇదిగో గుండెల్ని పగుల గొట్టుకున్న
కొండా రెడ్డి బురుజు
ఆకలి అగ్నిశిఖల్ని ఆర్పడానికి
రేగడి మట్టిలో పెరుగు కలుపుకు తిన్న
విలక్షణ చరిత్ర నాది
ఎడాపెడా లెంపలు వాయించినా
నిప్పులు చెరిగే వడగాలే నా ఊపిరి" [149]

అంటూ ఈ సీమ ప్రాంతంలో ఎన్ని కరువులు వచ్చినా కష్టాలు ఎదురైనా వాటిని ధైర్యంగా ఎదుర్కొని బ్రతుకులు వెళ్ళదీస్తామని కవి ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. 'వెలుతురు జలపాతం' కవితలో కవి ఇలా అంటున్నాడు.

" వాన చినుకు రాలితేనే మేఘం బతికున్నట్టు లెక్క
విత్తనం మొలకెత్తితేనే నేల కడుపు పండినట్టు లెక్క
అరచేతి గీత అదృశ్యమైతేనే పగలు మునిగి పోయినట్టు లెక్క
వేకువ కొమ్మ మీద కాకొకటి అరిస్తేనే భళ్ళున తెల్లవారినట్టు లెక్క

పంటబావి గట్టు మీద గిజిగాడు కిచకిచమంటేనే

దుర్భిక్షం దూరమైనట్టు లెక్క....!

ఇంతవరకు కరకు నెత్తుటి మరకలతో మైలపడి

మనుషులు రాళ్లై రగులుతున్న సీమనే చూపావు కానీ

మూడు పువ్వులూ - ఆరు నవ్వులై సాగిన

కృష్ణరాయగండని స్వర్ణకిరీటపు ధగధగల్లో

సాహితీ వాసనల్ని విరజిమ్మిన అక్షరాల్ని

రాళ్ళకి నోళ్ళొచ్చి పలికిన పదనిసల్ని

రతనాల సీమ స్వర్ణయుగ పురావైభావాల్నీ

కళ్ళారా మళ్ళీ ఒకసారి చూపించు కిటికీ...!"[150]

అంటూ ఈ సీమ ప్రాంత వాస్తవ దృశ్యాలను చెబుతూ రాయలేలిన సీమలో ఆనాటి సాహిత్య, సాంస్కృతిక కళా వైభవాలనూ అలాగే రతనాల వంటి సీమ స్వర్ణయుగపు కీర్తిని మళ్ళీ ఒకసారి చూడాలని కవి తన ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ చిత్రించిన కవిత ఇది.

### 3.2.18 వర్గ- ముఠా కక్షలు:

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'ఫ్యాక్షనిజం' కవితలో వారసత్వంగా సంక్రమిస్తున్న సీమ ముఠా తగాదాలను తెలుపుతున్నాడు.

" తరం నుండి తరానికి

సంక్రమిస్తున్న అక్రమ ఆస్తి

తల నుండి తలకు

పాకుతున్న బ్రెయిన్ ట్యూమర్

ఈ ఫ్యాక్షనిజం" [151]

అంటూ సీమలో ఫ్యాక్షనిజం ముసుగులో కొన్ని కుటుంబాల మధ్య తరతరాలుగా వారసత్వంగా కక్షలు పెంచుకొని దానిని కొనసాగిస్తున్నారనే దృశ్యాన్ని చెబుతూ ఏమంటున్నాడో చూడండి.

" ఫ్యాక్షనిజం

మనుషుల్ని మనుషులుగా గాక

తెగిన తలలుగా

తలలేని మొండాలుగా

ప్రేళ్ళు తెగిన చేతులుగా, విరిగిన కాళ్ళుగా

పగిలిన పుర్రెలుగా, చెదిరిన మెదళ్ళుగా

గుర్తిస్తుంది

ఆకు వెంట ఆకు

సుడులు తిరుగుతూ

రాలి పోయినట్లు

ప్రాణం వెంట ప్రాణం

గిలగిలా కొట్టుకుంటూ

గాలిలో కలిసి పోతేనే

ఫ్యాక్షనిజానికి సంతృప్తి" [152]

అని ఈ సీమలో కొన్ని కుటుంబాలు మనుషుల మధ్య పగలు, ప్రతీకారాలు పెంచుకొని కక్షగట్టి ముఠాలుగా ఏర్పడి దారి కాచి మాటువేసి ప్రత్యర్తులను దారుణంగా నరికి చంపడం మనుషుల ప్రాణాలు తీయడం అలవాటుగా మారిపోయిందని కవి ఆవేదన వ్యక్తం చేశాడు.

స్వరూప్ కృష్ణ 'దృష్టి' అనే కవితలో ఇలా అంటున్నాడు.

" బలవంతంగా ముఠాల్లోకి లాగబడుతున్న యువతరాలు

ఇవ్వాళ తుపాకులు చుట్టూ ఉంటే

ఠీవిగా మధ్యలో నడవడం ఓ ఫ్యాషన్

అంగ రక్షకుల చేతుల్లో నియంత్రించ బడిన జీవితాలు

ముఠా కోరల్లో బతుకు బలిదానం

చంపడం ఈ జాతికి వెన్నతో పెట్టన విద్య" [153]

అంటూ సీమ ప్రాంతంలోని యువతరం కూడా ముఠాలు, వర్గాలుగా ఏర్పడి కక్షలు పెంచుకొని బతకడం ఫ్యాక్షన్ ముసుగులో మనుషులను చంపే ఆచారాన్ని నేర్చుకుంటున్నారని కవి చెబుతున్నాడు.

నందవరం కేశవరెడ్డి 'కామాలే' కవితలో ముఠా కక్షలు గూర్చి ఇలా అంటున్నాడు.

" మొన్న ఆ పక్క నిన్న యీపక్క

నేడు యిక్కడ రేపు అక్కడ

రగిలే ముఠా కక్షలు

ఆధిపత్యం అహంకారాలు

యెగ దోసిన పొయి మంటలు

తెగిపడుతున్న నడయాడే శరీరాలు" [154]

అంటూ కొందరు ముఠాలుగా ఏర్పడి కక్షలు పెంచుకొని ఆదిపత్యం కోసం రోజూ గొడవలు పడుతూ మనుషులను చంపే దుష్ట సంస్కృతిని నేర్చుకుంటున్నారని కవి వ్యక్తీకరించాడు. ఇంకా ఇలా అంటున్నాడు.

" పగలు పౌరుషాలు

పంతాలు పట్టంపులు

కరుకు రాతిపై నూరిన కొడవళ్లు

పదును పెట్టిన పిడి బాకులు

చొక్కా తొడుక్కుని

సంకలో వేలాడుతుంటాయి

బొగ్గిట్లో దాక్కుని వుంటాయి" [155]

అంటూ ప్రత్యర్థుల మీద పంతాలు పట్టింపులకు పోయి పగలు, పౌరుషం పెంచుకుని కొడవళ్ళు, బాకులతో దాడు చేయుటను కవి చిత్రించాడు. ఇంకా ఏమంటున్నాడో చూడండి.

" రెప్పపాటుతో లేచిపోయిన ప్రాణాలు

నేల కొరిగిన దేహాలు

యిది నెత్తుటి రుచి మరిగిన రాక్షస నిలయం

మానవ మృగాల దండకారణ్యం

యిక్కడ కక్షలకు కామాలే గానీ

ఫుల్‌స్టాప్ లేదు." [156]

అంటూ మనుషులు పగలు, ప్రతీకారాలతో ప్రత్యర్థుల మీద మృగాల్లాగా విరుచుకుపడి అంతమొందిస్తారు. ఈ సీమలో ముఠా వారికి వర్గ కక్షలకు ముగింపు పలికే వారు ఎవరు అని ఇవి ఇలాగే కొనసాగుతాయని అంతం ఎప్పుడవుతాయని కవి వేదన చెందుతున్నాడు.

### 3.2.19 ఉగ్రవాదం- తీవ్రవాదం:

నందవరం కేశవరెడ్డి 'చివరాఖరుకు' కవితలో మతం ముసుగులో పెరిగిపోతున్న అల్లర్లు, దాడుల గూర్చి మానవుడి ప్రయాణాన్ని తెలియజేస్తున్నాడు.

" ఎందుకో మతం మత్తుమందు పెట్టింది

మనసు చచ్చిన తీవ్రవాదం

మందు పాత్రయ్యింది

కరుదు గట్టిన ఉగ్రవాదం

కారు బాంబయ్యింది

ఆత్మాహుతి దళం

విమాన విధ్వంసక మయ్యింది

అడవుల్నుండి నగరాల కొచ్చాం

ఆటవికం వైపే అడగేస్తున్నాం

మధ్య యుగాల్లోకే నడుస్తున్నాం

ఎటుచూసినా నేల

రక్తంతో తడిసి ముద్దయ్యింది" [157]

అంటూ ఈ సమాజంలో మతాలు, కులాల పేరుతో తీవ్రవాదం, ఉగ్రవాదం పెరిగిపోతున్నది. అవి మందు పాత్రలుగానూ బాంబు దాడులు, ఆత్మాహుతి దాడులు లాంటి విధ్వంసక చర్యలకు ఉసిగొల్పుతున్నాయి. మనిషి అధునాతన నాగరికత వైపు అడుగులేస్తున్నా వెనకడుగు వేస్తూ విధ్వంసక చర్యలకు పాల్పడుతున్నాడు. యక్కలూరి శ్రీరాములు 'విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా' అనే కవితలో బాంబు దాడులు గూర్చి ఇలా అంటున్నాడు.

" తాజ్‌లో

నారీమెన్ హౌజ్‌లో

రైల్వే ఫ్లాట్‌పార్మ్‌లో

ముంబై వీధుల్లో

ఢిల్లీ రహదారుల్లో

హైదరాబాద్ మక్కా మసీదుల్లో

లుంబిన పార్కుల్లో

మరియట్ హొటల్లో

గోకుల్ ఛాట్‌లో

అరణ్యాల్లో ఎక్కడైతేనేం?

హిందూ ముస్లిం క్రైస్తవ శిక్కులెవరైతేనేం?

అక్కడ చంపబడుతున్న వారందరూ

మొట్టమొదట మనుషులు

ఆ తర్వాతే క్రైస్తవులు, హిందువులు,

ముస్లీములు సకల మతాల చిహ్నాలు" [158]

అంటూ బాంబు దాడులు చేసేవారికి ప్రాంతాలు, నగరాలు, దేశాలు, రహదారులు, వీధులు, అరణ్యాలు, జనారణ్యాలు, పార్కులు, ప్రార్థనా స్థలాలు ఏవైతేనేమి అన్ని చోట్లా దాడులు చేయడమే లక్ష్యంగా కుట్రలు చేస్తారు. ఇంకా ఇలా అంటున్నాడు.

" జరుసలేం జనీవా

అమెరికా ఆస్ట్రేలియా

ప్రపంచాన క్రైస్తవ సంకేతం

ఏసుక్రీస్తు చిహ్నం

శిలువ ఒక్కటే బైబిల్ ఒక్కటే క్రిస్మస్ ఒక్కటే!

పాకిస్థాన్‌లో ముస్లిం

హిందూస్థాన్‌లో ముస్లిం ఒకరే!

లోకంలో ఇస్లాం ఒకటే!

ఖురాన్ ఒకటే! రంజాన్ ఒకటే!

హిందూస్థాన్‌లో హిందువు

పాకిస్థాన్‌లో హిందువు ఒకరే!

దేవుడొక్కడే!

భగవద్గీత ఒకటే!

దీపావళి ఒకటే!

కులమేదయినా

మతమేదయినా

దేశమేదయినా మనిషి ఒక్కడే!" [159]

అంటూ ఈ ప్రపంచంలో ఎన్ని మతాలు, వర్గాలు, కులాలు ఉన్నప్పటికీ వాటి సారం, సందేశం ఒక్కటే మనుషులందరూ ఒక్కరే అని కవి వ్యక్తీకరించాడు.

" విధ్వంసం వాడి జెండా

వినాశనం వాడి ఎజెండా

అగ్రరాజ్యాల ఊపిరితోనే

పురుడు పోసుకుంది ఉగ్రవాదం" [160]

ఈ ప్రపంచంలో అగ్రరాజ్య దేశాలు విధ్వంసం సృష్టించడానికి వినాశనం చేయడానికి పూనుకొని స్వార్థపూరిత ఆలోచనలతో ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్నాయి.

కెరె జగదీష్ 'దగ్ధ గీతం' కవితలో ఉగ్రవాదుల వికృత చర్యలను తెల్పుతున్నాడు.

" శవాల గుట్టలపై

ఉగ్రవాదుల విజయ కేతనం

విరగబడి నవ్వింది

అగ్ని జ్వాలలను ధరించి

జ్వలిత సంచలిత నేత్రాలతో

శ్వాసిస్తూ శాసిస్తూ

ఉగ్రరూపం దాల్చిన ఉగ్రవాదం

సర్వశక్తి సమన్వితమై

విస్ఫోటిస్తూనే ఉంది" [161]

అంటూ ఉగ్రవాదులు జరిపే భయంకర దాడుల దారుణ పరిస్థితిని కవిత్వీకరించాడు. 'శిలాక్షరాలు' కవితలో ఉగ్రవాదులు సృష్టించే భయానక వాతావరణాన్ని చిత్రించాడు.

" ఉగ్రవాదుల భీభత్సం

తీవ్రవాదుల విధ్వంసం

నెత్తిమీద కూర్చొని విన్యాసాలు చేస్తుంటే

నా దేశంలో రోడ్లన్నీ

రథయాత్రలతో నిండిపోయాయి

మండుతున్న రైళ్ళల్లో

మానవత్వం మసై పోతూంటే

రెక్కలు విప్పిన మతోన్మాదం

రక్తం తాగడానికి సిద్ధమయ్యింది

తరతరాలుగా మతాల మతాబులు

కారుచిచ్చులకు ఊపిరి పోస్తుంటే

నా పుణ్య భూమిలో

మత కలహాలు శిలాక్షరాలుగా మిగిలిపోయాయి." [162]

అంటూ ఈ దేశంలో ఉగ్రవాదులు చేసే విధ్వంసాలు, భీభత్సాలతో ఎక్కడ చూసిన మారణహోమాలు, మతోన్మాదాలు చెలరేగి పోతున్నాయి. ఇవి దేశంలో అల్లర్లు, అలజడులను సృష్టిస్తూ మత కలహాలను రేపుతూ హింసను తెచ్చిపెడుతున్నాయని కవి వేదన చెందుతున్నాడు.

### 3.2.20 నదులు:

రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి 'విషాద కావ్యం' కవితలో సీమ నదుల నీటివల్ల సుసంపన్నమైన సీమ ప్రాంతాన్ని చిత్రించాడు.

" పెన్న చిత్రావతి స్వర్ణముఖి తుంగభద్రలు

సస్యశ్యామల సీమ వాల్జడలు

ఇది స్వర్ణ గర్భ, వజ్రగర్భ

దేశ పటంలో ఇదొక అద్భుత ఖండం

మంచో చెడో

చరిత్రలో

దీనిదొక ప్రత్యేక అధ్యాయం" [163]

అంటూ సీమలో ప్రవహించే నదులు ఒకప్పుడు ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశాయి. ఇది బంగారానికి, వజ్రాలకు పుట్టినిల్లు వంటిదని దేశంలో ఇదొక అద్భుత ప్రాంతమని కవి కొనియాడాడు.

శశిశ్రీ ' ఇక తల్లి పెన్నమ్మ లేదు' కవితలో ఇలా చెబుతున్నాడు.

" మా తల్లి నదీమ తల్లి పెన్నమ్మ

మాలో మానవత్వం లోపించింది

నదీమ తల్లి కొంత దూరం జరిగింది!

మాలో సంస్కారం కరువైంది

ఆ తల్లి పూరి పొలిమేరకు చేరుకుంది

మాలోంచి నర మృగాలు జన్మించి

ఊరంతా జనారణ్యమైంది

ఆ తల్లి యిసుక పర్రలోంచి అదృశ్యమైంది!

ఇప్పుడు అక్కడ జాలు లేదు

గలగలా పారిన జాడా లేదు” [164]

అని సీమలో ప్రధాన నది పెన్నానది దీనత్వాన్ని వర్ణించాడు. తల్లి లాంటి ఆ పెన్నా తల్లి నీటితో కళకళ లాడుతూ పంటలకు, పొలాలకు సీమ ప్రాంత జనవాసానికి నీరు అందిస్తూ వుండాల్సిన ఆ నదీమ తల్లి క్రమ క్రమంగా సీమవాసులకు దూరం అవుతూ ఎలా అదృశ్యమై పోతుందో కవిత్వీకరించాడు. ఇంకా ఇలా అంటున్నాడు.

“ మా వూరు ఆనుకొని ప్రవహిస్తూ
మమ్మల్ని వసివాడని తన పసివారిగా భావిస్తూ
తొలి పొద్దున మా పాదాల్ని కడిగే నదీమ తల్లి
మాలోంచి యెటో యెగిరి పోయిన ఆర్ధ్రతలానే
తిరిగిరాని ఏ అధః పాతాళానికో వెళ్ళి పోయింది
ఎండిన పెన్నమ్మ
ఒళ్ళంతా చెలమల పుండ్లయి
నరకయాతన అనుభవిస్తోంది
ఆ తేట నీటి వూట ఆ ఏటి పాట
తీతువ పిట్ట రోత కూతగా మారింది” [165]

అని పెన్నా నదిలోని నీళ్ళు, నీటి ప్రవాహ జాడలు, నీటి పలవరింతలు అన్ని కూడా తిరిగిరాని పాతాళానికి పడిపోయాయని ఆ పెన్నా నది యొక్క దుస్థితిని వర్ణించాడు.

సడ్లపల్లి చిదంబర రెడ్డి ‘ నీటిబొమ్మ’ కవితలో ఇలా అంటాడు.

“ రైతుకు వెన్నుదన్నై నిల్చిన జల–పెన్నమ్మ
నేడు పర జ్ఞాపకాల నీటి బొమ్మ
నేడు కళ్ళు చించుకొన్నా కనిపించని నీటి పాయ
దుర్భిణీతో వెదికినా అగుపించని ఏటి జాడ
నది మానాన్ని కాపాడే ఇసుక
నగర బకాసురుల భోగాలకు బలై
దుశ్శాసన నికృష్టానికి వలవలు పొగొట్టుకొన్న
ద్రౌపదికి వారసురాలయ్యింది
నదిగట్టు పల్లెతనాల మూలాలెండి

ప్రపంచీకరణం సుడిగాలి దుమారానికి కెగిరి

పట్టణాల్లో రాలుస్తున్న చిరిగిన విస్తర్లయ్యాయి

ఇప్పుడు పెన్నమ్మ ఒక నిర్జీవ శిథిల శకలం

కాలి బూడిదై మిగిలిన వసంతవనం

వెలుగులు ఆరి చూపులు కారి

లొట్టలై మిగిలిన నయనం" [166]

అని ప్రకృతి శాపంతో పెన్నా నదికి వర్షాలు రాక నీళ్ళు పారలేక పోవడం ఒక ఎత్తైతే ఆ నదిలోని ఇసుకను కాంట్రాక్టర్లు, దళారులు, దోపిడీ దారులు ఇసుకను తోడేస్తూ స్వాహా చేస్తున్నారని కవి వేదన చెందాడు. 'ఆశ్చర్యం' అనే కవితలో కవి ఇలా అంటున్నాడు.

" కాలు జారిన ధూమ కేతువు కడుపుజారి

ఏడ్నెల్లకే కన్నబిడ్డ దుమ్ము కేతువు

రైతు కలల కళ్లలో దుమ్ము కొట్టి

ఎండిన పొలాల మధ్య

వికృత శవమై పడి వున్నట్లు

సీమ భూపటలంలో ఒక ఏరు!

................................

పశువుల కడుపుకు గడ్డి పరకలందించని

వాగూవంకా కాని

శిథిలమైన వట్టి మట్టి గొయ్యిని

అందరూ చెప్పగా అది పెన్నేరని తెలిసింది

తల లేనివాడు మనిషెట్లవుతాడో

జల లేనిది నది యెట్లయ్యిందో ఈ తరానికంతా

ఒకటే ఆశ్చర్యం!! " [167]

అని పెన్నానది యొక్క ప్రస్తుత దుస్థితిని కవి తెల్పుతున్నాడు. జీవం లేని శరీరంలా నది వుందని తల లేని వాడు మనిషి ఎట్లా అవుతాడో నీరు లేని నది ఎట్లా అవుతుందో అని కవి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తూ కవిత్వీకరించాడు.

వేంపల్లి అబ్దుల్ ఖాదర్ 'స్వర్ణసీమ' కవితలో ఇలా అంటాడు.

" ఈ పింఛానది, ఆ మాండవ్య నది
గాయాలు మాన్పలేని గార్గేయ
చకుముకిలా రగిలే స్వర్ణముఖి
కోపాగ్ని రగిలించే పాపాఘ్ని
చిత్ర విచిత్రాల చిత్రావతి
బాహువులు తెగి పోయిన బహుదా
అన్నార్తుల కన్నీళ్లు తుడవ లేని పెన్నా
గండ కత్తెర దంష్ట్రల్లే మండిపడే ఎండల్లో
కొడిగట్టిన ఆశలా అడుగంటిన పాతాళ గంగ!"[168]

అని సీమ ప్రధాన నదులు వాటి స్థితిని కవిత్వీకరించాడు.

### 3.2.21. ప్రేమోన్మాదులు:

కెరె జగదీష్ 'మరణిస్తున్న నమ్మకం' కవితలో ప్రేమోన్మాదుల గూర్చి తెల్పుతున్నాడు.

" నిజమే
నా చెల్లి గొంతుమీద
ప్రేమ పూసిన కత్తి దిగబడి
తన రక్త దాహాన్ని తీర్చుకుంది
...............................
అక్షరాల ఆలయంలో రాక్షస పాదాలు
వెంటాడు తాయనీ, వేటాడు తాయనీ
తెలియని నా చిట్టి తల్లి
చదువుల తల్లి వొడిలో
సేద తీర్చుకొంటుంటే
'మనోహర' వదనంతో
మానవ మృగం పంజా విసిరింది" [169]

అంటూ శ్రీలక్ష్మీ అనే యువతిని ప్రేమ పేరుతో వెంటపడి ఆమెను మోహించి చివరకు కళాశాలలోనే కత్తితో దాడి చేసి హతమార్చిన సంఘటన గూర్చి కవి చిత్రించాడు. ఇంకా ఇలా అంటాడు.

" నిన్న ప్రసన్నలక్ష్మి, నేడు శ్రీలక్ష్మి

ఎవరైతేనేం ఒక అబల మీద
తన ఆకాశంలో సగంపైన
అహంకారంతో విచ్చుకొన్న
ఇనుప రెక్కల మగ డేగలు
దాడి చేస్తూనే వున్నాయి
రొమ్ములిరుచుకొని తిరుగుతూనే వున్నాయి
ఆ డేగల రెక్కలు నరికే దెవరు?
ఆకాశాన్ని నిర్మల సమతుల్యం చేసేదెవరు?" [170]

అంటూ ఎంతో మంది మహిళలపై ప్రేమ పేరుతో వెంటబడి కొంత మంది పురుషులు కత్తులతో కిరాతకంగా హత్యలు చేస్తున్నారు. ఈ మానవ మృగాల హత్యలను ఆపేదెవరు అని కవి ప్రశ్నిస్తున్నాడు.

" ద్రౌపది వస్త్రాపహరణాన్నీ
శ్రీలక్ష్మి ప్రాణాపహరణాన్నీ
ప్రజలు, పాలకులూ
గుడ్లప్పగించుకొని అనాదిగా
చూస్తూనే వున్నారు
స్త్రీ ప్రారబ్ధాల చరిత్ర మారనే లేదు
అభయ హస్తాల కోసం
యుగ యుగాల నుంచీ
ఎదురు చూస్తున్న అతివకు
స్నేహ హస్తాన్ని అందించే దెవ్వరు?
మరణిస్తున్న నమ్మకాన్ని
సాటి మనిషి బతికించేదెన్నడు?" [171]

అని తరతరాలుగా అనాది నుంచి ఈ కాలం వరకు మహిళలపై దాడులు, హత్యలు జరుగుతూనే వున్నాయని ప్రజలు, పాలకులు, ప్రభుత్వాలు సైతం ఏమీ చేయలేని దుస్థితిలో వున్నారని యుగయుగాల నుంచి మహిళలకు ధైర్యాన్ని, భరోసాను, నమ్మకాన్ని ఇచ్చేదెవరు అని కవి ఆవేదన చెంది వ్యక్తీకరించాడు.

యక్కలూరి శ్రీరాములు ప్రేమోన్మాదులు గూర్చి ఇలా అంటాడు.

" ప్రేమ పదార్థం తనలో ఇముడ్చుకున్న వాడు

భూమిపై మనిషి రూపంలో ఒకడున్నాడు

అమ్మ పాలు తాగి

రొమ్మునే కాలుస్తాడు

అక్క ఎదురైనా మత్తెక్కి కామిస్తాడు

స్వజాతిని ద్వేషిస్తాడు

అహరహం అహంతో

జాతి రక్తం నెత్తురు రుచి మరిగిన వీడు

శ్మశాన క్షుద్రుడు

మనిషి రూపంలో

సరైన ఆలోచనలు కోల్పోయిన

ప్రమాదకర జంతువు" [172]

అని ఈ సమాజంలో కొంత మంది పురుషులు మహిళలను ప్రేమిస్తున్నామంటూ వెంటబడి తిరుగుతూ చివరికి వారు తిరస్కరించే సరికి తనకు దక్కలేదనే అనాలోచిత కోపంతో ఉన్మాదులుగా మారి ఆ మహిళల పై కత్తులతో దాడి చేసిన సంఘటనలు చాలా వున్నాయి. ఈ ఉన్మాదులు తమ పర అనే బేధం లేకుండా స్త్రీలపై అఘాయిత్యాలు చేస్తారు. మనిషి రూపంలో వున్న ప్రమాదకర జంతువులుగా కవి వ్యక్తీకరించాడు. మహిళలపై యాసిడ్ దాడులు, కిడ్నాపులు, మానబంగాలు, హత్యాకాండలు ఒకటేమిటి ఈ సమాజంలో మగాళ్ళు పురుషాధిక్యాన్ని, ఆధిపత్యాన్ని చెలాయిస్తూ అనేక దాడులు చేస్తున్నారు.

### 3.2.22 మృత శిశువులు:

కెరె జగదీష్ 'అమ్మా అని పిలువక ముందే' అనే కవితలో స్త్రీలు పసిబిడ్డలను చెత్తకుప్పల్లోనూ ముళ్ళకంపల్లోనూ మురికికాల్వల్లోనూ పడివేసే దృశ్యాలను చెబుతున్నాడు.

" ఆమె

మాతృత్వాన్ని చీదరించు కొంది

మానవత్వాన్ని పుక్కిలించింది

చీకటి ప్రయాణంలో

ముల్లు చేసిన గాయం

రక్తపు మరకల్ని మిగిల్చింది

కళ్ళ కిటికీలో

దూసు కొచ్చిన

వెలుగు కిరణాలను

రెప్పల చాటున దాచింది

ఉమ్మనీటి నుంచి జారి

అమ్మా అని పిలువక ముందే

చనుబాలను పితికి

నేలపాలు చేసింది” [173]

అంటూ కొంత మంది స్త్రీలు తమ మాతృత్వాన్ని, కన్నపేగు బంధాన్ని తెంచుకొని పసి పిల్లలను ఎక్కడ బడితే అక్కడ వదిలేసి వెళుతున్నారు.

“ కళ్ళు తెరవని

లేత శరీరాలు

వీధుల్లోని పందులకు

పండుగ సరదాను

పంచుతున్నాయి

చీకటి గదుల్లో

తొమ్మిది నెలల భారం

నవ్వుల పాలవుతూంటే

ఆకులు రాల్చిన శిశిరంలో

వసంతాన్ని ఒంటినిండా పూసుకోవాలని

పరుగులు” [174]

అని అప్పుడే పుట్టిన పసి పిల్లలను మానవత్వం లేని స్త్రీలు కొందరు తమ బిడ్డలను విడిచి వెళుతున్నారు. తొమ్మిది నెలలు మోసిన భారం తొమ్మిది ఘడియలు వుంచుకోకుండా వీధిపాలు చేసి పోతున్నారు.

“ వెలుగు సంగమంతో

చీకటి ప్రసవించిన

కర్ణుని కన్నీటి గాథలో

కాల ప్రవాహంలో

అనాధలెందరో అభాగ్యులెందరో

గుక్కెడు అమ్మ పాలు
గొంతు తడవక ముందే
గుప్పెడు మాతృ ప్రేమ
గుండెకు చేరక ముందే
చెత్తకుప్పల్లో
మురికి నీటి గుంటల్లో
మట్టిపొరల్లో
రోధిస్తూ రోధిస్తూ
విస్ఫోటనమైన
వేయి గొంతుకలై
మానవీయతను ప్రశ్నిస్తున్నాయి!" [175]

అని అనాదికాలంలోని కర్ణుని నుంచి నేటి కాలం దాకా ఈ కాల ప్రవాహంలో ఎందరో పసి బిడ్డలు చెత్త కుప్పలు, రోడ్ల ప్రక్కల్లోనూ, ముళ్ల కంపల్లోనూ ఎక్కడబడితే అక్కడ కనిపిస్తుంటారు. ఇలాంటి లేత పసి బిడ్డలు అమ్మపాలు రుచి చూడక అమ్మ పొత్తిళ్ళ ప్రేమను పొందలేక రోధిస్తున్నారు. ఇలాంటి ఎన్నో పసి హృదయాల గొంతుకలు సమాజం తలదించుకునేలా చేసిన స్త్రీల మాతృత్వ మానవీతను ప్రశ్నిస్తున్నాయని కవి వేదన చెందాడు.

వేంపల్లి అబ్దుల్ ఖాదర్ 'మృత శిశువులు' కవితలో ఇలా అంటాడు.

" దిక్కుమాలిన అనాథ చావులకు దూరంగా
ఏ పసిడి ఉయాల్లో బజ్జోవాల్సిన పసితనమో
పోస్ట్‌మార్టమ్ కత్తుల కింద
నిర్దయుగ ముక్కలవుతుంది!
ఏ కన్నతల్లి కౌగిట్లో కరిగి పోవాల్సిన వాత్సల్యమో
మార్చురీ మృత్యు పేటికల్లో ఘనీభవిస్తుంది!
ఏ తరగతి చెట్లకు
చిగురించాల్సిన లేత భవిష్యత్తో
హృదయమే లేని
శ్మశానం చితి ఛాతి మీద కాలి బూడిదవుతుంది! [176]

అని సమాజంలో ఎన్నో పసి హృదయాలు కన్నతల్లి కౌగిట్లలో వుండాల్సిన వారు వారి భవిష్యత్ తరం వృద్ధి చెందాల్సిన అమూల్యమైన పసి జీవితాలు దిక్కులేని వారుగా పడి చనిపోతున్నారు.

### 3.2.23 ప్రపంచీకరణ ప్రభావం:

'గ్లోబలైజేషన్' అనే ఆంగ్ల పదానికి సమానంగా 'ప్రపంచీకరణ' అనే పదాన్ని వాడుతు న్నాము. ఈ గ్లోబలైజేషన్ అనేది వివిధ దేశాల ప్రజలు, కంపెనీలు మరియు ప్రభుత్వాల మధ్య పరస్పర చర్య మరియు సమైక్యత. ఇది అంతర్జాతీయ రంగంలో వాణిజ్యం మరియు పెట్టుబడులపై ఆధారపడిన ఒక ప్రక్రియ. దీనికి సమాచార సాంకేతిక పరిజ్ఞానం మద్దతు ఇస్తుంది. ప్రపంచంలోని వివిధ దేశాల ఆర్థిక వ్యవస్థల మధ్య అడ్డంకులు లేకుండా వస్తుసేవలు, మూలధనం, సాంకేతిక పరిజ్ఞానం, శ్రామికులు స్వేచ్ఛగా కొనసాగడాన్ని ప్రపంచీకరణ అంటారు. ఇది ప్రపంచాన్ని గ్లోబల్ విలేజ్‌గా మారుస్తుంది. భారతదేశంలో 1991లో నూతన ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ఎల్.పి.జి. అనే అభివృద్ధి నమూనాను నాటి ప్రధాని పి.వి.నరసింహా రావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్‌లు ప్రారంభించారు.

ప్రపంచీకరణ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాలలో పెను మార్పులు సంభ వించాయి. ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, రాజకీయ రంగాలలో మార్పులు వచ్చి నూతన ఆవిష్కరణలు జరిగాయి. ప్రపంచీకరణ ప్రభావం వల్ల అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెరిగి పోయి సమాజంలో నూతన మార్పులు వచ్చాయి. అభివృద్ధి చెందే దిశలో నూతన కోణాల ద్వారా సాంకేతికతను అందిపుచ్చుకొని విప్లవాన్ని సృష్టించాయి.

ప్రపంచీకరణ ప్రభావం వల్ల వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగాలలో యంత్రాలు ప్రవేశించాయి. వ్యవసాయంలో కూలీలకు పెద్దగా పని లేకపోయింది. రైతులకు ఖర్చులు పెరిగి ఆదాయం తగ్గి పంటలకు గిట్టుబాటు రేట్లు తగ్గాయి. ఒక వైపు సబ్సీడీల కోత మరో వైపు పెరుగుతున్న వ్యయం. ప్రకృతిలో వచ్చే మార్పులు పాలకుల నిర్లక్ష్యం వల్లనూ వ్యవసాయం హైటెక్ జూదమయింది.

కెంగార మోహన్ 'మనుగడ' అనే కవితలో ఇలా అంటాడు.

" కార్పోరేట్ విష వలయంలో
విశ్వం జీవిత ఖైది అయ్యింది
నీరు, గాలి, భూమి, అగ్ని
అన్నీ అమ్మేస్తున్నారు
.......................
సిరులు పండించే అన్నదాత

రిలయన్స్ ఫ్రెష్, మోర్ షాపింగ్ మాల్స్
ముందు బిక్షాటన చేస్తున్నాడు
అరచేతిలో అశ్లీల ప్రపంచాన్ని
స్వేచ్ఛగా యువత సెల్లుల్లో వీక్షిస్తుంది
యువ కిషోరాల భవితను
2జి,4జి మెమోరి కార్డులు శాసిస్తున్నాయి.
ఉమ్మడి కుటుంబాలను
బుల్లితెర సీరియళ్ళు
చీల్చేశాయి
మంగళ సూత్రాలను స్పాన్సర్
కంపెనీలు తెంపేశాయి
హద్దులు, సరిహద్దులు, తోసుకొచ్చి
మనలోకి, మదిలోకి చొరబడ్డాక
మనుగడేముంటుంది." [177]

ప్రపంచీకరణ ప్రభావంతో కార్పోరేట్ కంపెనీలు ఈ దేశంలోకి ప్రవేశించిన తర్వాత సమాజంలో అనేక మార్పులు వచ్చాయి. స్వేచ్ఛా వ్యాపార ముసుగులో అనేక దుష్పరిణామాలు చోటు చేసుకున్నాయి. మనిషి నిమిత్తమాత్రుడయ్యాడు. రైతుల పంటలకు విలువ లేకుండా అయింది. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి యువత చెడు వ్యసనాలకు బానిసవుతున్నారు. కుటుంబ మానవ సంబంధాలు దూరమయ్యాయి. మానవ సమాజ మనుగడకే ప్రమాదకర పరిస్థితి ఎదురైంది. 'ప్రగతిచిత్రం' కవితలో ఇలా అంటున్నాడు.

" మార్పును చూస్తే
మదిలో భయము, సందేహము
గ్లోబల్ వైరస్
విశ్వమంతా వ్యాపించింది
మనిషినా? మార్కెట్ వస్తువునా?
దేశాభివృద్ధి బక్కచిక్కిన డొక్కల్లో
స్పష్టంగా అగుపిస్తోంది" [178]

అని ప్రపంచీకరణ ప్రభావం వల్ల సరళతర వాణిజ్యం, పెట్టుబడుల ప్రవాహం పెరిగి ప్రపంచమంతా

మార్కెట్‌లో మార్పులు వచ్చాయి. అభివృద్ధి పేరుతో అనేక మోసాలు జరిగే స్థితికి వచ్చింది. బడా మార్కెట్ కంపెనీ వాళ్ళు లాభాలు పడుతూ పేద, మధ్యతరగతి వారు కోలుకోలేని పరిస్థితికి వచ్చారు.

'పెత్తనం' అనే కవితలో సామ్రాజ్యవాద దేశాల పెత్తనాన్ని తెల్పుతున్నాడు.

" ఇక్కడున్నదంతా ఒకప్పుడు నాదే
ఇప్పుడు సామ్రాజ్యవాదుల
వశమైంది
మాతృభూమిపై పరాయివాడిగా
ఊపిరి పీలుస్తున్నా
ఇప్పుడిక్కడేం కావాలో క్షణాల్లో
దొరుకుతాయి
వాటిమీద పేరు వాడిదే
పెత్తనం వాడిదే" [179]

అని 'సామ్రాజ్యవాదం' ప్రపంచమంతా విస్తరించిన తర్వాత దేశాలపై ఆదిపత్యం, పెత్తనం చెలాయించడం మొదలయింది.

'బహుముఖీయం' కవితలో ప్రపంచీకరణ వ్యాపార విష సంస్కృతి మనిషిపై ఏవిధంగా ప్రభావం చూపిస్తుందో తెల్పుతున్నాడు.

" మనిషిని, మనసును
మెదడును మార్కెట్ మార్చింది
యోచనలు, లోచనలు
వ్యాపారీకరించబడ్డాయి
భావాలు, భావనలు
బహిష్కరించబడ్డాక
త(నూ)నువొక యంత్రమే
...........................
ఆధునిక హంగుల రంగుల
హోయలో సంస్కృతి పరారైంది
సమాజంలో గ్లోబల్ సమాజం

పురుడు బోసుకుంది

బహుముఖీయ రూపాల్లో

బలి పశువులు మనమే” [180]

అని మార్కెట్ శక్తులు సమాజంలోకి చొరబడిన తర్వాత మనిషి ఆలోచనా స్వరూపాన్ని మార్చివేశాయి. మనిషి మనుగడ ప్రశ్నార్థకమైంది. సమాజ సంస్కృతి పరాయీకరణ చెందింది. గ్లోబల్ శక్తులు సమాజ స్వరూపాన్ని మార్చివేసి మనిషిని కబంధహస్తాల్లోకి బంధించేటట్లు చేసింది.

'గ్లోబల్ శారద' కవిత్వంలో తెలుగు భాష పై చిన్నచూపు చూడటాన్ని కవి చెబుతూ,

“ ఆంగ్ల ప్రేయసి కౌగిట్లో

అమ్మ ప్రేమ మాయమైంది

మాతృత్వ మమకారాన్ని

కార్పోరేట్ సరస్వతి చంపేసింది

……………………………

మరణ శయ్యపై పడిన

మాతృభాష తులసీ తీర్థానికి

పరితపిస్తోంది

నల్దిక్కులు ఇ–స్కూళ్ళు

కెజి టు పీజీల హోరులో

సర్కారు బళ్ళు కొన ఊపిరితో

కొట్టుమిట్టాడుతున్నాయి

అచ్చులు, హల్లులు,

హొత్తులు, దీర్ఘాలు

అనంత వాయువుల్లో

కలిసే సమయమొచ్చింది

ఛందస్సు, అలంకారాలు

సౌందర్య హీనమయ్యాయి

తెలుగు సామెతలు వైరాగ్యంతో

నిష్క్రమించాయి

పెద్దబాలశిక్షను గ్లోబలీయుల ఆజ్ఞతో

ఆంధ్రీయులు జీవితఖైది చేశారు" [181]

అంటూ ప్రపంచీకరణ ప్రభావం వల్లనూ ప్రపంచ వ్యాప్తంగా అధునాతన సాంకేతిక పరిజ్ఞానం పెరగడం, ఆంగ్లభాషా వ్యాప్తిలోకి రావడం వల్ల మన దేశంలో మాతృభాషల యొక్క ఉనికి ప్రమాదంలోకి పడింది. ఆంగ్లభాషను నేర్చుకోవడం, మాట్లాడటం ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. తెలుగు భాష, సాహిత్యం తమ ప్రాధాన్యాన్ని కోల్పోయే ప్రమాదంలోకి వచ్చాయి. ఇ స్కూల్స్, టెక్నోస్కూల్స్, కెజి టు పీజీ అంటూ రకరకాల పేర్లతో ఆంగ్లభాషకు మొదటి ప్రాధాన్యాన్ని కల్పించాయి.

'చిత్రకారుడు' అనే కవితలో చిత్రకారుడు పడుతున్న వేదనను చిత్రించాడు.

" భావాలను, భావనల కుంచతో

జ్ఞాపకాల రంగులద్ది

ముఖచిత్రం గీసుకున్నా

అస్థికలను వొకటి చేసి

సత్తువ కూడగట్టి

అద్భుత మాయా ప్రపంచపు

మార్కెట్ ప్రపంచీకరణ రూపం

సప్త వర్ణాల్లో వేసుకున్నా

..................................

అనుభూతులను చిత్రిద్దామంటే

అనుభవాలన్నీ ఫ్లెక్సీలలో బంధీ అయ్యాయి.

రంగులూ, సొగసులూ

కాలచక్రంలో వెనక్కి నెట్టబడ్డాయి

మదిపెడ్తున్న తొందరకు

కార్పొరేటు ఔట్‌లైన్సు వేసి

చితికిన చిత్రకారుడి జీవితాన్ని వేశా" [182] అని చిత్రాలు వేసే కళాకారుడి కష్టాలను కవి తెల్పాడు. చిత్రాలు వేయడానికి రంగులు, కుంచెలు, బ్రెష్‌లు, పెన్సిల్స్ లాంటి రకరకాలైన వాటిని ఉపయోగించేవారు. అయితే నేటి ఆధునిక కాలంలో టెక్నాలజి పెరిగి యంత్ర పరికరాలు వచ్చి ఫ్లెక్సీలు దర్శన మిస్తున్నాయి. కళాకారుల పనితనాన్ని తగ్గించి ఉపాధి లేకుండా చేసింది.

డి.కె. చదువుల బాబు 'ప్రశ్నార్థకం' కవితలో ఇలా అంటాడు.

" పొలాలపై పంట యంత్రాల ఎనుబోతులు
కాలువలపై క్రొకేన్ కొండచిలువల కౌగిలి
వ్యవసాయ కూలీల కడుపై పిడుగు పాట్లు" [183]

అని వ్యవసాయం చేయడానికి అధునాతన యంత్ర పరికరాలు వచ్చి పల్లె కూలీలకు పెద్దగా పని లేకుండా పోయింది.

" గ్రైండర్ బ్లేడుల మధ్య నల్గుతూ
సుత్తి, ఉలుల నమ్ముకున్న సృజనకారుడి గుండె
తిరుగలి, రుబ్బురోలు ఆకలి కేకల
ఆరిన దిగులు దివిటీలయ్యాయి" [184]

పాతతరం కాలం నాటి ఇళ్ళల్లో ఇసుర్రాయి, రుబ్బురోలు, తిరుగలి ఇంకా అనేక రకాల పరికరాలు వుండేవి. వాటిని తయారు చేసేవారు ఉపాధిని పొందేవారు. వాటి స్థానంలో గ్రైండర్లు, కుక్కర్స్, మిక్సీలు వచ్చి చేరాయి.

" వాషింగ్ మిషన్ మిసమిసలకు
చితికిన ధవళ హృదయాలు
జెంట్స్ పార్లర్లు, ఎలక్ట్రానిక్ రైజర్ల మంటల్లో
మసిబారిన మంగళి పెట్టె " [185]

వాషింగ్ మిషన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలు వచ్చి అలాగే బ్యూటి పార్లర్స్‌లలో అధునాతన సౌందర్య లేపనాలు వచ్చి చాకలి, మంగలి వాళ్ళకి గిరాకి తగ్గింది.

" కొయ్య నాగలి, కొయ్య గొర్రు, దంతెలు
ధూళాలు, స్థంభాలు, కొయ్య కుర్చీ, మేజాలు
శిథిలమైన జ్ఞాపకాలు
వరద వెల్లువలో వడ్రంగి జీవితం
యంత్ర చక్రాల మధ్య వందల బతుకులు పతనం
ప్రపంచీకరణ దోపిడీలో
ఛిద్రమైన బతుకులు ప్రశ్నార్థకమే!" [186]

వడ్రంగులు పల్లెల్లో జీవనం సాగించేవారు. రైతులకు, ప్రజల నివాసానికి అవసరమయ్యే వస్తువులను

తయారు చేసేవారు. యంత్ర పరికరాలు రావడం వల్ల వారి బతుకులు ఛిద్రమయ్యాయి.

లోసారి సుధాకర్ ' మా ఊరొక వసుధైక కుటుంబం' కవితలో ప్రపంచీకరణ ప్రభావం మరియు నేటి సాంకేతిక పరిజ్ఞానం వల్ల గ్రామాల్లో కనుమరుగైపోతున్న సంస్కృతిని చిత్రించాడు.

" బయలు నాటకాలు
తోలు బొమ్మలాటల్ని
హరికథల్ని, బుర్రకథల్ని
మింగేసిన సినిమాలు, టీవి సీరియళ్ల కాలుష్యం
ఎడ్లు పోయి యంత్రాలు
సేద్యం చేస్తున్నాయి
కర్టెన్లతో కప్పిన ద్వారాలు
కువైట్ బీబీ
నల్ల గాగూల్సులా ఉన్నాయి
పాలు, మజ్జిగ, గోళీ సోడాలు, కొబ్బరి బోండాలు
పోయి మత్తు మందులూ
విదేశీ పానియాలు వెలిశాయి
కర్రాబిల్లా, గోళీ కాయలు
బొంగరాలాటల స్థానంలో
క్రికెట్టు, వాలీబాలాటలు వచ్చాయి
కట్టు బొట్టు చీర పంచె మసిబారుతున్న వైనం
వాస్తవం వొక గాయమై గుచ్చుకొని
జ్ఞాపకాల పర్రల్లోకి దూరి
నాలోని తడిని త్రవ్వుతుంది" [187]

సమాజంలో కాల ప్రవాహ పరిణామంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడం వల్ల పాతతరం నాటి వస్తువుల స్థానంలో కొత్తవి వచ్చాయి. ఎన్నో యేళ్ళ నుంచి తరతరాలుగా సంప్రదాయ బద్ధంగా కాపాడుకొంటూ వచ్చిన సంస్కృతి సంప్రదాయాలు సాంకేతికత మహిమ వల్ల దాని మనుగడే ప్రశ్నార్థకమైంది. ఈ ప్రపంచీకరణ ప్రభావం అన్నది సమాజం, మనిషి మనుగడను నిలువ నీడలేక కనుమరుగయ్యే స్థితికి తెచ్చింది.

కుమారస్వామి 'నా మదర్‌టంగ్ తెలుగే' కవితలో దేశీయ సంగీతాలు, కళల స్వరూపాలు మారుతున్న సందర్భాన్ని గుర్తుచేస్తున్నాడు.

" మైఖేల్ జాక్సన్ రాకతో పులకించిన
కూచిపూడి
తన పదగతుల్ని మార్చుకుంది
శాస్త్రీయ సంగీతం పరవశించి
నిలువెల్లా వంకరలు పోతోంది
పద్యం నిలువెల్లా కరిగి విరిగి
బీట్ కనుగుణంగా
నృత్యం చేస్తోంది" [188]

ఫ్రెండ్‌షిప్‌డే, వాలెంటైన్స్‌డే, జనవరి ఫస్ట్, ఫ్యాషన్ షోలు, డిస్కోథెక్‌లు, పబ్‌లు, పార్టీలు వంటి వాటిలో వ్యాపార సంస్కృతి మితిమీరిపోయింది. ఇది దేశీయ సంగీత నృత్యాలను, పాటలను ప్రభావితం చేస్తోంది. ఈ సంస్కృతి విషాదాన్ని కవి ఆర్తిగా వ్యక్తీకరించాడు.

రాధేయ 'మిత్రుడు కన్పించడం లేదు?' కవితలో సాంకేతిక పరిజ్ఞానం అనేది మనిషి, మానవ సంబంధాలపై ఎంతటి ప్రభావం చూపిస్తుందో తెలుపుతున్నాడు.

" ప్రపంచమే ఓ కుగ్రామమై
వీళ్ళ అరచేతుల్లో కొచ్చింది
మాటల్ని కొంటున్నారు
అభిమానాల్ని అమ్ముకుంటున్నారు
వీళ్ళకి కన్నవాళ్ళు
కవరేజి ఏరియాల్లో కన్పించరు
వీరంతా సెల్‌ఫోన్ రింగుల్లోంచి
శబ్దరత్నాకరం నేర్చుకుంటున్నారు
ఇంటర్నెట్‌లో కూర్చోని
శృంగార నైషథం అధ్యయనం చేస్తుంటే
అమ్మానాన్నలకు అనాథ శరణాలయాలే
ఆదుకొంటాయి" [189]

సాంకేతిక పరిజ్ఞానం మాయలో మనిషి చిక్కుకున్నాడు. తన ఆలోచనల్ని, మనసుని, అనుబంధాలను, ఆత్మీయతలను దూరం చేసుకుంటున్నాడు. ఒంటరిగా వుంటూ ఇతరులతో కలవకుండా కన్నవారిని దూరం చేసుకుంటూ మమతానురాగాలను దూరం చేసుకుంటున్నాడు.

మధుర శ్రీ ' పద్మవ్యూహాన్ని ఛేదిద్దాం రండి' కవితలో సామ్రాజ్యవాద స్వభావాన్ని చెబుతూ మనిషిని ఏకాకిగా చేస్తున్న దృశ్యాన్ని తెల్పుతున్నాడు.

" బహుళజాతి విషవృక్షాల వేళ్ళు లోయల్లోకి విస్తరిస్తున్నాయి
విదేశీ కంపెనీ చూపులకు కౌలు భూములు వణికి పోతున్నాయి
నల్లధనాన్ని మేటలు వేసుకుంటున్న
కల్తీ ఉత్పత్తి సంస్థలు మట్టి కరవాలి
లిప్తకాలం ఊరుకున్నావా బహుళజాతి హస్తాలు చాచి
నీ వారికి నోటిముద్దను దూరం చేస్తోంది
డాలర్ల చూపుతో నీ పై దాడి చేస్తోంది
సామ్రాజ్యవాద ఊబిలో చిక్కి
నిన్ను అనాదగా మారుస్తోంది" [190]

ఈ దేశంలోకి బహుళజాతి కంపెనీలు వచ్చి మార్కెట్‌ను విస్తరించి లాభాలే లక్ష్యంగా పెట్టుబడులు పెట్టి డాలర్ల మోజులో ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నాయి.

కె.బాబ్జి 'యుద్ధం అనివార్యమైన చోట' కవితలో ఏమంటున్నాడో చూడండి.

" దశాబ్దాల పాటు ముస్లిం దేశాలను
నిలువునా చీల్చిందెవరు? ఎందుకు?
ల్యాండ్ లీజు కావచ్చు
ఆయుధాల వ్యాపారం కావచ్చు
నీ మార్కెట్ విస్తరణ కావచ్చు
కారణం ఏదైతేనేమి
నువ్వు నిప్పు రాజేయని దేశం ఏదైనా ఉందా?
నీ గ్లోబల్ కుటుంబంలో
ఆకలి చావులేని రోజు ఏదైనా వుందా?
భయపెట్టడం బెదిరించడం తప్ప

ప్రపంచ సమస్యలలో

ఏదైనా పరిష్కరించావా?" [191]

అని సామ్రాజ్యవాదం పేరుతో అగ్రరాజ్యాలు చేస్తున్న దాడులు, ఆధిపత్య ధోరణులు, మార్కెట్ విస్తరణ లాంటి అంశాలను నిరసిస్తూ కవి ప్రశ్నిస్తున్నాడు. సామ్రాజ్యవాద దేశాల స్వభావాన్ని ఎండగడుతున్నాడు. యక్కలూరి శ్రీరాములు 'నా రెండు పాదరక్షలతో నమస్కారం' కవితలో ప్రపంచీకరణ ముసుగులో ఈ ప్రపంచమంతా దోపిడి చేయబడే వైనాన్ని చిత్రించాడు.

" సూదిమొన ఆనినంత భూమిని సైతం

వదలకుండా ఆక్రమించుకుంటూ

నీటిని ప్లాస్టిక్ బాటిల్స్

క్యాన్‌లలో నించి అమ్ముకుంటూ

గాలిని(ఆక్సిజన్ బాక్స్) పెట్టెల్లో బందించి

సొమ్ము చేసుకుంటూ

నిప్పును సిలిండర్‌లో నింపి

వెలుగుకు వెలకడుతూ

చంద్రున్ని, ఆకాశాన్ని ప్లాట్లుగా చేసి

నిస్సిగ్గుగా మనిషి జీవితాన్ని శిలువ చేస్తూ

భూమి, నీరు, గాలి, నిప్పు, ఆకాశం

ప్రకృతి ప్రసాదించిన ప్రాణ ప్రదమైన అవసరాలన్నిటిని

కాసుల కోసం రాసులుగా పోసి

పంచభూతాలని వ్యాపార వస్తువులుగా చేసి

భూమండలంలో డబ్బు వున్నవాడే బతకాలని

లేనినాడు లేనివాడు తప్పకుండా చావాలని

భూమి, నీరు, నిప్పు, గాలి, ఆకాశం

వ్యాపార వస్తువులైతే చావక చస్తాడా

పంచభూతాలు పంచ ప్రాణాలు తీస్తుంటే

క్షణకాలం జీవిస్తాడా

మనుషుల జీవితాల్ని శాసిస్తున్న

కార్పొరేట్ వ్యాపారానికి

నా రెండు పాదరక్షలతో నమస్కారం" [192]

ఈ దేశంలోకి బహుళజాతి, కార్పొరేట్ కంపెనీలు ప్రవేశించిన తర్వాత దేశ స్వరూపం మారిపోయింది. గ్లోబలైజేషన్ పేరుతో వ్యాపార ముసుగులో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. సమాజంలో మనిషి మనుగడ ప్రశ్నార్థకమై బతుకు భారమైంది.

## పాదసూచికలు - మూడవ అధ్యాయం

1. మధుసూధన రావు. త్రిపురనేని, సాహిత్యంలో వస్తుశిల్పాలు, పుట-14

2. లక్ష్మీకాంతం.పింగళి, సాహిత్య శిల్ప సమీక్ష, పుట-39

3. మధుసూధన రావు. త్రిపురనేని, సాహిత్యంలో వస్తుశిల్పాలు, పుట-13

4. వీరభద్రయ్య.ముదిగొండ, విమర్శ కళాతత్త్వ శాస్త్రాలు, పుట-201

5. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-15

6. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-188

7. రాజారాం.టి, అతడే, పుట-48

8. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, కిరణం, పుట-95

9. సీమకవిత, పుట-11

10. మునిసుందరం, మట్టవాసన, పుట-35,36

11. చదువుల బాబు.డి.కె, ఆకాశం అందుతోంది, పుట-30

12. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, పొలి, పుట-42

13. గోపిని కరుణాకర్, పొద్దున్నే వచ్చిన వాన, పుట-40,41

14. చిదంబర రెడ్డి. సడ్లపల్లె, మహాభినిష్క్రమణం, పుట- 29,30

15. అనంత కవిత, పుట-128,129

16. బిక్కి కృష్ణ, చినుకు, పుట-66

17. చంద్రశేఖర్ రెడి. రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-83

18. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, పొలి, పుట-02

19. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, పొలి, పుట-06

20. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, పొలి, పుట-09

21. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, పొలి, పుట-16

22. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, పొలి, పుట-35

23. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, పొలి, పుట-39

24. శంకరరాజు. బడబాగ్ని, వానచూపు.పుట-40

25. శంకరరాజు. బడబాగ్ని, వానచూపు.పుట-46

26. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట-48

27. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట-32

28. ప్రేంచంద్.జూపల్లి, నిచ్చెనమెట్ల లోలకం, పుట-71

29. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-09

30. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-09

31. సీమ కవిత, పుట-50

32. సీమ కవిత, పుట-92

33. షేక్ నబీరసూల్.కంబదూరి, కమ్మని కంఠం నాకు లేదు, పుట-19

34. వెంకట కృష్ణ.జి, దున్నే కొద్దీ దుఃఖం, పుట-37,38

35. వెంకట కృష్ణ.జి, హంద్రీగానం, పుట-08,09

36. ఈశ్వర రెడ్డి.ఎన్, కన్నీటి సీమ, పుట-18,19

37. బిక్కి కృష్ణ, చినుకు, పుట-53

38. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు- సందర్భాలు, పుట-103

39. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం,ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు-సందర్భాలు,పుట-103,104

40. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-194

41. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-329

42. అనంత కవిత, పుట-114

43. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-45

44. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-23

45. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట- 45,47

46. చంద్రశేఖర శాస్త్రి.వి, ఒక కత్తుల వంతెన, పుట- 64

47. అనంత కవిత, పుట- 31

48. వెంకట కృష్ణ.జి , హంద్రీగానం, పుట-45

49. ఈశ్వర రెడ్డి.ఎన్, కన్నీటి సీమ, పుట-44

50. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-220

51. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-223

52. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట-44

53. ఒక కత్తుల వంతెన, పుట-40

54. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్దీ దుఃఖం, పుట-27

55. రాధేయ, అవిశ్రాంతం, పుట-32,33

56. కెంగార మోహన్, కవనసేద్యం, పుట-54

57. అబ్దుల్‌ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట-59,60

58. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-01

59. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-01,02

60. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-06

61. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-07

62. చంద్రశేఖర్.ఎస్.జి.డి, సౌందర్యం ఎక్కడ వుంటుందో అక్కడ నేను, పుట-17

63. వెంకటకృష్ణ..జి, హంద్రీగానం, పుట-35,36

64. సుధాకర్.లోసారి, మైనపు బొమ్మలు, పుట-34

65. స్వరూప్ కృష్ణ.జె, ఇప్పుడో నది కావాలి, పుట-37

66. కేశవ రెడ్డి. నందవరం, కామాలే, పుట- 02,03

67. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట-56

68. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట-56,57

69. కవితా సుమాలు, పుట-34,35

70. పాలవాయి రాధిక, ఈ చీకట్లను తొలగించలేమా, పుట-28

71. శ్రీరాములు.వై, మూడు ఎడారులు ఏడు సముద్రాలు ఒకే ఒక్క అనంతపురం, పుట-32

72. శ్రీరాములు.వై, జలగండం, పుట-01

73. శ్రీరాములు.వై, జలగండం, పుట-44,45

74. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-23

75. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-254

76. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-254

77. కవితా సుమాలు, పుట-49

78. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్దీ దుఃఖం, పుట-23

79. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్దీ దుఃఖం, పుట-23,24

80. కల్పనా రెంటాల, నేను కనిపించే పదం, పుట-56,58

81. కల్పనా రెంటాల, నేను కనిపించే పదం, పుట-08

82. కల్పనా రెంటాల, నేను కనిపించే పదం, పుట-14

83. కల్పనా రెంటాల, నేను కనిపించే పదం, పుట-02

84. కల్పనా రెంటాల, నేను కనిపించే పదం, పుట-03

85. కల్పనా రెంటాల, నేను కనిపించే పదం, పుట-04

86. నాగపద్మిని.పుట్టపర్తి, హద్దులు, పుట-67

87. పద్మావతమ్మ.పసుపులేటి, మౌనఘోష, పుట-13

88. కవితాసుమాలు, పుట-21

89. కవితాసుమాలు, పుట-21

90. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట-79

91. శ్రీరాములు.వై, మూడు ఎడారులు ఏడు సముద్రాలు ఒకే ఒక్క అనంతపురం, పుట-86,87

92. బిక్కి కృష్ణ, చినుకు, పుట-78

93. సుందర్రాజు. నాగప్పగారి, ఛండాలచాటింపు, పుట-35

94. సుందర్రాజు. నాగప్పగారి, ఛండాలచాటింపు, పుట-42

95. సుందర్రాజు. నాగప్పగారి, ఛండాలచాటింపు, పుట-76

96. సుందర్రాజు. నాగప్పగారి, ఛండాలచాటింపు, పుట-36

97. సుందర్రాజు. నాగప్పగారి, ఛండాలచాటింపు, పుట-78

98. సుందర్రాజు. నాగప్పగారి, ఛండాలచాటింపు, పుట-50

99. సుందర్రాజు. నాగప్పగారి, ఛండాలచాటింపు, పుట-51

100. ప్రకాశరావు. ఆశావాది, అంతరంగ తరంగాలు, పుట-21

101. ప్రకాశరావు. ఆశావాది, అంతరంగ తరంగాలు, పుట-32

102. రాజారాం.టి, అతడే, పుట-52,53

103. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట-80,82

104. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట-88

105. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట-92

106. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట-90

107. రాజారాం.టి, అతడే, పుట-41,43

108. పొలవాయి రాధిక, ఈ చీకట్లను తొలగించలేమా, పుట-18,19

109. వెంకటకృష్ణ.జి, కొన్ని రంగులూ ఒక పద్యం, పుట- 20,21

110. రాజారాం.టి, అతడే, పుట-38

111. వెంకటకృష్ణ.జి, కొన్ని రంగులూ ఒక పద్యం, పుట- 116,117

112. మధురశ్రీ, మథనం, పుట-81,82

113. రాజారాం.టి, అతడే, పుట-34

114. రాజారాం.టి, అతడే, పుట-35

115. వెంకటకృష్ణ.జి, లోగొంతుక, పుట-17

116. వెంకటకృష్ణ.జి, లోగొంతుక, పుట-18

117. శ్రీరాములు.వై, చేయి చాచిన వెన్నెల, పుట-40,41

118. శ్రీరాములు.వై, చేయి చాచిన వెన్నెల, పుట-50,51

119. శ్రీరాములు.వై, చేయి చాచిన వెన్నెల, పుట-43,44

120. శ్రీరాములు.వై, చేయి చాచిన వెన్నెల, పుట-54

121. శ్రీరాములు.వై, చేయి చాచిన వెన్నెల, పుట-69

122. శ్రీరాములు.వై, చేయి చాచిన వెన్నెల, పుట-66

123. రాధేయ, అవిశ్రాంతం, పుట-17,18

124. గంగప్ప.ఎస్. చైతన్య కిరణాలు, పుట- 06,07

125. చంద్రశేఖర్ రెడ్డి. రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-16

126. ప్రకాశరావు.ఆశావాది, అంతరంగ తరంగాలు, పుట-49

127. జెట్టీ జైరామ్, జననేత్రం, పుట- 16

128. జెట్టీ జైరామ్, జననేత్రం, పుట-17

129. జెట్టీ జైరామ్, జననేత్రం, పుట-57

130. షేక్ నబీరసూల్.కంబదూరి, కమ్మని కంఠం నాకు లేదు, పుట-42

131. వెంకటకృష్ణ.జి, హంద్రీగానం, పుట-09

132. అనంత కవిత, పుట-79,80

133. ఈశ్వర రెడ్డి.ఎన్, కన్నీటి సీమ, పుట-8,9

134. ఈశ్వర రెడ్డి.ఎన్, కన్నీటి సీమ, పుట-10,11

135. మునిసుందరం, మట్టివాసన, పుట-62,63

136. చదువుల బాబు.డి.కె, ఆకాశం అందుతోంది, పుట-49

137. సుధాకర్ లోసారి, మైనపు బొమ్మలు, పుట-80,81

138. సుధాకర్ లోసారి, మైనపు బొమ్మలు, పుట-82,83

139. సుధాకర్ లోసారి, మైనపు బొమ్మలు, పుట-83,84

140. అనంత కవిత, పుట-106,107

141. అనంత కవిత, పుట-107,108

142. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట-23

143. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట-24,25

144. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట-195

145. నెలవంక, సాహిత్య మాసపత్రిక, పుట-3

146. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట-80

147. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట-81

148. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట-33

149. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట-33,34

150. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట-121

151. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-12

152. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-13,14

153. స్వరూప్ కృష్ణ.జె, ఇప్పుడోనది కావాలి, పుట-37

154. కేశవ రెడ్డి.నందవరం, కామాలే, పుట-52

155. కేశవ రెడ్డి.నందవరం, కామాలే, పుట-52,53

156. కేశవ రెడ్డి.నందవరం, కామాలే, పుట-53

157. కేశవ రెడ్డి.నందవరం, కామాలే, పుట-23

158. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట-125,126

159. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట-134,135

160. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట-92

161. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట-51,52

162. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట-113,114

163. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట-03

164. శశిశ్రీ, జేబులో సూర్యుడు, పుట-34

165. శశిశ్రీ, జేబులో సూర్యుడు, పుట-35

166. పెన్నేరు పక్ష పత్రిక, పుట-22

167. చిదంబర రెడ్డి.సడ్లపల్లె, దృశ్య ప్రవాహం, పుట-120,121

168. అబ్దుల్ఖాదర్.వేంపల్లి, కిరణం, పుట-34,35

169. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట-40

170. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట-40,41

171. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట-41

172. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట- 104

173. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట-47

174. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట-47,48

175. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట-48,49

176. అబ్దుల్ ఖాదర్.వేంపల్లి, కిరణం, పుట-69

177. కెంగార మోహన్, విన్యాసం, పుట-40,41

178. కెంగార మోహన్, విన్యాసం, పుట-31

179. కెంగార మోహన్, విన్యాసం, పుట-34

180. కెంగార మోహన్, విన్యాసం, పుట-37,38

181. కెంగార మోహన్, విన్యాసం, పుట-46,47

182. కెంగార మోహన్, విన్యాసం, పుట-95

183. చదువుల బాబు.డి.కె, ఆకాశం అందుతోంది, పుట-59

184. చదువుల బాబు.డి.కె, ఆకాశం అందుతోంది, పుట-59

185. చదువుల బాబు.డి.కె, ఆకాశం అందుతోంది, పుట-59

186. చదువుల బాబు.డి.కె, ఆకాశం అందుతోంది, పుట-59

187. సుధాకర్.లోసారి, మైనపు బొమ్మలు, పుట-81

188. పిల్లా కుమార స్వామి, కవితాసంద్రం, పుట-13

189. రాధేయ, అవిశ్రాంతం, పుట-68,69

190. మధురశ్రీ, మథనం, పుట-11

191. బాబ్జి, యుద్ధం అనివార్యమైన చోట, పుట-10

192. శ్రీరాములు.వై, మూడు ఎడారులు ఏడు సముద్రాలు ఒకే ఒక్క అనంతపురం, పుట-99,100

# నాల్గవ అధ్యాయం

# రాయలసీమ ఆధునిక కవిత్వం-
# ప్రాంతీయ చైతన్యం
# (1986-2015)

# నాల్గవ అధ్యాయం
# 4.రాయలసీమ ఆధునిక కవిత్వం- ప్రాంతీయ చైతన్యం
(1986-2015)

తెలుగు సాహిత్య సృజనాత్మక ప్రక్రియల్లో కవిత్వానికి ఎనలేని ఆదరణ వుంది. ఆధునిక సాహిత్యం ఇరవయ్యో శతాబ్ది చివరి దశలో విభిన్న పరిణామాలు సంభవించాయి. ఇదే కాలంలో సాహిత్య స్రవంతిలో ఏకతావాదం విచ్ఛిన్నమై వినిర్మాణానికి దారి తీసింది. విభిన్న అస్తిత్వాలు పాదుకొని చైతన్య వంతంగా బలపడ్డాయి. ఏ అస్తిత్వవాద ఉద్యమమైనా, ధోరణి అయినా ప్రధానంగా కవిత్వ ప్రక్రియలో ఆరంభమై బలపడ్డాకనే ఇతర ప్రక్రియల్లోకి విస్తరిస్తుంది. ఈ దిశలో తెలుగు సాహిత్యంలో ఆధునిక కవిత్వం నిరంతరం నవ్యతని సంతరించుకొని ముందుకు పయనిస్తోంది. ఇరవయ్యో శతాబ్ది ప్రారంభం నుంచి వచ్చిన సంఘ సంస్కరణ, జాతీయోద్యమ కవిత్వాలతో మొదలుకొని భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ కవిత్వోద్యమాలు దీనినే సూచిస్తున్నాయి. 1980ల మధ్య కాలానికి విప్లవ సాహిత్యోద్యమం బలహీన పడిన తర్వాత కవులు, రచయితలు ఎక్కువగా ఆర్థిక దోపిడి, రాజ్యహింస, వర్గదృష్టితో రాస్తూ వచ్చారు. మనిషి జీవితంలోనూ సమాజంలోనూ జెండర్, కులం, మతం, ప్రాంతం, వృత్తి వంటి ఎన్నో అంశాలు నిర్వహిస్తున్న పాత్రను విస్మరించారు. దీనిని ప్రశ్నించే క్రమం 1985ల నాటికి ఏర్పడింది. తర్వాతి క్రమంలో ఎవరి అనుభవాలను వాళ్ళే బలంగా వినిపించగలరన్న భావనకు బలం చేకూరింది. ఈ భావన తొలుత స్త్రీవాద కవిత్వ సృజనకు పునాది అయింది. స్త్రీవాదం తర్వాత దళితవాదం ముందుకు వచ్చింది. ఈ విధంగా అస్తిత్వవాద ఉద్యమాల్లో భాగంగా స్త్రీ, దళిత వాదాలు అగ్రభాగాన నిలిచిన తర్వాత ఈ అస్తిత్వ వాదాల చైతన్యాన్ని అందుకొని మైనారిటీ, ప్రాంతీయ అస్థిత్వవాదాలు ముందుకు వచ్చాయి.

## 4.1. ప్రాంతం అర్థం- నిర్వచనం:

ప్రాంతాన్ని సాధారణమైన అర్థంలో 'ఒక నిర్దిష్టమైన శాశ్వత ప్రదేశంగా' నిర్వచించవచ్చు. ఇంగ్లీషులో Region అనే పదాన్ని తెలుగులో ప్రాంతం అంటారు. Oxford English Dictionary(2009) లో Region గురించిన అర్థాన్ని ఇలా వివరించబడింది.

> ''Region(n)=an area of a country or the world having
> definble Characteristics but not always fixed
> boundaries originated from middle english:
> from old french, from latin, region(n)-
> direction, district; from 'regere' to rule, direct''[1]

“ ప్రాంతం ( Region ) ఒక సమాజ శాస్త్రీయ అస్తిత్వం. దీన్ని వివిధ కారకాల ద్వారా గుర్తించవచ్చు. ఎస్.ఆర్.మహేశ్వరి అభిప్రాయం ప్రకారం ప్రాంతం అనేది భౌగోళిక పరిస్థితి, స్థలాకృతి, భాష, మతాలు, సాంస్కృతిక ఆచరణలు, ఆచారాలు, అభివృద్ధి యొక్క సామాజిక ఆర్థిక రాజకీయ దశలు, చారిత్రక నేపథ్యం, సమిష్టి జీవన విధానం, ప్రజలలో మనం అనే భావన లాంటి చలాంకాల ఆధారంగా ఇతర ప్రాంతాల కంటే ప్రత్యేకంగా ఉండే ప్రాంతం”[2] ప్రాంతంగా గుర్తింప బడుతుందని మహేశ్వరి గారు విస్తృతమైన అర్థంలో నిర్వచించారు. భూమి యొక్క భౌతిక లక్షణాలయిన భూమి రూపం, వాతావరణం, నేల తీరు, అటవీ సంపద, మానవ మనుగడ వంటి లక్షణాలు ప్రాంతాన్ని నిర్వచించడానికి ప్రాతిపదికలయితే మనం ప్రాంతాన్ని భౌతిక, భౌగోళిక, ఆర్థిక, సామాజిక– సాంస్కృతిక ప్రాంతాలుగా వర్గీకరించవచ్చు. భౌగోళికంగా ఒక నిర్దిష్ట సరిహద్దులను కలిగి చారిత్రకంగానూ, రాజకీయంగానూ సుదీర్ఘ పాలనలో వుండి, ఆర్థికంగా ఉత్పత్తి విధానాలూ, మానవ సంబంధాలు కలగలసిన జీవన విధానం లాంటివన్ని ప్రాంతానికి సంబంధించిన అస్థిత్వ అంశాలుగా చెప్పుకోవచ్చు. ప్రాంతం అనే పదం నుంచే ‘ప్రాంతీయత’ అనే భావన కూడా స్ఫురిస్తుంది. ప్రాంతీయతను తెల్పేటప్పుడు ‘స్థానికత’ ప్రాధాన్యం వహిస్తుంది. ఒక నిర్దిష్ట ప్రాంతంలో జన్మించిన వ్యక్తి ఆ ప్రాంతానికి స్థానికుడు అవుతాడు. ఆ ప్రాంతంలోని చారిత్రక, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక సంప్రదాయల పరిస్థితుల ద్వారా తన ప్రాంతీయతను చాటుకోవడం గమనించవచ్చు. ప్రాంతం, ప్రాంతీయత, స్థానికత, దేశీయం దాదాపుగా సమానార్థకాలుగా పరిగణించవచ్చు.

సుప్రసిద్ధ భౌగోళిక శాస్త్రవేత్త నార్టన్ గిన్స్‌బర్గ్ భావించినట్టుగా “ప్రాంతం అన్న పదాన్ని అందరికీ ఆమోదయోగ్యంగా నిర్వచించటం సాధ్యం కాదు. ఎంత ప్రయత్నించినా ఆ నిర్వచనాలు కొంతవరకైనా వ్యక్తి నిష్ఠంగా ఉండక తప్పదు. ప్రపంచంలో ఆసియా ఒక ‘ప్రాంతం’. ఆసియాలో దక్షిణ ఆసియా , దక్షిణ ఆసియాలో భారతదేశం ఒక ‘ప్రాంతం’. భారతదేశంలో దక్షిణ భారతదేశం, అందులో ఆంధ్రదేశం, అందులో రాయలసీమ ఒక ‘ప్రాంతం’ అన్న భావన మనలో విస్తృతంగానే ఉంది. అలాగే ఆంధ్రదేశంలో కోస్తా, తెలంగాణా, రాయలసీమ అన్న మూడు ఉప ప్రాంతాలున్నట్టుగా కూడా మనం అంగీకరిస్తూ ఉన్నాం. ఈలోగా ఉత్తర కోస్తా(విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం)ను నాలుగవ ప్రాంతంగా కొందరు పేర్కొంటున్నారు. ఇందుకు భౌగోళిక, ఆర్థిక కారణాలే ఆధారమని చెప్పవచ్చు”.[3] ఒక ప్రాంతం యొక్క సరిహద్దుల్ని నిర్ణయించేటపుడు పరిశోధకులు చారిత్రక, భౌగోళిక, సాంఘిక, సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక పరిస్థితులు ప్రధానమైనవిగా భావించి పరిగణలోనికి తీసుకుంటారు.

## 4.2 ప్రాంతీయవాదం:

భారతదేశంలో వలస పాలనాంతర ప్రజాస్వామ్య రాజకీయాలలో జాతీయ అస్తిత్వానికి

సమాంతరంగా ప్రాంతీయ అస్తిత్వ ధోరణులు పోటీపడటం మనం గమనిస్తూనే ఉన్నాం. ఈ ప్రాంతీయ అస్తిత్వపు స్వభావాన్ని సాంఘిక, సాంస్కృతిక శక్తుల దృష్ట్యా విశ్లేషించి పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రాంతం అనేది ఒక సందర్భానికి సంబంధించినదే అయినప్పటికీ భారతదేశ రాజకీయాల విశ్లేషణలో క్రమంగా ప్రాంతీయవాదం ఒక ప్రత్యేకమైన అర్థాన్ని సంతరించుకొన్నది. కేంద్రీకృతమైన అన్ని శక్తుల కలయికగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు.

ఒక ప్రత్యేక ప్రాంతం పట్ల అత్యధికంగా మక్కువ, విశ్వాసం కలిగి ఉండి తమకంటూ ఒక ప్రత్యేక అస్తిత్వాన్ని, గుర్తింపును కోరుకునే ప్రజల ఆకాంక్షను ప్రాంతీయవాదంగా నిర్వచించవచ్చు. 19వ శతాబ్ది అమెరికన్ సాహిత్యంలో ప్రాంతీయవాదం ఈ విధంగా నిర్వచించబడింది.

''Regionalism refers to text that concentrate heavily on specific, unique featuers of a certain region including dialect, customs, traditions, topography, history and Characters. It focuses on the formal and informal, analyzing the attitudes characters have towards are another and their community as a whole''.[4]

భూ పరిసరాలు, మాండలిక భాష, చరిత్ర, ఆచార వ్యవహారాలు, గుణ శీలాలు, వ్యక్తి స్వభావం, మనస్తత్వం, స్థలాకృతి, సంప్రదాయాలు మొదలైన అంశాల్లో తమదైన సామాజికతను ప్రతి బింబించేదే ప్రాంతీయవాదం అని పై నిర్వచనానికి అర్థం.

మార్షల్ ఇ.డిమోక్ నిర్వచనం ప్రకారం " పరిసర సంబంధమైన ఆర్థిక, సామాజిక, ప్రభుత్వ పరమైన కారకాలన్నీ కలిసి ఒక ప్రత్యేకమైన అస్తిత్వం గల చైతన్యంగా తయారు కావడమే ప్రాంతీయ వాదం. స్వయం ప్రతిపత్తి గల ప్రణాళిక, సాంస్కృతిక ప్రత్యేకతల అభివ్యక్తీకరణ, పరిపాలనా స్వేచ్ఛ కావాలన్న కోరికలకు సైద్ధాంతికంగా గుర్తింపు లభించడమే కాకుండా వాటి కార్యాచరణ కూడా ప్రాంతీయ వాదంతో ఏర్పడుతుంది. ప్రాంతీయ వాదం రూపుదిద్దుకున్న దృగ్విషయం; అదే సమయంలో ఇంకా అభివృద్ధి చెందాల్సిన అంశం కూడా. ప్రాంతీయవాదం ఒక జీవన విధానం; ఒక ఆత్మ- చైతన్య ప్రక్రియ"[5] ప్రాంతీయ సమూహ శక్తులతో కలగలిసి బలాన్ని చేకూర్చుకొని ఒక ప్రత్యేకవాదంగా ఈ ప్రాంతీయవాదం రూపుదిద్దుకుంటోంది.

"భారతదేశం దృష్ట్యా చూస్తే ప్రాంతీయవాదానికి అనుకూల(Positive) ప్రతికూల (Negative) దృక్కోణాలున్నాయి. అనుకూల దృక్కోణం ప్రకారం ప్రాంతీయవాదాన్ని ఆత్మ అస్తిత్వం కోసం చేసే ప్రయత్నంగా వర్ణించవచ్చు. ఒక ప్రాంతంలో నివసించే ప్రజలలో కొందరు సాపేక్ష లేమితో బాధపడటాన్ని ప్రాంతీయవాదం వ్యక్తం చేస్తుందని ప్రతికూల దృక్పథం తెలియజేస్తుంది. ఈ సాపేక్ష లేమిని ఆర్థిక విశ్లేషణ

తీర్చలేదని కొన్ని శక్తులు ఉద్దేశ పూర్వకంగా ఈ స్థితిని ఏర్పరచారని భావిస్తారు".[6] ఒక నిర్దిష్ట ప్రాంతంలో మనుగడ సాగించే ప్రజలు తమ జాతి గుర్తింపు కోసం భవిష్యత్తు కోసం చేసే ఆరాటమే ప్రాంతీయతలో గుర్తించవచ్చు. జన సమూహం లేదా జన సముదాయం ప్రత్యేకత చాటుతూ భూభాగం, మతం, భాష, సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, అభివృద్ధి ధోరణులు లాంటివి ప్రాంతీయవాదాన్ని ప్రేరేపించి దీర్ఘ కాలంగా ఒక ప్రాంతంలో అభివృద్ధి కుంటు పడినపుడు ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి జరగనపుడు ఆ ప్రజల మనోభావాలు దెబ్బతిని ఆ ప్రాంత తెగలు లేదా జాతి, వర్గానికి సరైన ప్రాధాన్యం, గుర్తింపు, గౌరవం లభించనపుడు ప్రాంతీయవాదం ఉద్యమాల వైపు పయనిస్తుంది.

### 4.2.1 ప్రాంతీయవాద లక్షణాలు:

1) సమూహ అస్తిత్వ భావన, ప్రాంతీయ విశ్వాసం ఆధారంగా ఏర్పడినది.
2) ఇతర ప్రాంతాల అవసరాలను పట్టించుకోకుండా తమ ప్రాంతపు అభివృద్ధి మాత్రమే అవసరం అనే భావన.
3) ఒక ప్రత్యేక ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాల ప్రజలు లబ్ధి పొందడాన్ని అవరోధిస్తుంది.

### 4.2.2 ప్రాంతీయవాదం రకాలు:

1) మొదటి రకానికి చెందిన ప్రాంతీయవాదాన్ని ప్రాక్-రాష్ట్ర ప్రాంతీయతావాదం అని చెప్పవచ్చు. వివిధ రాష్ట్రాల సమూహ అస్థిత్వానికి వ్యక్తీకరణ ఈ వాదం. దీనిలో వివిధ రాష్ట్రాలు సమిష్టి, పరస్పర అభిరుచుల కోసం లేదా ఇతర రాష్ట్రాలకు వ్యతిరేకంగా పని చేస్తున్నపుడు చేతులు కలుపుతాయి. రాష్ట్రాల మధ్య వివాదం తలెత్తినపుడు ఉమ్మడి ప్రయోజనాలున్న రాష్ట్రాలు ఒక్కటై దీనిని వ్యతిరేకిస్తాయి. హిందీని జాతీయ అధికార భాషగా ప్రకటించినపుడు దక్షిణాది రాష్ట్రాలు ఒక్కటై వ్యతిరేకించాయి.
2) రెండవది రాష్ట్రాల మధ్య గల ప్రాంతీయవాదంగా పేర్కొనవచ్చు. ఈ రకమైన ప్రాంతీయవాదంలో వివాదాంశం ప్రత్యేకంగా ఉంటుంది. అంతర రాష్ట్రీయ నదీ జలాల వినియోగ వివాదాలు, సరిహద్దు సమస్యలు ఈ కోవకు చెందినవే. కర్ణాటక, తమిళనాడుల మధ్య కావేరి జలాల వివాదం, ఆంధ్ర, కర్ణాటకల మధ్య ఆల్మట్టి డ్యాం వ్యవహారం ఇలాంటి ఉదాహరణలుగా చెప్పవచ్చు.
3) ఒక రాష్ట్రంలోని ఒక భాగం ఆత్మ అస్తిత్వం కోసం, స్వీయాభివృద్ధి కోసం ప్రయత్నిస్తున్నప్పుడు ఏర్పడే ప్రాంతీయవాదాన్ని మూడవ రకం ప్రాంతీయవాదంగా వివరించవచ్చు.

### 4.2.3 ప్రాంతీయవాద కారణాలు:

భిన్నత్వంలో ఏకత్వం ఉన్న భారతదేశంలో ఏడు సహజ మండలాలు ఉన్నప్పటికీ విభిన్న భౌగోళిక వైరుధ్యాలు ఉన్నాయి. ఈ వైరుధ్యాలతో పాటు అనేక ఇతర కారణాలు ప్రాంతీయవాదానికి దారితీస్తున్నాయి.

1) 1947లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వాలు అనుసరించిన వ్యూహాలు లోపభూయిష్టంగా ఉండడం వల్ల దేశంలోని అన్ని ప్రాంతాల్లో సమతౌల్య అభివృద్ధి జరగలేదు.

2) పాలకులు వారి సొంత ప్రాంతాల పట్ల ప్రత్యేక శ్రద్దను కనపరచి మిగిలిన ప్రాంతాలను విస్మరించడం మూలంగా అనేక ప్రాంతాలు అభివృద్దిలో వెనుకబాటుకు గురయ్యాయి.

3) పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల అభివృద్ధితో పోలిస్తే ఈశాన్య రాష్ట్రాలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా, రాయలసీమ ప్రాంతాలు అభివృద్దిలో చాలా వెనుకబడి వున్నాయి.

4) అభివృద్ధి చెందిన ప్రాంతాల వారు రాజకీయ అధికారంలో ఉండి ఆధిపత్యం చెలాయిస్తూ వెనుకబడిన ప్రాంతాల వారికి సరైన భాగస్వామ్యం ఇవ్వకపోవడం వల్ల కూడా ఆ ప్రాంతాలలో ఆందోళనలు తలెత్తుతాయి.

5) ఒక ప్రాంత ప్రజలు, నాయకులు మరో ప్రాంత ప్రజలపై సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ ఆధిపత్యం చెలాయిస్తూ ఆ ప్రాంత ప్రజల సంస్కృతి, భాషలపై వివక్ష చూపడం వల్ల అక్కడి స్థానికులలో అసంతృప్తి చెలరేగి ఉద్యమాలకు కారణం అవుతాయి.

6) మన దేశంలోని జమ్ము కాశ్మీర్‌లోని స్థానిక ముస్లిం కాశ్మీరీలు ప్రత్యేక రాష్ట్రం కోరడం బొంబాయి నగరంలోని రాజకీయ, ఆర్థిక రంగాలలో గుజరాత్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతీయుల ఆధిపత్యం ఎక్కువగా వుండటం వల్ల అక్కడ ప్రాంతీయ ఉద్యమాలు బయలుదేరాయి.

7) జార్ఖండ్, ఈశాన్య రాష్ట్రాలలో గిరిజనులున్నప్పటికీ ఆధిపత్యం మాత్రం గిరిజనేతరులది కావడం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని తెలంగాణా ప్రాంతంలో ఆంధ్ర ప్రాంతీయులు వలస వచ్చి ఆధిపత్యం చెలాయించడం తెలంగాణ భాష, సంస్కృతులను కించపరచడం, వనరులు, విద్యా ఉద్యోగ అవకాశాలలో ఆంధ్రవారు పెత్తనం చెలాయించడం వంటి కారణాలతో తెలంగాణ ప్రజలలో ప్రత్యేక తెలంగాణ ప్రాంతీయ ఉద్యమాలు తలెత్తేందుకు కారణమైంది.

8) ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతంలో కూడా ప్రభుత్వాలు, నాయకులు, పాలకుల నిర్లక్ష్యం అలసత్వం వల్ల వెనుకబాటుతనానికి కారణమయింది. సీమలో ఏటేటా కరువులు సంభవించడం

సహజవనరులు కొరత, నీళ్ళు సమృద్ధిగా లేకపోవడం లాంటి కారణాలతో సీమ ప్రజలు, మేధావులు నీళ్ళు, నిధులు, వాటా హక్కుల కోసం సుదీర్ఘకాలం పాటు పోరాటాలు చేస్తూ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఉద్యమాలు ప్రారంభించారు.

9) భారతదేశ వైవిధ్యభరిత సమాజంలో ప్రాంతీయ వైరుధ్యాలు అధికంగా ఉండడం వల్ల ప్రజలు తమ తమ ప్రాంతీయ అస్తిత్వాలను బట్టి మాత్రమే గుర్తింపు పొందడం ప్రాంతీయవాద ఉద్యమాలకు ఒక కారణం.

10) భారతదేశంలో భౌగోళిక పరంగా గమనిస్తే తాము భారతీయులమనే జాతి భావన ఉన్నప్పటికీ గతంలో రాజరికంలో ఉండి తర్వాత మండళ్ళుగా, సంస్థానాలుగా ఉన్న తరువాత ఇతర ప్రాంతాలతో కలిసి కొత్త రాష్ట్రాలుగా అవతరించినప్పటికీ తమ భౌగోళికతను వివిధ సందర్భాలలో వ్యక్తీకరిస్తారు. ఉదాహరణకు 'మా తెలంగాణ', 'మా రాయలసీమ' ఇలా ప్రజలు వ్యక్తం చేయడం తరచుగా గమనించవచ్చు.

11) ఒక ప్రాంత చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక అంశాలు ఆ ప్రాంత ప్రజల స్వభావాన్ని తీర్చిదిద్దుతాయి. బెంగాలీయులు దేశభక్తికి, తమిళులలో ద్రావిడ ఉద్యమ ప్రభావం వల్ల హిందీ భాష పట్ల వ్యతిరేకతను గమనించవచ్చు.

12) రాజకీయ నాయకులు అధికారానికి రావడానికి, వచ్చిన అధికారాన్ని నిలబెట్టు కోవడానికి ప్రజల్లో ప్రాంతీయ భావజాలాన్ని రేకెత్తించడం, కేంద్ర ప్రభుత్వాన్ని బలహీన పరచడానికి ప్రజల్లో భాష, సంస్కృతి, చారిత్రక నేపథ్యం లాంటి భావోద్వేగాలను రెచ్చగొట్టి తమ స్వప్రయోజనాల కోసం ప్రాంతీయవాదానికి కారణమవుతున్నారు.

13) ఒక రాష్ట్రంలో ఒకే భాష మాట్లాడినప్పటికీ యాస, మాండలికాల్లో స్పష్టమైన వ్యత్యాసాలు కనిపిస్తాయి. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ, రాయలసీమ, సర్కారు జిల్లాల యాసల్లో స్పష్టమైన తేడా కనిపిస్తుంది. ఈ సంస్కృతి సంప్రదాయాలు, ఆహార, ఆచారాల్లో కూడా వ్యత్యాసం ఉండి వాటిని పరిరక్షించుకునేందుకు ఉప ప్రాంతీయవాదానికి ఆజ్యం పోస్తారు.

14) భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు ఇతర భాషల వారికి కూడా ప్రేరణ కలిగిస్తుంది. మద్రాస్ నుంచి తెలుగు భాషను మాట్లాడే వారితో ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడటంతో మిగిలిన ప్రాంతాల్లో కూడా ఉద్యమాలు ప్రారంభమయ్యాయి.

### 4.2.4 ప్రాంతీయవాదం- అభివృద్ధి- మూలాలు:

1) మన దేశంలో ప్రాంతీయవాద ఉద్యమం తొలిసారిగా తమిళనాడులో ప్రారంభమైంది. 20వ శతాబ్దిలో

తమిళనాడులో బ్రాహ్మణులు, బ్రాహ్మణేతరులుగా ప్రారంభమైన ఈ ఉద్యమం తర్వాత కాలంలో హిందీ వ్యతిరేక ఉద్యమంగా మారి భారతదేశ సమైక్యతను ప్రశ్నార్థకం చేసింది. ఈ ఉద్యమంలో దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి ద్రవిడనాడు/ ద్రవిడస్థాన్‌గా ఏర్పాటు కావాలనే డిమాండ్ ప్రారంభమైంది.

2) 1953 అక్టోబరు 1న తెలుగుభాష ఆధారంగా కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కావడంతో ఇతర ప్రాంతాల్లో భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలనే ఉద్యమాలు ఊపందుకున్నాయి.

3) మహారాష్ట్రలో శివసేన పార్టీ నేతృత్వంలో మహారాష్ట్రేతరులకు వ్యతిరేకంగా భూమి పుత్రుల సిద్ధాంతం, పంజాబ్‌లో పంజాబియేతరులకు వ్యతిరేకంగా ఖలిస్థాన్ ఉద్యమం, ఆంధ్రప్రదేశ్‌లో ఉత్తరాంధ్ర, రాయలసీమ ఉద్యమం, అస్సాంలో బెంగాలీలు బీహారీలకు వ్యతిరేకంగా యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ అస్సాం(ULFA), బోడోలాండ్ ఉద్యమాలు ప్రాంతీయ, ఉప ప్రాంతీయవాద ఉద్యమాలుగా పేరొందాయి.

4) భాషా ప్రాతిపదికపైన ఏర్పడిన రాష్ట్రాలన్నీ ప్రాంతీయవాదం అనే భావజాలం వల్లే ఏర్పడ్డాయి. ఈ రాష్ట్రాలలో ప్రత్యేకమైన సంస్కృతి, ఆచారాలు, సంప్రదాయాలు, తెగలు, జాతులు ఉండవచ్చు. ప్రాంతీయ అసమానతలు కూడా ఉండవచ్చు. తమ ప్రత్యేకతను చాటుతూ వారి గుర్తింపు, అస్థిత్వం కోసం ఉద్యమాలు, పోరాటాలు చేయవచ్చు. దీన్నే ఉప ప్రాంతీయవాదం అంటారు.

**4.3 ప్రాంతీయ చైతన్యం:**

సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన ఉద్యమాలు జరుగుతున్న పోరాటాలు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. ఆ ప్రభావంతో వచ్చిన అస్తిత్వ ఉద్యమాల్లో భాగంగా స్త్రీవాదం, దళితవాదం, మైనార్టీ, ప్రాంతీయవాదాలు ముందుకు వచ్చాయి. కాలంతో పాటు సమాజం, సమాజంతో పాటు సాహిత్యం మార్పుకు లోనవుతూ నూతన దృక్పథాన్ని అందిస్తాయి. నేడు ప్రాంతీయ అస్తిత్వ దృక్పథంతో కవిత్వం విస్తృతంగా వెలువడుతోంది. సాహిత్యంలో కులం, మతం, జెండర్ మాత్రమే కాదు ‘ ప్రాంతం ’ కూడా ప్రధానమైన పాత్రను పోషిస్తోంది. తమ ప్రాంత సంస్కృతీ సంప్రదాయాలు, భౌగోళిక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంఘిక అంశాలను సాహిత్యం ద్వారా స్పృశిస్తున్నారు. ప్రాంతీయ స్పృహను వ్యక్తం చేసే సాహిత్యాన్ని స్థూలంగా ప్రాంతీయ చైతన్య సాహిత్యంగా భావించవచ్చు.

ప్రాంతీయ చైతన్యం దీనిని ఇంగ్లీషులో ‘Regional Consciousness’ అంటారు . Bring awareness among people about the place they blong to. Example-Nationalism we belong to a nation called India= India. Similarly Telanganite, Andhraite, Rayalasemite. Oxford English Dictonary లో consciousness(adj) కు అర్థం ఇలా వివరించబడింది.

" Aware of responding to one's surroundings. orgin 16th century= from lation. conscious knowing with others of in oneself from conscious be privy to ours from this the noun from consciousness=the state of being conscious"[7]

పై వివరణలను బట్టి ప్రాంతీయ చైతన్యం అంటే ఏమిటో తెలుసుకుందాం. ప్రాంతం పట్ల, ప్రాంత పరిస్థితుల పట్ల ఆ ప్రాంతానికి చెందిన వారిలో స్పృహ లేదా ఎరుక కలిగి ఉండటమే ప్రాంతీయ చైతన్యంగా చెప్పవచ్చు. ప్రాంతానికి చెందిన పుర్వాపరాలు, నైసర్గిక స్వరూపం పట్ల ఆ ప్రాంతపు సంస్కృతి పట్ల ఆ ప్రాంతాన్ని నిర్దేశించినటువంటి రాజకీయాల పట్ల స్పృహ కలిగి వుండడమనేది ప్రాంతీయ చైతన్యంగా మనం భావిస్తాము. ఒక ప్రాంతంలో నెలకొని వున్న అనేక సామాజిక సమస్యలు అలాగే మరే ఇతర సమస్యలపై నైనా అక్కడి స్థానిక ప్రజలకు అవగాహన కలిగి ఉండడంగా చెప్పవచ్చు. సాహిత్య కారులు ఆ ప్రాంత సమస్యలపై సాహిత్యాన్ని స్పృశించి ఆ సాహిత్యం ద్వారా ప్రజానీకాన్ని మేల్కొల్పినట్లయితే దానిని ప్రాంతీయ చైతన్యంగా సాహిత్యంలో ప్రకటించవచ్చు.

" ప్రాంతీయ స్పృహలో తమను అణచివేస్తున్న ఆధిపత్యవర్గాలపై ఆగ్రహం ఉంటుంది. పాలకులు, వలస వాదులు చూపిస్తున్న వివక్షపై నిరసన ఉంటుంది. తమ ప్రాంత సంస్కృతి సంప్రదాయాల పై ఆత్మ గౌరవంతో కూడిన ప్రకటన కూడా ప్రాంతీయ స్పృహలో విడదీయరాని భాగం."[8] ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వచ్చిన వారు స్థానిక ప్రజానీకంపైనా, వనరులు పైనా ఆధిపత్యం, పెత్తనం చెలాయించడం వల్లనూ అలాగే ఒక ప్రాంతాన్ని పాలించే ప్రభుత్వ పాలకులు, నాయకులు ఆ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేయడం, అభివృద్ధి చేయకపోవడం వల్లనూ ప్రజల్లో తిరుగుబాటు ధోరణి కనపిస్తుంది. దీని ఫలితంగా ప్రాంతీయవాద ఉద్యమాలు తలెత్తుతాయి. "తన చుట్టూ వున్న ప్రపంచ వస్తుగత వాస్తవికతను ప్రతిబింబించే ఉన్నత రూపమే చైతన్యం. ఆ చైతన్యం కవి ప్రాంతానికి సంబంధించినదైతే దానిని ప్రాంతీయ చైతన్యం అని పిలవొచ్చు."[9]

" ప్రాంతీయ స్పృహ, స్వత్వం ప్రత్యేక ఆస్తిత్వకాంక్ష వ్యక్తం చేసే సాహిత్యాన్ని స్థూలంగా ప్రాంతీయ చైతన్య సాహిత్యం అని భావించవచ్చు."[10] ప్రాంత చరిత్ర, స్థానికత, భౌగోళికత, ప్రకృతి వనరులు, మానవ సంబంధాలు, సంస్కృతి ప్రాంతీయ స్వత్వాన్ని, అస్తిత్వాన్ని నిర్ణయిస్తాయి. జెండర్, కులం, మత పరంగా వాటి ఉనికి కోసం అస్తిత్వాల కోసం ఏర్పడిన ప్రత్యేక వాదాలు ఇప్పుడు ప్రాంతీయ అస్తిత్వ వాదానికి స్పూర్తిగా నిలిచాయి. ప్రాంతీయ చైతన్యంలో వెలువడిన సాహ్యితం ప్రాంతం పట్ల పాలకుల నిర్లక్ష్యాన్ని, వివక్షను, ఆధిపత్యాన్ని ప్రశ్నిస్తుంది.

## 4.4. రాయలసీమ కవిత్వం - ప్రాంతీయ చైతన్యం:

20 వ శతాబ్దంలో తెలుగు సాహిత్యంలో అనేక మార్పులు వచ్చిన తర్వాత 1990 ల మధ్య కాలం నుంచి ప్రాంతీయ స్పృహను ప్రబలంగా వ్యక్తం చేయడం కనిపిస్తోంది. ఎవరి అనుభవాలను వాళ్ళే రాయాలన్న వాదం బలపడి తమ అనుభవాలను తమదైన శైలిలో చెప్పడం జరిగింది. మూడు దశాబ్దాల కిందట 'కళింగాంధ్ర కథలు' అనే కథా సంకలనాన్ని చాగంటి సోమయాజులు తీసుకు వచ్చారు. అలాగే రాయలసీమ ప్రాంతం నుంచి 'సీమ కథలు' అనే కథా సంకలనాన్ని సింగమనేని నారాయణ తీసుకు వచ్చారు. మొదటి సారిగా ఒక ప్రాంత జీవితాన్ని, సాహిత్యాన్ని ప్రతిఫలించే సాహిత్యం కథా రూపంలో వచ్చింది. ప్రాంతీయ అస్తిత్వవాదం మొదట కవిత్వంతోనే రూపుదిద్దుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో కోస్తాంధ్ర ప్రాంతం తప్ప మిగిలిన మూడు ప్రాంతాలు నిర్లక్ష్యానికి, వివక్షకూ లోనయ్యాయి. వీటిలో రాయలసీమ తర్వాత తెలంగాణా ప్రాంతం మరింత అన్యాయానికి, వివక్షకు గురైంది.

సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఇతరుల ఆధిపత్యంలో ఉన్న ప్రాంతాలు స్వయం ప్రతిపత్తి కోసం డిమాండ్ చేయడం తమ ప్రాంతాలపై అధికారం తమకే ఉండాలని ఆశించడం సహజం. వీటి కోసం జరిపే ఆందోళనల్ని ప్రాంతీయ ఉద్యమాలుగా పేర్కొనవచ్చు. తెలుగుదేశంలో ఇలాంటి ఉద్యమాలకు తెలంగాణా ప్రజలే శ్రీకారం చుట్టారు. 1969లో ఆరంభమైన ప్రత్యేక తెలంగాణా ఉద్యమం ఇందుకు నిదర్శనం. "అభివృద్ధి క్రమంలో అసమానతలు, ఆధిపత్యాలు ప్రత్యేక ప్రాంతాల భౌగోళిక స్వత్వాన్ని, సాంస్కృతిక అస్తిత్వాన్ని, భాషాగత ప్రత్యేకతలను, చారిత్రక స్మృతులను ముందుకు తీసుకొని వస్తాయి. ప్రత్యేక అనుభవాలను వ్యక్తం చేయడానికి సాహిత్యం సాధనమవుతుంది. ఏ రచనకైనా వస్తువు ఒక స్థలానికి సంబంధించినదే అయి ఉంటుంది. కాని రచనా స్ఫూర్తి, లక్ష్యాలు, సామాన్యమూ, విశ్వజనీనమూ కావచ్చు. స్థానిక స్పృహ, ప్రాంతీయ స్పృహ స్ఫూర్తి అయినప్పుడు సాహిత్యంలో స్థానికత, ప్రాంతీయతగా భావించడం జరుగుతుంది. ప్రాంతీయతలో ప్రత్యేక రాజకీయ ఆస్తిత్వ కాంక్ష కూడా చేరుతుంది. రాయలసీమ, ఉత్తరాంధ్ర, తెలంగాణా ప్రాంతాల నుంచి స్థానిక, ప్రాంతీయ ఆస్తిత్వ, స్వత్వాలకు ప్రాతినిధ్యం వహించే సాహిత్యం వస్తున్నది."[11]

చారిత్రకంగా రాయలసీమ ప్రాంతం వివిధ రాజుల పరిపాలనలోనూ ఆ తర్వాత బ్రిటీష్ వారి పరిపాలనలోనూ మద్రాసు రాష్ట్ర భూభాగంలో వున్నది. మద్రాసు రాష్ట్రం నుండి తెలుగు వారి ఆంధ్రరాష్ట్రం ఏర్పడడంతో రాయలసీమ ప్రాంతం కోస్తాంధ్ర నాయకుల నిర్లక్ష్యానికి, వివక్షతకు, చిన్నచూపుకు గురైంది. రాయలసీమకు దక్కవలసిన నీళ్ళు, నిధులు, విద్యా సంస్థలు, ఉద్యోగావకాశాలు, ప్రభుత్వ

కార్యాలయాలు లాంటివి సీమకు దక్కకుండా కోస్తాంధ్ర ప్రాంతానికి తరలి పోయాయి. కర్నూలు రాజధానిగా వున్న ఆంధ్రరాష్ట్రం కూడా విశాలాంధ్ర పేరుతో రాజధాని హైదరాబాదుకు తరలి పోయింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పటి నుంచి ఈ కాలం వరకు రాయలసీమకు అన్యాయమే జరుగుతోంది. మద్రాస్ రాష్ట్రంలో అంతర్భాగంగా వున్నపటి నుంచే ఈ రాయలసీమ ప్రాంతం రాజకీయంగానూ, సాంస్కృతికంగానూ, సాహిత్య పరంగానూ చైతన్య వంతంగా వుంది. ఆనాటి సీమ రాజకీయ నాయకులు, మేధావులు, పండితులు, విమర్శకులు, సాహితీకారులు తమ ప్రాంత వెనుక బాటుతనం, నాయకుల నిర్లక్ష్యం, వివక్షతల పట్ల, వనరులు, హక్కుల పట్ల అవగాహన కలిగి వుండి చైతన్యవంతంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తూ క్రియాశీలకంగా ఉద్యమాలు నిర్వహిస్తూ వచ్చారు.

ఆధునిక కవిత్వం అంటే రాయలసీమలోనే కాదు ఆధునిక తెలుగు సాహిత్యంలో వచన కవిత్వంగా స్థిరపడింది. రాయలసీమ ఆధునిక వచన కవిత్వంలో సీమ అస్థిత్వం ఎలా వ్యక్తమైంది. సీమ ప్రాంతీయ చైతన్యం ఉద్యమ రూపాన్ని అందుకొని ఎలా అభివ్యక్తమైందనే అంశాలను పరిశీలించాలి. తెలుగులో ఆధునిక కవిత్వం 'ముసలమ్మ మరణం' అనే కావ్యంతో ప్రారంభమైందని విమర్శకులు గుర్తించిన తర్వాత రాయలసీమలో కూడా ఆధునిక కవిత్వానికి ఈ కావ్యమే నాంది పలికిందని గుర్తించవచ్చు. ఆ తర్వాత రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ గారి 'పెనుగొండ కొండ' పాటతో గతకీర్తి వైభవగానం, ప్రాంతీయత చైతన్యంతోనూ పుట్టపర్తి నారాయణాచార్యుల వారి 'పెనుగొండ లక్ష్మి' కావ్యంతో నాటి వర్తమాన పరిస్థితులను ప్రతిబింబిస్తూ కావ్యం వెలువడింది. ఆ తర్వాతి కాలంలో 1955లో వచ్చిన విద్వాన్ విశ్వం గారి 'పెన్నేటి పాట'ను మాత్రమే రాయలసీమ అస్తిత్వాన్ని, ప్రాంతీయ క్షామ పీడిత వేదనను, ఆధునిక విలువలను చెప్పినటువంటి రచనగా మనం గౌరవించాలి. విద్వాన్ విశ్వం గారు అభ్యుదయ భావాల దృక్పథంతో రాయలసీమ వెనుకబాటుతనాన్ని, సీమ వాస్తవిక దృశ్యాలను, వివక్షతో కూడిన వేదనను ప్రాంతం వైపు తీసుకొచ్చారు. 1955 నుండి రాయలసీమలో ఆధునిక కవిత్వపు ఛాయలతో నిజంగా ప్రాంతీయ స్పృహతో కవిత్వం ప్రారంభమైందని చెప్పవచ్చు. ఆ తర్వాతి చాలా కాలం పాటు రాయలసీమను పలికే కవిత్వం రాలేదని గమనించవచ్చు. 1979లో ఆశావాది ప్రకాశరావు సంపాదకత్వంలో 'ఆర్కెస్ట్రా' అనే వచన కవితా సంకలనం వచ్చినప్పటికీ ఇందులో మానవ, సామాజిక స్పృహలతో కవిత్వం రాశారు.

1955 నుంచి 1980 కాలం వరకు తెలుగు రాష్ట్రంలోనూ అలాగే రాయలసీమలోనూ ఆధునిక కవిత్వోద్యమాలైన అభ్యుదయ, విప్లవ కవిత్వాల ప్రభావం కనిపిస్తుంది. ఈ కవిత్వోద్యమాల ప్రభావంతో సీమ కవులు కవిత్వం రాశారు. 1986లో కడప జిల్లా రచయితల సంఘం ప్రచురించిన 'కవితా కౌముది' కవితా సంకలనంలోనూ యువ కవులు భావ కవిత్వపు ఛాయలో గేయ ఖండికలు,

వచన కవిత్వాన్ని రాశారు. అనంతపురం నుండి జూపల్లి ప్రేంచంద్ 1999లో ప్రచురించిన 'అవేద' కవిత్వం ద్వారా రాయలసీమను పలికించాడు. బాబ్రిమసీదు విధ్వంసం తర్వాత పరిణామాలు, దళిత వాదం, బ్రాహ్మణీయ భావజాలంపై వ్యతిరేకతను అనంత వాస్తవిక దృశ్యాల్లోంచి కవిత్వం రాశాడు. ఆ తర్వాత రాయలసీమ ప్రాంతీయ కవిత్వాన్ని అందిపుచ్చుకొని రాయలసీమ కవిత్వంగా చెప్పుకోదగిన ఒక సిగ్నేచర్ లాంటిది రాయలసీమ స్వరంగా పేరు పొందిన సంతకం వేసిన సంకలనం ఏదైనా ఉంది అంటే అది "సీమ కవిత". 2001లో ప్రొద్దుటూరు నుండి ప్రచురించ బడింది. ఈ కవితా సంకలనం 44 మంది కవులతో రాయలసీమకు ప్రాతినిధ్యం వహించే మొదటి కవితా సంకలనం. ఇది రాయలసీమ ప్రాదేశికతను, చైతన్యాన్ని, ధిక్కార స్వరాన్ని, ఉద్యమ ఆకాంక్షని కలగలిపి చెప్పినటువంటి కవితా సంకలనంగా చెప్పుకోవచ్చు. అనంతపురం జిల్లా రచయితల సంఘం ప్రచురించిన 'పొరుపు' కవితా సంకలనం అనంతపురం వ్యవసాయ సంక్షోభాన్ని, రైతుల బతుకుల్ని, కరువు పీడనాన్ని కవిత్వ రూపంలో సాక్షాత్కరిపం జేసింది. కడప నుండి ఎన్. రామచంద్ర సంపాదకత్వంలో 2004లో 'సాహితీ సౌరభం' అనే కవితా సంకలనం వెలువడింది. ఈ సంకలనంలో దాదాపుగా 200 మంది కవులు వున్నారు. సీమ ఆధునిక కవితా సంకలనంగా ప్రసిద్ధి చెందిన ఈ పుస్తకంలో రాయలసీమలో కనిపించే ప్రతి అంశాలను ప్రతిబింబిస్తుంది. రాయలసీమ ప్రాంతీయ కవిత్వానికి నిలువెత్తు నిదర్శనంగా ఈ సంకలనం నిలుస్తుంది. కవిసేన ప్రభావంతో వెలువడిన 'కొమ్మలు చీల్చుకుని వస్తున్న పూలు' యువ కవుల సంకలనంగా ప్రసిద్ధి చెందింది.

2000 సం॥ నుండి సీమ కవులు ప్రత్యేకంగా సీమ ప్రాంతం పట్ల అభినివేశంతో కవిత్వం రాయడం చూడవచ్చు. అనంతపురం నుంచి యక్కలూరి శ్రీరాములు రంగుల పక్షి, జలగండం, జూపల్లి ప్రేంచంద్ నిచ్చెనమెట్ల లోలకం, రాధేయ అవిశ్రాంతం, మగ్గం బతుకు, మల్లెల నరసింహ మూర్తి జలస్వప్నం, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'పొలి', రెండు ప్రపంచాలు, బిక్కి కృష్ణ చరమగీతం, వేకువ పిట్టలు, కాలం నది ఒడ్డున, ఆశావాది ప్రకాశరావు అంతరంగ తరంగాలు లాంటి కవితా సంపుటాలు వున్నాయి. కర్నూలు నుండి జి.వెంకటకృష్ణ హంద్రీగానం, దున్నేకొద్ది దుఃఖం, టి.వెంకటేష్ ఒక తడి అనేక సందర్భాలు, కెంగార మోహన్ విన్యాసం, కడప నుండి యన్. రామచంద్ర రక్తం చెమర్చిన కళ్ళు, తవ్వా ఓబుల్ రెడ్డి, పాలా వెంకట సుబ్బయ్య, యన్.ఈశ్వర రెడ్డి, లోసారి సుధాకర్, శశిశ్రీ, డి.కె.చదువుల బాబు, మహమూద్, ఖలందర్ లాంటివారు, చిత్తూరు నుండి వేంపల్లి అబ్దుల్ ఖాదర్ మేఘం, చినుకు, కిరణం, పలమనేరు బాలాజి, ఎస్.జి.డి.చంద్రశేఖర్, ఎస్.మునిసుందరం గారి ఈ గుండె అలసిపోదు, మసక, మట్టివాసన, చీకటి దీపాలు, శైలజా మిత్ర లాంటి వారు వున్నారు. 'పర్వవేలా తరంగాలు' చిత్తూరు నుండి మధురాంతకం మహేంద్ర గారి ఆధ్వర్యంలో వెలువడింది. అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల నుంచి అనేక

మంది కవులు, రచయితలు, రచయిత్రులు కవిత్వం రాశారు. ప్రధానంగా కొందరి కవుల పేర్లు, వారి రచనలను మాత్రమే ప్రస్తుతం పేర్కొన్నాను. ఇట్లా వీరి కవిత్వంలో తప్పకుండా సీమకు సంబంధించిన ప్రాదేశికత స్థిరంగా కనపడటం గమనించవచ్చు. ఇలా 2000 సం॥ నుంచి తెలుగు సాహిత్యపు ప్రధాన ఒరవడి నుండి రాయలసీమ కవిత్వాన్ని ఐడింటిఫై చేయడానికి, చూడ్డానికి ఒక పాయ, ధార కనిపిస్తాది.

రాయలసీమలోని ప్రాచీన మరియు ఆధునిక కవులు, వారి జీవిత విశేషాలు, రచనలు, వారి కవిత్వం, సాహిత్యాలను తెలిపే విశేషాలతో కూడిన గ్రంథాలు కూడా వెలువడినాయి. యన్. రామచంద్ర సంపాదకత్వంలో 2007లో 'సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర' అనే బృహత్ గ్రంథం వెలువడింది. ఈ గ్రంథంలో 314 మంది రాయలసీమకు చెందిన ప్రాచీన కవులతో మొదలుకొని నేటి ఆధునిక కవుల దాకా వారి జీవిత విశేషాలు, రచనలు, కవిత్వం, వారి సాహిత్య విశేషాలను గురించి వివరించబడింది. తెలుగు పాఠక ప్రియులకు, సాహిత్య పరిశోధకులకు రాయలసీమ కవుల గురించి తెలుసుకోవడానికి, అధ్యయనం చేయడానికి ఈ గ్రంథం బాగా ఉపకరిస్తుంది. కర్నూలు నుండి కె.యన్.ఎస్.రాజు సంపాదకత్వంలో కర్నూలు జిల్లా రచయితల చరిత్ర 1994లో వెలువడింది. ఇది కూడా కర్నూలుకు చెందిన కవుల చరిత్రను వారి కవిత్వాన్ని తెల్పుతుంది. కడప నుండి డి.కె.చదువుల బాబు సంపాదకత్వంలో కడప జిల్లా సాహితీ మూర్తులు అనే గ్రంథం వెలువడింది. ఇందులో కేవలం కడపకు చెందిన 465 కవులు, రచయితల పరిచయాలు వారి రచనా విశేషాలు తెలుపబడింది.

అనంతపురం నుండి అనంతకవిత, అనంత కవితా స్వరాలు, కర్నూలు నుండి కర్నూలు కవిత లాంటి కవితా సంకలనాలు వచ్చాయి. 1996లో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి ప్రధాన సంపాదకత్వంలో 'సీమ సాహితి' సాహిత్య సామాజిక మాస పత్రిక వెలువడింది. ఈ పత్రికలో సీమ సాహిత్యాన్ని, వెనుకబాటుతనాన్ని, ప్రభుత్వ నాయకుల వైఫల్యాన్ని, హక్కులు లాంటి అంశాల విలువైన సమాచారం వెలువడి ప్రజలను చైతన్యవంతం చేసింది. మేధావులు, విమర్శకులు, పరిశోధకులు రాయలసీమకు సంబంధించిన అనేక అంశాలను చారిత్రక, సాహిత్య, సామాజిక, సాంస్కృతి, రాజకీయ, ఆర్థిక కోణాలలోంచి ఆలోచించి, వివేచించి వ్యాసాలు, పుస్తకాలు రచించి సీమ ప్రజలలో జాగురూకత కల్పించి మేల్కొలిపి చైతన్యవంతం చేస్తున్నారు.

కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాలు చరిత్రలో 'దత్త మండలాలు' గా పిలువబడుతూ ఆ తర్వాత 1928 కాలానికి దత్త మండలాలు అనే పేరు బానిసత్వాన్ని సూచించేదిగా వుందని గుర్తించి ఆత్మగౌరవానికి ప్రతీకగా, అస్తిత్వాన్ని నిలబెట్టేదిగా, ప్రాంతీయ చైతన్యాన్ని నడిపించేది గానూ 'రాయలసీమ' అని నామకరణం పొందడం ప్రాంతీయ అస్తిత్వ చైతన్యంలో భాగంగా చూడవచ్చు.

రాయలసీమ ప్రాంతం అంటే ఏమిటి? అసలు దాని అస్తిత్వానికి సంబంధించిన చైతన్యం ఏమి? ఎట్లా ఒక ప్రాంతం అస్తిత్వం చైతన్యంలో నుంచి ముందుకు వెళుతుంది? ఎందుకు వెళుతుంది? అన్న విషయాలు కూడా సీమ ప్రాంత కవులు తమ కవిత్వంలో విశదీకరించారు. రాయలసీమ లాంటి ప్రాంతం గురించి ఇంకొంచెం ఎక్కువగా ఆలోచిస్తే ఒక ప్రాంతం ప్రాంతంగా నిలుపుకోవడానికి ప్రాంతం గురించి ఆలోచించే క్రమంలో ఆ ప్రాంతం వెనుకబాటుతనానికి ఏ శక్తులు కారణమౌతాయి ఏమిటి అనే విషయాలు కూడా చర్చలోకి వస్తాయి. అప్పుడు తప్పకుండా ఆ ప్రాంతం మీద ఆధిపత్యం వహిస్తున్న శక్తులు ఎవరు అనేది చూస్తే ఆ ప్రాంతం యొక్క చైతన్యంలోంచి దిక్కారం వస్తుంది. ఆ ఆధిపత్యాలను ఎదురించడానికి లేదా ఆధిపత్య భావాలను చెప్పడానికి, ప్రచారం చేయడానికి సంబంధించిన చైతన్యం అవసరమౌతుంది.

ఒక ప్రాంత నైసర్గిక స్వరూపంలో వున్నటువంటి మౌలిక అంశాలు అయిన కరువు కార్పణ్యాలు, ఫ్యాక్షన్, వర్గ, ముఠా కక్షలు రావడానికి కారణమేంటి? కరువులు, కక్షలు ఆ ప్రాంతాన్ని ఏం చేస్తున్నాయి ఇలాంటి అంశాలన్నింటినీ కవులు ఆలోచిస్తారు. ఆలోచన చేస్తూనే వాటికి సంబంధించిన చైతన్యంలో నుంచి ఒక దిక్కారం వైపుకు వెళ్తారు. రాయలసీమలో ప్రధాన సమస్య కరువు. అసలు కరువుకు మేఘమే కారణమా? వేరే కారణాలు లేవా? అయితే చాలా మంది కవులు ప్రకృతి పరిణామ కారణాల దగ్గరే ఆగిపోలేదు. ఆ కరువు వెనుక వున్నటువంటి రాజకీయ కారణాలు ఏవి? నిర్లక్ష్యం ఎవరిది? రైతుల పంటల సాగుకు సరైన నీటి సదుపాయాల కల్పనలో జరుగుతున్న జాప్యం ఏమిటి? అవసరమైన ప్రాజెక్టులు, కాలువలు నిర్మాణం చేయకపోవడం, ఫ్యాక్షన్ ముఠా శక్తులకు కారణాలు ఏంటి? ఎవరి హస్తం వుంది, ఏ శక్తులు నడిపిస్తున్నాయి? సహజ వనరుల మీద ఆధిపత్యం ఎవరికి వెళ్తోంది, దోపిడి ఎక్కడ జరుగుతోంది? ఈ అంశాలన్నింటి మీద ఆలోచనలు, ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆ ప్రయత్నాలలో భాగంగానే కవులు కవిత్వంలో రైతులు గూర్చి, ఆత్మహత్యలు, కరువులు, వలసలు, ఫ్యాక్షన్, నీటి సమస్య, నిధుల వాటా, హక్కులు, నాయకుల వాగ్దానాలు, సీమ ప్రాదేశికత లాంటి ఏ అంశాన్ని గురించి మాట్లాడినా చివరకు చైతన్యం వైపుకు వచ్చేసి ఎవరిని ఎదురించాలి అనే దగ్గరికి ఆగుతారు. రాయలసీమ ఆధునిక వచన కవిత్వంలో 2000 తర్వాత వచ్చిన పరిణామం ఏంటంటే కవులందరూ పై పేర్కొన్న కారణాల్ని విశ్లేషించి కవిత్వం రాశారు అని చెప్పలేము కాని చాలా మంది కవులు తమ ప్రాంతం పట్ల, సీమ స్వరూప స్థితిగతుల పట్ల, గతించిన సీమలోని సమస్యల పట్ల, వర్తమానంలో జరుగుతున్న వాస్తవిక దృశ్యాల పట్ల, భవిష్యత్‌లో జరగబోయే, ఎదుర్కొనబోయే అవరోధాల పట్ల జాగురూకతను కలిగి వుండి, బాధ్యతాయుతమైన స్పృహను కలిగి వుండి, నూతన చైతన్యం వైపు ఆలోచించి వివేచించగల కవులున్నారని చెప్పవచ్చు.

రాయలసీమ వచన కవిత్వ ప్రయాణాన్ని, దాని పరిణామ క్రమాన్ని మూడు దశలుగా చెప్పుకోవచ్చని జి.వెంకటకృష్ణ గారు వివరించారు.

1) రాయలసీమ ఇట్లా ఎందుకు వుంది. ఇలా ఉండడానికి ప్రధాన కారణం ఎట్లా వుంది, దాని వెనుక వున్నటువంటి ధైన్యం ఎలా ఉంది అనేది ఒక స్థాయి. సీమను గురించి, సీమ ప్రాదేశికతను గూర్చి మాత్రమే చెప్పేది ఇది. ఇది ఒక భావాన్ని గూర్చి చెప్పేది మాత్రమే. ఇది ఒక చైతన్యం.

2) కరువుకు, ఈ ఫ్యాక్షన్‌కు తర్వాత ఈ మొత్తం వ్యవహారానికి వెనుక వున్నటువంటి రాజకీయాలు ఏంటి, పరిస్థితులు ఎలాంటివి అని చెప్పడం ఒక రకమైన చైతన్యం. ఆ స్పృహలో నుంచి వచ్చే చైతన్యం ఇది ఒక దశ.

3) ఆ తర్వాత దీన్ని ఎదుర్కోవడానికి, దిక్కారం చేయడానికి అవసరం ఉందా లేదా ఎట్లా ప్రచారం చేయాలి, ఎట్లా ఉద్యమాన్ని చేయాలనే ఉద్యమం వైపుకు తీసుకువెళ్ళే ఒక పాయ, ఒక దశ.

ఈ మూడు దశల కవిత్వం రాయలసీమ కవిత్వంగా చెప్పవచ్చు అని విశ్లేషించారు.

రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి కవులు, యువ కవులు కవిత్వం రాస్తూ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తమదైన ఆధునిక వచన కవిత్వాన్ని రాస్తున్నారు. కవిత్వంలో రాయలసీమ స్పృహ కూడా కనిపిస్తుంది. పైన విశ్లేషించిన మూడు దశల కవిత్వపు ఆలోచనలు రాయలసీమ కవుల్లో స్థిరపడింది. “ఒక ప్రాంతపు నైసర్గిక స్వరూపం, ఆ ప్రాంతపు భాష, చరిత్ర, సంస్కృతి, రాజకీయాలు మొత్తం కవిత్వంలో ప్రతిఫలిస్తే దానిని ప్రాంతీయ అస్తిత్వవాద కవిత్వం అంటాము” అని బండి నారాయణ స్వామి రాయలసీమ సమాజం- సాహిత్యం అనే పుస్తకంలో వివరించారు.

ప్రాంతీయతను మూడు లక్షణాలుగా అర్థం చేసుకోవచ్చు.

1) ఒక ప్రాంతపు స్థితిగతుల పట్ల స్పృహ కలిగి వుండటం ప్రాంతీయత.

2) ఒక ప్రాంతపు పూర్వాపరాల చరిత్ర పట్ల చైతన్యం కలిగి వుండటం ప్రాంతీయత.

3) ఒక ప్రాంతపు అణచివేతకు కారణమైన ఆధిపత్య శక్తులను ధిక్కరించ గలగటం ప్రాంతీయత.

ఈ మూడు లక్షణాలను అనుసరించి రాయలసీమ కవిత్వాన్ని మూడు ధోరణులుగా చూడవచ్చు. అవి

1. రాయలసీమ స్వయం స్పృహ కవిత్వం
2. రాయలసీమ భావ చైతన్య కవిత్వం
3. రాయలసీమ ధిక్కార కవిత్వం ” [12]

జి. వెంకటకృష్ణ గారు విశదీకరించిన మూడు దశలు, బండి నారాయణ స్వామి భావించిన మూడు ధోరణులను రాయలసీమ వచన కవిత్వంలో ఏవిధంగా ప్రతిఫలించింది, అలాగే రాయలసీమ ఆధునిక వచన కవితా సంపుటాలు, సంకలనాలు, దీర్ఘ కవితలలో రాయలసీమ కవుల చైతన్యాన్ని, వారి దృక్పథాలను పరిశీలన చేయడం అవసరం.

## 4.4.1 వ్యవసాయం- చైతన్యం:

రాయలసీమ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. రాయలసీమలో వ్యవసాయం ఎక్కువగా వర్షాధారితం. ఆ తర్వాత కాలువలు, బోరుబావుల ద్వారా సీమ రైతులు పంటలను సాగు చేస్తున్నారు. రాయలసీమ ప్రాంతాల్లో చాలా చోట్ల సరైన వర్షాలు కురవకపోవడం ప్రాజెక్టులు, డ్యాంల నుంచి కాలువల ద్వారా సరైన విధంగా నీరు పారక పోవడం, భూగర్భ జలాలు అడుగంటి పోవడం ద్వారా అరకొరగా బోరుబావుల్లో నుంచి నీరు లభించడం వంటి అనేక కారణాల వల్ల సీమలో రైతులు వ్యవసాయం చేయడం జీవన్మరణ సమస్యగా మారింది. శాస్త్ర- సాంకేతిక రంగాల్లో ఎంత అభివృద్ధి సాధించినా మానవ మేధస్సులో మనకు ఎవరూ సాటిలేరని పిలుపించుకున్నా తినడానికి తిండి లేకుండా వుండలేము. వ్యవసాయాభివృద్ధి జరగకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదు. నేటి ఆధునిక కాలంలో వ్యవసాయం చేయడం చాలా ఖర్చుతో కూడుకొన్న పని. సేద్యం చేసే యంత్ర పరికరాల ధరలు పెరగడం డీజిల్, పెట్రోల్ ధరలు రోజు రోజుకు పెరుగుతూ వుండడం రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు లభించక పోవడం విత్తనాలు, ఎరువులు, మందులు రేట్లు పెరగడం కూలీల కొరత, సేద్యంలో పనులు చేసే పని మనుషుల కూలీ రెట్లు పెరగడం, సరైన మార్కెట్ సదుపాయాలు లేకపోవడం, మార్కెట్‌లో పంటకు తగ్గ గిట్టుబాటు ధరలు వుండక పోవడం, మధ్యవర్తులు, దళారులు, వ్యాపారస్తుల మోసాలు ఒకటేమిటి ఎన్నో కారణాలు వ్యవసాయాన్ని అతలాకుతలం చేస్తున్నాయి.

రాయలసీమ కవులు సీమ వ్యవసాయం, అందులోని కష్టాలను, కడగండ్లను కళ్ళారా చూసిన వారు కావడం వల్ల అందులోని సాధకబాధలను అర్థం చేసుకొని ఆ సమస్యలను పట్టుకొని కవితలు రాశారు. వ్యవసాయపు స్థితిగతులు దానికి గల కారణాలను వెదుక్కొంటూ, ఆ వ్యవసాయాన్ని రైతులను చైతన్యవంతం చేస్తూ కవిత్వాన్ని వెలువరించారు. వేంపల్లి అబ్దుల్ ఖాదర్ రాయలసీమ భాష, యాసలో రైతు, వ్యవసాయ సమస్యల్ని చిత్రించాడు. 'ఎన్ని వొగాదులొచ్చినా' అనే కవితలో సేద్యం చేయడం ఎంతకష్టమో అందులోని కష్టాలను కవిత్వీకరించాడు.

" సెనిక్కాయ్ సేద్దిం చేస్తి!
మోటబాయిలో నీళ్లున్నా

ఈ అడపా దడపా కరంటుతో సొగం ఎండిపాయ

సొగంలో సొగం అగ్గి తెగులు నాకేస్తే

మిగిలిందేమో ఎలకల పాలైపాయ!

సట్టమొగటి పెట్రి

ఆ లెక్కన సీలింగులో బూమొచ్చ

సదునూ పదునూ చేస్తి

ఆరద్దల కారితి అదునులో ఇత్తనమేసినా

ఆసట్టు సవిట్నేల్లో ఏసిన గింజ

ఒగటైనా మొలకెత్తలా!

కొండన్యాలిక్కి మొందేస్తే

ఉండే న్యాలికే ఊడిపాయ!"[13]

వేరుశెనగ పంటను పండించే రైతుల కష్టాలను తెల్పుతున్నాడు. బావులో నీరు పంటకు అందకపోవడం, ఎప్పుడు వస్తుందో పోతుందో తెలియని కరెంటు సమయాలు, పంటకు పట్టిన చీడపురుగులు, రోగాలు, ఎలుకల బెడదలు లాంటి అనేక కారణాలు సేద్యాన్ని చుట్టముట్టాయి. భూపంపిణీలో ప్రభుత్వం మంజూరు చేసిన ఆ చవిటి నేలలో రైతు విత్తనాలు చల్లి అవి మొలకెత్తక పోవడం వల్ల రైతు ఏవిధంగా మోస పోయాడో కవి చిత్రించాడు. సేద్యానికి అవసరమయ్యే నీరు, కరెంటు అలాగే పంటకు సోకే తెగుళ్ళు, రోగాలు, పశువులు, జంతువులు, క్రిమికీటకాల బెడదలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం లాంటి ఎన్నో కారణాల వల్ల సేద్యం ఎలా వెనకబడి పోతుందో కవి చిత్రించాడు.

జూపల్లి ప్రేంచంద్ అనంతపురం యాసలో వ్యవసాయ సమస్యలను రైతుల ఈతిబాధలను చెబుతూ సేద్యం చేయడం అంటే ఎలా వుంటుందో 'కడాకు' కవితలో ఇలా అంటాడు.

" ఏమప్పా

యాపొద్దన్నా

ఉగాదులూ పొద్దు పొడుపులు చూసిందామా

బతుకంతా బందల దొడ్డిగదరా

ఊరంతా వల్లకాడే గదా

పంట పండితే పండగ పండకుంటే యండగ

పంట పండిందేది ఎబ్బుడబ్బా

వానలు వచ్చినా కష్టమే రాకున్నా కష్టమే

పదును ఎక్కువయినా కష్టమే తక్కువయినా కష్టమే

పాడు చనిక్కాయ యాటినించీ వచ్చెనో

బతుకు ఛిద్రం ఛిద్రం అయిపాయ"[14]

అనంతపురం జిల్లాలోని వేరుశెనగ పంటను పండించడంలో గల కష్టాలను తెల్పుతున్నాడు. పంటలు పండితేనే కదా రైతులు సంతోషంగా వుంటారు. పండుగలు, ఉత్సవాలు జరుపుకొని ఊరంతా సుఖః సంతోషాలతో ప్రజలు వుంటారు. అలాంటి పంటలు ఎప్పుడు పండినాయి, మేము ఎప్పుడు సంతోషంగా ఉన్నాము అని కవి ప్రశ్నిస్తున్నాడు. పంటలు సాగుచేసే సమయంలో వర్షాలు వచ్చినా కష్టమే పదును ఎక్కువయినా కష్టమే అలాగే వర్షాలు రాకపోయినా పదును కాకపోయినా పంటలు పండవు. ఇలాంటి సమస్యలోంచి అనంత సేద్యాన్ని చైతన్యవంతంగా అనంత రైతులు మాట్లాడే యాసలో కవిత్వీకరించాడు. ఇంకా ఇలా అంటున్నాడు.

" తీగ చెనిక్కాయా అనిరి

ఏస్తిమి

గుత్తి చనిక్కాయ అనిరి

ఏస్తిమి

తినేకి తిండి గింజలే కరువాయ

సజ్జలు యాటికి బోయనో

కొర్రలు, సాములు, జొన్నలు యాటికి బోయనో

రాగి సంగటి కతే మర్సిపోతిమి

రెండు రుపాయల బియ్యం అరవై రూపాయలాయనా

కడాకు అర్ధాకలితో గదా సస్తాండాము

కడుపు నిండుకూ కూడు తినిందే దెబ్బుదు?"[15]

అనంతపురం జిల్లాలో వర్షాధారిత ప్రధాన పంట వేరుశెనగ. అధికభాగం రైతులు ఖరీఫ్ కాలంలో సాగు చేస్తారు. అలాంటి గుత్తులు గుత్తులుగా కాసే వేరుశెనగను విత్తితే పంట పండక తినేకి కూడా కరువై పోయింది. ఇక చిరుధాన్యాలైన సజ్జలు, కొర్రలు, సాములు, జొన్నలు, రాగులు పండించే రైతులూ లేరు. ఆ ధాన్యాలు కనుమరుగైపోతున్నాయి. రాగి సంగటిని కూడా మరిచి పోయే స్థితికి చేరుకున్నారు. చివరికి రేషన్ ద్వారా దొరికే బియ్యం కూడా ధరలు పెరిగి ప్రజలు పస్తులుండి అర్ధాకలితో అలమటించిన దృశ్యాలను

కవి ఎండగడుతున్నాడు. అనంత సేద్యాన్ని గూర్చి ఇలా అంటున్నాడు.

“ ఈ పొద్దు
మా ఊర్లో సేద్యం చేసేటోల్లు ఎవురు
చిల్లరోల్లు, శూద్దరోల్లు బతకలేనోల్లు
ఒగబ్బుడు సేద్యం చేసేటోడు మొగోడు
అప్పుల ఊబిలో పుట్టి అప్పుల ఊబిలో పెరిగి
అప్పుల ఊబిలో సచ్చెటోడు రైతు
ఆత్మహత్య అతని చిరునామ
యాల మేసేదానికి తనకాబాంకోడు సిద్ధం
ఏమిడి దుందినాతాన పుట్టగోసి
నడిబజార్లో సిద్దంరా! కరువును అంచనా వేసే
దమ్ముంటే! నా శవాన్ని యాలమేయండిరా!
కడాకు
నా శవం గూడా తిరగబడి సాక్ష్యం చెబుతాది
ఈ హత్యలన్నిటికీ అసలు ముద్దాయి ఎవరో!”[16]

తరతరాలుగా చేస్తున్న రైతు పనిని ఈ రోజు చేసేవారు ఎవరు? ఒకప్పుడు సేద్యం చేయడం గొప్పతనం సేద్యం చేసే రైతు గొప్పవాడు. ప్రస్తుతం సేద్యం చేయడమంటే నిరంతరం ఖర్చులు, అప్పులు, మోసాలు లాంటివి పెరిగిపోతున్నాయి. ఊబిలో కూరుకుపోయినట్లేనని రైతు కడగండ్లను దృశ్యమానం చేశాడు. చివరికి సేద్యంలో కష్టాలు ఎక్కువై సేద్యం చేయలేక ఆత్మాభిమానాల్ని తాకట్టుపెట్టి చావే శరణ్యం అనుకుంటున్న రైతుల సేద్యం దీనస్థితిని కవిత్వీకరించాడు. 'వానాకాలంలో ఎండాకాలం' కవితలో ఇలా అంటున్నాడు.

“ ఆశపడి
ఒల్లు గుల్ల చేసుకొని
దుక్కి దున్ని ఎదురు చూసీ...సీ...సీ
బుగ్గలు సొట్టలు పడి
జూన్ మాసంలో కూడా
మే ఎండ మంట పెట్టగా పెట్టగా

ఇత్తనం కాయ ఇంట్లో ఎక్కిల్లు పడతాంటే

అరకొర పదునుకే చనిగిత్తనాలు

ఇత్తితే ఇల్లంతా బోసిపాయ

సుట్రగాలి సుడులు తిరగ్గా

చేనంతా ఎర్రగాబు లేయబట్టె

చీల్చుకొచ్చిన రెండు లేతరెమ్మలు

చేతులెత్తి ఆకాశానికి వందనం చేశి

మలమల మాడిపాయ"[17]

మే, జూన్ మాసాల్లో ఎండలు బాగా కాసి తొలకరి వర్షాలు రాగానే రైతులు ఆశతో పొలాలు దున్ని విత్తనాలు సిద్ధం చేసుకొని పొలాల్లో విత్తుతారు. ఆ తర్వాత క్రమంగా వర్షాలు రాక ఎండలు పెరిగి పంటలు ఎండిపోతాయి. ఇలాంటి సేద్యంలోని విషాద దృశ్యాల్ని చెప్పాడు.

పి. వెంకటేశ్వర రావు 'తొలకరి ఉరకలు' కవితలో సీమ వ్యవసాయ చిత్రాన్ని మన కళ్ళ ముందు నిలిపారు.

" తొలకరి రాలితే కొత్త పులకింత

రైతు లోగిళ్ళలో ఏటా ఆనందాల కేరింత

సూర్యునితో పోటి– చంద్రునితో భేటి

అరకలు ఉరకలు...మెరకల్లో నాగలి రేఖలు

బంగారు పంటలపై ఆశలతో గీసే గీతలు

అప్పుల కోసం చెప్పులరిగేలా తిప్పలు

విత్తు మొదలు శ్రమ ఆరుగాలం భ్రమ

అంగట్లో నకిలీల బెడద

ముంగిట్లో పథకాల రొద

పిల్లాడి మొదలు కళ్ళల్లో

వత్తులేసుకొని గడిపే రోజులు

ఆఖరికి పత్తి నవ్వదు వడ్లు దుడ్లు రాల్చవు

'కూరలూ' చిల్లిగవ్వనివ్వవు

చెనిక్కాయ కునుకు తీస్తుంది

చివరికి మార్కెట్టూ దగ చేస్తుంది

ఐనా వెరవని 'సీమ' వ్యవసాయీ..

నిత్యశ్రమసాయీ..."[18]

సీమ ప్రాంతాల్లో తొలకరి వర్షాలు వచ్చినప్పటి నుంచి రైతులు పంటల సాగుకు సిద్ధమౌతారు. పొలాలు దున్ని విత్తనాలు, ఎరువులు, మందులు సిద్దం చేసుకొంటారు. పెట్టుబడులకు అప్పులు చేస్తారు. ఆరుగాలం శ్రమపడి సేద్యం చేస్తారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు రైతులు తెచ్చి మోసపోతారు. పంటలు పండవు చేసిన అప్పులు తీరవు. గిట్టుబాటు ధరలు లభించవు. సీమలో వ్యవసాయం అంటే ఊబిలోకి దూకి క్రమక్రమంగా చావును కొని తెచ్చుకొన్నట్లేనని కవి చైతన్యవంతంగా చిత్రించాడు.

గోపిని కరుణాకర్ 'పొద్దున్నే వచ్చిన వాన' కవితలో సేద్యం చేసిన ఒక రైతు కుటుంబం ఎంతటి దీనావస్థలో వుందో ఆ దృశ్యాన్ని తెల్పుతున్నాడు.

" సేద్దం జూదమై పోయిందిరా

మీ అమ్మ మెడలోని తాళిబొట్టు

పసుపు కొమ్మయింది

నీ చెల్లెలి చెవుల్లోని కమ్మలు

జొన్న బెండులైనాయి

నీ తమ్ముడు బడిమాని

బట్టీలో కాలే ఇటికైపాయ

నువ్వేమో హోటల్లో ఎంగిలి కంచమైపోతివి

దేశానికి పట్టెడన్నం పెట్టిన మీ తాత

తుంట బీడీలు అడుక్కుంటా

బస్టాండులో బిచ్చగాడైపాయ

అన్నింటిని ఒడ్డి

నేను జూదంలో ఓడిన ధర్మరాజునైపోతిని"[19]

సీమలో వ్యవసాయం చేసి నష్టపోయిన రైతు కుటుంబం ఆ కుటుంబంలోని వారు ఎలా బతుకుల్ని వెళ్ళదీస్తున్నారో కవి ఆలోచనాత్మకంగా, వాస్తవికంగా చిత్రించాడు. నేటి కాలంలో సేద్యం ఒక జూదమై పోయిందని సీమ వాస్తవికతలోంచి చిత్రించాడు. రైతు కుటుంబంలో రైతు భార్య, కొడుకు, కూతురు, రైతు ఎలాంటి దీనావస్థల జీవితం గడుపుతున్నారో తెల్పుతున్నాడు. ఈ సమాజానికి పట్టెడన్నం పెట్టే రైతు దీనస్థితి ఎలా వుందో శక్తివంతంగా చైతన్యవంతంగా కవిత్మాకంగా చిత్రించాడు.

జి.వెంకటకృష్ణ 'మూడు కోర్కెలు' కవితలో ఇలా చిత్రించాడు.

" మట్టిని విత్తి విత్తులై తానే పండాలని
దుమ్ము రేగిన బతుకులో
దున్ను చేసిన నేలలో
మట్టి మోసగించిందో
మేఘం ద్రోహం చేసిందో
కళ్ళకు కానరాని మాయకుట్ర పన్నిందో
మట్టిపాట మెడకు వురి బిగిసింది
మట్టిలోకి చేరిన విత్తు
మొలకలై మొలుకువై
వెలుగిలు నింపాల్సిన విత్తు
కళ్ళ ఎదురుగా నిలిచెను మిత్తై
ఆఖరి చరణం హంసగీతమై
అతడి ఆఖరి కోరిక
మట్టిలో మట్టై జీవించాలని
గడప ముందు పరచిన తెల్లటి గుడ్డ కింద
పచ్చటి పాడె మీద
వాలిపోయిన కమిలిపోయిన
నురగలు కక్కుకున్న గొంతుతో
మట్టికి అప్పుపడ్డానని
ఎలుగెత్తి అరవాలని"[20]

సీమలో సేద్యం చేయడం ఎంత కష్టంగా వుంటుందో తెల్పుతున్నాడు. మట్టిని నమ్ముకుని రైతు సేద్యం చేస్తే ఆ మట్టిలోనే అతని జీవితం ఎలా కలసి పోతుందో ఒక విషాదకర దృశ్యాన్ని, హృదయ విదారకర సంఘటనను గుర్తు చేస్తుంది. మట్టిని నమ్మి విత్తనాలు విత్తితే పంట పండాలి. అయితే విత్తులు మొలవలేదు కారణం ఎవరు? ఎవరు మోసం చేశారు. ద్రోహం చేసింది ఎవరు అని కవి ఆలోచనాత్మకంగా ప్రశ్నిస్తాడు. అతడి ఆఖరి కోరిక జీవితం రెండు మట్టిలోనే కలిసిపోయాయి.

డి.శిరీష 'బదులు చెప్పేదాక' కవితలో ఇలా అంటుంది.

" ఆలి కాళ్ళ కడియాలను
కుదువ బెట్టి విత్తనాలేసినా
మొలకెత్తులేదు గానీ
వడ్డీలు వడలిన చేతుల్లో
ఊబ ముళ్ళాయె!
చక్రవడ్డీలు
సత్తువ లేని కాళ్ళ క్రింద పల్లేరు ముళ్ళాయె
బతుకు బతుకంతా బండగ
బతికే బ్రహ్మాజెముడయి పాయె!
గంజికి గింజల్లేక
పేగులెండి పాయె
మేతలేక గిత్తలు
గుంజకు గింజులాడె!
ఎద్దుల బండి
కంపచెట్ల క్రింత అరుగయిపాయె!"[21]

సేద్యానికి పెట్టుబడి ఖర్చుల కోసం నగలను తాకట్టు, కుదవ పెట్టి డబ్బులు తెచ్చి సేద్యానికి పెడితే చివరికి అప్పులు తీరక, వడ్డీలు కట్టలేక చక్రవడ్డీలు పెరిగి రైతుల బతుకంతా బండపాలైందని రచయిత్రి చెబుతున్న వాస్తవ దృశ్యం. తినడానికి గింజలు లేవు. పశువులకు గడ్డిలేదు. సేద్యం వట్టిపోయిన దృశ్యాన్ని చెప్పింది.

### 4.4.2 రైతులు- రైతు ఆత్మహత్యలపై చైతన్యం:

దేశానికి వెన్నెముక 'రైతు' అని రైతు గురించి అతని గొప్పతనాన్ని గూర్చి సమాజం కీర్తిస్తుంది. ఈ సమాజంలో వ్యవసాయం చేసేవాడు రైతు. పంటలను పండించడం అతడు తన ధర్మంగా నిర్వహిస్తాడు. వ్యవసాయాన్నే నమ్ముకుని జీవనం సాగిస్తాడు. ఈ దేశానికి ఒక సైనికుడు రక్షణ కోసం ఎంత అవసరమో ఈ సమాజానికి ఒక రైతు కూడా అన్నం పెట్టడానికి అంతే కీలకమైన వ్యక్తిగా గుర్తించాలి. అలాంటి రైతు వారి సేద్యపు జీవితం, కష్టాలు, కడగండ్లు, సమస్యలు, బ్రతుకు తెరువు లాంటి అంశాలను రాయలసీమ కవులు కవిత్వీకరించారు.

సడ్లపల్లె చిదంబర రెడ్డి అనంతపురం మాండలికంలో ఎక్కువగా కవిత్వం రాస్తారు. 'పెన్నేటి పదాలు' కవితలో రైతును ఇలా అంటాడు.

“ పాతాళానికి దించె బోరింగు

పడతాయంటాని – నీళ్ళు

పడె.......వాన్నోట్లో దుమ్ము!!”[22]

అనంతపురంలాంటి ప్రాంతాల్లో రైతులు నీటికోసం 500 అడుగులు నుంచి వెయ్యి అడుగుల దాకా బోరు వేయిస్తారు. అయితే ఈ కవితలో నీరు పడాల్సిన చోట రైతు నోట్లో దుమ్ము పడిందని ఒక పద విరుపుతో వ్యంగ్యంగా చెప్తాడు.

“ ఏనుగట్లా రైతు

ఎగబడి సేద్యం జేసి

ఎండే పంటల్జూజసి

పీనుగై పాయ!!

కాసంత వాన పడదా అని

తోట్లో కాసుకుని కూకుంటే

కాసిన పూత రాలిపోయ

వాని కండ్లు మాత్రం కాయలుగాశ!!”[23]

బంగారం లాంటి పంటలు పండించే రైతు సీమలో పంటలు పండక పీనుగులా చిక్కిపోతున్నాడు. వాన కోసం నిత్యం ఎదురు చూపులు ఆ ఎదురు చూపుల్లోనే రైతు కళ్ళు జీవంలేని కాయలుగా మారాయని కవి ఆక్రోశించాడు.

పులికంటి కృష్ణా రెడ్డి ‘చెమటచిరునామా’ కవితలో రైతు ప్రాముఖ్యతను అతని గొప్పతనాన్ని తెలియజేస్తున్నాడు.

“ మట్టిలో పురుగనే వాదనకు వాతబెట్టి

మేడిపట్టి లోకాన్ని మేపేటి మొనగాడా

దిగులు పడవద్దన్నా రైతన్నా!

.........................................

పుడమి తల్లి ఒళ్ళంతా పులకరింప జేస్తావు

అరముద్ద సంగటిలో ఆకలి గుప్పిటపట్టి

పప్పన్నమే మాకు పెట్టే పరమాత్ముడివి

దిగులు పడవద్దన్నా రైతన్నా

మట్టిని తిని బతికేటి మనిషి లేడు లోకాన
మట్టిని మాకందిస్తావు మార్చి బువ్వరూపాన
పెట్టేదిక్కు నువ్వయితే పెట్టేవాడు దేవుడని
పిచ్చోళ్ళు నమ్ముతుంటే గుండె గిచ్చినట్లుంది"[24]

మట్టిని నమ్ముకుని మట్టిలో సేద్యం జేసి తన కష్టాన్ని ధారపోసి, పంటలు పండించి, ఈ సమాజానికి అన్నం పెట్టేవాడు నిజమైన దేవుడని కవి వాస్తవికతలోంచి ఆలోచించి రైతును అధైర్య పడవొద్దని, దిగులు చెందవద్దని రైతుకు భరోసానిస్తూ కవిత్వీకరించాడు.

జి.హరిసర్వోత్తమ నాయుడు 'స్వర్ణాంధ్రకు శవమెత్తు సంతకం' కవితలో ఇలా అంటున్నాడు.

" రైతులే రాజులంటున్నా
రైతు మాత్రం
రాజకీయ జూదంలో పావుగానే మిగిలిపోతున్నాడు
పెళ్ళాం బిడ్డల్ని గాలికొదలి
ఎద్దుల్ని కళేబాలకు దానం చేసి
మడక, ముల్లుగర్ర,
మోటబాన, జాటికర్ర
జమ్మిచెట్టు మీద మూటగట్టి
'అనంత' వెతలలోంచి విముక్తమౌతున్నాడు!
స్వర్ణాంధ్రకు శవమెత్తు సంతకమౌతున్నాడు![25]

రైతే రాజుగా కీర్తించబడినవాడు నేటి హైటెక్ సాంకేతిక కాలంలో రాజకీయాలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల జూదంలో పావుగానే మిగిలి బలైపోతున్నాడు. రైతుల్ని ఆదరించే ఆపన్న హస్తాలు కరువైనాయి. వ్యవసాయంలో వ్యయం(ఖర్చు) వుంది, సాయం రైతులకు అందట్లేదు. పెళ్ళాం బిడ్డల్ని, కుటుంబాలను, సేద్యపు జీవితాన్ని వదిలించుకొని రైతు తన బతుకు వ్యథలలోంచి బయటపడే మార్గం లేక విముక్తుడవు తున్నాడని కవి ఒక చైతన్యాన్ని మనకు కలిగించాడు.

బిక్కి కృష్ణ 'వామనుడి మూడోపాదం కోసం' కవితలో చైతన్యవంతంగా చెప్తూ ఆలోచనాత్మక కవితను రాశాడు.

" నా దేహాన్ని
ఒక శిలాఫలకంగా నాటండి

నా రెండు కళ్ళల్లో స్రవించే కన్నీళ్ళు
హంద్రీ నీవా సుజల స్రవంతులై
నా సీమను సస్యశ్యామలం చేస్తాయి
నన్ను ఆ మబ్బు పట్టిన ఆకాశంలోకి విసిరేయండి
నేను చినుకు పూల వర్షాన్నై
సీమ నేలపై కురుస్తాను
రైతన్నల పొలాల్లో పచ్చని పంటగా పల్లవిస్తాను" [26]

హంద్రీ-నీవా సుజల స్రవంతి పథకం ద్వారా రాయలసీమ ప్రజానీకానికి, రైతాంగానికి సాగు, తాగునీరు అందివ్వాలి. అయితే నాయకులు, ప్రభుత్వాల నిర్లక్ష్యం, అలసత్వం కారణంగా శిలాఫలకాలకే పరిమితమై పనులు నత్తనడకన జరుగుతున్నాయి. ఈ కాలయాపనను దృష్టిలో పెట్టుకొని కవి రైతు దేహంలోంచి, ఆత్మలోంచి పలికించాడు. రాజకీయ నాయకుల వాగ్దానాలను, ప్రభుత్వాల నిర్లక్ష్యాలను ఎండగడుతూ ఇలా అంటాడు.

" ధర్మరాజుల్లాంటి రైతులకు దక్కాల్సిన
అయిదు ఊళ్ళూ కాసిన్ని
తాగునీళ్లు, సాగునీళ్లు కూడా ఇవ్వని
రాజకీయ దుర్యోధనులు
ఏ మడుగులోనూ తలదాచుకోలేదు
కారణం...నా సీమ
మడుగుల్లోకి నీళ్ళు రాకుండా చేసింది
వాళ్ళే కదా!
ఎవరి కన్నీళ్లకు ఎవరు కారణమైనా
ఫలితం ఎప్పటికైనా అనుభవించక తప్పదు
భూమి పుత్రులు మరణించారని మురిసిపోకండి
భూమిలోనికే వెళ్ళారు...పాతాళగంగను పైకి
తేవడానికి కాదు... వామనుడి మూడోపాదాన్ని
మోసుకు రావడానికి..."[27]

రాయలసీమ ప్రాంతానికి ఇతర ప్రాంతాల నుంచి నదుల ద్వారా ప్రాజెక్టులు ద్వారా సాగు, తాగునీరు

కల్పించలేని ప్రభుత్వాలను ఆక్షేపిస్తున్నాడు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల జీవితం వృథా కాదని వారు వామనుడి మూడోపాదమై అవతరిస్తారని కవి కవిత్వీకరించాడు.

చంద్రశేఖర్ 'గద్దలాడుతున్న దృశ్యం' కవితలో రైతు ఆత్మహత్యల పై కవితా బాణం సందించాడు.

" పాడుబడిన గూట్లో
ముసలిపక్షి చావకేం చేస్తుంది
మోనో్క్రోటో పాస్ తాగి
మన్ను తిన్న మనిషిది
ఆత్మహత్య కాదు
ముమ్మాటికి హత్యే
రాజ్యం చేసిన హత్య
శవాల మీది బట్టలమ్ముకొనే
రాజకీయ హత్య
రైతు వెన్నెముక
పదవులను కట్టబెట్టే సాధనం కాదు
పళ్లు రాలగొట్టే వజ్రాయుధం కావాలి" [28]

పంటల క్రిమి కీటకాలు, చీడ పురుగులను చంపలేని మోనో్క్రోటోఫాస్ మందు రైతుల ప్రాణాలను తీస్తుంది. రైతుల సంక్షేమాన్ని రైతుల పాలిట ఆపన్న హస్తంగా వుండాల్సిన ప్రభుత్వాలు రైతుల ఆత్మహత్యలకు కారణమౌతోంది. కాబట్టి ఈ రాజకీయాలు, ప్రభుత్వాలే రైతులను హత్య చేస్తున్నాయని కవి ఎండగట్టాడు. రైతుల సంఘటిత శక్తి వజ్రాయుధంలా మారి ప్రభుత్వాలకు, కుటిల రాజకీయాలకు కనువిప్పు కలిగించాలని చైతన్యం చేశాడు.

మునిసుందరం 'వెన్నెముక' కవితలో ఇలా అంటాడు.

" ప్రకృతి దయతలచి
జల్లులుగా నేలను తడిపినపుడు
ఆశల విత్తనాలు విత్తితే
అవి కల్తీలై నిన్ను దహించాయి
తెల్లని పత్తి పువ్వులు
కత్తులై గుండెల్ని చీల్చాయి

రోగాల వేరుసెనగ

నీ మూలాలకు నిప్పు పెట్టింది

అప్పులు, రోగాలు, మందులు

ప్రపంచ కబేళాలో

నిస్సగ్గుగా నిన్ను కోశాయి

ఎక్స్‌గ్రేషియోలు

నీ బిడ్డల కంచాలలో

అన్నం ముద్దలవుతాయా?

సానుభూతులు

సంగటి ముద్దలవుతాయా?”[29]

ఎన్నో ఆశలతో రైతులు పంటలను సాగు చేస్తారు. అయితే నకిలీ విత్తనాలు, మందులు, ఎరువులు పంటలకు వేసి నష్టపోయి మోసపోయిన రైతులెందరో వున్నారు. మార్కెట్ వ్యాపారస్తులు, ఈ ప్రభుత్వాలు రైతును కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. రైతులు ఆత్మహత్యలు చేసుకున్న తర్వాత నాయకుల పరామర్శలు, సానుభూతులు, ఎక్స్‌గ్రేషియా రూపంలో డబ్బులు ఇవ్వడం లాంటివి ఎన్ని చేసినా ప్రయోజనం వుండదని కవి చైతన్యవంతంగా ఆలోచనాత్మకంగా ఆక్షేపిస్తూ రాశాడు.

పలమనేరు బాలాజి ‘విజన్’ అనే కవితలో రైతు గూర్చి ఇలా అంటాడు.

“ అతడొక

మందుపాతరని

ముందే తెలుసు

పల్లెకు, నగరానికి

తేడా లేని కాలంలో

తాకట్టు పెట్టి పెట్టీ

అతడికిప్పుడు తలే లేదు

మిగిలిందల్లా

అప్పుల ఆనవాళ్ళే

ఇప్పుడతడు

గుప్పెడు గింజలు, పోగొట్టుకున్న పరపతి

కాసిన్ని నీళ్ళు, కరెంటు

కావాలంటున్నాడు

పైరు పండితేచాలు

పచ్చదనంతో తల పైకెత్తుతాడు"[30]

రైతులు పంటల పెట్టుబడి కోసం డబ్బులకు గాను నగలను తాకట్టు పెడతారు. ఆ తాకట్టు పెట్టిన నగలను విడిపించుకోలేక డబ్బులు లేక అప్పులు ఎక్కువై పంటలు పండక సమస్యల సుడిగుండాలలో చిక్కిపోతున్నాడు. పంటల సాగు కోసం నీరు, కరెంటు కావాలని రైతులు అడుగుతున్నారు.

కెరె జగదీష్ 'మహా ప్రయాణం' కవితలో పాలకులను ఇలా మేల్కొలుపుతున్నాడు.

" నాగలి మోసిన భుజం మీద

తుపాకి మొలవక ముందే

నేలలో దాగిన విత్తనాలు

బాంబులై పేలక ముందే

రైతుల కన్నీటి అలలు

ఉప్పెనలా ముంచక ముందే

మేల్కోండి

పాలకులారా! మేల్కొండి"[31]

రైతుల పట్ల వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం వహించిన పాలకులు రైతులు సంఘటితం కాక మునుపే రైతుల్లో తిరుగుబాటు ధోరణి రాక మునుపే ప్రభుత్వాలు, పాలకులు మేల్కొనాలని కవి రైతుల పక్షాన హెచ్చరిస్తున్నాడు. 'మేఘాల సాక్షిగా' కవితలో అన్నదాత అయిన రైతు స్థితిని తెల్పుతున్నాడు.

" ఇప్పుడు నా సీమలో

అన్నదాత ప్రశ్నార్థకమవుతున్నాడు

వ్యవసాయ వ్యసనానికి బానిసై

రుణాల ముళ్ళ బాటలో

మహాప్రస్థానం సాగిస్తూ

కరువు రగిలించిన చితిమంటను

ఉన్మాదంతో కౌగిలించుకుంటున్నాడు"[32]

రైతులకు పంటలను సాగు చెయ్యడమే పని. దానికి బానిస అయ్యి ఈ సమాజానికి అన్నం పెడతాడు.

అయితే సీమలో ఏటేటా కరువులు రావడం పంటలు పండక, అప్పులు ఎక్కువై, తనకు తానే ఆత్మహత్య చేసుకుంటున్నాడు. సీమలో అన్నదాతలు వారి బతుకులు, రైతుల వ్యవసాయం నడవక సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోతున్నాడని కవి ఆవేదన చెంది వ్యక్తం చేశాడు.

వేంపల్లి అబ్దుల్ ఖాదర్ 'సావుకీ బతుక్కీ మద్దెన' కవితలో రైతు ఆత్మస్థైర్యాన్ని ఇలా ప్రకటిస్తున్నాడు.

" చీమ సిటుక్కుమంటే
లటుక్కున ఉరేసుకునే పిరికినా కొడుకును గాను!
నేను కరుకే గాని పిరికిదనం తెలవని
పదునెక్కిన 'గుఱ్ఱంకొండ' పట్టాకత్తిని
బతుకంటే అర్థం పోరాటమేనని చెప్పే
పులిగడ్డన పుట్టిన సీమ బిడ్డని!"[33]

సీమ రైతు తనకు తానుగా ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకొని ఎన్ని కష్టాలు ఎదురైనా పోరాడుతానని ఆత్మహత్యల వైపు ఆలోచనలు చేయనని ఈ బతుకు ఆరాటంలో పోరాటం నేర్పిన ఈ సీమబిడ్డగా చెబుతున్నానని కవి రైతుల మనోధైర్యాన్ని కవిత్వీకరించాడు.

పి.ఎల్.శ్రీనివాస రెడ్డి 'మీరెప్పుడు కలుస్తారు' కవితలో రైతుల ఆత్మహత్యలపై చెబుతున్న దృశ్యం,

" రైతు
ఆత్మహత్య చేసుకుంటున్నాడు
కాదు
అన్నమే ఆత్మహత్య చేసుకుంటోంది
ఆహారం విషమవుతోంది
తల్లి చనుబాలు దారుణాగ్ని జ్వాల అవుతోంది
దేశం వెన్నెముక విరుగుతోంది
దేశం దేశమే ఆత్మాహుతి చేసుకుంటోంది"[34]

సమాజానికి తిండిని ప్రసాదించే రైతు కనుమరుగవుతున్నాడు. అతను పండే పంటలు నాశనమవుతున్నాయి. వ్యవసాయ పంటలు కలుషితమవుతున్నాయి. తల్లి లాంటి ఈ సీమలో అగ్నిజ్వాలలు రేగుతున్నాయి. దేశానికి వెన్నెముక అయిన రైతు నిట్టనిలువునా పడిపోతున్నాడు. దేశమే తగలబడి పోయే స్థితికి వచ్చిందని

ప్రమాదంలోకి మారే పరిస్థితి వచ్చిందని కవి హెచ్చరిక చేస్తున్నాడు.

నూకా రాంప్రసాద్ రెడ్డి 'వాన కురిస్తే' కవితలో సీమ రైతుల ఆత్మస్థైర్యాన్ని వారి మనోధైర్యాన్ని తెలుపుతున్నాడు.

" ఎడారిలో బతుకుతున్న మాకు
ఎవరి గుండె వారికి ఒయాసిస్సే
ఇక్కడ కన్నీళ్ళయినా, తాగి బతుకుతాం కాని
నిస్పృహతో మూర్ఛపోం
గుండెలో ఎక్కడో మిగిలి ఉన్న ధైర్యంతో
ఆకాశానికేసి ఆశగా చూడొచ్చు
రైతు కూలీగా మారొచ్చు
దళారీలకు జీవితాన్ని తాకట్టు పెట్టి ఉండొచ్చు
అయినా మేము మట్టిని నమ్ముకున్న వాళ్ళం
కష్టాలను కన్నతల్లి పేగు నుండి నేర్చుకున్న వాళ్ళం"[35]

సీమ ప్రాంతాల్లో కరువు కష్టాలను, కడగండ్లను చూసిన వారు ఎన్ని కష్టాలు, ఆపదలు వచ్చినా మనోధైర్యంతో బ్రతుకుతామని మేము మట్టిని నమ్ముకుని ఆ కష్టాలను, సమస్యలను ఎదుర్కొంటామని కవి సీమ ప్రజల మనోధైర్యాన్ని, ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

కెరె జగదీష్ 'ఆకలినేల' కవితలో ఇలా అంటాడు.

" మేఘాల చినుకుల కోత
ట్రాన్స్‌కో విద్యుత్ కోత
బ్యాంకుల అప్పుల వడ్డీ మోత
కరువులో ఆకలి మంటల వాత
నిరంతరం
నిరంతరం ఆనంతలో రైతన్నలకు రంపపు కోత" [36]

సీమలో సరైన సమయంలో వర్షాలు పడవు. కరెంటు కోతలు, బ్యాంకుల్లో అప్పులకు వడ్డీలు పెరగడం, కరువు వల్ల రైతన్నలకు పంటలు పండక తినడానికి కూడా లేని పరిస్థితి దాపురించింది.

" అందుకే కళ్ళుతెరు రైతన్న!
నేల మీద అడుగు మోపి

గుండెనిండా ఊపిరి నింపుకొని

నాయకుల గుండెల్లో

తత్తరపాటును సృష్టించు

పిడుగులను చేతపట్టుకొని పిడికిలి బిగించు

ఆత్మహత్యలను విడనాడి

ఆత్మ బలం పెంచుకో

శవాలు మిగిల్చిన అస్తిపంజరాల శిథిలాలను

అస్త్రాలుగా సంధించి విజయం సాదించు

వెన్నెముకగా నిలబడి వెన్నెలవాన కురిపించు'[37]

ఆత్మహత్యలను విడనాడి ఆత్మబలం పెంచుకొని ఈ సమాజంలోని కుటిల రాజకీయాలను, నాయకుల వాగ్దానాలను చెండాడాలని ప్రబోధం చేశాడు.

### 4.4.3. కరువు – చైతన్యం:

దీర్ఘకాలంగా వర్షాలు లేక పంటలు పండని కారణంగా ప్రజలకు తినడానికి తిండి దొరకని పరిస్థితిని కరువు లేదా క్షామము(Famine) అంటారు. వాతావరణ కరువు, జల సంబంధ కరువు, వ్యవసాయ కరువు, సామాజిక, ఆర్థిక కరువు అని నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు. కరువు యొక్క సాధారణ పరిణామంలో భాగంగా వ్యవసాయంపై ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తుంది. పంటలు మరియు వృక్ష సంపదపై ప్రభావం చూపిస్తుంది. ఆహార పరిశ్రమ, పర్యావరణ ఆవాసాలు, వాటి జాతుల జంతువులు మరియు వృక్షాలు ప్రభావితమౌతాయి.

రాయలసీమలో ప్రతి సంవత్సరం కరువులు సంభవిస్తాయి. గడచిన 80 సం॥ల నుంచి ఈ ప్రాంతంలో అతి దుర్భిక్ష కరువు పరిస్థితులు ఏర్పడినట్లు నివేదికలు, కమిటీల రిపోర్ట్ల ద్వారా తెలుస్తోంది. సంవత్సరిక సగటు వర్షపాతం చాలా తక్కువగా వుండటం మూలాన దేశం మొత్తంలో తీవ్రంగా కరువు కాటకాలకు గురయ్యే ప్రాంతంగా రాయలసీమ పేరు పొందింది. రాయలసీమను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో కరువు సమస్య ఒకటి. రాయలసీమ కవులు కరువు, కరువు ప్రభావం వల్ల ఏర్పడే పరిణామాలను కవిత్వీకరించారు.

రాధేయ 'సంక్షోభ సీమ' కవితలో కరువు వల్ల సీమ ప్రజలు ఎదుర్కొనే కష్టాలను అలాగే వర్షాలు కురవాలని వారు చేసే ప్రయత్నాలను తెలుపుతున్నాడు.

" ఏటేటా పీడించే కరువుకు జాలిలేదు

మేఘాలకు కరుణ రాలదు

కప్పల పెళ్ళిళ్ళకూ, విరాటపర్వాలకూ

బొడ్రాతి అభిషేకాలకు చినుకులు రాలవు

మట్టి మీద మమకారం

మాకు చితి మీద జీవన గీతమవుతుంది

విత్తనం తడిస్తే  అన్నం మొలకెత్తుతుందన్న ఆశతో

వర్తమానం ఓ ఎదురుచూపు భవిష్యత్తు ఓ వడగాడ్పు

ఇది సంక్షోభ సీమ

మా అప్పులు ఊటబావులు, ఆదాయం ఎండమావులు

మా రెప్పల కింద జలాశయాలు

రెక్కల కింద అగాధాలు

నిరంతరం...తరం...తరం ఆర్థిక దాస్యానికి వారసత్వం" [38]

రాయలసీమలో కరువు ఎంతటి ప్రభావాన్ని చూపిస్తుందో కవి ఆలోచనాత్మకంగా తెల్పాడు. సీమ ప్రజలు వర్షాలు కురవడం కోసం కప్పల పెళ్ళిళ్ళు, భజనలు, గాడిదల ఊరేగింపులు, విరాటపర్వాల పారాయణం, బొడ్రాతి అభిషేకాలు లాంటి ఎన్నో పనులు చేస్తారు. సీమలో సంక్షోభం నెలకొంది. వారి వర్తమానం, భవిష్యత్తు ఓ ప్రశ్నార్థకంగా మారిందని కవి వ్యక్తీకరించాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'అనంత వేదన' కవితలో ఇలా అంటాడు.

" మా గ్రామాల్లో

కరువు విధించిన కర్ఫ్యూ మాత్రం చూద్దురు రండి

గంజి కేంద్రాల సాక్షిగా

కరువు తాండాల డొక్కలు డోలు కొడుతున్నాయి"[39]

కరువు ప్రభావం వల్ల సీమ ప్రాంతాల్లో జన సంచారం లేక కర్ఫ్యూ విధించినట్లుందని గంజి కేంద్రాలే దానికి సాక్ష్యమని తెల్పుతున్నాడు.

జూపల్లి ప్రేంచంద్ 'పదును' కవితలో కరువంటే ఏమిటో తెల్పుతున్నాడు.

" కరువు అంటే తిండి లేక పోవటం కాదు

కరువు అంటే పంటలు పండక పోవటం కాదు

కరువు అంటే గిట్టుబాటు ధర లేకపోవటం కాదు

కరువు అంటే నిత్యం కొద్ది కొద్దిగా రక్తం పీల్చే రక్తపింజారి

కరువు అంటే ఆత్మల్ని నడిరోడ్ల మీద వేలం పాటలో

తెగనమ్ముకోవటం

కరువు అంటే నిత్య ఆత్మహననం

కరువు అంటే అనునిత్యం ఆత్మహత్యించుకోవటం!"[40]

కరువు ప్రభావం వల్ల ప్రజలు తమ మానాల్ని, శరీరాల్ని, ఆత్మాభిమానాల్ని అమ్ముకొని ప్రతినిత్యం చావు బతుకుల మధ్య జీవితాన్ని గడపడమే కరువుగా చిత్రించాడు. ఇక కరువుపై రాజకీయ కుటిల నాయకుల మీద తిరుగుబాటును చెబుతూ,

" ప్రకటించాల్సిందే

కరువు మీద యుద్ధం ప్రకటించాల్సిందే

మానవ క్రౌర్యం మీద కౌటిల్యం మీద

కపట రాజకీయం మీద యుద్ధం ప్రకటించాల్సిందే"[41]

సీమలో కరువు నివారణ చర్యలు శాశ్వత పథకాలు, ప్రయోజనాలు చేకూర్చకుండా నిర్లక్ష్యం వహించే కపట రాజకీయాలు, ప్రభుత్వాల మీద చైతన్యవంతంగా యుద్ధం చేయాల్సిందేనని కవి కవిత్వీకరించాడు.

రాధేయ 'అనంత దుఃఖం' కవితలో అనంత కరువు గూర్చి ఏమన్నాడో చూడండి.

" అమ్మా! ఆకలి!

తెలుగు వర్ణమాల అచ్చుల్లో

మొదటి అక్షరం అనంతపురాన్ని పల్కరిస్తుంది

మొదటి హల్లు – కరువు కలవరిస్తుంది

ఆకలి అనేది అనంతమైతే

అనంత జిల్లా ఆకలి స్వరమే పల్కుతుంది

అది మా రాయలసీమనే వరిస్తుంది

అనంత సాహిత్యానికి అమరకోశం కరువు

సీమ వేదనకు పేదరికమే పెద్ద బాలశిక్ష"[42]

రాయలసీమలో అనంతపురం అతి దుర్భిక్ష కరువు ప్రాంతం. ఎడారిగా మారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆకలి, కన్నీళ్లు, వేదనలు ఇవన్నీ కలిసిన కరువుకు నిలయంగా అనంతపురమే నిలుస్తుందని కవి వేదన చెందాడు.

" కృష్ణమ్మ, పెన్నమ్మ
తుంగభద్ర, చిత్రావతి
నదీ పరీవాహ ప్రాంతమంతా
దాహం తీరని దుఃఖ జలమే
భూగర్భ జలాలన్నీ
మాకు ఆగర్భ శత్రువులే
దారిద్ర్యం మా పాత పరిచయం
కరువే మాకు దగ్గరి చుట్టం
దుర్భిక్ష దాస్యానికి సజీవ సాక్ష్యం మా అనంత".[43]

సీమ నదుల్లో నీళ్ళు పారవు. పంటలూ పండవు, రైతుల కన్నీళ్ళు ఆగవు, ప్రజల దాహం తీరదు. ఎండిపోతున్న జలాశయాలు అడుగంటిపోతున్న భూగర్భ జలాలు, దారిద్ర్యం ఎప్పుడు సీమ ప్రజల్లో విడవకుండా, కరువు పిలవకుండానే వచ్చే చుట్టంలా ఇవన్నీ అనంత సజీవ సాక్ష్యాలుగా కవి ఆలోచనాత్మక కవితగా చిత్రించాడు.

బి. సూర్యసాగర్ 'కరువు కెరటం' కవితలో ఇలా అంటాడు.

" మట్టి చెమటలతో
దుక్కి అయిన దేహాలివి
ఎన్ని కరువుల కన్నీటినైనా నింపుకోగల
నేత్ర సముద్రాలివి
కబళం ముద్ద దొరకని కరువులో
గెదర ఆకులు ఈతగడ్డలతో
ప్రాణాలు నిలుపుకున్నాము
ఇంకేదో లేదని
ఏనాడైనా ఆరాము చేశామా"[44]

కరువు కష్టకాలంలో ప్రజలు ఆకలి బాధల్ని ఎలా తీర్చుకున్నారో వారి ప్రాణాలను ఎలా నిలుపుకున్నారో కవిత తెలుపును.

" శతాబ్దాలుగా
ఏటేటా కరువుతో కాగిపోయిన

నీ జీవిత భాండంలో
మొండి ధైర్యం తప్ప పిరికితనం లేదని తెలిసి
కన్నీళ్ళతోనే నిండుగా నవ్వాము
బక్కెద్దులతో బక్క రైతులతో
ఎడారిని దున్నుతున్న సాహసం నీది
ఎడారి స్పర్శలో కూడా నిబ్బరం కోల్పోని
తాత్విక దృక్పథం
మా తల్లి  రాయలసీమదని తెలిసి
ఎంత గర్వించాము"[45]

ఎన్ని కరువు కాటకాలు, దారిద్ర్యాలు దాపురించినా ఆత్మస్థైర్యం, మనో నిబ్బరం కోల్పోకుండా ఈ సీమ బిడ్డలుగా బతుకుతామని కవి ప్రజల మనోభావాల్ని, ఆశాభావాన్ని, స్ఫూర్తిని ప్రకటించాడు.

" మగ్గిన జీవితాల సెగల్లోంచే
బండబారిన బతుకు బీళ్ళలోంచే
నీ మీద సాగుతున్న అన్యాయమ్మీద
తిరుగుబాటు కెరటాలుగా లేస్తాం
ఎర్రనేలలనే జెండాలుగా ఎగిరేసి
ఎండిన పైరు మొక్కలను
నిప్పు నాల్కలుగా మేల్కొల్పుతాం
ఆకుపచ్చని పొలమై మొలుస్తాం"[46]

తరతరాలుగా సీమపై, సీమ ప్రజలపై జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలు, నిర్లక్ష్యాలు, వాగ్దానాల పట్ల నిలదీస్తామని సంఘటితమై తిరుగుబాటు లేవదీస్తామని కవి ఒక చైతన్యవంతమైన ధోరణిని ప్రజల తరుపున పీడిత హృదయాల పట్ల విశ్వాసం ప్రకటించాడు.

జి.వెంకటకృష్ణ 'దున్నేకొద్దీ దుఃఖం' కవితలో ఇలా అంటాడు.

" పదును లేని భూమిలో
అదును కాని కాలంలో
ఆశను అరకగ పట్టాలని
దున్నుతున్న కొద్దీ

తిర్లమర్లగవుతున్న మట్టిలా బతుకు

మానం ప్రాణం పణంగా పెట్టి

ఆలిమెళ్ళో తాళి

తనవొంట్లో సత్తువ

ఆకాశంలో మేఘానికి కుదువబెట్టి

కురవని క్రీనీడల్లో తలవంచి

ఎకరాలు ఎకరాలు పండిన కరువు సాక్షిగా

ఎండిన బతుకు"[47]

రైతులు సేద్యం చేయడాన్ని ఆశగా శ్వాసగా శ్వాసిస్తూ జీవిస్తారు. రైతుల పొలాల్లో వర్షాలు కురవక ఎకరాలకు ఎకరాలు కరువులు పండిన విషాద దృశ్యాల్ని, దున్నేకొద్దీ బయట పడుతున్న రైతుల దుఃఖాల్ని వేదన భరితంగా చిత్రించాడు.

" నాగలిపట్టి నాలుగు తరాలుగా దున్నుతున్న కొద్దీ

వొడ్డుకు చేరని బతుకు

వురితాడు పేనిన పత్తి పంట

పురుగు మందు తాపిన వుల్లిగడ్డ

బతుకులా బజారు పాలైన

రేటు పలకని టమోటా

గొంతు బిగించిన

వూడలు దిగని వేరుశెనగ

బోరులో పడ్డ బాల్యంలా

వుక్కిరి బిక్కిరి చేసి చంపుతున్నది

సేద్యం బతుకు" [48]

తరతరాలుగా సీమలో రైతులు సేద్యం చేస్తున్నా కరువుల వల్ల బతుకులు తెల్లారవు. ఏ పంటలు సాగు చేసినా వర్షాలు కురవక, రేట్లు వుండక, చేసిన అప్పులు తీరక, రైతుల బతుకులు జీవన్మరణ పోరాటంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయని కవి ఆర్ద్రంగా చిత్రించాడు.

రాచపాళెం చంద్రశేఖర రెడ్డి 'విషాదం' కవితలో కరువును ఇలా అంటాడు.

" మా సీమలో కరువు

బిడ్డలాంటి పశువును

అడ్డంగా అమ్మిస్తోంది

గుట్టంత చెట్టును

నిట్ట నిలువునా నరికిస్తోంది

ఊళ్ళకు ఊళ్ళే ఖాళీ చేయించి

మనుషుల్ని

వలస పక్షుల్ని చేయిస్తోంది

వానల కోసం చేసే

కప్పల పెళ్ళిళ్ళు, విరాటపర్వ పఠనాలు

గాడిదల ఊరేగింపులు

రోళ్ళు రోకళ్ళు దిగేయడాలు

చెరువులో అర్ధరాత్రి నగ్న తిరుగుళ్ళు

మా సీమకు ఉగాది

పండ లయ్యాయి”[49]

సీమలో కరువు ఎలా విలయతాండవం చేసి ప్రజలను వారి జీవితాలను ఎలా చిన్నాభిన్నం చేస్తుందో కవి చిత్రించాడు. దీర్ఘ కాలంగా సీమలో వర్షాలు కురవక పోవడం వల్ల ప్రజలు వర్షాలు బాగా కురవాలని వారు చేసే ప్రయత్నాలు వారి అగచాట్లను కవి చిత్రించాడు.

“ కరువు చెట్టు మీద

ఎన్నో పథకాల కొమ్మలు సాగిసాగి

కోట్ల నిధుల కాయలు కాస్తున్నాయి

రాజకీయ క్రీనీడలో

కాయలేమో మాయం

మా సీమకు

కరువు మాత్రం పదిలం”[50]

కరువు నివారణ పథాకల కింద మంజూరైన పంటల భీమాలు, సబ్సీడీలు, ఇన్‌పుట్ సబ్సీడీలు వంటి కోట్ల రూపాయల నిధులు రాజకీయ శక్తులు, నాయకుల పరం కావటాన్ని కవి చైతన్యవంతంగా చెప్పాడు. మల్లెల నరసింహమూర్తి ‘జలఖడ్గం’ కవితలో శక్తివంతమైన ఆలోచన ఖడ్గాన్ని సంధిస్తున్నాడు.

" చినుకే బంగారమైన
మా సీమలో
మెతుకే వైభోగం
పచ్చటి చిగుళ్ళు వేయని
మోడు చెట్టు కొమ్మలపై
కోయిలలు ఊయలలూగవు
ఉగాది పల్లవి పాడవు
కరువు కొమ్మపై
ఎప్పుడూ బతుకు ప్రశ్నలే!"[51]

చినుకులు రాలని సీమలో రైతు బతుకులు ప్రశ్నగానే మిగిలిపోతుందని కవి వేదన చెందుతున్నాడు.

" కాకులు మాకు తోబుట్టువులు
చావు వాసన వేసే
మా ఎముకల గూళ్ళునంటి పెట్టుకొనే వుంటాయ్
కరువు పాటను
గుండె తప్పెటపై
లయ తప్పకుండా దరువేస్తుంటాయ్"[52]

కరువు సీమ ప్రాంతాల్లో ఎంతగా పాతుకుపోయి వీరవిహారం చేయసాగిందో చూడవచ్చు.

" రాజకీయపుటెండమావుల
వెంబడి తిరిగి అలసిపోయా...
ఇక రాళ్ళకు తిరగడం చేతకాదు
తిరగబడటం తప్ప
మౌనం దాల్చిన శిలలకు
సంఘటిత విస్ఫోటనం
తప్ప మార్గం లేదు
సైబీరియన్ పక్షుల్లా
పోలోమని
వలస పోవటం పరిష్కారం కాదు

కరువు శత్రువుని సంహరించటానికి

జలఖడ్గమే మా ఆయుధం" [53]

సీమ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్న రాజకీయాలు, నాయకులు, ప్రభుత్వాల పట్ల సంఘటితం కావాలని పోరాటమె శరణ్యం అని కరువు పీడిత ప్రజలను ఉద్ధరించడానికి జలఖడ్గమే మా ఆయుధంగా వీరభద్రుడిగా అవతరిస్తామని కవి ఆవేశపూరితంగా కవిత్వీకరించాడు.

జంధ్యాల రఘుబాబు 'సంఘటిత స్పర్శ' అనే దీర్ఘ కవితలో రాజకీయ శక్తులను ఎండగడుతున్నాడు.

" కరువు పోలీసుకు చిక్కిపోయిన

అభాగిని ప్రశ్న

రాజధానుల వైపు చేతులు చాస్తూ నిరీక్షిస్తుంది.

కానీ

రాజకీయం

చూసినట్టు, చేసినట్టు అభినయిస్తుంది

సర్పమై కరువు నెర్రల్లో దాక్కుని

క్షామ హస్తాల సోలిన వారిపై పడగ విప్పుతుంది"[54]

కుటిల రాజకీయాలు సీమ ప్రజలను ఎలా మోసం చేస్తుందో ప్రజలపై ఎలా దగా చేస్తుందో చూసి చూడనట్టు ఎలా నటిస్తుందో వాస్తవికంగా చిత్రించాడు. సీమ రాజకీయాలను దోషిగా నిలబెట్టి నిందిస్తు న్నాడు.

" జీవితమిక్కడ కన్పించని యుద్ధ క్షేత్రం

అప్రత్యక్ష దాడితో మమ్ము

పీనుగులను చేసి ఆడుకునే శత్రువు

ఇద్దరే ఇద్దరు

ఒకరు కరువు రక్కసి

మరొకరు రాజకీయ మృగం" [55]

సీమ రాజకీయాలను, కరువు పరిస్థితులను బాగా అవగాహన చేసుకున్నాడు ఈ కవి. సుదీర్ఘకాలం పాటు ఈ సీమలో పాతుకుపోయి ప్రజానీకం పట్ల శత్రువులుగా మారినవి కరువు, రాజకీయాలు అని వాటిని ఎండగడుతున్నాడు.

జూపల్లి ప్రేంచంద్ 'కసాయి కరువు' కవితలో సీమలో వర్షాలు కురవడం కోసం ప్రజలు చేసే

రకరకాల ప్రయత్నాలను చిత్రించాడు.

" గ్రామ నడిబొడ్డులో బొడ్రాయిని
నూటొక్క కడవల్తో తడిపి
రోకలి మింద బెనకప్పలకు పెండ్లిండ్లు జేసి
పెండ్లిగాని పాయం పిల్లోలను అర్ధరాత్రి
ఊరంతా గాడిదల్ని తిప్పినట్లు పొలిమేరల్లో తిప్పి
అయ్యవారితో ఇరాటపర్వం సదివిపిచ్చి
బయల్నాట కాలేసి
మొలకల పున్నమి నా పొద్దు కలిశాల్తో ఆడపిల్లోల్లు
కోలుకోలు కొమ్మలాట
మేడమింద బొమ్మలాట
కోలు కోలన్నరే
చెలిమిరాయి మేలు మేలన్నరే
సందులన్నీ కలదిరిగి గొంతులన్నీ తడారేటట్ల అరిస్తే
వొగటంటే వొగ సినుకు ఈ పెయిమింద పడకపాయ"[56]

సీమలో వర్షాలు కురవాలనీ పంటలు బాగా పండాలనీ ప్రజలు, రైతులు చేసే ప్రయత్నాలు అన్ని ఇన్ని కావు. వాటన్నింటిని కవి తెల్పాడు.

జూటూరు షరీఫ్ 'కరువు దృశ్యం' కవితలో కరువును చెబుతూ,

" కరువు యిక్కడ పాతుకు పోయిన పాతవింత
కరువు యిక్కడ ప్రజలకు చుట్టం కాదు
చుట్టుకున్న ఉరితాడు
షరామామూలుగా
వెంటాడే భూతనీడలా
ఈ ప్రాంతంపై మమకారం చూపిస్తుంది
కరువు కరాళ నృత్యానికి ప్రజలు హతాశులు అవుతారు
కరువు కరాళ నృత్యానికి ప్రచండ తాండవానికి
పగల్లు పారిన రేగడిలా రైతు గుండె

పాయలౌతుంది.

రైతుల ఆశల మోసులు శుష్కించి పోతాయి

రైతులు విత్తులు విపత్తుకు దాసోహం మౌతాయి"[57]

కరువు సీమలో తిష్టవేసి అది రైతుల మెడకు చుట్టుకున్న ఉరితాడుగా చెపుతున్నాడు. రైతుల పంటలు, ఆశలు అన్నీ కరువుకు బలి అవ్వాల్సిందే. కరువు భూతంలా వెంటపడుతూ పీడిస్తుందని కవి వేదనాభరితంగా చెప్పాడు.

దాదాహయత్ 'రెండు దృశ్యాలు' కవితలో సీమ ఎడారిగా మారబోయె పరిస్థితిని చెబుతూ,

" ఈ ఎడారిలో

మొలిచే ప్రతి ఇసుక రేణువూ

చేజారిపోతున్న ఒక సంగతి ముద్దకు ఆనవాలు!

ఈ ఎడారిలో

నోళ్ళు తెరుచుకున్న బీళ్ళలోంచి

చేతులు బయటపెడతాయి బొమ్మజెముళ్ళు

ఈ ఎడారిలో

సీతాకోక చిలకలే కాదు

బతకడానికి దారిలేక పారిపోతాయి."[58]

సీమ క్రమక్రమంగా ఇసుక ఎడారిగా మారే ఆనవాళ్ళను తెల్పాడు.

చంద్రశేఖర శాస్త్రి 'సీమాంతర నేపథ్యం' కవితలో ఇలా అంటాడు.

" ఉదయరాగంలో కరువు పాట

సంధ్యారాగంలో చావుగీతం

అనంత ఎడారిలో అత్యంత సహజం" [59]

అని అనంత ఎడారిలో రైతుల చావులు, కరువు కరాళ నృత్యాలు సహజమని చెబుతున్నాడు.

" ఎడారిలో ఇసుక రేణువు సీమ రైతు జీవితం

ఇక్కడ ఏ రాయిని మీటినా పాడేది కరువు పాటే

కరువు పాటకు దరువేస్తుంది రాజకీయం

జావళి పాడనివ్వదు రాజధాని

ఫ్యాక్షన్ రాహువు

కరువు కేతువు ధ్వంసమయ్యే

సీమాంతర నేపథ్యాన్ని గానం చేస్తున్నాను"[60]

ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా కరువుకు శాశ్వత పరిష్కార మార్గాలు, ప్రత్యమ్నాయ విధానాలను అవలంబించకుండా సీమ కరువు పాటే పాడుతుంది. చావు గీతాలనే వింటుంది. కరువు శాశ్వత సమస్యగా మిగిలిపోయింది. దీనికి దుష్ట రాజకీయాలు అడ్డుపడుతున్నాయి. సీమ అభివృద్ధిని జరగనివ్వడం లేదు. అందుకే కవి వేదనాభరితుడిగా సీమాంతర గానాన్ని విలపిస్తున్నాడు.

జూపల్లి ప్రేంచంద్ 'కసాయి కరువు' కవితలో కరువు ప్రభావాన్ని తెల్పుతున్నాడు.

" కష్టాలు కాటకాలూ కొత్తకాదు

ధాతకరువు డొక్కల కరువులు

తాతముత్తాతల నుండీ చూసిందాము

రాయలసీమంతా పిలిస్తే పలుకుతాది కరువు

మా రాళ్ళనంతపురంలో పిలవకనే పలుకుతాది"[61]

సీమలో గత చరిత్రను పరిశీలిస్తే ధాతకరువు, డొక్కల కరువు, గంజి కరువు లాంటి దుర్భిక్ష కరువులు వచ్చాయి. కరువు కష్టాలు సీమ ప్రజానికాన్ని పట్టి పీడిస్తున్నాయి.

జి.వెంకటకృష్ణ 'ఓ దుఃఖమేఘం' కవితలో ఇలా అంటాడు.

" కురవమంటే సకాలంలో

మెరుస్తాయే తప్ప కురవడానికి మొరాయిస్తున్న

శుష్క రాజకీయ వాగ్దానాల్లాంటి మేఘాలు"[62]

సీమలో కుటిల రాజకీయ నాయకులు ఇచ్చిన వాగ్దానాలు, హామీలు అమలు చేయకుండా ఎలా మోసం చేస్తున్నారో మేఘాలు కూడా ఊరించి, మెరిపించి, వర్షం కురవకుండా తప్పుకుంటున్నాయి.

రాధేయ 'చావుల రుతువు' కవితలో కరువు సమాజాన్ని, మానవ కుటుంబ వ్యవస్థలను ఎలా నాశనం చేస్తుందో తెలుపుతున్నాడు.

" మా కరువిప్పుడు ప్రాంతీయ వేదన కాదు

ఇది జాతీయ విపత్తు

మా గ్రామీణ జీవన సౌందర్యాన్ని

కాలరాస్తున్న ఈ కరువు

మన సామాజిక, సాంస్కృతిక విలువల్ని

కాటేస్తున్న ఈ కరువు

ఉమ్మడి కుటుంబ వ్యవస్థని

ఊరుమ్మడి బతుకులుగా ఛిద్రం

చేస్తున్న ఈ కరువు" [63]

కరువు ఉమ్మడి కుటుంబాలను విడదీసి దూరం చేసింది. సామాజిక, సాంస్కృతికంగా తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పల్లెల వాతావరణ రూపురేఖల్ని మార్చివేసింది. జాతీయ విపత్తుగా ప్రకటించాలని కవి భావించాడు.

ఎ.ఎన్.నాగేశ్వరరావు 'కరువు పిడికిళ్ళు' కవితలో ఇలా అంటాడు.

" కరువుకు పుట్టిన కొదమబిడ్డలం

చీకటి పోరులో బతికిన కుసుమాలం"[64]

అని రాయలసీమ జీవిత సత్యాన్ని చాటాడు.

" ఇసుక తుఫాను మాదిరి వేడిగాలి

తూటుపడ్డ పూరి గుడిసె కప్పుల్ని వేసేస్తే

పగిలిన లాంతరు నీడల్లో

పడుపు వృత్తి చేసే యీ గడ్డ వారసులకి

స్వర్గం దోసెడు నీళ్ళు" [65]

సీమలో కరువు, దారిద్రం కలిసి ఇక్కడి జనాబాలో కొంత మందైనా వ్యభిచార కూపంలోకి నెట్టవేయబడు తున్నారని అర్థమౌతుంది.

" గుక్కెడు నీళ్ళకు కరువే!

కానీ పిడికిళ్ళకు కరువు లేదు

కరువుకు పుట్టిన పిడికిళ్ళు బిగుస్తాయి

యిది నా ముందు కనపడుతున్న చిత్రం" [66]

సీమలో నీళ్ళకు కరువు వుండొచ్చు కాని పోరాటం చేసే ప్రజల పిడికిళ్ళకు కరువు లేదు అని సంఘటిత సమూహ శక్తిని ఎలుగెత్తి చాటుతున్నాడు. సుదీర్ఘకాలం పాటు వేదనను, దారిద్ర్యాన్ని, కష్టాలను అనుభవించి నవారు స్వార్థపూరిత రాజకీయాలు, నాయకుల కల్లిబొల్లి మాటలను, వాగ్దానాలను, ప్రభుత్వాల అశ్రద్ధను, నిర్లక్ష్యాలను సహించే సమయం లేదని ప్రజలందరూ ఏకమై సంఘటితమై చేయిచేయి కలిపి పోరాటాలు, ఉద్యమాలు చేసే సందర్భం ఆసన్న మైందని ప్రజల చైతన్యాన్ని కవిత్వీకరించాడు. ఈ సందర్భం సీమలో

భవిష్యత్‌లో కళ్ళ ముందు కనిపించే చిత్రంగా భావించాడు.

కెరె జగదీష్ 'మహా ప్రయాణం' కవితలో కరువు ప్రభావం వల్ల సేద్యంలో పంట గింజలు వర్షాలు లేక ఎండిపోతున్న దృశ్యాన్ని, వర్షాల కోసం ప్రజలు పడే వేదనను చిత్రించాడు.

" పిడికెడు గుండెలో
కరువు పాదాల మోత
కలవర పెడుతూంది
నేలతల్లి గర్భంలో
కళ్ళు తెరవని విత్తనాలు
భరించలేని వేదనతో
దాహమని అరుస్తున్నాయి
కళ్ళను నింగిలో తాకట్టుపెట్టి
చేతులను పాతాళంలో నెట్టినా
కరుణించని మబ్బులు
కఠిన శిలలుగా మారుతున్నాయి
ఆకాశంలో ఎడారిలో
తడారిన మబ్బులు
వలస వెళ్ళిపోతున్నాయి"[67]

కరువు కర్కశ రూపం ఎలా వుందో దాని ప్రభావంతో వర్షాలు రాక ఎంతటి దారుణ పరిస్థితి పొలాల్లో కనపడుతుందో కవి బావుకతతో ఆర్ద్రంగా చిత్రించాడు.

### 4.4.4 వలసలు – చైతన్యం:

కెరె జగదీష్ 'ఆకలి నేల' కవితలో రైతు వలసల్ని ఇలా చిత్రించాడు.

" అన్నదాతల ఆకలి రాజ్యంలో
అన్నం మెతుకుల కోసం వలస వెళ్ళిన కూలీజనం
అతుకుల బతుకులతో కాళ్ళు కదపని వృద్ధాప్యం
సందడి లేని గ్రామాలలో స్మశాన నిశ్శబ్దం"[68]

సీమలో అన్నదాతలుగా పేరు పొందిన రైతన్నలు, కూలీలు బతుకు తెరువు కోసం వలసవెళ్ళారు. ఊరంతా వల్లకాడై స్మశానాన్ని తలపిస్తోంది.

దస్తగిరి 'ఈ యుద్ధం ఆపొద్దు' కవితలో కరువు వల్ల పల్లె పరిస్థితి ఎలా మారిందో తెల్పాడు.

" అనా వృష్టి
అకాల వృష్టి
రాజకీయ సంకుచిత దృష్టి
చుట్టుముట్టి నలుపుతున్నాయి
ప్రతిదినమూ
ఆవులించిన అఘాతమై
అతన్ని మింగుతోంది
ప్రతి ఒక వూరూ
శవాన్ని సాగనంపిన దుఃఖంతో
కుములుతోంది"[69]

ప్రకృతి వైపరిత్యాలైన అనావృష్టి వల్ల తీవ్ర కరువు దుర్భిక్ష క్షామ పరిస్థితులు సీమ ప్రజానికాన్ని ఒక వైపు చుట్టు ముడుతుంటే రాజకీయాలు కుటిల స్వార్థ ప్రయోజనాలతో సీమ ప్రజలను దగా చేస్తున్నాయి. ఇన్నింటి భయానక పరిస్థితుల మధ్య ప్రజలు మరో దారి లేక వలస దారిని ఎంచుకున్నారు.

బద్వేలి రమేష్ 'కాకి రెక్కంత కరిమబ్బు కోసం' కవితలో వలస బతుకుల్ని చిత్రించాడు.

" నోరాడించే మేతలేక
మాంసంగా మారే మూగ జీవులు
మట్టిలో మెలకువ లేక
తూకమౌతున్న పంట విత్తనాలు
పల్లెల్లో బతుకు దారిలేక
వలసలైన నేలని నమ్మిన వాళ్ళు
జవాబు దొరకని కరువు ఊరేగింపులో
భాగమైన రైతు జనాలు
ఎడారి పల్లెకి ఎప్పటిలా
మారని కరువు దృశ్యాలు"[70]

కరువు ఎంతటి తీవ్ర విషాధాన్ని మిగిల్చిందో చెబుతూ పశువులకు మేత లేక పంటలకు నీళ్ళు లేక రైతులు పల్లెల్లో బతక లేక బ్రతుకు తెరువు కోసం వలసెళ్ళి పోతున్న ప్రజలు, రైతులను గూర్చి వేదనా భరితంగా

చిత్రించాడు.

" చేను- సొంత స్మశానం

తోట- పెంచిన సర్పం

నాగలి- శిథిలమైన జ్ఞాపకం

కక్ష - కరువుకి ఇంకోరూపం

పల్లె - అనాథ శవం

ఏడారి పల్లెకి ఎప్పటిలా

భయపెట్టే కరువు చిత్రాలు"[71]

రైతుల పొలాలు, తోటలు, సాగు పరికరాలు లాంటివన్ని బద్ధ శత్రువులై వాటిని విడిచి వెళుతున్నాడు.

### 4.4.5. ఫాక్షన్ నిర్మూలన-చైతన్యం:

'ఫ్యాక్షన్' అనే పదాన్ని మొట్ట మొదట ఉపయోగించింది బ్రిటీష్ వాళ్ళు. రాయలసీమ బ్రిటీష్ ఇండియాలో భాగం అయ్యే నాటికి పాలెగాళ్ళ వ్యవస్థ వుండేది. విజయనగర రాజ్య కాలంలో సైనిక వికేంద్రీకరణ కోసం ఏర్పడిన అమర నాయంకర వ్యవస్థకు కొనసాగింపుగా వస్తోన్న చివరిదశ. ఈ పాలెగాళ్ళకు సీమలోని కొన్ని పల్లెలపై ఆధిపత్యం ఉండేది. బ్రిటీష్ వారు ఈ పాలెగాళ్ళ వ్యవస్థను కొంత వరకు రూపుమాపినా పాలెగాళ్ళ సంస్కృతి మాత్రం పల్లె పల్లెకూ పాకింది. గ్రామాల్లోని భూస్వాములు గ్రామ పెత్తనం కోసం ఒకరితో ఒకరు పోటీపడి ముఠాలు కట్టి దాడులు జరుపుకొంటూ ఒకర్నొకరు చంపుకొంటూ ఆధిపత్యం నిలుపుకొనే అలవాటు యీ నాటికీ సాగుతూ వుంది. ఈ ఆధిపత్యాలు, గొడవలతో గ్రామాల్లో ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకొని దాడులు జరుపుకోవటంగా అభివర్ధిస్తూ ఆ లక్షణాలకు ఫ్యాక్షన్ అనే నామకరణం చేయడం జరిగింది.

వార్తాపత్రికలు, టి.వి.లు, సినిమాల వల్ల కూడా ఫ్యాక్షన్ అనే పదాన్ని బాగా ప్రచారాన్ని తెచ్చిపెట్టాయి. నాడు గ్రామాలకే పరిమితమైన కక్షలు పాలకవర్గాలు రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చే సాధనాలుగా మూఠా కక్షలు తయారయ్యాయి. రాజకీయ పార్టీల మధ్య ఆధిపత్యం, కొన్ని వర్గాలుగా ఏర్పడటం, కుటుంబాలలోకి ఈ గొడవలు చేరడం, తరతరాలుగా ఈ గొడవలు పెరిగి పెద్దవిగా మారి పగలు, ప్రతీకారాలుగా పరిణామం చెంది కక్షలు గట్టి చంపుకునే పరిస్థితికి వచ్చింది. సమాజంలో వ్యక్తిగత ఆధిపత్యం కోసం పెద్దరెడ్ల మధ్య పోరాటాలు, మనిషిలో వున్న అహంభావాలు, భూతగాదాలు, మాట పట్టింపులు, అక్రమ సంబంధ తగాదాలు, రెడ్లు రాజకీయంగా ఎదగడం, రాజకీయ పార్టీలలో గ్రూపుల ఆధిపత్యంకై ప్రాకులాట, మితిమీరిన అధికార దాహం, కరువుల అప్పుల వల్ల బతుకు దెరువు

లేని కొందరు రెడ్ల పంచన చేరి వారి గొడవల్ని మెడలకెత్తుకోవటం, కాంట్రాక్టులు, వ్యాపారాల్లో ఆధిపత్యాలు లాంటి అనేక కారణాలు ఈ ఫ్యాక్షనిజాన్ని పెంచి పోషించాయి. రాయలసీమలో కొందరు కవులు, రచయితలు ఈ ఫ్యాక్షన్ గొడవలను కక్షలను, ఆధిపత్యాల పోరులను, గ్రూప్ రాజకీయాలను, బాంబుల సంస్కృతిని, వేటకొడవళ్ళ దాడులను మొదలగు అనేక అంశాల పట్ల అవగాహన కలిగి వున్నారు. ఈ ఫ్యాక్షన్ గొడవలు అంతరించి పోవాలని చైతన్యవంతమైన కవిత్వం రాసారు.

రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి 'ఫాక్షనిజం' కవితలో ఫ్యాక్షనిజాన్ని నిర్మూలించి అంతం చేయాలని ప్రబోధిస్తున్నాడు.

" ఫాక్షనిజం
ఒక మృగయా వినోదం
పగ దానికి ఆయుధం
ఫాక్షనిజం
రాయలసీమ ఆత్మగౌరవాన్ని
నవ్వుల పాలు చేస్తున్నది
ఈ ఫాక్షనిజం కడుపు కాలా
దీనికి చావెప్పుడో గాని
ఇది చచ్చే లోపల
సీమను మరుభూమిని చేసేటట్టుంది
ఫాక్షనిజాన్ని నిర్మూలించాల్సిందే
మనుషుల్ని
వేటగాళ్ళుగా రేసు కుక్కలుగా మార్చే
ఈ ఫాక్షనిజాన్ని నిర్మూలించాల్సిందే
జనం చలిచీమలన్నీ కలిసి
ఈ ఫాక్షనిస్టు పామును చుట్టుముట్టాల్సిందే"[72]

పగలు, ప్రతీకారాలతో ప్రత్యర్థులను జంతువులను వేటాడి చంపినట్టు ఫ్యాక్షనిస్టులు వెంటపడి హత్యలు చేస్తారు. ఇలాంటి హేయమైన దుర్మార్గమైన నరుక్కోవడాలు, చంపుకోవడాలు లాంటి పనులను నిర్మూలించి అంతమొందించాలని కవి తెల్పాడు. ' జనం మునులు కారు ' కవితలో ఫ్యాక్షనిస్టులైన వారు పగలు, పంతాలు మానుకొని సమాజాభివృద్ధికి తోడ్పడాలని చెబుతున్నాడు.

" కొడవలి

వరికోతలు కోస్తే

అన్నం అభివృద్ధికి ఆయుధమైంది

అదే తలలు నరికితే

జన్మభూమి పరాధీన అవుతుంది

కుందేలు వేటకుక్కల్ని తరిమినప్పుడు

పౌరుషం సీమ జండా అయింది

పౌరుషమే వేటకుక్క అయినప్పుడు

ఫాక్షనిజం కమురు వాసన వీస్తుంది

మూతి మీసాలు

నిమ్మకాయలు నిలబెడితే సరేగాని

అవి విషసర్పాలై బుసలు కొడితే

మానవత్వం మంట గలుస్తుంది"[73]

పగలు, ప్రతీకారాలు, కక్షలు, పౌరుషాలు, పంతాలు, మాట పట్టింపులు మానుకొని ఈ సమాజంలో శాంతిని నెలకొల్పాలి. సమాజం, దేశాభివృద్ధికి పాటుపడాలని కవి ప్రభోదం చేస్తున్నాడు.

ఎన్.కె.మద్దిలేటి 'ఫ్యాక్షన్ ఫ్యాక్షన్' కవితలో ఇలా అంటున్నాడు.

" ఫ్యాక్షన్ నేతల కొమ్ముకాసే

దూతల్లారా! ధూర్తుల్లారా!

ఆలిబిడ్డల తలలు తాకట్టు పెట్టే

మూర్ఖుల్లారా! మృగాల్లారా!

ఇకనైనా మేలుకోండి...

రావణ కాష్టం ఆపండి"[74]

ఫ్యాక్షన్ ముసుగులో మనుషుల ప్రాణాలు తీసే మానవ మృగాల్లారా ఇకనైనా మేల్కోండి. ఈ హింసను ఆపండి అంటూ కవి ప్రభోదిస్తున్నాడు.

### 4.4.6 నీటి సమస్యలు – చైతన్యం:

రాయలసీమను పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్యల్లో నీటి సమస్య కూడా ఒకటి. నీళ్ళు

నాగరికతకు మూలాధారం. నాగరికత అభివృద్ధి చెందడానికి నాగరికత విస్తరించడానికి నీరు ప్రధాన వనరు. నీళ్ళు రాయలసీమలో అనేక సమస్యలకు మూలం. రాయలసీమ మొత్తంగా ఒక కోటీ అరవై ఎనిమిది లక్షల భూవిస్తీర్ణం ఉంది. అందులో 70 లక్షల ఎకరాలు సాగుకు అనువైన భూమిగా ఉంది. రాయలసీమ ఎక్కువ భాగం కొండలు, గుట్టలు, అడవులు, వంకలు, వాగులు, చిన్న చిన్న నదులతో కూడి ఉంటుంది. వర్షం బాగా పడే రోజుల్లో ఇక్కడి భౌగోళిక పరిస్థితులు అవకాశాలను బట్టి చెరువులు, కాలువలు, బావులు తదితర సంప్రదాయ నీటి వనరుల ఆధారంగా 12 లక్షల ఎకరాలకు నమ్మకంగా నీళ్ళు అంది పంటలు సాగు అయ్యేవి. మిగతా పంటలు వర్షం ఆధారంగా బాగా పండేవి. రాను రాను వర్షపాతం తగ్గిపోతూ సగటున 550 మి.మీ.కే పరిమితం అవుతుండటంతో రాయలసీమ మొత్తం ప్రమాదంలో పడే పరిస్థితికి వచ్చింది.

రాయలసీమలో ప్రవహించే నదులలో నీళ్ళు లేకపోవడం, సుధీర్ఘకాలం పాటు వర్షాలు పడకపోవడం, చెరువులు, బావులలో నీళ్ళు లేక ఎండి పోవడం, భూగర్భజలాలు అడుగంటిపోయి బోర్లలో నీళ్ళు పడకపోవడం, తుంగభద్ర, శ్రీశైలం ప్రాజెక్టులు వాటి కాలువల ద్వారా ఇతర ఎత్తిపోతల పథకాలు రిజర్వాయర్‌లకు నీటి కేటాయింపుల మేరకు నీళ్ళు అందక పోవడం లాంటి అనేక సమస్యలు రాయలసీమను పట్టి పీడిస్తున్నాయి. రాయలసీమ వెనుకబాటుకు గురికావడానికి ప్రధాన కారణాలలో సాగునీటిలో జరిగిన అన్యాయమే ప్రధాన కారణం. రాష్ట్రంలో సమృద్ధిగా నీళ్ళు లభించే ప్రాంతాల వారికి నీటి సమస్యలు, నీళ్ళు లేకపోవడం వల్ల వచ్చే కష్టాలు ఆ బాధలు తెలియవు. నీళ్ళున్న ప్రాంతాల వాళ్ళకు నీళ్ళు లేని వారి ఈతిబాధలు చెబితే తప్ప అర్థం కావు. ఒక కడివెడు నీళ్ళ కోసం మైళ్ళకు మైళ్ళు నడవాల్సి రావడం, గంటల తరబడి పడిగాపులు కాయటం, నీళ్ళు చాలక పైరు పంటలు ఎండిపోవడం, పశువులు, జంతువులు, ఇతర జీవ జాలాలకు నీళ్ళు లేకపోవడం కళ్ళారా చూస్తే తప్ప ఆ విషాదం హృదయాన్ని తాకదు. కుటుంబ జీవనం మొదలుకొని దేశ జీవనం వరకు ఆర్థికాన్ని శాసించేది నాగరికతను తీర్చిదిద్దేది నీళ్ళే. తరతరాలుగా రాయలసీమ వాసులు నీళ్ళ కోసం తపించి పోవటాన్ని రాజకీయ నాయకులు, పాలకులు, ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోలేదు. రాయలసీమ కవులు, రచయితలు నీటి సమస్యల పట్ల స్పందించారు. నీళ్ళు లేకపోవడం వల్ల కలిగే కష్ట నష్టాలను కవిత్వంలో చొప్పించారు. రైతాంగానికి, ప్రజానికానికి సాగు, తాగునీరు అందివ్వలేక పోయిన ప్రభుత్వాల వైఫల్యాలను ఎండ గట్టారు. సీమ ప్రాజెక్టులకు, కాలువలకు నీటి పంపకాలలో జరుగుతున్న అన్యాయాలను నిలదీసారు.

యక్కలూరి శ్రీరాములు 'జలగండం' అనే దీర్ఘ కవితను రాశారు. ఈ దీర్ఘ కవిత రాయలసీమకు గల నీటి అవసరాన్ని, ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. నీటి సమస్యల వల్ల ఉత్పన్నమయ్యే

పరిణామాలను విశదీకరించారు. సీమకు నీరు ఎంత అవసరమో వారి చైతన్యాన్ని మన కళ్ళముందు సాక్షాత్కరింపజేశారు.

" ఏ దేశ పుట్టుకైనా
ఏ ప్రజల సంపదకైనా
నీరే! నీరే! నీరే పరమావధి"[75]

ప్రపంచంలో నాగరికత, సంస్కృతులు, జీవన విధానాలు నదులు, నీళ్ళున్న చోటనే వర్ధిల్లి విస్తరించి అభివృద్ధి చెందాయి. ప్రాచీన నాగరికతా కాలం నుంచి ఇప్పటి వరకు చరిత్రను పరిశీలిస్తే ఈ విషయం అర్థమౌతుంది.

" కృష్ణా, తుంగభద్ర, నగరి, హంద్రి, పాపాగ్ని, చిత్రావతి,
గుండ్లకమ్మ, పీలేరు, స్వర్ణముఖి
ఇలా ఎన్నో నదులు, మరెన్నో కాలువలు
కాని ప్రవహించేది నీళ్ళు కాదు, సర్కారు ముళ్ళ పొదలు"[76]

క్రిష్ణా జలాలను సీమ నదులతో అనుసంధానం చేసి సీమకు నీటి సౌకర్యాన్ని కల్పించడంలోనూ కాలువలు, ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని అందివ్వలేక ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని చేస్తూ నీటి సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

" జీవ నదులు సముద్రంపాలు
జన జీవనం మట్టిపాలు
కడలిలో కలిసే నదులు చాలు
కరువు సీమకు అవే పదివేలు"[77]

కృష్ణా, గోదావరి లాంటి నదుల్లో ఏటేటా వర్షాల వల్ల నదులు పొంగి ప్రాజెక్టులు నిండి మిగులు జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోతాయి. ఆ మిగులు జలాలను కాలువల ద్వారా సీమకు మళ్ళిస్తే సీమను సస్యశ్యామలం చేయవచ్చు.

" నాగులు తిరిగే కోనల్లో
నాలుగు వానలు కురిపించండి
వలస వెలుతున్న వారి భూముల్లో
వాగులు ప్రవహింప చేయండి
అదును చూసి నీళ్ళు వదిలితే అదే పదివేలు

సీమ సతుల నుదుటి బొట్లు నిలవాలంటే
నీటి బొట్లు చాలు
కదిలే కన్నీళ్ళు
ఇక్కడి మనుషులు
ఇంకా ఎన్నాళ్ళు
నీళ్ళకై ఎదురు చూపులు?"[78]

పంటలు పండే రైతులు నీళ్ళు లేక వలసలు వెళుతున్నారు. ఆ వలసలను ఆపి రైతుల పొలాల్లో నీళ్లు ప్రవహించేలా చేయండి అని చెబుతూ సీమ ప్రజానీకం ఎన్నాళ్ళు నీళ్ళకోసం ఎదురు చూడాలి అని వేదన చెందుతున్నాడు. సీమ రాజకీయ పార్టీలు, నాయకుల వాగ్దానాలు, హామీలను కవి ఎండగడుతూ ఇలా అంటాడు.

" నాన్నా!
నీళ్ళు కావాలిని చేతులు చాచితే
మా చేతుల్లో
రంగు రంగుల జెండాలు
ఉచితంగా ఉంచుతారు
తెల్ల చొక్కా తొడిగి
చేతిలో జెండా నాటుతాడొకడు
పసుపు చొక్కా తొడిగి
నెత్తిమీద జెండా ఎత్తుతాడొకడు
ఎర్ర చొక్కా తొడిగి
గుండెలో సూటిగా జెండా గుచ్చుతాడొకడు
కాషాయ చొక్కా తొడిగి
కసాయి కంటే దారునంగా
నిన్ను నిలువుగా తగలేస్తాడొకడు
అన్ని జెండాలు చేతపట్టి
అన్ని అంగీలు తొడిగి
అదును కోసం వెతుకుతుంటాడొకడు

ఇది శవాల మీద వ్యాపారం చేసే దళారుల రాజ్యం

ఇక్కడ దాహానికి నీళ్ళు పూజ్యం"[79]

సీమలో ప్రధాన పార్టీల వాగ్దానాలు, హామీలు, వారి బండారాన్ని బట్టబయలు చేసాడు. చాలాకాలం నుంచి సీమ ప్రజలను ఎలా మోసగించి పదవులు పొందుతున్నారో ఇచ్చిన హామీలను నెరవేర్చలేక వైఫల్యం పొందుతున్న వైనాన్ని ఎండగట్టాడు. అవకాశవాద రాజకీయాలు, పార్టీలు సీమలో ఎలా చెలామణి అవుతున్నాయో కవి చైతన్యాత్మకంగా కవిత్వీకరించాడు.

" నేడు కృష్ణా, గోదావరీ, కావేరీ, తుంగభద్ర

రేపు గంగా, యమునా, సరస్వతి, బ్రహ్మపుత్ర

అనంతపురం నుంచి హస్తిన వరకు అంతులేని దాహం

టిబెట్టు నుంచి ఆల్మట్టి దాకా తప్పదు నీటి పోరాటం"[80]

దేశంలో వివిధ రాష్ట్రాల మధ్య నదుల నీటి విషయంలో పంపకాల అమలులోనూ ప్రస్తుత కాలంలోనూ భవిష్యత్తులోనూ నీటి కోసం పోరాటాలు తలెత్తే సమస్యలు వస్తాయని కవి హెచ్చరిస్తున్నాడు.

" నేడు రాయలసీమకు మాత్రమే పరిమితం కాదు, జలగ్రహణం,

రేపు దేశమంతటా తప్పదు జలగండం"[81]

తరతరాలుగా సీమను పీడిస్తున్న నీటి సమస్య దేశమంతటా కూడా నీటి సమస్య ఏర్పడే ప్రమాదముందని తెలియచేస్తున్నాడు.

" ఇక్కడ బతుకు నిరంతరం

మండుతున్న అగ్నిగుండం

ఇక్కడ మనిషికి నిత్యం యమగండం

ఇక్కడ మట్టికి జలగండం"[82]

సీమలో బ్రతకడమంటే సమస్యల సుడిగుండంలోకి పడిపోవడమే. ఇక్కడి ప్రజానీకానికి సమస్త జీవ జాలానికి, మట్టికి జలగండం దాపురించి ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి వుందని భావి భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ఆవేదన చెందుతున్నాడు.

వై. శ్రీరాములు 'కలాలకు సంకెళ్ళు' కవితలో కోస్తాంధ్రుల నీటి దోపిడీని తెలియజేస్తూ,

" నీళ్ళు వాళ్ళు తాగుతుంటే

నీ దప్పిక ఎలా తీరుతుంది?

అన్నం వాళ్ళు తింటుంటే!

నీ ఆకలి ఎల్లా చల్లారుతుంది

నాసికం నీదయినా శ్వాస వాడిదే!

దేశం మనదయినా శాసనం వాడిదే!"[83]

ప్రాజెక్టులు, కాలువల ద్వారా సీమకు రావాల్సిన నీటిని కోస్తా పెత్తందార్లు, నాయకులు సీమకు రాకుండా అడ్డు పడుతున్నారు. నీటి వాటాలు, హక్కులు, నిధులు వాళ్ళు అనుభవిస్తుంటే సీమ ప్రజల ఆకలి దప్పికలు ఎలా తీరుతాయి. ప్రభుత్వాలు, రాజకీయాలు వాళ్ళ కనుసన్నుల్లో నడుస్తుంటే శాసించేది వాళ్ళే అయితే సీమకు దక్కేది మిగిలేది కన్నీళ్ళే గదా అని ఆలోచనాత్మకంగా కవిత్వీకరించాడు.

జి.వెంకటకృష్ణ 'హంద్రీగానం' అనే లఘు కవిత్వంలో సీమ స్వరాన్ని వినిపిస్తున్నాడు. కవి తన ఆత్మగానాన్ని ఇలా వినిపిస్తున్నాడు.

" గర్భంలో ఎండిపోతున్న పెన్నకు

అంచుల్లో కదిలిపోతున్న తుంగభద్రకు

నడిబొడ్డున హంద్రి పాడే సందేహ గానమిది

ఇది  ఓ తల్లి కన్నీటి గానమో"[84]

రాయలసీమలో ప్రధాన నది పెన్నానది. నీళ్ళు మాత్రం వుండవు. కర్నూలు పట్టణానికి ఆనుకుని ప్రవహిస్తున్న తుంగభద్ర నది నీటిని కూడా సరిగా సీమ వాసులు ఉపయోగించుకోలేని పరిస్థితి. ఇలాంటి పరిస్థితిలో ఉపనది అయిన హంద్రీ నది దీన స్థితిని ఆ నది యొక్క సందేహాన్ని ఆ నదీ తల్లి  కన్నీటి గాథని వినిపిస్తున్నాడు. తుంగభద్ర, హంద్రీ, హగరి, కృష్ణా నదులు పారుతున్నా సీమకు గుక్క నీరు కూడా అందదు. 'నీటిపాతాల పాట' కవితలో నీటి వనరులు, సమస్యల మీద ఏర్పడిన కమీషన్లు, కమిటీలు, బోర్డులు, ట్రిబ్యునళ్ళు నీటి పంపకాల విషయంలో సీమకు జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని ఎత్తి చూపిస్తున్నాడు.

" ఆబాల గోపాలుడు చెప్పేదాకా

రాజ్యం గుప్పిటే జల రహస్యం

నా దేహమ్మీద పారుదలకేదీ నికరజలం?

ఖరారు కాని కాలంలోనే

తరలించుకు పోయిన జలధారలు

పడగకట్టి నిలబెట్టిన ఆనకట్టలు

కరువు సీమ దేహంపై పన్నిన పన్నాగాలు"[85]

మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయినప్పటి కాలం నుంచి నీటి పంపకాల విషయంలో సీమకు తీవ్ర అన్యాయమే జరుగుతోంది. కుట్రలు కుతంత్రాలతో కోస్తాంధ్రులు సీమకు నీరు అందకుండా పన్నాగాలు పన్నుతున్నారు.

“ ఏ ట్రిబ్యునల్ తీర్పులైనా
నిలబడిన జలాశయాలనే నింపుతాయట
నిద్ర లేవని సీమలకు మిగిలింది కటకట
కేటాయింపులు లేని ప్రాజెక్ట్‌లకు
అపర భగీరథ మహాశయులు తవ్వే
కాంట్రాక్టు కాల్వలు
రాని నీళ్ళకు వార్చే వాగ్దానాల
ఓట్ల పాచికలు
తీరానికి ముక్కారుకైనా
యివ్వాలని వరంలా
ఎత్తి పోసేరు గోదావరి నీళ్ళు
ఎండిన సీమ గొంతుకేమో
కృష్ణార్పణం దప్పిక దాహాలు”[86]

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్, కృష్ణాబోర్డు యాజమాన్యం ప్రకారం సీమ ప్రాజెక్టులకు, కాలువలకు నీటి కేటాయింపులు జరిగినా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు, గుత్తేదార్లు, కాంట్రాక్టర్లు, పెత్తనందార్ల నిర్లక్ష్య వైఖరి వల్ల సీమ దాహంతో తపించిపోతోంది.

“ నిక జలాల తకరారులో
ఎగువ రాష్ట్రాలు ఆపే వాటాలు
నా రైతు గొంతుకు వురి బిగించేను ముందే
అందవు చావు నీళ్ళూ!”[87]

నదులలోని నికర జలాలు సీమ ప్రాంతానికి చెల్లవని మిగులు జలాలు, వెనుక జలాలు వాడుకోవాలని ఎగువ రాష్ట్రాలు, పక్క రాష్ట్రాల ధోరణికి సీమకు చుక్కనీరు కూడా అందలేని దౌర్భాగ్యం దాపురించింది.

“ పోతిరెడ్డిపాడు నోటికి
అందాలంటే గుక్కెడు నీళ్ళు
వరదై రావాలి ఆల్‌మట్టి ఎత్తుని

దాటి కృష్ణ నీళ్ళు
మల్యాల నుండీ ఎత్తి పోసుకునే
తడి వుసురు ఎప్పుడు చేరాలి
హంద్రీ నుండీ నీవాకు
నదులే లేని నా చిత్తూరు
సీమను దాటిపోయిన
తుంగభద్ర కృష్ణలు
యీనేల జార్చిన కన్నీటి ధారలు
కన్నీటి ధారలతో
సిరులు పండించే సాగర వారసులు
చరిత్రలో నేరస్తులై నిందలు మోస్తారు
ప్రేమలేని సోదరులు"[88]

కర్ణాటకలోని ఆల్‌మట్టి డ్యాం నిండి మిగులు జలాలు కిందకి వదిలితేగాని పోతిరెడ్డిపాడు ఎత్తిపోతల పథకానికి నీళ్ళురావు. శ్రీశైలం డ్యాం మిగులు జాలాలు కూడా వాడుకోలేని పరిస్థితి. హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులకు మోక్షం ఎప్పుడో.

రాయలసీమ ప్రాంతం నీళ్ళ విషయంలో శతాబ్దాలుగా ఎన్ని అవకాశాలు కోల్పోయిందో ఎంతటి మోసం, అన్యాయం జరిగిందో తెలుసుకోవాలి. 1901లో 36 లక్షల ఎకరాలకు నీళ్ళందించేందుకు మెకంజీ రూపొందించిన 'కృష్ణా, తుంగభద్ర, పెన్నానదుల అనుసంధాన పథకం' అందుకోలేక పోయారు. 1927 లో దత్తమండలాల నీటిపారుదల కమీషన్ నేతృత్వంలో ఐర్లాండీ అనే ఇంజనీరు రూపొందించిన తుంగభద్ర- కృష్ణా ప్రాజెక్టును, సిద్దేశ్వరం ప్రాజెక్టులు పొందలేక పోయారు. 1937లో శ్రీబాగ్ ఒప్పందం ప్రకారం రాయలసీమకే కృష్ణా, తుంగభద్ర జలాలు అందిస్తామని ఆంధ్ర నాయకులు ఒప్పందం చేసుకున్న ప్పటికీ అమలు కాలేదు. 1951లో సీమకు 20 లక్షల ఎకరాలకు నీళ్ళందించే కృష్ణా-పెన్నార్ ప్రాజెక్ట్ (సిద్దేశ్వరం)ను అరవ ప్రాంతానికి నీళ్ళు వెళతాయన్న సాకుతో రాయలసీమ వాసులను నమ్మించి ఆ ప్రాజెక్టును కోల్పోయేలా చేశారు. 1953 లో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేసే తొందరలో తుంగభద్ర ప్రాజెక్టును రాయలసీమ భూభాగంలో లేకుండా చేశారు. 1954లో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినాక సిద్దేశ్వరం వద్ద కడతామని నిర్ణయించిన ప్రాజెక్టును సీమకు దూరం చేసి నాగార్జున సాగర్‌గా నిర్మించి 24 లక్షల ఎకరాలకు నీళ్ళు పొందారు. 1963లో శ్రీశైలం ప్రాజెక్టును విద్యుత్ ప్రాజెక్టుగా నిర్మించి చట్టబద్ధంగా రాయలసీమ నీళ్ళు

అందుకునే అవకాశం లేకుండా చేశారు. 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్విభజన చట్టంలో గోదావరి నది నుండి 165 TMCలను తీసుకొచ్చే దుమ్మగూడెం- నాగార్జున సాగర్ టెయిల్‌పాండు ప్రాజెక్టు చేరకుండా పోయి పోలవరం మాత్రమే వచ్చి చేరింది. దీనివల్ల కృష్ణ నుంచి 165TMCలు రాయలసీమ ప్రాంతం శ్రీశైలం నుంచి పొందలేని పరిస్థితి ఎదురవుతోంది. ఇలా అనేక అవకాశాలు సీమ ముంగిట ఊరించి ఉసూరుమని పించాయి.

జి.వెంకటకృష్ణ 'అన్నా న్యాయం' కవితలో నీళ్ళు లేకపోవడం వల్ల రైతు ఎదుర్కొనే కష్టాన్ని తెల్పుతున్నాడు.

" నీడలు తప్ప
నీళ్ళే కానరాని భూముల్ని దున్నావా
అన్నా
దున్నే కొద్దీ దుఃఖాన్ని
వొడిసి పట్టావా
తవ్వేకొద్దీ తరగని
సుడుల్ని చుట్టావా
చుట్టుకున్న వురి మెడలను లెక్కబెట్టావా
.......................................
అన్నా
హైనాల తాకిడిని అనుభవించావా
పిల్లల్ని ఎత్తుకెల్లే హైనాల తాకిడి
తల్లుల్ని ఏమార్చే హైనాల తాకిడి
నేల తల్లుల్ని మరిచే
స్వార్థ హైనా పుత్రుల తాకిడిని
భరించమంటావా"[89]

రైతుల పొలాలకు నీళ్ళు లేకపోవడం వల్ల ఆ పొలాలను దున్ని సేద్యం చేయడమంటే దున్నే కొద్దీ దుఃఖాలు బయట పడుతున్నాయి. తవ్వే కొద్దీ తరగని రైతు ఆత్మహత్యల ప్రాణాలు ఉబికి వస్తున్నాయి. ఇలాంటి దయనీయ స్థితిలో నీటి సమస్యల వల్ల కలిగే బాధల్ని కవి చిత్రించాడు.

జి.వెంకటకృష్ణ 'ఆఖరి దాహం' కవితలో ఇలా అంటాడు.

" గోదావరి
కృష్ణా
తుంగభద్రా
చిత్రావతి
ఇన్ని వున్నా
దాహం తీరని తెలంగాణ
తడి సోకని రాయలసీమ
నిలువెత్తు ఆగ్రహ జ్వాలలు
సహజ వనరు
అసహజ పంపిణీని
ప్రశ్నిస్తున్న నిరసనలు
కరువు నిండిన బతుకు సాక్షిగా
అడుగంటిన భూజలం సాక్షిగా
తరతరాలుగా పల్లంలోకే జారిపోతున్న
అదృష్టం సాక్షిగా
రాజ్యపు కుటిల రాజకీయం సాక్షిగా
నదీమ తల్లీ"[90]

నీరు అనే సహజ వనరుల పంపిణీ విషయంలో తలెత్తుతున్న వివాదాలు, వివిధ ప్రాంతాల నిరసనలు మనం చూడవచ్చు. జీవ వర్షాధారిత నదులున్నప్పటికీ సాగు, తాగునీటికి సరిగా వినియోగించుకోలేని పరిస్థితి వచ్చింది.

మునిసుందరం 'నాసీమ' కవితలో సీమ నీటి బతుకుల్ని తెల్పుతూ,

" ఇక్కడ నీళ్ళు లేవు
కన్నీళ్ళు కూడా లేవు
సిరిసంపదలు లేవు
చలువ పందిళ్ళు లేవు
తరతరాల బండరాళ్ళ వలె
మొండి బ్రతుకులున్నాయ్

ఇనప గుండెలున్నాయ్"[91]

నీళ్ళు లేని రైతుల మొండి బ్రతుకులున్నాయని తెల్పుతున్నాడు.

" నేడు గుక్కెడు నీళ్ళు కరువై బ్రతుకే బరువై

దిక్కులేని పక్షుల్లా

దిక్కు దిక్కులకూ వెడుతున్న జనం

గోదారి, క్రిష్ణమ్మ

వురకలేస్తున్నాయి

పరుగులు తీస్తున్నాయి

నీళ్ళు లేవా?

అడిగే నోళ్ళు లేవు

నా సీమ కన్నుల్లో

కన్నీళ్ళు కూడా లేవు"[92]

గోదావరి, క్రిష్ణా వంటి నదులు ప్రవహిస్తున్న సీమ ప్రాంతానికి నీళ్ళు కరువు. ఈ అన్యాయాలను ఎదురించి అడిగే నోళ్ళు లేవు అంటూ సీమ దైన్యాన్ని తెల్పుతున్నాడు.

బిక్కీ కృష్ణ 'జల ప్రళయం' కవితలో స్వార్థపూరిత రాజకీయాలను ప్రశ్నిస్తున్నాడు.

" కరువు సీమలో నీళ్ళు లేవన్న దెవరు?

స్వార్థ రాజకీయాలు రగిలించిన ఫ్యాక్షనిజం జ్వాలల్లో

కాలి బూడిదై పోయిన పేద కుటుంబాల కళ్ళల్లో చూడు నీళ్ళు! కన్నీళ్ళు!

కరువు సీమలో నీళ్ళు లేవన్న దెవరు?

పెన్నా కుముద్వతి చిత్రావతీ నదీమ తల్లుల ఎండిన

ఇసక స్తనాలపై గుక్కెడు నీళ్ళకోసం నెమరు వేస్తూ చేసే

బర్రెల కళ్ళల్లో చూడు నీళ్ళు! కన్నీళ్ళు!"[93]

సీమ నదుల్లో నీళ్ళు లేకపోవడానికి ప్రజలకు, రైతాంగానికి, పశుజాలాలకు నీళ్ళు అందక పోవడానికి ఈ ప్రాంతపు స్వార్థపూరిత రాజకీయలే కారణమన్న నిజాన్ని తెల్పుతున్నాడు.

ఎస్. మునిసుందరం 'నాకు నీళ్ళు కావాలి' కవితలో నీటి అవసరాన్ని తెల్పుతున్నాడు.

" నాకు నీళ్ళు కావాలి

ఈ మట్టి మనిషి కిన్ని నీళ్ళు కావాలి

నీళ్ళుంటే జీవనం

నీళ్ళుంటే బ్రతుకు నందనవనం

నాగరికతలు నీళ్ళతోనే ప్రవహిస్తాయి

చరిత్రలు యేటి అలలే రాస్తాయి

అందుకే నాకిన్ని నీళ్ళు కావాలి

నా తల్లి కన్నీళ్ళు తుడవాలి

ఎడారి దాహం నాది

తడారిన గొంతు నాది

తరతరాల పరితాపం నాది

యుగయుగాల శాపం నాది"[94]

నాగరికతలు నీటితోనే రూపుదిద్దుకొని నిర్మాణం జరుగుతుందని చరిత్రను రాస్తాయనే సత్యాన్ని వ్యక్తీ కరించాడు. యుగయుగాల నుండి తరతరాలుగా సీమ వాసులు వేదన అనుభవిస్తున్నారని ఈ మట్టికి, మనిషికి నీళ్ళు కావాలని కవి ఆవేదన చెందుతూ కవిత్వీకరించాడు. తెలుగు రాష్ట్రాల మధ్య అలాగే వివిధ రాష్ట్రాల మధ్య సఖ్యతగా ఐక్యతగా వుండి ఒకే జాతిగా కలిసి వుండాల్సిందిపోయి భూమి మీద సహజ వనరులను వాటాలుగా పంచుకొని ఎవరు ఏమైపోతే మాకేంటి అనే స్వలాభం కోసం ఆలోచించే స్వభావాన్ని చిత్రిస్తున్నాడు.

" ప్రకృతి ప్రసాదాలయిన

ఈ మట్టిని, ఈ నీటిని, ఈ గాలిని

పదవుల్లా వాటా లేసుకొంటాం

మనిషి మనిషకి మధ్య

ఇనుప గోడలు కట్టుకొంటాం

ఒక తల్లి బిడ్డలమని

ఒక జాతి మొక్కలమని

ఒకే గూటి పక్షులమని మర్చిపోతాం

అన్న ఆకలితో ఏడిస్తేనేం?

తమ్ముడు దాహంతో ఛస్తేనేం?

మా దారులు మాకున్నాయ్

మా గోడలు మాకున్నాయ్

గుండె ద్వారాలు మూసుకుపోయి

మానవ యంత్రం తప్పటడుగు వేస్తూంటే

భుజాలు తడుముకొంటున్నాం

బాధ్యతలు విస్మరిస్తున్నాం"[95]

తెలుగు రాష్ట్రాలు, వివిధ రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు, వాటాల మధ్య తరచూ వివాదాలు, గొడవల నేపథ్యంలో కవి ఏకసూత్రతో కవిత్వాన్ని నిర్మించాడు.

మహమూద్ 'నీళ్ళకోసం ఉద్యమం' కవితలో ఇలా అంటాడు.

" కరువులను కాటికి పంపే

నీళ్ళ కోసం ఉద్యమాలను నిదురలేపే

కార్యక్రమాలకు మన ఊపిర్లను వేదికలు చేయాలి

నీళ్ళే సంస్కృతి...

నీళ్ళే చరిత్ర...

నీరెండి పోయి పాయలు మిగిలిన

ఈ సీమ మీద

నీళ్ళ కోసం పారలమై

పాతాళాన్ని పైపైకి ఎగదోసుకొచ్చేట్టు

కదలికలు సృష్టించాలి

కష్టం మీద హక్కు మాదని

దుక్కి, దున్ని మీద హక్కు మాదని

సముద్రాల కోసం ఉవ్విళ్ళూరే నదీ జలాలని

పొలాల్లోకి మరల్చేట్టు

హలాన్ని ఆయుధంగా మార్చే

పని మొదలు పెట్టాలి"[96]

అని నీళ్ళ కోసం నీటిమీద హక్కుల కోసం సంఘటితమై ఒక యుద్ధాన్ని చేయవలసిన ఆవశ్యకతను కవి గుర్తుచేస్తున్నాడు.

**4.4.7 కుల వృత్తుల చైతన్యం:**

**4.4.7.1 చేనేత వృత్తి చైతన్యం:** రాధేయ 'క్షతగాత్రం' కవితలో చేనేత వృత్తి గొప్పతనాన్ని చెబుతూ నేత వృత్తిలో గల ఇబ్బందులను చిత్రించాడు.

" వ్యవసాయం తర్వాత సంపద్వంతమైంది
మా చేనేత రంగం
ఈ సీమ వస్త్రకళా నైపుణ్యంలో
రూపుదిద్దుకున్న ధర్మవరం పట్టుచీరలు
జరీ చీరెలల సౌందర్యం
పుల్లం పేట, మాధవరం చేనేత చీరెలతో
వికసించిన సౌందర్య సిరుల పూదోట
ఆకలి చావులకు ఆలవాలమై
సంక్షోభంలో కూరుకుపోయింది
నేత్రల కుట్రపూరిత మౌనం
శవాల మధ్య దారి చేసుకుంటూ నడుస్తోంది
బతుక్కి ఆలంబన
భవిష్యత్తుకి ఆసరాలేని వృత్తి
నోరు తెరచి నేతగాళ్ళను కబళిస్తుంటే
ఉండలుగా బిగిసిన తమ నరాల్ని
కండెలుగా వడుకుతున్నారు వారు
పేగుల్లో మెలికలు తిరిగిపోతున్న ఆకలిని
పోగులుగా అతికేసుకుంటున్నారు
జరీ అంచుల మీద జలతారు స్వప్నాల్ని
అతికించి
మగ్గం మీదే మరణ శాసనాల్ని
నేసుకుంటున్న నేతగాళ్ళ
ఆకలి చావులకు ఖరీదు కట్టే షరాబు లెవ్వరు?"[97]

చేనేత కుటుంబాల్లోని సాధక బాధల్ని వారి ఆకలి చావుల్ని ఆత్మహత్యల్ని చైతన్యవంతంగా చిత్రించాడు.

రాధేయ 'మగ్గం బతుకు' కావ్యం ద్వారా చేనేత వృత్తిని ఆ వృత్తిలోని సమస్యల్ని చేనేత కుటుంబాల జీవన వ్యథల్ని చిత్రించాడు.

" పత్తిని పండించిన వాడూ
పాడెమీద ఊరేగుతున్నాడు
ఆ పత్తిని వస్త్రంగా నేసినవాడూ
మగ్గం గిలకకు ఉరేసుకుంటున్నాడు!
కాళ్ళల్లో శక్తీ, చేతిలో సత్తువా
కూడదీసుకొని ఎంతనేసినా
మా శ్రమ ఫలితాన్ని సొసైటీలు మింగేస్తున్నాయి
సత్తువ వెక్కిరిస్తున్నా
చాకిరీ ఏడిపిస్తున్నా
'ఆశ' కంటిలో పొగై చుట్టుకుంటుంది
దోనెలో వస్త్రమై మలుపు తిరుగుతుంది!
కళ్ళల్లో వత్తులు వేసుకొని మగ్గం నేసినా
'కరెంటు బల్బు' కే భారమైన బతుకుమాది"![98]

చేనేత కుటుంబాలను సొసైటీలు ఏవిధంగా దోపిడీ చేస్తున్నాయో తెల్పుతున్నాడు. సత్తువ కూడబెట్టుకొని చీరలు నేసినా బతుకులు తెల్లారలేని జీవితాలు సంపాదన అంతా కరెంటు బిల్లులకే సరిపోతుందన్న యదార్థ దృశ్యాలను కవి చిత్రించాడు. చేనేత వృత్తి కుటుంబాలు ఆత్మహత్యలు చేసుకున్న దృశ్యాల్ని చిత్రించాడు.

" ఆ మధ్య
రైలు పట్టాల మధ్య ఛిద్రమైన
దిక్కులేని శవం
'ధర్మవరం' దాసరి ఓబులేసు కథ!
మొన్న మగ్గం గిలకకు ఉరేసుకొని
ఉసురు తీసుకున్న
'మాధవరం' అవ్వారు రామయ్య దంపతుల కథ!
నిన్న అప్పులు తీర్చలేని స్థితిలో
ఆత్మహత్యకు పాల్పడిన

'ముదిరెడ్డిపల్లె' పట్టుపోగుల నరసింహులు కథ!
ఆకలిని భరించలేని స్థితిలో
ఎర్రమన్నే పరమాన్నంగా జుర్రుకొని
కాటికి పయనమైన వృద్ధుడు
'కేశేపల్లి' చెన్నా ఈశ్వరయ్య కథ!
పాలడబ్బాకొనే శక్తిలేక
పురిటి పొత్తిళ్ళలోనే
ఆడబిడ్డలను ఆరువేలకు అమ్ముకున్న
'నరసాపురం' చౌడమ్మ కథ!"[99]

చేనేత కుటుంబాలలోని ఆత్మహత్యల్ని విషాదకరమైన జీవితాలను ఆకలి బతుకు వ్యథల్ని కవి చిత్రించాడు. చేనేత వృత్తి గొప్పతనాన్ని కవి ఇలా చిత్రించాడు.

" పురాణాల కంటే పవిత్రమైన వృత్తి
మనిషి స్వేదంతో వెలిగే వృత్తి
వ్యవసాయం తర్వాత
సంపద్వంతమైంది ఈ చేనేత వృత్తి!
మనిషి నాగరికతకు
మొదటి సాక్ష్యం
వస్త్రధారణం
స్వాతంత్ర్య పోరాటంలో
స్వాభిమానం నేర్పిన వృత్తి
రాట్నంతోనూ పోరాటం
చేసిన వృత్తి
గగన సీమలో జాతీయ పతాకమై
రెపరెపలాడుతూ
జాతి ఔనత్యాన్ని చాటిన వృత్తి!"[100]

పురాణాలు, వేదాల కాలం నుంచి మనిషి నాగరికతను ప్రారంభించిన కాలం నుంచి ఆ తర్వాత జాతీయోద్యమ కాలంలోని పోరాట స్ఫూర్తిని గొప్పతనాన్ని చక్కగా చిత్రించాడు.

“ ఆరుగజాల నేత చీరెను
అగ్గిపెట్టెలో అందంగా మడతబెట్టి
అంతర్జాతీయ కీర్తిని
తలదాల్చిన ఈ కళాకారుడు” [101]

ఆరు గజాల చీరెను అగ్గిపెట్టెలో మడతబెట్టి అంతర్జాతీయ కీర్తిని కూడా ఈ నేతగాడు సంపాదించాడు. చేనేత కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కవి చెబుతూ,

“ ఓదార్పులైనా
రాయితీలైనా
మా మరణాల్ని వాయిదా వేస్తాయి తప్ప
జీవించటం నేర్పవు!
మా కష్టానికి తగ్గ
ప్రతిఫలం దక్కేలా
చట్టాల్ని సవరించండి!
మరమగ్గాల్ని నియంత్రించి
మా రెక్కల కష్టాన్ని నిల్పండి!
ముడిసరుకు కొనుగోలును
సరళం చేసి
మూలపడిన మగ్గాలకు
జీవం పొయ్యండి!
అప్పుల చావులూ, ఆకలి వలసలూ లేని
మా చేనేత బతుకును ఆదుకోండి!” [102]

ఆధునిక కాలంలో మర మగ్గాలను నియంత్రించి చేనేత మగ్గాలను ఆదుకోవాలని ముడి సరుకులు, రంగులు ఇతర వాటికి రాయితీలు కల్పించి అప్పులు, ఆకలి చావులను, వలసలను నిలిపి చేనేత మగ్గాలకు పునర్జీవనం చేయవలసిందిగా కవి వ్యక్తీకరించాడు.

### 4.4.7.2 కుమ్మరి వృత్తి – చైతన్యం:

టి.రాజారాం ‘అతడే’ అనే దీర్ఘ కవితలో కుమ్మరి చేతి వృత్తి నైపుణ్యాన్ని వారు తయారు చేసిన మట్టి పాత్రల రకాలను తెల్పుతున్నాడు.

“ మట్టిని అతడు మరచిపోవచ్చు
కానీ... మట్టిసారె, గుదిపె, ఆము
మరువనే మరువవు అతడిని
కుండ కూజా కడవ బాన మూకటి
ప్రమిదె, బొమ్మ ఏవయితేనేం
ఏదయితే నేం...
సారె మీద అతడు ఆవిష్కరించిన
మానవ నాగరికతను నిరూపించే
అద్భుత నగిషీల నిలువెత్తు సాక్ష్యాలు అవి”[103]

చరిత్రలో సమాజానికి నాగరికత నేర్పిన కుమ్మరి వృత్తిని అతని నేర్పరితనాన్ని ఈ సమాజం మరచిపోదని అతడు సృష్టించిన మట్టి పాత్రల అద్భుత నగిషీలు సాక్ష్యాలుగా నిలిచిపోతాయని కవి చిత్రించాడు.

### 4.4.7.3 కంసాలి వృత్తి- చైతన్యం:

టి.రాజారాం ‘అతడే’ అనే దీర్ఘ కవిత ద్వారా కంసాలీ వృత్తి పనితనాన్ని చిత్రించాడు.

“ అతను చెక్కిన శిల్పాలు ధ్వజ స్తంభాలు
కట్టిన ఆలయాలు మలిచిన యిత్తడి గంగాళాలు
రాగి చెంబులు చేసిన ఆభరణాలు
అన్నీ...ఇవన్నీ...ఇపుడు
అతడికి యింత అన్నం కూడా పెట్టలేని
అపురూప కళా ఖండాలు
త్రాసులు...తాయెత్తులు దర్వాజాల మీద
మంత్రించిన రాగిరేకులు పీర్లకు కట్టిన దట్టీలు
చివరికి అన్ని పనిముట్లు
అతడి మేదస్సులో ఘనీభవించిన
అద్భుత నగిషీల నాగరికతా శిలాజాలే
ఏ లోహాలు కరిగితే
ఏ కొత్త లోహం పుడుతుందో
ఎరిగిన ఏకైక లోహ రహస్య సిద్ధుడతడు”[104]

కంసాలీ వృత్తి చేతిలో రూపుదిద్దుకొన్న శిల్పకళా ఆభరణాలు అతని నైపుణ్యాన్ని కవి తెల్పాడు.

### 4.4.7.4 రజకుల వృత్తి- చైతన్యం:

పి.దస్తగిరి చాకలి వాళ్ళ జీవన విధానాన్ని రేవు బతుకుల్ని చిత్రించాడు. 'మేం సాకలోళ్ళం' కవితలో ఇలా అంటాడు.

" ఎప్పుడూ మీరు కట్టే బట్టల్ని
మలినం లేని మల్లెపువ్వుల్లా తీర్చే
చాకి రేవులం
ధోభి ఘాట్లు!
................
ఇంగొద్దూ చాలు
మేము ఆత్మాభిమానమున్నోళ్ళమే
మనసున్న మనుషులమే
మమ్మల్నీ గుర్తించండి
గౌరవించండి!
......................
ముళ్ళ కంపనే కాదు
ముళ్ళులై క్షణక్షణం
మా మనుసుల్ని గుచ్చే
మీ మాలిన్యమైన మాటలను
రోగాళ్ళమై మోసుకెళ్ళి
చాకలి పొయ్యిలో
కాల్చే పంగల కర్రలం"[105]

గ్రామాల్లో ప్రజల మురికి బట్టలను ఉతికి శుభ్రం చేసే చాకలి వాళ్ళు తమకు ఆత్మాభిమానం, మనసు వుందని మనుషులుగా గుర్తించండి అంటూ కవి స్వాభిమానాన్ని గుర్తు చేస్తున్నాడు.

జూపల్లి ప్రేంచంద్ ' ఇవాళ నా పుట్టిన రోజు' కవితలో చాకలివాళ్ళు ఏవిధంగా శ్రమ దోపిడీకి గురి అవుతున్నారో తెల్పాడు.

" ఊరిలో సవర్ణుల పెళ్ళైతే నావాళ్ళు సంబరపడి

తమ దేహాలను పడుపు కోకలుగా పరిచారు

ఊరేగింపుల్లో దివిటీలై వెలిగారు

పండగ పబ్బాల్లో ఇంటి వెల్లలై మెరిశారు

రోజంతా నానాయాతన చేసి

చివరికి ఇల్లిల్లూ తిరిగి

వెట్టి చీకట్లో ఎంగిలి బుట్టలై మిగిలారు

ఇప్పటికీ ఓ ఇస్త్రీ పెట్టె కోసమో

ఓ డ్రమ్ము కోసమో ఓ దోభీ ఘాట్ కోసమో

దేబిరిస్తూ అమాయకంగా ఎదురు చూస్తూ!"[106]

గ్రామాలలో పెద్ద పెద్ద కుటుంబాల్లో పెళ్ళిళ్ళు జరిగినపుడు పెళ్ళి ఊరేగింపులో వస్త్రాలను పరచడం, వెలుతురు దివిటీలను చేతపట్టడం, అలాగే గ్రామాలలో పండుగలు జరిగినపుడు ఇల్లిల్లూ తిరిగి వాళ్ళు పెట్టింది తీసుకొని జీవనం గడుపుతారు. ఇలాంటి చాకలి వాళ్ళ బతుకుల్ని చిత్రించాడు.

### 4.4.7.5 బెస్తలు– వృత్తి చైతన్యం:

టి.వెంకటేష్ 'మర్లా ఈ రోజు' కవితలో బెస్తల వృత్తి జీవితం చేపలు పట్టే విధానంలో గల కష్టాల కడగండ్లను చిత్రిస్తున్నాడు.

" కునుకును చూరుకు తగిలించి పయనమవుతారు

మసక చీకట్లో భారమైన గమ్యం

భుజంపై కావడి మోత

మెత్తని అడుగుల క్రింద శిశిరం నలుగుతూంటుంది

వలలోని మట్టిపూసలు

గాలి ఈలకు దరువేస్తుంటాయి

బీడీ దమ్ములతో వణుకును తరిమి

తెప్పలపై గట్లపై కొంగలై వాలుతారు

నిదరోతున్న నదిపై

ఆశలను విసురుతారు

............................

తీరం వెంబడి వేట

వేకువ గోరు వెచ్చగయ్యేంత వరకు సాగుతుంది"[107]

బెస్తవాళ్ళు చేపల వేటకు బయలుదేరి వెళ్ళి వలలు వేసి చేపలు పట్టుటకు సిద్ధం అయ్యే దృశ్యాన్ని చిత్రించాడు. కె.బాబ్జి 'ప్రతిభ' అనే కవితలో గౌడ, మాదిగ, రజక, చేనేత, మంగలి వృత్తి కులాల ప్రతిభను చిత్రించాడు.

" బొడ్లో పదునైన కత్తి దించుకుని
నిలివెత్తు తాటి చెట్టుకు
గాయం లేని గాట్లు పెట్టి
మీ విలాసాలకు మత్తెక్కించిన
గౌడవానికి
'ప్రతిభ' కత్తే ప్రాణం తీస్తున్నది"

గౌడ కులస్తులు తమ దగ్గరున్న చిన్న పదునైన కత్తి ద్వారా తాటి చెట్టును గీసి కల్లును తీస్తారు. తాటి చెట్టును గీసిన కత్తే వారి ప్రాణాలను తీస్తున్నదని తెలియజేస్తున్నాడు.

" కరుకైన ఆరెతో జంతు చర్మం వలిచి
మీ వామన పాదాలకు
మెత్తని మేజోళ్ళు చేసిన
మాదిగోన్ని 'ప్రతిభ' చెప్పుకరచి
శరీరమంతా రణమైంది"

అని మాదిగల పనితనాన్ని చెప్తున్నాడు.

" చౌడు మట్టి సున్నపు తేటతో
సమస్త మైలను పోగొట్టే
చాకలి జీవితాలు
డ్రైక్లీనింగ్ వాషింగ్ మెషీన్లు ప్రతిభ నైపుణ్యానికి
ఉబ్బ- కంపు కొడుతున్నాయి"

చౌడుమట్టి నీరు, సున్నపు తేట నీరుతో ఎటువంటి మైలనైనా తొలగించే చాకలి వాళ్ళ జీవితాలు డ్రైక్లీనింగ్ వంటి పద్ధతులు రాకతో చాకలి జీవితాలు ఇబ్బందుల్లో పడ్డాయి.

" మెత్తని కత్తితో బహుముఖాల
మీ కురూపి ముఖానికి సుందర రూపమిచ్చి

నిలువెత్తు మలినమై

సెలూన్ బ్యూటీ పార్లల్స్ విష 'ప్రతిభే'

మంగలివాని పీక కోస్తున్నది"[108]

పట్టణాల్లో పురుషులకు, స్త్రీలకు బ్యూటి పార్లర్స్, సెలూన్స్ వెలుస్తుండటంతో గ్రామాల్లోని మంగలి వారికి ఉపాధి కరువైంది. నాగమ్మ పూలే 'కులగీత' అనే వచన కావ్యంలో ఈ దేశంలో కుల వ్యవస్థ ఎలా పుట్టింది. ఎలా రూపుదిద్దుకుంది. దాని పరిణామాలు ఎలా వున్నాయో సమగ్రంగా సుదీర్ఘంగా చిత్రించారు. కులం అనేది మనుషులను, మానవ సమూహాన్ని, ఈ సమాజాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేసిందో తెల్పుతున్నారు.

" కులం అంటే చీలిక

అది మానవులను చీల్చింది

కులం అంటే – అణచివేత

అది క్రింది కులాలను అణచివేసింది

కులం అంటే మతం

అది ప్రజలను మూఢులను చేసింది

కులం అంటే వ్యవస్థ

అది నిస్సహాయులనందర్ని బానిసలను చేసింది

కులం అంటే రాజకీయం

అది దగా కోరులను బలవంతులను చేసింది

కులం అంటే చట్టం

అది మనుషులను వెనుకబాటుతనంలో వుంచింది

కులం అంటే బానిసత్వం

అది శ్రమ జీవులను కాలరాసింది.

కులం అంటే వేర్పాటు వాదం

అది మనుషుల మధ్య ప్రేమను తుంచేసింది

కులం అంటే ఉగ్రవాదం

అది జీవితాలను సర్వనాశనం చేసింది

కులం అంటే కుట్ర

అది అగ్రకుల చేతిలో ఆయుధమైంది

కులం అంటే భారతదేశం

అది మనువాదానికి పట్టం కట్టింది"[109]

కులం అనే రెండు అక్షరాలు అనాది కాలం నుంచి తరతరాలుగా ఈ సమాజంలో ఎలా పాతుకుపోయి మనిషిని వేరు చేసిందో తెల్పింది. అలాగే కులాన్ని ఆధారం చేసుకొని సమాజంలో కొన్ని శక్తులు ఎలాంటి దోపిడీ, దౌర్జన్యాలకు, వికృత చర్యలకు పాల్పడేలా చేసిందో రచయిత్రి కులం యొక్క విరాట్ స్వరూపాన్ని చూపించింది. కులవృత్తులు ఈ సమాజానికి నాగరికతను నేర్పాయని చెబుతూ,

" కులవృత్తులే పాట నేర్పాయి

కులవృత్తులే ఆట నేర్పాయి

కులవృత్తులే రాగాలు నేర్పాయి

కులవృత్తులే చైతన్యం నేర్పాయి

ప్రకృతిలో ప్రకృతిగా కలిసిపోయి

నాగరికతను పెంచి పోషించాయి"[110]

అని కులవృత్తులే ఈ సమాజానికి ఆట, పాటలు నేర్పి ఒక చైతన్యాన్ని అందించి ముందుకు నడిపించాయని రచయిత్రి తెల్పింది.

### 4.4.8 సీమ రాజకీయ నాయకులు- ప్రభుత్వాల నిర్లక్ష్యం పట్ల చైతన్యం:

బిక్కి కృష్ణ 'జలదానం' కవితలో సీమ ప్రాంతానికి, ప్రజలకు నీటిని దానం చేయండి అంటూ నాయకులను వేడుకుంటున్న దృశ్యాన్ని చిత్రించాడు.

" జనం కోసమే జీవిస్తున్నామంటున్న

కరువు సీమ నేతల్లారా!

జలదానం చేయండి! మా ప్రాణాలు నిలపండి!

మాకు కావల్సింది తాత్కాలిక పథకాల ముష్టిదానం కాదు

మా ఎడారి పొలాల గుండెలపై పచ్చదనం మెరవడానికి సాగునీరు

ఎండిన నూతుల్లాంటి తడారిన గొంతులు తడుపుకోవడానికి తాగునీరు కావాలి!

జలదానం చేయండి!

ఇన్నాళ్ళు మీ నోటి మాటల లాలాజలంతో

మా చెరువు నిండుగా నీళ్ళు నింపారు

ఇన్నేళ్ళు మీ పవిత్ర హస్తాల శంకుస్థాపనలతో
సీమలో ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు
ఇక మీ మాటలు చాలించండి
ఓట్ల వర్షం కురిపించకండి!"[111]

సీమ ప్రాంతానికి సాగు, తాగు నీటికి ఉద్దేశించిన ఎత్తిపోతల పథకాలు, కాలువ నిర్మాణ పనులు శిలా ఫలకాలకే పరిమితమై పనులు నత్తనడకన జరుగుతున్నాయి. రాజకీయ నాయకులు నీటి విషయంలో ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చలేకపోతున్నారు. రాజకీయాల కోసం ప్రభుత్వ పదవుల కోసం ప్రజల ఓట్ల కోసం ప్రజలను మభ్య పెడుతున్నారు. ఇలాంటి స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టండి అంటూ నాయకులకు హితబోధ చేస్తున్నాడు. 'కులచైతన్యం' కవితలో నేటి రాజకీయాల స్వరూపాన్ని తెల్పుతున్నాడు.

" నేటి రాజకీయం టక్కరి కొంగ
ఓటు హక్కు ఉన్నా ప్రతి ఒక్కరికీ ఎన్నికల బెంగ
ఎన్నికలలో ఎన్నికలలు సృష్టిస్తారు?
ఎన్నికైనాక మట్టి మనిషికి మన్ను తినిపిస్తారు
ఈ దేశానికి వెన్నెముక రైతన్న అన్నదెవరు?
ఎన్నికలకు పనికి వచ్చే ఒక ఓటుకాదా?
ఇక్కడ కులాలు వందలు వందలు
ప్రతికులంలో మనుషులు మందలు మందలు
రెండు కులాల రాజకీయపు సర్కస్‌లో కీలుబొమ్మలు
ఇపుడు రాజకీయ చైతన్యం కాదు రావాల్సింది
కులచైతన్యం!"[112]

ప్రభుత్వాల పదవుల కోసం సీమ రాజకీయ పార్టీలు ఎలక్షన్‌లలో ప్రజల ఓట్లు పొందడం కోసం ఎన్నో 'కలలు' సృష్టిస్తారు. కుల, మత, వర్గ ప్రజలను కీలుబొమ్మలుగా నాయకులు చేసుకుంటారు. కావున ప్రజలు ఈ మర్మాన్ని తెలుసుకొని కులచైతన్యం తీసుకొని రావాల్సిందిగా తెల్పుతున్నాడు.

వి.చంద్రశేఖర శాస్త్రి 'ఒక కత్తుల వంతెన' కవిత్వంలో ఇలా అంటాడు.

" మా వేలిముద్రలు
మిమ్ముల అందల మెక్కిస్తాయి

మీ పాదముద్రలు

మమ్ముల పాతాళానికి తొక్కేస్తాయి

అరో, ఒకటో వాగ్దానాలు

కార్యరూపం దాలుస్తే

ఆ కూర అందేప్పటికి

ఈ అన్నం పాసిపోతుంది"[113]

ప్రజల ఓట్లతో నాయకులు గెలుపొంది, పదువులు పొంది ఎలక్షన్‌లలో ఇచ్చిన వాగ్దానాలు, హామీలను మాత్రం నాయకులు నెరవేర్చరు. ఈ హామీలు, వాగ్దానాలు కార్యరూపం దాల్చేటప్పటికీ ప్రజల ఆశలు అడియాశలే అవుతాయన్న యథార్థ సత్యాన్ని వ్యక్తీకరించాడు. 'సీమాంతర నేపథ్యం' కవితలో ఇలా అంటాడు.

" హంద్రీ-నీవా నీళ్లను రాబట్టలేని కంత్రీలను

గాలేరు- నగరిని గాలికొదిలేసిన గాడిదలను

వాటర్ షెడ్లను విజయవంతం చేయలేని వాజమ్మలను

ఎప్పుడు నిలదీస్తావు?"[114]

రాయలసీమ ప్రాంతానికి సాగు, తాగు నీటి కోసం ప్రధాన జీవ నాడులైన హంద్రీ-నీవా, గాలేరు-నగరి పథకాలు ప్రభుత్వాలు, నాయకుల నిర్లక్ష్యాల వల్ల పనులు వేగవంతంగా జరగడం లేదు. ఇలాంటి నిర్లక్ష్య ధోరణిని కవి ఒక దిక్కార స్వరంతో ఎండగడుతున్నాడు.

'మల్లెల నరసింహమూర్తి 'జలస్వప్నం' అనే కవితలో సీమ రాజకీయాలను చిత్రించాడు.

" ఇక్కడ వర్షాలు వరాలు...

మా పిల్లలకు భవిష్యత్తులో

అభూత కల్పనలు!

వరిమళ్ళు పండటంలేదు

కానీ

రాజకీయపు వడగళ్ళు మాత్రం

పడుతున్నాయ్ ముమ్మరంగా...

ఆకలిగొన్న జనాలు

మూర్ఛపోయేట్టు...

వడగళ్ళు వానలు కావు

వాగ్దానాలు దాహాలు తీర్చవు

పంటల్లేని రాయలసీమలో

సరికొత్త వంగడం రాజకీయం"[115]

సీమ రాజకీయాలు, ప్రభుత్వాలు ఇచ్చే వాగ్దానాలు, వరాలు సీమ భవిష్యత్తు తరానికి ఉపయోగం లేనివిగా కవి భావించాడు. కనీ కనిపించని ఎండమావులుగానూ పంట పొలాలను నాశనం చేసే వడగళ్ళుగాను భావించాడు. నీళ్ళు లేని పండే పంటలలో ఈ సీమ రాజకీయాలు సరికొత్త వంగడం(పంట) గా చెప్పాడు.

" ఎన్ని నదీ జలాల మళ్ళింపు

ఎన్ని హామీల కంపు

ఓట్ల బిక్షం కోసం

హెలీకాప్టర్లలో విహరించే

రాజకీయ గ్రహాంతర వాసులకు

మా సీమ చంద్రమండలం

నదులకే హృదయాలుంటే

కదలి రావాలి గంగ వెర్రులెత్తి

కపటపు రాజకీయపుటాన కట్టలు

పడగొట్టి హడల్ గొట్టి!

నదులు మా సీమలో నెమళ్ళై

నాట్యం చేసేంత వరకూ

పంటలు భూముల్లో

పచ్చటి ప్రాణమై

ఎదిగేంత వరకూ

నిత్య సంక్రాంతుల పాటలు

పల్లవించేంత వరకూ

మాకు ఉషస్సు లేవు

ఉగాదుల్లేవు"[116]

రాజకీయ నాయకులు, ప్రభుత్వాల హామీలు, వాగ్దానాలు ఫలించి అమలైతే వాటి ద్వారా సీమ ప్రాజెక్టులు, కాలువలు, నదులలోకి నీళ్ళు వచ్చి పంట పొలాలలో నీరు పారి సిరులు పండేంతవరకు సంక్రాంతి సందళ్ళు, ఉగాది ఉషస్సులుండవనే ఒక నిరాశా నిస్పృహ వాతావరణాన్ని చిత్రించాడు. 'వలస పోయిన వసంతం' కవితలో ప్రభుత్వాల గురించి చెబుతున్నాడు.

" హృదయం లేని
ఏ ప్రభుత్వాన్ని నమ్ముకున్న రైతన్నకూ
నష్ట పరిహారం మాట దేవుడెరుగు
పాప పరిహారం కూడా లేదు
నేలను నమ్ముకున్న రైతు
ఏ నాయకునికీ తలవంచడు
బ్రతుకు సముద్రాన్ని ఈదుతున్న రైతులకు
రాజకీయం జాలరి
వల విసురుతున్నాడు చూడు!"[117]

సీమ రైతులకు ప్రభుత్వాలు అందించే పంట నష్టపరిహారాలు అందవు. రైతులకు ప్రభుత్వాల నుంచి, నాయకుల నుంచి ఏ లబ్ధి చేకూరదని కవి చిత్రించాడు.

జంధ్యాల రఘుబాబు 'సంఘటిత స్పర్శ' అనే దీర్ఘ కవితను రాశాడు. ఈ కవిత్వం రాయలసీమ కరువుకు, ఇక్కడి ముఠా తగాదాలకు అక్షర రూపమిస్తూ ఈ రెండు సమస్యలకు కారణాలను వెదకడమే కాక పరిష్కారాన్ని సైతం సూచిస్తుంది. సీమ రాజకీయాలు ఎలా చెలామణీ అవుతున్నాయో, వాటి స్వరూప స్వభావాలను తెల్పుతాడు.

" జన శూన్య భూగర్భం
రైతుతో పరాచిక మాడినప్పుడు
రాజకీయం క్షంతవ్యం కాని
పురాణాన్ని ప్రారంభిస్తుంది!
తరాల కిందే ప్రాజెక్టుల ఉక్కు తలుపులు
కరువు పులి ఆట కట్టిస్తాయనీ
తరాల కిందే కాలువల రక్తనాళాలు
ఈ మెట్టని పులకింప చేస్తాయనీ

తరాల కిందే సేద్య గీతం
పచ్చ కిరీటాల్తో రైతుల్ని అలంకరిస్తుందనీ...
ఆశల నెగళ్ళు రగిల్చిన రాజకీయ స్వప్నం
పళ్లిగిలిస్తూ వికటాట్టహాసం చేస్తూ
కష్టజీవ కంకాళాలపై అనావృష్టి యాత్ర ఆరంభిస్తూనే ఉంది
రైతు హృదయం ఎడారి భారంతో
ఇసుక పాన్పుల నలకరిస్తుంది”[118]

తరతరాలుగా ఈ సీమలో పాతుకుపోయిన కరువు నిర్మూలనలోనూ ఎన్నో ఏళ్ళుగా నీటి కోసం ఎదురు చూస్తున్న రైతుల ఆశలు అన్నింటిని రాజకీయ శక్తులు వమ్ము చేస్తూ తన నిర్లక్ష్యాన్ని చాటుతూనే వున్న ధోరణిని కవి చిత్రించాడు.

“ సాకు కేవలం సాకు మాత్రమే
ఏదో ఒకటి చెప్పుకోవాలి కదా!
రాజధానులకు సర్వం తెలుసు
శీలం చెడిన రాజకీయాలకు సమస్యను నాన్చటం తెలుసు
జల హామీల పర్వతాల చాటున
ఆనకట్టలు పూర్తి కాకుండా చెయ్యటం తెలుసు
అభివృద్ధికి అడ్డుకట్టలు పడేసి
తాము కుబేరులు కావటమూ తెలుసు
ఎడారి కావటానికి అనుమతించిన వాడు
ప్రశ్నించటం మర్చిపోయాడు
నిలదీసిన వాడి ప్రశ్న
వాడినే బాంబై పేల్చి వేస్తుంది”[119]

సీమ రాజకీయాలు చిరకాలంగా ప్రజలను నమ్మించి కల్లిబొల్లి మాటలు, హామీలతో, కొంటె సాకులతో కాలయాపన చేస్తూ ప్రాజెక్టులు, కాలువల నిర్మాణం పూర్తికాకుండా అభివృద్ధి నిరోధకులైనారు. ఆ విషయాన్నే కవి తెల్పాడు.

“ సమగ్రత నించీ ఏకాకిని చేయటమే
రాజకీయం ముఖ్య కర్తవ్యం

ఇక్కడ ప్రారంభమైన ప్రాజెక్టులు ఎన్నటికీ పూర్తికావు
రైతన్నల గుండె గుబులు దించటానికి
ఇక్కడ పూర్తయిన ప్రాజెక్టులకు నీరందదు
రైతన్నల ఆశల నెమళ్ళు పురి విప్పటానికి
వాయిదాల చర్చల్తో రాజకీయం కిమ్మనదు
రైతన్నల్ని మీ కరువుతో మీరే రాజీ పడండంటూ
ట్రిబ్యూనళ్ళ తీర్పులు ఆఫీసుల్లో యోగ నిద్రపోతుంటాయి
రైతన్నల అనైకమత్యం వారికే కొరివి పెడ్తుంది
ఒక్క తరమా- ఎన్ని తరాలు గడిచినై
పాడుకుందు క్కూడా ఆశ మిగలకుండా పోయింది”[120]

సీమలో నెలకొన్న సమస్యలు రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగపడినంతగా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడలేదని చెప్పవచ్చు. ఎన్నో ఏళ్ళుగా నీటి సమస్య అలానే వుంది. ప్రాజెక్టులు పూర్తికావు. ప్రభుత్వాలు చోద్యం చేస్తున్నాయి. భవిష్యత్తులో ఈ సమస్యలు తీరుతాయనే ఆశ కూడా మిగలకుండా పోతుందని కవి వేదన చెందాడు.

రాఘవ శర్మ ‘రుద్రసీమ’ కవితలో ప్రభుత్వ పాలక వర్గాలను ఎండగడుతున్నాడు.

“ మెకంజీ పథకాలు
శ్రీబాగ్ ఒప్పందాలు
కృష్టా- పెన్నార్ ప్రాజెక్టులు
అరచేతిలో వైకుంఠాలు
ఏనుగు అంబారీలపై ఊరేగింపులు
కలక్కుమంటున్న జ్ఞాపకాలు
తలుచుకుంటే చాలు
గుండె భగ్గుమంటుంది
పాలక వర్గాలకే కాదు
రుతుపవనాల క్కూడా సవతి బిడ్డలయ్యాం
...............................
ఈ సీమ త్యాగాలకు సాహసాలకు మెచ్చి

కరువు కాటకాలు

పాలకవర్గాలిచ్చిన వరాలు"[121]

రాయలసీమ హక్కులు, వాటాల కోసం ఏర్పాటు చేసుకొన్న ఒప్పందాలు, కమిటీలు అలాగే నీటికోసం రూపొందించుకున్న పథకాలు, ప్రాజెక్టులు అన్నీ కూడా సీమ వాసులకు కలలుగానే మిగిలిపోయాయి. ఈ సీమలో కరువు కాటకాలను పాలక వర్గాలు ఇచ్చిన వరాలుగా కవి అభివర్ణించాడు. మహమూద్ 'నీళ్ళ కోసం ఉద్యమం' కవితలో ఒక దిక్కార స్వరాన్ని వినిపిస్తూ తిరుగుబాటు ధోరణితో చెబుతున్నాడు.

" ఈ సీమ మీద వాడి పాద ముద్రలు పడకుండా

వాడి కాళ్ళను తుంచేస్తేనే

పంటలు వంటలై మా ఆకలి తీర్చేది

వాడి కళ్ళను పీకి

తుపాకీలో నింపి

వాడి గుండెను పేల్చేస్తేనే

ఈడ హలానికి మట్టి స్పర్శ సోకేది

అందుకే!

పచ్చిక మీద ఎండ్రిన్ చల్లి పురుగుల్ని తోలేసినట్టు

రాజకీయ రాబందులను

ఈ గడ్డ మీద నుంచి

అదృశ్యం చేసే

యుద్ధం మొదలు పెట్టాలి"[122]

చిరకాలంగా సీమ అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వ్యక్తులు, నాయకులు, ప్రభుత్వాలు అయితేనేమి వారి పాదముద్రలే లేకుండా చేయాలని చెబుతున్నాడు. రాజకీయ శక్తులను రాబందులుగా పోల్చి వారిని ఈ గడ్డ మీద నుంచే తరిమి వేసే యుద్ధానికి శ్రీకారం చుట్టవలసిందిగా సీమ ప్రజానీకాన్ని చైతన్యవంతం చేశాడు.

రాధేయ 'సంక్షోభ సీమ' కవితలో రాయలసీమ వర్తమాన చరిత్రను ఆవిష్కరిస్తున్నాడు.

" నా సీమ వర్తమాన చరిత్ర

జీవరసం ఇంకిపోయిన మట్టి చరిత్ర

నేతల నిర్లక్ష్య చూపుల్లోంచి జారిన గాజుపాత్ర

నా సీమ విషాద పర్వంలో

అతుక్కుపోయిన పిచ్చిభ్రమలున్నాయ్

ఉగ్గబట్టుకున్న దుఃఖంలో అర్థాలకు లొంగని భాష్యాలున్నాయ్

కుదించుకుపోయిన మనస్తత్వంలో

తడిచూపుల మేన పరామర్శలున్నాయ్

అంటించుకున్న చిరునవ్వుల్లో

ఆరిన రక్తపు మరకలున్నాయ్

మా హృదయాల గిడ్డంగుల్లో

మౌన ఘోషలే కాదు, అశాంతి మార్గాలున్నాయి"[123]

అని సీమలో గతకాలం నుంచి నేటి వర్తమాన చరిత్రదాకా నేతల నిర్లక్ష్యాలు, అలసత్వాల వల్ల అభివృద్ధికి దూరమైంది. సీమ బతుకుల విషాదాన్ని కవి చిత్రించాడు.

మల్లేల నారాయణ 'క్షుద్రగణాల రుద్రభూమి' అనే కవితలో సీమ గత కాల చరిత్రను తలచుకొని నేటి వర్తమాన కాలంలో ఆవరించియున్న సీమ దైన్యాన్ని తెల్పుతున్నాడు.

" ఒకనాడు

ఈ సీమ అంగళ్ళలో

రతనాల రాశులు పోసి పళ్ళతో కొలిచి అమ్మిన దృశ్యాల్ని

నెమరేసుకొంటుంటే

ఈనాడు

అధికార దాహంతో క్షుద్రగణాలు

సాగించే అరాచకత్వాన్ని తలచి

కుమిలి కుమిలి కుటారిల్లిపోతుంది నేల

ఈ చారికను తుడిచే దెవ్వరు?

ఈ ఏడుపును మాన్పేదెవ్వరు?

ఈ హింసని చెరిపే దెవ్వరు?

అందుకే అంటున్నా

ప్రజాబలం సంఘటిత పడాలి

జన చైతన్యం వెల్లువలై ప్రవహించాలి

అప్పుడే విముక్తి

అందాకా లేదు ముక్తి"[124]

చరిత్రలో రాయలసీమ రతనాల సీమగా ప్రసిద్ధి చెంది నేడు దుష్ట రాజకీయాలు, ప్రభుత్వాల అధికారాల దాహాలు వల్లనూ ఫ్యాక్షన్, ముఠాకక్షలు వల్లనూ సీమ ప్రాశస్త్యం మరుగున పడిపోయింది. దానికోసం ప్రజాబలం సంఘటితం కావాలని జన చైతన్యం సమూహశక్తిగా కూడగట్టుకొని సీమ విముక్తికోసం పోరాడాలని అంతవరకు మనకు ముక్తి వుండదని ఒక ఆశావాద దృక్పథ చైతన్యాన్ని అందించాడు.

బి.పాండురంగా రెడ్డి 'సీమ పిలుపు' కవితలో సీమ దగాపడి మోసపోయిన దృశ్యాన్ని తెల్పుతున్నాడు.

" పొలమంతా బీటలు పడి
కరువే మనకు చుట్టమాయెరా
కన్నీరు కూడ యింకిపోయెరా
ఒప్పందాలడుగున పడి
కుడియెడమల దగాపడి
నీరు లేక మోసపోయెరా!
రాజకీయ పాచికగా మారిపోయెరా!"[125]

సీమ ప్రజల జీవితాలు రాజకీయాలు ఆడే చదరంగంలో పాచికలుగా మారి కుడిఎడమలుగా దగా పడ్డాయన్న వాస్తవాన్ని ఆవిష్కరించాడు. ఇలా దగాపడి బంగపడ్డ సీమకు న్యాయం జరగాలంటే సీమ వాసులు ఏకమై పోరాడాలని పిలుపునిస్తున్నాడు.

" సీమ బతుకులు బండలాయెరా
ఈ సీమ బతుకు బద్దలాయెరా
సీమ బతుకు మోడువారెరా
ఈ సీమ బతుకు చితికిపోయెరా!
మేధావులు రచయితలు
విజ్ఞానులు, విద్యార్థులు
నవ యువకులు నాయకులు
ప్రజాస్వామ్య శక్తులంత
చేయిచేయి కలపమందిరా!
తన కండగ నిలువమందిరా!

తన గొంతు తడపమందిరా!

తన కూపిరి పోయమందిరా!

చేతులెత్తి పిలుస్తోందిరా!

మీ వైపే దీనంగా చూస్తోందిరా!" [126]

అని యావత్తు సీమ ప్రజానీకం సంఘటితమై పోరాడవలసిన అవసరాన్ని కవి గుర్తు చేశాడు.

బిక్కి కృష్ణ 'శిలాఫలకాలెత్తండి' కవితలో సీమ రాజకీయాలను, నాయకులను వారి వాగ్దానాలను తెల్పాడు.

" అభివృద్ధి పేరుతో నడిచిన ఓట్ల రాజకీయం

కాలువలు త్రవ్విస్తామన్న వాళ్ళు కాటికెళ్ళారు

నదులు నీరు మళ్ళిస్తామన్న వాళ్ళు మట్టిలో కలిశారు

శంకుస్థాపనలకే పరిమితమయిన పెండింగు ప్రాజెక్టులను చూసి

శిలాఫలకాల రాతిపూలు నవ్వుతున్నాయి

కరువు సీమలో పుట్టి కరువు సీమలో పెరిగి

కరువు సీమ ప్రజల కడగండ్లు చూసినోళ్ళు

కరువు ప్రజల ఓట్లతో వామనులై పెరిగినోళ్ళు

పల్లె నుంచి ఢిల్లీ దాకా రాజకీయం నడిపినోళ్ళు

నోళ్ళు తెరుచుకొన్న సీమ బీళ్ళకు నీళ్ళిచ్చినారా?

శాశ్వత నీటి ప్రాజెక్టులు తెచ్చినారా"[127]

సీమ అభివృద్ధికి హామీలు, వరాలు ఇచ్చిన వారెందరో కాలగమనంలో గతించిపోయారు. అలాగే సీమ ప్రాంతానికి చెందిన ముఖ్యనాయకులు దేశంలో ప్రధాన పదవులను పొందారు. వివిధ హోదాల్లో రాష్ట్రపతులయ్యారు, ఉప రాష్ట్రపతులు, ప్రధానులు, మంత్రులు అయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా సీమ ప్రాంత నాయకులే ముఖ్యమంత్రులు, ప్రధాన శాఖలకు మంత్రులు కూడా అయ్యారు. ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించారు. సీమ మట్టిలో పుట్టి ఈ నీళ్ళు తాగి ఈ కష్టాల కడగండ్లను అనుభవించిన వారు కూడా సీమకు పెద్దగా ప్రయోజనం చేకూర్చలేకపోయారు. పెళ్ళిలో వడ్డించే వాడు మనవాడు అయితే విస్తరితో ఎక్కడ కూర్చుంటే ఏమి? అని అనుకున్నట్లు సీమ వాసులు పెళ్ళి పంక్తిలో విస్తళ్ళతో కూర్చుంటే వారి ఆశలు అడియాశలు కలలు కన్నీళ్ళుగా నీరుగారి పోయాయి. ఎంతో అభివృద్ధి పథంలోకి సీమను తీసుకురావలసిన వారు ఆ వైపుగా ఆలోచన చేసినా అది ఆచరణలోనికి రాలేదు. దేశంలో ఈనాటికి సీమ

వెనుకబడిన ప్రాంతంగానే గుర్తించబడుతోంది. కవి ఇలాంటి వాస్తవాలను దృశ్యమానం చేశాడు. ఇదే కవితలో రాజకీయ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దని ప్రజలను చైతన్యం చేస్తున్నాడు.

“ నా ప్రియమైన నేతల్లారా!
రాజధాని ఏలికలు రాయలసీమ వాసులైనా
కరువు రక్కసి కంఠంపై జలఖడ్గం ఝులిపించలేదు
సీమ తల్లికి పచ్చని చీర గట్టి సీమంతం చేయలేదు
సీమేతర నాయకులు నక్కలకు సోదరులు
కన్నతల్లి ప్రేమను కోస్తాంధ్రకు పంచి
సవతి తల్లి ప్రేమను సీమపైన చూపారు
అందుకే ఓ రైతన్నా!
ఓట్లేస్తే నీళ్ళిస్తాం! ప్రాజెక్టులు నిర్మిస్తాం! నదులన్ని మళ్ళిస్తాం!
రాయలసీమ జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని
మళ్ళీ మీ ముందుకొచ్చే నాయకులను నమ్మకండి
శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులకే మళ్ళిమళ్ళీ
శంకుస్థాపన చేయడానికి ప్రయత్నించి
సీమ ప్రజలను పదే పదే మోసగించు
నాయుకులు ఎవరైనా!
పిడికిళ్ళు బిగించండి, ఆగ్రహ జ్వాలలై లేవండి
ప్రాజెక్టుల వద్దనే శిలఫలకాలెత్తండి”[128]

అని సీమ నాయకులు సీమపై చూపించే కపట ప్రేమను వారు ఇచ్చే వాగ్దానాలు, హామీలు మొదలగు వాటిని ఇక నమ్మే పరిస్థితి వుండదని కవి చైతన్యపూరిత తిరుగుబాటు లేవనెత్తాలని చెబుతున్నాడు.

### 4.4.9 దళితుల వివక్షపై చైతన్యం:

జూపల్లి ప్రేంచంద్ ‘అవేద’ కవితలో దళితుల పట్ల వివక్షతను ప్రశ్నిస్తున్నాడు.

“ నేను అంటరాని వాడిని
నా చర్మం ఒలిచి నీ పాదాలకు చెప్పులు తొడిగిన వాడిని
నీ వీధులు వూడ్చి నీ సర్వ కల్మశాన్నీ శుభ్రం చేసిన వాడిని
నీ మైల బట్టలు వుతికి నీ సమస్త మురికినీ వదల గొట్టి

నీ సకల రోగ క్రిముల్నీ అంటించుకొని ఈసురోమని బ్రతుకు
వెళ్ళమారుస్తున్న వాడ్ని
పెరిగిన నీ తల వెంట్రుకల్ని శుభ్రంగా గుండుగీసి
ఒట్టిపొదితో ఫుట్‌పాత్‌ల ప్రక్క నిలబడ్డవాడ్ని
సవాలక్ష జీవనాధారాల్ని ఆశ్రయించి
నీ సకల సంపదలకు కారణమయిన
శూద్రుడ్ని! శ్రామికుడ్ని!!"[129]

అని ఈ సమాజం దళితులను అంటరాని జాతులుగా ముద్రవేసి వారి బతుకులను ఎలా నాశనం చేసిందో కవి చిత్రించాడు.

'సర్పపంజరం' కవితలో దళితులపై మానసికంగా, శారీరకంగా దెబ్బతీసిన విధానాన్ని తెల్పుతున్నాడు.

" మంత్రోచ్ఛారణ చేశాను- నాలుక తెగ్గోశారు
మంత్ర శ్రవణం చేశాను- చెవిలో కరిగించిన సీసం పోశారు
తలక్రిందులుగా తపస్సుకు ఉపక్రమించాను
ఖండ ఖండాలుగ ఖండించారు!"[130]

మానవ సమూహం నుంచి సమాజం నుంచి వెలివేయబడ్డ దళితులు ఒకనాటి కాలంలో చదువు కోవడానికి అర్హులు కారని దూరం పెట్టారు. వేద పండితులు పఠించే మంత్రాలను వినే అవకాశమే లేకుండా చేశారు. ఋషులు ఆచరించే తపస్సులను ఆచరిస్తే ఏవిధంగా ఖండిచారో చూడవచ్చు. మనువాద బ్రాహ్మణీయ భావజాలం ఈ దేశంలో అంటరాని జాతులను ఏవిధంగా పీడించి ఊచకోతలు కోసిందో కవి చిత్రించిన నేపథ్యంలోంచి ఆలోచించవచ్చు. ఈ కోణంలోంచి ఈ దేశంలో సత్య శోధన జరగాలి అని చెబుతూ,

" ఔను నిజం ఇపుడు సత్య శోధన తప్పనిసరి
సమాధుల్ని తవ్వాలి! ఆరామాల్ని తవ్వాలి
మసీదుల్ని తవ్వాలి! మందిరాల్ని తవ్వాలి
నేల మాళిగలో పాతేసిన కాలనాలిక కావాలిప్పుడు
మనుషుల్ని ముఖం భుజం తొడ
పాదాల్లోంచి పుట్టించిన ధర్మం
తానున్న పాదాల మీద నడిచిందా
అయితే అవి నాలుగు పాదాలా

ధర్మం నాలుగు పాదాల మీద నడవటం కాదు
కుంటిన వైనం కావాలిపుడు
రక్తసిక్తం కాని మానవ అవశేషం కావాలిప్పుడు
ఒకే ఒక ఖడ్గ చాలనంతో తెగిపడిన
శంబూకుడి శిరస్సు సాక్ష్యం చెబుతుందేమో చూద్దాం!" [131]

మనువాదం సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థ, ధర్మం ఈ సమాజంలో ఎలా చెలామణి అయిందో తెలుసుకోవాలని ఆ సత్యాన్ని వెలికి తీయాల్సిన అవసరాన్ని గుర్తుచేశాడు.

'కొయ్యకాళ్ళు చిగిర్చేదాకా' కవితలో దళితులు శ్రమ దోపిడికి గురికాబడ్డ దైన్యాన్ని చిత్రించాడు.

" నిజమే
మేము అపరిశుభ్రులం
మీ మురికి మూటలు మోసీమోసీ గాడిదలమయ్యాం
మీ మురికి వీధులు వాడలు ఊడ్చీ ఊడ్చీ చండాలురమయ్యాం
మీ సకల కల్మశాన్ని శుభ్రం చేసీచేసీ అంటరానితనాన్ని
నీటికుండగ మోస్తున్నాం
మా చెమట చుక్కలతో తడిచిన మీ పొలాలు పుష్పించి ఫలించాయే!
మీ పాద సేవకై మా చర్మాలను ఒలిచి
మీ పాదాలను అలంకరించామే!
నిరంతరం మేము చేసిన వెట్టి వ్యర్థమూ, నిరర్థకమై
మీ అహంకారానికీ, అధికారానికీ రాచబాట వేసింది"[132]

అని ఈ సమాజానికి దళితులు చేసిన సేవ, శ్రమ, కష్టాన్ని తెల్పుతూ దళితుల ఆత్మాభిమానంలోంచి కవిత్వీకరించాడు.

'నన్ను మళ్ళీ మాతృ గర్భంలోకి వెళ్ళనివ్వండి' కవితలో దళితుల ఉనికిని తెల్పుతున్నాడు.

" ఇవాళ నా వాళ్ళెవ్వరూ నన్ను ఆనవాలు పట్టలేరు
నా తల్లి వ్రేళ్ళ నుండీ నన్ను తెగ్గోసీ తలలేని మొండాన్ని చేశారు
నిలుచున్న పణంగా నిలువెత్తు వెల్తురు ఊబిలో పాతేశారు
ఈ వేళ నన్ను ఎవ్వరూ ఆనవాలు పట్టలేరు
నరవాసన నరవాసన అంటూ నా చిరునామాకై

నరరూప రాక్షసుల అన్వేషణ!”[133]

అని ఈ సమాజంలో దళితుల ఆనవాళ్ళు కనపడకుండా చేస్తున్నారని వారి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని వారి అస్తిత్వానికి ప్రమాద పరిస్థితి ఏర్పడిందని కవి ఆవేదన చెందాడు.

“ ఇవాళ నా గొంతు నాది కాదు
నా ప్రతిబింబం నాది కాదు
అద్దం ముందు నిలుచున్నానా నా పాదాల కొసకు
ఎవరో నిప్పు అంటించారు
ముఖ ప్రక్షాళన చేసిన నీళ్ళు చిత్రంగా
నా ముఖం మీదికే చిందుతూ...!”[134]

అని దళితులను నామ రూపాల్లేకుండా చేయాలని చూస్తున్న సందర్భాన్ని గుర్తు చేశాడు.

“ నా మాతృగడ్డ మీద నాకు స్థానం లేదిప్పుడు
నా మాతృస్థానం నాది కాకుండా పోయిందిప్పుడు
తల్లిపేగు తెగిన నా ఆత్మీయులందరూ ఎవరికి వారు
అధోముఖంగా పయనమయ్యారు” [135]

ఈ సమాజంలో దళితుల స్థానం, వారి మనుగడ ప్రశ్నార్థకమై నిలువ నీడలేక పోతోందని కవి వ్యక్తీకరించిన సందర్భంలోనిది కవిత.

బిక్కి కృష్ణ ‘చెప్పులు తిరగబడ్డాయి’ కవితలో దళితుల కులవృత్తి అయిన చెప్పులు కుట్టే నేపథ్యంలోంచి మాట్లాడతాడు.

“ మీ పాదాల్లో రగతం చిప్పిలకుండా
మీకు రక్షణ నిచ్చింది చెప్పులే గదా
మీ తాత ముత్తాతల కాలం నుండి
మీ పాదాల వద్దనే పడి వుంటూ
మీకు మీ కొడుకులకు రక్షణ ఇచ్చింది చెప్పులే గదా!
మరి చెప్పులు అంటరాని వెలా అయ్యాయి?
ఇప్పుడు చెప్పులకు చైతన్యం వచ్చింది సుమా
ఇంకా మీ కాళ్ళ క్రిందే నలిపేయాలని ప్రయత్నిస్తే
ఇక ముందు పశువుల తోలుతో కాదు

మీ తోలుతో చెప్పులు తయారవుతాయి

తస్మాత్ జాగ్రత్త"[136]

దళితులను ఇన్నాళ్ళుగా దోపిడి చేస్తూ వచ్చారు. ఇకపై దళితులను అణగ ద్రొక్కాలని ప్రయత్నిస్తే తిరుగుబాటు తప్పదని కవి హెచ్చరిస్తున్నాడు.

### 4.4.10 ఉగ్రవాదం వ్యతిరేకత పట్ల చైతన్యం:

యక్కలూరి శ్రీరాములు 'విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా' అదే దీర్ఘ కవితలో ఉగ్రవాదులు, తీవ్రవాదులు సృష్టించే విధ్వంసాలను ప్రతిఘటించాడు.

" ఖరీదేలేని మనిషి చావుకు

పగలయితేనేం! రాత్రయితేనేం!

అక్షరధాం అయితేనేం!

అయోధ్య అయితేనేం!

అంతర్జాతీయ వాణిజ్య కేంద్రమయితేనేం!

అనంత విధ్వంసానికి తరతమ భేదం లేదు కదా!

పాకిస్తాన్‌లో

మరియట్ హొటలయితేనేం?

హిందూస్తాన్‌లో

తాజ్ హొటలయితేనేం!

అగ్నికి ఎక్కడైనా మండే స్వభావమే కదా!"[137]

ప్రపంచంలోనూ, మన దేశంలోనూ ఉగ్రవాదులు సృష్టించిన భీకర విధ్వంసాలను తెలియజేస్తున్నాడు.

" రామ్‌లీలా విగ్రహమయితేనేం?

మక్కా మసీదు ప్రార్థనా స్థలమయితేనేం?

పార్లమెంట్ అయితేనేం?

ప్రజా సమూహమైతేనేం?

ఆగని విస్ఫోటనానికి

హిందూ ముస్లీం మత భేదం లేదుకదా!

కాశ్మీరు అయితేనేం?

గుజరాత్ అయితేనేం?

ప్రాణాలు తీయడానికి ప్రాంతాలతో పని లేదు కదా!"[138]

విధ్వంసాలు, అల్లర్లు సృష్టించే వారికి ఏ ప్రాంతం అయితేనేం ఏ స్థలాలు అయితేనేం మనుషుల ప్రాణాలు తీయడమే దాని లక్ష్యం అని కవి తెల్పుతున్నాడు.

" తారీఖులు ఏమయితేనేం?
మాసమేదయితేనేం?
ద్రోహం వాడి క్యాలండరయినపుడు
పాకిస్తాన్ అయితేనేం?
హిందుస్తాన్ అయితేనేం?
విద్రోహం వాడి జండరయినప్పుడు
మనం నిలుచున్న కాళ్ళ కింద తివాచీని
సర్రున లాగితే
క్రింద పడినా సరే!
నేల ఆసరాగా మారుతుంది
నిలుచున్న నేలనే లాగితే మనిషికి దిక్కేది
మృత్యువే కదా! దక్కేది!"[139]

ప్రపంచంలోని ఏ ప్రాంతంలోనైనా ఏ కాలంలోనైనా సరే విద్రోహం చేయడమే దాని పని. విధ్వంసం సృష్టించడమే వాని పని. అలాంటి వానికి మనుషుల ప్రాణాల విలువు ఏం తెలుసు? అని కవి ప్రశ్నిస్తున్నాడు.

" హెూటల్ తాజ్‌లో
ముంబై రైల్వే ఫ్లాట్‌ఫార్మ్‌లో
గోకుల్ ఛాట్‌లో
మరియట్ హెూటల్‌లో
నింపాదిగా తింటున్న వారి పాత్రలన్నీ
నిముషాల్లో విషంతో నిండిపోతాయి
సజీవులందరూ నిర్జీవులవుతారు
ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి
మరెక్కడో ప్రయాణించాలనుకునే జీవితాలు
నెత్తుటి మడుగుల్లో

అడుగే లేని పాడుబాయిలో అడుగు వేయగానే

అథః పాతాళానికి దిగబడి పోతాయి

రక్త మాంసాలు బూడిద కుప్పలుగా మారిపోతాయి

ఊహించని మారణ హోమంలో

మరణించిన వారిని చూసి

బ్రతుకు నీడుస్తున్న

మనుషుల ఆలోచనలన్నీ

సమాధానాలు దొరకని ప్రశ్నలుగా

జీవితాంతాం మిగిలిపోతాయి."[140]

ముంబైలోని తాజ్‌హోటల్ మొదలుకొని రైల్వే ప్లాట్‌ఫార్మ్‌లు వంటి రద్దీ జనాభా గల ప్రదేశాలు, గోకుల్ ఛాట్‌లు, లుంబినీ పార్క్‌లు లాంటి ప్రాంతాల్లో ఉగ్రవాదుల బాంబుదాడుల వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇలాంటి ఉగ్రమూకల చర్యల వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరిగి సమస్త మానవాళికి పెను సమస్యగా ఉగ్రవాదం నిలబడుతోంది.

" ఒక తుపాకి

వందమందిని

పొట్టన పెట్టుకున్నా

ఏదో ఒక రోజు

ట్రిగ్గర్ నొక్కిన చేతిని

మూసివేస్తుంది"[141]

ఎంతోమందిని తుపాకి ద్వారా చంపి ప్రాణాలు తీసిన ఈ ఉగ్రవాదులు ఏదో ఒక రోజు వారిని అంతం చేస్తుందని కవి సూచిస్తున్నాడు.

" అవును!

ఆయుధం విసర్జించాలి!

ఎందుకంటే

అది జాతిని నిర్జీవం చేసే మలిన పదార్థం

ప్రేమను సముపార్జించాలి!

ఏలంటే

అది ఆత్మామృతంలో చేసిన యదార్థం”[142]

అని హింసను సృష్టించే ఆయుధాన్ని విడనాడి ప్రేమతో మెలిగి శాంతిని చేకూర్చాలని కవి ప్రభోధిస్తున్నాడు.

## 4.4.11 ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం- చైతన్యం:

1980వ దశకం చివరి కాలం 1990 దశకమంతా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. తూర్పు ఐరోపాతో పాటు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలైన ఇండియా, వియత్నాం, పెరూ, మొరాకో, క్యూబా వంటి దేశాల్లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. సుస్థిర ఆర్థిక వృద్ధిని త్వరితగతిన సాధించాలనే లక్ష్యంతో ప్రపంచంలోని అనేక దేశాలు ఆర్థిక సంస్కరణల వైపు మొగ్గు చూపాయి. ఆర్థిక సంస్కరణల అమలుతో మెక్సికో, చిలీ, స్పెయిన్ వంటి దేశాలు మెరుగైన ఫలితాలు సాధించాయి.

1991లో భారతదేశంలో పి.వి.నరసింహారావు ప్రభుత్వం ఎల్.పి.జి. పేరుతో నూతన ఆర్థిక సంస్కరణలు అమలు చేసింది. ఈ ఆర్థిక సంస్కరణలను మూడు రూపాల్లో అమలు చేసింది. అవి: సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ. ‘గ్లోబలైజేషన్’ అనే ఆంగ్లపదానికి సమానంగా తెలుగులో ప్రపంచీకరణ అనే పదాన్ని తెలుగులో ఉపయోగిస్తున్నాము. ప్రపంచీకరణ అంటే అంతర్జాతీయంగా వస్తువులు, సేవలు, మూలధనం, సాంకేతిక పరిజ్ఞానాలపై ఉన్న ఆంక్షలను తొలగించి సమాచార, సాంకేతిక విప్లవం ద్వారా ప్రపంచాన్ని గ్లోబల్ విలేజ్‌గా మార్చడం. ప్రపంచంలోని ఏ ప్రాంతంలోని ఏ వస్తువైనా వినియోగ దారులందరికీ అందేలా చూడడం, ఆర్థికాభివృద్ధి ఫలితాలను ప్రపంచంలోని అన్ని దేశాలకు లభించేటట్లు చేయడం ప్రధానమైనవి. నేటి వర్తమాన సమాజంలో ప్రపంచీకరణ ప్రభావం విపరీతంగా పెరిగిపోయింది. ప్రపంచీకరణ ఫలాలు, దాని వినాశకాలు దాని విపరీత పరిణామాలను నేటి కాలంలో మనందరికి అనుభవంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ప్రపంచీకరణ ప్రభావం సమాజంలో అన్ని రంగాలపై పడింది. “అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందని దేశాలకు అప్పులిచ్చే నెపంతో, అభివృద్ధి నెపంతో అమెరికా తన సహస్ర బాహువులతో ఆక్రమించుకొని ఆయా దేశాల స్థానిక సంస్కృతులను, జీవ వైవిధ్యాన్ని చంపెయ్యడం, ఆయా దేశాల రాష్ట్రాల ప్రభుత్వాలను తోలుబొమ్మలుగా, కీలు బోమ్మలుగా మార్చుకుని పెత్తనం చెయ్యడమే ప్రపంచీకరణ” అని రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

“ ప్రపంచీకరణం, ఎలక్ట్రానిక్, మాధ్యమాలు, సమాచార విజ్ఞానం భిన్న దేశాలకు, జాతులకు మధ్య దూరాన్ని తగ్గిస్తున్నాయి. మరో వైపు భిన్న దేశాల మధ్య, ప్రాంతాల మధ్య, వర్గాల మధ్య దూరం పెరుగుతున్నది. ఆర్థిక ఉదారీకరణం ‘దేశాన్ని చర్మం వొలిచిన సాకీ’ని చేస్తున్న దంటాడో కవి. ప్రపంచీకరణం మనిషి జీవితాన్ని మరీ యాంత్రికం చేసి మానవ సంబంధాలను విచ్ఛిన్నం చేసింది. బహుళ జాతి సంస్థలు

ఆర్థిక గుత్తాధిపత్యం 'బతుకును మార్కెట్ సరుకు'ను చేసింది. వినియోగదారీ సంస్కృతిలో మనిషి సృష్టించిన సరుకు మనిషిపైన పెత్తనం చలాయిస్తున్నది. మార్కెట్‌ను పదిలం చేసేదిగా సాంస్కృతిక సామ్రాజ్యవాదం విస్తరిస్తున్నది. మార్కెట్ తత్త్వవాదం, మత తత్త్వవాదం జతకట్టుకొని నడుస్తున్నాయి. మానవ జీవితంలో అనిశ్చితత, తాత్కాలికత, అభద్రతా భావం పెరుగుతున్నాయి. ప్రపంచీకరణం కొత్త మానసిక అనుభవాల్ని సృష్టించింది."[143] ఈ సమాజాన్ని, వ్యవస్థను ప్రపంచీకరణ రూపం సమూలంగా మార్చివేసిందని చెప్పవచ్చు.

సాహిత్యంలో అన్ని ప్రక్రియల్లోనూ ప్రపంచీకరణ ప్రతిఫలనం కనిపిస్తుంది. స్త్రీ, దళిత, ముస్లిం, ప్రాంతీయవాద సాహిత్యాలలో ప్రపంచీకరణ ప్రభావ చిత్రణ కనిపిస్తుంది.

బిక్కి కృష్ణ 'గ్లోబల్ హంటర్' అనే కవితలో ఇలా అంటాడు.

" వాడు నిన్ను మోసం చేస్తున్నాడు
నమ్మించి మరీ మోసగిస్తున్నాడు
ఆధునికత పేరుతో ప్రపంచ వ్యాప్తంగా
వివిధ దేశాల చెట్ల కొమ్మలపై
స్వేచ్ఛగా జీవించే!
మానవ విహంగాలపై వల విసిరాడు
వాడే అమెరికన్ కిరాతకుడు
వాడు ఎన్నో అవతారాలెత్తి
ప్రపంచ ప్రజలను మోసగిస్తూనే ఉన్నాడు"[144]

అమెరికా లాంటి సామ్రాజ్యవాద దేశాల ఆలోచనల్లోంచి ప్రపంచీకరణ అనే విష సంస్కృతి పుట్టుకొచ్చి ప్రపంచ మానవాళిపై పడగ విప్పిందని అది విశ్వరూపం చూపిస్తోందని కవి చెబుతున్న దృశ్యం. ఇదే కవితలో వ్యాపార విష సంస్కృతి ఎలా వ్యాప్తి అవుతుందో కవి తెల్పుతున్నాడు.

" వాడు మొన్న ఒక వ్యాపారిగా వచ్చాడు
వలస దేశాల ప్రజల దేహాల్లో!
వాడి మురికి సంస్కృతిని ఇన్‌జెక్ట్ చేసి వెళ్ళాడు
మన దేహాల్లో నరాల్లో మెదళ్ళలో
వాడి రక్తం వాడి సంస్కృతి వాడి భాష
వాడి ప్రవర్తననే మిగిల్చాడు" [145]

ప్రపంచీకరణ విష ప్రభావాన్ని మానవ సమూహంపై రుద్ది ఊబిలోకి నెట్టివేసే ప్రయత్నం జరిగింది.

" నేడు వాడు కబందుడి వేషం వేశాడు
గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ అనే రెండు చేతులతో
ప్రపంచ దేశాల పేదల బతుకులను నలిపేస్తున్నాడు
మల్టినేషనల్ కంపెనీలవాడి గోళ్ళతో
నిరుపేదల గుండెలు చీల్చి వారి వేడి రక్తాన్ని
ఆయా దేశాల జెండాలకు పూసి
దేశాధినేతలతో సెల్యూట్ చేయిస్తున్నాడు"[146]

బహుళ జాతి కంపెనీలు స్వేచ్ఛగా ఈ దేశంలోకి వచ్చి మార్కెట్‌ను శాసించే స్థాయికి చేరుకున్నాయి. పేద, మధ్యతరగతి, సామాన్యుల జీవితాలు కోలుకోలేని విధంగా తయారయ్యాయి.

" తన పేటెంట్ ఉక్కు పాదాలను
మన సహజ వనరులపై బలంగా మోపుతున్నాడు
సహస్ర వృత్తులను సమస్త చిహ్నాలను కాలరాస్తున్నాడు
వాడు గ్లోబలైజేషన్ పేరుతో
కొత్త కొత్త యంత్ర భూతములను ఉసి గొలిపి
దేశ దేశాల రైతుల కార్మికుల నోళ్లు గొట్టి
ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నాడు
వాడు ఇవాళ అపరచాణక్యుడి వేషం ధరించాడు
'ప్రపంచబ్యాంకు' అన్న సరికొత్త అర్థశాస్త్రాన్ని రచించాడు
అప్పుల అగ్ని గుండంలోకి కోట్లాది ప్రజలను త్రోసి
రాజ్యాంగం సాక్షిగా చట్టబద్ధంగా సమాదులు గడుతున్నాడు"[147]

ఈ దేశ సహజ వనరులపై ఆధిపత్యం సంపాదించి పేటెంట్ హక్కులను పొంది వ్యాపారాన్ని విస్తృతం చేసుకుంటున్నారు. ప్రపంచీకరణ ముసుగులో అధునాతన పరికరాలు ప్రవేశపెట్టి రైతులకు, కార్మికులకు పనిలేకుండా చేసింది.

ప్రపంచ బ్యాంకు నిబంధనల పేరిట కొత్త కొత్త నియమాలు, నిబంధనలు సృష్టించి ఈ దేశ ప్రజలను అప్పుల ఊబిలోనికి దించేశాయి. కవి ఇలాంటి వికృత చర్యలను కవిత్వీకరించాడు.
జి. వెంకటకృష్ణ 'గ్లోబల్ వైరస్' కవితలో ప్రపంచీకరణ పల్లెలు, నగరాలపై వ్యాపించి కబళించిన వైనాన్ని

చిత్రించాడు.

“ నా పల్లె పల్లె మీదా కనిపించని మేఘమొకటి
నగరాల ఎదపై వ్యాపించిన మేఘమొకటి
కురిసే మేఘం కాదది
నా పొలాలనూ కర్మాగారాలను
నా సమస్త సంబంధాలనూ
మట్టివేళ్ళ పునాదులను విధ్వంసం చేసే
పిడుగులా అది
మెరిసి మైమరపించే కుతంత్రమది”[148]

అని ఈ ప్రపంచాన్ని చుట్టిముట్టిన పెనుభూతంలా కవి పేర్కొన్నాడు. ప్రపంచీకరణ ప్రభావం ఈ సమాజంపై ఎలాంటి దుష్ప్రభావాన్ని చూపుతుందో కవి తెల్పుతున్నాడు.

“ ప్రపంచాన్ని గల్లీ చేసిన మ్యాజిక్
నా పల్లె నా పట్నానా వికసించిన మెరికల్ని
అమెరికాకు చేర వేసి డాలర్లకు అంటగడుతున్న
ప్యాకేజ్
టెర్మినేటర్ తాలుతో
పత్తి రైతు మెడలకు వురితాళ్ళ ఇంపోర్ట్
ఇక్కడి తిండి బట్టనే కాదు
గాలి నీరూ మట్టి అంతా తనకే పేటెంట్
ఇపుడు కన్నీటి ధర మంచినీళ్ళంత!
ఇపుడు సంస్కరణలంటే భూమినీ, శ్రమనూ
కార్పొరేట్ చేయడమే నట!
కాదన్నారా
ఉద్యమించారా
నీ ముఖమ్మీద ఓ లేబిల్
“టెర్రరిస్ట్”!
తెస్తారు పోటోయాక్ట్”[149]

సామ్రాజ్యవాద దేశాలు ప్రపంచాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొని నడిపిస్తున్నాయి, శాసిస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలు పుట్టుకొచ్చి వ్యాపారానికి సరికొత్త నిర్వచనం ఇచ్చి వ్యాపార సంస్కృతిని మార్చి వేశాయి. కార్పొరేట్ సంస్థలు చెప్పినట్లే ఈ దేశం నడుచుకోవాలి.

“ కార్పొరేట్ వ్యాపార తంత్రపు వ్యూహం కింద
విస్తృతమవుతున్న వికృత రూపం
చెమట రక్తం మేటలు పడుతున్న రాయలసీమ
అంగాంగాలూ తెగిపడుతున్న తెలంగాణ
అత్యాశల అహంకారీతనాల కోస్తాసీమ
కరువూ ఫ్యాక్షన్
ఎన్‌కౌంటర్
రొయ్యల చెరువూ
నా ముఖానికి తగిలించిన
అనాకారీ తనపు పరాకాష్ట
ఇపుడు
కూడూ గుడ్డా లేనివాడి నెత్తి మీద కూడా
మోయలేనంత అప్పు
గ్లోబల్ రోలర్ కింద నలిగిపోతున్న పేవ్‌మెంట్”[150]

కార్పోరేట్ సంస్థల వ్యాపార ముసుగులో ఈ సమాజం బందీ అయిపోయింది. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి వెళ్ళినా దాని విష ప్రభావం కనిపిస్తుంది.

కె.బాబ్జి ‘యుద్ధం అనివార్యమైన చోట’ కవితలో సామ్రాజ్యవాద దేశాల స్వభావాన్ని తెల్పుతున్నాడు.

“ దశాబ్దాల పాటు ముస్లిం దేశాలను
నిలువునా చీల్చిందెవరు? ఎందుకు?
ల్యాండ్ లీజు కావచ్చు
ఆయుధాల వ్యాపారం కావచ్చు
నీ మార్కెట్ విస్తరణ కావచ్చు
కారణం ఏదయితేనేమి
నువ్వు నిప్పు రాజేయని దేశం ఏదైనా ఉందా?

భయపెట్టడం, బెదిరించడం తప్ప
ప్రపంచ సమస్యలలో
ఏదైనా పరిష్కరించావా?"[151]

సామ్రాజ్యవాద దేశాలు చిన్న చిన్న దేశాలపై గుత్తాధిపత్యం చేస్తూ తన మార్కెట్‌ను విస్తృతం చేస్తోంది.

" మానవీయ సంబంధాలను
మార్కెట్ సంబంధాలుగా
మానవత్వానికి
డాలరు ముఖం తగిలించెందెవరు?"[152]

ఈ సమాజంలో మనిషి మనిషికి మధ్య సంబంధాలు తెగిపోయి ధనమే ప్రపంచంగా తయారు చేసింది ఈ ప్రపంచీకరణ. కవి ఈ విషయాన్నే ప్రశ్నించాడు.

ప్రపంచీకరణ నేపథ్యంలో దేశీయ కులవృత్తులు కనుమరుగై పోయాయి. బతుకు తెరువు కోసం చేసే వృత్తులు తమ బతుకుని నిలబెట్టలేని స్థితిలో నేటి వృత్తిదారులు దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారు. టి.రాజారాం 'అతడే' దీర్ఘ కవితలో కుమ్మరి వృత్తిని గూర్చి ఇలా అంటాడు.

" మట్టిని కాళ్ళతో తొక్కి తొక్కి
సారెను తిప్పి, తిప్పి అతడే
వొక తడిసిన మట్టి ముద్దవుతున్నాడు
లిబరలైజేషన్ కత్తివాదరకు
కుత్తుక తెగిన జీవిలా కొట్టుకునే
అతడి గుండె
చేజారిన కుండలా ముక్కలై
కవితకు ప్రతీకయ్యింది
మార్కెట్ ఎకానిమీలో
నాణ్యమైన అమ్ముడు పోని కుండే
అతడి పోరాటం
మట్టిని అతడు మరిచి పోవచ్చు
సారెను అతడు స్మరించుకోక పోవచ్చు
కుండలకు కాలం చెల్లొచ్చు

అయితే ఏదో వొక రోజు మాత్రం

అతడి చేతిలో తిరిగిన సారె

చరిత్రను తిరగ తిప్పుతుంది"[153]

సరళీకృత ఆర్థిక విధానాలు ఈ దేశంలోకి ప్రవేశించిన తర్వాత ప్రైవేటు రంగం దాని వ్యాపారం బాగా విస్తరించింది. కాలాలు మారే కొద్దీ సమాజం అభివృద్ధి చెందే కొలదీ కొత్త కొత్త ఇంటి సామాగ్రి పరికరాలు తయారయ్యే కొద్దీ మట్టితో తయారైన వస్తువులకు కాలం చెల్లిపోయింది. కుమ్మరి చేతిలో తిరిగిన సారె దాని ద్వారా రూపు దిద్దుకున్న మట్టి వస్తువులు చరిత్రను తిరగ రాస్తాయని కవి ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నాడు. దళితుల కులవృత్తి అయిన 'చెప్పులు కుట్టే' వృత్తి నేటి కాలంలో ఏ విధంగా ధ్వంసం అయిందో తెల్పుతున్నాడు.

" మన పాదాలకు అద్భుత అందాల్ని

ఆవిష్కరించే అతడి స్వీయ ప్రతిభ

ప్రపంచీకరణ సమ్మెట దెబ్బకు

వొంగి పోయిన మేకు అయ్యింది

అతడి తలమీద నిటారుగా తెరుచుకున్న

గొడుగు

నడి వీధుల్లో నల్ల జెండా మొలిచినట్టుంది

ఆధునికా పాదుకా ప్రపంచంలో

అతడికీ అతడే వొక మూలపడ్డ పనిముట్టు"[154]

మాదిగల కులవృత్తి ఏవిధంగా మూలన పడిపోయిందో కవి తెల్పాడు. మనుషుల పాదాలకు అద్భుతంగా చెప్పులు కుట్టే అతని ప్రతిభ నేటి కాలంలో గిరాకి లేక అతను కుట్టిన చెప్పులు తొడిగే వారు లేక అతని జీవితం మూలన పడ్డ పనిముట్టులా తయారైంది అని చెప్పడం ప్రపంచీకరణకు నిదర్శనం.

రాధేయ 'మగ్గంబతుకు' దీర్ఘ కవితలో చేనేత బతుకులు నేటి కాలంలో ఎలా తయారయ్యాయో తెల్పుతున్నాడు.

" ప్యాకేజీ స్కీములతో

పవర్‌లూమ్స్ లాభపడితే

టెక్స్‌టైల్ పార్కులతో

బహుళ జాతి కంపెనీలు

బలపడతాయి!

మా శ్రమజీవన సౌందర్యం
షోరూముల్లోనూ
ఆర్ట్ గ్యాలరీల్లోనూ
మీకు కనువిందు చేస్తుంది!
రేపటి మా మనవళ్ళు
మనవరాళ్ళు
చేతివృత్తుల శిథిలాల్లో
మా బతుకు రాట్నాలను చూసి
మురిసిపోతారు
దేశ విదేశీ పర్యాటకులు
సందర్శించడానికి
మా పనిముట్లన్నీ
మ్యూజియంలో భద్రపరుస్తామంటుంది సర్కారు"[155]

నేటి ప్రపంచీకరణ ప్రభావం వల్ల బహుళజాతి కంపెనీలు వచ్చి పెట్టుబడులు పెట్టి పవర్‌లూమ్స్ వంటి యంత్ర పరికరాలు తయారు కావడం వల్ల చేనేత మగ్గాలు మూలన పడిపోయే స్థితికి వచ్చాయి. ఇలాంటి విపరిణామాల వల్ల చేనేత వృత్తి నశించి భవిష్యత్తులో మ్యూజియంలో చూడడానికే చేనేత పనిముట్లు పనికి వస్తాయని కవి ఆవేదన చెందుతున్నాడు.

" ప్రపంచీకరణ నీలినీడలు
మా చేనేత రంగాన్ని చేరి
చెదలు పట్టి తొలిచేస్తున్నాయి!
బహుళ జాతి కంపెనీలు బలపడి పోయి
శ్రామిక వర్గం చతికిలబడి పోయింది
ప్రైవేటు మిల్లుల ఆధిపత్యం
పూటకూలి కార్మికుల
పొట్టలు కొడుతోంది
మరమగ్గాల బ్రహ్మరాక్షసి
మా మగ్గం బతుకుల్లో

కోరలు చాపి విషం చిమ్ముతోంది!"[156]

చేనేత రంగం ఏవిధంగా కొట్టుమిట్టాడుతోందో కవి తెల్పుతున్నాడు.

" ఈ విధ్వంస విషాదానికి
'పల్లవి' ప్రపంచీకరణది
'చరణం' సామ్రాజ్యవాదానిది
'పాపం' పాలనా యంత్రాంగానిది!" [157]

ప్రభుత్వ పాలనా యంత్రాగాల లోపాల వల్లే ఇలాంటి దుస్థితి వచ్చిందని కవి చిత్రించాడు.

బి.సూర్యసాగర్ 'వాడు' అనే కవితలో సామ్రాజ్యవాది యొక్క స్వభావాన్ని విడమర్చి చెబుతున్నాడు.

" వాడికి యుద్ధం కావాలి
ఆకాశమంతా వాడికే
భూగోళమంతా వాడికే
సముద్రాలు చమురు బావులూ
సకల దేశాల సకల వనరులూ
విశ్వాంతర గ్రహాలూ
అన్నీ వాడికే
దేశ దేశాల ప్రజల బ్రతుకులు
వారి నివాసాలు, పంట పొలాలు
వారి కలలు వారి కోరికలు
వారి సంతోష సమయాలు
...............................
వాడు
ప్రపంచ ప్రజల బతుకులు బుగ్గి చేస్తాడు
శ్మశాన భస్మరాశులను
ముక్క పొడుం చేసుకుంటాడు
వారి సంస్కృతినీ చరిత్రనూ
రక్త నాలుకతో వెక్కిరిస్తాడు"[158]

ఈ ప్రపంచంలోని దేశాలన్నిటి మీద, వనరుల మీద ఆధిపత్యం ఉండాలనీ దోపిడి చేయాలని సామ్రాజ్యవాద దేశాలు ఆలోచిస్తాయి. దాడులు, యుద్ధాలతో వివిధ దేశాలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని ఆలోచిస్తాయి. ఇలాంటి వికృత ఆలోచనా స్వభావాలను కవి చూపించాడు. సామ్రాజ్యవాదం యొక్క పరిణామ క్రమంలో పరాకాష్ట దశ ప్రపంచీకరణ. నేటి కాలంలో ప్రపంచీకరణ యుగ కవిత్వంలో వాడు అంటే సామ్రాజ్య వాదికి ప్రతీకగా వాడబడుతోంది.

“ మన సంస్కృతితో
మన చరిత్రతో
మన ఆగ్రహంతో
మన సమిష్టి జీవన లాలసతో
వాడిపై యుద్ధం చేద్దాం
వాన్ని సమాధి చేద్దాం
వీడు మానవాళి శత్రువు
నికృష్టంగా చచ్చాడు
అని సమాధి ఫలకం బిగిద్దాం”[159]

అని సామ్రాజ్యవాదానికి ముగింపు పలకాలని కవి ప్రజల్ని సంఘటిత పరచడం, పరిష్కార మార్గం చూపించడం ఈ కవితలో చూడవచ్చు.

కెంగార మోహన్ ‘విన్యాసం’ అనే కవితా సంపుటిలో నేటి ప్రపంచీకరణ పరిణామ క్రమాన్ని వాటి వికృత రూపాలను కవిత్వంలో చక్కగా చూపించాడు. ‘కంచంలోని బువ్వ’ కవితలో ఇలా అంటాడు.

“ పొలం గట్ల సింగారం
అదృశ్యమైంది
అమ్మలక్కల పని పాటలు
పాడె గట్టాయి
పల్లె పనుల్ని యంత్రాలు
మింగేశాయి
కలుపు తీయడం
కోత కోయడం

కుప్ప నూర్చడం యంత్రమే

.................................

రైతు ప్రాణం తీసి,

కూలి గొంతు కోసి

తన బొజ్జ నింపుకున్నాడు

కంచంలో బువ్వ లాగేసి

ఫాస్టుఫుడ్డు తినమంటే ఎలా?"[160]

నేటి కాలంలో ప్రతి గ్రామాలలోనూ వ్యవసాయపు పనులు చేయడానికి సాగు చేసిన పంటలను శుభ్రం చేయడానికి అధునాతన యాంత్రాలు, పరికరాలు వచ్చి రైతులకు, కూలీలకు పని, ఉపాధి లేకుండా పోయింది. పల్లె కూలీల పనులు, మహిళా కూలీల పని పాటలు, ఆ కూలీ శ్రమ సౌందర్యాలు అన్నీ అదృశ్యమైపోయాయని కవి వ్యక్తీకరించాడు.

'ఆరోభూతం' కవితలో ప్రపంచీకరణ విష సంస్కృతిని తెల్పాడు.

" రోకట్ల నుండి కుక్కర్ల దాకా

చందనం నుండి గార్నియర్ దాకా

లంగా ఓణి దగ్గర్నుంచి

మిడ్డీ స్కర్టు దాకా అభివృద్ధి పరిచాడు

ఇది నాగరికత, ఇదే సంస్కృతి అంటూ

గ్లోబల్ పాఠాలు కర్ణభేరి బద్దలయ్యేలా

వినిపిస్తున్నాడు

పట్టెడన్నం వద్దు పాస్టుపుడ్డు తినమంటాడు

అమ్మ భాష వద్దు ఆంగ్ల భాష ముద్దంటాడు"[161]

వంట సామాగ్రి మొదలుకొని స్త్రీ పురుషుల అలంకరణ సామాగ్రి మరియు వస్త్రాలు అన్నీ ఈ ఆధునిక కాలంలో ఎక్కువగా తయారై మార్కెట్లోకి వస్తున్నాయి. ఈ ప్రపంచీకరణ యుగంలో మన సంస్కృతి అంతా కల్తీలాగా మారిపోయింది. 'భాషాసోడా @ సోడాహబ్' కవితలో భాషా సోడా కొట్టు ఎలా అదృశ్యమైందో తెల్పుతున్నాడు.

" మీటనొక్కితే

ఎన్నో రంగులు, రుచులు

సహజ రుచుల్ని
యాంత్రిక రుచి శాసిస్తోంది
గాలిసోడా శబ్ధం
గాలిలో కలిసి పోయింది
అంతా క్షణాల్లో
అన్ని ఒకే చోటు
ఒకేసారి ప్రత్యక్షం
లెమన్, నన్నారి
మసాలా సోడా
ఏది కానరాదు
అన్నింటిని సోడాహబ్
గటగటా తాగేసింది
.......................
సంత మార్కెట్టులోని
భాషా సోడా
'హబ్' అయ్యింది
భాషా అలానే ఉన్నాడు
కొడుకేమో తలకు
ఎర్ర రంగేసుకున్నాడు
చెవికొక రింగు
చేతికొక రబ్బరు తొడుగు
ఎంత స్టైలో..........
నిజంగా ఎంతమార్పు"[162]

మార్కెట్టులో గాలిసోడా అమ్ముకునే ఒక చిల్లర వ్యాపారస్తుడు కాలక్రమంలో అతని సోడా కొట్టు కనుమరుగై దాని స్థానంలో ఒక పెట్టుబడిదారికి ప్రతిరూపమైన యంత్ర పరికరం వచ్చి ఎలా ఆక్రమించిందో కవి తెల్పుతున్నాడు. సహజంగా ప్రకృతిలో చెట్ల నుండి వచ్చిన పండ్లు వాటి ద్వారా తయారు చేసే జ్యూస్‌లు కాకుండా రసాయనాలు, పండ్ల రకాల పౌడర్‌లతో తయారైన జ్యూస్‌లతో అనారోగ్యాన్ని కొని తెచ్చుపెట్టు

కుంటున్నాం. భాషా సోడా కొట్టు స్థానంలో 'సోడాహబ్' ఆక్రమించిన విధానాన్ని, భాషా కొడుకు నేటి ఆధునిక కాలానికి ప్రతిరూపంగా ఎలా వస్త్ర, వేష ధారణను మార్చుకున్నాడో కవి తెల్పాడు.

'రోలు...రోకలి...రోబో....' కవితలో ఇలా అంటాడు.

" షడ్రుచులనిచ్చే రోలు
పాతాళంలో ఇల్లు కట్టుకున్నది
రుబ్బిన కొద్దీ రుచీ...
మాయా మిక్సీ...
ఎన్ని వేసినా, ఎంత తిప్పినా
రవ్వంత సంతృప్తి లేదిపుడు
...........................
ఇంట్లో, వీధుల్లో
రోలు, రోకలి చేసే సందడి
ఘోర తపస్సు చేసినా
కానరాదు
అన్నమైనా, పప్పు పచ్చడైనా
రోబో చేసే రోజొచ్చింది
ఆయువు క్షీణిస్తేనేం
ఆకలి తీరితే చాలు..."[163]

కాలం మారే కొద్దీ సమాజం ఆధునీకరణ చెందే కొద్దీ పాతతరం నాటి వస్తువుల స్థానంలో కరెంటుతో నడిచే పరికరాలు వచ్చాయి. నేటి సాంకేతిక పరిజ్ఞాన కాలంలో ఏ పనైనా రోబోతో చేపించుకునే పని వచ్చిందని కవి తెల్పుతున్నాడు. 'ఆడతనం' కవితలో స్త్రీ మాతృత్వాన్ని వ్యాపారంగా మార్చుకోవడాన్ని చిత్రించాడు.

" అమ్మే అమ్మకానికొస్తే
మాతృత్వం అద్దెకు రాదా?
ఆకలి దప్పులకు పరిష్కారం
'సరగసీ' అయినపడు
సంఘం వేసే ప్రశ్నలు

కర్ణభేరిలోకి వెళ్ళవు

పెరిగేదెవరైనా

పెంచేది తల్లి తనమే ఐనా

అనుబంధం తాత్కాలికమే కదా?

కారణ శుక్ర కణ మెవరిదైనా

అండోత్పత్తి చేసేది

చేయించేది

ఆధునిక విజ్ఞాన విజయమే కావచ్చు

మమకారాన్ని హత్య చేయడం కాదా?

నవ మాసాలు మోస్తున్నది

శిశువును కాదు

విశృంఖల రాక్షస గ్లోబల్ బిడ్డను

నోటుకు విలువలు

అమ్ముడు బోతుంటే

ఆడతనం అంగడి సరకవ్వదా?"[164]

'సరోగసి' అనే విధానం ద్వారా స్త్రీ గర్భాన్ని అద్దెకు తీసుకొని బిడ్డకు జన్మనివ్వడం జరుగుతుంది. ఒక స్త్రీ తన అమ్మతనాన్ని వ్యాపారంగా చేసుకొని మాతృత్వాన్ని అద్దెకు ఇవ్వడం వల్ల తల్లి తనాన్ని, అనుబంధాన్ని, మమకారాన్ని ఆధునిక సాంకేతిక విజ్ఞానం ద్వారా తల్లి నుంచి వేరు చేయడమే కదా అని కవి ప్రశ్నిస్తున్నాడు. ఆడతనాన్ని అంగడి సరుకుగా మార్చుకొని డబ్బు సంపాదించే పద్ధతులను కవి ఎండగడుతున్నాడు. సింగార సుబ్బరాయుడు' ప్రపంచీకరణ ఆకర్షణ లాస్యం' కవితలో ఇలా అంటున్నాడు.

" ప్రపంచీకరణ ఆకర్షణ లాస్యం

పరవంచన వంచన దాస్యం

తిమింగలాల తిమురు విన్యాసం

మెతుకు కరువు బ్రతుకు జోస్యం

ప్రపంచ బ్యాంకు విచిత్ర విశ్లేషణం

కీడెంచి, ఊరించి ఇచ్చే ఋణం

షరతుల బూచాటలో మాయని వ్రణం

మెలమెల్లగా తీయు ప్రజల ప్రాణం"[166]

ప్రపంచీకరణ యొక్క వికృత రూపాన్ని అది ప్రజలకు తెచ్చిపెట్టే హానిని కవి తెల్పుతున్నాడు.

" మార్కెట్టులో ప్రతి వస్తువు రేటు
రాకెట్టు స్పీడుకు దీటు
ప్రపంచీకరణ లీలలు
కాలరాసే కార్మిక ఉద్యోగుల హక్కులు
నిర్భంద పదవీ విరమణ హక్కులు
కాంట్రాక్టు లేబరు జిమ్మిక్కులు
సంక్షేమ పథకాల ప్రైవేటికరణ టెక్కులు
కార్పోరేటు వ్యవసాయ ట్రిక్కులు
రైతన్నలకు యీ జన్మకు తీరన చిక్కులు
తప్పుడు తడకల కాకుల లెక్కలు
గమనిస్తోంది ప్రజానీకం అన్ని దిక్కులు"[166]

ఈ దేశంలో ఆర్థిక సరళీకరణ విధానాలు అమలైన తర్వాత సమాజ స్వరూపం మారిపోయింది. పెరుగుతున్న నిత్యవసర ధరలు, ఉపాధిని కోల్పోతున్న కార్మికులు, ప్రైవేటురంగం బాగా వ్యాప్తిలోకి రావడం వ్యవసాయంలో జీవనోపాధి తగ్గిపోవడం లాంటి ఎన్నో పరిణామాలు సంభవించాయి.

నందవరం కేశవరెడ్డి 'రుచులెరక్కనే' కవితలో నేటి ప్రపంచీకరణ యుగంలో సేద్యం చేయడం ఎంత కష్టమో తెల్పుతున్నాడు.

" యెవుడు కనిపెట్నో యేమోగాని
మడకల్ని మూల పడేసి
సేద్యానికి టాక్టర్లొచ్చినాయి
కపిలను కాలదన్ని
మోటర్లు రసాయనపు టెరువు
లొచ్చినాయి
పెస్టిసైడ్లొచ్చినాయి
దీండ్ల మొగాన మజ్జిగ పులుసు జల్ల
దిగుబడేందో పెరిగిందంటారు గాని

యా బువ్వన్నా నోటికి సయిస్తాందా

యా కూరన్నా రుచిగా వుందా

తినింది సయించక

తోటకూర మాదిరి

మొగాలు యాలాడేస్తిమే"[167]

ఈ సమాజంలో గత కాలపు రోజుల్లో పొలాల్లో సేద్యం చేయాలంటే ఎద్దులు, దున్నలతో మడకలు దున్ని కపిలతో నీళ్ళు తోడి పొలానికి పారించి పశువుల సేంద్రీయ ఎరువులు వేసి వివిధ రకాల చెట్ల ఆకులు వేసి తొక్కి పంటలు పండించే వాళ్ళు. ఇలాంటి సేంద్రీయ వ్యవసాయ స్థానంలో యాంత్రిక రసాయన వ్యవసాయం రావడం వల్ల సేద్యం ఎలా మార్పు చెందిందో కవి అనంతపురం జిల్లా మాండలికంలో పలికించాడు.

రాధేయ 'ఎడారి వసంతం' కవితలో ప్రపంచీకరణ స్వభావాన్ని విడమర్చి చెబుతున్నాడు.

" మతోన్మాదికి మనిషి మనుగడ గిట్టదు

సామ్రాజ్యవాదికి శాంతి మంత్రం చెవికెక్కదు

ఉగ్రవాదికి విధ్వంసమే లక్ష్యం

శవాలమీద సవారీ చేసే

సామ్రాజ్యవాద పెత్తనం

మన కాళ్ళ కింద భూమిని సైతం

తన్నుకు పోతోంది

బహుళజాతి కంపెనీ కనుసన్నల్లో

గాలీ, భూమీ, నీరూ సైతం

శిక్షణ పొందుతున్నాయ్"[168]

నేటి ప్రపంచంలో మానవాళికి పెను సవాళ్ళుగా మారిన ఉగ్రవాదం, సామ్రాజ్యవాదం, మతోన్మాదం లాంటి వాటిని కవి తెల్పుతూ వాటి వికృత చర్యల్ని తెల్పుతూ బహుళ జాతి కంపెనీలు ఈ దేశంలో ఎలా పెత్తనం చేస్తున్నాయో కవిత్వీకరించాడు.

సడ్లపల్లె చిదంబర రెడ్డి 'అన్ని రూట్లూ బిజీ' అనే కవితలో కుటుంబంలోని మానవ సంబంధాల పతనాన్ని గూర్చి తెల్పుతున్నాడు.

" అబ్బాయిల శక్తియుక్తులన్నీ వికెట్ల మధ్య పగిలే యవ్వన పాత్రలై

అమ్మాయిలు సెల్ పంజరాల్లో చిక్కుకున్న చిలకలై
అమ్మలంతా టివీ సీరియల్ శ్లేష్మంలో తగుల్కొన్న ఈగలై
నాన్నలంతా వార్తాపత్రికల విషాక్షర రక్తాన్ని పీల్చే నల్లులై
అవ్వా తాతలు జీవితం పోరులో చేతులెత్తి వృద్ధాశ్రమాల్లో ఖైదీలై
అన్ని రూట్లూ బిజీగా వున్నాయి!
దయచేసి కొన్నాళ్ల తర్వాత ప్రయత్నించండి" [169]

కుటుంబం అంటే అవ్వ తాతలు మొదలుకొని తల్లిదండ్రులు, పిల్లలు, ఇతర బంధుత్వాలతో కూడిన సమాహారం. మనుషుల మధ్య మమతానురాగాలు, ఆప్యాయతలు, అనుబంధాలు వుండాలి. నేటికాలంలో ఇలాంటి సంబంధాలన్నీ కుటుంబాల నుంచి, సమాజంలో నుంచి అంతరించిపోయే స్థితికి వచ్చాయి. సాంకేతిక పరిజ్ఞానం పెరిగి టి.వీ.లలో వచ్చే సీరియల్స్ ఇతర కార్యక్రమాలు సెల్‌ఫోన్స్, కంప్యూటర్స్ వచ్చి మనుషుల మధ్య దూరాన్ని పెంచుతున్నాయి. మనుషులు ఈ సాంకేతిక విజ్ఞానానికి ఆకర్షితుడై చివరికి దానికి బానిసగా మారి దాని ఉచ్చులో చిక్కుకుపోతున్నాడు. ఒక కుటుంబంలో తల్లిదండ్రులు, పిల్లలు, టి.వీ.లు, సెల్‌ఫోన్స్ ఆటలతో ఎలా బిజీ అయ్యారో కవి తెల్పుతున్నాడు.

లోసారి సుధాకర్ 'రాలుతున్న మొగ్గలు' కవితలో నేటి విద్యార్థుల చదువులు, విద్యా వ్యవస్థను గూర్చి తెల్పుతున్నాడు.

" విద్యాలయాలన్నీ వాణిజ్య కేంద్రాలయ్యాయి
ర్యాంకులు మెరిట్ స్టూడెంట్లేనట కదా
మేనేజ్‌మెంట్‌కు కాసుల పంట
అన్నీ కమర్షియల్ రిలేషన్స్
.................................
ఇవ్వాళ చదువు రాకాసి స్వప్నం
ఇవ్వాళ చదువు బాల్యాన్ని మింగే సర్పం
చదువు సముద్రమైంది
చదువు సుడిగుండమైంది
చదువు లేత బాల్యాన్ని ముంచేసే తుపాను అయ్యింది
చదువు ముందు కన్న ప్రేమ మరుగుజ్జయ్యింది
కార్పొరేట్ కాలేజీల

గేటు ముందు 'క్యూ' లో నిల్చోని
ఆదివారాల్లో పర్మిషన్ పొంది
గంటల్లో ప్రేమను పంచుకోవడానికి
ఎదురు చూస్తోంది"[170]

నేటి ప్రపంచీకరణ యుగ కాలంలో విద్య ఖరీదైన వస్తువుగా మారిపోయి అంగడి సరుకుగా మారింది. పేద, మధ్యతరగతి, సాధారణ ప్రజలు విద్యను కొనలేని పరిస్థితికి వచ్చారు. మల్టినేషనల్ కంపెనీలు, కార్పొరేట్ సంస్థలు మాదిరిగా పట్టణాలు, నగరాలలో మల్టిటాలెంటెడ్ స్కూల్స్, కార్పొరేట్ స్కూళ్లు, ఈ టెక్నో స్కూల్స్ లాంటివి కొత్త కొత్తవి వెలుస్తున్నాయి. ఈ విద్యా సంస్థల్లో విద్య చాలా ఖరీదైపోయింది. వేలకు వేలు, లక్షల రుపాయల్లో ఫీజులు వుంటున్నాయి. ఇలాంటి విద్యాసంస్థల్లో తల్లిదండ్రులు పిల్లల్ని చేర్పించి హాస్టల్స్‌లో వుంచి వారిని బంధీలుగా చేసి వారికి దూరమవుతున్నారు. కొంతమంది పిల్లలు విద్యాసంస్థల మెరిట్, ర్యాంక్‌ల ఒత్తిడిని, చదువుల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు మనం చూస్తూనే వున్నాం. ఇలాంటి కార్పొరేట్ చదువుల నేపథ్యంలోంచి కవి సాక్షాత్కరింపజేశాడు.

## పాదసూచికలు - నాల్గవ అధ్యాయం

1. Concise Oxford English Dictionary, Page:1211

2. తెలుగు అకాడమి, సామాజిక నిర్మితి, వివాదాలు & విధానాలు, పుట:147

3. వెంకటసుబ్బయ్య. వల్లంపాటి, రాయలసీమలో ఆధునిక సాహిత్యం, పుట:15

4. Regionalism and Realism in 19th century American Literature -wikipedia

5. తెలుగు అకాడమి, సామాజిక నిర్మితి, వివాదాలు & విధానాలు, పుట:59

6. తెలుగు అకాడమి, సామాజిక నిర్మితి, వివాదాలు & విధానాలు, పుట:59,60

7. Concise Orford English Dictionary, Page: 304,305

8. తెలుగు అకాడమి, తెలుగులో కవిత్వోద్యమాలు, పుట:245

9. నారాయణ రెడ్డి. సుంకిరెడ్డి, గనుమ, పుట:218

10. రంగనాథాచార్యులు.కె.కె, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, పుట:259

11. రంగనాథాచార్యులు.కె.కె, ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, పుట:260,261

12. నారాయణ స్వామి.బండి, రాయలసీమ సమాజం- సాహిత్యం, పుట:221

13. అబ్దుల్ ఖాదర్. వేంపల్లి, కిరణం, పుట:42,43

14. ప్రేంచంద్.జూపల్లి, నిచ్చెన మెట్ల లోలకం, పుట:56

15. ప్రేంచంద్.జూపల్లి, నిచ్చెన మెట్ల లోలకం, పుట:57

16. ప్రేంచంద్.జూపల్లి, నిచ్చెన మెట్ల లోలకం, పుట:61

17. ప్రేంచంద్.జూపల్లి, నిచ్చెన మెట్ల లోలకం, పుట:102

18. కర్నూలు కవిత, పుట:22

19. సీమ కవిత, పుట:51,52

20. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్ది దుఃఖం, పుట:19,20

21. వొరుపు, పుట:45

22. సీమ కవిత, పుట:47

23. సీమ కవిత, పుట:47

24. సీమ కవిత, పుట:17

25. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:46

26. బిక్కి కృష్ణ, చినుకు, పుట:07

27. బిక్కి కృష్ణ, చినుకు, పుట:08

28. ఒక కత్తుల వంతెన, పుట:41

29. మునిసుందరం, మసక, పుట:10,11

30. పలమనేరు బాలాజి, మాటల్లేని వేళ, పుట:55

31. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట:55

32. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట:131

33. అబ్దుల్‌ఖాదర్.వేంపల్లి, మేఘం, పుట:25

34. శ్రీనివాసరెడ్డి.పి.ఎల్, శ్వేదాశ్రువులు, పుట:28

35. సీమ కవిత, పుట:52

36. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట: 58

37. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట: 60

38. సీమ కవిత, పుట:30,31

39. చంద్రశేఖర రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట:40

40. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట:32,33

41. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట: 33

42. రాధేయ, అవిశ్రాంతం, పుట:73

43. రాధేయ, అవిశ్రాంతం, పుట: 74

44. సూర్యసాగర్.బి, ధనస్సు, పుట:38

45. సూర్యసాగర్.బి, ధనస్సు, పుట:38,39

46. సూర్యసాగర్.బి, ధనస్సు, పుట:39

47. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్దీ దుఃఖం, పుట:25

48. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్దీ దుఃఖం, పుట:26

49. రాచపాళెం, స్వర్ణభారతిసాక్షిగా, పుట:14

50. రాచపాళెం, స్వర్ణభారతిసాక్షిగా, పుట:16

51. నరసింహమూర్తి.మల్లెల, జలస్వప్నం, పుట:30,31

52. నరసింహమూర్తి.మల్లెల, జలస్వప్నం, పుట: 31

53. నరసింహమూర్తి.మల్లెల, జలస్వప్నం, పుట:32

54. రఘుబాబు, సంఘటిత స్పర్శ, పుట:1,2

55. రఘుబాబు, సంఘటిత స్పర్శ, పుట:12

56. ప్రేంచంద్. జూపల్లి, నిచ్చెనమెట్ల లోలకం, పుట:69,70

57. అనంతకవిత, పుట:114

58. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:177

59. ఒక కత్తుల వంతెన, పుట:113

60. ఒక కత్తుల వంతెన, పుట: 114

61. ప్రేంచంద్.జూపల్లి, నిచ్చెనమెట్ల లోలకం, పుట:72

62. వెంకటకృష్ణ.జి, లోగొంతుక, పుట:61

63. వొరుపు, పుట:1,2

64. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు-సందర్భాలు, పుట:42

65. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు-సందర్భాలు, పుట: 42

66. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు-సందర్భాలు, పుట: 44

67. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట:53

68. కెరె జగదీష్, సముద్రమంత గాయం, పుట:59

69. అనంత కవిత, పుట:29

70. అనంత కవిత, పుట:44,45

71. అనంత కవిత, పుట:45

72. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, రెండు ప్రపంచాలు, పుట:14

73. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:43

74. మద్దిలేటి, మిలీనియంలో నేనంటాను, పుట:51

75. శ్రీరాములు.వై, జలగండం, పుట:02

76. శ్రీరాములు.వై, జలగండం, పుట:11

77. శ్రీరాములు.వై, జలగండం, పుట:19

78. శ్రీరాములు.వై, జలగండం, పుట:23

79. శ్రీరాములు.వై, జలగండం, పుట:24

80. శ్రీరాములు.వై, జలగండం, పుట:29

81. శ్రీరాములు.వై, జలగండం, పుట:28

82. శ్రీరాములు.వై, జలగండం, పుట:37

83. శ్రీరాములు.వై, మూడు ఎడారులు ఏడు సముద్రాలు ఒకే ఒక్క అనంతపురం, పుట:41,42

84. వెంకటకృష్ణ, హంద్రీగానం, పుట:13

85. వెంకటకృష్ణ, హంద్రీగానం, పుట:32

86. వెంకటకృష్ణ, హంద్రీగానం, పుట:32,33

87. వెంకటకృష్ణ, హంద్రీగానం, పుట:33

88. వెంకటకృష్ణ, హంద్రీగానం, పుట:33

89. వెంకటకృష్ణ, హంద్రీగానం, పుట:40,41

90. వెంకటకృష్ణ.జి, దున్నే కొద్దీ దుఃఖం, పుట:36

91. మునిసుందరం, ఈ గుండె అలసిపోదు, పుట:26

92. మునిసుందరం, ఈ గుండె అలసిపోదు, పుట:27

93. అనంత కవిత, పుట:56

94. మునిసుందరం, చీకటి దీపాలు, పుట:11

95. మునిసుందరం, చీకటి దీపాలు, పుట: 12,13

96. సీమ కవిత, పుట: 74

97. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభాలు, పుట:139,140

98. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట:70

99. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట:72

100. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట:77,78

101. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట:78

102. రమేష్ నారాయణ.పి, వీవర్స్ & లూమ్స్, పుట:108

103. రాజారాం.టి. అతడే, పుట:37,38

104. రాజారాం.టి. అతడే, పుట:42

105. ఇబ్రహీం, రాయలసీమ కవిత్వం – దశ దిశ, పుట:23,24

106. ప్రేంచంద్.జూపల్లి, నిచ్చెనమెట్ల లోలకం, పుట:33

107. వెంకటేష్.టి, ఒక తడి అనేక సందర్భాలు, పుట:24

108. బాబ్జి, యుద్ధం అనివార్యమైన చోట, పుట:29,30

109. నాగమ్మపూలే, కులగీత, పుట:49,50

110. నాగమ్మపూలే, కులగీత, పుట: 91

111. బిక్కి కృష్ణ, చినుకు, పుట:58,59

112. బిక్కి కృష్ణ, చినుకు, పుట: 37

113. ఒక కత్తుల వంతెన, పుట:130

114. ఒక కత్తుల వంతెన, పుట: 115

115. నరసింహమూర్తి. మల్లెల, జలస్వప్నం, పుట:21

116. నరసింహమూర్తి. మల్లెల, జలస్వప్నం, పుట: 22

117. నరసింహమూర్తి. మల్లెల, జలస్వప్నం, పుట: 28

118. రఘుబాబు, సంఘటిత స్పర్శ, పుట:4,5

119. రఘుబాబు, సంఘటిత స్పర్శ, పుట:6

120. రఘుబాబు, సంఘటిత స్పర్శ, పుట:13

121. సీమ కవిత, పుట:99

122. సీమ కవిత, పుట: 75

123. సీమ కవిత, పుట:30

124. సీమ కవిత, పుట: 28,29

125. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:147

126. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:148

127. బిక్కి కృష్ణ, చినుకు, పుట:81

128. బిక్కి కృష్ణ, చినుకు, పుట:81,82

129. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట:75

130. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట:79

131. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట:80

132. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట:101

133. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట:36

134. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట:36

135. ప్రేంచంద్.జూపల్లి, అవేద, పుట:37

136. బిక్కి కృష్ణ, చినుకు, పుట:78,79

137. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట:88,89

138. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట:89

139. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట:90

140. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట:100,101

141. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట:116

142. శ్రీరాములు.వై, విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా, పుట:94

143. రంగనాథాచార్యులు.కె.కె, ఆధునిక సాహిత్యంలో విభిన్నధోరణులు, పుట:265

144. బిక్కి కృష్ణ, చినుకు, పుట:21

145. బిక్కి కృష్ణ, చినుకు, పుట:21,22

146. బిక్కి కృష్ణ, చినుకు, పుట:22

147. బిక్కి కృష్ణ, చినుకు, పుట:22,23

148. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్దీ దుఃఖం, పుట:50

149. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్దీ దుఃఖం, పుట:51

150. వెంకటకృష్ణ.జి, దున్నేకొద్దీ దుఃఖం, పుట:52

151. బాబ్జి, యుద్ధం అనివార్యమైన చోట, పుట:10

152. బాబ్జి, యుద్ధం అనివార్యమైన చోట, పుట: 9,10

153. రాజారాం.టి, అతడే, పుట:39,40

154. రాజారాం.టి, అతడే, పుట:36

155. రమేష్ నారాయణ, వీవర్స్ &లూమ్స్, పుట:84

156. రమేష్ నారాయణ, వీవర్స్ &లూమ్స్, పుట:104

157. రమేష్ నారాయణ, వీవర్స్ &లూమ్స్, పుట:70

158. సూర్యసాగర్, ధనస్సు, పుట:40,42

159. సూర్యసాగర్, ధనస్సు, పుట:43

160. కెంగార మోహన్, విన్యాసం, పుట:27,28

161. కెంగార మోహన్, విన్యాసం, పుట:74

162. కెంగార మోహన్, విన్యాసం, పుట:88,89

163. కెంగార మోహన్, విన్యాసం, పుట:93

164. కెంగార మోహన్, విన్యాసం, పుట:102

165. రామచంద్ర, సాహితీ సౌరభాలు, పుట:73

166. రామచంద్ర, సాహితీ సౌరభాలు, పుట:73

167. కేశవరెడ్డి. నందవరం, కామాలే, పుట:45,46

168. రాధేయ, అవిశ్రాంతం, పుట:52,53

169. చిదంబర రెడ్డి.సడ్లపల్లె, దృశ్య ప్రవాహం, పుట:60,61

170. లోసారి సుధాకర్, మైనపు బొమ్మలు, పుట:67,69

# ఐదవ అధ్యాయం

# రాయలసీమ ఆధునిక కవిత్వం-
# రూప పరిణామ ( ప్రక్రియ )
# వైవిధ్యం (1986-2015)

# ఐదవ అధ్యాయం

# 5.రాయలసీమ ఆధునిక కవిత్వం - రూపపరిణామ(ప్రక్రియ) వైవిధ్యం

**(1986-2015)**

'హితేన సహితం సాహిత్యం', 'సహితస్య భావ సాహిత్యం' అని సాహిత్యకారులు నిర్వచించారు. సాహిత్యం బోధిస్తుంది, మేలును కలిగిస్తుంది. మంచిని చేకూరుస్తుంది. సమాజానికి నడవడికను నేర్పిస్తుంది. నీతిని ప్రభోదిస్తుంది. తెలుగు సాహిత్యం ఆదికవి నన్నయ కాలం నుంచి నేటి ఆధునిక కాలం వరకు విస్తృతంగా వెలువడుతోంది. సాహిత్యం బహుముఖాలుగా విస్తరించింది. సాహిత్యం ప్రాఙ్నన్నయ యుగ కాలం నుంచి నేటి యుగం వరకు ఎన్నో దశలను, యుగాలను దాటుకుంటూ ప్రక్రియ పరంగానూ, రూప పరంగానూ, శాఖోపశాఖలుగా విస్తరించి విశ్వజనీనతను సాధించుకుంటోంది.

తెలుగు భాష, సాహిత్యాలకు దాదాపు రెండు వేల సంవత్సరాల పైబడిన చరిత్ర వుందని స్పష్టమవుతోంది. ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు, యక్షగానాలు, నాటకాలు, నవలలు, కథలు, కథానికలు ఆతర్వాతి పరిణామ క్రమంలో హైకూలు, గజల్స్, నానీలు, రెక్కలు వంటి ప్రక్రియలతో తెలుగు సాహిత్యం వికాసం చెందింది. నేటికి కూడా విస్తృతమైన కృషి జరుగుతూ కొత్త కొత్త రూప పరిణామాలతో సాహిత్యం వృద్ధి చెందుతోంది. పురాణాలు, కావ్యాలు, ప్రబంధాలు, శతకాలు లాంటి ప్రక్రియలు పద్యంలో వెలువడ్డాయి. కథ, నవల, నాటకం వంటివి గద్యంలో వెలువడుతున్నాయి. తెలుగు సాహిత్యంలో పద్యం ఒక విశిష్టమైన ప్రాముఖ్యతను పొందింది. పద్యం రాసినవారే పండితులు, కంద పద్యాలు రాసిన వాడే కవి అనే నానుడులు మనం వినే వుంటాము.

దీనిని బట్టి పద్యం రాయాలంటే పాండిత్యం అవసరమని తెలుస్తుంది. పద్యాలు పండిత పామరులను విశేషంగా ఆకట్టుకొంటాయి. ధారణకు అనువుగా వుంటాయి. స్వరరాగ సమ్మేళనంగా హృదయాన్ని ద్రవింపజేస్తాయి. ఇంతటి గొప్ప పద్య కవిత్వం నేటి ఆధునికకాలంలో ప్రాధాన్యత తగ్గిందని చెప్పవచ్చు. నా పరిశోధనాంశం 'రాయలసీమ ఆధునిక కవిత్వం- ప్రాంతీయ చైతన్యం'(1986-2015) ఈ మూడు దశాబ్దాల కాలంలో రాయలసీమ ఆధునిక కవిత్వం రూప పరిణామంగా ఎలాంటి వైవిధ్యాన్ని రూపుదిద్దుకుందో దాని విస్తృతి ఎలా వుందో తెలియజేయడం ఈ అధ్యాయ ఉద్దేశం.

## 5.1 పద్య కవిత్వం:

ప్రాచీన సాహిత్యంలోని నన్నెచోడుని కాలం నుంచి రాయలసీమ పద్యకావ్యాలకు ప్రసిద్ధి చెందింది. నాచన సోముడు, నన్నెచోడుడు, తాళ్ళపాక కవులు, అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, మాదయగారి మల్లన, అయ్యలరాజు రామభద్రుడు, రామరాజ భూషణుడు, పింగళి సూరన, పుష్పగిరి

తిమ్మన, పాలవేకరి కదిరీపతి, దామెర్ల అంకరాజు, సంకుశాల నృసింహ కవి, తరిగొప్పుల మల్లన, కట్టా వరద రాజు, సారంగపాణి, వినుకొండ వల్లభామాత్యుడు, కవి చౌడప్ప, వీరబ్రహ్మం, వేమన వంటి వారు ప్రాచీన పద్య కవులు. వీరు రచించిన పద్యకావ్యాలు ఈ గడ్డ మీద నుంచే రచింపబడ్డవే.

ధర్మవరం రామకృష్ణమాచార్యులు, కట్టమంచి రామలింగారెడ్డి, పుట్టపర్తి నారాయణా చార్యులు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, గడియారం వేంకట శేషశాస్త్రి, దుర్భాక రాజశేఖర శతావధాని, జనమంచి శేషాద్రిశర్మ, పాలా వెంకటసుబ్బయ్య, బైరపురెడ్డి నారాయణ రెడ్డి, వావికొలను సుబ్బారావు, బెళ్ళూరి శ్రీనివాసమూర్తి, కుంటిమద్ది శేషశర్మ, విద్వాన్ విశ్వం, అలాగే మన్నవ భాస్కరనాయుడు, నారు నాగనార్య, నరాల రామిరెడ్డి, మేడసాని మోహన్, సుబ్బన్న శతావధాని, భూతపురి సుబ్రహ్మణ్యం, ఆముదాల మురళి, పాలాది లక్ష్మీకాంత శ్రేష్ఠి, అంతటి నరసింహం, గంగప్ప, ఒంటెద్దు రామలింగారెడ్డి ఎలూరి యంగన్న, ఆశావాది ప్రకాశరావు, కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై మొదలైన ఆధునిక పద్య కవులు పద్య కవిత్వాన్ని సుసంపన్నం చేశారు. రాయలసీమ అవధానాలకు చాలా ప్రసిద్ధి చెందింది. ఈ అవధానాలలో పద్యం విశిష్టమైన స్థానం పొందింది.

ఆశావాది ప్రకాశరావు బహుగ్రంథ రచయితగా, కవి పండితుడుగా, అవధానిగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రసిద్ధి చెందాడు. పుష్పాంజలి, మెరుపు తీగలు, లోకలీలా సూక్తము, విద్యాభూషణ మొదలగు పద్య కావ్యాలు, వరదరాజ శతకం, పార్వతీ శతకం లాంటి శతకాలను రచించాడు. 'జూదమై సీమ సేద్యమ్ము' శీర్షికన సీమలో సేద్యం చేయడానికి ఎన్ని కష్టాలు పడాలో ఈ క్రింది పద్యంలో తెలియజేస్తున్నాడు.

సీ॥ భూమిని నమ్మిన పుణ్యాత్ములకు నెల్ల
ఉగ్రిత్రాడె సాక్ష్యమై ఉసురుమ్రింగె
పాడిని నమ్మిన పావనాత్ముల కెల్ల
లాఠీల దెబ్బలే పాతమయ్యె
కాయమ్ము నమ్మిన కష్ట జీవుల కెల్ల
నడి బజారే తుడి పడకయయ్యె
నీరమ్ము నమ్మిన నిర్మలాత్ముల కెల్ల
కన్నీటి ధారలే కాన్కయ్యె

తే॥గీ॥ ఊహలకు క్రొత్త ఊపిరు లూదజేయు
రైతు కూలీల బ్రతుకులు రచ్చకెక్క
జూదమై సీమ సేద్యమ్ము జోలిబట్టి జేసే అన్నదాతను

ఏమి చెప్పనేర్తు తలచుకొన్నచో గుండెలు తల్లడిల్లు"[1]

అని భూమిని నమ్ముకుని కాయకష్టంతో సేద్యంచేస్తూ పాడిపంటలు పండే రైతుల బ్రతుకులు నేడు సేద్యం ఒక జూదంలా మారిందని అది తలచుకుంటే గుండెలు తల్లడిల్లుతాయని కవి వేదనతో చిత్రించాడు. 'వైవిధ్య దర్శనం' శీర్షికలో నాటి పెనుకొండ గొప్పదనాన్ని వర్ణించాడు.

సీ॥ శత్రురాజన్యుల శౌర్య ధైర్యంబులు
చెండినదీ పెనుగొండ కొండ
సంగీత సాహిత్య సత్కళా ధామమై
పండినదీ పెనుగొండ కొండ
శ్రీ కష్ణ రాయల గ్రీష్మ విశ్రాంతికి
దిండైనదీ పెనుగొండ కొండ
ఆళియ రామారాయు నాహవ విస్ఫూర్తి
నిండినదీ పెనుగొండ కొండ

తే॥గీ॥ తిమ్మరసు మంత్రి ప్రస్థాన దివ్యభూమి
బట్టుమూర్తికి కుదురైన భవ్యభూమి
పుట్టపర్తి సత్కవి గన్న పుణ్యభూమి
దీని నుతియింప సుకవితా తేజమబ్బు"[2]

అని విజయనగర సామ్రాజ్యానికి రెండవ రాజధానిగా వున్నటువంటి పెనుగొండ కీర్తిని వర్ణించాడు. ఆముదాల మురళి 'అవధాన కళానిధి' అని బిరుదు పొంది పచ్చని తెలుగు, స్వర్ణ తుషారం అనే పద్య రచనలు చేశారు. స్వర్ణ తుషారం రచనలో సామాజిక సంఘటనలు, సమస్యల్ని ఇతివృత్తంగా తీసుకొని పద్య ఖండికలుగా రచించాడు. 'సస్యశాస్త్రవేత్త' శీర్షికలో రైతు గొప్పదనాన్ని తెల్పుతున్నాడు.

సీ॥ ఎవ్వాని చెమటతో ఈ నేల తడిసిన
బంజరు భూములు పుంజియగును
ఎవ్వాని కండలు హిమముగా కరిగిన
ఆకలికేకలు అంతమగును
ఎవ్వాని రక్తము ఎఱుపెక్కి ఎఱుపెక్కి
పైరుపచ్చల భూమి ప్రాణమగును
ఎవ్వాని ఆయుస్సు ఇకముందు తరముల

నిండు జీవితముల నీడయగును

తే॥గీ॥ ఎవని నాగేటి చాలులో ఇగురులెత్తి

స్వేద సారంబులో వృద్ధి చెందినట్టి

తిండి గింజలు జాతికి అండగాగ

సత్త్వమును నింపు; రైతుకు సాటి యెవరు?”[3]

అని ఈ సమాజంలో ఎవరి కష్టం చెమట ధారలతో భూమిని దున్ని పంటలు పండి తిండి గింజలు ఈ జాతికి అండగా నిలిచి ఈ జాతికి అన్నం పెట్టే వాడు అటువంటి రైతుకు సాటి ఎవరు అని గొప్పగా కీర్తించాడు. అలాగే ‘కంచికి చేరని కథ’ శీర్షికలో రైతుల కష్టాల కడగండ్ల కథలను చిత్రించాడు.

సీ॥ “కామధేనువు వంటి గంగగోవును రైతు

కన్నీళ్ళతో అమ్ముకొన్న కథలు

విత్తనంబుల విత్తి వేమారు తలయెత్తి

ఆకాశమును జూచు ఆశకథలు

పుస్తెల తెగనమ్మి పస్తులున్నను గాని

విద్యుత్తు చాలని వెతల కథలు

పడుచు వారంతయు పనికి పట్నముఁ బోవ

ముసలివారల పల్లె మూల్గుకథలు

తే॥గీ॥ వెన్ను నిశ్శబ్ద రోగాన విరుగుచుండ

కార్చు కన్నీరు దాహార్తిఁ దీర్చుననగ

నెండి పోయిన వెప్పుడో రెండు కనులు

కంచిఁజేరవు క్రూరమౌ కరువు కథలు”[4]

ఇలాంటి రైతుల కష్టాలు, కన్నీళ్ళ గాథలు, బతుకు వ్యథలు కరువు చిత్రించిన కథలు ఎన్నో వున్నాయని కవి తెల్పుతున్నాడు. తెలుగు భాషా సాహిత్యానికి సి.పి.బ్రౌన్ చేసిన సేవను కొనియాడుతూ ఇలా వర్ణించాడు.

సీ॥ అటకలపై తాటియాకులలో మూల్గు

తెలుగు కావ్యాలకు వెలుగెవండు?

జనుల నాల్కలపైన జావళీలైనట్టి

వేమనపద్యాల వెలుగెవండు?

ఆంధ్రమ్ములో తావి ఆంగ్లేయులకు జెప్ప

కోశంబు నేర్పుతో కూర్చెనెవడు?

పండితులకు తాను భత్యంబు నిచ్చి వ్యా

ఖ్యానముల్ వ్రాయించ బూనెనెవడు?

తే॥గీ॥ స్వార్జితం చెల్ల పరభాష సత్వమునకు

స్ఫూర్తి తోడుత వెచ్చింప బూనెనెవడు?

పరమ సౌజన్యమూర్తి యా బ్రౌను దొరకు

తెలుగు వారెల్ల ఋణపడి మెలగవలయు"[5]

అని బ్రౌన్ మహనీయుడు తెలుగు సాహిత్యానికి చేసిన విశేషమైన కృషిని స్మరిస్తూ రచించాడు. 'యంత్ర భూతం' శీర్షికలో వృత్తికులాల చేతి వృత్తులు అంతరించిపోయిన స్థితిని వర్ణిస్తున్నాడు.

సీ॥ "సాలెల మగ్గంబు చావు శాసనమాయె

వడ్రంగి బాడిసె వన్నె తగ్గె

చాకి రేవులలోన సందడి లేదాయె

కుమ్మరావంబుల కూలిపోయె

కమ్మరి కొలిమిలో గడ్డిదుబ్బలు మొల్చె

ఆరె జూడగ మొద్దు బారిపోయె

డోలు సన్నాయిలు ఢీలా పడెను చాల

గీత కార్మికులకు వ్రాతమారె

తే॥గీ॥ భూత మెయ్యెదొ వీటిని ముట్టడించె

కర్కశంబైన నూతన కాలమందు

చేతి వృత్తుల కథలెల్లఁ జేరెకంచి

వాటి నమ్మిన వారి నట్టేట ముంచి"[6]

ఈ ఆధునిక కాలంలో చేతి వృత్తులు వారి జీవనోపాధి నాశనమై వారి బతుకు రాతలు ఎలా తారుమారు అయ్యాయో కవి తెల్పాడు.

మన్నవ భాస్కర నాయుడు హృదయోదయం, స్వేద సూర్యోదయం మొదలగు పద్య కావ్యాలు రాశాడు. స్వేద సూర్యోదయం ఒక ఆధునిక కథా కావ్యం. ఒక అగ్రవర్ణ యువకుడు ఆదర్శా లకు కట్టుబడి ఒక దళిత యువతిని పరిణయ మాడటం, వారి వెంట నిలవడం ఈ కథలోని సారాంశం.

స్వేద సూర్యోదయం కావ్యంలోని కథ జరిగిన గ్రామాన్ని గూర్చి తెలుపుతున్నాడు.

" అది మన దేశమాత కనులంచుల కందని ఊరు, దాని సం
పదలకు గుర్తుగా కలదు ప్రక్కనె ఎండిన ఏరు, దానిలో
పొదరుల ఈదితే ఎదుట పుట్టల గుట్టల బారు, స్వేదమం
దుదికిన అస్థి పంజరము లూగెడు తేరుల తీరు గేహముల్"[7]

అని ఈ దేశంలో ఒక మూలన గ్రామం దాని పక్కనే నీళ్ళు లేని ఏరు, రాళ్ళగుట్టలు, అస్థిపంజరం వలె వున్నటువంటి ఆ గ్రామాన్ని గూర్చి వర్ణించాడు. కుల,మత, వర్గ భేదాలు మరచిపోయి ఆ గ్రామ ప్రజలు ఎలా శ్రమిస్తున్నారో కవి తెల్పుతున్న పద్యం,

" కుల మతల వర్గ విభేదము
కల-కలసి మెలసి శ్రమించి గాదెలు నింపే
కళ- స్వేచ్ఛా బానిసలుగ
గిలగిల। ఈ ఊరి వారికే సొంతమగున్"[8]

అని కష్టపడి పనిచేయడం ఆ గ్రామం వారికే సొంతమవుతుందని కవి తెల్పాడు. వైశాఖ మాసంలో ఎండలు మండిపోతున్నాయి. ఎండల ప్రభావాన్ని ఇలా తెల్పుతున్నాడు.

" శిలలు ద్రవించి పోయినవి - క్షేమము కాదని లోతు లోతులన్
తెలియని చోట దాగినవి నీళ్ళు- దిగుల్పడి వంచె వక్షముల్
తలలు- తలెత్త నేరని లతల్, చిరు మొక్కలు వాడి వత్తలై
బిలబిల రాలిపోయినవి పిచ్చిగ గ్రీష్మకరోగ్రచాలనన్"[9]

అని ఎండల వేడిమికి రాళ్ళు కరిగి పోయినాయి. నీళ్ళు భూమిలోనికి ఇంకిపోయాయి. చెట్లు, ఆకులు, తీగలు, చిన్నమొక్కలు వాడిపోయి రాలిపోయాయి అని గ్రీష్మ ఋతువులోని ఎండల విశ్వరూపాన్ని వర్ణించాడు. ఈ కవి పద్యరచనలో చెయ్యి తిరిగిన వాడని ఏ పద్యం చూసినా చెప్పవచ్చు. పద్యాల్లో విరుపులు ఎట్లా ఇవ్వాలో, యతిప్రాసలు ఎట్లా సంధించాలో, పదాల్లో అనుప్రాస మాధుర్యాన్ని ఎట్లా కూర్చాలో, సమతా గుణాన్ని ఎలా సాధించాలో ఈ కవికి బాగా తెలుసు.

" కూలికి రేబవళ్లు సమకూడిన నౌకరులుండ, సైగతో
కాలికి చేతికందు నయగారపు చాకరులండనుండ, గా
రాల వరాల పౌరుల జ్వరాల చికిత్సకు పూనె పూర్ణయున్
మూల విరాట్టు లేని గుడి ముందర పూజకు పూనినట్లుగా"[10]

అని పద్యంలో అనుప్రాస మాధుర్యాన్ని చాలా చక్కగా పదాల పొందికగా సమకూర్చారు. ఈ క్రింది

పద్యంలో సమాసంలో వృత్తం నడపటం సాధారణ కాని తెలుగు మాటల విరుపులతో వృత్తం కొత్త సొగసులు పోతుంది.

" ప్రాణము లేచివచ్చు సదుపాయము కాయము నూరడింపగా
వేణువు లూదినట్లు- మృదువీణలు జాణలు మీటినట్లు - మా
గాణము పండినట్లు- నయగారము తీరముదాటినట్లు- పూ
బోణులు నవ్వినట్లు - విరిబుగ్గలు సిగ్గులు రువ్వినట్లుగా" [11]

అని మనసుకు హాయినిచ్చే దృష్టాంతాలను మధురమైన శైలిలో కవి నడిపాడు.

అంతటి నరసింహం కవిగా, నాటకకర్తగా, సంఘ సంస్కర్తగా, రచయితగా ప్రసిద్ధి చెందాడు. నవసృష్టి, కంకాళరాత్రి, కాలవేదం, తాడితవ్యాఘ్రి మొదలగు కావ్య రచనలు చేశాడు. 'కంకాళ రాత్రి' పద్యరచన కావ్య ఖండికలుగా వివిధ రీతులుగా సాగింది. '(కం) కాళరాత్రి' శీర్షికలో వర్షాలు పడని ఘోరమైన దృశ్యాలను వర్ణిస్తున్నాడు.

" ఏ తట్టు చూచినన్ ఆ తట్టు పీనుగు
పెంటలే ఘోరమై కంటబడును
ఏ ఛాయ పరికింప నా చాయ జంతుకం
కళాలు కుప్పలై కానుపించు
ఏ వంక జాచినన్ ఆ వంక సస్యాఢ్య
కుంభిని పంకమై గోచరించు
ఏ దిక్కు చూచినన్ ఏడుపుల్ పెడబొబ్బ
లై చూపరుల గుండెలవియజేయు
పంచభూతాలలో రెండు వాయుజలము
లేకమై జంటగట్టి బిట్టేచి పాంచ
భౌతికములగ ప్రాణుల పంచజనుల
పంచతనుబొంద జేసెను పాపమేమొ"[12]

అని గాలి నీరు ఏకమై అవి ఎంతటి ప్రళయాన్ని సృష్టించాయో సరళ గ్రాంథిక భాషలో రచించాడు. 'పంచజన దుర్మార్గము' శీర్షికలో జాతి, మత భేద భావాల వల్ల ఎదురయ్యే సమస్యలను తెల్పుతున్నాడు.

" ప్రాంతీయ భేదాలు భారతీయైకతా
భంగ కారణములై పరిఢవిల్లె

భాషా విభేదాలు భావైక్య శక్తులం
దరలించ దూరాన తరిమివైచె
జాతి విద్వేషాలు జాత్త్యైకమత్య శ
క్తికి పరశ్వధములై తీరిబలిసె
వర్ణ విద్వేషాలు వర్ణ భేదముగాక
కులరూపముల నిల్చి కుళ్లు బలిసె
ఏవమాది విభేద సంభావనముల
సర్వ మానవ హృదయాల సహ్యగర్హ్య
వైరి తేర్ష్యాది దుర్గుణ వర్ణనములు
గా పరిణమించి సంఘ ముగ్రౌర్యమయ్యె”[13]

కుల, మత, వర్గ, జాతి, విద్వేషాలు నశించిపోవాలని కవి కోరుకుంటున్నాడు. ‘అ(హ)రిజనులు’ శీర్షికలో ఇలా అంటాడు.

“ఎవడు రా వాడు మమ్మింత చివరిదాక
తరిమి తరిమి హృదంతరాంతరములందు
దహన కీలల దరికొల్పి తనను తాను
దగ్గ మొనరించు కొనుచున్న దానవుండు”[14]

అని అంటరానివారుగా, అస్పృశ్యులుగా గ్రామాల వెలుపలకు నెట్టివేయబడ్డ హరిజనులను గురించి ఒక దిక్కార స్వరంతో, వ్యంగ్య గర్భితంగా, హెచ్చరికగా కవి చిత్రించాడు. ‘నాయకుడు’ శీర్షికలో నాయకుని గుణగణాలను తెల్పుతున్నాడు.

“పరధన స్పర్శమ్ము పాపమ్ముగాహేయ
తాపమ్ముగా బుద్ధి తలచువాడు
పరనారి గమనమ్ము పరిభావ పారుష్య
మని దూరముగ పారి, మనెడివాడు
అన్యభోజనమున్ పరాన్న భోజనముగా
నెంచి స్వార్జితమే భుజించువాడు
అన్నార్త జనదైన్య హరణోద్యమ సమీక
యోద్ధగా మున్ముందు నుండు వాడు

అతడె జనముల దుఖార్తి నపనయింప
శక్తి గలవాడు, శీలానురక్తి పరుడు
స్వార్థ రాహిత్యమే పరమార్థమైన
నడత గలవాడు సార్థక నాయకుండు"[15]

అని సమర్థుడైన నాయకుడు ఎలా ఉండాలో తెల్పిన పద్యం ప్రశంసనీయమైనది.

ఒంటెద్దు రామలింగారెడ్డి ఉపాధ్యాయుడిగా, కవిగా ప్రసిద్ది చెందాడు. సంక్రాంతి, ప్రబోధాశ్రయం, జానకీ శతకం, శిష్య శతకం అనే రచనలు రచించాడు. వీరి 'ప్రబోధాశ్రయము' నేటి వ్యవస్థకు చైతన్య కరదీపిక లాంటిది. ప్రస్తుత సమాజంలో జరిగిన, జరుగుతున్న అవినీతి, లంచగొండితనం, అసాంఘిక ధోరణులను నేటి యువతరం విపరీతపు పోకడులను నిర్భయంగా నిర్ద్వంద్వంగా చీల్చి చెండాడారు. ఈ కాలపు పాశ్చాత్య సంస్కృతిని నిరసిస్తూ ఇలా అంటాడు.

తే॥ వేదకాలంబు నుండి యీ విశ్వమునకె
మంచి నడవడి నడత నేర్పించినట్టి
ఉత్తమంబగు మన సంస్కృతులను వీడి
అధమ పాశ్చత్య సంస్కృతి కరుగదగునె?"[16]

అని యుగయుగాల నుండి ఈ సమాజ మానవాళికి నడకను నేర్పిన భారతీయ సంస్కృతిని మరచిపోయి పాశ్చాత్య సంస్కృతిని ఎలా అలవరుచుకుంటారు అని కవి ప్రశ్నిస్తున్నాడు. ఈ సమాజం నీతి నియమాలలో అన్నీ మరిచిపోతున్నారని చెబుతున్న పద్యం.

తే॥ "నీతి నియమంబులన్నియు పాతబడిన
అస్థిరత్వంబు తోడ సమాజ మంత
మనిషి మనిషిని దోచెడి మార్గములకె
యత్న మొనరించు స్వార్థ పరత్వమునను"[17]

నీతినియమాలు మరచి మనిషి మనిషిని దోపిడి చేసే స్వార్థం మనుషులలో వుందని తెల్పాడు. నేటి ప్రభుత్వాలు ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి డబ్బులు పంచుతూ తిరిగి ఆ డబ్బును పన్నుల రూపంలో దోచుకొనే వ్యవస్థను ఈ పద్యంలో తెల్పుతున్నాడు.

తే॥ "ప్రజల కేమిచ్చినను గాని ప్రజలసొమ్మె,
వారి తాతల సొమ్ము లుదారములుగ
ప్రజకు బెట్టగ లేదుగా ప్రజలసొమ్మె

దొరికినంతకు నందరు దోచుకొనిరి"[18]

ప్రజలసొమ్మును ప్రజలకే పంచి తిరిగి ఎలా దోచుకుంటారో కవి తెల్పాడు. మన మాతృభాష తెలుగు భాష పై ఈ సమాజం, ప్రభుత్వాల నిర్లక్ష్యాన్ని ఇలా అంటాడు.

తే॥ "స్వచ్ఛముగ తెలుగు మాట్లాడు జనము కఱవు
తెలుగు మనభాష యనెడి యుద్దీప్తి కఱవు
అమ్మభాషకు పరిరక్షణంబు కఱవు
తెలుగు భాషా వధూటికి దిక్కు కఱవు"[18]

అని తెలుగు భాషకు జరుగుతున్న అన్యాయాన్ని గూర్చి కవి ఆవేదన చెందుతూ తెల్పాడు.

పాలాది లక్ష్మీకాంతం శ్రేష్టి కవిగా, సంపాదకుడిగా, సమాజ సేవకులుగా ప్రసిద్ధి చెందాడు. హనుమ గీతాలు, అక్షరసుమాలు, పురంజనోపాఖ్యానం, సంస్తుతి లాంటి పద్యరచనలు వాసవి, కన్నగి, చారుగుప్త లాంటి నవలలు రచించాడు. వీరి 'అక్షర సుమాలు' పద్య కావ్య ఖండికల మేళవింపుల సమాహారం. 'పొట్టి శ్రీరాములు' శీర్షికలో అతని ప్రాణ త్యాగాన్ని ఇలా కొనియాడాడు.

"తెలుగువారికి రాష్ట్రమున్ తెచ్చినాడు
తెలుగు మేల్మికి మూలమై నిలిచినాడు
తెలుగు దీక్షకు సాక్షియై వెలసినాడు
పొట్టి శ్రీరాము లాంధ్రుల పుణ్యఫలము"[19]

అని పొట్టిశ్రీరాములు గారిని కీర్తించాడు. సి.పి.బ్రౌన్ తెలుగు భాషకు చేసిన సేవను గూర్చి ఇలా అంటాడు.

"తెలుగు భాషలోని తీయందనాలను
తొలుత గన్న తెల్లదొర యతండు
భాషకెందు దేశపర భేదమదిలేద
టంచు చాటినట్టి యనుఘుడతడు"[20]

జాతి, భాష భేదాలు మరచి తెలుగు భాషకు అజరామర కీర్తిని తెచ్చి పెట్టిన బ్రౌన్ దొరను స్మరించాడు.

ఆచార్య ఎస్.గంగప్ప కవిగా, రచయితగా, పరిశోధకుడిగా, బహుగ్రంథకర్తగా ప్రసిద్ది చెందాడు. వీరి 'హృద్యము తెలుగు పద్యము' పద్యకవితా సంపుటి ప్రసిద్ధమైనది. 'తెలుగుదనము' శీర్షికలో తెలుగు భాష గొప్పదనాన్ని కొనియాడుతున్నాడు.

"తెలుగుదనమె మనకు తెలుగుధనము
తెలుగు మాట మనకు తేటమాట

తెలుగు పలుకు మనకు తీయనయిన తేనె

తల్లిపాలు మనకు తల్లి భాష!"[21]

అంటూ మాతృభాషను కీర్తించాడు. 'దుస్థితి' శీర్షికలో రాయలసీమ ప్రాంత కరువును చెబుతున్నాడు.

"పడక, మెండుగా వానలు పడియు, కరువు

సీమరైతులు పరమదుస్థితిని దెలుప

వేరుశనగ పంటలు రాక వీగిపోగ

ప్రాణము వదలి చనినారు పరమపదము!"[22]

అని వర్షాలు రాక పంటలు పండక సీమ ప్రజలు ప్రాణాలను వదులుకుంటున్నారని కవి చెబుతున్నాడు. జోస్యం జనార్ధన శాస్త్రి కవి పండితుడుగా ప్రసిద్ధి చెందాడు. వీరు కన్నీటి చుక్కలు, కన్నతల్లి, దేవి మహాత్మ్యం, పసిడి పంట, సీతమ్మ, వీరాంజనేయ విలాసం, విజయజ్యోతి అనే రచనలు చేశారు. సీతమ్మ అనే ఖండకావ్యంలో ఆడపడుచు మనోవేదన చిత్రీకరింపబడినది. ఆధునిక సీతమ్మ తన కడగండ్లను పురాణ స్త్రీయైన సీతాదేవితో చెప్పుకొంటున్నట్లు కవి అభివర్ణించారు.

"ఇది మన సొమ్ముకాదిచట నిల్లడ పెట్టిన దేరి కోసమో

గడ? యెటు లెన్ని చేసినను గాని యొకయ్యకు నెట్టునొప్పఁజె

ప్పదగిన దాడుపిల్ల యను భావనతో విధి లేక సాకునొ

ప్పిదముగఁ తల్లిదండ్రులగు పింతురు మాదెటు వంటికర్మయో"[23]

అని ఈ సమాజంలోని స్త్రీల మనోభావాలను, యధార్ధ విషయాలను కవి వర్ణించాడు.

సిద్ధేశ్వరం కొల్లప్ప పేదరికం వల్ల పెద్ద చదువులు చదవలేక పోయినప్పటికీ తెలుగు భాష పై పట్టు, పాండిత్యం సంపాదించారు. సిద్ధేశ్వర శతకం, సద్గురు శతకం, శ్రీరంగ శతకాలు, దళిత దుందుభి మొదలగు రచనలు చేశాడు. 'దళితదుందుభి' పద్య కావ్యం. ఇందులో దళితుల జీవితాలను ఆవిష్కరించాడు.

ఆ॥వె॥ "సులభమైన పనులు శ్రోత్రియులకు దక్కె

కావలి పనిదొరికె క్షత్రియులకు

వస్తుసేకరణము వైశ్యుల పరమయ్యె

బడుగు వారికబ్బె బరువుపనులు"[24]

అని బ్రహ్మదేవుడు సృష్టించిన చాతుర్వర్ణను వారి వృత్తిని తెల్పుతున్నాడు. 'మేఘదూత' ఖండికలో పోస్ట్ మాన్ వృత్తిని సహజంగా ఇలా వర్ణించాడు.

"ఛత్రము చేతబూని ఒక చంకకు సంచియు చేతినిండుగా
పత్రికలుత్తరాలు పరివారముగా తలపైని టోపితో
మిత్రుల కాప్త బంధులకు మేలగు వార్తలు చేర్చుచుందువో
మిత్రుడ! నీదు సేవలకు మెత్తురె లోకులు నిన్ను పోస్టుమేన్"[25]

అని పోస్ట్‌మాన్ మన ఎదుట నిలబడి ఉత్తరాలు అందించడానికి సిద్ధమైనాడేమో అన్న భావనను స్ఫురింప జేస్తూ కమనీయ సహజ వర్ణనతో చిత్రించారు. 'రాగమయి' అను ఖండికలో మహిళ గూర్చి ఇలా వర్ణించారు.

"స్వర్ణ మతముల శోధించి సారమరయ
తొయ్యలియె మగవానికి తోడు, నీడ
ధరణి సంసార వార్ధిని దాటఁజేయ
దంపతుల యనురాగమే తగిననావ"[26]

అని ఈ సమాజంలో మహిళామణుల ఔన్నత్యాన్ని గొప్పగా చిత్రించారు.

ఎన్.రామచంద్ర కవిగా, రచయితగా, సంపాదకుడుగా ప్రసిద్ధి పొందాడు. భాష్పాంజలి, నా నీడ, విజయగీతిక అనే ఖండకావ్యాలు రాశాడు. పాకిస్థాన్ నుండి విడదీసి బంగ్లాదేశ్‌ను ఏర్పాటు చేసినపుడు ఇందిరాగాంధీ ధైర్య సాహసాల్ని మెచ్చుకొంటూ 'విజయగీతిక' అనే ఖండకావ్యం రచించాడు.

"ఏ పుణ్య భూమిలో నెనలేని ధర్మంబు
    నాల్గు పాదాలతో నడచుచుండె
ఏ పవిత్ర జగననెన్నిక కెక్కిన
    వరధాన్యరాశులు వరలుచుండె
ఏ కళా జగతిలో నెన్నెన్నో విద్యలు
    చిలుకలు సైతము పలుకుచుండె
ఏ శౌర్య పృథ్విలో నెలతృణంబున గూడ
    పసగల చేవయే మసలుచుండె
అట్టి భారత భూమిపై నన్యుడెవడు
కత్తి ఝుళిపించి ప్రాణముల్దల్గి యుండు
లేదు భారత జాతికి లేదు లేదు
ఓడుటన్నది – జయగీతి పాడుటొండె"[27]

అని ఇందిరాగాంధి విజయాలను కవి కీర్తించాడు

ఎ.సి.దస్తగిరి గారు విద్వత్కవి. కమనీయ కావ్యాల సృష్టికర్త. నా కలం పద్యరచనకే, నాగళం పద్యగానానికే అని చాటుకున్న కవి దస్తగిరి. వీరి 'అమృతమూర్తి' కావ్యం సర్వమానవ సౌభ్రాతృత తో మానవతా విలువలకు పట్టం కట్టి సమైక్యాన్ని వెలుగెత్తి చాటిన కావ్యం.

"భిన్నమతంబులన్ మఱియు భిన్నములైన పురాణ సంస్కృతుల్
భిన్నములైన భాషలున వేలముగాఁగల భారతోర్వి, తా
భిన్నత యందు నేకతయు భిన్నత యేకతయందుఁగల్గి, శ
శ్వన్నుతి పాత్ర మౌటయను సత్యము సర్వులెఱింగినట్టిదే"[28]

అని జాతీయతా భావాన్ని చాటుతూ భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రభోదిస్తుంది. వీరు మఱిమంజూష, కవితా భారతి మొదలగు ఖండకావ్యాలు రచించారు. కవితాభారతి ఖండకావ్యంలో కర్షకుల కష్టాలను తెల్పుతున్నాడు.

"తిండికి గుడ్డకున్ కఱవు దీరక బాధలబల్మి మ్రింగుచున్
చండమయూఖు తీవ్ర కిరణంబుల బోలిన కష్టసంతతుల్
గుండెలపైన కుంపటులు గూర్చిన రీతి సెగల్ ఘటింపగా
బండలు వారు నక్కటిక భాగ్య విహీనులకేది దిక్కగున్"[29]

ఈ కవితా భారతి ఖండకావ్యంలో జాతీయ నాయకుల జీవితాలను, సామాజిక సమస్యలను ఎత్తిచూపారు.

కరణం బాలసుబ్రహ్మణ్యం పిళ్ళై చరిత్రకెక్కని మారణహోమం, విషాద మాధవి, ఒక రాఘవ రెడ్డి కథ అనే కావ్యాలను రచించారు. విషామాధవి కావ్యంలో పురుషాహంకారం వెర్రితలలు వేసిన ఆనాటి సమాజాన్ని చంధోబద్ధమైన కావ్యంగా మలిచాడు. మాధవి ఈ కావ్యంలో తన దయనీయ కథను తానే స్వయంగా చెబుతుంది.

## 5.2. గేయ కవిత్వం:

గేయకవిత/గేయం అంటే గాన యోగ్యమైనది. గేయంలో మాత్రా ఛందస్సుకు ప్రాధాన్యం ఉంటుంది. ఆధునిక కాలంలో పద్యం నుండి విడివడి గేయ కవిత ఒక ప్రత్యేక ప్రక్రియగా తెలుగులో వెలుగులోకి వచ్చింది. ఆంగ్ల సాహిత్య ప్రభావం గేయరచన మీద ఉంది. స్వతంత్ర మాత్రా ఛందస్సు, యతి ప్రాసలకు ప్రాధాన్యం లేకపోవడం అంత్యప్రాసల ఆడంబరం గేయకవిత లక్షణాలు.

రాయలసీమలో పద్యాలు రాసిన కవులతో పాటు గేయాలు రాసిన కవులు వున్నారు. షేక్ హుస్సేన్ సత్యాగ్ని, యం.సి.నాగన్న, మన్నవ భాస్కరనాయుడు, పులికంటి కృష్ణారెడ్డి, కలువకొలను సదానంద, జై సీతారాం, ఏలూరి యంగన్న, గొల్లపిన్ని వాసుదేవ శాస్త్రి, సుబ్రహ్మణ్యశర్మ, ఎన్.ఈశ్వరరెడ్డి,

పుట్టపర్తి నాగపద్మిని మొదలైన వారు గేయ కవిత్వం రాశారు.

షేక్ హుస్సేన్ సత్యాగ్ని అభ్యుదయ కవి. వీరి 'సత్యాగ్ని గీతాలు' 116 గేయాల సంపుటి. సమాజంపై కవికి గల కోపం, అస్తవ్యస్థ వ్యవస్థపై చీదరింపు కనిపిస్తుంది.

"కలము బలమును చాటిచెప్పెడు
కవిత పల్కగ పూనవలెనోయ్
సమాజమ్మును భీతి గొల్పెడు
దౌష్ట్యమును హరియించవలెనోయ్"[30]

అని తన కలం, గళం ద్వారా ఈ సమాజాన్ని మేల్కొల్పాడు. వర్తమాన రాజకీయాలను తీవ్రంగా నిందించాడు. ఇలా అంటాడు.

"రంకు బొంకుల రాజకీయపు
గొడుగు నీడన బడుగు బతుకులు
ప్రజాధనమును దోచి మెక్కెడు
పందికొక్కుల సంతరా యిది"[31]

రాజకీయాల కుతంత్రాలను చీల్చి చెండాడినాడు. మతం పేరుతో మారణహోమం జరిపేవారి పట్ల ఈ కవి కళ్ళెర్రజేసిన తీరు ప్రశంసనీయం.

"మతము మాటున కుమ్ములాటలు
బరితెగించిన స్వార్థక్రీడలు
కన్నతల్లికి కన్ను చెదిరిన
అన్నదమ్ముల కత్తి వైరము"[32]

స్వార్థం కోసం మతాన్ని అడ్డుపెట్టుకొనే రోజులివి. అన్నదమ్ముల్లా కలిసి బతకాల్సిన వాళ్ళు కలహించుకొని కొట్లాడుతారు.

"కుటిల నేతల కుట్ర ఫలితము
జాతి మారణకాండ హేతువు
ఉగ్గు తోడనే మతము మత్తును
కలిపి తాగిన కాలయములోయ్"[33]

ఈ రోజు జరుగుతున్న మత మారణ కాండలకు రాజకీయ నేతల కుటిల కుట్రలే కారణమన్నది జగమెరిగిన సత్యం. మధ్యపానాన్ని గూర్చి ఇలా అంటాడు.

"మధువు మత్తున మునిగి తేలగ
వీధివీధిన పానశాలలు
పతుల బాధ భరింపజాలని
సతుల యేడ్పుల జాలిగాథలు"[34]

నేటి సమాజంలో మద్యం షాపులు ఎక్కువై మధ్యపాన వ్యాపారం విచ్చలవిడిగా జరుగుతోంది.

"రాసులుగ రతనాలనమ్మిన
జీవగడ్డని పొంగి పోకుము
కాలదోషము పట్టె సిరులకు
కరువు రక్కసి తాండవించెను"[35]

రత్నాలు రాసులుగా పోసి అమ్మిన ఈ సీమ నేడు కరువు రాక్షసి కబంధ హస్తాల్లో చిక్కుకుపోయింది. ఈ దేశ సంపదను దోచుకునే నేతల కుతంత్రాలను తెల్పుతూ,

"జాతి సంపద కొల్లగొట్టెడు
బడానేతల యింద్ర జాలము
వేల కోట్లకు పడగలెత్తక
మహా నాయకులెట్టులగుదురు"[36]

అని ఈ దేశ సంపదను స్వాహా చేస్తున్న స్వార్థపరులను గూర్చి తెల్పాడు.

జనప్రియ కవిగా పేరుపొందిన ఏలూరు యంగన్న 'తెలుగమ్మ పండుగ' అనే లఘు గేయ కృతిని రచించాడు. సహజ సరళ రీతిలో సాగిన ఈ కమ్మని తెలుగు పలుకులో మన ప్రకృతి సంపదను, నదీమ తల్లుల సోయగాన్నీ, పూర్వ వైభవ శోభను, జలపాతంలా ఉరికిన కవితారీతులను మనం ఈ గేయకృతిలో గమనించవచ్చు. ఆంధ్రదేశాన్ని పాలించిన రాజవంశాల కీర్తిని ఇలా వర్ణించాడు.

"శ్రీ శాతవాహనుల సామ్రాజ్యభోగము
అల కాకతీయుల పాలనాపటిమమ్ము
విజయ నగర రాజ్య విశ్వనుత క్షాత్రమ్ము
మమ్మొనల శక్తియై దమ్ము జూపిన యపుడె
తెలుగు గడ్డ వెలుంగు!
తెలుగు బిడ్డ చెలంగు!!"[37]

అని రాజవంశాలను స్మరించాడు. తెలుగువారి ధీశక్తిని, పౌరుష ప్రతాపాల్ని, తేజోగుణాన్ని ఇలా కొనియాడాడు.

"సాగరసీమలో సామరస్యము విరిసి
తెలంగాణ భూమిలో చెలిమి కలిమి కురిసి
రాయలసీమలో రాగమే విరభూసి
జై విశాలాంధ్రమే స్వర్ణాంధ్రమై వెలయు
ఘనమైత్రి వర్ధిల్లు!
కన్నమ్మ శోభిల్లు!!"[38]

అని శాంతి సామరస్యాలతో కలిసిమెలిసి వుండాలని సూచిస్తున్నాడు. సాగు, తాగు నీటి అవసరాన్ని తెల్పుతున్న ఈ గేయంలో,

"గలగల ప్రవహించు జలధారలొలకించు
జీవన ధారలై జీవులను పోషించు
కృష్ణ గోదావరి తుంగభద్రమ్మలు
పరవళ్ళ నెల్లెడల సిరులు పంచిన నాడె
తెలుగమ్మ పండుగ!
వెలుగొందు నిండుగ!!"[39]

అని నదులు నీటి పరవళ్ళతో సస్యశ్యామలం కావాలని కవి ఆశిస్తున్నాడు. అధికారభాష తెలుగు అమలును గూర్చి తెల్పుతున్నాడు.

"ఆంధ్రదేశము నందు అన్ని తావులయందు
అన్నివేళల యందు అన్ని రంగములందు
అధికార భాషగా ఆంధ్ర మొప్పిన యపుడె
ప్రజల భాషగ ఎదిగి భాసించునప్పుడె
భాషా మహోత్సవం!
ప్రభల నిత్యోత్సవం!!"[40]

అని అందరూ తెలుగు భాషను ఆదరించాలని కవి కోరుకొంటున్నాడు. బిక్కి కృష్ణ అనంతపురానికి చెందిన ప్రముఖ అభ్యుదయ భావాల కవి. ఇతని 'చరమగీతం' గేయ కవితా సంపుటి అభ్యుదయ దృక్పథంతో వెలువడిన కృతి. సమాజంలోని ప్రతి అంశాన్ని స్వీకరించి రచించాడు. శ్రమ జీవుల రెక్కల కష్టాన్ని ఇలా తెల్పుతున్నాడు.

"చేసిన కష్టం కాగా నష్టం

పండక పంట కాగా కాష్ఠం

కడుపులు మండి కరువై తిండి

కష్టజీవులే నష్టజీవులై

ముష్టి ఎత్తుకొని బ్రతకాల్సొస్తే"[41]

కష్టజీవుల కడగండ్లను చిత్రించాడు. పిల్లల చదువులకై రైతుల కష్టాలను తెల్పుతూ,

"పిల్లల చదువుకై, పొలాలు అమ్మి

ఫలాలు అమ్మి పశువుల పంటలనమ్మి

సొమ్ములు ఖాళీయై దమ్ములునీరై

హొరుమని విలపించే పేద రైతు

స్వాంతపు ద్వాంతపు భేదం-ఖరీదెంత?"[42]

పేద రైతుల కష్టం విలువ ఎంత అని ప్రశ్నిస్తున్నాడు. కవి కార్మికులు, శ్రామికుల పక్షం వహిస్తూ ఇలా అంటాడు.

"కార్మికుల స్వేదం నా వేదం

కర్షకుల ఖేదం నా వాదం

ఆర్తుల కళ్ళల్లో జాలిని నేను

అందుకే పల్లవినౌతున్నాను

అన్నార్తుల గుండెల్లో జ్వాలను నేను

అందుకే పాటగ రగలుతున్నాను"[43]

అని కవి తన ఆలోచన తత్త్వాన్ని ప్రకటిస్తున్నాడు. ఈ సమాజంలోని స్వార్థ నాయకులు, దోపిడీ బడాబాబుల స్వభావాన్ని ఎండగడుతూ ఇలా అంటాడు.

"నక్కలే నాయకులైనాయి

కుక్కలే సింహాసనం ఎక్కాయి

ఇక పందికొక్కులు బాగా దోచుకున్నాయి

నల్లబజారులో తలదాచుకొన్నాయి

ప్రజాస్వామ్యమనే దోమల తెరలో

ప్రజల మత్తుగా నిద్రపోతూనే ఉన్నారు

నల్లులు ప్రజల రక్తాన్ని త్రాగుతున్నా
ప్రజలు శవాలల్లే నిద్రిస్తున్నారు
వీళ్ళు మేల్కోవాలంటే
తెల్లవారాలి
తెల్లవారాలంటే స్వాతంత్రం
మళ్ళీరావాలి"[44]

అని ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలోని నాయకులు, ప్రజల స్వభావాన్ని తెల్పుతూ మళ్ళీ స్వతంత్రం రావాలని ఆకాంక్షిస్తున్నాడు. ప్రజలు మొద్దు నిద్రను వీడి మేల్కొనాలని కవి చైతన్యపరుస్తున్నాడు.

"నిద్రమత్తు వదలండి
నిర్నిద్రులై లేవండి
నిర్భరులై కదలండి
గర్జిస్తూ కదలిరండి
రుద్రులై వీరభద్రులై
ప్రతాప రుద్రులై
ప్రళయ సముద్రులై
దోపిడీని శిక్షించి న్యాయాన్ని రక్షించి
కృష్ణులై జిష్ణులై దర్మసంస్థాపన
ధరాగతం చేయండి"[45]

అని సమాజాన్ని చైతన్యం చేస్తున్నాడు.

గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ తన 'కవితా సుమాలు' రచనలో అక్షర సుమాలను కవిత్వీ కరించాడు. 'వృక్షోరక్షతి రక్షితః ' శీర్షికలో వృక్షాలను కాపాడుకోవాలని చెబుతున్నాడు.

"చెట్లు కొట్టకుర అన్నా
చెట్టు కొట్టితే మట్టిమీద
మనబ్రతుకే నరకము రన్నా
అడవుల్లోని మృగాలకంతా చెట్టేగదరా ఇళ్ళు
ఆకాశంలో ఎగిరే పక్షికి– చెట్లే గదరా గూళ్ళు
సృష్టిలోని ప్రతి ఋతువు ఋతువుకు పుష్టినిచ్చురాచెట్లు

వంట చెరుకని, ఇంటి పనికని కొట్టవద్దురా చెట్లు"[46]

చెట్లను నాటి వాటిని పెంచి ఈ సృష్టిని కాపాడుకోవల్సిన బాధ్యతను గుర్తు చేశాడు.

ఎన్.ఈశ్వరరెడ్డి ప్రముఖ కవి. 'మనసుపాట' అనే గేయ కవిత్వాన్ని రచించాడు. ప్రజాకవి వేమనను స్మరిస్తూ గేయాన్ని రచించాడు. ఈ గేయాన్ని కడపలోని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రార్థన గేయంగా అధికారులు స్వీకరించారు.

"యోగివేమన నీకు వందనం
విశ్వ కవితాత్వికా నీకు వందనం
చదువులమ్మా నీకు వందనం
భవిత దిద్దేటి మా తల్లి వందనం
యోగివేమన విశ్వవిద్యాలయం నీకు
వందనం హృదయాభివందనం"[47]

కవి వేమనగారికి కవితానమస్సులు సమర్పించాడు.

"తన్నుతానెరిగిన తానెపోబ్రహ్మమని
పరమాత్మ తత్వాన్ని మాకువిడమరచి
బ్రహ్మమనగ వేరె పరదేశమున లేదు
నీలోనె ఉంది చూడన్నావు తరచి
అంధవిశ్వాసాలు అణగ దొక్కుడటంచు
గుణదోషములు మాకు ఓర్పుతో నేర్పి"[48]

వేమన గారి బ్రహ్మ జ్ఞాన తత్వాన్ని, కవితా సారాన్ని కవి స్మరించాడు. 'నా తల్లి ఆకాశమా' శీర్షికలో రైతు వేదనను చిత్రించాడు.

"నా తల్లి ఆకాశమా
నీటి పొదుగేమి చేశావమ్మ
నీ కోసమే చూసి నీళ్ళు లేక ఏడ్చి
ఎండిపోతున్నాను పైరు పాపను నేను
కరుణించి కాపాడుమా
పాల మబ్బుల్ని కరిగించుమా
..................................

నా తల్లి పుస్తెలు తాకట్టు పెట్టేసి

నా తండ్రి కండలు మట్టిలో పిండాడు

దొంగ జల్లుల తోన ఎక్కిరించి పోతే

కన్నీళ్లనే నేను కానుకగా పంపాల

రాకాసి ఎండమో నీటి తడి మింగేసి

భూమాత గుండెల్లో గునపాలు దించింది

దుక్కిదున్నిన ఎద్దు ఎముకల్ని మోస్తోంది

పచ్చగడ్డి లేక పడవబడి పోయింది"[49]

వాన కోసం రైతు ఎదురు చూపును, రైతు పడే కష్టాలను చిత్రించాడు.

పాలాది లక్ష్మీ కాంత శ్రేష్ఠి 'అక్షర సుమాలు' రచనలో 'స్వర్ణ భారతి' శీర్షికలో ఇలా అంటున్నాడు.

"తెల్లవారల పాలనమ్మున

దేశసంపద కరగిపోగా

స్వేచ్ఛగా వాయువులు

పీల్చగ, వీలుపడకా

కనులు విప్పిరి భరతపుత్రులు

తొడలు చరిచిరి భరత వీరులు

దీక్షభూనిరి త్యాగనిరతులు

చూచి పరుగిడి నారు వారలు

దిక్కు తెలియని తెల్లవారలు

విరిగిపోయెను శృంఖలమ్ములు

భరతమాతకు స్వేచ్ఛ వచ్చెను

స్వపరిపాలన మనకు దక్కెను

బరువు బాధ్యత లెంతో పెరిగెను

ఏబదేడులు సాగిపోయెను

ఎంతవడిగా వెళ్ళిపోయెను

ఎంత మృదువుగ గడచిపోయెను

మంచిచెడ్డల మేలుకలయిక"[50]

బ్రిటీషు వారి బానిస సంకెళ్ళ నుండి భారతదేశం విముక్తి పొంది, స్వాతంత్ర్యాన్ని సంపాదించి, స్వేచ్ఛా జీవులుగా మారినవైనాన్ని కవి చిత్రించాడు.

వట్టిపల్లి సుబ్బరాయుడు 'నాడూ–నేడూ' శీర్షికలో ఇలా అంటున్నాడు.

"సిరియు సంపదలెల్ల సీమజేరుట గాంచి
దోపిడీ రాయుళ్ళ దొరతనము వద్దంచు
పాశ్చాత్య పాలనను పనికిరాదని యెంచి
జన జాగృతిని సేయ సమకట్టె దేశమ్ము
దేశస్వాతంత్ర్యమే ధ్యేయమ్ముగా నెంచి
సర్వోత్తమంబైన సంచలన శక్తియై
సంఘటిత శక్తియై సాగర గభీరమై
నిలిచె నొక త్రాటిపై నేల యీనినయట్లు
.........................................
యువతరము కదిలింది ఉగ్రావతరమై
పచ్చి నెత్తురు తోడ పారాణి దిద్దంగ
దేశమాతకు రక్తతిలకమర్పింపంగ
శత్రు శీర్షంబులే హారావళులుగాగ
విప్లవంబొక్కటే విధ్యుక్త ధర్మమని"[51]

మన భారత జాతి విముక్తి కోసం స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం యావత్తు దేశాన్ని సమైక్యం చేశాడు కవి.

వై.హరేరామ మూర్తి 'కలిమిబలిమి' శీర్షికలో ఇలా అంటాడు.

"రామ రాజ్యము రామరాజ్యము– ఎక్కడున్నది అన్నయా
లేమి లేని కలిమి బలిమియే రామరాజ్యము చెల్లెలా
బీటవారిన నారుమళ్ళకు
మోటబావిలో నీళ్ళుకరువై
మోరలెత్తి నింగిచూసె
రైతన్నకు దారి ఏదిర? అన్నయా
ఉరుకు నదుల పరుగునాపి
తరిగిపోని వనరు జూపి

పంట కాల్వల నీరుసాగ

సాగుబడిలో మేలుకలుగ

రామరాజ్యము ఎక్కడున్నది చెల్లెలా"[52]

రైతులు, ప్రజలు కష్టాలతో తల్లడిల్లిపోతుంటే రామరాజ్యం ఎక్కడుంది అని కవి ప్రశ్నిస్తున్నాడు.

సింగార సుబ్బరాయుడు 'మేలుకో' శీర్షికలో కవి తన ఆలోచనను ఇలా వ్యక్తీకరిస్తున్నాడు.

"నాలోని కవీ!

మేలుకో మేలుగోరి

కాగితమనే భూతలంపై

కలమనే హలం దించి

సిరాయనే నీరు పారించి

సాలు చూసి సాగు చేయి

..............................

అల్పాక్షర విత్తుల నిసిరి

మెదడు బురద సత్తువ నేసి

అనల్ప దిగుబడి సాగించు

శ్రమ మాన్యఫలం

సమంగా ఎంచిపంచు

...................................

నీ ఆలోచన అనుభవాల జంట

కావాలి నీ కవితల పంట

కమ్మని రుచుల పిండి వంట

ఇంటింటా ప్రతియింట

చల్లార్చు దీనుల కడుపు మంట"[53]

కవి కవన సేద్యం చేస్తూ బీజాక్షరాలను చల్లి సాహితీ పంటను పండిస్తున్నాడు.

వి.శివరామయ్య 'దేశభక్తి గీతం' శీర్షికలో యువతరాన్ని, నవతరాన్ని మేల్కొలుపుతున్నాడు.

"ఈ దేశం మనదేశం మన కన్న గొప్పదోయి

దేశభక్తి కన్న మిన్న వేరే లేనే లేదుర

దేశభక్తి లేని వాడు దేశమిడచి పోవర

........................................

నా దేహం నా ప్రాణం నా దేశ రక్షణకు

ఫణముగానే నొడ్డి అణచివేతు శత్రువులను

యుద్ధకాలమునందున యోధునిగా నిలచి నేను

సరిహద్దుల సంరక్షణ సతతమెపుదు కాతును

..................................................

ఈ దేశం నాదనగ ఈ గాలి ఈ పంటలు

నా దేశం నాకీయగ నా మనుగడె సాగుచుండ

నా సర్వమె ఈ దేశం నా ధ్యేయమె త్యాగనిరతి

దేశరక్షణే నాకు తృప్తి దేశభద్రతే నాకు ముఖ్యం"[54]

భారత జాతి రక్షణకు, భద్రతకు యువతలోని కర్తవ్య దీక్షను, బాధ్యతను గుర్తు చేస్తున్నాడు.

**5.3. ఖండకావ్యం:**

రాయలసీమ కవులు ఖండకావ్యాలను తక్కువగా రాశారు. ఎ.సి.దస్తగిరి, పాలాదిలక్ష్మీ కాంత శ్రేష్ఠి, ఎలూరి యంగన్న, అంతటి నరసింహం, మన్నవ భాస్కరనాయుడు, కరణం బాల సుబ్రహ్మణ్య పిళ్ళై లాంటి కవులు ఖండ కావ్యాలు రాశారు.

ఎలూరి యంగన్న గారి 'శాంతిశిఖరం' అధునాతన ఖండ కావ్యం. ఈ సృష్టికి మూలమైన అణువు గూర్చి ఇలా అంటాడు.

"విశ్వసృష్టికి పరమాణు బీజమాది

అణువు కదలిక చైతన్యమై రహించె

అణు రవంబాది యౌ శబ్దమై ధ్వనించె

అణువు లేకున్న భూగోళ మసలుసున్న"[55]

ఈ సృష్టికి బీజమైన అణువు ప్రాముఖ్యతను తెల్పాడు. నిత్యవసర సరుకులు, వస్తువులు వాటి ధరలు పెరుగుతున్న తీరును చెబుతూ,

"చుక్కలనంటెను ధరలిపు

దక్కజముగ వెక్కిరించె నంగడి సరుకుల్

నిక్కము సామాన్యుల కడు

నిక్కట్టులు మాడ్చె, మండుటెండల మాడ్కిన్"[56]

సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు కొనలేని విధంగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మతం గూర్చి ఇలా అంటాడు.

"మనిషి మనిషి మధ్య మాయగోడలు నిల్పి
మతుల చెఱచు పాడు మతము కన్న
సకల జనహితంబె సర్వోత్తమంబని
చాటమేలు! సత్యసమ్మతమ్ము!"[57]

మతాలు, కులాలు మనిషి మనిషికి మధ్య దురాన్ని పెంచుతున్నాయి.

"అరుణకాంతి విరిసి, అన్యాయ తిమిరమ్ము
పరుగుదీసి, అధిక ధరల మంచు
బిందువులును సమసి పేదపద్మాలమో
ములు హసించునాడె కలలు పండు"[58]

అన్యాయాలు, అక్రమాలు నశించి అధిక ధరలు తగ్గిపోయి పేద, మధ్యతరగతి ప్రజల ముఖాలలో నవ్వులు పూసినపుడే నిజమైన సమతాభావం సిద్ధిస్తుంది.

"ఎంతదోపిడి జేసిననేమి ఫలము?
దోచబడ్డ అనాధలే త్రాచులైన
ఎంత రాపిడి సల్పిన నేమి సుఖము?
రాచబడ్డ అభాగ్యులే ఱేచులైన"[59]

దోపిడీ, అన్యాయానికి గురైన అనాథలు, అభాగ్యులు ఏదో ఒక రోజు తిరగబడుతారు.

"పరుల తప్పులనెన్నుచు పనికిమాలి
స్వీయ ధర్మమ్ము మఱచిన శ్రేయమొక్కొ
తనదు బాధ్యత తానెఱిగినను చాలు
దేశమంతయు సిరులతో దేజరిల్లు"[60]

ఎల్లప్పుడూ ఎదుటివారి తప్పులను ఎత్తిచూపుతూ తన తప్పును, బాధ్యతను విస్మరిస్తారు. తన బాధ్యతను గుర్తెరిగినవాడే మనిషిగా మెలగుతాడు. ఈ సమాజం, దేశం బాగుపడుతుంది.

### 5.4. శతకం:

తెలుగు సాహిత్యంలో శతకానికి విశిష్ఠ స్థానముంది. రాయలసీమ కవులు శతక సాహిత్యానికి

విశేషమైన కృషి చేశారు. ఈ ప్రాంతంలో భక్తి, నీతి శతకాలు ఎక్కువగా వున్నాయి. సామాజిక అంశాల నేపథ్యంలో కొన్ని శతకాలు వెలువడ్డాయి. దాదన చిన్నయ్య బాల్యదశ నుండే కవితాసక్తిని పెంచుకున్నారు. వీరు శ్రీ బళ్ళారి దుర్గాంబికా శతకము, శ్రీ అంజనేయ శతకము, శ్రీ భరతమాతృ శతకము లాంటి శతకాలు రచించాడు. శ్రీ అంజనేయ శతకంలో సామాజిక స్పృహ మరియు లోక నీతులు చోటు చేసుకొన్నాయి.

"భక్తి నెందు రామభజన సాగుచునుండు
పాణియుగము శిరముపైని జేర్చి
కనుల బాష్పజలము కదలనందుండవే
అమర నికర గేయ! ఆంజనేయ"[61]

అని శ్రీరాముని పై ఆంజనేయ స్వామికి గల భక్తి భావాన్ని తెల్పాడు. శ్రీ భరతమాతృ శతకములో అన్నీ సామాజికాంశాలే వున్నాయి.

"కన్నవారి జబ్బు కనులతో జూచియు
వారిమూల్గు చెవుఁజేరనీక
మందు కొట్టు కొడుకు మందులిప్పించునా?
భవ్యగుణసమేత! భరతమాత!"[62]

అని తల్లిదండ్రులను చూడలేని వారి అరోగ్య పరిస్థితులను పట్టించుకోని కొడుకులను గూర్చి తెలుపు తున్నాడు.

సిద్దేశ్వరం కొల్లప్ప సద్గురు శతకం, శ్రీరంగ శతకము, మనసా శతకములను రచించాడు. సద్గురు శతకము 1999లో ముద్రించబడింది.

"వ్రాసెదనిత్తరిన్ శతకరాజము దేశికునాజ్ఞ జ్ఞాన జి
జ్ఞాస గలట్టి వారలకు సంస్కృతి వారధి మున్గ వారికిన్
ఊసు చనంగ వ్రాయనిది ఊర్జిత దంతములున్న వారికే
పోసితి పప్పులన్ నమలి మోదము నందగ సంతసద్గురూ!"[63]

వృత్త పద్యాలలో ఈ శతకం సాగుతుంది. మనసా శతకం 2000 సం॥లో అచ్చయినది.

"నీ వుండిననె ప్రపంచము
నీవున్న కళత్ర పుత్ర నిచయము కలుగున్
నీవున్ననె సుఖ దుఃఖము
లేవైనను పొడముచుండు నెప్పుడు మనసా!"[64]

అని 'మనసా' అనే మకుటంతో కందపద్యాలలో రచించాడు. ఉమ్మడి శెట్టి లక్ష్మయ్య 'మారుతీ శతకం' రచించాడు. అందులో ఒక పద్యం.

"గుణ విహీనులైన కొడుకులు గల తల్లి
కన్న గొడ్డురాలు మిన్నగాదె
సుగుణవంతులైన సుతులున్న స్వర్గమ్ము
అక్కివారి పల్లె ఆంజనేయా"[65]

అని సరళ వ్యావహారికంలో ఈ శతకాన్ని రచించాడు.

వారణాశి ఆంజనేయ శర్మ కాశినాయన శతకము, ఆంజనేయ శతకాలను రచించాడు. ఆంజనేయ శతకంలో నీతిబోధక పద్యం,

"వాదులాడరాదు వంచింపగారాదు
కపటవృత్తి మదిని కలుగరాదు
నియత వృత్తి గలుగ నిర్మల సౌఖ్యము
కలసపాటి హనుమ! కరుణగనుమ"[66]

నీతిని బోధించే పద్యాలను రచించాడు.

పుత్తూరు వేంకట సుబ్రహ్మణ్యం శ్రీవేంకటేశ్వర శతకం, శ్రీకృష్ణ శతకాలు రచించాడు. శ్రీ వేంకటేశ శతకం నుండి ఈ క్రింది పద్యం.

"సాధనంబు లేక సంగీతమబ్బునే
దాన మియ్యకున్న దాతయగునె?
బేరమాడకున్న బేపారమగునయ్య
వినుతగుణ వికాస! వేంకటేశ!"[67]

అనంతపురానికి చెందిన మాద్గుల ఆదినారాయణ శాస్త్రి గారు 'సద్గురు రాఘవేంద్ర శతకం'1988లో ప్రచురితమైంది. ఇందులో భక్తిభావాలను ఇనుమడింపజేశాడు.

"క్షామముల బాపి జనుల సంక్షేమ మరసి
చీకటుల దుల్చి జగముల శోకమడసి
శాశ్వతానంద మొసగవే సార్వభౌమ
రమ్యగుణ సాంద్ర! సద్గురు రాఘవేంద్ర"[68]

అని రాఘవేంద్ర స్వామి మీద భక్తి విశ్వాసాలను ప్రకటిస్తూ స్వామి మహిమలను కొనియాడాడు.

కడపజిల్లాకు చెందిన బాలశ్రీ 'బాలశ్రీ శతకం' రచించాడు. 1992లో ముద్రించబడింది. ఇందులో నీతిబోధ ప్రధానమైనది.

"గంగలో స్నానమాడిన ఘనతరాదు
గుడులు దిరిగిన మాత్రాన గొప్పగాదు
పూని జనసేవ చేసిన పూజ్యుడతడె
పాలగిరి బాలుడు పలికె పసిడి వాక్కు"[69]

అని సమాజ శ్రేయస్సు కోసం నీతులను తెలుపుతుంది.

కర్నూలు జిల్లా నంద్యాలకు చెందిన వైద్యం వేంకటేశ్వరాచార్యులు గారి 'తెలుగు భాష శతకం' 2003లో ప్రచురించబడింది. ఈ శతకం తెలుగు భాష గొప్పధనాన్ని, మాధుర్యాన్ని, విశిష్టతను తెలుపుతుంది.

"భాష లెన్నియైన భాషింపగావచ్చు
తెలుగు వార మౌట తెలుగునాట
పల్కుతేనె లొల్క స్వచ్ఛందముగా పల్క
వలయు గాదె మనము తెలుగు భాష!"

అని తెల్పుతూ మరొక పద్యంలో,

"అన్యభాష లెన్నియైన నేర్వగ వచ్చు
మాతృభాష నెపుడు మరువబోకు
తరుణులెందరున్న తల్లిని మరతురే
పలుక వలయు మనము తెలుగు భాష!"[70]

అంటూ మాతృభాషను మరువరాదని గట్టిగా నొక్కి చెబుతున్నాడు.

చిత్తూరు జిల్లాకు చెందిన ప్రముఖ కథా రచయిత, బుర్రకథ కళాకారుడు పులికంటి కృష్ణారెడ్డి 'ఆటవెలదుల తోట' అనే శతకాన్ని రచించాడు. ధనదాహం గూర్చి ఇలా అంటాడు.

"దేహమందున ధనదాహమే తీరదు
తీర్చుకొలది పెరిగి తీరుమార్చు
కట్టెలందు పెట్టి కాల్చిన తీరునా?
కంటి నలుసుర పులికంటి మాట!"[71]

అని డబ్బుపై మనుషులకు గల వ్యామోహన్ని తెల్పాడు. మనుషుల మధ్య సంబంధాల గూర్చి ఇలా అంటాడు.

“మనిషి మనిషి మధ్య మమతానురాగాలు
మట్టగించు చుండ మథన మిగిలె
నాగరికత మిత్తినమలగా మమతను
కంటి నలుసుర పులికంటి మాట!”[72]

మానవ సంబంధాలు, మమతానురాగాలు మనుషుల మధ్య దూరం అయితే మనుషులకు తీరన వ్యథ మిగులుతుంది. మనిషికి ఉండాల్సిన ఆత్మస్థైర్యాన్ని చెబుతూ,

“ధనము బలముకన్న దైవబలము కన్న
గుండె బలముకన్న కండకన్న
అసలు మనిషి బలము ఆత్మవిశ్వాసమే
కంటినలుసుర పులికంటి మాట!”[73]

అని అన్ని బలాలకన్న మనిషికి ఆత్మవిశ్వాసమే ముందుకు నడిపిస్తుందని కవి ప్రభోదిస్తున్నాడు.

ఒంటెద్దు రామలింగారెడ్డి గారి శిష్య శతకం 2013లో ముద్రితమైంది. ఈ శతకంలో విద్యార్థులు అలవర్చుకోవాల్సిన ఎన్నో నైతిక విలువలను కవి సమకూర్చారు. నైతిక విలువలతో పాటు ఇతర సామాజికాంశాలను కవి రచించాడు.

విద్యార్థుల చదువు గూర్చి ఇలా అంటాడు.

“చదువు కొనెడి విద్యార్థులు
హృదయము నిర్మలముగా వివేకముతోడన్
విధినియమ వర్తనంబున
చదివినచోనబ్బు గొప్ప చదువులు శిష్యా”[74]

అని విద్యార్థులు ఎలా చదువుకోవాలో తెల్పాడు.

“తెలవారగనే లేచుట
నలవాటుగ జేసికొనుట నత్యుత్తమమౌ
తొలిజామునందు చదువులు
విలసితమై హృదయమందు వెలయును శిష్యా”[75]

విద్యార్థులు తెల్లవారుజామునే లేచి చదువుకోవాలని సూచిస్తున్నాడు. మాతృభాష గూర్చి ఇలా అంటాడు.

“పుట్టుక నిచ్చిన తల్లిని
పుట్టవయై ఉగ్గుపాల బొలిచెడి భాషన్

కట్టడివై మరచిన చో

జెట్ట కృతఘ్నతయు నీకు జేకురు శిష్యా"[76]

జన్మనిచ్చిన తల్లిపాలవలె మాతృభాష నీకు వృద్ధిని చేకూర్చుతుంది.

సవ్వప్పగారి ఈరన్న కర్నూలు జిల్లాకు చెందిన కవి. ఈయన అనేక రచనలు చేశాడు. 'సత్యరుక్కు' అనే శతకాన్ని రచించి 2014లో ప్రచురించాడు. కొంతమంది మనుషులు మాయమాటలతో మోసం చేసే విధానాన్ని తెల్పుతున్నాడు.

"మాయ మాటలెన్నో మంచిగా వినిపించు

మనిషి మర్మమెరిగి మసలవలయు

మోసకారి బ్రతుకు ముప్పుకు చిహ్నము

సవ్వపార్యవాక్కు సత్యరుక్కు"[77]

అంటూ మనుషులు మాయ మాటలతో నమ్మించి మోసం చేయుటను తెల్పాడు. హత్యలు, ఆత్మహత్యలు గూర్చి ఇలా అంటాడు.

"హత్య, ఆత్మహత్య- అపరాధములు ధాత్రి

భీతిని విడనాడి-బెంగవదిలి

బ్రతుకు బాట మీద-పయనింపశుభమౌను

సవ్వపార్యవాక్య-సత్యరుక్కు"[78]

మనుషులకు చైతన్యాన్ని కలిగిస్తున్నాడు. వరకట్న విషయాన్ని తెల్పుతూ,

"కట్నకానుకలని - కన్యలన్ వేధింప

ధర్మమార్గమగునె- ధరణియందు?

కష్టపడగవచ్చు-కాసులే సుఖమిచ్చు

సవ్వపార్యవాక్కు-సత్యరుక్కు"[79]

కట్నకానుకలు అంటూ స్త్రీలను వేధించడం మంచిదికాదని కవి తెల్పుతున్నాడు.

**5.5. పాట:**

పాటలు జానపదుల(పల్లె ప్రజలు) వ్యవహారంలో భాగమైనవి. మనిషి మనసుకు హాయి నిచ్చేవి, సాంత్వనను చేకూర్చేవి. పల్లె ప్రజల నాలుకలపై నాట్యమాడేవి. పాట జనసమూహన్ని చైతన్య పరుస్తుంది. మేల్కొలుపుతుంది. రాయలసీమలో పాటలు తక్కువగా వెలువడినప్పటికీ అవి జనాదరణ పొందాయి. కవులు, రచయితలు పాటలు రచించారు. బి.పాండురంగారెడ్డి, షేక్ మహమ్మద్ ముస్తఫా,

ఆశావాది ప్రకాశరావు, హెచ్.జి.పద్మావతి, జెట్టి జైరామ్, ఎన్.ఈశ్వర రెడ్డి లాంటి కవులు పాటలు రచించారు.

ఆశావాది ప్రకాశరావు 'విరిదండ-పెనుకొండ' అనే శీర్షికలో పెనుకొండను స్మరించాడు

"ఇదే ఇదే మనకండ..ఘనమైన పెనుకొండ
కీర్తికీ కుదురైన పెద్ద విరిదండ
రాళ్ళపల్లీ శర్మ రాగాల కులికింది
పుట్టపర్తీ కవిత లక్ష్మియై ఒదిగింది
భట్టుమూర్తీ వీణ పరవశించింది
వీర విక్రమ మిచట ఏరులై పారింది
గాంధర్వ గానమే గంగయై దూకింది
సాహిత్య విజయాల సంద్రమే పొంగింది"[80]

అంటూ పెనుకొండ వైభవాన్ని సాంస్కృతిక సాహిత్య సమ్మేళనాన్ని కీర్తించాడు.

గొల్లాపిన్ని సుబ్రమణ్యశర్మ 'కరువు-పాట' శీర్షికలో రాయలసీమ కరువు దృశ్యాలను చిత్రించాడు.

"ఏమని సెప్పేది బాబు
ఇంకేమని సెప్పేది బాబు
కటకటామని మేము
కరువుతో సత్తుంటే
నీళ్ళు బువ్వా లేక
ఊళ్ళోదిలి పోతుంటే
పాలిచ్చి పసిబిడ్డ- పానాలు నిల్పిన
పశువులు కొన్నేమో- పానాలు ఇడిసాయి
మరికొన్ని కాసాయి- వాడితో నడిసాయి
రైతన్నలకు తోడు - నీడగా ఉండేటి
బఱ్ఱెలు, ఎద్దులు- బఱ్ఱెంకలైనాయి
మట్టి మిద్దెల పక్క- మట్టిలో కలిసాయి
తడిలేక నేలపై - వేరుశనగ సెట్లు
సెరుకు వరిపైరంత-తలలు వాల్సేసాయి
కరిమబ్బులను సూసి- కనికరించన్నాయి

మోదైన సెట్లు- సేతులతోన కొండలు

ఎండిపోయిన గుండెలను -సూపుతున్నాయి

వర్షింసమని వాన- దేవుడిని ఏడాయి"[81]

అంటూ సాగే ఈ పాటలో సీమలో కరువు భయానక దృశ్యాలను, వర్షాలు లేక తల్లడిల్లుతున్న రైతుల దీనావస్థలను కవి చిత్రించాడు.

షేక్‌మహమ్మద్ ముస్తఫా 'రాయలసీమ కన్నీటిపాట' ను రచించాడు.

"నీరు పారే ఏరులేక

పైరు పండే దారి కానక

దుఃఖ నదులే కలయచూచి

చీకు చింతల గూటిలోన

వాసముండే సీమరైతల

గుండెలో సుడిగుండాలను

లెక్కకట్టే గణికుడెవ్వడు?

పెన్నా వంటి నదులు ఉన్నా

అన్నదాతకు నీళ్ల కరవు

మండిపోయెను ఎండలెప్పుడు

మబ్బు కురవక మాయమయ్యెను

నేలతల్లినే నమ్ముకొన్న

కూలి జనులా రైతులన్నల

బ్రతుకులన్నీ బండబారె

భాష్పధారలె నిండిపారె

సీమవాసులె నేతలైతే

జనం ఇడుమలు తొలగుననుట

కల్లలాయెను కలలె మిగిలెను

మూల్గసాగెను జాతినీతి"[82]

అంటూ సీమ రైతుల నీటి కష్టాలు, సేద్యం చేయడంలో గల శ్రమను చిత్రించాడు.

కడప జిల్లాకు చెందిన యర్రగుడి రామాంజనేయలు 'గుండెగది' కవితా సంపుటిలో పాటలు

వున్నాయి. ‘ ఓ మానవుడా’ శీర్షికలో కులమత భేదాలు గూర్చి తెల్పుతున్నాడు.

“ఓ మానవుడా ఏమిటిరా ఈ వింత
ఇక మారవా నీ వింక
కులమత భేదం వదలరా
కలిసిముందుకు సాగరా!
ధనవంతులు పీల్చేది ఈ గాలేరా
నిరుపేద పీల్చేది ఈ గాలేరా
అందరి ఆకలి తీర్చేది
ఈ మట్టిన పుట్టిన గింజలేరా
ఈ గాలి కులమేదిరా
ఈ నేలకు మతమేదిరా”[83]

అంటూ వీరి పాట సాగుతుంది. ‘ఎడారిలోకం’ శీర్షికలో ఇలా చిత్రించాడు.

“నీరు దొరకదు ఎడారిలో పేదకడుపు నిండదీ లోకంలో
నీతి న్యాయం శూన్యం ధనమే మనిషికి ముఖ్యం
రెక్కలు ముక్కలుగ పనిచేసినా
చెఱువు నిండుగా చమటచిమ్మినా
నీ కడుపు మాత్రం నిండదురా
అది పెద్దలకే దక్కునురా
అన్నము లేక నీకు జబ్బురా
తిన్నది అరగక వారికి జబ్బురా
దొరికినప్పుడే నీకు తిండిరా
ఆకలుంటేనే వారికి తిండిరా
ఓటు వేయుటే నీ వంతురా
నోట్లు పొందుటే వారి వంతురా
నీకు చెప్పే తియ్యని మాటలు
నీటి మీది రాతలురాల”[84]

అంటూ సమాజంలో పేద ప్రజల కన్నీటి బాధలను, రాజకీయ నాయకుల స్వార్థ పూరిత కుతంత్రాలను

చిత్రించారు.

'బ్రతుకు వీణ' శీర్షికలో పాట ఈ విధంగా రచించారు.

"సంగీత భరిణ నా బ్రతుకు వీణ
ఆ వీణను మీటవే నా కుందర వదనా
పలికించవే సంసార సరిగమ స్వరాలు
మన కలయిక వీడదు ఎన్ని జన్మలు
ఎల దోటలో ఎలనాగ నీవై
వెన్నెల్లు వొలికే ఎలనవ్వు నీదై
ఎలమేయని పంటగా
ఎడబాయని జంటగా
కమనీయ వనములో కలకంఠి నీవై
నీ కంఠగానమే నాకానంద గానమై
నా కలలను పండించగా
మన కలయిక నిలిచుండగా"[85]

అంటూ ఇద్దరి ప్రేమికుల మధ్య సాగే ప్రణయాన్ని చక్కని పదాలతో మధురంగా చిత్రించారు.

'కరువుపాట' శీర్షికలో రైతులు వర్షాల కోసం ఎదురు చూసి పడే కష్టాలను చిత్రించాడు.

"సాగిపోయే మేఘమాలా
ఆగిచూడవే ఈ నేల
దాహమేసి ఎదురు చూసే
పుడమి తల్లిని కాంచవేల
మానులన్నీ మోడువారగ
పక్షులన్నీ ఎగిరిపోయె
చెరువులన్నీ ఎండిపోవగ
జలచరాలు జీవముడిగె
భూములన్నీ బీటలు వారగ
జంతుజాలము సమసిపోయె
వికృతమైన ఈ ప్రకృతి గాంచి

నీ గుండె కరుగదు బండవారెనా

వానకోసం ఎదురుచూసి

రైతు కన్నుల నీరుగారె

అప్పుతెచ్చిన పంట గింజలు

తిండి గింజలుగా మారె

కూటికోసం కూలి జనులై

దూర ప్రాంతం వలసపోయిరి

వల్లకాడు లీ పల్లెల జూచి

నీ గుండె కరుగదు బండ వారెనా"[86]

వర్షాలు రాకపోవడం వల్ల ఎదురయ్యే గడ్డు పరిస్థితులను కవి చిత్రించారు.

జెట్టి జైరాం విప్లవ భావాలు గల కవి. రైతులు పడే కష్టాలు, కరువు భయానక దృశ్యాలను 'నీ చాకిరంతా వెట్టిదిరోరన్నో రైతన్నా' అంటూ పాడుతున్నాడు.

"కరువు కరువుకూ నలిగిపోయితివి

నీళ్ళకు గంజికి కరువై పాయెను

భూములొదిలీ ఇండ్లు వొదిలీ

పెళ్ళాం పిల్లల వెంట బెట్టుకొని

కూలీనాలీ వెతుక్కుంటూ

టౌన్లదారీ బట్టితిరో రన్నో రైతన్నా!

నీ గోడు ఎవరూ విన్నరురో రన్నో రైతన్నా

వానలు వచ్చె వంకలు బారె

ఆశతో పల్లెకు చేరుకొంటివి

ఇత్తనం కాయా అప్పుదెస్తివీ

బాకీగోసీ ఎద్దులు గొంటివి

ఎరువుల ధరలూ పెరిగిపాయెను

మందుల ధరలూ పెరిగిపాయెను

సొమ్ములమ్మితివి ఎరువులు కొంటివి

సామాన్లమ్మి మందులు కొంటివి

రెక్కలు విరుగా కష్టం జేస్తివి
కల్లాల్ జేసీ పంట దెచ్చితివి
పంటదెచ్చీ మార్కెట్ కోస్తే
గిట్టుబాటు ధరలే లేవు రన్నో రైతన్నా!
నీ చాకిరంతా వెట్టిదిరో రన్నో రైతన్నా!"[87]

అంటూ 'ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా' అనే పాట ధోరణిలో పాడుకునే విధంగా ఈ పాటను కవి రచించాడు.

కర్నూలు ప్రాంతానికి చెందిన హెచ్.జి.పద్మావతి గారు 'పల్లె పాటలు' రచించారు. ఈ పాటల్లో మానవీయ విలువలు, భార్యభర్తల సరదాలు, వివిధ జాతర్లలో పాడుకునే పాటలు, సంతల సంబరాలు, రైతులు, కష్టజీవులు ఆడుతూ పాడుతూ పనిచేస్తూ అలుపూ సొలుపూ లేకుండా పాడే పాటలు ఇందులో వున్నాయి. ఈ పాటలన్నీ జానపద సాహిత్యానికి చెందినవి. 'రైతు పాట' శీర్షికలో రైతులు కల్లంలో పాడుకునే పాట ఈ విధంగా వుంది.

"వేగుచుక్క పొడిచిందీ!
వేకువ అయ్యిందీ
కాడెద్దులు కట్టరా రైతన్నా
దుక్కిదున్న పదరా రైతన్నా
ఫోలిగ్గా– సలాఫోలిగ్గా– సలసలాఫోలిగ్గా!
తొలికోడి కూసిందీ!
తోకచుక్క పొడిచిందీ
మొద్దు నిద్ర మానరో రైతన్నా
సద్ది అన్నము మూటకట్టరో రైతన్నా
తొలకరి వానజల్లు తొందర పెడుతున్నది
చిత్తకార్తె వచ్చింది చిరుపురు లాడింది
విత్తనాలు వెయ్యమందిరో రైతన్నా
సత్తువ చూపమందిరో రైతన్నా
ప్యాడయెరువు కలుపుకోని
విత్తనాలు సర్దుకొని

అదును జూచి పనిచెయ్యరో రైతన్నా

పదును జూచి విత్తుమురో రైతన్నా"[88]

అంటూ రైతులు సేద్యానికి సిద్ధమయ్యే విధానాన్ని చిత్రించారు.

## 5.6. వచనకావ్యం:

ప్రపంచంలోని ఏ భాషా సాహిత్యాల్లోనయినా సాధారణంగా పద్యం, గద్యం అని రెండు రూపాలు ఉంటాయి. ప్రాచీన తెలుగు సాహిత్య చరిత్రలో పురాణేతిహాసాలు, మహా కావ్యం, ప్రబంధం వంటి పద్యరూప రచనలే ఆధిపత్య స్థానాల్లో నిలిచాయి. పద్యంతోపాటు గద్యం అనేక పాయలుగా విస్తరించి ఉంది. శాసనాల్లో ఉండేది తొలిదశ వచనం. పద్యగద్య మిశ్రితమైనవి చంపూ కావ్యాలు. వచన రూపంలో వుండేవి రాజుల పొగడ్తలు, దేవుడికి చేసే స్తోత్రాలు, సింహగిరి వచనాలు, శఠగోప విన్నపములు, కథతో నిమిత్తం లేని విడివిడి స్తోత్రాలు. వచనైక రచనల్లో భాగంగా వచన కావ్యం అనే ప్రక్రియ కూడా వుంది. వచనకవిత, దీర్ఘకవిత, దీర్ఘ కథా కావ్యం, వచన కావ్యం కొద్ది తేడాలతో ఇవన్నీ కవిత్వ నిర్మాణ పరిధిలోకి వస్తాయి.

రాయలసీమలో వచనకావ్యాలు చాలా తక్కువగా వెలువడ్డాయి. నాకు లభించిన సమాచారం ప్రకారం మన్నవ భాస్కరనాయుడు గారి 'హృదయోదయం', నాగమ్మ పూలే గారి 'కులగీత' అనే వచన కావ్యాలు లభించాయి. మన్నవ భాస్కరనాయుడు గారి 'హృదయోదయం' వచన కావ్యంలో మనిషి సాధించిన అభివృద్ధిని గుర్తిస్తూ మానవుడు సాధించిన విజయాలను కీర్తించాడు. గతకాలం నుండి నేటి కాలం వరకు మనిషిలో ఎదుగుతున్న అసమానత్వాన్ని, హృదయ రాహిత్యాన్ని ఈ రంగం మీదకు తేవడం మానవుడు ఏకపక్షంగా సాధించే అభివృద్ధి ఈ సృష్టి వినాశకమవుతుందని హెచ్చరిస్తాడు. మనిషి మనిషిగా గుర్తించబడాలి, మనిషిగా మనగలిగి మసలుకోవాలి అని బోధించడం ఈ వచన కావ్యంలోని సారాంశం. ఇందులో ఒక చోట కవి ఇలా అంటాడు.

"చీకటి యుగాన మనిషి ఆకలి కడు

పొకటి నిండిన చల్లారుచుండె, కాని

సైబరు యుగాన విజ్ఞాన జంతువునకు

ఇంద్రియములెల్ల ఆకలి కేంద్రములయె"[89]

అంటూ ఈ ఆధునీకరణ యుగంలో సాంకేతిక పరిజ్ఞానానికి బానిసైన తర్వాత తన హృదయాన్ని కోల్పోయి, కోరికలు పెరిగిపోయి అధోగతికి ఎలా వెళ్తున్నాడో పై పద్యం వల్ల తెలుస్తుంది.

"సంస్కార విజ్ఞాన సంపద నీడలో
విశ్రాంతి లేని వృద్ధాశ్రమాలు
అభ్యుదయ జ్ఞాని యజ్ఞకుండాలలో
ఫాస్ట్‌పుడ్డు బోజన ఫలరసాలు
విప్లవ జ్ఞాన వివేక యుద్ధాలలో
చెవి పోగులవుతున్న సెల్లుఫోన్లు
అత్యాధునిక భారమైన జ్ఞానార్తిలో
వెర్రిపండించు టి.వి.ల ఛానళ్ళు
ఆధునిక జనత సమతా ధురణ
వాద ఫలములు వరదలో బాష్పములయి
కొట్టుకొని పోయెనా, కనుకట్టులేన
నీ నవాద్భుతాధునికతా జ్ఞాన కథలు?"[90]

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్న నేటి సమాజం తన సాంస్కృతిక మూలాలను మరిచిపోతున్నది. సాంకేతిక మాయాజాలంలో మనిషి బంధించబడుతూ వస్తు వ్యామోహం పెరిగిపోతున్నది. ప్రపంచీకరణ అనేది ఈ సమాజ స్వరూపాన్ని, మనుషుల ప్రవర్తనను ఏవిధంగా మార్చివేసిందో కవి తెల్పాడు.

కర్నూలు జిల్లాకు చెందిన నాగమ్మ ఫూలె కవయిత్రిగా ప్రసిద్ధి చెందింది. 'కులగీత' అనే వచన కావ్యాన్ని రచించి 2005లో ప్రచురించారు. ఈ కావ్యాన్ని దళిత బహుజన అభ్యుదయ దృక్పథం గల మహాకావ్యంగా గుర్తించారు. కుల నిర్మూలన దృక్పథంతో చరిత్రని సామాజిక సంబంధాలని, ఉత్పత్తి సంబంధాలని, వ్యవస్థలని విశ్లేషిస్తూ ఈ కావ్య రచన సాగింది. ఈ కావ్యం ఇలా ప్రారంభమౌతుంది.

"చరిత్ర పొరల నిండా
ముసుగు కప్పిన దాఖలాలు
శాసనాల శిలాఫలకాల నిండా
చిక్కు వీడని ఆనవాళ్ళు
పురాణ పుటల నిండా
అంధ విశ్వాసాల చెరసాలలు
మనిషి మస్తిష్కం నిండా

ఇంకి పోయిన నిజాల యిజాలు
మేకులు దిగ్గొట్టిన మేధస్సు నిండా
కర్మ సిద్ధాంతాల రాద్ధాంతాలు
భూతలం నిండా
భూదేవుళ్ళు సృష్టించిన దేవుళ్ళు
హిందూ కులవ్యవస్థ నిండా
బానిసత్వం మొలకెత్తిన బతుకులు
సమాజ చరిత్ర నిండా
మిరాశి శాసనాల శాపాలు
చరిత్ర అందించిందంతా
ఆకలి అంచున గాయపడ్డ భవిష్యత్తులు"[91]

ఈ దేశంలో కర్మసిద్ధాంతాలు, కులవ్యవస్థ ఈ సమాజగతిని, స్వరూపాన్ని అనాది కాలం నుండి ఏవిధంగా మార్చివేసిందో కవయిత్రి తెలిపారు. ప్రజల భాషల్ని అణగద్రొక్కి సంస్కృతానికి పట్టం గట్టిన వైనాన్ని ఇలా చెప్పింది.

"ప్రాచీన భాషలైన
పాళీ, పైశాచిక ప్రాకృతాలను
రూపు రేఖలు లేకుండా చేసి
ఇరాన్ పదాలను ఇరికించి
సంస్కృతంగా సంస్కరించి
ఊడిపడిందని, దేవతల ముఖాల నుంచి
ఇది పక్కా దేవతల భాషని
ఆర్యులు తప్ప అన్యులెవ్వరు చదవరాదని
వేదాలు వెలయించి
ఆరంగ్రేటం చేసిన ఆర్యబ్రహ్మ"[92]

మన దేశంలో భాషా చరిత్రకు సంబంధించిన పునాదిని నాగమ్మ గారు ఇక్కడ ప్రస్తావించారు. మనువాద సిద్ధాంతం అంటరాని వారిగా అస్పృశ్యులుగా ఎలా ముద్రవేసిందో కవయిత్రి ఇలా చెప్పింది.

"దళిత పుట్టకనే
శాపంగా మార్చిన వేదమతం
దళితులను దూరముంచి
అస్పృశ్యతను అంటగట్టిన హిందూమతం
చదువు సంస్కారానికి దూరమయి దళితులు
పుట్ట బానిసత్వంలో మునిగి దళితులు
అల్లకల్లోలం రేగిన
మానసిక ప్రస్థాన ఉప్పెనలు
మానవత్వం మీద
కసి పెంచుకున్న మనస్తత్వాలు
అస్పృశ్యత కంటె హీనమయినది
అంటరాని తనం కంటె వెగటయినది
పంచకత్యం కంటె పనికిమాలినది
దళితత్వం కంటె దయనీయమైనది
మరొకటుండదనే
మానసిక ప్రవృత్తిని ప్రతిష్టించుకున్నవాళ్లు"[93]

అంటూ దళితులు ఈ సమాజం నుంచి ఎలా వెలివేయబడి అవమానింపబడ్డారో కవయిత్రి తెలిపింది. ఈ దేశంలో ఆర్యులు ఆధిపత్యం సంపాదించి కులాలను ఎలా సృష్టించారో తెలుపుతుంది.

"కులాల కుంపట్లు నిర్మించడానికి
కలిసొచ్చిన కాలం
ఆర్యుల ఆధిపత్యానికి
అవకాశం కల్పించిన ద్రావిడ సంస్కృతి
నాగరికతకు పునాదులేసి
శాస్త్ర విజ్ఞానాన్ని పైకి తీసి
ప్రత్యేక నైపుణ్యాన్ని ప్రదర్శించిన తెగలకు
ప్రత్యేకతను ఆపాదించి
శ్రమించి సాధించిన వృత్తులను విభజించి

వృత్తుల నుంచి బైటపడిన

విజ్ఞానానికి వెలలేకుండ జేసి

శ్రమ నుంచి సాధించిన సైన్సును

శ్రమ జీవుల కందకుండా చేసి"[94]

అంటూ మనువాదం వృత్తులను విభజించి శ్రమను, విజ్ఞానాన్ని కింది కులాల వారికి అందకుండా చేసిన వైనాన్ని చిత్రించింది. మనువాద బ్రాహ్మణీయ భావజాలాన్ని ఇలా చెప్తున్నది.

"వేదాల్లోని వెట్టిని

ధర్మశాస్త్రాల్లోని దోపిడీని

తెల్సుకునే వీలు లేకుండా

వేదాలు వింటే చెవుల్లో సీసపు గుండు

వేదాలు చదివితే నాల్కపై కాల్చిన పుండు

పదహారు రకాల సేవలు, మాత్రం

పవిత్రులైన క్షత్రియులకు వైశ్యులకు

అపవిత్రులైన శూద్రులకు

అర్హత లేనివి ఆ సేవలు

కన్యలకు గర్భాదానం చేయడం

గర్భిణీ స్త్రీలను దీవించడం

పుట్టిన బిడ్డలకు శాంతి చేసి దీవించడం

జాతకాలు వ్రాయడం

పండుగలు చేయడం

బిడ్డలు లేని స్త్రీలకు గర్భాదానం చేయడం

పెండ్లి చేయడం

చనిపోయిన వారికి కర్మ చేయించడం

ప్రతి సంవత్సరం తద్దినం చేయడం

పదహారు రకాల సేవల రూపం

దోపిడీ రకాలను తెల్పే విశ్వరూపం"[95]

మనువాదంలో చెప్పినట్లుగా ఈ దేశంలో బ్రాహ్మణులు మాత్రమే చేయగలిగే కార్యాలను, మనువాద

సిద్ధాంతాలను ఒంటబట్టించుకొని ఆ భావజాలాన్ని సమాజంపై ఎలా రుద్దారో కవయిత్రి కవిత్వీకరించారు. మనువాదం సృష్టించిన చాతుర్వర్ణ వ్యవస్థను ఇలా చెప్పింది.

"బ్రాహ్మణ వర్గం నిర్వర్తించే ధర్మం
మంత్రాలు తంత్రాలు దేవతల కొరకు
పురోహిత్యాలు పూజలు ప్రజల కోరకు
క్షత్రియ వర్గం నిర్వహించే ధర్మం
రాజ్యరక్షణ మునుల కొరకు
ప్రజల భక్షణ బ్రాహ్మణుల కొరకు
వైశ్యవర్గం అనుసరించే ధర్మం
ధనమార్జన రాజుల కొరకు
ధాన్యమార్జన బ్రాహ్మణుల కొరకు
శూద్రవర్ణం నిర్వహించే ధర్మం
వెట్టికూలి-బ్రాహ్మణులకొరకు
కండకూలి-క్షత్రియుల కొరకు
వృత్తికూలి- అందరికొరకు"[96]

నాలుగు వర్ణాల వ్యవస్థలో శూద్రులు పై మూడు వర్ణాలకు దాస్యం చేయబడ్డ వైనాన్ని కవయిత్రి తెల్పింది.

### 5.7. వచనకవిత:

తెలుగు సాహిత్య కవిత్వ ప్రక్రియలలో ఎక్కువ మందిని ఆకట్టుకున్నది వచన కవిత్వమే. తెలుగు కవిత్వానికి పద్యమే దిక్కు అన్నది కొంతమంది కవులు అంగీకరించక కొత్త ధోరణుల్లో తెలుగు కవితా ప్రక్రియలకు శ్రీకారం చుట్టాలన్న తపనతో యువ కవులు చేసిన ప్రయోగమే వచన కవిత. 'పాత కాలం పద్యమైతే వర్తమానం వచనకవిత' అని ఒక అభ్యుదయ కవి అన్నాడు. కవి భావుకతకు, భావ ప్రకటనా స్వేచ్ఛకు, చంధస్సుకు ఆటంకం కాబట్టి చంధోరహితమైన వచనం సామాన్యుడికి కూడా అందుబాటులో ఉంటుందన్నది వచన కవుల అభిప్రాయం. ఇపుడు పద్యం రాసే వారి కంటె వచన కవిత రాయడం వైపే మొగ్గు చూపే వారు ఎక్కువ. 'కుందుర్తి ఆంజనేయులు' వచన కవితా పితామహుడుగా ప్రసిద్దుడయ్యాడు.

రాయలసీమ కవులు ఎక్కువగా వచన కవిత్వాన్నే రాస్తున్నారు. జూపల్లి ప్రేంచంద్, యక్కలూరి శ్రీరాములు, వెంకటకృష్ణ, రాధేయ, మల్లెల నరసింహమూర్తి, రఘుబాబు, వేంపల్లి అబ్దుల్

ఖాదర్, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, ఎస్జీడి చంద్రశేఖర్, తులసీనాథ నాయుడు, కె.వి.రమణ, పి.మోహన్, మునిసుందరం, సవ్వప్ప గారి ఈరన్న, కెరె జగదీష్, పి.నరసింహారెడ్డి, పలమనేరు బాలాజి, ఎన్. రామచంద్ర, లోసారి సుధాకర్, బిక్కి కృష్ణ లాంటి కవులు విస్తృతంగా వచన కవిత్వాన్ని రాస్తున్నారు.

అనంతపురం జిల్లాకు చెందిన చింతా లక్ష్మీ నారాయణ 'కుంచె' కలం పేరుతో వచన కవిత్వాన్ని రాస్తున్న యువకవి. 'మాగాని' కవితలో వరి పంటకోసం నారు పొయ్యడం, దానికి ముందు చేయాల్సిన తతంగాన్ని ఇలా వివరించారు.

"ఇత్తనానికి మాంచి
వడ్లు తీసిపెట్టి
నారు పోసే టయ్యానికి
గోనె సంచిలోని వడ్లకు
మొలకెత్తేలా నీళ్లుపోసి
మొలేత్తే లోపు
మడియక్యను నీరు పెట్టి తడిమి
మడక దెచ్చి కాడెద్దులకు కట్టి
దున్ని నీరు పెట్టి
పెల్లతొక్కి ఆకులు అలుములు మరగబెట్టి
నాటడం అయ్యాక
మాగాని కయ్యలు
ఆకుపచ్చని చీర చుట్టినట్లు
అందంగా కన్పించేవి"[97]

అని రైతు వరిధాన్యాన్ని సేకరించి, నానబెట్టి, మొలకలొచ్చేలా చేసి, వరిమడిని దున్ని సిద్ధం చేయడం లాంటి అంశాలను కనులముందు సాక్షాత్కరింపజేశాడు.

ఉద్ధండం చంద్రశేఖర్ వచన కవిత్వాన్ని రాస్తున్న యువకవి. 'చివరి విన్నపం' కవితలో సీమరైతు వర్షం కోసం ఎదురు చూడటాన్ని చెబుతున్నాడు.

"కళ్ళల్లో కలల చినుకుల్ని కొవ్వొత్తులుగా వెలిగించుకొని
వర్షపు జాడల్లి ఆత్రంగా వెతుక్కుంటున్న వాళ్ళం
నీళ్ళన్నీ ఆవిరై పోయిన ఎడారి నేలపై

కన్నీళ్ళనే చప్పరిస్తూ బతుకుతున్న వాళ్ళం
ఆకాశం మేఘాల దుప్పటి కప్పుకున్నట్లే వుండేది...
సందెవేళ తూరుపు ఉరమినట్లే ఉండేది
నెత్తుటితో తడుస్తున్న కత్తుల వంతెనపై
వాన కురుస్తుందనే అనుకున్నాం
ఇక్కడ రాజకీయ దళారులలాగ
ఆకాశం కూడా...మమ్మల్ని
ఇంత దారుణంగా దగా చేస్తుందని
కలలో కూడా అనుకోలేదు!"[98]

అని వర్షాల కోసం రైతులు కళ్ళల్లో వత్తులు వేసుకొని పడిగాపులు కాసే దీన దృశ్యాలను ఆర్ద్రంగా చిత్రించాడు. ఆకాశంలోని మేఘాలు కూడా రైతులతో చెలగాట మాడుతున్నాయి. రాజకీయాలు చేసే మోసాలు లాగా వర్షాలు కూడా సీమను దగా చేస్తున్నాయనే వేదనను కవి చిత్రించాడు.

జి.వెంకటకృష్ణ వచన కవిత్వాన్ని ఉద్యమంలా నడిపిస్తున్న కవి. రాయలసీమ ప్రధాన సమస్యలపై అక్షరపోరాటం చేస్తున్నారు. తన కలం ద్వారా సీమ గళాన్ని విప్పుతున్న సీమబిడ్డ. 'జలగండం' కవితలో నీటి ప్రాధాన్యాన్ని చెబుతున్నాడు.

"పచ్చని పైరును
కళకళ లాడించే తడి
అసదృశ రూపాన పాతాళం అడుగున
రేపటి పంటను వెక్కిరించేను
మూడు తరాల జ్ఞాపకాల వూటలు
నిండిన ఏడుమట్ల బావి
ఎండిన తన ఎదచారికల్ని
మట్టి వేళ్ళతో తడిమి చూసుకునేను
నీళ్ళు తారాడిన దరులను
బండరాళ్ళ గుండె అరలోంచీ ఎదిగిన కొమ్మలు
తొండలూ పాములూ పాకిన గగుర్పాటును తాకేను
గట్టున పైరును

పచ్చగ మెరిపించిన బావి అలలు

చెట్ల కొమ్మల రావడిగా కరకరలాడెను

రవ్వారవ్వా రాచుకొని కాలం కరిగే సమయాన

చేలకు ప్రాణం నింపిన బావి

చెట్లు మొలచి పాడు బడేను

భూమిన నీడను పరిచే కొమ్మలు రెమ్మలు

రైతు బావిని చీకటితో నింపెను"[99]

బావి ఏడుమట్ల నీటితో సమృద్ధిగా నిండి పంట పొలాలను పచ్చగా వుంచగా నేడు నీరు లేక బావి క్రమంగా ఎండిపోవటంతో ఆ దుస్థితిని కళ్ళకు కట్టినట్లు కవి చిత్రించాడు. బావిలోని నీటి గలగలాలు, ఆ నీరు ఏర్పరచిన దరులు, బావి నిండి పొర్లినపుడు వచ్చిన అలలు, ఆ నీటి శబ్దాల ధ్వనులు, ఆ నీటి సవ్వడులు మన జ్ఞాపకాల దొంతరలలోకి తీసుకొని వెళ్ళేలా చేశాడు.

ఎస్. మునిసుందరం కవిత్వాన్ని నిబద్ధతో రాస్తున్న సీనియర్ కవులలో ఒకడు. సీమ మట్టిని, ఆర్తిని, ఆవేదనను తన కవిత్వంలో పలికించాడు. 'నిజమేనంట్రా' కవితలో మన తాతలు మోట తోలిన విధానాన్ని సీమ యాసలో ఇలా పలికించాడు.

"తెల్లారు జాము కాడ నుండి

మద్దేనం దాకా మోట తోలినా

బాయిలో నీళ్లు కుయ్‌కయ్ అనేది ల్యా

మే నీరు బావుల్లో నీళ్లు తగ్గినా

తెల్లారికి యదా పకారం వచ్చేత్తావుండె

మోటతోలతా మునికిస్టడు

మోటు సరసాల పాటలు పాడతా వుంటే

నా సామి రంగా

సేని కాడికి బోయే పతి సన్నిదీ

పాట విని రాతి బొమ్మై పోతా వుండె

కపిలిజేసే కిసకిసా కసకస కిరుకిర్రు

శబదాలు యిప్పుడేడ బోయె బిడ్డా!"[100]

సేద్యానికి మోట తోలుతూ నీళ్ళు పెట్టి శ్రమను మరచిపోవడానికి సరసాల పాటలు పాడుతూ ఉల్లాసంగా

పని చేసిన దృశ్యాలు చెబుతూ అలాంటి మోట శబ్దాల పదనిసలు, సేద్యాలు ఎక్కడికి పోయోనో అంటూ కవి చిత్రించాడు.

కె.యస్.రమణ వచన కవిత్వాన్ని రాస్తూ సీమ సమస్యలను, ప్రపంచీకరణ ప్రభావాన్ని విడమర్చి చెప్పాడు. నది, జడి లాంటి కవితా సంపుటాలను రచించారు. 'కొన్ని శ్వాసించిన క్షణాలు' కవితలో అగ్రరాజ్యాల సామ్రాజ్యవాద స్వభావం, ప్రపంచీకరణను తెలుపుతూ ఇలా అంటున్నాడు.

"చంపడంలో వున్న సరదాయే వేరు
యుద్ధ మంత్రనగరి రహస్యం
నియంతలకే తెలుసు
అగ్రరాజ్య అధినేతలకే తెలుసు
తాగించటంలో వున్న తమాషాయే వేరు
క్రిమి సంహారకాల జాతక కథలు
కోకో పిల్లకే తెలుసు
పెప్సీ బాబుకే తెలుసు
అప్పివ్వటంలో ఆంతర్యమే వేరు
మాయల ఫకీరు ప్రభుత్వాల మారిపోయే రంగులు
ప్రపంచ బ్యాంకులకే తెలుసు
ధనిక స్వామ్యాలకే తెలుసు
.........................................
ప్రపంచీకరణ వున్నత్త స్వభావమే వేరు
పావురాల నెత్తురు రుచి
వేటగాళ్ళకే తెలుసు
ప్రపంచశాంతి స్థాపకులకే తెలుసు
యిప్పటి కింతే మరి
అర్ధరాత్రి మెరిసిన స్వాతంత్ర్యం గురించి
నేనేమీ మాట్లాడలేను
తెల్లవారడానికి సమయం మిగిలే వుంది"[101]

అగ్రరాజ్య దేశాల యుద్ధ స్వభావం, దోపిడి, నియంతృత్వాన్ని, ప్రపంచీకరణ దోపిడీ, వ్యాపార ముసుగులో

జరుగుతున్న కల్తీలు, కుతంత్రాలను కుండ బద్దలు కొట్టారు. 'యుద్ధమూ శాంతి' కవితలో ఉగ్రవాదుల మారణ కాండను తెల్పుతున్నాడు.

"బొమ్మల కొలువులో పేర్చిన ఆయుధాలన్నీ
ఆదమరచి నిద్రపోతున్నాయి
రండి యిప్పుడు మనం కొంతసేపు
యుద్ధం ఆట ఆడుకుందాం
ఆయుధాలకేం తెలుసు
ట్రిగ్గర్‌ను మీటుతున్న ఆ వేళ్ళకి మాత్రమేం తెలుసు
మనసేవొక మందుపాతరై పోయినప్పుడు
ప్రతి ఆలోచనా వొక విస్పోటనమైనప్పుడు
తెలుపైనా నలుపైనా తెరవెనకా తెరపైనా
యెవరికి మాత్రం యేం తెలుసు
పదండి కొంతసేపు యుద్ధం ఆట ఆడుకుందాం
మిత్రులారా మనకన్నీ సమస్యలే
సరికొత్త ఆయుధాల్ని యెక్కడ పరీక్షించాలి
కొన్న ఆయుధాల్ని యెక్కడ పాతరేయాలి
మిత్రులారా మనకన్నీ కుశంకలే
యెవడి పంట పొలంలో యుద్ధాన్ని విత్తాలి
యెవడి మనోవల్మీకంలో విషనాగుల్ని పూయించాలి"[102]

ఉగ్రవాదులు సృష్టించే తూటాదాడులు, తీవ్రవాదుల భయంకర బాంబు దాడులు, వారి మారణ కాండ దాడుల స్వభావాన్ని, ఆలోచనల్ని స్పష్టం చేశారు.

ఎస్జీడి చంద్రశేఖర్ హేమంతిక హసంతిక, జీవితరేఖలు లాంటి వచన కవితా సంపుటాలను ప్రచురించారు. 'యుద్ధం' అనే కవితలో దేశాల మధ్య యుద్ధాలు, దాడులు వాటి స్వభావాలను చెబుతున్నాడు.

"ప్రజల స్వాతంత్ర్యం కోసం యుద్ధం
ప్రజల స్వేచ్ఛావాయువుల్ని
కలుషితం చేయడానికి యుద్ధం

ప్రజల వినాశనానికి యుద్ధం

.......................................

ఆమెరికాపై ఆటంబాబు

రువ్వుతాడొకడు

చైనాపై దాడి చేస్తాడొకడు

రష్యాపై గర్జిస్తాడొకడు

భారత్‌పై బాంబు

విసురుతాడొకడు

పాలస్తీనా పైకి

పరుగెడుతాడొకడు

ఎందుకో మనిషి మనిషికీ

యుద్ధంపై ప్రీతి

దేశ దేశానికీ

దేశంపై ద్వేషం"[103]

అంటూ దేశాలపై దాడులు, యుద్ధాలు చేసుకోవడాన్ని కవి చిత్రించాడు.

చిత్తూరుకు చెందిన పి.తులసీనాథం నాయుడు తులసాకులు, తులసీపుష్పాలు అనే కవితా సంపుటాలను వెలువరించారు. 'పచ్చినిజం' కవితలో ఇలా అంటాడు.

"దున్నేవాడికి జానెడు భూమి దొరకదు

కార్పోరేటర్లకు వేలవేల ఎకరాలు దొరుకుతాయి

జనానికి తాగు నీరు దొరకదు

కోలా కంపెనీలకు లక్షల లీటర్లు దొరుకుతాయి

రైతుల ఆత్మహత్యలు ఆపరు

శవాలపై రాజకీయం చేస్తారు.

ఆకాశాన్నంటే ధరలు

రైతుకు గిట్టుబాడు ధరుండదు"[104]

అంటూ ఈ సమాజంలో జరుగుతున్న నిజాలను గూర్చి మాట్లాడుతున్నాడు. 'సిరి-ఉరి' కవితలో ఇలా అంటాడు.

"వర్షాలు బాగా కురిస్తే
రైతులకు సిరి
కరువులు బాగావస్తే
రైతులకు ఉరి
వేసిన బోర్లలో నీరు పుష్కలమా
రైతులకు సిరి
బోర్లు నిష్ఫలమా
రైతు గొంతులకురి"[105]

అంటూ రైతుల పరిస్థితులను చిత్రించాడు.

కె.వి.రమణ(రమ్య) 'రమ్య కవితలు' అనే వచన కవిత్వాన్ని వెలువరించింది. 'ఆడజన్మ' కవితలో స్త్రీలపై ఈ సమాజం ఎంత వివక్షను చూపిస్తుందో తెల్పే కవిత చూడండి.

"మాతృగర్భంలో వుండగనే మొదలవుతుంది పోరాటం
లింగనిర్ధారణ జరిగితే చావు బ్రతుకుల చెలగాటం
అదృష్ట వశాన గండం గడచి జన్మిస్తే
మరలా జీవితాంతం చెలగాటం
చిరుత ప్రాయంలో కూడా ఆమెకు మానప్రాణగండమే
..........................................
గండాలన్నీ దాటాక మొదలవుతుంది
పెళ్ళిపేరుతో మాయాజూదం"[106]

అంటూ తల్లి కడుపున ఆడపిల్లగా రూపుదిద్దుకున్నప్పటి నుంచి పెరిగి పెద్దదై పెళ్ళిచేసుకున్న తర్వాత జీవితాంతం వరకు ఆమెపై ఈ సమాజంలో జరిగే దాడులను, వివక్షను ప్రశ్నిస్తున్నది.

ఎస్జీడీ చంద్రశేఖర్ 'నేనూ నా రాయలసీమా' అనే కవితలో సీమను గూర్చి ఇలా అంటున్నాడు.

"వెన్నెలలు అద్దిన
అందమైన నా వాకిళ్ళ ముందు
రాయలసీమ కక్షలకు కార్పణ్యాలకు తావులేదు
నేను నా రాయలసీమలో
స్నేహాల కుసుమాలు విరబూయాలనీ

పువ్వుల పరిమళాలు

గుబాళించాలనీ ఆకాంక్షిస్తూ ఉన్నాను”[107]

అని రాయలసీమలో శాంతి, సౌభాగ్యం విరబూయాలని కవి ఆకాంక్షిస్తున్నాడు.

“నాకు నా సీమంటే ఇష్టం

నాకు నా రాయలసీమంటే మరీ ఇష్టం

అందుకే నా రాయల సీమలో

కక్షలూ కార్పణ్యాలూ తొలగిపోయి

హత్యలూ అలజళ్ళూ నిలిచిపోయి

ముందుముందు నా రాయలసీమ

రాళ్ళసీమ కాదిది రతనాల సీమ

అని ముక్త కంఠంతో

మనమంతా మన సీమను

వేనోళ్ళో కొనియాడాలని

ఆకాంక్షిస్తూ వున్నాను”[108]

అంటూ రాయలసీమకు పూర్వవైభవం తీసుకురావాలని కవి ఆశిస్తున్నాడు.

చిత్తూరు జిల్లా నుంచి నూతలపాటి గంగాధరం ‘చీకటి నుంచి వెలుగులోకి’ అనే వచన కవితా సంపుటిని ప్రచురించాడు. ‘నిశి’కవులు అనే పేరుతో ఐదుమంది కవులు వచన కవిత్వాన్ని వెలువరించారు. వారు డి.మహేష్ కుమార్, మహమ్మద్, హరీష్, కె.యస్.రమణ, ఖాశీం యూసఫ్, కె.మదన్ మోహన్. వీరు వచన కవిత్వాన్ని రాశారు. ఎస్జీడీ చంద్రశేఖర్ రణగొణ ధ్వనులు, వేంపల్లి అబ్దుల్ ఖాదర్ గారి చినుకు, మేఘం, కిరణం లాంటి కవితా సంపుటాలు, కాణిపాకం లింగన్న గారి వెలుగు, స్వేచ్ఛాగానం, యస్.మునిసుందరం గారి ఈ గుండె అలసిపోదు, మసక, మట్టివాసన, చీకటి దీపాలు వంటి కవితా సంపుటాలు, సౌభాగ్య వ్రాసిన సంధ్యాభీభత్సం, కృత్యాద్యవస్థ, మధురాంతకం నరేంద్ర గారి పర్వవేలా తరంగాలు, తులసీనాథ నాయుడు గారి తులసాకులు, తులసీపుష్పాలు, పలమనేరు బాలాజి గారి మాటల్లేని వేళ, ఇద్దరి మధ్య కవితా సంపుటాలు, పి.నరసింహ రెడ్డి గారి భావ విహంగాలు, అనుభూతుల పొదరిండ్లు మొదలైనవి ప్రముఖ వచన కవితా సంపుటాలు పేర్కొనదగినవి.

కడప జిల్లా నుండి శశిశ్రీ గారి జేబులో సూర్యుడు, శబ్దానికి స్వాగతం, పల్లవి కవితా సంపుటాలు, జింకా సుబ్రహ్మణ్యం సాగించు నీ పయనం, జాగ్రత్తండోయ్ జాగ్రత్త, రామచంద్రగారి రక్తం

చెమర్చిన కళ్ళు, మహ్మద్ ముస్తఫా వెలుగుల రవ్వలు, పసుపులేటి పద్మావతమ్మ మౌన ఘోష, తక్కోలు మాచిరెడ్డి అసలు విషయం వ్యవస్థను మార్చడం, ఎన్.ఈశ్వరరెడ్డి కన్నీటి సీమ, మనసుపాట, లోసారి సుధాకర్ మైనపు బొమ్మలు, అంతటి నరసింహం ఇరవై ఒకటో శతాబ్దంలోకి, సన్నపురెడ్డి వెంకట రామి రెడ్డి గారి బడి మొదలైనవి ప్రధాన కవితా సంపుటాలు.

కర్నూలు జిల్లానుంచి జి.వెంకటకృష్ణ గారి లోగొంతుక, దున్నే కొద్దీ దుఃఖం, కొన్ని రంగులు ఒక పద్యం, చినుకు కవితా సంపుటాలు, హెచ్చార్కె గారి అబద్ధం, వానలో కొబ్బరి చెట్టు, ఒక్కొక్క రాత్రి కవితా సంపుటాలు, కాశిబట్ల వేణుగోపాల్ మళ్ళీ ఎగరాలనీ, టి.వెంకటేష్ ఒక తడి అనేక సందర్భాలు, పాణి అబూజ్‌మాడ్, నాగప్పగారి సుందర రాజు చంఢాల చాటింపు, రమణ జీవి నలుగురు పాండవులు, రఘుబాబు సంఘటిత స్పర్శ, హోమీ పత్రం కావాలి, కెంగార మోహన్ విన్యాసం, కవన సేద్యం లాంటి కవితా సంపుటాలు వెలువడ్డాయి. సవ్వప్ప గారి ఈరన్న నవయుగం, కడలి కెరటం, మానసవీణ, గుండెచప్పుడు, భావవీచికలు మొదలైన కవితా సంపుటాలు.

అనంతపురం జిల్లా నుంచి జూపల్లి ప్రేంచంద్ గారి అవేద, నిచ్చెనమెట్ల లోలకం, రాధేయ గారి దివ్య దృష్టి, జ్వలనమ్, తుఫాను ముందటి ప్రశాంతి, ఈ కన్నీటికి తడిలేదు, క్షతగాత్రం, అవిశ్రాంతం లాంటి కవితా సంపుటాలు, జెట్టి జైరాం ఎర్రగాలి, జననేత్రం, ఆశావాది ప్రకాశరావు గారి అంతరంగ తరంగాలు, బిక్కి కృష్ణ చరమగీతం, చినుకు, వేకువ పిట్టలు, కాలం నది ఒడ్డున, డి. శిరీష శిశిరాలు రాలినా, ముక్తాపురం స్నేహలత కొత్తపొద్దు, యక్కలూరి శ్రీరాములు చేయిచాచిన వెన్నల, బహుముఖ వర్షం, రంగులపక్షి, సూర్యుడు ఏనాడూ అస్తమించడు, సడ్లపల్లె చిదంబర రెడ్డి దృశ్య ప్రవాహం, మహాభి నిష్క్రమణం, మల్లెల నరసింహమూర్తి జలస్వప్నం, కెరె జగదీష్ సముద్రమంత గాయం, ఎస్.గంగప్ప అంతరంగ తరంగాలు, చైతన్య తరంగాలు, భావ పరంపర, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి రెండు ప్రపంచాలు, కల్పన రెంటాల నేను కనిపించే పదం, పసులూరి ఓబిలేసు నల్లగుండె, పాలవాయి రాధిక ధరిత్రి కన్నీరు, ఈ చీకట్లను తొలగించలేమా, షమీవుల్లా సూర్యోదయానంతరం, పి.ఎల్.శ్రీనివాస రెడ్డి శ్వేదాశ్రువులు మొదలైనవి ప్రధానమైన వచన కవితా సంపుటాలు.

### 5.8 దీర్ఘకవిత:

వచన కవిత, వచన కావ్యం, దీర్ఘకవిత, దీర్ఘ కథా కావ్యం కొద్ది తేడాలతో కవిత్వ ప్రక్రియలో రూపుదిద్దుకున్నాయి. దీర్ఘకవిత్వం దైర్ఘ్యత , ఏకరూపత(ఒకే ఇతివృత్తం) కలిగి వుంటుంది. పుటల పరిమితి ఒకటి నుండి వంద పుటలు లేదా అంతకంటె ఎక్కువ కూడా వుండవచ్చు. కవి చెప్పదలచుకొన్న భావనను బట్టి ఇది సాగుతుంది. కథ, పాత్రలు లేని ఒక అవిచ్ఛిన్న భావధారలాగ కొనసాగుతుంది. ఉన్నతమైన

లక్ష్యాన్ని ఎంచుకొని దానికి సంబంధించిన అభివ్యక్తీకరణ దీర్ఘకావ్యంలో ఇతివృత్తంగా ఉంటుంది.

రాయలసీమలో దీర్ఘకవితలు రాసిన కవులు వున్నారు. యక్కలూరి శ్రీరాములు, కాశీభట్ల వేణుగోపాల్, రాధేయ, టి.రాజారాం, పి.నరసింహరెడ్డి, జి.వెంకటకృష్ణ, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, కెరె జగదీష్, ఎస్జీడీ చంద్రశేఖర్ లాంటి కవులు దీర్ఘ కవితలు రాశారు. యక్కలూరి శ్రీరాములు జలగండం, ఎడారి ఆకాశం, చివరి విప్లవం, ఆకాశం అంతరించదు, చేయి చాచిన వెన్నెల, విధ్వంసం నుండి విస్ఫోటనం వరకు లాంటి దీర్ఘ కవితలను రచించాడు.

'జలగండం' దీర్ఘకవిత ప్రసిద్ధమైనది. రాయలసీమలోని నీటిసమస్యను గూర్చి ప్రస్తావించింది.

"జలమే కదూ అమృతం
అమృత మంటేనే జలం
..........................
మట్టిలో విత్తనాలు విత్తితే
గుత్తులు గుత్తులుగా
వేరుశనగా పండుతుందనుకున్నాం
కరువు కత్తులు మొలిచి
కుత్తుకలు తెగిపడటం రోజూ చూస్తున్నాం
ప్రతి పూటా పస్తున్నాం
ప్రతిఏటా చస్తున్నాం"[109]

కరువు కరాళ విశ్వరూపం వల్ల పంటలు పండక, రైతు బతుకులు గడవక, జీవనం సాగక అవస్థలు పడుతున్నారు.

"ఋతువులెన్నైనా
మా రాయలసీమకు
ఒకే ఒక ఋతువు
కరువు
కాలాలెన్నైనా
మా సీమకున్న ఒకే ఒక కాలం
ఎండాకాలం"[110]

ఋతువులు, కాలాలు ఎన్ని వున్నా సీమకు మాత్రం కరువు ఋతువు ఒక్కటే అని చెబుతున్నాడు.

"కరువు చెరనుంచి

భూమిని విడిపించాలంటే

నీళ్ళకు వేసిన సంకెళ్ళు తెంచాల్సిందే"[111]

అని సీమకు రావలసిన నీటి వాటాల మీద జరిగే అన్యాయాలను ఎదురించి పోరాడి విముక్తి కలిగించాలని చెబుతున్నాడు.

"రాళ్ళ సీమలో

నీళ్ళ లేమితో

కనుచూపు మేరా కరుడు గట్టిన కరువు

కంటి మీద కునుకు రాదు

కష్టాలే ఏకరువు

బుక్కరాయ సముద్రం...అనంత సాగరం

రాచసముద్రం...విజయసముద్రం

ఇలా మా సీమలో

ఎన్నో సముద్రాలు మరెన్నో సాగరాలు

కాని నీళ్ళు లేవు తీరాల్లో చిల్లి గవ్వల్లేవు"[112]

వర్షాలు పడక సీమలో ఎన్నో చెరువులు, కుంటలు, వాగులు, నదులు నీళ్ళు లేక ఎండిపోయాయి. కరువు సృష్టించిన భయానక పరిస్థితులు అల్లకల్లోలం చేశాయి.

శ్రీరాములు గారి 'ఆకాశం అంతరించదు' దీర్ఘకావ్యం ప్రకృతి పరిణామాలను విశదీ కరిస్తుంది. భూమి, నీరు, చెట్లు వాటి సంరక్షణ వాటిని కాపాడు కోవాల్సిన బాధ్యతను గుర్తుచేస్తాడు. మానవుడు చేయవలసిన కర్తవ్యాన్ని భోదిస్తాడు.

"మొక్క పెరిగితేనే గాని

మొగ్గ తొడగదు

పుష్పించదు

చెట్టు విస్తరిస్తేనే గాని

కాయలు కాయవు

పండవు

విత్తనం భూమిపై

తల ఎత్తితేనే గాని

ధాన్యపు తిత్తులు నిండవు

చేతికి ఫలాల గుత్తులు అందవు"[113]

అంటూ కావ్యాన్ని ప్రారంభిస్తాడు.

"మట్టికి నీరందించనిదే

పుట్టెడు ధాన్యపు పుట్టుక జరగదని తెలిపిన

ప్రతిసృష్టి కర్తవాడు

నాగలితో ఆకలి చీల్చిన

నాగరికుడు వాడు

అటు

అరణ్య గర్భ అటవీసంపద

దోపిడీకి గురి అవుతుంటే

మొట్టమొదట ప్రశ్నించి

ఎదురించి

నిలిచిన వ్యక్తి

వాడో శక్తి

ఇటు

జనారణ్యంలో

కార్మికుల నెత్తుటి చైతన్యమై

శ్రమకు తగ్గ ప్రతిఫలం కోసం

వాడో హక్కుల ప్రవాహ ఉద్యమం"[114]

అంటూ మనిషి వ్యవసాయం చేసి ఈ సమాజానికి తిండిని ప్రసాదించి అటవీ సంపదను కాపాడిన వ్యక్తిగా కవి పేర్కొన్నాడు. మనిషి సృష్టించుకున్న ఆయుధం అభివృద్ధికి తోడ్పడాలని వినాశనానికి కాదని తెలియ జేస్తున్న కవిత చూడండి.

"ప్రతి ఆయుధం

మానవాళికి

ఉపయోగపడేదైతేనే

దీపావళి సంబరమై

అంబరమంతా వెలుగుతుంది

అది కత్తి గాని

అది సుత్తి గాని

అది కొవ్వొత్తి గాని

అదిలోహాన్ని కరిగించే

కొలిమి తిత్తి గాలి

ప్రపంచ వికాసానికి తోడ్పడే దయితేనే

అది అసలైన ఆయుధమవుతుంది"[115]

అని మానవాభివృద్ధికి ఆయుధం తోడ్పడాలని చెబుతూ ఇలా అంటాడు.

"మనిషి మనుగడకు శాపంగా

మారణ హోమంగా మారిన

ఏ ఆయుధమైనా

నిస్సందేహంగా

నిరర్థకరమే

అటువైపు గాని

ఇటువైపు గాని

ఎటువైపు గాని

ఆయుధాలు

లేని సమాజమే శ్రేయస్కరం

ఎవరి దగ్గర ఆయుధాలు లేకపోవడం

ఎంత అద్భుత సమాన పతాక సన్నివేశం"[116]

సమాజ మనుగడకు ముప్పుతెస్తున్న ఆయుధాన్ని విడనాడాలని కవి ఆశిస్తున్నాడు.

'చేయి చాచిన వెన్నెల' దీర్ఘకవిత బాల్యం గురించి సుదీర్ఘంగా చిత్రించింది. అందమైన బాల్యం తీపి గురుతులు, బాలల సమస్యలను చిత్రించింది.

"నిజానికి నిర్వచనం

ఆనందానికి బహువచనం బాల్యం

దేహం దాహం తీర్చే గతం బాల్యం

అమ్మ ఉదరంలో

ఊపిరి దిద్దుకున్న ఉభయ పొద్దులు

అమ్మ అధరంతోనే మొదటి ముద్దులు

అమ్మ పాలతోనే ప్రేమ పద్దులు

అమ్మ పొత్తిళ్లతోనే మురిపాల సుద్దులు

అమ్మ చేతితోనే అమృతమైన గోరు ముద్దలు

అమ్మ చేతులే అందరికీ అందమైన సరిహద్దులు"[117]

అందమైన బాల్యాన్ని నిర్వచిస్తూ అమ్మ ప్రేమలోని బాల్యాన్ని అలంకారమయంగా కవిత్వీకరించాడు. ఇలాంటి తీపి గురుతుల బాల్యం నేడు బాలలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారు.

"నీ లేత జీవితం

ఊహకందని భయంకర స్వప్నం

చీకటిలో ముళ్ళు పరచిన మార్గం

అన్ని దారులూ మూసుకుపోతున్న దుర్గం

బాబూ

తల ఎత్తినా

తలదించినా

ఈ లోకంలో నీది ఒంటరి పోరాటం

పనిముట్లన్నీ నీ చేతుల్లో వున్నా

ఏమున్నది ఫలం

తిట్లూ...చీవాట్లూ...కన్నీళ్ళూ...

చివరకు నీకు ప్రతిఫలం

నీకన్నీ సమస్యల తుఫానులే

పల్లెలో వున్నా

డిల్లీలో వున్నా

ఏ దేశంలో ఏ ప్రదేశంలో వున్నా

ప్రపంచంలో ఎక్కడున్నా

నీ చేతులు పనిచేసే చర్మ పరికారలే"[118]

నేడు సమాజంలో అనాథ బాలలు, బాల కార్మికులు చాలా సమస్యలు ఎదుర్కొంటూ అవమనాలు పడుతూ తమ భవిష్యత్తును గుప్పిట్లో పెట్టుకొని జీవితాన్ని గడుపుతున్నారు. 'విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా' దీర్ఘ కవిత ఈ దేశాన్ని, ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న ఉగ్రవాదం, తీవ్రవాదం గురించి సమగ్రంగా కవి చిత్రించాడు.

"ఎవరో ఎందుకో
తమకు తెలియకనే
కనురెప్ప పాటులో కనులు మూస్తారు
వెలుగుకు తావివ్వని
కటిక చీకటిలో నులిమివేయబడతారు
సమిధలవుతారు
సమాధులవుతారు
అటు ఇటు ఎటు చూసినా
ప్రాణాల వత్తులు ఆరిన మనుషుల
కుటుంబ సభ్యులందరు
నెత్తురు కోల్పోయిన
ప్రమిదలవుతారు
ఆత్మీయ తెరచాపలు లేని
నావలవుతారు
తుఫానులో చిరునామా దొరకని
గడ్డిపోచలవుతారు
కన్నీటితో
వీలునామా వ్రాసిన సముద్రాలవుతారు"[119]

ఉగ్రవాదులు సృష్టించే బాంబు దాడులు, ఆత్మాహుతి దాడులు, అల్లర్లలో ఏమి తెలియని అమాయక ప్రజలు బలైపోతారు.

"తుపాకీ ఒకటే
తూటా ఒకటే

చంపుతున్న వాడొకడే

చచ్చిపోతున్న వాడొకడే

అటువైపు ఇటువైపు

ఎటువైపు చూసినా

మనిషే చనిపోతున్నపుడు

మనిషి సహజ మరణం లేని

అనామకుడవుతున్నాడు

హిందూ ముస్లీం ఇసాయి సిక్కు జైన్

మతాలు ఎన్నయినా! ఏవయినా

మనిషి మాత్రం మాయమవుతున్నాడు

మనిషే మతం సృష్టించాడని

మరచిపోతున్నాడు

పచ్చినెత్తురు తాగే పులులు సింహాలు

స్వజాతికి తెల్లనిపాలే ఇస్తాయి

ప్రేమగానే లాలిస్తాయి"[120]

మనిషి మనిషిని చంపుకునే ఈ సమాజంలోని మారణ హోమాన్ని చిత్రించాడు.

జి.వెంకటకృష్ణ 'నదీవరదా మనిషి' అనే దీర్ఘకవితను 2009లో ప్రచురించాడు. ఎడతెరపి లేని వర్షాల కారణంగా తుంగభద్రానది పొంగి పొర్లి కర్నూలు ప్రాంతాన్ని అతలాకుతలం చేసింది. వరద భీభత్సం సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. వరద ప్రళయాన్ని కవి చిత్రించాడు.

"నింగి నుండీ నేల మీదికి

దూకే హోరులా

నది నుండి నేల మీదికి

దూకిన వరద

నింగి నేలను ఏకం చేసిన వరద

మట్టి నుండీ మట్టికి చేరే మనిషికి

కంటి నుండీ కంటికి

పారుతున్న వరద

మట్టిని కరిగించుకొని నది
చేరవేసింది నేల మీద
బురద వరద
నదిని ఆశ్రయించిన మనిషిని
ముంచి తేల్చుతున్నది”[121]

వర్షం వల్ల కర్నూలు నగరం మొత్తం నీటితో నిండిపోయింది. నీరు, బురద ఏకమై నగరం మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది.

“నదులు అమ్మలగన్న యమ్మలు
మూడు పాయల సంగమ తల్లులు
హంద్రీ తుంగభద్రా కృష్ణా
మహోత్తుంగ తరంగాల
మూలపుటమ్మలు
కాలకృష్ణా తరంగాలు
నిశ్చలమై నిలిచెను
నీలం సాగరాన
అశ్వరభ అశ్వరభమని
ముందుకు తోస్తున్న
ఏరులెన్నో కలుపుకొని
వురుకులతో పరుగులతో
తొక్కుకుంటూ తోసుకుంటూ
తుంగభద్ర కలిసెను
సంగమేశ్వరాన
యిద్దరు తల్లుల ఎదను
ఎగదన్ని తాకెను
హంద్రీ తరంగాల వెల్లుల
మూడు నదుల ముడిలో
ముప్పేట మునిగెను

నగరం నట్టింట్లోకి

తోసుకొస్తున్న అనుకోని అతిథుల్ని

చూసి స్థాణువులైరి జనం"[122]

హంద్రీ, తుంగభద్రా, కృష్ణా నదులు వరదల వల్ల పొంగి ప్రళయాన్ని సృష్టించిన నేపథ్యాన్ని కవి చిత్రించాడు.

"ఉరుములై వురిమి

పిడుగులా కాల్చి

కరకట్టల్ని కూల్చి

పొలాల్ని తాకిన జలాఘతంతో

సేద్యం ఇక సాధ్యం కాదు

ముందు కరువుతోనూ

వెనుక వరదతోనూ

నిండుకున్న పంటలు

సగం గుంటలు పడి

సగం మేటలు వేసి

ఖాళీ అయినాయి

రైతు బతుకులు

రైతు పొలంలోని

పల్లెసారం అంతా నగరంలో

అంగడి సరుకుల మధ్యా

మొలకై తేలుతుంది

గోడౌన్లలో పేర్చిన ధాన్యాలు

బురదకు మొలిచి

వీధిన పడ్డ రాశులు రాశులు

కుళ్ళిన పంటను కాచిన

నగరంలో వీధులు"[123]

ప్రకృతి ప్రళయంవల్ల అనావృష్టి, అతివృష్టి వల్ల పొలాలు, పంటలు అన్నీ నీటితో నిండి సర్వనాశనం అయ్యాయి.

టి.రాజారాం గారి 'అతడే' అనే దీర్ఘకావ్యం రైతు గురించి, చేతివృత్తుల నైపుణ్యాలను ఆవిష్కరించాడు. ఇందులో రైతు గూర్చి ఇలా అంటాడు.

"అతడు
రాత్రంతా మోరపైకెత్తి
మెరుపుల హారాలన్నీ పుటుక్కున తెగి
భూమిపై రాల్తూ చేసే చప్పుళ్ళ కోసం
చూపులు సారిస్తాడు
ఆకాశం కేసి మెడసాచి చూస్తూ
మేఘాలన్నీ భళ్ళున విరిగి కరిగి
నేల నేలంతా నీరై పాకే శబ్దం కోసం చూస్తాడు
అన్నం మెతుకుల్ని రాలుస్తాయనుకునే
వాన చినుకుల కోసం చేతులు పైకెత్తి
చేనుగట్టు మీద నిద్రాయవుతాడు
దుక్కిదున్నే దృశ్యాలు నాట్లేసే దృశ్యాలు
కన్రెప్పల కింద ఘనీభవించకుండా
అశ్రువులై రాలుతుంటే
మాను చేను చివరకు మనిషి కూడా
మోడై పోవటం చూల్లేక
కరువు నెర్రెల్లోకి కన్నీరై
జలజలా ప్రవహిస్తాడు"[124]

రైతు సేద్యం చేయడానికి వర్షం కోసం ఎదురు చూసే నిట్టూర్పుల్ని కవి కవిత్వీకరించాడు.

రాధేయ(నారాయణ సుబ్బన్న) గారి 'మగ్గంబతుకు' చేనేత కుటుంబ జీవితాలను ఆవిష్కరించాడు. ఇది చేనేత వృత్తిని, నేత కార్మికుల కష్టాలు, బాధలు, వేదనలు, వ్యథలు, ప్రపంచీకరణ ప్రభావం, దుస్థితి వంటి అంశాలను దయనీయ దీనగాథల వాస్తవికతా రూపాన్ని వివరిస్తుంది.

"ఇది మా యధార్థ కథ
చేనేత చిత్రపటంలో
విరిగిన మగ్గం వ్యథ

చెమట చుక్కలన్నీ రాశీభూతమై
కన్నీటి మడుగులైన కథ
సగం దేహం గుంటలోనూ
సగం ప్రాణం కళ్ళలోనూ నిలుపుకొని
ఆర్తిగా చేయి సాచే అన్నార్థుల కథ"[125]

చేనేత కార్మికుల జీవిత గాథలను తెల్పుతున్నాడు.

"సిరిసిల్లలో అప్పుల చావులు
మంగళగిరిలో వలసల బాటలు
వెంకటగిరిలో వెతల పాటలు
పోచంపల్లిలో పురుగుమందుతో చావులు
పుల్లంపేటలో పుట్టెడు వ్యథలు
నారాయణ పేటలో నలిగిపోతున్న బతుకులు
కదిలిస్తే చాలు కన్నీరు పెడ్తున్న
చీరాల షెడ్డు కూలీలు"[126]

చేనేత రంగాలకు ప్రసిద్ధి చెందిన ప్రాంతాలలోని నేత కార్మికుల దీనగాథల్ని తెల్పుతున్నాడు.

"మొన్న మొన్నటి దాకా
తన చురుకైన చూపుతో
అద్వితీయమైన ప్రజ్ఞతో
రంగురంగుల ఇంద్రధనుస్సుల్ని పోతపోసి
వస్త్ర ప్రపంచాన్నే అద్భుతంగా
ఆవిష్కరించిన తాతయ్య
నేడు వంగిన వెన్నెముకతో
కృంగిన వయోభారంతో
మహాభారతంలో
మూడుతరాల వైరుధ్యాల్ని
కళ్ళారా చూసిన భీష్మాచార్యునిలా
నేడు కుక్కిన మంచంలో

కూలబడిపోయి

మరణశయ్యపై ఆఖరు ఘడియల్ని

లెక్కిస్తూంటే

నా కనుపాపలపై ఒక దయనీయ దృశ్యం

రెక్కలల్లార్చి నిల్చిపోయింది”[127]

చేనేత కార్మికుడు జీవితాంతం నేత పనిచేసి వయోభారంతో ముసలివాడైన స్థితిని, అతని దీనత్వాన్ని వ్యక్తీకరించాడు.

అనంతపురం జిల్లా రాయదుర్గం ప్రాంతానికి చెందిన ప్రముఖ కవి కెరె జగదీష్. ‘రాత్రి సూర్యుడు’ దీర్ఘకావ్యాన్ని 2012లో రచించారు. అంధుల జీవితాలను వారి దృష్టికోణంలోంచి ఆలోచించి, వివేచించి వారి సాధక బాధలను, అనుభవాలను సమగ్రంగా సుదీర్ఘంగా చిత్రించిన విశిష్ఠ కావ్యం రాత్రి సూర్యుడు.

“మాతృగర్భంలో

అణువులో అణువుగా

రూపాంతరం చెంది

తొమ్మిది నెలల ప్రస్థానంలో

జిగురు లోకాన్ని చుట్టి

సర్వేంద్రియాలను సంతరించుకొని

పంచభూతాల సాక్షిగా

పేగుబంధాన్ని పెనవేసుకొని

ఉమ్మనీటిలో జారిన దేహం

కెవ్వుమని అరచినా

ఆవరించిన కారుమబ్బులలో

కళ్ళకు

ముళ్ళతీగ చుట్టుకుంది”[128]

అంటూ అంధుల ప్రస్థానాన్ని కావ్యారంభం చేస్తాడు. అంధుల ఆత్మవిశ్వాసాన్ని, ఆలోచనా శక్తిని ఇలా చెప్తాడు.

"జలపాతం గల గలలు
శ్రవణేంద్రియంతో
మా మస్తిష్కంలో నిక్షిప్తమవుతాయి
కరచాలనం స్పర్శలోని ప్రేమతో
మాలో
పురివిప్పిన అందాల రూపురేఖలు
ఊపిరి పోసుకుంటాయి
మానవతా పరిమళాలు మా గంధ జ్ఞానాన్ని
పరవశింప జేస్తాయి
రసస్ఫూర్తితో ఈ విశ్వాన్ని దర్శిస్తాం! మాకేం?
చీకటి చినుకులనే జీవనాధారగా చేసుకున్నవాళ్ళం
చీకటి వర్ణాన్ని పంచ రంగులుగా
చిత్రించుకునే సత్తా మాకే ఉంది
మాకు కళ్ళు లేకపోయినా
మనసుందిగా"[129]

పై కవితలో గొప్ప రహస్యాన్ని వివరించాడు. ఆ ఇంద్రియాలు అంత బలంగా పనిచెయ్యడానికి కారణం వారి మనశ్శక్తి వారి ఆత్మబలం. ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకొంటూ ప్రతిదినం వారు బ్రతుకు పోరును ఆరంభిస్తారు. ఒక ఆర్ద్రతతో కూడిన కవిత్వాన్ని రచించారు. అంధులు ఎదుర్కొనే సమస్యలను ఇలా చెబుతున్నాడు.

"అవమానాల కొరడా దెబ్బలు తింటూ
చీకటి శిలువను మోస్తూ
భారంగా అడుగులు వేస్తున్న యేసుక్రీస్తులం
చీకటి పాలసముద్రంలో
కష్టాల శేషపాన్పుపై
పవళించిన విష్ణుమూర్తులం
సమస్యల స్మశానంలో
చీకటి గరళాన్ని మింగిన

పరమశివులం

ఒళ్ళంతా కళ్ళు మొలిపించుకొని

చీకటి కత్తుల వంతెనపై ప్రయాణిస్తుంటాం

పెదవుల నవ్వుల వెనుక

మనసు మూలుగులు వినపడనివ్వం

మాపై రాళ్ళు రువ్విన వారిని చూసి భయపడం

వారి మదిలోని చీకటిని చూసి జాలిపడతాం

మా ఆత్మవిశ్వాసం ముందు

ఎవరెస్టు శిఖరెమెంత?

చీకటి మేఘాలు

మా కంటి పాపల్లో నిక్షిప్తం

మా హృదయాలలో

వెలుగు కిరణాల జలపాతం

మాటలతో మనసులను స్పర్శిస్తాం

అంతరంగాలలో అనురాగ వారధులు నిర్మిస్తాం”[130]

ఈ ప్రపంచంలో అడుగడుగునా ఎదుర్కొనే సవాళ్ళను, జీవన్మరణ సమస్యలను అధిగమిస్తూ అనునిత్యం బ్రతుకు పోరాటం చేసే విషాద జీవిత గాథలను చిత్రించాడు. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు ‘పొలి’ దీర్ఘ కావ్యాన్ని 2007లో రచించారు. సేద్యం గురించి అందులోని సాధక బాధలను సుదీర్ఘంగా చిత్రించారు.

“మా తాత సేద్యాన్ని కథలుగా చెబుతూ

మా నాయన సేద్యం చేసినాడు

సేద్యం తెలిసినా

నాకు చెప్పుకోవడానికి కథలంటూ లేవు

నా కొడుక్కి

సేద్యమూ లేదు

కథలూ లేవు

అందుకే ఈ పొలి”[131]

అంటూ తాతల తరం నాటి నుండి సేద్యం నేటి తరం వరకు పరిణామాన్ని తెల్పుతూ కావ్యాన్ని ప్రారంభిస్తాడు.

వరిపైరును నాట్లు వేసే సందర్భాన్ని ఇలా దృశ్యమానం చేశాడు.

"నెలనాళ్ళ దున్నకం
ఒక మహా సంగ్రామం
భూమి మీద మనిషి చేసిన తాండవం
నేల తడిపి సాళ్ళు దున్ని
మడుపు వేసి అండ జెక్కి
పేడెరువు చల్లి ఆకు తొక్కి
నేలను నాజూకు చేసిన సంరంభం
మనుషులు, యంత్రాలు
పశువులు, పక్షులు,
అంతా కలిసి చేసిన సంభారం
ఫలితం అడుసు కయ్యలు
వెండి పళ్ళాలు కావడం
నాట్లానికి నేల సిద్ధం
ప్రతిసృష్టికి అంతా సన్నద్ధం"[132]

వరినాట్లు వేయడానికి ముందు రైతులు పొలాన్ని సిద్ధం చేయడాన్ని కవి చిత్రించాడు.

"వరిసేద్యమైనా
వెలిసేద్యమైనా
కలుపు తియ్యడం
పైరు ఎదుగుదలకు
అడ్డంకుల్ని తొలగించడమే
అదొక విశిష్టకళ
.........................
వేటగాడి వలలో
మధ్య చిక్కినట్లు పైరు
ఊరుకుంటే
నేటి కలుపే రేపటి పైరు

కలుపు మొక్కల్ని పెంచేకదా
ఈ దేశం ఇలా కాలబడింది!

.................................

చేతుల్ని దువ్వెనల్ని చేసి
నేలకు చిక్కు తీసినట్లు
కలుపు తియ్యడం
యూనివర్సిటీల నేర్పని విద్య
పెరిగిన పైరును
చేతుల్తో ముందుకు వంచుకొని
కలుపు మొక్కల్ని పీకెయ్యడం
ఎదిగిన ఆడబిడ్డను
అమ్మ
వొళ్ళోకి వంచుకొని
తలపేన్లను ఏరి పారేసినట్లుండేది
రోజంతా
నేలను గోకిగోకి
కలుపు తీసితీసి
తెల్లగా చివికిపోయిన చేతులు
సాయంత్రం కూలితోపాటు
వక్కాకు కోసం అణా ఇనామిస్తే
ఆర్ద్రమైపోయి
రేపటి కలుపుతీతకు
మళ్ళీ అభయమిచ్చేవి"[133]

వరిపైరును నాటిన తర్వాత మహిళా కూలీలు కలుపుతీయడాన్ని వారి పని నైపుణ్యాన్ని చక్కగా తెల్పాడు.

రాయలసీమ నుండి యక్కలూరి శ్రీరాములు గారి రాయలసీమలో వాన తెలంగాణ, కాశీభట్ల వేణుగోపాల్ అనాదీ-అనంతం, పి.నరసింహారెడ్డి ప్రేమవేదం, ముకుందాపురం పెద్దన్న ప్రతీక్ష, రఘుబాబు హామీ పత్రం కావాలి, ఎస్జీడీ చంద్రశేఖర్ రణగొణ ధ్వనులు మొదలైన దీర్ఘకావ్యాలు వెలువడ్డాయి.

## 5.9. మినీ కవిత:

ప్రాచీన యుగంలోని చాటువులు, ముక్తకాల స్థానాన్ని ఆధునిక యుగంలో మినీ కవిత్వం ప్రాధాన్యత వహిస్తున్నదంటే అత్యుక్తి కాదు. వచన కవితలో తావు చేసుకొన్న అస్పష్టతనూ సుదీర్ఘతనూ పరిహరించే ఉద్దేశంలో ఆధునిక యుగంలో మినీ కవిత ఉత్పన్నమైంది. మినీ కవిత అంటే చిన్న కవిత అని అర్థం. సంక్షిప్తత, కొసమెరుపు మినీ కవితకు ప్రాణం. వచన కవిత్వంలో సుదీర్ఘత, వర్ణనలు ఎక్కువ కావడంతో పాఠకులు దాని పట్ల విసుగు చెందుతున్న సమయంలో మినీ కవిత దానికి వ్యతిరేకంగా ప్రారంబమయింది.

రాయలసీమ కవులు ఎక్కువగా వచనకవిత్వం రాస్తున్నప్పటికీ మినీ కవిత్వాన్ని కూడా రాశారు. మినీ కవిత, హైకూలు, నానీలు లాంటి కవితా రూపాలు పరిమితంగానే వెలువడిప్పటికీ ఒక నిర్దిష్ట లక్ష్యంతో, నిబద్ధతతో కవులు కవితలు రాసారని చెప్పవచ్చు. మునిసుందరం, ఎస్జీడీ చంద్రశేఖర్, పి.నరసింహ రెడ్డి, ఎన్.రామచంద్ర, .జి.వెంకటకృష్ణ, సవ్వప్పగారి ఈరన్న, యక్కలూరి శ్రీరాములు, షేక్ మహమ్మద్ ముస్తఫా, గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ, శైలజామిత్ర, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, అబ్బిగారి రాజేంద్రప్రసాద్ మొదలైన వారు మినీకవిత్వాన్ని రాశారు.

ఎస్.మునిసుందరం 'మునిసుందరాలు' పేరిట చిరు కవితలు ప్రచురించారు. చిరు కవితలు కాలం చెల్లిపోతున్న రోజుల్లో ఈ కవితలు రావడం విశేషం అని కవిగారే ముందుమాటలో చెప్పుకున్నారు. 'బాణి' శీర్షికలో లాగుడు బండి ద్వారా కష్టపడి జీవనం సాగించే మనిషిని గురించి ఇలా అంటాడు.

"లావా లాంటి తారురోడ్డు మీద
లాగుడు బండి వాడి పద విన్యాసం
ఏ బాణీయో
భరతముని చెప్పగలడా?"[134]

విపరీతమయిన ఎండలో తారురోడ్డు మీద వేడిమిని భరిస్తూ లాగుడు బండిని లాగే శ్రామికుని గూర్చి చెప్పాడు. 'పలుకులు' శీర్షికలో ఏమంటున్నాడో చూడండి.

"ఈ మట్టి అందరిది
ఈ నీరు అందరిది
ఈ గాలి అందరిది
ఈ దేశ సంపద మాత్రం
కొందరిది"[135]

ఈ దేశ సంపద మాత్రం కొందరి చేతుల్లోనే కేంద్రీకృతమైంది. 'చాలు' శీర్షికలో మానవుడి పరిణామక్రమాన్ని తెల్పుతూ,

"వానరుడు
నరుడు కావడానికి
లక్షల సంవత్సరాలు పట్టాయట
నరుడు
వానరుడు కావాలంటే
ఒక్క క్షణం చాలా?"[136]

చింపాజీలు, వానరుల రూపం నుంచి మనిషిగా పరిణామం చెందిన వాడు మళ్ళీ వాటిలాగా ప్రవర్తించేలా మారుతున్నాడు. 'విత్తు' శీర్షికలో ఇలా అంటాడు.

"భయపడదు
తాను మట్టిలో కల్సిపోయి
మరో నవాంకురానికి
ఊపిరి పోస్తుంది
జీవనమూ అంతే"[137]

విత్తనం మొలకెత్తి మహావృక్షంగా పెరగడం, మనిషి జీవితం కూడా మరో జీవితాన్ని ప్రసాదిస్తుంది. 'బలి' శీర్షికలో ఇలా అంటాడు.

"పునాదులు పైకి కనిపించవు
భవంతులే కనిపిస్తాయి
మట్టికింద
ఎన్ని సుహృదయాలో"[138]

పెద్దపెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్ నిర్మించాలంటే ఎంతోమంది కూలీలు చెమటధారను చిందించి పని చేస్తారు. 'అందం' శీర్షికలో కూలీల శ్రమను చెబుతూ,

"తాజ్‌మహల్ మెరుస్తుందంటే
ఎందుకు మెరవదూ?
అది కట్టింది
చెమటతో గదా!"[139]

తాజ్‌మహల్ నిర్మాణంలో వేలమంది కూలీలు శ్రమపడి ఎంతో మంది చనిపోయి త్యాగం చేసి దానిని నిర్మించారు. 'అవసరమయితే' శీర్షికలో,

"నీ అక్షరాలు
వెన్నెల చినుకులే కాదు
అవసరమయితే
అగ్గి బాణాలు కూడా"[140]

'ఒక సిరా(చుక్క) అక్షరం లక్షల మెదళ్ళకు కదలిక' అన్న మహానుభావుడి ఆలోచనలకు ప్రతిగా కవిత ఉంది. 'జండాలు' శీర్షికలో రాజకీయ పార్టీల గూర్చి,

"వానా కాలం మొలచిన
పిచ్చిమొక్కల్లా
దేశం నిండా జండాలు
జండాల గుండెల్లో
స్వార్థాల గంగాళాలు
జండాల కురుక్షేత్రంలో
నేను.......నా దేశం"[141]

ఈ దేశంలో విపరీతంగా పుట్టుకొస్తున్న రాజకీయ పార్టీల గూర్చి అనవసరంగా మొలుస్తున్న పిచ్చి మొక్కల్లా కవి భావించాడు. ఎస్జీడీ చంద్రశేఖర్ 'సూక్ష్మ కవితలు' పేరిట కవితల్ని ప్రచురించాడు.

"ఆమె పొద్దున్నే లేచి లేవంగానే
తన ఒళ్ళును శుభ్రం చేసుకొందో లేదో కానీ
రోడ్లను మాత్రం శుభ్రం చేస్తూ ఉంది"[142]

మున్సిపాలిటీ నగరాలు, పట్టణాలలో వీధులు, రహదారులలోని చెత్తను శుభ్రం చేసే మహిళ గూర్చి తెలుపుతుంది.

"ఆకాశంలో మబ్బులు
బెయిల్ మీద తిరుగుతున్నాయ్
వర్షం వచ్చేట్లుంది"[143]

వర్షం వచ్చే ముందు మబ్బులు ఆకాశంలో దోబూచలాడుతుంటాయి. ఆ దృశ్యాన్ని వ్యక్తీకరించాడు.

"నేల మీద ప్రవహించే నదులన్నీ

పరిగెత్తి పరిగెత్తి సముద్రంలోకి చేరి

సముద్రం అలలపైకెక్కి సవారీ చేస్తున్నాయి"[144]

సముద్రంపై అలలు, కెరటాల దృశ్యాలను సవారీ చేస్తున్నట్లుగా అభివర్ణించాడు.

"నేను నా వార్ధక్యంలో

దుఖాలే పండ్లుగా పండిన

ఎండిపోయిన మ్రోడు వృక్షాన్ని"[145]

మనిషి ముసలితనంలో దుఃఖాలే వేదనలుగా మిగిలిపోయిన సందర్భాన్ని ఎండిపోతున్న చెట్టుతో కవి పోల్చి దృశ్యమానం చేశాడు.

"నేతలెప్పుడూ

పీతలు కాకుడదు

నేతలు పీతలైతే

ప్రజల వాతలు తప్పవు"[146]

రాజకీయ నాయకులను పీతలతో పోల్చి వారు చేసే దోపిడీ స్వభావాన్ని చిత్రించాడు.

"కులాల తీరుల్ని ఎండగడుతూ

కలాల బారులు

కానీ కులాలు రేపుతున్న

కలకలాలు ఎన్నెన్నో"[147]

కులాలు, మతాలు కుతంత్రాలను ఎందరో మేధావులు, రచయితలు ఎండగడుతున్నా కులాలు వాటి ముసుగులో ఎందరో అల్లకల్లోలాలు సృష్టిస్తున్నారు.

"ఈ దేశంలో

జండాలు మారడంలేదు కానీ

జండాలు మోసేవాళ్ళు మాత్రం

మారుతూ ఉన్నారు"[148]

రాజకీయ పార్టీలు, వారి అనుచరులను గూర్చి పార్టీల సిద్ధాంతాలను పరోక్షంగా చెప్పాడు.

"ఆకాశంలో తెల్లని మబ్బులు

భూమ్మీద పండిన పత్తి పంటలు"[149] రైతు పండించిన పత్తి పంటలోని తెల్లగా విరభూసిన పత్తిని ఆకాశంలోని తెల్లమబ్బులతో పోల్చి అలంకారమయంగా చెప్పాడు.

శైలజామిత్ర గారు 'అగ్నిపూలు' పేరుతో మినీ కవిత్వాన్ని రచించారు.

"నేను రెండుసార్లు
మరణించాను
ఒకసారి
పుట్టినపుడు
మరోసారి ప్రేమించినపుడు"[150]

స్త్రీ యొక్క మనోవేదనను చిత్రించింది. ఆడపిల్లగా పుట్టినపుడు ఈ సమాజం చిన్నచూపు చూడటం, స్త్రీ పురుషున్ని ప్రేమించి మోసపోయిన సందర్భాన్ని గుర్తు చేసింది.

"గాంధీ తాత
రోడ్లపై ఇప్పటికీ
నాకు ఎదురవుతుంటాడు
కాకుంటే
వెండిలో మెరుస్తుంటాడు"[151]

పట్టణాలు, నగరాలలో కొంతమంది వెండి రంగును ఒంటినిండా పూసుకొని కర్ర చేతబట్టి గాంధీ వేషధారణలో ప్రధాన కూడళ్ళు, రహదారులలో దర్శనమిస్తూ చిల్లర అడుక్కునే దృశ్యాన్ని చిత్రించింది.

"కనిపెంచిన అమ్మ
వంటింటిలో
ఒక మూలగా కూర్చుంది
కనిపించిన అమ్మాయి ఏకంగా
అతని గుండెలో కూర్చుంది"[152]

స్త్రీ ఒక్కరే కానీ ఆమె పాత్ర మారగానే పురుషుడి ప్రవర్తన ఎలా మారుతుందో ఇక్కడ ఆమె బొమ్మ కట్టించారు.

"మానవ జన్మ
అపురూపం
నేడు
'అప్పు' రూపం"[153]

అపురూపమైన మనిషి జన్మ అప్పులతో కొట్టుమిట్టాడుతోంది. పదాల మధ్య విరుపులో భావాన్ని చిత్రించింది.

"పిల్లలతో పాటు

ఆమె కూడా

అమెరికాలో స్థిరపడింది

అయితే

వంటింట్లో"[154]

నేటి యువతరం విదేశీ వ్యామోహం పెంచుకొని అమెరికా లాంటి దేశాలకు కన్న తల్లిదండ్రులను వదిలిపెట్టి వెళ్తారు. తల్లి మాత్రం వంటింటికే పరిమితమైందనే కఠోర వాస్తవాన్ని చిత్రించింది.

"బాపూజీ

కలలుగన్న

భారతదేశం ఇది

అందుకే

కర్రతో కాపలా"[155]

గొప్ప భావ ప్రకటనతో కూడిన కవిత ఇది. గాంధీ కలలు కన్న రామరాజ్యంలో నేటి వర్తమాన పరిస్థితులు మనం చూడవచ్చు. ఇలాంటి ఈ దుస్థితి వున్న మన దేశంలో కర్రతో నిలిచివున్న గాంధీజీ విగ్రహాలు కాపలా వున్నట్లు మనకు సాక్ష్యమిస్తున్నాయి.

"ఆ నాయకుని

వెనుక గన్‌మేన్

నీ చావు

నా చేతుల్లో వుందని

హెచ్చరిస్తూ"[156]

ఎమ్.ఎల్.ఎ లు, ఎమ్.పీలకు రక్షణగా వున్నటువంటి గన్‌మెన్‌లను ఉద్దేశించి చెప్పిన కవిత ఇది.

జి.వెంకటకృష్ణ 'నిర్బంధం' శీర్షికలో ఇలా వ్యక్తం చేశాడు.

"అతడిని

ప్రేమించినందుకు

జీవితకాలం శిక్షించాడు

పెళ్ళితో"[157]

ఒక మహిళ పురుషుడిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నందుకు ఆ తర్వాత మోసపోయి జీవితకాలం శిక్ష

అనుభవించిన నేపథ్యాన్ని గుర్తుచేసింది కవిత. 'అస్తిత్వం' శీర్షికలో ఇలా అంటాడు.

"నలిపి నుసి చేసి
మాయం చేయొచ్చు పూలని
రద్దు చేయలేవు
పరిమళాణ్ణి"[158]

పూలను రుద్ది నాశనం చేసినా సహజ గుణాన్ని మనం వేరు చేయలేం కదా? మనిషి అస్తిత్వాన్ని కూడా మనం వేరు చేయలేము అనే భావన కవిత చదవగానే తెలుస్తుంది.

గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ 'కవితా సుమాలు' రచనలో మినీ కవితలను రాశారు. 'అ(నా)గరికం' శీర్షికలో ఇలా అంటాడు.

"మనిషి గొట్టె తోకతో
నడిస్తే అనాగరికం!
గ్లోబు తోకతో
నడిస్తే...నాగరికం!!"[159]

మనిషి విజ్ఞానాన్ని వేరు చేసిన సాంకేతికతను కవి గొప్పగా ప్రతీకతో చిత్రించాడు. 'లోకం పోకడ' శీర్షికలో ఇలా అంటాడు.

"తల్లి బిడ్డకు కల్పతరువు
బిడ్డకు తల్లి తల బరువు"[160]

తల్లి తన బిడ్డకు కల్పతరువులా కోరిన వరాల్ని, సపర్యాలను, సేవలను చేస్తుంది. ఆ తర్వాత పసిబిడ్డ పెరిగి పెద్ద వాడై పెంచి పోషించిన తల్లే తనకు తల బరువుగా భావించే స్థితిని కవిత్వీకరించాడు. 'సీక్రెట్' శీర్షికలో ఇలా అంటాడు.

"సాహిత్యంలో...దాగుంది
చమత్కారం!
నమస్కారంలో...దాగుంది
సంస్కారం!!"[161]

అంటూ పదాల పొందికలో గొప్ప కవితను చిత్రించాడు.

యర్రగుడి రామాంజనేయులు రెడ్డి 'కుకవి–సుకవి' శీర్షికలో భేదాన్ని చెబుతూ,

"ఖరీదైన బ్రాందీని

కలంలో పోసుకొని

విలాసాల కవితలను

వ్రాసేవాడు కుకవి

పేదల కన్నీటిని

సిరాగా చేసుకొని

బ్రతుకులపై కవితలను

వ్రాసేవాడు సుకవి"[162]

అంటూ ఇద్దరి కవుల మధ్య తేడాను గొప్పగా చిత్రించారు.

## 5.10. నానీలు:

ఆధునిక తెలుగు కవిత్వంలో ఏర్పడిన లఘు కవితా రూపం'నానీ'లు. నాలుగు పంక్తులు మొత్తం 20 నుండి 25 అక్షరాలతో సాగే సూక్ష్మ కవితా పద్ధతిని నానీలు అంటారు. ఈ కవితా ప్రక్రియను ఆచార్య ఎన్.గోపి ప్రవేశపెట్టారు. సరదా కోసం రాయడం కాకుండా సమాజ చైతన్య దిశగా కొత్త లక్ష్యం దిశగా నానీ రూపుదిద్దుకుంది. నానీల సృష్టికర్త అయిన గోపి గారు 'నానీలు అంటే నావీ నీవి వెరసి మనవి' అని అర్థం చెప్పారు.

రాయలసీమలో నానీలను రాసిన కవులు ఉన్నారు. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, జి.వెంకట కృష్ణ, అబ్బిగారి రాజేంద్ర ప్రసాద్, ఎ.ఎ.నాగేంద్ర, కె.వి రమణ మొదలగు వారు నానీల ప్రక్రియను చేపట్టారు. రాయలసీమలో రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారు మొదటగా నానీలను రాసి 2006లో 'సీమ నానీలు' పేరుతో ప్రచురించారు. ఈ నానీలలో కరువు, నీటి ఎద్దడి, కక్షలు, రాయలసీమ భాష పట్ల ప్రేమ మొదలైన సామాంజికాంశాలు వ్యక్తమయినాయి.

"రాయలసీమ

అనగానేమి?

నీళ్ళకు బదులుగా

కన్నీళ్లు కురియును"[163]

రాయలసీమ అంటేనే నీటి సమస్య గుర్తుకు వస్తుంది. ఈ సమస్య వల్ల సాగు, తాగుకు ఎంతటి ఇబ్బందులు కలుగుతున్నాయో సీమ ప్రజానీకం ఎంతటి వేదన అనుభవిస్తున్నారో కవిత తెలుపుతుంది.

"అబ్బో! ఎద్దులు

లారీ లెక్కాయా

అయితే కరువు హారన్

మోగిందన్న మాటే"[164]

కరువు ప్రభావం వల్ల పశువులకు గడ్డి, నీళ్ళు దొరక్క వాటిని రైతులు కబేళాకు అమ్ముతున్న దృశ్యాలను ఒక వ్యంగ్యంగా చిత్రించారు.

"అదేమిటి

అనంతలో అంత వర్షం?

బహుశా మబ్బులు

దారితప్పాయేమో"[165]

ఎప్పుడో ఒకసారి కురిసే భారీ వర్షానికి అనంతపురం జిల్లాను దృష్టిలో పెట్టుకొని కొసమెరుపుతో కవి చిత్రించాడు.

"కోపం మనిషి మీదా

నరికేది చెట్లను

ఇదేమి

మనిషి న్యాయం?"[166]

కొంతమంది మనుషుల మధ్య గొడవలు, కక్షలు, పగల వల్ల ఆ ప్రతీకారాన్ని తీర్చుకోవడానికి చెట్లు నరకడం, పళ్ళతోటలను ధ్వంసం చేయడం చేస్తారు.

"సిన్మాలోడా!

సీమతో పెట్టుకోకు

వేషాలు వేస్తే

మా యాసతో కొడతాం"[167]

రాయలసీమ ప్రాంతానికి చెందిన మాండలిక భాష, యాసను సినిమాల్లో విలన్లకు, కామెడీ యాక్టర్స్‌కు ఉపయోగించి సీమ యాసను, భాషను ఎగతాళీ చేసే సందర్భాన్ని కవి గుర్తు చేశాడు.

"ఉయ్యాలవాడా

తెల్లోడి గుండెల్లో నీ దడ

అందుకే కోట గుమ్మంపై

నీ తల"[168]

బ్రిటీష్ వారిని గజగజ లాడించి వారి గుండెల్లో దడ పుట్టించిన రాయలసీమ విప్లవ వీరుడు, పాళెగాడు

అయిన ఉయ్యాలవాడ నరసింహరెడ్డిని బ్రిటీష్ వారు ఉరితీసి తల కోట గుమ్మానికి వేలాడదీశారు.

"కోన సీమా!
నిన్ను పడవలు మోస్తున్నాయి
మేం కడవలు మోస్తున్నాయి
అంతే తేడా!"[169]

రెండు ప్రాంతాల మధ్య నీటిని గూర్చి కవిత తెలుపుతుంది. ఒక ప్రాంతంలో నీరు ఎక్కువై విలాసాలు చేస్తుంటే మరోప్రాంతం (సీమ) గుక్కెడు నీళ్ళ కోసం ఎంతో దూరం నడిచి నీటిని తెచ్చుకునే పరిస్థితిని కవి తెల్పాడు.

"రాగి సంగటి
శెనక్కాయల చట్నీ
ఒక్క ముద్ద
స్వర్గం చేస్తుంది ముంగిట్ని"[170]

రాయలసీమ ప్రజల ఆహారంలో భాగమైన రాగిముద్ద, వేరుశెనగ చట్నీ రుచులను గూర్చి చిత్రించిన కవిత.

"ఊర్లపేర్లన్నీ
సముద్రాలూ చెరువులూ
ఏ తలుపు తట్టినా
బొట్టు లేదు"[171]

రాయలసీమలో ఎన్నో చెరువులు, వాగులు, కుంటలు ఉన్నప్పటికీ నీళ్ళు లేని దృశ్యాలను చిత్రించాడు.

"పౌరుషం
తలకెక్కిందా!
ఇక పెళ్లాం మెడలో
పుస్తె ఫటాఫట్!"[172]

సీమలో కొంతమంది ప్రజలు పగలు, ప్రతీకారాలతో పంతాలకు పట్టింపులకు పోయి పౌరుషాలు పెంచుకొని పరస్పర దాడుల్లో పురుషులు చనిపోతారు. దీనితో వారి భార్యలు విధవలుగా మిగిలిపోతారు.

"అందరూ
మంచి కలలే కనండి

మాకు కరువు కలలు

ఉండనే ఉన్నై”[173]

అంటూ సీమను పీడిస్తున్న కరువు గూర్చి చెప్తాడు.

“పేపరు

ఇంటిముందు పడిందా

ఆ తలకాయ

ఎవరిదో చూడు”[174]

అని సీమ ఫ్యాక్షన్ హత్యలను గూర్చి పేపర్లో వచ్చే వార్తలను గూర్చి తెల్పిన కవిత.

“రారా అంటే

వ్యాసాలు రాల్తాయి

అక్షరాల్లో

వడగళ్ళు పరవళ్లు!”[175]

రాచమల్లు రామచంద్రారెడ్డి గారి వ్యాసాల్లో ముక్కుసూటిదనం, ఖచ్చితత్వం కనిపిస్తాయి.

“ఎన్ని కతలు రాసినా

ఎన్ని కవితలు చెప్పినా

సీమ వెతల

కుతకుతలు పోవా?”[176]

ఎంతోమంది కవులు, రచయితలు సీమ బతుకు వ్యథల్ని, గాథల్ని సాహిత్యంలో చిత్రించినా ఇంకా మిగిలే వున్నాయనేది కవి భావన.

అబ్బిగారి రాజేంద్రప్రసాద్ ‘కడప నానీలు’ పేరుతో నానీలను రచించారు. 2008లో ప్రచురించారు.

“కడప జిల్లా

కవుల కాణాచే కాదు

కథల

మాగాణి కూడా”[177]

కడప జిల్లాలో గడప గడపకు కవులకు పుట్టినిల్లు అన్నట్లుగా కవులే కాకుండా కథలకు కూడా నిలయంగా వుందని కవి చిత్రణ.

"ఇంట్లో అన్ని

గూళ్లల్లో సెల్లులు

కుటుంబ సభ్యుల్లో

మాటలు నిల్లు"[178]

నేడు ప్రతి కుటుంబంలో అందరి దగ్గర సెల్‌ఫోన్స్ వచ్చి మనుషుల మధ్య మాటలు కరువైపోయాయి.

"చరిత్రను

కుప్పలకెత్తా డండీ

అతని పేరు

కల్నల్ మెకంజీ"[179]

కైఫియత్తులను సేకరించిన కల్నల్ మెకంజీని గూర్చి చెప్పాడు.

"నీళ్లు లేని

నదులు కూడా

అక్షరాలు లేని

పుస్తకాల్లాంటివే"[180]

సీమలో నీళ్ళు లేని నదులు చూసిన కవి గుండె తడి ఇది. అక్షరాలు లేని పుస్తకాల వల్ల ఏం లాభం అలాగే నీళ్ళులేని నదులు అంతే కదా!

"వేమన పేరిట

విశ్వవిద్యాలయమా

ఆయన

విశ్వకవి కదా!"[181]

వేమన కవిపేరు మీదుగా విశ్వవిద్యాలయ ఏర్పాటును ప్రస్తావించాడు.

ఎ.ఎ. నాగేంద్ర 'నాగేంద్ర నానీలు' పేరుతో నానీలు రచించి 2009లో ప్రచురించారు.

"ఇండియా పక్షి

ఫారిన్ పయనం

'డాలర్'

ముక్కకోసం"[182]

భారతీయుల విదేశీ వ్యామోహాన్ని తెల్పాడు.

"రైతు ఆత్మహత్య
కరువుతో కాదు
పరువుతో"[183]

అంటూ సమాజంలో గొప్పగా బ్రతికిన రైతు ప్రకృతి విపత్తులతో పంటలు పండక అప్పులు ఇతర సమస్యలతో పరువు మర్యాదలు పోవడాన్ని అవమానంగా భావించి రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారు.

"ఇద్దరం
మట్టి మనుషులమే
కానీ
గ్లాసులు వేరే"[184]

అని కులవివక్షను చూపించి అంటరానితనాన్ని అంటగట్టే ఈ సమాజాన్ని చిత్రించాడు.

"మంటల్లో రోధిస్తోందా
ఎర్రబస్సు?
అయితే అది
'బందే' "[185]

సమ్మెలు, బంద్‌లు, రాస్తారోకోలలో అల్లరి మూకలు బస్సులను తగలబెట్టి ప్రభుత్వ ఆస్తుల్ని బుగ్గిపాలు చేయడం చూసి కవి చిత్రించాడు.

"పల్లె
ఇవాళ పక్షి అయింది
వలసై
ఎగిరిపోయింది"[186]

పల్లె ప్రజలు బతుకు తెరువు కోసం తమ గ్రామాలను వదిలి వలస వెళ్ళే దృశ్యాన్ని తెల్పాడు.

"యువకుడు
వృద్ధుడయ్యాడు
వయసుతో కాదు
ఫ్లోరైడ్‌తో"[187]

అని సీమలో కొన్ని ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నీటివల్ల పిల్లల్లో వచ్చిన అంగవైకల్యాన్ని ప్రస్తావించాడు.

"గుడికంటే

బడేనయం

రమ్మంటుంది

నన్ను లోనికి"[188]

అని దళితులపై కుల వివక్షను ప్రశ్నిస్తాడు.

"స్వారీ చేస్తున్నాయి

పుస్తకాలు

పిల్లల వీపుపై"[189]

అని బడిపిల్లలు పుస్తకాల బరువును మోయుటను తెల్పాడు.

"కాలాన్ని కాదు

'కలాం' ను అడుగు

నేర్పుతాడు

కలలు కనడం ఎలాగో"[190]

అబ్దుల్ కలాం ఆలోచనల్ని, సందేశాన్ని ప్రస్తావించాడు.

"వైద్యం

ఎప్పుడో అటకెక్కింది

దిగుతుంది

డబ్బిస్తేనే"[191]

అని పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వైద్యం చాలా ఖరీదైపోయింది. పెద్ద మొత్తంలో డబ్బులుంటేనే వైద్యం సేవలు దొరికే పరిస్థితిని తెల్పాడు.

"కూరగాయలు

చుక్కల్తో దోస్తీ

ఎప్పుడెక్కుతాయో

నింగికి"[192]

కూరగాయ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి అనే సందర్భంలోంచి కవి వ్యక్తీకరించాడు.

"హెూలి

మమ్మల్ని

సీతాకోక చిలుకల్ని చేసింది

రంగురంగులతో"[193]

హోలి పండుగలో రంగులు చల్లుకోవడం వల్ల మనుషులు వివిధ రంగుల్లో సీతాకోక చిలుకల్లా కనబడుతున్నారని కవి భావన.

"ఉత్తరాలు

ఆచూకీ లేదు

కిడ్నాప్ చేశాయి

ఫోను, కంప్యూటర్"[194]

సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్‌లు, ల్యాప్‌ట్యాప్‌లు వచ్చాక ఉత్తరాలతో పనేముంది. సాంకేతికత పరిజ్ఞానం ఉత్తరాలు రాసే సంస్కృతిని మింగేసింది.

## 5.11 హైకూలు:

హైకూ(STLLABLES) అనేది ఒక ఛందస్సు. ఇది జపాన్ దేశస్థులైన కవుల ఛందోరీతి. హైకూ ఛందస్సులో రచితమైన జపాను కవిత్వం వారి సంస్కృతికి నిలువుటద్ధంగా నిలిచింది. కడప జిల్లాకు చెందిన సాగర్ జయ్యది శ్రీ అలీం సభా నవేది అనే ఉర్దూకవి రాసిన హైకూలను తెలుగులో 'పరిమళ వీచికలు' పేరుతో తెలుగు అనువాదం చేశారు. ఈ పుస్తకం ప్రస్తావనలో ఒక జపాన్ హైకూను ఉదాహరించారు. "17వ శతాబ్దానికి చెందిన జపాను కవి 'MAT SUOSUO' హైకూ ఛందో రీతిలో రచించిన ఒక కవితా శకలం మీ ముందుంచుతున్నాను.

"Shi-Zv-Ka-Sa-Ya-

I-Wa-Wi-Shi-Mi-i-ru-

Se-Mi Wo -Ko-e=

ఈ కవితకు తెలుగు అనువాదమిది.

"భయద నిశ్శబ్దమున

క్రిమ కీటకాల శ్వాస గూడ-

పుడమి అదిమేస్తోంది-

ఈ ఛందోరీతిలో మొదటి పాదంలో పది మాత్రలు, రెండవ పాదంలో పదునాల్గు మాత్రలు, మూడవ పాదంలో పది మాత్రలు వుంటవి. ఇది అరుదైన ఛందోరీతి."[195] జపాన్ హైకూను తెలుగులోకి అనువదించి పరిచయం చేశాడు.

తెలుగులో హైకూ మూడు పాదాలలో పదిహేడు 'మాత్రలు'(సిలబుల్స్) కలిగిన త్రిపద. మొదటి పాదంలో ఐదు, రెండో పాదంలో ఏడు, మూడో పాదంలో ఐదు చొప్పున మాత్రలు ఉంటాయి. సాధారణ విషయాలలో అద్భుతాన్ని చూపగల ప్రక్రియ. ఏ ఆలోచన చేయకుండా ఒక దృశ్యాన్నో, సంఘటననో చూసి కవి మెరుపు వేగంతో చెప్పే ప్రక్రియ. మానవాత్మనీ, భూమ్యాకాశాల్ని, వెలుగు నీడలను ఒకే స్నాప్ షాట్లో పట్టే ప్రక్రియ అంటారు ప్రముఖ సాహితీకారులు వాడ్రేవు చినవీరభద్రుడు. కొలనులోకి రాయి విసిరితే వృత్తాలు వ్యాపించినట్లు హైకూ పాఠకునిలో ఆలోచనాతరంగాలను సృష్టిస్తుంది.

తెలుగు సాహిత్యంలో హైకూలను పరిచయం చేసిన కవి ఇస్మాయిల్. 1991లో పెన్నా శివరామ కృష్ణ 'రహస్యద్వారం' పేరుతో తొలి హైకు కవిత్వ సంపుటిని తీసుకొని వచ్చాడు. 1994లో గాలి నాసర రెడ్డి జపాన్ హైకూలను తెలుగులోకి అనువదించారు. ప్రస్తుతం తలతోటి పృథ్విరాజ్ 'ఇండియన్ హైకూ క్లబ్'ని స్థాపించి ఈ ప్రక్రియకు విస్తృత ప్రచారం కల్పించి విరివిగా రాస్తున్నారు.

రాయలసీమలో కూడా హైకూలను రాసిన కవులున్నారు. యస్.ఆర్.ప్రతాప రెడ్డి, జి.వెంకటకృష్ణ, మునిసుందరం, టి.యమ్.ఆర్.రమణా రెడ్డి, వి.చంద్రశేఖర శాస్త్రి, సాగర్ జయ్యాది మొదలైనవారు హైకూలను రాశారు.

యస్.ఆర్.ప్రతాప రెడ్డి గారి హైకూలు ప్రధానమైనవి.

"రాత్రంతా వర్షం
కప్పల బెకలతో
ఊరు మేల్కొంది!"[196]

అని వర్షాలు వచ్చినప్పుడు కప్పల సందడిని చెబుతున్నాడు.

"వాన వెలిసింది
పల్లె వీధులంతా
తేనీటి ప్రవాహం!"[197]

అని వర్షాలు పడగానే వర్షపు నీరు మట్టిలో కలిసి తేనీరు రంగులా మారిన దృశ్యం.

"తన గతవైభవాన్ని
తలచుకుంటూ
కోటలో పాతబురుజు!"[198]

అని గతకాలపు రాజుల కాలంలో వైభవంగ వెలుగొందిన కోటలు, బురుజులు నేడు శిథిలావస్థలో వున్న దీనస్థితిని చూసి వ్యక్తీకరించిన కవిత.

"పున్నమి రాత్రి
నదిలో వెలుగుతూ
వెన్నెల దీపం"[199]

అని పున్నమి నాటి నిండు చంద్రుడు నది నీటిలో కన్పించిన ప్రతిబింబాన్ని 'వెన్నెల దీపంగా వెలగింది' అని గొప్ప భావచిత్రంగా అభివర్ణించారు.

"కోర్టు హాలులో
నిజాన్ని వెదుకుతూ
పాపం! గుడ్డి దేవత!"[200]

అని కోర్టు హాలులో న్యాయ దేవత విగ్రహానికి ఆమె కళ్ళకు గుడ్డకట్టి వుంటారు. కళ్ళుండీ చూడలేని దేవతగా న్యాయం అన్యాయాలను తీర్పు చెప్పలేని గుడ్డి దేవతగా తెల్పాడు.

టి.ఎం.ఆర్ రమణారెడ్డి 'గ్లోబల్ హైకూ' ల పేరుతో హైకూలను రచించారు.

"వరల్డ్‌ట్రేడ్ ఉచ్చులకు
వ్రేలాడే బొమ్మ
అన్నపూర్ణమ్మ"

"బిన్‌లాడెన్
చిచ్చుబుడ్డి
డబ్లూటీసి"

"సన్నకారు రైతుల
వులన్ ఉరిత్రాడు
విశ్వవిపణి సంస్థ"

"ఐ.ఎం.ఎఫ్. లోగిలిలో
బుక్కా ఫకీర్లు....
వర్ధమాన దేశాలు" [201]

ప్రపంచీకరణ ప్రభావాన్ని అది సృష్టించే విధ్వంసాన్ని అగ్రరాజ్యాల కనుసన్నుల్లో నడుస్తున్న వర్ధమాన దేశాలు కీలుబొమ్మలుగా మారిన వైనాన్ని చిత్రించాడు.

జి.వెంకటకృష్ణ 'రైతు హైకూ' ల పేరుతో హైకూలను రచించారు.

"నేల ప్రసవించి
మొలకలు పులకలు
ముంగారు పైరు"
"విరగ గాచిన
గంపలు గంపలు
రైతు కలలు"
"సంతల నిండా
ఆశపడిన కళ్ళు
రైతు శ్రమలు"
"అమ్ముడు పోదు
యింటికీ చేరదు
రైతు కష్టం"
"రైతు బతుకు
పంటలో తాలు
దిబ్బల పాలు"[202]

రైతు పొలంలో చల్లిన వరి విత్తనాలు మొలకలు వచ్చిన దృశ్యాన్ని బాగా పండిన పంటలు మార్కెట్‌లో ధరల కోసం ఎదురుచూసే స్థితిని, అమ్ముడు పోని పంటలు, రైతుల శ్రమ మరియు కష్టం చివరికి దిబ్బలపాలయ్యే దృశ్యాలను భావం ఉట్టిపడేటట్టుగా చిత్రించాడు.

"గుప్పెడు చినుకు
గర్భంలో దాచుకుంది
మట్టి వాసన"[203]

అని ఒక వర్షపు చినుకు మట్టిలో పడి మట్టి సువాసనను వెదజల్లే దృశ్యం.

"వాన వెలసింది
వెలుగు కురిసింది
ఇక చెట్లవంతు"[204]

వర్షాలు పడిన తర్వాత చెట్లు చిగుర్చే దృశ్యం ఇది.

"నీటి దుప్పటి

కప్పుకున్న తటాకం

ఉదయకాలం"

"కంకి పట్టిన

వెన్నెల గింజలు

జొన్న చేలల్లో"

"కావలి గాళ్ళ

వొడిసెల రాళ్ళే

గువ్వల కళ్ళు"[205]

అని నీటితో నిండిన చెరువు గూర్చి పాల గింజలతో తెల్లగా వున్న జొన్న కంకులు, పంటలలో కాపలా దారుల చేతుల్లోని వొడిసెల రాళ్ళు గూర్చి భావచిత్రాలు ఉట్టిపడేట్టుగా కవి వర్ణించాడు. ఎస్.మునిసుందరం 'బైక్యూ క్యూ' రచనలో హైకూలను రచించాడు. కవి గారి మాటల్లో "బైనాక్యూలర్ వ్యూ' ను కుప్తీకరిస్తే 'బైక్యూ' అయింది. చుట్టూ వున్న ప్రపంచాన్ని మూడు పంక్తుల్లో నుండి చూడటం. ఇది నా కళ్ళజోడు. అని చెప్పుకున్నాడు. జపాన్ హైకూలో మూడు పాదాలుండి మరికొన్ని నియమ నిబంధనలుంటాయి. ఈ బైక్యూలో మూడు వరుసలు నిర్దుష్టంగా వుంటాయి తప్ప తక్కిన నియమాలేవీ వుండవు." తెలుగులో వెలువడిన హైకూలకు ఏమాత్రం తీసిపోని విధంగా మునిసుందరం గారి హైకూలు వున్నాయి.

"మండే ఎండలో పసిబాలుడు

సమ్మెటతో ఆకలి ఆట

కడుపెంత కఠినాత్మురాలు"[206]

ఇందులో గొప్ప శబ్దచిత్రం స్పురిస్తుంది. సమాజంలో బాల కార్మికుల దీనస్థితిని మనం చూస్తూనే ఉన్నాం. అటువంటి దృశ్యాన్ని కవి మన కళ్ళ ముందు ఉంచాడు.

"కొమ్మపై కోకిలమ్మ

ఇంట్లో పాలబొమ్మ

ఇద్దరు లతామంగేష్కర్లు"[207]

ఒకటి ప్రకృతిలో పాడే గాన కోకిల రెండోది పాలకై ఏడ్చే చిన్నారి కోయిల. రెండు సందర్భాల్ని చెప్పిన కవిత.

"లీకేజీ వ్యవస్థలో

ఏ చదువయినా కిలోల లెక్క

బలిపశువులు బడుగులే"[208]

ప్రైవేట్, కార్పొరేట్ చదువులు చాలా ఖరీదు అయిపోయాయి. నేటి వ్యవస్థలో పేదవారికి ఈ చదువులు డబ్బులతో కొనలేనివి.

"రాజకీయం నేడు

సంపాదన సదుపాయం

అదీ ఓ బిజినేస్సే"[209]

రాజకీయాలు వ్యాపారంగా మారి సంపాదనే లక్ష్యంగా నడుస్తున్న నేతలు.

"ప్రేమ...నిజమా?

రాకాసి పులి అది

రక్తం జుర్రేస్తుంది"[210]

ప్రేమ పేరుతో అమ్మాయిలను వేధించి వారిని ఎక్కడ పడితే అక్కడ కొందరు కిరాతకులు కత్తులతో దాడులు చేసి హతమారుస్తున్నారు.

"మానవత

మహోన్నత ధర్మం

ఆచరిస్తేనే మహాత్ముడు"[211]

'మానవ సేవే మాధవ సేవ' అనే సూక్తిని తెలుపుతున్న కవిత.

"అమ్మా!నాన్నా

పాత చింతకాయ పచ్చడి

మమ్మీడాడి చికెన్ బిరియాని"[212]

నేటితరం పిల్లలు తల్లిదండ్రులను అమ్మా నాన్నా అని నోరారా పిలిచేవారే కరువై పోయారు. ప్రాణం, జీవం లేని పదాలైన మమ్మీ డాడీ అంటూ పిలుస్తూ విదేశీ సంస్కృతికి బానిసై పోతున్నారు. కవి అలాంటి సందర్భాన్ని రెండు చక్కని పోలికలతో దృశ్యమానం చేస్తూ సాక్షాత్కరింప చేశాడు.

**5.12 రుబాయీలు:**

రుబాయీ నాలుగు పాదాలు కల ఫారసీ సాహిత్య ఛందః ప్రక్రియ. రుబాయీ పదానికి మూలం అరబ్బీ భాష పదం ' అరబా '. అరబా అనగా నాలుగు. చతుర్ పంక్తులు గలది. రుబాయీకి

బహువచనం 'రుబాయిత్' పర్షియన్ భాషలో అధికంగా ప్రసిద్ధి చెందాయి. రుబాయీలకు ఉమర్ ఖయ్యాం(పర్షియన్), అంజద్ హైదరాబాది, మహమ్మద్ ఇక్బాల్ మొదలగువారు ప్రసిద్ధులు.

రుబ్ అంటే 'రసం, సారం' అని అర్థాలు. రుబాయి అంటే రసవంతమైనది అని కూడా అర్థం. ఇది నాలుగు పంక్తుల గల కవిత. ప్రతిపాదం ఒక సంపూర్ణ వాక్యం. ఒకటి, రెండు, నాలుగు పాదాలకు అంత్య ప్రాస నియతి వుంటుంది. మూడో పాదంలో వుండదు. మూడో పాదం ఒకటి, రెండు పాదాలను అనుసంధానం చేస్తుంది. మొత్తంగా మూడు పాదాల్లోని అభిప్రాయాన్ని బలపరుస్తూ నాలుగో పాదం చరుపుతో మెరుస్తుంది. ఉమర్‌ఖయ్యాం రుబాయీలను తెలుగు అనువాదం చేసిన వారిలో ఆదిభట్ల నారాయణ దాసు, దువ్వూరి రామిరెడ్డి, రాయప్రోలు సుబ్బారావు మొదలగు ప్రధానమైన వారు. దాశరథి కృష్ణమాచార్యులు, సి.నారాయణ రెడ్డి, తిరుమల శ్రీనివాసాచార్య, సామల సదాశివ మొదలైన వారు తెలుగులో రుబాయీలను రాశారు. రాయలసీమ ప్రాంతం నుండి రుబాయీలను రాసిన కవి కడప జిల్లాకు చెందిన వారు షేక్ మహమ్మద్ ముస్తఫా. ఈయన తెలుగు రుబాయీలు ఇలా వున్నాయి.

"నరజాతికి జీవం పోసే నారీమణి
గౌరవమందే పవిత్ర భారతావని
వరుడు వధువు శిరస్సుపై పవిత్రంగా
అక్షతలు చల్లిన నక్షత్రక శిరోమణి"[213]

అని స్త్రీ లేనిదే ఈ సృష్టి లేదు. మనిషికి జన్మను ఇచ్చి చరాచరా జగత్తును ఆమె నడిపిస్తుంది. అటువంటి స్త్రీ గూర్చి తెల్పినాడు.

"స్వార్థం, ద్వేషం, కపటం, వ్యూహం
పరిపూర్ణంగా పండేపొలం
మంచిని సాగు చేసి పండించే
రైతులకు బ్రతుకే ప్రశ్నార్థకం"[214]

రైతు గూర్చి అతను పండే పంటల పొలాల స్థితిగతులను చెప్పాడు.

"మట్టికి సౌభాగ్యాన్నిచ్చే శ్రమజీవులు
పుట్లకొద్దీ వెలసిన ప్రభుత్వ పథకాలు
పట్టు లేని హామీల వానల కాలం
వేర్లు బలపడే మృత్యువాతల బ్రతుకులు"[215]

అని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వాగ్దానాలు, హామీలు లాంటి ఏ ప్రయోజనాలు బడుగు పేద శ్రామికులకు

అందని పరిస్థితిని గూర్చి తెల్పినాడు.

"పదేను నెలల పాలబుగ్గల పసిబాలుడు
ఆకలికి అసువులు బాసిన ఎముకలగూడు
సోమాలియా మన ప్రక్కనే ఉంది
కరువు ప్రాంతాల్ని హృదయంతో చూడు"[216]

కరువు ప్రభావం వల్ల పేదరికం పెరిగి తిండి కూడా దొరకని స్థితిలో ఆకలితో అలమటించి చనిపోయిన దృశ్యాన్ని వెలుబుచ్చాడు.

"అవనిని అద్భుత సృష్టి రూపాలు
కాంక్రీటు నగరాల సదనాలు
సువిశాల సుందర భవనాల్లో
ముడుచుక పోయిన హృదయాలు"[217]

పెద్దపెద్ద నగరాలు, పట్టణాలలో భవంతులు, అపార్ట్‌మెంట్స్‌ల కట్టడాలలో శ్రామికులు, కూలీలు లేనిదే వాటి నిర్మాణం పూర్తికాదు. అటువంటి దృశ్యాన్ని చెప్పినాడు.

"బహుళ జాతి సంస్థలు వివరించిన
బహుముఖ లోక జనోద్ధరణ
మానవతను మృత్యువాటికకు పంపే
వ్యాపార దృష్టికి శంకుస్థాపన"[218]

ఆర్థిక సంస్కరణల్లో భాగంగా ఎల్.పి.జి. వ్యవస్థ ఈ దేశంలో ప్రారంభమైన తర్వాత దాని ప్రభావాలు, ప్రపంచం కుగ్రామంగా మారి మార్కెట్ వ్యవస్థ విస్తృతమై క్రమేపి అది దేశాలను కబళించే నాశనకారిగా మారిందనేది సత్యం.

"ఇటు నవ నాగరికతా జైత్రయాత్ర
అటు సాంకేతిక వికాసం సర్వత్ర
ఇదేమి వింత! రుధిర ధారల్లో
కళంకమైన మానవ చరిత్ర"[219]

ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న కొద్దీ ఈ నాగరిక సమాజంలో ఇంకనూ మనిషుల మీద దాడులు, నరుక్కోవడాలు, చంపుకోవడాలు, అల్లర్లు, బాంబు దాడులు లాంటి వాటితో రక్తతర్పణాలతో ఈ నేల తడిసిముద్దవుతోంది. అలాంటి దానిని దృశ్యమానం చేశాడు.

"నిండా ఊకదంపుళ్లు

శుష్కప్రియాల ముళ్లు

ఇవి మేనిఫెస్టోలు నిండిన

రకరకాల పూల గంపలు"[220]

నేటి రాజకీయ పార్టీలు ఎన్నికలు వచ్చినపుడు వారి మేనిఫెస్టో ఎజెండాలో ప్రకటించే హామీలు, వాగ్దానాలు గూర్చి కవి తెల్పాడు.

"అర్ధరహిత ధర్మాలు

ప్రసంగాల తతంగాలు

ఎన్నడూ బ్రతుకు పొలంపై

కురవని నీరదాలు"[221]

నాయకుల వాగ్దానాలు, హామీలే కాని అవి అమలు కావు. సీమ పొలాలకు నీళ్ళు రాని పరిస్థితిని చిత్రించాడు.

"పేదల దుర్భర జీవితాల కథనాలు

కరువుకు బలియైన నిర్భాగ్యుల శవాలు

ఎన్నో జీవనదులున్న దేశంలో

రాజకీయాల నడకకు జవసత్వాలు"[222]

వర్షాలు కురవక పంటలు పండక కరువు కాటకాలు, కరువు కోరల్లో చిక్కి పేద ప్రజల బతుకులు బలవన్మరణాలకు సిద్ధపడుతున్నాయి. ఎన్నో నదులు వాటి నీరు సముద్రం పాలవుతున్నా ఆ నీటిని ఒడిసి పట్టి ప్రాజెక్టుల ద్వారా కరువు ప్రభావిత ప్రాంతాలకు నీటిని మళ్ళించలేని ఈ రాజకీయాలు, ప్రభుత్వాలు గూర్చి కవి ఆవేదన చెందాడు.

"ప్రజా నాయకుల దేశం

కృత్రిమ ప్రశంసల వర్షం

నీటిబొట్టు రాల్చదు

సిగ్గుపడ్డ ఆకాశం"[223]

సుదీర్ఘకాలం వర్షాలు కురవని ప్రాంతాల్లో ప్రభుత్వాలు తాత్కాలిక చర్యలో భాగంగా పంట పొలాలపై కృత్రిమ వర్షాలు కురిపించాయి. ఆ సందర్భాన్ని కవి చిత్రించాడు.

ఆధునిక తెలుగు కవిత్వంలో తెలుగు కవులు కొన్ని లఘు కవితా ప్రక్రియల్ని రూపొం దించారు. గజళ్లు, రుబాయీలు, నానీలు, హైకూలు, కొంటె కోణాలు, కూనలమ్మ పదాలు, ఇంటింటి

పద్యాలు, ప్రపంచ పదులు, సిరిసిరి మువ్వలు, ప్రాస క్రీడలు, లిమరిక్కులు, మినీ కవితలు, అక్షర కవితలు, ఏకాక్షర కవితలు, అక్షింతలు లాంటి వాటిని కవులు వెలువరించారు.

ఇటీవలి కాలంలో ఆధునిక కవిత్వంలో మినీ కవితలో భాగంగా నూతన ప్రక్రియ రూపాలను ప్రవేశ పెడుతున్నారు. మినీ కవితలు మొదలుకొని నానీలు, రెక్కలు, చిటికెలు, గాథలు, లిప్రాలు, పద్దికలు లాంటి కొత్త కొత్త పేర్లతో నూతన ప్రయోగాలను కవులు చేపట్టి కవిత్వ రూపాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్నారు.

రాయలసీమ కవులు కూడా మినీ కవితా రూపాలను చేపట్టారు. దీనిలో భాగంగానే త్రిపదలు, ఎస్జీడీలు, బాలీలు, కోయిలమ్మ పదాలు, చిలుక పలుకులు, చంద్రికలు లాంటి పేర్లతో కవితా రూపాలను నిర్మించారు. ఎన్.రామచంద్ర, ఎస్జీడీ చంద్రశేఖర్, మునిసుందరం, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, వి.చంద్ర శేఖర శాస్త్రి లాంటి వారు ఈ కవిత్వాన్ని నిర్మించారు. ఈ కవులు చేపట్టిన కవితా నిర్మాణాలు తెలుగు సాహిత్యంలో తమకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఈ కవుల కవితా రూపాలను, వైవిధ్యాలను, విశిష్టతలను నా పరిశోధనలో పరిచయం చేస్తూ విశ్లేషించాలని భావించాను.

### 5.13 క.చ.ట.త.ప (త్రిపదలు):

ఎస్.మునిసుందరం గారు క.చ.ట.త.ప ల పేరుతో 2007లో 'త్రిపదలు' రచించాడు. తన త్రిపదలు గురించి మునిసుందరం గారు ఇలా పేర్కొన్నారు. 'హైకూ' అనలేక 'త్రిపద' అన్నారు. హైకూ తాత్వికథ వేరు. త్రిపదల ఆలోచనా విధానం వేరు. ఇవి నేను జీవించిన, జీవిస్తున్న వ్యవస్థను అక్షరీకరించిన ట్రాన్స్‌పెరెంట్ చీకట్లు అని అన్నారు. ప్రసిద్ధ విమర్శకుడు కడియాల రామమోహన్ రాయ్ గారు 'క.చ.ట.త.ప'లు చిట్టిపొట్టి కవితలు, సిసింద్రీలు, చిటపటలాడి కంటికి, చెవికి ఆహ్లాదం కలిగించి మనస్సును దోచేస్తాయి. కవిగారికి తన పుట్టిన నేల, నింగీ, నీరు, గాలీ, మనుష్యులూ వాళ్ల భాషా అన్నీ అభిమాన పాత్రమైనవే. తన చుట్టూ వున్న మనుషుల్లోని లోపాలను, తిక్కలను ఆక్షేపించ కుండా వదలరు. ఇదంతా వాళ్ళ మీద ఆపేక్షతోనే అని విశ్లేషించారు.

మేడిపల్లి రవికుమార్ గారి మాటల్లో "త్రిపదల పేరుతోనే మునిసుందరం కొత్తదారి తొక్కారు. వస్తుపరంగా వారి దృష్టి తీక్షణతకూ, అభివ్యక్తి పరంగా వారి ప్రయోగవాద శిల్పానికీ ఈ త్రిపదలు మచ్చుతునకలు. కొంచెం జొన్నలు, ఇంకొంచెం మొక్కజొన్నలు, మరికొంచెం అలసందలు కలిపి ఉడక బెట్టి, వాటికి ఉప్పు కారం చేర్చితింటున్నట్లుగా ఉంటాయి ఈ త్రిపదలు. కొంచెం హాస్యం, ఇంకొంచెం అపహాస్యం, మరికొంచెం అధిక్షేపం పద్ధతుల్ని కలిపి వాటికి కాసింత కసినీ, ఇంకొంత ఆవేదననూ జోడించి పేల్చి పేర్చిన కవిత్వపు గుగ్గిళ్ళు ఈ కచటతపలు" అని త్రిపదల స్వరూపాన్ని విడమర్చి చెప్పారు.

"టక్కరి డాలర్

జనం చెమటతో చదువు

అమెరికా కే...టా...టా...బై..."[224]

విదేశీ డాలర్ల మోజులో విదేశాలకు వెళుతున్న భారతీయులను చూసి చిత్రించిన కవిత.

"అందరూ శాఖహారులే

తెలుగు

గంపకింద కోడి...హాచ్"[225]

ఒక చమత్కారం, వ్యంగ్యంతో చిత్రించిన కవిత. తెలుగుదేశంలో అందరూ తెలుగువాళ్ళమే. తెలుగు భాష గొప్పతనాన్ని చాటుకున్న వాళ్ళమే. అయితే గంపకింద కోడిలాగ మన మాతృభాష మాత్రం మన మధ్యలోంచి మాయమవుతోంది. తెలుగువాళ్ళమై మన భాషను మనమే మాయం చేసుకుంటున్నాము అనే కఠిన వాస్తవంలోంచి చెప్పిన కవిత. తెలుగు భాష ప్రాధాన్యం తగ్గిపోతున్న తరుణంలో చిత్రించాడు.

"బుజ్జిముండ

నల్లధనం

ఎంత ముద్దొస్తుందో"[226]

అని స్విస్ బ్యాంకుల్లో దాగిన భారతీయుల అక్రమ సంపాదన ధనాన్ని గూర్చి చెప్పిన కవిత.

"గాంధీ రోడ్డు

ప్రతిమూడో అంగడి

జగమే మాయ"[227]

అని మద్యం షాపులు, మద్యం అమ్మకం, వ్యాపారాన్ని గూర్చి తెల్పిన కవిత.

"భక్తి

ప్రసారం చేసుకోగలిగితే

లాభసాటి ఛానల్"[228]

ఈ సమాజంలో అసంఖ్యాకంగా పుట్టుకొస్తున్న డేరాబాబాలు, నిత్యానందుల స్వాములు లాంటి వారు దేవుడు, భక్తి ముసుగులో నడుస్తున్న చీకటి బాగోతాలు, సంపాదనలను వాటి గూర్చి కవి వాస్తవిక దర్శనం చూపించాడు.

"వేదాలు పురాణాలు శాస్త్రాలు

అవి యిప్పుడూ

ఆషాఢ భూతుల అస్త్రాలే"[229]

అని వాస్తవాన్ని కవి స్పష్టం చేశారు. ఈనాటి వ్యవస్థలోని అనేక దుర్మార్గాలను మన ఇతిహాసాలలో కూడా గుర్తించి నేటి వ్యవస్థకు ఆపాదించారు.

"ఫిరాయింపులు

శల్యుడు చేయలేదా?

అది మన వారసత్వం"[230]

అని రాజకీయ నాయకులు పార్టీలు మారడాన్ని వ్యంగ్యంగా చెప్పారు.

"పొత్తులు

రాముడే చేశాడు ఆనాడు

ఇదేం కొత్తగాదబ్బీ"[231]

తమ సొంత ప్రయోజనాల కోసం, రాజకీయ అవసరాల కోసం పొత్తులు పెంచుకోవడాన్ని దానిని తుంచుకోవడాన్ని కూడా వ్యక్తీకరించారు.

"ఆశ్రమాలు

స్వర్గ ద్వారాలు

తెర వెనుక తధిగిణతోం"[232]

మతం, భక్తి ముసుగులో దొంగ స్వామీజీలు వరాలు పేరుతో నమ్మించి తెరవెనుక లీలల బాగోతాలను వారి బంఢారాన్ని బట్టబయలు చేశాడు.

"చవగ్గా దొరికాడు

పనికి కుర్రాడు

ఏ తల్లి కడుపు మంటో"[233]

ఒక అనాథ బాలుడు బాలకార్మికునిగా మారిన దృశ్యాన్ని చెప్పిన కవిత.

"రాయలసీమ

బండరాళ్ళ మద్దిన

మొలిచిన రాగి మొలక"[234]

రాయలసీమ బతుకును కఠోర పరిస్థితులు ఎదుర్కొంటూ జీవితాలను వెళ్ళదీస్తున్నట్లుగా ధ్వని రమ్యంగా చిత్రించాడు.

“ ‘మో’

ఆయన అర్థం కాదు

చే.రా.చెప్పాల్సిందే”[235]

వేగుంట మోహన్ ప్రసాద్ కవిత్వం, అతని భావజాలం అంత సులభంగా ఎవరికీ అర్థంకాదు. చేరా లాంటి విమర్శకులు విడమర్చి విశ్లేషిస్తే పాఠక లోకానికి తెలుస్తుంది.

## 5.14 ఎస్జీడీలు:

చిత్తూరు జిల్లాకు చెందిన ఆచార్య ఎస్జీడీ చంద్రశేఖర్ ‘ఎస్జీడీ’లు పేరుతో రచించారు. వీటిని కవి ‘త్రీడీలు”గా అభివర్ణించారు. కవిగారి మాటల్లో “వచన కవిత్వంలోని ప్రధానమైన అంశమైన ఈ స్వేచ్ఛను (వస్తుపరంగా, రూపపరంగా, శైలీపరంగా) దృష్టిలో ఉంచుకొని నాకు అప్పుడప్పుడూ కలిగిన వినీలాకాశంలో స్వేచ్ఛగా తేలియాడే మబ్బు ముక్కల్లాంటి భావుక శకలాల్ని మీ ముందుకు ‘ఎస్జీడీలు’గా తీసుకువస్తున్నాను. వీటిల్లో కొన్ని మూడుపాదాల్లోనూ, ఇంకొన్ని నాలుగు పాదాల్లోనూ కొనసాగినవి ఉన్నాయి. ఎస్జీడీల్లో వీటికంటే భిన్నమైనవి కూడా కొన్ని ఉన్నాయి. వీటికి కొంత వరకు హైకూలే ప్రేరణ. ఇవి మినీ కవితల కంటే, హైకూల కంటే భిన్నమైనవి కాబట్టి వీటికి నా పేరు మీద పొడి అక్షరాలతో ఎస్జీడీలు అని పేరు పెట్టడం జరిగింది. మినీ కవిత్వంలోలాగా ఒక మెరుపును ఇవి కలిగి ఉన్నాయి”. అని తన కవితా రూపాన్ని విశదీకరించారు.

“కవిత్వంలో

త్రీడీలు

ఈ ఎస్జీడీలు”[236]

త్రీడి కళ్ళద్దాలు మనిషి పెట్టుకొని కవిత్వాన్ని చూసినట్లుగా కవి తెల్పాడు.

“ఫ్యాక్టరీలు

కాలుష్య నిర్మాణ

సౌదాలు”[237]

అని ఫ్యాక్టరీలు విడుదల చేస్తున్న విపరీతమైన పొగవల్ల చిత్రించిన కవిత.

“రాత్రికి చీకటంటే

ఎక్కళ్ళేని భయం

నక్షత్రాల్నీ చంద్రుణ్ణీ

వెలిగించుకొంటుంది”[238]

గొప్ప భావచిత్రం దాగి వున్న కవిత ఇది.

"కొమ్మ కొమ్మకూ
తిరుగుతోంది కోయిల
రాగం కుదరక"[239]

కూనిరాగాలు తీస్తూ పలు రకాల చెట్లను సంచరిస్తూ వుండే కోయిల దృశ్యాన్ని గూర్చి తెల్పిన కవిత.

"విడివిడి
విస్తరాకులే
విడాకులు"[240]

భార్యాభర్తలు కలహాలు చెంది విడాకులు తీసుకొంటే ఆ ఎడబాటును తెల్పినాడు.

"రోగాల
పుట్ట
వార్ధక్యం"[241]

ముసలితనంలో వచ్చే రోగాల గూర్చి తెల్పాడు.

"రాయలసీమలో
పండేవి
రాళ్ళు"[242]

అని సీమలో సహజంగా ప్రకృతి ప్రసాదించిన రాళ్ళ గూర్చి వ్యక్తీకరించాడు.

"కూతలేస్తేనే
పరిగెత్తేది
ఫైలు"[243]

అని ప్రభుత్వ కార్యాలయాలలో అధికారుల సంతకాల కోసం నిరీక్షిస్తున్న ఫైళ్ళను ఉద్దేశించి చెప్పిన కవిత.

"జనమూ సముద్రమూ
ఉప్పొంగితే
ముప్పు తప్పదు"[245]

జనాభా పెరగడం, సముద్రంలో సునామీ రావడం రెండూ భయంకరమైనవే. భవిష్యత్తులో సమస్యలు తప్పవు.

ఈ త్రీడీలు సమాజంలోని రుగ్మతల్ని, మానవ ప్రవృత్తిల్ని, ఆధునిక సమాజ పరిణామాన్ని

త్రిడీ కళ్ళద్దాలలో మరింత స్పష్టంగా చూపించాడు. వీటిల్లో భావుకత, సంక్షిప్తత, కొసమెరుపు, వ్యంగ్యం ఈ ఎస్జీడీలలో వ్యక్తమైనాయి.

**5.15 బాలీలు:**

పేరూరు బాలసుబ్రహ్మణ్యం 'తొలకరి' పేరుతో బాలీలను రచించారు. నానీల కవితా ప్రక్రియగానే ఈ బాలీలను రచించానని కవి చెప్పుకొన్నాడు. ఇవి నాలుగు పాదాలుగా రూపొందాయి.

"ఓటుకు
తీసుకుంటే వెయ్యి
గెలిచాక
చూపిస్తాడు గొయ్యి"[246]

ఎన్నికలలో ప్రజలు ఓటుకు నోటు తీసుకుంటే ఆ తర్వాత జరిగే పరిణామాన్ని చిత్రించాడు.

"బాల్యానికి
'నెట్' వేశారు
వీడియోగేముల్లోకి
నెట్టేశారు"[247]

అధునాతన ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్స్ అందుబాటులోకి వచ్చి, ఇంటర్నెట్ డాటా ధరలు తక్కువ ధరకే లభిస్తున్నందున పిల్లలు, యువత వీడియో గేములు ఆడుతూ బానిసలైపోయారు. పబ్జీ లాంటి ప్రమాదకర మైన గేములు ఆడి పిల్లలు చనిపోయిన సందర్భాలు మనము చూస్తూనే వున్నాం.

"కక్ష్యలోనే తిరుగుతోంది
భూగోళం
కక్షలతో మానవుడే
గందరగోళం"[248]

మానవ జన్మ పగలు, ప్రతీకారాలు, కక్షలతో నిరంతరం పడి చస్తున్న సందర్భాలను చూసి చెప్పిన కవిత.

"అబ్బాయి ప్లస్సు
అమ్మాయి మైనస్సు
మైనస్సే లేకుంటే
ప్లస్సెక్కడిదో" [249]

ఈ సమాజంలో ఆడపిల్లలను చిన్నచూపుగా చూస్తారు. అబ్బాయిలు ఏదో ఈ సమాజాన్ని ఉద్ధరించేస్తారని తల్లిదండ్రులు భావిస్తారు. కావున స్త్రీ లేకపోతే ఈ సృష్టి లేదు అనే భావాన్ని చక్కగా తెల్పాడు.

"మూడు ఫుల్లులూ
ఆరు హాఫ్‌లు
ఎన్నికలు వస్తే
ఊర్లే బార్లు"[250]

ఎన్నికలలో ఓటర్లు మద్యం పంపిణీని పుచ్చుకొని చిందేసే స్థితిని తెల్పాడు.

"తెలుగోడిగా
పుట్టడం ఒక 'ఎత్తు'
తెలుగు మాట్లడక
పోవడం 'విపత్తు' "[251]

తెలుగువాడు తెలుగు భాషను మాట్లడకపోవడాన్ని ఒక విపత్తుగా, ముప్పుగా కవి భావించాడు.

"తండ్రి బాల్యాన్ని
హాస్టల్లో కుక్కాడు
కొడుకు వృద్ధాప్యాన్ని
అనాథాశ్రమంలో పడేశాడు" [252]

నేటి సమాజంలో జరుగుతున్న నిత్య సత్యాన్ని కవి చిత్రించాడు. తల్లిదండ్రులు తమ పిల్లల అల్లరి, పోరు భరించలేక చదువుల కోసం దూరంగా కార్పోరేట్ హస్టల్స్‌లో బంధిస్తారు. ఆ తర్వాత పిల్లలు పెద్దవారైన తర్వాత కొంతమంది తల్లిదండ్రులను చూడక, వారికి సేవలు చేయక భారంగా భావించి వృద్ధాశ్రమాల్లో పడేస్తారు.

"ఊసరవెల్లి
నోరెళ్ళ బెట్టింది
నాయకులు మార్చే
రంగులు చూసి"[253]

రాజకీయ నాయకుల వేషాలు, ఆలోచనలు, వారి పార్టీల గూర్చి అసహ్యంచుకొంటూ తెల్పిన కవిత.

'నెలబాలునికో
నూలుపోగు

సినీతారకు టూ పీస్

బికిని బాగు బాగు"[254]

నేటి సినిమా ప్రపంచంలో హీరోయిన్ల వేషధారణ మనం చూస్తూనే వున్నాం. పొట్టి పొట్టి దుస్తులు ధరిస్తూ అర్ధ నగ్నంగా బికినీలుగా కనిపిస్తూ ప్రదర్శించడాన్ని కవి ఆక్షేపించాడు.

తొలకరి బాలీలలో ప్రతి బాలీలలోనూ రెండు విషయాలు స్పష్టమవుతాయి. మొదటగా ఒక విషయాన్ని చెబుతున్నప్పుడు దానికి కొనసాగింపుగా ఒక చమత్కారాన్ని జోడించి స్పష్టం చేస్తాడు. కవి ఉపమానాలతో శబ్ద, భావ చిత్రాలతో బాలీలలను రూపొందించాడని చెప్పవచ్చు. ఈ తొలకరి బాలీల మీద మన కనులు వాలినాయో అవి కట్టిపడేస్తాయి.

## 5.16 కోయిలమ్మ పదాలు:

ఎన్.రామచంద్ర గారు 'కోయిలమ్మ పదాలు' రాశారు. 2014లో ముద్రించారు. కవి తన కోయిలమ్మ పదాలపై ఇలా అంటున్నారు. "యెంకి పాటలు, ఏల పదాలు, కూనలమ్మ పదాలు, బంగారి మామ పాటలు, రంగి పదాలు, సిరిసిరి మువ్వ పద్యాలు ఆధునికులు అధిక స్థాయిలో నిర్మించిన నిర్మిస్తున్న శతకానికి లాగే వీటికి ఒక మకుటం లాంటిది కద్దు. ఈ పదాలకు ఛందో నియమాలు వర్తించవు. కాని ఒక ఊపు, తూగు, లయ, అర్థవంతమైన మాటల కూర్పు, కొన్ని చోట్ల దూరాన్వమయం, పొడి మాటలు మూడు పాదాలకు సూటిగా సమన్వయ రాహిత్యం ఉంటాయి. ఒక్కో పదం ఏదో ఒక రీతో, నీతో, ఉత్సాహమో, ఉద్రేకమో, ప్రణయమో, విరహమో, విషాదమో గర్భీకరించుకొని ఉంటుంది. వీటన్నిటినీ కోయిల ద్వారా నేను పలికించినవే. మకుటమున్నా శతకం అని అనను. గణ యతి ప్రాసలు యాదృచ్ఛికంగా పడ్డా ఛందోబద్ధమని బుకాయించను. ఇవి కేవలం కోయిలమ్మ పదాలు" అని కవి సుదీర్ఘ విశ్లేషణ చేశారు.

కోయిలమ్మ పదాలు మూడు పాదాలుగా కొనసాగుతుంది. మూడు పాదాల చివర అంత్య ప్రాస పునరావృతం అవుతుంది. చివర 'ఓ కోయిలమ్మా' అనే మకుటంలాగా వుండి ముగుస్తుంది.

"పాలు ఇచ్చును వెన్న

వెన్న తెచ్చును వన్నె

వన్నె మెచ్చుట మిన్న

ఓ కోయిలమ్మా!" [255]

పాలు, ఆ పాల ద్వారా వచ్చే వెన్న దాని కమ్మదనాన్ని వాసన చూపించాడు. దీనిని పరికించి చూస్తే ఒక శబ్దాలంకారానికి ఉదాహరణగా చెప్పవచ్చు. ముక్తపదగ్రస్తం అలంకారానికి సరిపోతుంది.

"మంటిలోన పంట
పంటలోన వంట
వంటలోన ఉంట
ఓ కోయిలమ్మా"[256]

రైతు మట్టి నుండి పండిన పంటలు, అతను ఇంటిలో వండిన వంటల తీయదనాలను రుచి చూపించాడు.

"కులము రేపును కంపు
కంపు తెచ్చును రంపు
రంపు తుంచుట ఇంపు
ఓ కోయిలమ్మా!"[257]

కులాల ద్వారా పుట్టే గొడవలు గూర్చి చెబుతున్నాడు.

"కొడుకు తల్లికి తోడు
పడతి భర్తకు జోడు
జోడు యానమే కూడు
ఓ కోయిలమ్మా"[258]

కనిపెంచిన తల్లిదండ్రులకు కొడుకు తోడునీడగా, ఆసరాగా వుండాలి. భార్యభర్తకు ఇంపైన జోడుగా వుండాలి. వీరిద్దరి ప్రయాణమే సుఖ సంసారం.

"చినుకు రాలిన పంట
పంట నిండిన యింట
ఇంట సిరియే నంట
ఓ కోయిలమ్మా"[259]

వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండితే రైతుల ఇంట సుఖసంతోషాలు వారి ఇంట్లో సిరులు కురుస్తాయి.

"ఏటిగట్టున మోట
మోట పెంచును తోట
తోట గడుపును పూట
ఓ కోయిలమ్మా"[260]

తాతలతరం నాటి గత కాలపు రోజుల్లో మోటతోలి, నీరు పంటలకు పెట్టి, పంటలు పండే దృశ్యాన్ని చిత్రించాడు.

"ఆడపిల్ల పుటక
కంటనీరు నిడక
సిరుల పంట కనుక
ఓ కోయిలమ్మా"[261]

నేటి సమాజంలో చాలా మంది తల్లిదండ్రులు తమకు ఆడపిల్ల పుట్టగానే బాధపడే దృశ్యాలను మనం చూస్తూనే ఉన్నాం. అలా కాకుండా ఆడపిల్ల సిరులను కురిపించే శ్రీలక్ష్మిగా స్పష్టం చేశాడు.

"ఎడ్లమెడపై కాడి
ఇంటి నిండుగ పాడి
గుడ్లు పెట్టెడి కోడి
ఓ కోయిలమ్మా"[262]

ప్రతి ఇంట పశువులు వుంటే పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండవచ్చు.

"అక్షర మవనికి రక్ష
దరికి రానీకు కక్ష
మనకు శ్రీరామ రక్ష
ఓ కోయిలమ్మా"[263]

అక్షరమనేది నశించలేనిది. అది వెలుగును ప్రసాదిస్తుంది. అది మనలను రక్షించే రక్షణ కవచం.

"కులవృత్తులన్నీ కూలిపోయె
కుంపట్లో నిప్పులు ఆరిపోయె
కడుపులో ఆకళ్ళు రగిలిపోయె
ఓ కోయిలమ్మా!" [264]

చేతివృత్తుల మీదే ఆధారపడి జీవనోపాధి పొందే కులవృత్తులు అంతరించిపోయిన తర్వాత సంపాదన మార్గం లేకపోతే వారి ఇంట్లో పొయ్యి మీద నూకలు ఉడికేది ఎట్లా, వారి ఆకలి తీరేదెట్లా ఆ సందర్భంలోంచి వచ్చిన కవిత.

"అరకలెటు బోయెనో
ఎద్దులేమాయెనో
పల్లె పాడాయెనో
ఓ కోయిలమ్మా"[265]

అరకలకు(నాగలి) మరకలుపడి మూలనపడి, చెదలపట్టి పాడైపోయె. ఎద్దులేమో కబేళా గోదాముల్లోకి తోలేశారు. పల్లెమో పాడె మీదకు చేరే స్థితికి వచ్చింది. రామచంద్రగారి కోయిలమ్మ పదాలు ఎంతో విశిష్టమైనవిగా పేర్కొనవచ్చు.

**5.17. చిలుక పలుకులు:**

ఎన్.రామచంద్ర గారు 'చిలుక పలుకులు' 2015లో రాసి ముద్రించారు. ప్రాచీన జానపద రూపమైన 'కూనలమ్మ పదాలు' కోవలో చిలుక పలుకులు రాశారు. వీటి సంఖ్య 505. కూనలమ్మ పదాల నిర్మాణంలో ఇవి కూడా కొనసాగాయి. ఈ పదాలు మూడు పాదాలుగా మాత్రా గణాలతో నిర్మితమై వుంటాయి. అంత్యప్రాస మాత్రం విధిగా పాటించబడింది. మూడవ పాదం చివర 'చిలుకా' అనే సంబోధనా పదాన్ని కవి చేర్చారు. కవి తన చిలుక పలుకుల గూర్చి "నానీలు, హైకూలు లాంటి చిట్టిపొట్టి కవితల సరసన నిలబడే చిలుక పలుకులు అనే మూడు పాదాల మాత్రా ఛందస్సులో కృతిని నిర్మించడమయింది. ఇవి సూక్తులు కావు-సూచనలు,హేళనలు కాదు- హెచ్చరికలు, పాటలు కాదు-పలుకులు. అంత్య ప్రాసకో, మరో ప్రలోభానికో కక్కుర్తిపడి ఎక్కడా భావానికి విఘాతం కల్గించ లేదు" అని విశదీకరించారు.

"తల్లి పాలిడు మేధ
గురువులిత్తురు బోధ
అదియె యెదుగుకు చేద-చిలుకా"[266]

తల్లిపాలు పసిబిడ్డకు ఎదుగుదలకు మేధస్సు వికాసం చెందడానికి, గురువులు అక్షరజ్ఞానాన్ని ప్రసాదించి హితబోధ చేస్తారు. అమ్మ ఒడి, చదువుల బడి రెండూ ఎదుగుదలకు తోడ్పడే మూలాలు.

"ప్రగతి బాటకు ఓటు
నోటు నీతికి చేటు
తెలివికీయుము చోటు- చిలుకా"[267]

ఎన్నికలలో ఓటర్లు విజ్ఞతను కలిగి వుండి సమాజాభివృద్ధికి పాటుపడే సమర్థనాయకుడికి ఓటు వేయాలి. అలా కాకుండా ఓటుకు నోటు అని భావిస్తే వారి మూర్ఖత్వానికే మచ్చ.

"మాట దాటును కోట
చేత దాటదు పేట
చెత్త చెరుగును చేట-చిలుకా"[268]

మాటలు కోటలు దాటించి చేతుల్లో ఏమి చేయనివాడు గురించి వ్యంగ్యంగా చెప్పిన కవిత.

"కోడి కూతకు వెలుగు

రైతి చేతికి పలుగు

పెను చీకటులు మలుగు –చిలుకా"[269]

తెల్లవారు ఝామున కోడి కూతతోనే మెలకువై తెల్లవారిన తర్వాత రైతు పలుగు పారలతో పొలానికి సిద్ధమైతాడు.

"దంపులు తిని ఏడ్చింది రోలు

తన్నులు తిని కుమిలింది నూలు

బతుకంటే ఇదే కాబోలు– చిలుకా"[270]

మానవ జీవితాన్ని, బతుకు సారాన్ని భావచిత్రాలతో ముడిపెట్టి చెప్పిన కవిత. తిండిగింజలు కోసం రోలులో రోకటిపెట్టి దంచాలి. గొర్రెల నూలు(ఉన్ని) శుభ్రం కావాలంటే దాని కట్టెలతో విదల్చాలి.

"చేయి చల్లగా తడిసింది

కాగితం వేగంగా కదిలింది

ఇంట పొయ్యి మండింది – చిలుకా"[271]

అధికారులకు లంచాలు ఇస్తేనే సంతకాల కోసం ఫైళ్ళు కదులుతాయి. అలాంటి అవినీతి బాగోతాన్ని చిత్రించిన కవిత.

"పైడి లేడి వెంట

వడివడిగ పరుగంట

వాడు దేవుడంట– చిలుకా"[272]

శ్రీరాముడు బంగారు జింకను పట్టుకొనడానికి దాని వెంట వెళ్ళిన సందర్భంలోంచి కవి చిత్రించాడు.

"రా! రమ్మంటుంది మాల్

అది ఎల్పీజి గోల్‌మాల్

లొంగిన వాడు ఢమాల్–చిలుకా"[273]

దేశంలో ఎల్పీజీ వ్యవస్థ ప్రారంభమైన తర్వాత దేశంలో అన్ని రంగాలపై ప్రభావం పడి మార్పులు వచ్చాయి. వ్యాపార రంగంలో పెట్టుబడుల ప్రవాహం పెరిగి రకరకాల షాపింగ్ మాల్స్ పుట్టుకొచ్చి సామాన్య మానవుడు ఏవి కొనలేని విధంగా ధరలు పెరిగాయి.

"కండలా? కాకులకివ్వు

ఎమ్ములా? కుక్కలకివ్వు

కిడ్నిలా? వైద్యులకివ్వు-చిలుకా"[274]

కండలు, ఎముకలు ఉపయోగించవు కాబట్టి కాకులకు ఎముకలకు ఇవ్వమంటున్నారు. కిడ్నీలు లక్షలాది వ్యాపారం కాబట్టి వైద్యులకివ్వు అంటున్నారు. దొంగ వైద్యులు చేసే ఇలాంటి కిడ్నీల వ్యాపారం చూస్తుంటాం. వ్యంగ్యంతో కూడిన కవిత ఇది.

"రూపాయికే బియ్యమిస్తం
అయిదుకే అన్నీ ఇస్తం
మిగిలింది సారాకివ్వు నేస్తం-చిలుకా"[275]

ప్రభుత్వాలు ఉచిత పథకాలు ప్రవేశపెట్టి మళ్ళీ వాటి నుంచి పన్నుల రూపంలోనూ ధరలు పెంచేసి ప్రజల నుంచే వసూలు చేసే దుర్మార్గాన్ని వ్యంగ్యంగా చిత్రించాడు.

"అంతంలేని కోరికలు
కళ్ళెంలేని గుర్రాలు
తీరకపోతే శాపాలు- చిలుకా"[276]

మనిషికి కోరికలు అనంతం. అవి కళ్ళెం లేని గుర్రాలవలె పరుగెడుతుంటాయి. ఆ కోరికలను మనం నిలువరించాలి. లేకపోతే వాటి నుంచి తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని కవి చెబుతున్న దృశ్యం.

"అంతానాకే, దురాశ
ఇంతేనా నాకు, నిరాశ
పంచుకు తిందాం సదాశ-చిలుకా"[277]

'దురాశ దుఃఖానికి చేటు' అనే సామెతను అనుసరించి మనిషికి కొంత ఆశ వుండాలి కాని అంతా నాకే కావాలి అనే దురాశ వుండకూడదు. అలాగే ఏమి దక్కలేదనే నిరాశ చెందకూడదు. కాబట్టి మానవులందరూ ఒక సదాశయాన్ని పంచుకోవాలని ప్రబోధించారు.

"పడ్డావా? లేవగలవు
ఓడావా? గెలవగలవు
చెడ్డావా? నిలవలేవు -చిలుకా"[278]

మనిషికి ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మస్థైర్యాన్ని నింపే బలమైన కవిత.

"అమెరికాలో నొకడు
ఆస్ట్రేలియాకొకడు
ఇంటనే లేడొకడు- చిలుకా"[279]

మనిషిని మానవ సంబంధాల నుండి దూరం చేసి ఒంటరితనం మాత్రమే మిగిల్చి వస్తు సామాగ్రిలో మాత్రమే సుఖముందనే వ్యాపార సూత్రానికీ, డబ్బులో మాత్రమే అభివృద్ధి ఉందనే మూడ విశ్వాసానికీ లోబడేటట్లు చెయ్యడమే ప్రపంచీకరణ వల్ల వచ్చిన ప్రధానమైన అనర్థం. భారతీయులు చదువులు, ఉద్యోగాలు, జీవనం కోసం విదేశాలను వెతుక్కుంటూ వెళ్ళడం వల్ల దాని తర్వాత వచ్చే పరిణామాలు దుఃఖాన్నే మిగుల్చుతాయి. ఇల్లు, కుటుంబం, అనుబంధాలు మొదలైనవన్నీ విధ్వంసం కావడం ధ్వనిమయంగా కవి చిత్రించాడు.

"ఒకనాడు దళితులు
గడీలముందు చెప్పులు
ఈనాడు బెబ్బులులు- చిలుకా"[280]

ఒకనాటి దళితులు, ఈనాటి దళితుల మధ్య తేడాను కవి చెబుతున్నాడు. ఆనాటి కాలంలో సమాజం దళితులను ఎలా దూరంగా ఉంచిందో తెలుపుతుంది.

"ఇంటి మాదిగ గంగడు
ఇప్పుడెవరికీ లొంగడు
మునుపటిలా నేలకు వంగడు- చిలుకా"[281]

ఒకనాటి దళితులు పాలేరు పని చేయాలి, చెప్పిన పని చేయాలి. దొరలకు, భూస్వాములకు వొంగి వొంగి సలాం కొట్టాలి. కూర్చో అంటే కూర్చోవాలి, లేవాలి. దళితులను మనుషులుగానే కాకుండా హీనంగా చూసేవారు. అలాంటి బానిస బతుకులులోంచి నేటి దళితులు విముక్తి చెందారు. తమ అస్తిత్వాలను కాపాడుకొంటూ నిలబడుతున్నారు. అలాంటి దళిత చైతన్యానికి ప్రతీకలుగా కవి చిత్రించాడు.

"గాంధీ ఊరేగిన బండి
చెత్తంతా మోసిన బండి
దానిదెంత యోగమండి-చిలుకా"[282]

'స్వచ్ఛాభారత్' కార్యక్రమంలో భాగంగా గాంధి పోస్టర్‌తో చెత్త బండీలలో చెత్తను సేకరించుటను గూర్చి చిత్రణ.

"విడిపోతే చెడిపోతాం
కలబడితే బలపడలేం
నిలబడితే గెలవగలం- చిలుకా"[283]

ఐక్యమత్యాన్ని బోధిస్తున్న కవిత. 'కలిసి ఉంటే కలదు సుఖం' అని తెలుపుతున్న విశిష్ట కవిత.

రామచంద్ర గారి చిలుకపలుకులు విశిష్టతలను కలిగి వుండి సందేశాన్ని తెలుపుతున్న ప్రభోదాత్మక పలుకులుగా గుర్తింపు పొందాయి. కవి తన పలుకులో “చిలుక పలుకులు కులాసాగా, విలాసంగా అలా–ఇలా చదివితే మెదడుకు ఒదగవు. ఒక్కొక్క పలుకు చదివి లేదా విని కొంచెం హృదయం తెరిచి, కాసేపు ఆగి, పలుకుల మధ్యనున్న సమన్వయాన్ని వాఖ్యానించుకొని, విశ్లేషించుకొని అనుభూతిని పొంది ఆపైన మరో పలుకుకు జరగాలి. పలుకుకు–పలుకుకు మధ్య అనుబంధాన్ని ధారను వెదకకూడదు. దేనికదే స్వయం సంపూర్ణమైన పలుకు” అని విశ్లేషించారు.

## పాద సూచికలు- ఐదవ అధ్యాయం

1. అనంతకవిత, పుట:35
2. అనంతకవిత, పుట:21
3. ఆముదాల మురళి, స్వర్ణతుషారం, పుట:12
4. ఆముదాల మురళి, స్వర్ణతుషారం, పుట:16
5. ఆముదాల మురళి, స్వర్ణతుషారం, పుట:31
6. ఆముదాల మురళి, స్వర్ణతుషారం, పుట:48
7. మన్నవ భాస్కరనాయుడు, స్వేదసూర్యోదయం, పుట:01
8. మన్నవ భాస్కరనాయుడు, స్వేదసూర్యోదయం, పుట:03
9. మన్నవ భాస్కరనాయుడు, స్వేదసూర్యోదయం, పుట:04
10. మన్నవ భాస్కరనాయుడు, స్వేదసూర్యోదయం, పుట:46
11. మన్నవ భాస్కరనాయుడు, స్వేదసూర్యోదయం, పుట:07
12. అంతటి నరసింహం, కంకాళ రాత్రి, పుట:04
13. అంతటి నరసింహం, కంకాళ రాత్రి, పుట:15
14. అంతటి నరసింహం, కంకాళ రాత్రి, పుట:18
15. అంతటి నరసింహం, కంకాళ రాత్రి, పుట:23
16. రామలింగా రెడ్డి. ఒంటెద్దు, ప్రబోధాశ్రయం, పుట:03
17. రామలింగా రెడ్డి. ఒంటెద్దు, ప్రబోధాశ్రయం, పుట:18
18. రామలింగా రెడ్డి. ఒంటెద్దు, ప్రబోధాశ్రయం, పుట:70
19. పాలాది లక్ష్మీకాంత శ్రేష్టి, అక్షర సుమాలు, పుట:15
20. పాలాది లక్ష్మీకాంత శ్రేష్టి, అక్షర సుమాలు, పుట:21
21. గంగప్ప, హృద్యము తెలుగు పద్యము, పుట:05
22. గంగప్ప, హృద్యము తెలుగు పద్యము, పుట:31
23. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాజ్మయ చరిత్ర, పుట:557
24. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాజ్మయ చరిత్ర, పుట:587
25. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాజ్మయ చరిత్ర, పుట:595
26. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాజ్మయ చరిత్ర, పుట:596

27. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:649

28. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:615

29. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:616

30. షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సత్యాగ్ని గీతాలు, పుట:01

31. షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సత్యాగ్ని గీతాలు, పుట:02

32. షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సత్యాగ్ని గీతాలు, పుట:03

33. షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సత్యాగ్ని గీతాలు, పుట:08

34. షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సత్యాగ్ని గీతాలు, పుట:18

35. షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సత్యాగ్ని గీతాలు, పుట:22

36. షేక్ హుస్సేన్ సత్యాగ్ని, సత్యాగ్ని గీతాలు, పుట:31

37. ఎలూరి యంగన్న, తెలుగమ్మ పండుగ, పుట:01

38. ఎలూరి యంగన్న, తెలుగమ్మ పండుగ, పుట:04

39. ఎలూరి యంగన్న, తెలుగమ్మ పండుగ, పుట:11

40. ఎలూరి యంగన్న, తెలుగమ్మ పండుగ, పుట:19

41. బిక్కి కృష్ణ, చరమగీతం, పుట:04

42. బిక్కి కృష్ణ, చరమగీతం, పుట:11

43. బిక్కి కృష్ణ, చరమగీతం, పుట:20

44. బిక్కి కృష్ణ, చరమగీతం, పుట:26

45. బిక్కి కృష్ణ, చరమగీతం, పుట:29

46. గొల్లాపిన్ని సుబ్రహ్మణ్యశర్మ, అక్షరసుమాలు, పుట:89

47. ఈశ్వర రెడ్డి, మనసుపాట, పుట:08

48. ఈశ్వర రెడ్డి, మనసుపాట, పుట:08

49. ఈశ్వర రెడ్డి, మనసుపాట, పుట:22,23

50. లక్ష్మీకాంత శ్రేష్ఠి, అక్షరసుమాలు, పుట:72,73

51. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:87

52. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:33

53. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:36

54. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:11,12

55. ఎలూరి యంగన్న, శాంతి శిఖరం, పుట:01

56. ఎలూరి యంగన్న, శాంతి శిఖరం, పుట:4

57. ఎలూరి యంగన్న, శాంతి శిఖరం, పుట:37

58. ఎలూరి యంగన్న, శాంతి శిఖరం, పుట:56

59. ఎలూరి యంగన్న, శాంతి శిఖరం, పుట:58

60. ఎలూరి యంగన్న, శాంతి శిఖరం, పుట:58

61. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:530

62. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:532

63. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:586

64. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:587

65. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:673

66. రామచంద్ర.ఎన్, సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర, పుట:728

67. చదువుల బాబు.డి.కె, కడపజిల్లా సాహితీ మూర్తులు, పుట:286

68. మాడ్గుల ఆదినారాయణ శాస్త్రి, సద్గురు రాఘవేంద్రశతకం, పుట:88

69. బాలశ్రీ, బాలశ్రీ శతకం, పుట:82

70. వైద్యం వెంకటేశ్వరాచార్యులు, తెలుగు భాష శతకం, పుట:03

71. పుటికంటి కృష్ణా రెడ్డి, ఆటవెలదులతోట, పుట:37

72. పుటికంటి కృష్ణా రెడ్డి, ఆటవెలదులతోట, పుట:50

73. పుటికంటి కృష్ణా రెడ్డి, ఆటవెలదులతోట, పుట:66

74. రామలింగారెడ్డి.ఒంటెద్దు, శిష్యశతకం, పుట:04

75. రామలింగారెడ్డి.ఒంటెద్దు, శిష్యశతకం, పుట:06

76. రామలింగారెడ్డి.ఒంటెద్దు, శిష్యశతకం, పుట:63

77. సవ్వప్పగారి ఈరన్న, సత్యరుక్క, పుట:19

78. సవ్వప్పగారి ఈరన్న, సత్యరుక్క, పుట:24

79. సవ్వప్పగారి ఈరన్న, సత్యరుక్క, పుట:31

80. అనంత కవిత, పుట:20

81. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:200

82. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:55,56

83. యర్రగుడి రామాంజనేయులు రెడ్డి, గుండెగది, పుట:45

84. యర్రగుడి రామాంజనేయులు రెడ్డి, గుండెగది, పుట:55

85. యర్రగుడి రామాంజనేయులు రెడ్డి, గుండెగది, పుట:59

86. యర్రగుడి రామాంజనేయులు రెడ్డి, గుండెగది, పుట:09

87. జెట్టి జైరాం, పుట:30

88. పద్మావతి, పల్లెపాటలు, పుట:29

89. మన్నవ భాస్కర నాయుడు, హృదయోదయం, పుట:81

90. మన్నవ భాస్కర నాయుడు, హృదయోదయం, పుట:100

91. నాగమ్మ పూలే, కులగీత, పుట:01

92. నాగమ్మ పూలే, కులగీత, పుట:11

93. నాగమ్మ పూలే, కులగీత, పుట:ముందుమాట

94. నాగమ్మ పూలే, కులగీత, పుట:14

95. నాగమ్మ పూలే, కులగీత, పుట:61

96. నాగమ్మ పూలే, కులగీత, పుట:57

97. ఇబ్రహీం, రాయలసీమ కవిత్వం-దశదిశ, పుట:122

98. చిక్కనవుతున్న పాట, పుట:14

99. వెంకటకృష్ణ.జి, కొన్నిరంగులు ఒక పద్యం, పుట:98

100. మునిసుందరం, మట్టివాసన, పుట:62

101. రమణ.కె.యస్, జడి, పుట:40,41

102. రమణ.కె.యస్, జడి, పుట:43

103. చంద్రశేఖర్.ఎస్జీడి, హేమంతిక హసంతిక, పుట:103,104

104. తులసీనాథం నాయుడు, తులసీపుష్పాలు, పుట:19

105. తులసీనాథం నాయుడు, తులసీపుష్పాలు, పుట:38

106. రమణ, రమ్య కవితలు, పుట:

107. చంద్రశేఖర్, ఎస్జీడీ, సౌందర్య ఎక్కడ ఉంటుందో అక్కడ నేను, పుట:16

108. చంద్రశేఖర్, ఎస్జీడీ, సౌందర్య ఎక్కడ ఉంటుందో అక్కడ నేను, పుట:17

109. శ్రీరాములు.వై, జలగండం, పుట:02,03

110. శ్రీరాములు.వై, జలగండం, పుట:04

111. శ్రీరాములు.వై, జలగండం, పుట:08

112. శ్రీరాములు.వై, జలగండం, పుట:10

113. శ్రీరాములు.వై, ఆకాశం అంతరించదు, పుట:23

114. శ్రీరాములు.వై, ఆకాశం అంతరించదు, పుట:30,31

115. శ్రీరాములు.వై, ఆకాశం అంతరించదు, పుట:52,53

116. శ్రీరాములు.వై, ఆకాశం అంతరించదు, పుట:53

117. శ్రీరాములు.వై, చేయించిన వెన్నెల, పుట:42,43

118. శ్రీరాములు.వై, చేయించిన వెన్నెల, పుట:57,58

119. శ్రీరాములు.వై, విధ్వంసం నుండి విస్ఫోటనం దాకా, పుట:86

120. శ్రీరాములు.వై, విధ్వంసం నుండి విస్ఫోటనం దాకా, పుట:103

121. వెంకట కృష్ణ.జి, నదీ వరదా మనిషి, పుట:05

122. వెంకట కృష్ణ.జి, నదీ వరదా మనిషి, పుట:10,11

123. వెంకట కృష్ణ.జి, నదీ వరదా మనిషి, పుట:18

124. రాజారాం.టి, అతడే, పుట:45,46

125. రమేష్ నారాయణ, వీవర్స్ & లూమ్స్, పుట:68

126. రమేష్ నారాయణ, వీవర్స్ & లూమ్స్, పుట:74

127. రమేష్ నారాయణ, వీవర్స్ & లూమ్స్, పుట:95,96

128. కెరె జగదీష్, రాత్రి సూర్యుడు, పుట:39

129. కెరె జగదీష్, రాత్రి సూర్యుడు, పుట:48

130. కెరె జగదీష్, రాత్రి సూర్యుడు, పుట:XXXIII

131. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం, పొలి, పుట:01

132. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం, పొలి, పుట:15

133. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాళెం, పొలి, పుట:20,21,22

134. మునిసుందరం.ఎస్, మునిసుందరాలు, పుట:03

135. మునిసుందరం.ఎస్, మునిసుందరాలు, పుట:04

136. మునిసుందరం.ఎస్, మునిసుందరాలు, పుట:16

137. మునిసుందరం.ఎస్, మునిసుందరాలు, పుట:19

138. మునిసుందరం.ఎస్, మునిసుందరాలు, పుట:21

139. మునిసుందరం.ఎస్, మునిసుందరాలు, పుట:04

140. మునిసుందరం.ఎస్, మునిసుందరాలు, పుట:23

141. మునిసుందరం.ఎస్, మునిసుందరాలు, పుట:29

142. చంద్రశేఖర్.ఎస్జీడీ, సూక్ష్మ కవితలు, పుట:01

143. చంద్రశేఖర్.ఎస్జీడీ, సూక్ష్మ కవితలు, పుట:03

144. చంద్రశేఖర్.ఎస్జీడీ, సూక్ష్మ కవితలు, పుట:08

145. చంద్రశేఖర్.ఎస్జీడీ, సూక్ష్మ కవితలు, పుట:18

146. చంద్రశేఖర్.ఎస్జీడీ, సూక్ష్మ కవితలు, పుట:23

147. చంద్రశేఖర్.ఎస్జీడీ, సూక్ష్మ కవితలు, పుట:29

148. చంద్రశేఖర్.ఎస్జీడీ, సూక్ష్మ కవితలు, పుట:33

149. చంద్రశేఖర్.ఎస్జీడీ, సూక్ష్మ కవితలు, పుట:51

150. శైలజామిత్ర, అగ్నిపూలు, పుట:26

151. శైలజామిత్ర, అగ్నిపూలు, పుట:27

152. శైలజామిత్ర, అగ్నిపూలు, పుట:30

153. శైలజామిత్ర, అగ్నిపూలు, పుట:35

154. శైలజామిత్ర, అగ్నిపూలు, పుట:46

155. శైలజామిత్ర, అగ్నిపూలు, పుట:52

156. శైలజామిత్ర, అగ్నిపూలు, పుట:47

157. వెంకటకృష్ణ.జి, కొన్ని రంగులు ఒక పద్యం, పుట:43

158. వెంకటకృష్ణ.జి, కొన్ని రంగులు ఒక పద్యం, పుట:82

159. వెంకటకృష్ణ.జి, కొన్ని రంగులు ఒక పద్యం, పుట:95

160. గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ, కవితా సుమాలు, పుట:98

161. గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ, కవితా సుమాలు, పుట:98

162. యర్రగుడి రామాంజనేయులు రెడ్డి, గుండెగది, పుట:27

163. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:07

164. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:07

165. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:08

166. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:08

167. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:09

168. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:11

169. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:13

170. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:14

171. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:21

172. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:29

173. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:30

174. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:31

175. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:35

176. చంద్రశేఖర్ రెడ్డి.రాచపాళెం, సీమనానీలు, పుట:41

177. రాజేంద్రప్రసాద్.అబ్బిగారి, కడపనానీలు, పుట:03

178. రాజేంద్రప్రసాద్.అబ్బిగారి, కడపనానీలు, పుట:14

179. రాజేంద్రప్రసాద్.అబ్బిగారి, కడపనానీలు, పుట:21

180. రాజేంద్రప్రసాద్.అబ్బిగారి, కడపనానీలు, పుట:31

181. రాజేంద్రప్రసాద్.అబ్బిగారి, కడపనానీలు, పుట:15

182. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:11

183. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:12

184. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:17

185. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:19

186. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:19

187. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:22

188. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:24

189. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:26

190. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:26

191. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:28

192. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:35

193. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:28

194. నాగేంద్ర, నాగేంద్ర నానీలు, పుట:29

195. సాగర్ జయ్యది, పరిమళ వీచికలు, పుట:IV

196. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:311

197. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:311

198. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:311

199. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:311

200. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:311

201. రామచంద్ర.ఎన్, సాహితీ సౌరభం, పుట:196

202. వెంకటకృష్ణ.జి, కొన్నిరంగులు ఒక పద్యం, పుట:113

203. వెంకటకృష్ణ.జి, కొన్నిరంగులు ఒక పద్యం, పుట:65

204. వెంకటకృష్ణ.జి, కొన్నిరంగులు ఒక పద్యం, పుట:65

205. వెంకటకృష్ణ.జి, కొన్నిరంగులు ఒక పద్యం, పుట:136

206. మునిసుందరం, బైక్యూక్యూ, పుట:01

207. మునిసుందరం, బైక్యూక్యూ, పుట:05

208. మునిసుందరం, బైక్యూక్యూ, పుట:06

209. మునిసుందరం, బైక్యూక్యూ, పుట:08

210. మునిసుందరం, బైక్యూక్యూ, పుట:15

211. మునిసుందరం, బైక్యూక్యూ, పుట:25

212. మునిసుందరం, బైక్యూక్యూ, పుట:05

213. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:22

214. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:23

215. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:23

216. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:24

217. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:50

218. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:50

219. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:51

220. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:51

221. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:51

222. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:51

223. షేక్ మహమ్మద్ ముస్తఫా, వెలుగుల రవ్వలు, పుట:51

224. మునిసుందరం, కచటతప, పుట:15

225. మునిసుందరం, కచటతప, పుట:16

226. మునిసుందరం, కచటతప, పుట:17

227. మునిసుందరం, కచటతప, పుట:17

228. మునిసుందరం, కచటతప, పుట:19

229. మునిసుందరం, కచటతప, పుట:29

230. మునిసుందరం, కచటతప, పుట:33

231. మునిసుందరం, కచటతప, పుట:33

232. మునిసుందరం, కచటతప, పుట:36

233. మునిసుందరం, కచటతప, పుట:38

234. మునిసుందరం, కచటతప, పుట:38

235. మునిసుందరం, కచటతప, పుట:45

236. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:01

237. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:02

238. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:11

239. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:16

240. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:17

241. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:18

242. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:22

243. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:25

244. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:

245. చంద్రశేఖర్.ఎస్జీడి, ఎస్జీడీలు, పుట:27

246. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:01

247. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:08

248. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:10

249. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:15

250. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:22

251. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:21

252. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:27

253. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:28

254. బాలసుబ్రహ్మణ్యం. పేరూరు, తొలకరి, పుట:38

255. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:08

256. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:09

257. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:11

258. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:13

259. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:24

260. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:31

261. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:34

262. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:41

263. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:60

264. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:69

265. రామచంద్ర.ఎన్, కోయిలమ్మ పదాలు, పుట:73

266. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:01

267. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:03

268. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:06

269. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:06

270. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:09

271. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:09

272. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:19

273. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:28

274. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:36

275. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:40

276. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:42

277. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:48

278. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:57

279. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:63

280. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:65

281. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:66

282. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:71

283. రామచంద్ర.ఎన్, చిలుక పలుకులు, పుట:73

# ముగింపు

ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రాంతీయ చైతన్య కవిత్వం విస్తృతంగా వెలువడింది. ఇప్పటికీ వెలువడుతూనే ఉంది. నా పరిశోధన "రాయలసీమ ఆధునిక కవిత్వం- ప్రాంతీయ చైతన్యం" (1986- 2015) అనే అంశంలోని కవిత్వాన్ని అధ్యయనం చేసిన తర్వాత కవిత్వాన్ని రచించిన కవులు తమ ప్రత్యక్ష సంఘటనల నుండి తమ జీవితాలలోంచి, తమ అనుభవం నేపథ్యంలోంచి, వాస్తవిక దృశ్యాలలోంచి తీసుకున్న కవితా వస్తువులుగా కన్పిస్తున్నాయి. రాయలసీమ ప్రాంతీయ కవిత్వం సీమను పట్టిపీడిస్తున్న ప్రధాన సమస్యలపై వ్యతిరేకిస్తూ కవిత్వంతో అక్షరయుద్ధం చేస్తూ ఈ ప్రాంతంపై గల వివక్షతను, దోపిడీని, నిర్లక్ష్య స్వభావాన్ని ప్రశ్నిస్తూ రాయలసీమ సమస్యల మీద దిక్కార స్వరంతో ఒక సైద్ధాంతిక భూమికతో ముందుకు వచ్చింది. రాయలసీమ కవులు తమ ప్రాంతీయ స్వరాన్ని వినిపిస్తూ, కవిత్వం ద్వారా చాటుతూ సాహిత్యంలో చైతన్యవంతమైన ఉద్యమరూపం దిశగా ముందుకు పయనిస్తోంది.

రాయలసీమ ప్రాంతీయ స్పృహతో, చైతన్యంతో సీమ కవిత్వం సరికొత్త డిక్షన్‌ను కవిత్వంలో ప్రవేశపెట్టింది.  తమ ప్రాంతానికి పరిమితమైన కొత్తభాష, కొత్త వ్యక్తీకరణ, సరికొత్త వస్తువులు, పదాలు, పదబంధాలను కొంతమంది కవులు ప్రయోగిస్తూ తెలుగు సాహిత్యంలోకి కవిత్వం ద్వారా ప్రవేశ పెట్టారు.

రాయలసీమ కవులు తమ ప్రాంత మూలాల్లోకి వెళ్ళి తమ ఉనికిని గుర్తించడం, తమ సీమనే పట్టి పీడిస్తున్న సమస్యల నేపథ్యంలోంచి మాట్లాడటం, తాము చెప్పగలిగిన అనుభవాలను నిజాయితీగా వ్యక్తీకరించడం, సమాజంలో వివిధ రూపాల్లో తమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడం, ప్రపంచీకరణ ప్రభావం వల్ల ఎదురయ్యే పరిణామాలను ఎదుర్కోవడం, దాని ద్వారా కనుమరుగైపోయే వాటిని కాపాడు కోవడం లాంటి అనేక కోణాల్లో ఆలోచించి కవిత్వాన్ని ఆవిష్కరించారు.

సీమ కవుల్లో కొంతమంది తమ ప్రాంతీయ మాండలిక భాషను, యాసను, పదాలను సృష్టించారు. తమ మూలాలను, జీవిత వాస్తవాలను నిజాయితీగా ఆత్మకథనాత్మక, గానాత్మక పద్ధతిలో ప్రకటించుకున్నారు. తెలుగు సాహిత్యానికి అద్భుతమైన, అపూర్వమైన కవిత్వాన్ని అందించారని తెలిపాను.

రాయలసీమ ఆధునిక కవిత్వం నేడు చైతన్యవంతమైన దిశగా పయనిస్తోంది. సీమ అస్తిత్వంలో కవితా సంపుటాలు, సంకలనాలు, పాటలు, కథలు, నవలలు, నాటకాలు మొదలైన ప్రక్రియలతో తెలుగు సాహిత్యంలో స్థానాన్ని పదిలపర్చుకొంది. గత చరిత్ర కాలం నుంచి అమలు కాని శ్రీభాగ్ ఒప్పందాలు, కమిటీలు, రాయలసీమకు రావలసిన నీటి వాటాలు, ప్రాజెక్టుల నిర్మాణం వాటి పనులు ముందుకు సాగకపోవడం, ప్రభుత్వాల అలసత్వాలు, నాయకుల నిర్లక్ష్యాలు, రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర రాజ్యాధికారం వంటి విషయాలపై తీవ్రమైన చర్చలు, సభలు, సమావేశాలు జరుగుతున్నాయి.  రాయలసీమపై జరుగుతున్న

అన్యాయాలను, వివక్షను, దోపిడీలను నిలువరించి ఎదురించాలంటే రాయలసీమ ప్రజానీకం సంఘటితంగా చైతన్యవంతమై ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగానే సీమ కవులు ఆలోచించి తమ కలాలకు పదును పెట్టారు.

రాయలసీమ కవిత్వం సీమ ప్రజల సమస్యల మూలాల దగ్గర నుండి మొదలై తిరుగు బాటు చైతన్యం వరకు పయనిస్తుంది. వస్తువులో, అభివ్యక్తిలో, శిల్పంలో, భాషలో, యాసలో, మాండలికం లోనూ కవిత్వం కొత్తపుంతలు తొక్కింది. కవితా వస్తువు, అభివ్యక్తులు పాఠకుల్ని కవిత్వంలో సంలీనం చేస్తూ వెంటాడుతూ చైతన్యాన్ని నింపుతాయనే విషయాన్ని ఇందులో నిరూపించే ప్రయత్నం చేశాను.

రాయలసీమ కవులు సీమ సమస్యల పట్ల గతకాలం అనుభవంలోంచి మొదలుపెట్టి వర్తమాన కాల వాస్తవికాంశాల పట్ల మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎదురయ్యే విపత్కర వాణిని పలికిస్తున్నారు. సాహిత్య, సాంస్కృతిక, ప్రాదేశిక పరిస్థితులను, తమ వేష, భాష, యాస, జీవననేపథ్యంలోంచి కవులు మాట్లాడారు. తమ ఆలోచనా కలాలకు పదును పెట్టి ముక్తకంఠాలుగా మారి సీమ స్వరాన్ని వినిపిస్తూ ధ్వజమెత్తారు. వెనుకకు నెట్టి వేయబడుతున్న సీమ వాసుల వారికి ప్రతినిధులుగా చైతన్యవంతంగా ముందుకు సాగారు.

ఈ ఆధునిక సాంకేతిక యుగంలో కూడా రాయలసీమ ప్రాంతం ఇంకా వెనుకబడి వుందని ఈ వెనుకబాటుతనం పోవాలంటే సీమ వాసులు పదునెక్కిన సంఘటిత చైతన్యంతో ముందుకు సాగాలని ప్రకటించారు. సుదీర్ఘకాలంగా రాయలసీమను పట్టి పీడిస్తున్న సమస్యలకు ప్రత్యమ్నాయ మార్గాలు చూపాలని సీమకు రావాల్సిన నిధులు, నీళ్ళులాంటి వాటాల్లోను న్యాయం జరగాలని సీమ ప్రజానీకం అభివృద్ధి పథంలోకి రావాలని పిలుపునిస్తూ పరితపిస్తూ సీమపై శీతకన్ను చూపిస్తున్న ప్రభుత్వాలు, నాయకుల అలసత్వాన్ని, నిర్లక్ష్య ధోరణిని, ఆధిపత్య భావజాలాన్ని ప్రశ్నిస్తూ నిరసిస్తూ వెనుకబడిన ప్రాంతాల్లోంచి ముందడుగు వేసి ఒక స్పష్టమైన భూమికతో ముందుకు సాగి చైతన్యవంతంగా అక్షరబద్ధం చేసినవే ఈ సీమ కలాలు.

గడిచిన దశాబ్దాల కాలంలో అస్తిత్వవాద ఉద్యమాల్లో భాగంగా ప్రాంతీయ చైతన్య కవిత్వం ఒక ఉద్యమ రూపంగా వెలువడి అది తన బలమైన ముద్రను వేసి సుస్థిర స్థానం సంపాదించు కొంది. రాయలసీమ ప్రాంతయ చైతన్య కవిత్వం వచ్చిన నేపథ్యం భిన్నంగా మనకు కనిపిస్తుంది. ఇందులో విభిన్న సామాజిక వర్గాలకు చెందిన సీమ ప్రజల ఆత్మఘోష వినిపిస్తుంది. ఇలాంటి వాటిపైన పరిశోధన చేయడం వలన నా మాతృభూమి విస్తృతి ఎంతో తెలుస్తుంది. నా ప్రాపంచిక దృక్పథం, పరిశీలన పరిజ్ఞానం, అధ్యయన శీలత అలవడుతుందనే సదాలోచనతో ఈ పరిశోధనకు ఉపక్రమించాను.

ఈ రాయలసీమ ఆధునిక కవిత్వంపై మరింత లోతుగా పరిశోధన చేయడానికి అవకాశం ఉంది. రాయలసీమ ఆధునిక కవిత్వం విస్తృతంగా వెలువడింది. కవితా సంకలనాలు, కవితా సంపుటాలు విరివిగా వెలువడ్డాయి. ఈ కవిత్వంపై వస్తు, శిల్ప వివేచన, మాండలిక, భాష పరిశీలన, కరువు, రైతులు, వ్యవసాయ రంగ చిత్రణ లాంటి ప్రధాన అంశాలుగా పరిశోధన చేయవచ్చు. ప్రస్తుత అస్తిత్వవాద ఉద్య మాల్లో ప్రాంతీయ ఉద్యమాల్లోని ప్రాంతీయ సాహిత్య రచనలపై గురించి సామాజిక, చైతన్యాత్మక విషయాల గురించి మరింత విస్తృతమైన లోతైన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉంది. అలా పరిశోధించే వారికి ఈ సిద్ధాంత పరిశోధన గ్రంథం ఏమాత్రం సమాచారాన్ని, విషయ అవగాహనను అందించి చైతన్య పరిచినా ఈ పరిశోధన గ్రంథం యొక్క ఉద్దేశం నెరవేరినట్లే.

**పరిశోధన ఫలితాలు :**

1. రాయలసీమ ఆధునిక కవిత్వం అధ్యయనం, పరిశీలన వల్ల ఎన్నో విశేషాంశాలు బోధపడతాయి.
2. రాయలసీమ కవుల వచన కవిత్వాన్ని చదివితే వారి కవిత్వంలోని వస్తువు, భావం, శైలి మనకు బాగా అవగాహనకు వస్తుంది.
3. రాయలసీమ కవుల కవిత్వంలోని భాషాశైలి సహజ నిర్మాణంగానూ, ఉదాత్తమైనదిగా ఉంటుంది.
4. రాయలసీమ కవుల అనుభవాలు, ఆలోచనలు నేటి విద్యార్థి మరియు పాఠక లోకానికి ఎంతో ఉపయోగకరంగా, ఆదర్శనీయంగా ఉంటాయని విశ్వసిస్తున్నాను.
5. రాయలసీమ ప్రాంతంలో సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు కవిత్వంలో అక్షర రూపాన్నిచ్చారు.
6. రాయలసీమ ఆధునిక వచనకవిత్వంలో అధికభాగం కరువు చిత్రణ కనిపిస్తుంది. ఈ కరువు ప్రభావం వల్ల ప్రభావితమయ్యే వ్యవసాయం, నీటి సమస్య, రైతాంగ సమస్యల చిత్రణ కనిపిస్తుందని తెలుస్తుంది.
7. రాయలసీమ ఆధునిక కవిత్వంలో విస్తృతమైనటువంటి వస్తు వైవిధ్యం కనిపిస్తుంది.
8. రాయలసీమ కవిత్వంలోని ప్రతి కవిత వాస్తవిక సంఘటన ఆధారంగానూ, సీమ ప్రజానీకం ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలలోంచి, క్షోభ మరియు ఆత్మన్యూనతలోంచి, సామాజిక రుగ్మతలోంచి, వివక్ష మరియు నిర్లక్ష్యధోరణి లాంటి అంశాలలోంచి ఆలోచించి, వాటిని ఎత్తిచూపుతూ, వాటిని రూపుమాపడం కోసం రాసినట్లుగా ఉంది.
9. రాయలసీమలోని ప్రతికవి తాము అనుభవించిన, తాము చూసిన, తాము అర్థం చేసుకున్న సమాజాన్ని, తమ ఆలోచనలను అక్షరబద్ధం చేస్తూ కవులు ముందడుగు వేస్తూ, విజయాన్ని సాధించారు.

10. రాయలసీమ కవులు తమ ప్రాంతీయ అస్తిత్వాన్ని కాపాడుకొంటూ, నిలదొక్కుకొంటూ, అస్తిత్వ నేపథ్యంలోంచి ప్రాంతీయ చైతన్యాన్ని కవిత్వంలో బలంగా చాటి చెప్పారని తెలుస్తుంది.

11. రాయలసీమ ప్రాంతంలోని మౌలిక సమస్యలు, సీమ వెనుకబాటు తనానికి ఎవరు కారకులు, వీటికి గల కారణాలన్నింటిని కవులు ఆలోచించి, వాటికి సంబంధించిన చైతన్యంలోంచి, ఒక నిరసన, దిక్కార స్వరాన్ని వినిపించారు.

12. రాయలసీమ మాండలిక భాష, యాసలో కవిత్వాన్ని రాసిన వారు వేంపల్లి అబ్దుల్‌ఖాదర్, ఎస్.మునిసుందరం, మహమూద్, మల్లెల నరసింహ మూర్తి, నందవరం కేశవరెడ్డి, యక్కలూరి శ్రీరాములు, సడ్లపల్లె చిదంబర రెడ్డి, పులికంటి కృష్ణారెడ్డి, శాంతి నారాయణ, గోపిని కరుణాకర్ లాంటి వారు సీమ ప్రజలు మాట్లాడే యాసలో కవిత్వాన్ని రచించారని తెలిసింది.

13. 'రాయలసీమ' అనే పదం దీని స్వతంత్ర గుర్తింపును తెలుపుతూ, రాయలసీమ అనే పేరు సూచించింది చిలుకూరి నారాయణ రావు అని తెలుస్తుంది.

14. రాయలసీమలో ఆధునిక కవిత్వం 1900 సంవత్సరం నుంచి ప్రారంభమైందని, కట్టమంచి రామలింగా రెడ్డి గారు ఈ కవిత్వానికి బీజం వేసి నాంది పలికారని తెలుస్తుంది.

15. రాయలసీమలో 1900 సం॥ తర్వాత ఆధునిక కవిత్వం ప్రారంభమై స్వాతంత్ర్యానంతరం అది విస్తృతమై 1985 తర్వాత చైతన్యంగా పరిణామం చెందుతూ వచ్చి, 2001లో 'సీమకవిత' అనే కవితా సంకలనం రాయలసీమ చైతన్యాన్ని, ప్రాదేశికతను, ఉద్యమ స్వరూప అకాంక్షని కలగలిపి చెప్పిన మొదటి కవితా సంకలనం అని తెలుస్తుంది.

16. రాయలసీమ నాలుగు జిల్లాలలో కవయిత్రులు తక్కువ వుండటం వల్ల, వీరి తరుపున కవిత్వం ఎక్కువగా రాలేదు. వీరు కవిత్వ సృజన చేసినప్పటికి, స్త్రీ నేపథ్యంలోంచి, సామాజిక అంశాలపట్ల కవిత్వం రాశారని చెప్పవచ్చు.

17. బానిసత్వానికి చిహ్నమైన 'దత్తమండలాలు' అనే పేరు నుంచి ఆత్మగౌరవానికి ప్రతీకగా 'రాయలసీమ' అనే పేరును పెట్టుకోవడంతోనే తమ అస్తిత్వాన్ని కాపాడుకొంటూ ప్రాంతీయ చైతన్యం వ్యక్తమైందని గ్రహించవచ్చు.

18. రాయలసీమ ఒక ప్రత్యేక రాష్ట్రంగా ఉండాలనే నినాదం, ఉద్యమం ఆంధ్రరాష్ట్ర ఉద్యమ కాలం నుంచి సీమ నాయకులు బలంగా కోరుకున్నట్లు తెలుస్తున్నది.

19. రాయలసీమ రాష్ట్ర సాధనతోనే సీమకు విమోచన, విముక్తి కలుగుతుందని 1980వ సంవత్సరం నుండి నాయకులు, మేధావులు, పరిశోధకులు, కార్యకర్తలు, కవులు, రచయితలు, పోరాటాలు, ఉద్యమాలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించారని తెలిసింది.

20. రాయలసీమ ఆధునిక కవిత్వంలో ప్రాంతీయ చైతన్య స్పృహ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారి 'పెనుగొండ' గేయం ద్వారా వ్యక్తమైందని, సీమ ప్రాంతీయ స్పృహతో రచించిన తొలి రచన అని తెలుస్తుంది.

21. రాయలసీమ వాస్తవిక జీవిత చిత్రణలోనూ, భాషలోనూ, భావ వ్యక్తీకరణలోనూ, కరువు ప్రభావ చిత్రణలోనూ సీమకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆధునిక తెలుగు కవిత్వంలోనే ప్రాంతీయ జీవితచైతన్యం పెన్నేటి పాటతో ప్రారంభమైందని తెలుస్తుంది.

22. 1900 సంవత్సరం నుండి 1970 వ కాలం వరకు కూడా రాయలసీమ కవులు ప్రాచీన సాహిత్య ధోరణిలో సాంప్రదాయక పద్య కవిత్వాన్నే రాసినట్లుగా తెలుస్తుంది.

23. 1980వ సంవత్సరం నుండి సీమ కవులు వచన కవిత్వాన్ని విస్తృతంగా రాసినట్లు తెలిసింది.

24. రాయలసీమ కవులు పద్యకావ్యాలతో పాటు ఖండకావ్యాలు, గేయకావ్యాలు, శతకాలు, పాటలు, వచన కావ్యాలు, దీర్ఘకావ్యాలు, పద్య ఖండికలు రాశారని తెలిసింది.

25. సీమ కవులు మినీకవితలు, నానీలు, హైకూలు, రుబాయీలు వంటి కవితా ప్రక్రియల్ని కూడా రచించారు.

26. రాయలసీమ కవులు ఆధునిక తెలుగు కవిత్వంలోని నూతన పోకడల్ని అందిపుచ్చుకొని, మినీ కవిత్వ నిర్మాణంలో విభిన్నమైన పంథాను అనుసరిస్తూ, సరికొత్త పేర్లతో మినీ కవిత్వ ప్రక్రియల్ని చేపడుతున్నారు. త్రిపదలు, ఎస్జీడీలు, బాలీలు, కోయిలమ్మ పదాలు, చిలుక పలుకులు లాంటి పేర్లతో మినీ కవిత్వాన్ని రాశారని తెలిసింది.

# అనుబంధాలు

# అనుబంధం - 1

ప్రసిద్ధ కవి, కథా రచయిత అయిన జి. వెంకట కృష్ణ గారితో చేసిన ముఖాముఖి ఇంటర్వ్యూని కింద పొందుపరిచాను.

**1. ప్రాంతీయ అస్తిత్వం అంటే ఏమిటి? ప్రాంతీయ సాహిత్యంలో ఎలా ప్రతిఫలించింది?**

ఒకానొక భౌగోళిక స్వరూపం లేదా సరిహద్దులు కలిగించే స్పృహను ప్రాంతీయ అస్తిత్వం అనవచ్చు. ఒకానొక నిర్దిష్ట ప్రాంతం అయినందువల్ల ఎదురయ్యే వివక్ష, చిన్నచూపు, వచ్చే యిబ్బంది, అబ్బేగుణం, వొనగూరే అనుభవం యిట్లాంటి వన్నీ కల్గించే భావజాలమే ఆ ప్రాంత అస్తిత్వం. నిర్దిష్టంగా ఆ ప్రాంతమైనందు వల్లే కొన్ని కొట్టొచ్చినట్టు వ్యక్తమయ్యే లక్షణాలు, ప్రత్యేకతలు, నిర్దిష్టమైన అనుభవాన్ని యిస్తాయి. ఆ అనుభూతిని సాహిత్యంలో వ్యక్తీకరించడం ఆ ప్రాంతాన్ని వ్యక్తీకరించినట్లైందనుకోండి ఆ సాహిత్యానికి ఆయా లక్షణాలున్న సాహిత్యంగా పేరొస్తుంది. ఒక ప్రాంతపు నైసర్గిక స్వరూపం, ఆ ప్రాంతపు భాష, చరిత్ర, సంస్కృతి, రాజకీయాల మొత్తం సాహిత్యంలో ప్రతిఫలిస్తే అది అస్తిత్వవాద సాహిత్యం. ఉదాహరణకు రాయలసీమ భౌగోళిక పరిస్థితుల రీత్యా కరువు కాటకాలు శతాబ్దాలుగా ఎదురువుతున్నాయి. ఈ భౌతిక స్థితి ఆధారంగా సమాజంలో కక్షలూ కార్పణ్యాలూ పెచ్చరిల్లాయి. దీంతో కరువూ ఫ్యాక్షన్ రాయలసీమ ప్రాంతీయ లక్షణాలుగా కనిపిస్తాయి. ఇదే రాయలసీమ ప్రాంతంలో సాహిత్య సృజన చేసే రచయితల రచనల్లో తప్పకుండా కన్పిస్తుంది.

**2. రాయలసీమలో ఆధునిక కవిత్వం ఎప్పటి నుంచి ప్రారంభమైంది? మీ అవగాహన?**

ఆధునికత రాయలసీమలోకి బ్రిటీష్ పరిపాలన వల్ల వచ్చింది. ఇంగ్లీషు చదువులు అందించిన భావాలు, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, చట్టబద్ధ పాలన, ప్రజాస్వామ్యం ఇవన్నీ ఇంగ్లీష్ చదువులు అందించిన ఆధునిక భావాలు. వీటి ప్రభావం వల్ల రాయలసీమలో సాహిత్యమేమైనా వచ్చింటే అది ఆధునిక సాహిత్యమే.

కట్టమంచి రామలింగా రెడ్డి గారు రాసిన 'ముసలమ్మ మరణం' మొదటి ఆధునిక కాలపు కావ్యమని సి.నారాయణ రెడ్డి గారు తన 'ఆధునికాంధ్ర కవిత్వం సాంప్రదాయములు, ప్రయోగాలు'లో చెప్పాడు. వల్లంపాటి వెంటక సుబ్బయ్య గారు తన 'రాయలసీమలో ఆధునిక సాహిత్యం, సామాజిక సాంస్కృతిక విశ్లేషణ' పుస్తకంలో ఆధునిక కవిత్వం అన్న మాటను ఆధునిక కాలంలో వచ్చిన కవిత్వం అంటే స్థూలంగా ఇరవయ్యవ శతాబ్దం ఉదయించిన తర్వాత వచ్చిన కవిత్వం అన్న అర్థంలో ఉపయోగిస్తున్నాను... కాలం మాత్రమే ప్రధాన దృక్పథం కాదు ప్రక్రియా కాదు అంటూ ఇరవయ్యవ శతాబ్దంలో

వచ్చిన సాహిత్యమంతా ఆధునిక సాహిత్యం కాదు అంటాడు. ఆధునిక రాయలసీమ సాహిత్యంలో ప్రాంతీయ చైతన్యం బహుశా రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ 'పెనుగొండ' అనే పాటలో ప్రారంభమైందంటాడు.

నా వరకూ దృక్పథం రీత్యా రాయలసీమలో ఆధునిక కవిత్వం విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట'తో ప్రారంభమైందనుకుంటాను. అది ప్రక్రియగా గేయ రూపంలో వున్నా అది తర్వాత కాలంలో రాయలసీమ ఆలోచనా పరులలో కలిగించిన స్ఫూర్తిరీత్యా చూస్తే దాని గొప్పతనం తెలుస్తుంది.

**3. రాయలసీమ కవిత్వంలో ప్రాంతీయ చైతన్యం ఉందా?**

ఉంది. అది పెన్నేటి పాటతో మొదలై(1956) డెబ్భైల, ఎనభైల దశాబ్దాలలో కొంత వెనుక బడి తొంభైల నుండి నిరంతరంగా వెలువడుతోంది.

**4. ప్రాంతీయ చైతన్యం అంటే ఏమిటి? మీ మాటలలో చెప్పండి?**

ఒక ప్రాంతపు అణచివేతకు కారణమయ్యే ఆధిపత్య శక్తులను దిక్కరించడమే ప్రాంతీయ చైతన్యం.

**5. ప్రాంతీయ చైతన్యానికి ఏ సిద్ధాంతాలు ప్రాతిపదికగా చెప్పవచ్చు?**

ఏ చైతన్యానికైనా మరీ ముఖ్యంగా ఆధిపత్యాలని ఎదురించే చైతన్యానికి మార్క్సిస్టు అవగాహనే ప్రాతిపదిక. అయితే ప్రాంతీయ అస్తిత్వం లేదా ప్రాంతీయ అస్తిత్వ చైతన్యం అంటూనే పోస్ట్ మోడర్న్ ధోరణిగా అపార్థం చేసుకుంటారు. లేదు అంత దూరం కాకుండా ఎగ్జిస్టెంన్షలిజమ్‌ను (సార్త్ర్, కిర్క్‌గార్డ్, నీషే తదితరులు ప్రతిపాదించిన) చెప్తారు. నా వరకూ భారతదేశంలో వెనుకబడిన ప్రాంతాల ప్రాంతీయ చైతన్యాన్ని పోస్టుమోడర్న్ ధోరణిగా చెప్పి తేలిక చేయలేను. ఆ చైతన్యం అభివృద్ధిని కోరుకునే ఆధునికతను కోరుకునే చైతన్యమే. సాంప్రదాయ మార్క్సిస్టులు ఆచరణలో విఫలమైనందు వల్ల తమ సిద్ధాంతాన్ని కుంచించు కున్నందువల్ల వచ్చిన అపార్థమిది.

**6. ప్రాంతీయ అస్తిత్వానికి, ప్రాంతీయ చైతన్యానికి మధ్య తేడా ఏమైనా ఉందా? మీ అభిప్రాయం?**

ఒక రచయితకు ప్రాంతీయ అస్తిత్వ స్పృహ వుంటే అతడు తన ప్రాంతాన్ని రచనలో పొందు పరుస్తాడు. వాస్తవికంగా ప్రాంత లక్షణాలను సృజనలోకి తెస్తాడు అంతే. అదే ప్రాంతీయ చైతన్యం స్పృహ వున్న రచయిత అయితే తన రచనల్లో తన ప్రాంతం అట్లా వుండడానికి కారణాలు చెప్పి వాటిని తొలగించడానికి ఏమి చేయాలో కూడా సృష్టిస్తాడు. తన పాఠకులలో చైతన్యం రగిలిస్తాడు. దిక్కారాన్ని రచిస్తాడు.

**7. ప్రాంతీయ చైతన్యాన్ని వ్యక్తం చేసే రచనలు లేదా కవిత్వం ఎక్కడి నుండి వచ్చాయి?**

'చైతన్యం' అనేది ప్రాతిపదిక అయితే ఉత్తరాంధ్ర, తెలంగాణ ప్రాంతాల నుంచి అలాంటి

సాహిత్యం వచ్చిందనే చెప్పాలి. అసలు అలా ఒక ప్రాంతంలో రావాలంటే ఆ ప్రాంతంలో ఏదో ఒక రాజకీయ సిద్ధాంతంతో ఉద్యమాలు నడిస్తేనే సాధ్యమైతుంది. అవి ప్రాంతీయ ఉద్యమాలైనా, విముక్తి ఉద్యమాలైనా....

**8. కవిత్వం పట్ల ఆసక్తి ఎలా కలిగింది? నేపథ్యం ఏమిటి?**

నేను కవిత్వం లోకైనా, సాహిత్యంలోకైనా రావడానికి నా హైస్కూల్ జీవితమే కారణం. నేను అనంతపురం జిల్లా మారుమూల కర్ణాటక సరిహద్దులోని బెస్తరపల్లి అనే వూరి హైస్కూలులో సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో వుండి చదువుకున్నా. అక్కడి టీచర్లు పరిచయం చేసిన చందమామలూ, బాలమిత్రలూ, ఇంకా ఎన్నో జానపద కథల చదువరితనంలో నుంచి, తెలుగు సీరియస్ సాహిత్యంలోకొచ్చా. హైస్కూలు రోజుల్లోనే శ్రీశ్రీ కవిత్వం ప్రభావానికి గురయ్యాను. తిలక్, రావిశాస్త్రి, రంగనాయకమ్మలను చదివాను. ఇంటర్ రోజులకే కవిత్వం రాశాను. అదంతా శ్రీశ్రీ మార్కు నినాద ప్రాయమైన కవిత్వం. అయితే సాహిత్య పాఠకుడిగా వుంటూ, తెలుగు ఇంగ్లీషు సాహిత్యాలను చదవడం నన్ను సాహిత్య సృజనలో నిలబడేలా చేసింది. నా మొదటి కవితా సంపుటి నేను నా డైరీల్లో రాసుకున్న. అన్నీ అచ్చుకాని కవితలతో 2000 సం॥లో (లోగొంతుక) తెచ్చాను. ఇక అప్పట్నుంచి రెగ్యులర్‌గా రాస్తున్నాను. ఇంతదాకా ఐదు కవితా సంపుటాలు, మూడు కథా సంపుటాలు వెలువరించాను. రెండు దీర్ఘ కవితలు తెచ్చాను. సాహిత్య వ్యాసాలు రాశాను.

**9. రాయలసీమ వెనుకబాటుతనం, ఈ వెనుకబాటు తనం వల్లే సాహిత్యం బడి పోయిందా? మీ అభిప్రాయం?**

ఆధునిక కాలంలో సాహిత్యం లిఖిత సాహిత్యమే. అచ్చులోకి సాహిత్యం రావడమూ, ప్రజల్లో విద్యావసతులు పెరగడమూ, అభివృద్ధి చెందిన సమాజాల్లో సాధ్యం. కోస్తాంద్రలో బ్రిటీష్ పరిపాలన నీటి పారుదల సౌకర్యాన్ని స్థిరీకరించాక ఆ సమాజం చైతన్యవంతమైంది. చదువరులూ, ఆలోచనాపరులు పెరిగారు. ఆధునిక భావాలు వ్యాప్తి కారణంగా రచయితలు సాహిత్య ప్రక్రియల్లో విశేష కృషి చేశారు. ఆ నేపథ్యంలోనే కందుకూరినైనా, గురజాడనైనా చూడాలి. ఆధునిక తెలుగు కథ కోస్తాంధ్రలో యిప్పటి పరిశోధనల కారణంగా 1870లో కాలానికే వచ్చినట్లు రికార్డు అయింది.

ఈ పురోగతి రాయలసీమలో జరుగలేదు. బ్రిటీష్ పరిపాలన వున్నా నీటివనరుల సౌలభ్యత వొనగూర లేదు. కృష్ణా పెన్నా ప్రాజెక్టు కర్నూలు జిల్లాలో సిద్దేశ్వరం వద్ద నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం అయినా అమలు కాలేదు. అంటే రాయలసీమలో ఆధునిక అభివృద్ధి ఫలాలు పండలేదు. దాంతో సహజంగానే వెనుకబాటుతనం దానివల్ల విద్యావంతులు, ఆలోచనా పరులతో కూడిన పౌర సమాజం ఏర్పడ లేదు. అందులో భాగంగానే రచయితలైనా, సాహిత్యమైనా వెనుక తొక్కు తొక్కిన మాట నిజమే. అయితే అది

కొద్ది కాలమే. 1950ల తర్వాత రాయలసీమలో కూడా ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కృషి జరుగుతోంది. కవిత్వం కొంత తక్కువ ఉధృతిలో వస్తున్నా కథ అద్భుతంగా వచ్చింది.

**10. రాయలసీమలో ప్రాంతీయ ఉద్యమాలు వున్నాయా చెప్పండి?**

నీటిపారుదల సౌకర్యం కల్పించాలని, ప్రాజెక్టులు నిర్మించాలనీ ఏవో చిన్నవో పెద్దవో ఉద్యమాలైతే జరిగాయి. ఇపుడు కూడా ఆంధ్రప్రదేశ్ విభజనానంతరం కూడా జరుగుతున్నాయి. ప్రాంతీయ ఉద్యమాలంటే ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు కోసం వేర్పాటు ఉద్యమాలైతే లేవు. అంత చైతన్యం యిక్కడ ప్రజలకు నేర్పే రాజకీయ నాయకత్వం లేదు.

**11. ప్రాంతీయ ఉద్యమ కవిత్వం రాయలసీమలో వెలువడలేదు అనే విమర్శలున్నాయి. దీనికి గల కారణాలు ఏమి? మీ అభిప్రాయం చెప్పండి?**

ఇంతకు ముందు చెప్పినట్లు ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమ కవిత్వం లేదు. అయితే ప్రాంతీయ అస్తిత్వ స్పృహ, ప్రాంతీయ అస్తిత్వ చైతన్యంగా వ్యక్తమైన కవిత్వం రాయలసీమ నుంచి వచ్చింది. ఆ చైతన్యమే ఇక్కడ కొందరు కవుల చేత ధిక్కార కవిత్వం రాయించింది. ప్రాంతీయ స్వయం స్పృహ కవిత్వం, భావ చైతన్యాన్ని ఆసరా చేసుకొని ఎలుగెత్తిన దిక్కారం కన్పిస్తుంది. సంఘటిత స్పర్శ – రఘుబాబు, జలగండం – యక్కలూరి శ్రీరాములు, పొలి – రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, హంద్రీగానం – జి.వెంకట కృష్ణ, వొరుప్పోటు – యాములపల్లి నర్సిరెడ్డి వీటిలో మీ ప్రశ్నను పూర్వ పక్షం చేసే చైతన్యవంతమైన కవిత్వం ఉంది.

**12. మీరు రాసిన కవిత్వంలో ప్రాంతీయ చైతన్యం ఉందా?**

నా మొదటి కవితా సంపుటి నుంచి నా కవిత్వంలో ప్రాంతీయ అస్తిత్వ స్పృహ వుంది. నా దీర్ఘ కవిత హంద్రీగానం రాయలసీమ దిక్కారాన్ని వినిపించింది.

**13. రాయలసీమ ఆధునిక కవిత్వం ప్రాంతీయ ఉద్యమాన్ని ప్రభావితం చేసిందా?**

అసలు రాయలసీమలో ప్రాంతీయ ఉద్యమం వుందా? రాయలసీమలో కొన్ని మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం అప్పుడప్పుడూ అక్కడక్కడా చిన్నపాటి ప్రయత్నాలు మాత్రమే జరిగాయి కాని పెద్ద స్థాయిలో ఉద్యమాలేవి జరుగలేదు. అయినా సాహిత్య ప్రక్రియల్లో రచయితలు తమ వంతు కృషి ప్రజల్లో చైతన్యం రగిలించడానికైతే చాలు. వాటిని అందుకొని ప్రచారం చేస్తూ ప్రజల్ని కూడగట్టే కార్యకర్త విధులు నిర్వహించే వారే కరువయ్యారు. నిజానికి అంత పెద్ద స్థాయిలో ఉద్యమం లేకున్నా సాహిత్యమైతే రావాల్సినంత వచ్చిందనే చెప్పాలి. తెలంగాణలో లాగా ఉద్యమ నాయకత్వం రూపొందితే యిప్పటికున్న సాహిత్యమే చాలు ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోవడానికి.

# అనుబంధం - 2

ప్రసిద్ధ కవి, సాహిత్య విమర్శకుడు మరియు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత అయిన రాచపాళెం చంద్రశేఖర రెడ్డి గారితో చేసిన ముఖాముఖి ఇంటర్వ్యూని కింద పొందుపరిచాను.

**1. ఆధునిక కవిత్వం అంటే ఏమిటి?**

ఆధునిక కవిత్వం ప్రజా కవిత్వం. పాలక కవిత్వం మీద ప్రజాస్వామిక కవిత్వం. నిరంకుశ కవిత్వం మీద సామాన్య జన కవిత్వం. అసామాన్యుల కవిత్వం మీద పురోగమన వాద కవిత్వం. తిరోగమన వాద కవిత్వం మీద శ్రామికుల కవిత్వం. విశ్రాంతి జీవుల కవిత్వం మీద భౌతికవాద కవిత్వం. భావవాద కవిత్వం మీద మనిషి కవిత్వం.

**2. రాయలసీమలో ఆధునిక కవిత్వం ఎప్పుడు మొదలైంది?**

1899లో మొదలైంది. కట్టమంచి రామలింగా రెడ్డి 1899లో రచించిన 'ముసలమ్మ మరణం' రాయలసీమ కవిత్వంలోనే కాదు మొత్తం తెలుగు కవిత్వంలోనే తొలి ఆధునిక కవిత్వం. సమిష్టి కోసం వ్యష్టి భోగాన్ని వద్దించిన కావ్యం.

**3. ప్రాంతీయత అంటే ఏమిటి? ప్రాంతీయ ఉద్యమాలపై మీ అభిప్రాయం?**

ప్రాంతానికి సంబంధించిన భావం ప్రాంతీయత. నిర్దిష్ట చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక పరిస్థితుల సమాహారం ప్రాంతీయత. ప్రాంతీయ ఉద్యమాలు అనివార్యంగానే పుట్టుకొస్తున్నాయి. అసమ సమాజంలో కొన్ని ప్రాంతాలు అవసరానికి మించి అభివృద్ధి చెంది, ఇంకొన్ని ప్రాంతాలు కనీస అవసరాలు కూడా తీర్చుకొన్న స్థితి నుండి ప్రాంతీయ ఉద్యమాలు పుడుతున్నాయి. సంపన్న ప్రాంతాల ఆధిపత్యాన్ని ధిక్కరిస్తూ ఆత్మగౌరవ స్ఫూర్తితో ప్రాంతీయ ఉద్యమాలు వస్తున్నాయి. వాటిని ఆహ్వానించటం ప్రజాస్వామిక చర్య.

**4. ప్రాంతీయ అస్తిత్వం అంటే ఏమిటి? ప్రాంతీయ స్పృహ, ప్రాంతీయ చైతన్యాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి.**

మనిషి నివసిస్తున్న ప్రాంత స్థితిగతుల వాస్తవికత ప్రాంతీయ అస్తిత్వం. ఒక ప్రాంతం ఉనికే ప్రాంతీయ అస్తిత్వం. మనం నివసించే ప్రాంతం ఎలా ఉంది? ఇది ఇలా ఉండడానికి కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలకు సమాధానాలు అస్తిత్వ స్పృహ. మన ప్రాంతం ఇప్పుడు ఉన్నట్లుగా లేకుండా ఇంకెలా ఉండాలి? మన ప్రాంతాన్ని విముక్తం చేసుకోవడం ఎలా? అని ప్రశ్నలకు సమాధానం ప్రాంతీయ చైతన్యం. ప్రణాళిక, కార్యాచరణ ప్రాంతీయ చైతన్యంలో భాగాలు.

**5. ప్రాంతీయ చైతన్యం అంటే ఏమిటి? దానిని ఎలా గుర్తించాలి? దానిని అస్తిత్వవాదంలో భాగంగా చూడాలా? వద్దా?**

ఒక ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి సంబంధించిన క్రియాశీల చైతన్యము ప్రాంతీయ చైతన్యం. దానిని ప్రాంతీయ వాదుల కార్యచరణతోనే గుర్తించగలం. అస్తిత్వవాదంలో ప్రాంతీయ చైతన్యం ఇతరులు దాన్ని భాగంగా చూడాలి.

**6. రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వంపై మీ అభిప్రాయం ఏమి?**

తెలంగాణతో పోల్చి చూస్తే రాయలసీమ అస్తిత్వం ప్రమాదంలో ఉన్నట్లు లెక్క. తెలంగాణకున్న ప్రత్యేక భౌగోళికత, రాజకీయ, చరిత్ర, సాంస్కృతిక, విభిన్నత రాయలసీమకు లేకపోవడమే ఇందుకు కారణం. ఇప్పుడిప్పుడే రాయలసీమ మేలుకుంటున్నది. 1950లో మొదలైన మెలకువ ఇప్పుడు స్పష్ట రూపం తీసుకుంటున్నది.

**7. రాయలసీమలో ప్రాంతీయ చైతన్యం లేదనే విమర్శ ఉంది. మీ అభిప్రాయం?**

నిజానికి రాయలసీమలో అస్తిత్వ స్పృహ 1928లో దత్తమండలమనే పేరును రాయలసీమగా మార్చుకున్నప్పటి నుండి ఉంది. ఆ స్పృహ చైతన్యంగా మారడానికి దశాబ్దాలుగా పురిటినొప్పులు పడుతున్నది. 1953లో జరిగిన రాయలసీమ చైతన్యాన్ని నీరుగార్చింది. 1985 నుంచి రాయలసీమ చైతన్యం అభివృద్ధి సాధన ఉద్యమ రూపంలో బయల్పడింది. కొంత పురోగతి సాధించింది. తెలంగాణ విడిపోయినాక రాయలసీమ ప్రాంతీయ చైతన్యం అభివృద్ధి ప్రత్యేక రాష్ట్ర సాధనం మధ్య నలుగుతున్నది.

**8. రాయలసీమ సాహిత్యంలో ప్రాంతీయ చైతన్య రచనలు వెలువడినాయా? వివరాలు తెలుపగలరు?**

1928లో చిలుకూరి నారాయణ రావు రాసిన 'దత్త' కవిత భాగంగా రాయలసీమ ప్రాంతీయ చైతన్యానికి మొదటి సంకేతం. 1956లో విద్వాన్ విశ్వం రాసిన పెన్నేటి పాట దానికి రాళ్ళపల్లి రాసిన ముందు మాట రాయలసీమ ప్రాంతీయ చైతన్యానికి స్పష్టమైన నిదర్శనాలు. 'ప్రభుత్వమా ఉంటివా నువ్వు' అంటూ ముగిసే పెన్నేటి పాట గొప్ప ప్రాంతీయ చైతన్య కావ్యం. రాళ్ళపల్లి ముందుమాట రాయలసీమకు శత్రువు ఎవరో స్పష్టంగా చెప్పింది. అప్పట్లోనే బెళ్ళూరి శ్రీనివాస మూర్తి రాసిన 'రాయలసీమ' ఖండిక, 1976 ప్రాంతంలో బైరపురెడ్డి రెడ్డి నారాయణ రెడ్డి రాసిన 'రాయలసీమ రైతు' అనే పద్య కావ్యం ఆ తర్వాత వచ్చిన, వస్తున్న అసంఖ్యాక వచన కవితలు రాయలసీమ ప్రాదేశిక వాస్తవికతను చాటుతున్నాయి. రాయలసీమ కథలలో ప్రాదేశిక అస్తిత్వ కథలు అసంఖ్యాకంగా ఉన్నాయి. కొన్ని నవలలు ఉన్నాయి. మధురాంతకం రాజారాం ఇక్కడ మేమంతా క్షామం, ఎడారి కోయిల, కె.సభా పాతాళగంగ మొదులుకొని వందల కథలు పేర్కొనవచ్చు. నామిని సుబ్రహ్మణ్యం మునికన్నడ సేద్యం సీమ జీవిత ప్రతిఫలనమే.

**9. రాయలసీమలో ప్రాంతీయ ఉద్యమం ఉందా?**

ఉంది. లేకపోలేదు. అది ఒకప్పుడు భగ్గుమంటున్నది. మరొకప్పుడు వెనుకు మినకపో మంటున్నది. ఎప్పుడో ఆ బడబాగ్ని బద్దలౌతుంది.

**10. రాయలసీమ ప్రాంతీయ ఉద్యమంలో రచయితలు, కవుల పాత్ర ఏమి?**

రాయలసీమ ప్రజలను తమ రచనల ద్వారా జాగృతపరచడం, ప్రజా ఉద్యమాలలో ముందు వరుసలో నిలబడడం, రాయలసీమ కవులు నిర్వహించవలసిన పాత్ర.

**11. ప్రాంతీయ చైతన్యం అంటే ప్రత్యేక రాష్ట్రాన్ని కోరుకోవడమేనా?**

పౌరాణిక భాషలో చెప్పాలంటే ప్రత్యేక రాష్ట్రం కోరుకోవడం బ్రహ్మాస్త్రం. చివరి అస్త్రం. తక్కిన అస్త్రాలన్నీ విఫలమైనప్పుడు ప్రత్యేక రాష్ట్ర అస్త్రం ప్రయోగించక తప్పదు.

**12. ప్రాంతీయవాదాలు జాతీయ సమైఖ్యతకు ముప్పని కొందరు భావిస్తారు, దీనిపై మీ అభిప్రాయం.**

ఇప్పుడు మన దేశంలో అనేక రాష్ట్రాలున్నాయి కదా! జాతుల సమైఖ్యత దెబ్బతినిందా? ప్రాంతీయవాదం జాతుల సమైఖ్యతను దెబ్బ తీసే స్థితిని పాలకులు కల్పించరాదు. ప్రాంతీయ వైరుధ్యాలను, అసమానతలను నిర్మూలించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తే ప్రాంతీయవాదాలు పదునెక్కక తప్పదు.

**13. ప్రాంతీయ చైతన్య రచనలు విశ్వజనీన సాహిత్యంలో భాగం అవుతాయా?**

ప్రతి రచనా ఒక ప్రాంతీయ రచనే. జీవితం, దాని ప్రతిఫలనమైన సాహిత్యం స్థలకాలబద్ధమై ఉంటాయి. అనేక ప్రాంతీయతల సమాహారమే విశ్వజనీనత.

**14. రాయలసీమలో ప్రత్యేక రాష్ట్రం కావాలనే డిమాండ్ వినిపిస్తోంది, దీనిపై మీ అభిప్రాయం?**

ఇంతకుముందే అనుకున్నాం ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ చివరి అస్త్రమని. ఇప్పటి దాకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాయలసీమ వాళ్ళే ఎక్కువ పర్యాయాలు ముఖ్యమంత్రులయ్యారు. రాయలసీమను స్వర్గసీమగా జరుగవలసింది ఎక్కువ. ప్రాంతీయ అసమానత సాంఘిక అసమానతలో భాగంగా చూడాలి.

**15. ఇప్పుడు రాయలసీమ కవుల పాత్ర ఎలా ఉండాలి.**

ఏ భావజాలం గల కవులైనా రాయలసీమ కవులు నిరంతరం తాము రాయలసీమ వాసులమని జ్ఞాపకం పెట్టుకొని కవిత్వం రాయాలి. మిగతా అంశాల గురించి కూడా కవిత్వం రాసుకోవచ్చు. ఎవరూ వద్దనరు. రాయలసీమ స్పృహ నిరంతరం రాయలసీమ కవులలో వ్యక్తం కావాలి.

**16. రాయలసీమ కవిత్వానికి తెలంగాణ, కోస్తాంధ్ర కవిత్వాలకు మధ్య ఏమైనా తేడాలను గమనించారా?**

తెలంగాణ కవులు తమ సమస్యలు వాటికి పరిష్కారాలు, తమ శత్రువుల వాళ్ళ నిర్మూలన

గురించి చాలాకాలం క్రితం నుండే రాస్తున్నారు. అంత స్పష్టత రాయలసీమ కవులకు ఇప్పుడు ఏర్పడుతున్నది.

**17. రాయలసీమ అంటేనే కరువు, వెనుకబడిన ప్రాంతంగా గుర్తిస్తారు? ఈ వెనుకబాటు తనం వల్ల సాహిత్యం వెనుకబడి పోయిందా?**

నండూరి రామకృష్ణమాచార్యులు కోస్తాప్రాంత కవి, పండితుడు. ఆయన రాయలసీమలో కరువులు ఎన్ని వచ్చినా, ఎందరు మనుషులు, పశువులు, చచ్చిపోయినా 'రసజ్ఞత మాత్రము చావలేదు, జ్ఞానామృత వృష్టి కొరత నందవేరు' అని అన్నారు.

రాయలసీమలో ఆధునికత అలస్యంగా ప్రవేశించింది. అందువల్ల అధునిక సాహిత్యం కొంత ఆలస్యంగా మొదలైందని అందరూ అభిప్రాయ పడ్డారు. కాని ఇవ్వాల తవ్వా వెంకటయ్య, అప్పిరెడ్డి హరినాథ రెడ్డి, పొదిలి నాగరాజు వంటి యువ పరిశోధకులు రాయలసీమ సాహిత్య చరిత్రను పునర్లిఖించారు. వాళ్ళు అందరూ అనుకున్నంతగా రాయలసీమ సాహిత్యం వెనుకబడలేదని రుజువు చేశారు.

# ఉపయుక్త గ్రంథ సూచి

# <u>ఉపయుక్త గ్రంథ సూచి</u>


1. అబ్దుల్ ఖాదర్. వేంపల్లి, **మేఘం(కవితా సంపుటి)**, హైదరాబాదు: జయంతి పబ్లికేషన్స్. 2008.
2. అబ్దుల్ ఖాదర్. వేంపల్లి, **కిరణం(కవితా సంపుటి)**,హైదరాబాదు: జయంతి పబ్లికేషన్స్. 2014.
3. అబ్దుల్ ఖాదర్. వేంపల్లి, **ఆలోచన(వ్యాసాలు)**,హైదరాబాదు: జయంతి పబ్లికేషన్స్. 2014.
4. అమరనాథ రెడ్డి. తరిమెల, **ఘోష(వ్యాసాలు)**, అనంతపురం: అనంతపూర్ ప్రింటర్స్. 2004.
5. అరుణ్. **సీమ గొంతు వినండి(వ్యాసాలు)**, హైదరాబాద్: చరిత ఇంప్రెషన్స్. 2016.
6. అరుణ్. **ప్రత్యేక రాయలసీమ రాష్ట్రం(ప్రజాస్వామిక దృక్పథం)**, కర్నూలు: రాయలసీమ విద్యావంతుల వేదిక. 2016.
7. **అనంత కవిత(కవితా సంకలనం)**, అనంతపురం:జిల్లా సాంస్కృతిక మండలి. 2012.
8. **అంకురం(కవితాసంపుటి)**, కర్నూలు: సాహితీ స్రవంతి. 1991.
9. **అనంత కవితా స్వరాలు(కవితా సంకలనం)**, అనంతపురం: సాహితీ స్రవంతి. 2015.
10. **ఆరుగాలం కరువు(అనంతపురం జిల్లా వ్యవసాయ సంక్షభం పై నివేది)**, అనంతపురం: మానవహక్కుల వేదిక ప్రచురణ. 2005.
11. ఆనంద్ కుమార్. జెన్నె, **ఘోష(కవితా సంపుటి)**, అనంతపురం: జెన్నె మాణిక్యమ్మ ప్రచురణలు. 2011.
12. ఇబ్రహీం. షేక్(సం), **రాయలసీమ కవిత్వం-దశదిశ(వ్యాస సంకలనం)**, పాలకొల్లు: పి. సి. యస్. ప్రింటర్స్. 2018.
13. ఈశ్వర రెడ్డి.ఎన్, **కన్నీటి సీమ(కవితా సంపుటి)**, హైదరాబాద్: వేణు గ్రాఫిక్స్. 2009.
14. ఈశ్వర రెడ్డి.ఎన్, **మనసు పాట(గేయకవిత)**, కడప: సీమ ప్రచురణలు. 2009.
15. ఈరన్న.సవ్వప్పగారి, **మానసవీణ(కవితాసంపుటి)**,పత్తికొండ: కమలా కళానికేతన్ సాహితీ సంస్థ. 2011.
16. ఈరన్న.సవ్వప్పగారి, **సత్యరుక్కు(శతకము)**, పత్తికొండ: కమలా కళానికేతన్ సాహితీ సంస్థ. 2014.
17. ఈరన్న.సవ్వప్పగారి, **కడలికెరటం(కవితాసంపుటి)**, పత్తికొండ: కమలా కళానికేతన్ సాహితీ సంస్థ. 1987.
18. ఈరన్న.సవ్వప్పగారి, **గుండెచప్పుడు (వచన కవితా సంపుటి)**, పత్తికొండ: కమలా కళానికేతన్ సాహితీ సంస్థ. 2012.
19. ఏలూరు యంగన్న, **తెలుగమ్మపండుగ(లఘుగేయ కృతి-నక్షత్రమాల)**, అనంతపురం: అనంత కళాపీఠం. 2002.
20. ఏలూరు యంగన్న, **శాంతిశిఖరం(ఆధునాతన ఖండకావ్యము)**, అనంతపురం: అనంత కళాపీఠం. 2001.

21. కరుణాకర్.గోపిని, **పొద్దున్నే వచ్చిన వాన(కవిత్వం)**, హైదరాబాద్: పాలపిట్ట బుక్స్. 2011.

22. కల్పనా రెంటాల, **నేను కనిపించే పదం(కవిత్వం)**, విజయవాడ: పల్లవి పబ్లికేషన్స్. 2001.

23. **కర్నూలు కవిత(కవితా సంకలనం)**, కర్నూలు: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం. 2015.

24. **కవితా కౌముది(కవితా సంకలనం)**, కడప: కడపజిల్లా రచయితల సంఘం. 1986.

25. కిట్టన్న.నెమిలేటి, **నిలువుటద్దం(కవితాసంపుటి)**, తిరుపతి: నెమిలేటి పబ్లికేషన్స్. 2014.

26. కిశోర్ కుమార్.కురుమేటి, **నల్లమల నంది వర్దనాలు(కవితాసంపుటి)**, నంద్యాల: రాహుల్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్. 2015.

27. కుమారస్వామి.పిల్లా, **ప్రపంచీకరణపై పోటెత్తిన కవితాసంద్రం**, హైదరాబాద్:సాహితీస్రవంతి. 2004.

28. కృష్ణమూర్తి.శిష్టు, **మహదాశయం(కవిత్వం)**,కర్నూలు: కర్నూలు జిల్లా రచియిత సహకార ప్రచురణ సంఘం. 1994.

29. కృష్ణారెడ్డి.పులికంటి, **ఆటవెలదుల తోట(శతకం)**, తిరుపతి:విశ్వంభర పబ్లికేషన్స్. 2002.

30. కేశవరెడ్డి.నందవరం. **కామాలే(కవిత్వం)**, తాడిపత్రి: విజయ్ ప్రచురణలు. 2009.

31. **కొత్త గొంతుక(కవితా సంకలనం)**, కర్నూలు: ఎమ్మిగనూరు సాహితీ మిత్రులు. 2008.

32. కృష్ణ.బిక్కి, **చరమగీతం(గేయ కవితా సంపుటి)**, ములకలేడు: విశ్వతేజ ప్రచురణలు. 1990.

33. కృష్ణ.బిక్కి, **చినుకు(కవిత్వం)**, అనంతపురం: ఆనంద్ పబ్లికేషన్స్. 2008.

34. కృష్ణ.బిక్కి, **అనంతశోభ(పెన్నాసమీరం వార్త)**, అనంతపురం: అశ్వమేథ ఛారిటబుల్ ట్రస్ట్. 2008.

35. గంగాధరం నూతలపాటి, **చీకటినుంచి(వచన కవిత)**, తిరుపతి: గంగాధర సాహితీ కుటుంబం. 2014.

36. గంగప్ప.ఎస్, **అంతరంగ తరంగాలు(కవితలు)**, గుంటూరు: శశీ ప్రచురణలు. 1996.

37. గంగప్ప.ఎస్, **చైతన్య కిరణాలు(వచన కవితా సంపుటి)**, గుంటూరు: శివాఆఫ్‌సెట్ & స్క్రీన్ ప్రింటర్స్. 2002.

38. గంగప్ప.ఎస్, **హృద్యము తెలుగు పద్యము (పద్యకవితా సంపుటి)**, గుంటూరు: శశీ ప్రచురణలు. 2012.

39. గోపాల కృష్ణ.రాప్తాడు, **ఏదీ యేకవచనం కాదు(కవిత్వం)**, కర్నూలు:విప్లవ రచయితల సంఘం. 2003.

40. చదువుల బాబు.డి.కె, **ఆకాశం అందుతోంది(కవిత్వం)**, ప్రొద్దుటూరు:రవీంద్ర, తిలక్ ప్రచురణలు. 2015.

41. చదువుల బాబు.డి.కె,(సం) **కడప జిల్లా సాహితీ మూర్తులు**, హైదరాబాద్:చిత్రలిపి ప్రింటర్స్. 2007.

42. **చిక్కనవుతున్న పాట(కవితా సంకలనం)**, అనంతపురం: సాహితీ స్రవంతి

43. చిదంబర రెడ్డి.సడ్లపల్లె, **దృశ్యప్రవాహం(కవితా సంపుటి)**, హైదరాబాద్:పాలపిట్ట బుక్స్. 2013.

44. చంద్రశేఖర్.ఎస్జీడీ, **జీవిత రేఖలు(వచన కవితా సంపుటి)**, తిరుపతి: ఎస్జీడీ పబ్లికేషన్స్. 1990.

45. చంద్రశేఖర్.ఎస్జీడీ, **హేమంత హసంతిక(కవితా సంపుటి)**,తిరుపతి: ఎస్జీడీ పబ్లికేషన్స్. 1982.

46. చంద్రశేఖర్.ఎస్జీడీ, **సౌందర్యం ఎక్కడ ఉంటుందో అక్కడ నేను(వచన కవితా సంపుటి)**, తిరుపతి: ఎస్జీడి పబ్లికేషన్స్,2012.

47. చంద్రశేఖర్.ఎస్జీడీ, **ఎస్జీడీలు**, తిరుపతి:ఎస్జీడి పబ్లికేషన్స్. 2007.

48. చంద్రశేఖర్.ఎస్జీడీ, **సూక్ష్మ కవితలు**, తిరుపతి: సి.ఎన్.ప్రింటర్స్. 2015.

49. చంద్రశేఖర్.ఎస్జీడీ, **రణగొణ ధ్వనులు(వచనకవిత)**, తిరుపతి:ఎస్జీడి పబ్లికేషన్స్. 1989.

50. చంద్రశేఖర రెడ్డి.రాచపాళెం, **ఆధునికాంధ్ర కవిత్వం ఉద్యమాలు-సందర్భాలు(వ్యాసాలు)** హైదరాబాద్: అనుపమ ప్రింటర్స్. 2002.

51. చంద్రశేఖర రెడ్డి.రాచపాళెం, **పాలి(దీర్ఘకావ్యం)**, అనంతపురం: లక్ష్మీ గ్రాఫిక్స్. 2007.

52. చంద్రశేఖర రెడ్డి.రాచపాళెం, **స్వర్ణభారతి సాక్షిగా(కవిత్వం)**, అనంతపురం:అనంతపూర్ ప్రింటర్స్. 2001.

53. చంద్రశేఖర రెడ్డి.రాచపాళెం, **రెండు ప్రపంచాలు(కవిత్వం)**,హైదరాబాద్:శ్రీ కళాంజలి గ్రాఫిక్స్. 2012.

54. చంద్రశేఖర రెడ్డి.రాచపాళెం, **సీమనానీలు**, అనంతపురం:శిల్పి ప్రచురణలు. 2006.

55. చంద్రశేఖర రెడ్డి.రాచపాళెం, **ప్రతిఫలనం(ఆధునిక తెలుగుకవిత్వ విమర్శ)**, హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. 2014.

56. చంద్రశేఖర రెడ్డి.రాచపాళెం, **శాంతినారాయణ.(సంపా) వొరుపు(కవితాసంకలనం)** అనంతపురం: జిల్లా రచయితల సంఘం. 2003.

57. చంద్రశేఖర శాస్త్రి.వి. **ఒక కత్తుల వంతెన(కవితాసంపుటి)**, అనంతపురం: వసంత ప్రచురణలు. 2008.

58. జగదీష్.కెరె, **సముద్రమంత గాయం(కవితాసంపుటి)**, రాయదుర్గం:కెరె & కెరె కంప్యూటర్స్ ప్రచురణ. 2001.

59. జగదీష్.కెరె, **రాత్రి సూర్యుడు(దీర్ఘకావ్యం)**, హైదరాబాద్: పాలపిట్ట బుక్స్ ప్రచురణ. 2015.

60. జైరామ్.జెట్టీ, **ఎర్రగాలి(విప్లవ కవితలు)**, అనంతపురం: శారదా ప్రింటింగ్ ప్రెస్. 1981.

61. జైరామ్.జెట్టీ, **జననేత్రం(కవిత్వం)**, అనంతపురం: కవితా భారతి ప్రచురణలు. 2006.

62. జోగినాయుడు.సి. **ఆంధ్రప్రదేశ్ సామాజిక సాంస్కృతిక చరిత్ర**, హైదరాబాద్:నిపుణ పబ్లికేషన్స్. 2016.

63. తులసీనాథం నాయుడు.పి, **తులసీ పుష్పాలు(కవితాసంపుటి)** చిత్తూరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ప్రచురణ. 2015.

64. తులసీనాథంనాయుడు.పి, **తులసాకులు(కవితాసంపుటి)**, శ్రీకాళహస్తి: బాబీ & బన్నీ ప్రింటర్స్. 2012.

65. **తెలుగులో కవిత్వోద్యమాలు(వ్యాసాలు)**, హైదరాబాదు:తెలుగు అకాడమి ప్రచురణ. 2012.

66. నరసింహా రెడ్డి.పి, **అనుభూతుల పొదరిండ్లు(కవితాసంపుటి)** తిరుపతి: శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్. 1995.

67. నరసింహారెడ్డి.పి, **భావవిహంగాలు(కవితల సంపుటి)**, తిరుపతి శ్రీనివాసమురళీ పబ్లికేషన్స్. 1984.

68. నరసింహం.అంతటి, **ఇరవై ఒకటో శతాబ్దంలోకి(కథన(వచన) కవితలు)** హైదరాబాద్: వర్మగ్రాఫిక్స్. 2000.

69. నరసింహం.అంతటి, (కం) **కాళరాత్రి(పద్య కవిత్వం)**, హైదరాబాద్: సమతా సాహితి పబ్లిషర్స్. 1980.

70. నరసింహ మూర్తి. మల్లెల, **జలస్వప్నం(కవితాసంపుటి)**, అనంతపురం:స్ఫూర్తి పబ్లికేషన్స్. 2004.

71. నబిరసూల్.కంబదూరి షేక్, **కమ్మని కంఠం నాకు లేదు(కవితా సంపుటి)**
హైదరాబాద్: కౌండిన్య ప్రచురణలు. 2012.

72. నాగరాజు.కీర్తి, **గుండెసెగలు(వచనకవితా సంపుటి)**, అనంతపురం:రాయలకళాగోష్ఠి ప్రచురణ. 1984.

73. నాగరాజు.కీర్తి, **గుండెసెగలు(రెండవభాగం-వచనకవితా సంపుటి)**,
అనంతపురం:రాయలకళాగోష్ఠి ప్రచురణ. 1985.

74. నాగేశ్వర రావు. ఎ.యన్, **సముద్రం నా స్వప్నం(వచన కవితలు)**, తిరుపతి:కదలిక ప్రచురణలు. 1985.

75. నాగపద్మిని.పుట్టపర్తి, **హద్దులు(కవితాసంపుటి)**, హైదరాబాద్: ఆకృతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్. 2003.

76. నారాయణాచార్యులు.పుట్టపర్తి, **పద్యకావ్య సర్వస్వం**, హైదరాబాద్: భాషా సాంస్కృతిక శాఖ
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం. 2014.

77. నాగారాజాచారి, పెనకచర్ల, **స్వప్నధార(కవితాసంపుటి)**, కడప: వాసవీ గ్రాఫిక్స్. 2004.

78. నారాయణ రెడ్డి.సుంకి రెడ్డి, **గనుమ(అస్తిత్వ వ్యాసాలు)**,
హైదరాబాద్: తెలంగాణ సాహితీ పబ్లికేషన్స్. 2010.

79. నారాయణ స్వామి.బండి, **రాయలసీమ సమాజం- సాహిత్యం(వ్యాసాలు)**,
హైదరాబాద్: పర్‌స్పెక్టివ్స్ పబ్లిషర్స్. 2019.

80. నాగమ్మఫూలే. **కులగీత(వచనకావ్యం)**, కర్నూలు:
మహాత్మాజ్యోతిరావు ఫూలే మెమోరియల్ ట్రస్ట్ ప్రచురణ. 2005.

81. నిత్యానందరావు.వెల్దండ, **విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన**, హైదరాబాదు: ఓంసాయిగ్రాఫిక్స్. 2013

82. **నేటి రాయలసీమ(చారిత్రక పరిశీలన)**, కర్నూలు: విప్లవ రచయితల సంఘం ప్రచురణ. 2014.

83. పద్మావతి. హెచ్.జి, **పల్లెపాటలు**, పత్తికొండ: కమలా కళానికేతన్ సాహితీ సంస్థ. 2013.

84. పద్మావతమ్మ.పసుపులేటి. **మౌనఘోష(కవితాసంపుటి)** ప్రొద్దుటూరు: రాదా మహిళా మండలి ప్రచురణ. 1988.

85. పద్మావతి.వెలిచెట్టి, **కావ్యపుష్పాలు(కవితలు)**, కర్నూలు:త్రినాథ్ ఆర్ట్ ప్రింటర్స్. 1989.

86. పాణి, **అబూజ్‌మాడ్(కవిత్వం)**, కర్నూలు: విరసం ప్రచురణ. 2013.

87. ప్రేంచంద్.జూపల్లి, **అవేద(మహాజన కవిత్వం)**, అనంతపురం: వాయిస్ దళిత అధ్యయన వేదిక ప్రచురణ. 1999.

88. ప్రేంచంద్.జూపల్లి, **నిచ్చెనమెట్ల లోలకం(కవిత్వం)**,హైదరాబాద్: పాలపిట్ట బుక్స్ ప్రచురణ. 2011.

89. ప్రకాశరావు.ఆశావాది, **అంతరంగ తరంగాలు(వచన కవితా సంపుటి)**, ప్రొద్దుటూరు: నవ్య సాహిత్య సమితి. 1988.

90. ప్రకాశరావు.ఆశావాది (సంపా), **ఆర్కెస్ట్రా(వచన కవితా సంకలనం)**, అనంతపురం: రాయల కళాగోష్ఠి ప్రచురణ. 1979.

91. బాలసుబ్రహ్మణ్యం పిళ్ళె.కరణం, **చరిత్రకెక్కని మారణహోమం(పద్యకావ్యం)** మదనపల్లె: యస్.ఆర్ గ్రాఫిక్స్ ప్రచురణ. 2000.

92. భాస్కర్ నాయుడు.మన్నవ, **స్వేదసూర్యోదయం(పద్యకావ్యం)** తిరుపతి: సుమాంజలి ప్రచురణలు. 2000.

93. బాలాజి.పలమనేరు, **మాటల్లేని వేళ(కవితలు)**, పలమనేరు: పవిత్ర & ప్రణీత ప్రచురణలు. 2007.

94. బాలాజి.పలమనేరు, **ఇద్దరిమధ్య(కవిత్వం)**, పలమనేరు: పవిత్ర & ప్రణీత ప్రచురణలు. 2012.

95. బాలసుందరం.మాదవరం, **నా రాయలసీమ రాష్ట్రం**, కర్నూలు:స్ఫూర్తి ప్రచురణలు. 2014.

96. బాబ్జీ.కె, **యుద్ధం అనివార్యమైన చోట(కవిత్వం)**, చిత్తూరు: విప్లవ రచయితల సంఘం ప్రచురణ. 2010.

97. బాలసుబ్రహ్మణ్యం.పేరూరు, **తొలకరి(బాలీలు)**, తిరుపతి:చరిత పబ్లికేషన్స్. 2010.

98. బుద్ధన్న.ఎం, **జ్వాలాహసంతి(పద్య సంపుటి)**, అనంతపురం: రమేష్ ప్రింటింగ్ ప్రెస్. 1987.

99. భూమన్.**రాయలసీమ రాష్ట్రం ఒక డిమాండ్**, ప్రొద్దుటూరు: పెన్నేరు సామాజిక రాజకీయ పక్ష పత్రిక ప్రచురణ. 2016.

100. మధుసూధన రావు. త్రిపురనేని, **సాహిత్యంలో వస్తు శిల్పాలు,(విమర్శ వ్యాసాలు)** హైదరాబాదు:పర్‌స్పెక్టివ్స్ ప్రచురణ. 1997.

101. మల్లారెడ్డి.వై.వి, **అనంత ప్రస్థానం,** అనంతపురం:కదలిక ప్రచురణలు. 2007.

102. మద్దిలేటి.ఎన్.కె. **మధువసంతాలు(రచనల సంకలనం),** కర్నూలు:విశ్వవాణి పబ్లిషర్స్. 2010.

103. మద్దిలేటి.ఎన్.కె. **మిలీనియంలో నేనంటాను(వచన కవితా సంపుటి)**, కర్నూలు: విశ్వవాణి పబ్లిషర్స్. 2008.

104. మధురశ్రీ, **మథనం(కవిత్వం)**, అనంతపురం: ఉమ్మడిశెట్టి సాహితీ ప్రచురణ. 2010.

105. మాచిరెడ్డి.తక్కోలు, **అసలువిషయం వ్యవస్థను మార్చడం(కవితా సంపుటి)**, కడప: అభ్యుదయ రచయితల సంఘం ప్రచురణ. 2008.

106. **మానవ హక్కులు-2015**,(బులెటిన్-14 ఆరవ మహాసభల సంచిక)

అనంతపురం: మానవహక్కుల వేదిక ప్రచురణ. 2015.

107. మహమ్మద్ ముస్తఫా. షేక్, **వెలుగుల రవ్వలు(కవితాసంపుటి)**, ప్రొద్దుటూరు: నవ్యసాహితీ సమితి. 2001.

108. మునిసుందరం.ఎస్, **ఈ గుండె అలసిపోదు(వచనకవితలు)** తిరుపతి: కీర్తి ప్రింటర్స్. 1994.

109. మునిసుందరం.ఎస్, **చీకటిదీపాలు(కవితలు)**,తిరుపతి: శ్రావణి ప్రచురణలు. 1999.

110. మునిసుందరం.ఎస్, **మునిసుందరాలు(చిరుకవితలు)**, తిరుపతి: కీర్తి ప్రింటర్స్. 1992.

111. మునిసుందరం.ఎస్, **మసక(కవిత్వం)**,తిరుపతి: శ్రావణి ప్రచురణలు. 2003.

112. మునిసుందరం.ఎస్, **మట్టివాసన(కవిత్వం)**, తిరుపతి: శ్రావణి ప్రచురణలు. 2006.

113. మునిసుందరం.ఎస్, **క.చ.ట.త.ప(త్రిపదలు)**, తిరుపతి: శ్రావణి ప్రచురణలు. 2007.

114. మునిసుందరం.ఎస్, **బైక్యూక్యూ(హైకూలు)**, తిరుపతి: శ్రావణి ప్రచురణలు. 1999.

115. మురళి.ఆముదాల, **స్వర్ణతుషారం(పద్యఖండికలు)**, తిరుపతి: సి.ఎన్.ప్రింటర్స్ ప్రచురణ. 2011.

116. మైనాస్వామి.**ఎన్నాళ్ళీ కన్నీళ్ళు?(పరిశోధనాత్మక రచన)**, తిరుపతి: శ్రీచరణ్ & శ్రీ కరణ్ పబ్లికేషన్స్. 2001.

117. మోహన్.పి, **కిటికీ పిట్ట(కవిత్వం)**, హైదరాబాద్: చరిత ఇంప్రెషన్స్. 2006.

118. మోహన్.కెంగార, **విన్యాసం(కవిత్వం)**, కర్నూలు: సాహితీ స్రవంతి ప్రచురణలు. 2012.

119. రమణ.కె.యస్, **రమ్యకవితలు(వచన కవిత)**, కర్నూలు: శ్రీ కృష్ణా పబ్లికేషన్స్. 2014.

120. రమేష్ నారాయణ.పి, **వీవర్స్ & లూమ్స్,** అనంతపురము:ఉమ్మడి శెట్టి, సాహితీ ప్రచురణలు. 2014.

121. రమేష్ నారాయణ.పి, **నాగేంద్రనానీలు**. అనంతపురం: రాధా ప్రింటర్స్. 2015.

122. రమేష్ నారాయణ.పి, **అనంత సాహిత్యం- ఆధునిక దృక్పథం,** అనంతపురము:రాధాప్రింటర్స్. 2015.

123. రమణ.కె.యస్. **జడి(కవిత్వం)**, హైదరాబాద్: మంజుల పబ్లికేషన్స్. 2011.

124. రఘుబాబు, **సంఘటిత స్పర్శ(కవిత్వం)**, అనంతపురం: లిటరరీమీట్ ప్రచురణ. 2000.

125. రమణజీవి. **నలుగురు పాండవులు(కవితలు)**, హైదరాబాద్: కూచి పబ్లికేషన్స్. 2001.

126. రంగానాథాచార్యులు.కె.కె(సంపా), **ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్నధోరణులు(వ్యాసాలు)**

హైదరాబాద్: ఆంధ్రసారస్వత పరిషత్తు ప్రచురణ. 2005.

127. రాజేంద్రప్రసాద్.అబ్బిగారి, **కడపనానీలు**, నందలూరు: నందలూరు కథానిలయం ప్రచురణ. 2008.

128. రామచంద్ర.ఎన్, **రక్తం చెమర్చిన కళ్ళు(కవిత్వం),** ప్రొద్దుటూరు: గంగాదేవి ప్రచురణ. 1994.

129. రామచంద్ర.ఎన్(సంపా), **సాహితీ సౌరభం(సీమ ఆధునిక కవితా సంకలనం)**

ప్రొద్దుటరు:సాహితీ మిత్ర మండలి. 2004.

130. రామచంద్ర.ఎన్(సంపా), **సీమ సంప్రదాయ కవుల వాఙ్మయ చరిత్ర,**
ప్రొద్దుటరు:సాహితీ మిత్ర మండలి.2007.
131. రామచంద్ర.ఎన్, **కోయిలమ్మ పదాలు**, ప్రొద్దుటూరు: పద్మాలయ ప్రచురణ.2014.
132. రామచంద్ర.ఎన్, **చిలుక పలుకులు**, ప్రొద్దుటూరు: పద్మాలయ ప్రచురణ.2015.
133. రాధేయ **ఈ కన్నీటికి తడిలేదు(వచన కవిత్వం)**, ప్రొద్దుటూరు: చైతన్య సాహిత్య కళావేదిక.1991.
134. రాధేయ, **అవిశ్రాంతం(కవిత్వం)**, అనంతపురం: స్పందన అనంతకవుల వేదిక ప్రచురణ.2009.
135. రాజారాం.టి, **అతడే(దీర్ఘకావ్యం)**, హైదరాబాదు: ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్. 2006.
136. రామలింగారెడ్డి.ఒంటెద్దు, **శిష్యశతకం**, పెనుకొండ: రాయలకళాగోష్ఠి ప్రచురణ. 2013.
137. రామలింగారెడ్డి.ఒంటెద్దు, **ప్రభోదాశ్రమం(పద్యఖండికలు)**, అనంతపురం:పవన్ ట్యూటోరియల్స్
ప్రచురణ.2014.
138. రామమోహన రావు. అద్దేపల్లి, **ఆధునిక కవిత్వంలో సామాజికత,**
హైదరాబాదు: తెలుగు అకాడమి ప్రచురణ. 2012.
139. రామాంజనేయులు రెడ్డి.యర్రగుడి, **గుండెగది( కవనకదంబం),**
పెద్ద జూటూరు: యర్రగుడి అక్షర ప్రసార నిలయం.1991.
140. రాధిక పాలవాయి.కె. **ఈ చీకట్లను తొలగించలేమా(కవితలు)**
రాయదుర్గం: శ్రీసత్యం కంప్యూటర్స్ ప్రచురణ.2012.
141. రాధిక పాలవాయి.కె. **ధరిత్రి కన్నీరు(కవితాసంపుటి),** రాయదుర్గం: శ్రీ సత్యం కంప్యూటర్స్. 2010.
142. రాజు.కె.ఎన్.ఎస్, **కర్నూలు జిల్లా రచయితల చరిత్ర,**
కర్నూలు: కర్నూలు జిల్లా రచయితల సహకార సంఘం ప్రచురణ.1994.
143. రాసాని. **లోచూపు(వ్యాసాలు)**, హైదరాబాద్: విశాలాంధ్ర విజ్ఞాన సమితి ముద్రణాలయం.2014.
144. రమణా రెడ్డి.యం.వి, **రాయలసీమ కన్నీటి గాథ**, హైదరాబాద్: ధరణి ప్రింటర్స్. 2001.
145. రంగారెడ్డి.ఎ. **ఓ రాయలసీమ నీకు రాష్ట్ర కళ ఎప్పుడొస్తుందమ్మా,**
ప్రొద్దుటూరు: పెన్నేరు ప్రింటింగ్ వర్క్స్ ప్రచురణం.2019.
146. లక్ష్మీకాంత శ్రేష్ఠి.పి, **అక్షర సుమాలు(పద్యఖండికలు)** కడప:వైశ్యప్రబోధిని పబ్లికేషన్స్. 2001.
147. లింగన్న.కాణిపాకం, **వెలుగు(వచన కవితాసంకలనం)**, చిత్తూరు: శ్రీబాలాజి ప్రెస్ ప్రచురణ.1990.
148. విద్వాన్ విశ్వం, **పెన్నేటిపాట(కావ్యం),** అనంతపురం:జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ప్రచురణ.2015.
149. విజయలక్ష్మి.ఎన్, **కవితాంజలి(కవితలసంపుటి)**, విజయవాడ: అరుణోదయ ప్రింటింగ్ ప్రెస్.1990.

150. **విమర్శ కళాతత్వ శాస్త్రాలు,** హైదరాబాదు: తెలుగు అకాడమి ప్రచురణ. 2012.

151. వెంకటసుబ్బయ్య.వల్లంపాటి, **రాయలసీమలో ఆధునిక సాహిత్యం సామాజిక సాంస్కృతిక విశ్లేషణ** హైదారాబాదు: చరిత ఇంప్రెషన్స్. 2006.

152. వెంకటకృష్ణ.జి, **లోగొంతుక(కవిత్వం)**, కర్నూలు: క్రెస్ట్‌పబ్లికేషన్స్. 2000.

153. వెంకటకృష్ణ.జి, **దున్నేకొద్దీదుఃఖం(కవిత్వం)**, కర్నూలు: స్ఫూర్తి ప్రచురణలు. 2005.

154. వెంకటకృష్ణ.జి, **హంద్రీగానం(కావ్యం)**, కర్నూలు: స్ఫూర్తి ప్రచురణలు. 2015.

155. వెంకటకృష్ణ.జి, **కొన్ని రంగులు ఒక పద్యం(కవిత్వం)**, కర్నూలు: స్ఫూర్తి ప్రచురణలు. 2010.

156. వెంకటకృష్ణ.జి, **నదీ వరదా మనిషి(దీర్ఘ కవిత)**, కర్నూలు: స్ఫూర్తి ప్రచురణలు. 2009.

157. వెంకటకృష్ణ.జి, **చినుకుదీవి(కవిత్వం)**, కర్నూలు: స్ఫూర్తి ప్రచురణలు. 2016.

158. వెంకటరమణ.ఎల్.ఆర్, **కవిత్వోదయం(వచనకవిత్వం)**, విజయవాడ:మల్లెతీగ ప్రచురణ. 2015.

159. వెంకటేష్.టి. **ఒక తడి అనేక సందర్భాలు(కవిత్వం),** కర్నూలు: వైండింగ్ ప్రచురణలు. 2004.

160. వేణుగోపాల్.కాశీభట్ల, **అనాదీ-అనంతం(దీర్ఘకవిత),** హైదరాబాద్: వాహిని బుక్ ట్రస్ట్ ప్రచురణ. 2001.

161. వేణుగోపాల్.కాశీభట్ల, **ఒక బహుముఖం(కవిత్వం),** హైదరాబాద్: వాహిని బుక్ ట్రస్ట్ ప్రచురణ. 2002.

162. **శతాబ్ది కవిత(మోనోగ్రాఫ్)**, హైదరాబాదు: తెలుగు అకాడమీ ప్రచురణ. 2009.

163. శశిశ్రీ, **రాయలసీమ సాహిత్యం**, హైదరాబాదు: తెలుగు అకాడమీ ప్రచురణ. 2012.

164. శశిశ్రీ, **జేబులో సూర్యుడు(వచన కావ్యం)**, కడప: నేత్రం ప్రచురణలు. 2006.

165. శశిశ్రీ, **శబ్దానికి స్వాగతం(కవితాసంకలనం)**, కడప: శ్రీరామా ప్రింటర్స్ ప్రచురణ. 1991.

166. శశిశ్రీ, **పల్లవి(కవితాసంపుటి)**, కడప: శ్రీ పార్వతి ప్రింటర్స్ ప్రచురణ. 1988.

167. శంకర రాజు, బడబాగ్ని, **వానచూపు(కవిత్వం)**, పీలేరు: బి.యస్.ఆర్ ప్రచురణలు. 2004.

168. శివశంకర్.పాపినేని, **సాహిత్యం మౌలిక భావనలు**, గుంటూరు, పాపినేని ప్రచురణలు. 1996.

169. శ్రీనివాస రెడ్డి.పి.ఎల్. **శ్వేదాశ్రువులు(వచన కవిత్వం)** అనంతపురం.పండువెన్నెల ప్రచురణలు. 2004.

170. శ్రీరాములు.వై, **జలగండం(దీర్ఘకవిత),** అనంతపురం: ఆనంద్ మల్టికలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ ప్రచురణ. 2004.

171. శ్రీరాములు.వై, **ఆకాశం అంతరించదు(దీర్ఘకవిత)**, అనంతపురం: శ్రీ ప్రచురణలు. 2006.

172. శ్రీరాములు.వై, **విస్ఫోటనం నుండి విధ్వంసం దాకా(దీర్ఘకవిత)**, అనంతపురం: శ్రీ ప్రచురణలు. 2009.

173. శ్రీరాములు.వై, **చేయిచాచిన వెన్నెల(దీర్ఘకవిత)**, అనంతపురం: శ్రీ ప్రచురణలు. 2005.

174. శ్రీరాములు.వై, **మూడు ఎడారులు ఏడుసముద్రాలు ఒకే ఒక్క అనంతపురం(కవిత్వం)** అనంతపురం: శ్రీ ప్రచురణలు. 2006.

175. శ్రీరాములు.వై, **బహుముఖ వర్షం(దీర్ఘకవిత)**, హైదరాబాదు: కౌండిన్య ప్రచురణలు. 2014.

176. శ్రీరాములు.వై, **నెమలీక సీతాకోక చిలుక(దీర్ఘకవిత్వం)** హైదరాబాదు: కౌండిన్య ప్రచురణలు. 2013.

177. శ్రీరాములు.వై, **రాయలసీమలో వాన తెలంగాణ(దీర్ఘకవిత)** ,అనంతపురం:శ్రీ ప్రచురణలు. 2007.

178. శైలజామిత్ర. **మనోనేత్రం(కవితాసంపుటి)**, సికింద్రాబాదు: విశ్వసాహితి అనుబంధ ప్రచురణ. 1999.

179. శైలజామిత్ర. **శంఖారావం(కవిత్వం),** సికింద్రాబాదు: విశ్వసాహితి అనుబంధ ప్రచురణ. 1997.

180. శైలజామిత్ర. **రాతిచిగుళ్ళు(కవితాసంపుటి)**, హైదరాబాదు: ఓంసాయి గ్రాఫిక్స్. 2013.

181. శైలజామిత్ర. **అగ్నిపూలు(మినీ కవితలు),** మచిలీపట్నం: సాహితీ మిత్రులు ప్రచురణ. 2011.

182. షమీఉల్లా.ఎస్, **సూర్యోదయానంతరం(కవిత్వం)**, అనంతపురం: షీమా ప్రచురణలు. 2011.

183. స్వరూప్ కృష్ణ, **ఇప్పుడోనది కావాలి(కవిత్వం)**, జమ్మలమడుగు: కళాభారతి ప్రచురణ. 2004.

184. **సామాజిక నిర్మితి, వివాదాలు & విధానాలు**, హైదరాబాదు: తెలుగు ఆకాడమి ప్రచురణ. 2016.

185. **సీమ కవిత(కవితా సంకలనం)**, ప్రొద్దుటూరు: మిత్రజ్యోతి ప్రచురణలు. 2001.

186. సుబ్రహ్మణ్యశర్మ.గొల్లాపిన్ని, **కవితాసుమాలు(కవిత్వం)**, చౌడేపల్లి: విజయవాణి ప్రింటర్స్ ప్రచురణ. 2008.

187. సుధాకర్.లోసారి, **మైనపు బొమ్మలు(కవిత్వం),** కడప: శ్రీచరణ్ పబ్లికేషన్స్. 2012.

188. సుబ్రహ్మణ్యం.జింకా, **జాగ్రత్తండోఓయ్ జాగ్రత్త(కవిత్వం)**, ప్రొద్దుటూరు: శ్రీనాథ కావ్యపబ్లికేషన్స్. 2013.

189. సుబ్రహ్మణ్యం.జింకా, **సాగించు నీ పయనం(కవితా సంపుటి)** ప్రొద్దుటూరు: శ్రీనాథ కావ్యపబ్లికేషన్స్. 1998.

190. సుజాతారెడ్డి, ముదిగంటి(సంపా), **ముద్దెర(అస్తిత్వ వ్యాసాలు)** హైదరాబాద్: రోహణమ్ పబ్లికేషన్స్, 2005.

191. సుందర్రాజు.నాగప్పగారి, **చండాలచాటింపు(దళితకవిత్వం)** కర్నూలు: సాహితీ స్రవంతి ప్రచురణ,2018.

192. సూర్యసాగర్.బి, **ధనస్సు(కవితలసంపుటి),** ఆంధ్రప్రదేశ్: జనసాహితి ప్రచురణ. 2005.

193. హరినాథ రెడ్డి.అప్పిరెడ్డి, **శ్రీసాధన పత్రిక(సీమ సాహితీస్వరం)** అనంతపురం:జెన్నె మాణిక్యమ్మ పబ్లికేషన్స్. 2014.

194. హనుమంతరావు.బి.యస్.ఎల్, **ఆంధ్రుల చరిత్ర**, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురణ.2012.

195. హుస్సేన్ సత్యాగ్ని.షేక్, **సత్యాగ్ని గీతాలు**, కడప: ఫాతిమా పబ్లికేషన్స్. 2007.

196. హెచ్చార్కె, **వానలో కొబ్బరి చెట్టు(కవిత్వం)**, హైదరాబాద్: పాలపిట్ట బుక్స్ ప్రచురణ.2011.

197. హెచ్చార్కె, **ఒక్కొక్క రాత్రి(కవిత్వం),** హైదరాబాద్: స్వంత ప్రచురణ. 1996.

**నిఘంటువులు:**

1. బ్రౌణ్య ఇంగ్లీషు – తెలుగు నిఘంటువు.విజయవాడ. విక్టరీ పబ్లికేషన్స్.2005

2. ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు డిక్షనరి

**పత్రికలు:**

1. ఆంధ్రజ్యోతి

2. ఆంధ్రభూమి

3. పెన్నేరు(పక్షపత్రిక)

4. నెమలీక (సాహిత్య మాసపత్రిక)

**అంతర్జాలం:**

www.teluguthesis.com

www.shodganga.com

www.wikipedia.com

# ప్రచురణ పొందిన పరిశోధనా వ్యాసాలు

# ఆంధ్రభారతి

# ANDHRA BHARATHI

## వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వైభవం

అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

2 & 3 ఏప్రియల్ 2018

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో

A SPECIAL ISSUE ON "THE GLORY AND POMP OF ONE THOUSAND YEARS OLD TELUGU LITERATURE

NATIONAL SEMINAR RESEARCH PAPERS HELD ON 2, 3 APRIL 2018.



తెలుగు విభాగం

యస్.వి.కె.పి. & డా॥ కె.యస్. రాజు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల

Recognised by UGC as "College with Potential for Excellence"     Accredited by NAAC with Grade "A"

పెనుగొండ - 534 320. ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్

Scanned with CamScanner

# ఆంధ్రభారతి

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు జరిగిన సందర్భంగా ప్రచురించిన

## ప్రత్యేక సంచిక

**2 & 3 తేదీలు, ఏప్రియల్ 2018**

Volume - III


గౌరవ సంపాదకులు

**డా॥ నడింపల్లి సూర్యనారాయణరాజు, పిహెచ్.డి.,**

ప్రిన్సిపాల్ & ఛైర్మన్

ప్రధాన సంపాదకులు

**డా॥ రంకిరెడ్డి రామోహనరావు, ఎం.ఏ. పిహెచ్.డి.,**

రీడరు & తెలుగుశాఖాధ్యక్షులు

సంపాదకులు

**డా॥ కె.వి.యన్.డి.వరప్రసాద్, ఎం.ఏ. పిహెచ్.డి.,**

సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం



**తెలుగు విభాగం**

**యస్.వి.కె.పి. & డా॥ కె.యస్.రాజు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల**

College with Potential for Excellence *** Accredited by NAAC with 'A' grade

పెనుగొండ - 534 320, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.



Scanned with CamScanner

# విషయ సూచిక


1. మహాకావ్య నిర్మాణ రచయిత్రి "మొల్ల" - ఆచార్య గోగినేని యోగప్రభావతీదేవి 1-4
2. ఆంధ్రప్రశస్తి - వేంగి క్షేత్రము - డా॥ తలారి వాసు 5-8
3. తెలుగులో జాతీయోద్యమ సాహిత్యం - మారాటి నర్సింహులు 9-14
4. సి.నా.రె. తెలుగు సినీ సాహిత్యవైశిష్ట్యం - డా॥ ముచ్చర్ల రాజ్యలక్ష్మి 15-18
5. సహృదయ సాంగత్యం హర్షణీయం - డా॥ దొంతరాజు లక్ష్మీనరసమ్మ 19-21
6. తెలుగు సాహిత్యాభివృద్ధికి విదేశీ తెలుగు సంస్థల కృషి - డా॥ పొందరి లక్ష్మణరావు 22-25
7. తెలుగుకథ పరిణామం - డా॥ కె.వి. శాంత కుమారి 26-29
8. శ్రీ అద్దంకి కేశవరావుగారి "తథాగతీయ" సమావలోకనము(సంపూర్ణ గౌతమబుద్ధ చరితము) - డా॥ లంక వేంకట సుబ్రహ్మణ్యేశ్వర శర్మ 30-35
9. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య చరిత్ర-చాటువులు - యం. వేణుగోపాల్ శర్మ 36-40
10. పాల్కురికి సోమన - దేశికవిత - డా॥ కొత్తిరెడ్డి మల్లారెడ్డి 41-43
11. తెలుగు నవలాసాహిత్యం-మానవతావిలువలు- ఒక పరిశీలన- డా॥ అల్లంశెట్టి నాగజ్యోతి 44-47
12. సినారె బాల్యం - సాహిత్యం - డా॥ మట్టా సంపత్కుమార్‌రెడ్డి 48-51
13. పోతన భాగవతం - సూక్ష్మ పరిశీలన - శ్రీమతి ఎమ్.ఎన్.వి. సూర్యకుమారి 52-56
14. రాష్ట్రేతర ప్రాంతాలలో తెలుగు వెలుగులు - పూషడపు సుబ్బారావు 57-61
15. ముక్తా మణి "సామాజిక స్పృహ" - డా॥ టి. మాల కొండయ్య 62-65
16. పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న జీవితం - రచనలు - కటుకం శారద 66-68
17. గురజాడ - రావుతరాయ్‌ల కవిత్వం తులనాత్మక పరిశీలన- డా॥ దార్లపూడి శివరామకృష్ణ 69-72
18. అద్వైత పోతన - తాతా శ్రీనివాస రమా సత్య సందీప శర్మ 73-77
19. శ్రీశ్రీ మహాప్రస్థానం - ఒక పరిశీలన - శిష్ట్లు పి.బి.వి. సత్యరాజేష్ 78-81
20. 'విముక్తి' బుర్రకథలో వినూత్న పోకడలు - బి.హెచ్.వి. రమాదేవి 82-86
21. తెలుగు సాహిత్యం-పశ్చిగోదావరి జిల్లా రచయిత్రుల సేవ (20వ శతాబ్ది ఆధారంగా) - ఉషారాణి బత్రాజు 87-60
22. తెలుగు సాహిత్యంలో సాహిత్య అకాడెమి పాత్ర - సి. శ్రీనివాస్ 91-95
23. ద్రావిడ భాషలలో నాటకావిర్భావం - ఎ.వి.వి.కె. చైతన్య 96-99
24. సంగీత కళకు ప్రాణం పోసిన శంకరాభరణం - పి. శివకుమార్ 100-102
25. కథాసాహిత్యాభివృద్ధిలో ఆచార్య కొలకలూరి ఇనాక్ పాత్ర - రావి శ్రీనివాసులు రెడ్డి 103-108
26. రాయలసీమ వచన కవిత్వం - ప్రాంతీయ అస్తిత్వం - జి.నాగేష్‌బాబు 109-114
27. 21వ శతాబ్ది తెలుగు కథ - ఒక పరిశీలన - రామరాజు మాధవీలత 115-119
28. బంజారాల సీత్లా పండుగ విశిష్టత - డా॥ పాన్‌గోత్ భగ్గు 120-124
29. తెలుగు సాహిత్యం - ప్రక్రియలు - చేబ్రోలు జఖరయ్య 125-130
30. కాళికాంబాసప్తశతి - ఒకపరిశీలన - సిద్ధాంతపు ప్రభాకరాచార్యులు 131-136
31. అమెరికా ఎమరీ యూనివర్శిటీలో తెలుగు సాహిత్యపీఠం - భానోత్ రమేష్ 137-139


Scanned with CamScanner

32. ప్రపంచీకరణ కథ-స్త్రీ - డా॥ యు. ఝాన్సీ 140-144
33. తెలుగు సాహిత్యానికి కొత్త పునాదులు వేసిన కత్తి పద్మారావు రచనల పరిచయం
- డా॥ అంబటి స్యామ్ సుందరరావు 145-150
34. ప్రకృతి కవి జయరాజు "వసంతగీతం" - రామారావు గంజికుంట్ల 151-155
35. కల్లూరి వెంకటనారాయణరావుగారి ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహము
-ఒక అధ్యయనం - గవ్వల బాలచంద్ర 156-159
36. గురజాడ అప్పారావు కన్యాశుల్కం మానవ సంబంధాలు - డి.వెంకట రమణ 160-164
37. కాలువ మల్లయ్య గారి అస్పృశ్య కోయిల - దళిత మహిళాచైతన్యం
- డా॥ ఓరుగంటి సరస్వతి 165-239
38. పోరాట దృక్పథ స్త్రీకి ప్రతీక - కాటిచిలుక - శ్రీమతి పెంట విజయలక్ష్మి 169-172
39. పాండురంగ మహత్యము-పశుపక్ష్యాదుల భక్తిరసం - డి. రాజమనోహర్ 173-177
40. ఆధునిక సాహిత్యంలో కవిరాజు హేతువాద దృక్పథం - డా॥ పులవర్తి శ్రీనివాసరావు 178-184
41. తెలుగు సాహిత్యపు అడుగుజాడ - గురజాడ - పెద్దోజు నరేష్ 185-187
42. हिन्दी में अष्टछाप कवि-तेलुगु में अष्ट दिग्गज कवि-A.Murali Krishna 188-191
43. तेलुगु साहित्ये इतर साहित्यानां प्रभावः - यम्.ज्योत्स्ना 192-196
44. वेदान्तवाक्यानां प्रभावः आन्ध्रभाषासाहित्ये (ब्रह्मर्षि उमरालीषा कृत
ब्रह्मविद्याविलासमनुश्रुत्य) - डॉ. पि. सुनीता देवी 197-200
45. तेलुगु के सुप्रसिद्ध रचनाकार - डॉ. एन. गोपि - डॉ. एच. रमादेवि 201-204
46. तेलुगु के प्रथम ऐतिहासिक नाटक - डॉ. कविराजू 205-208
47. दलित - विमर्श और तेलुगु नाटक - डॉ. के. नागेश्वर राव 209-212
48. हिन्दी साहित्य पर तेलुगु का प्रभाव - डॉ. के. श्रीलता 213-218
49. आन्ध्रभाषायामुपरि संस्कृत साहित्य प्रभावः
- Dr. K.V.R.B. Vara Lakshmi 219-222
50. दक्खिनी (हिन्दी) भाषा पर तेलुगु भाषा का प्रभाव - डॉ. वेल्पुल मोहनराव 223-224
51. हिन्दी-तेलुगु साहित्य में वैष्णव चरित काव्य एवं तुलना- Dr. CHARLA MRUDULA 225-228
52. वेईपडगलु (सहस्रफण) : एक विवेचन - के.वेंकट सुरेशबाबु 229-230

ISBN : 978-93-5300-753-9

# 26. రాయలసీమ వచన కవిత్వం - ప్రాంతీయ అస్తిత్వం

జి. నాగేష్‌బాబు
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
సెల్ నం. 97030 93351
Email : gknagababu786@gmail.com

తెలుగు సాహిత్యంలో కవిత్వానికి విశిష్టమైన ప్రాధాన్యం ఉంది. నన్నయ కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు సాహిత్యాన్ని గమనిస్తే కవిత్వానికున్న ప్రాధాన్యతను మనం గమనించవచ్చు. కవిత్వం నేటి సమకాలీన కాలంలో కొత్తపుంతలు తొక్కుతూ వివిధ రూపాల్లో వికాసం చెందుతూ తన స్థానాన్ని పదిలపర్చుకొంది.

**ప్రాంతీయ అస్తిత్వం - కవిత్వం :** తెలుగు సాహిత్యంలో ప్రాంతీయ అస్తిత్వవాదం మొదట కవిత్వంతోనే రూపుదిద్దుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా, రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాలలో కోస్తాంధ్ర ప్రాంతం తప్ప మిగిలిన ప్రాంతాలు నిర్లక్ష్యానికి, వివక్షకూ లోనయ్యాయి. వీటిలో రాయలసీమ తర్వాత తెలంగాణ ప్రాంతం మరింత అన్యాయానికి గురైనది. ప్రాంతీయ అస్తిత్వ కవిత్వం ఒక ఉద్యమస్ఫూర్తితో తెలంగాణ ప్రాంతం నుండి వెలువడింది. ప్రాంతీయ కవిత్వమంటే తెలంగాణ కవిత్వమనే భావన ఏర్పడి, ఇతర ప్రాంతాల అస్తిత్వాలకు ఆదర్శప్రాయంగా తెలంగాణ కవిత్వం నిలిచింది.

సామాజిక అణచివేతకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలు ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాయి. కాలంతోపాటు సమాజం, సమాజంతోపాటు సాహిత్యం మార్పుకు లోనవుతూ నూతన దృక్పథాన్ని అందిస్తాయి. నేడు ప్రాంతీయ అస్తిత్వ దృక్పథంతో కవిత్వం విస్తృతంగా వెలువడుతోంది.

**రాయలసీమ వచన కవిత్వం :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాయలసీమ ప్రాంతానికి విశిష్టమైన సాహిత్య చరిత్ర, సంస్కృతులు ఉన్నాయి. ప్రాచీన కాలం నుండి నేటికాలం వరకు ఈ ప్రాంతంలో సాహిత్యం విరివిగా వెలువడింది. సీమలో అనేకమంది ప్రాచీన, ఆధునిక కవులకు నిలయం. కట్టమంచి రామలింగారెడ్డిగారి 1900 సంవత్సరంలో వెలువడిన ముసలమ్మ మరణం ఆధునిక కావ్యంతో మొదలుకొని ఖండకావ్యాలు, పద్య, గేయ కావ్యాలు, అవధాన కవిత్వం, వచన కావ్యాలు వెలువడ్డాయి. 1980 దశకం నుండి రాయలసీమలో వచన కవిత్వాన్ని విస్తృతంగా కవులు, రచయితలు రాస్తున్నారు. తమ ప్రాంత సమస్యలపట్ల హక్కులు, నిధులు, నీళ్ళు లాంటి అంశాలపై రచయితలు, కవులు ప్రతిస్పందిస్తున్నారు. నేటికాలంలో రాయలసీమకు రావలసిన వాటా ఇతర అంశాలపై మేధావి వర్గం, విద్యార్థి లోకం చర్చలు, ఉద్యమాలను చేపడతున్నారు. రాయలసీమ వచన కవిత్వంలో ప్రతిఫలించే ప్రాంతీయ అస్తిత్వ కవిత్వాన్ని తెల్పడమే ఈ పరిశోధనా వ్యాస ప్రధాన ఉద్దేశం.



Scanned with CamScanner

ISBN : 978-93-5300-753-9

గోపిని కరుణాకర్ 'పొద్దున్నే వచ్చిన వాన' అనే కవితలో ఇలా అంటాడు-

"సేద్యం జూదమై పోయిందిరా / మీ అమ్మ మెడలోని తాళిబొట్టు
పసుపు కొమ్మయింది. / నీ చెల్లెలి చెవుల్లోని కమ్మలు
జొన్నబెండులైనాయి. / నీ తమ్ముడు బడిమాని
బట్టీలో కాలే ఇటుకైపాయ / నువ్వేమో హోటల్లో ఎంగిలి కంచమైపోతివి
దేశానికి పట్టెడన్నం పెట్టిన మీ తాత / తుంట బీడీలు అడుక్కుంటా
బస్టాండులో బిచ్చగాడైపాయ / అన్నింటిని ఒడ్డి
నేను జూదంలో ఓడిన ధర్మరాజునైపోతిని"[1]

అంటూ వ్యవసాయాన్ని నమ్ముకుని జీవనం చేసే రైతు కుటుంబం గూర్చి కవి చిత్రించాడు. రాయలసీమలో అధిక శాతం మంది ప్రజలు వ్యవసాయం చేస్తారు. ఈ వ్యవసాయం అంతా వర్షాధారితమే. సరైన సమయంలో వర్షాలు కురవక, రైతులకు పంటలు చేతికి అందకుండా, పెట్టుబడులు గిట్టకా రుణగ్రస్తులుగా మారిపోతున్నారు. ఇలా సేద్యాన్ని నమ్ముకుని చిద్రమైన రైతు కుటుంబాన్ని కవి చిత్రించాడు.

జూపల్లి ప్రేంచంద్ వచన కవిత్వాన్ని విస్తృతంగా రాస్తున్న కవి. 'కదాకు' అనే కవితలో-

"తీగ చెనిక్కాయ అనిరి / ఏస్తిమి / గుత్తి చనిక్కాయ అనిరి
ఏస్తిమి / తినేకి తిండిగింజలే కరువాయ/ సజ్జలు యాటికి బోయనో
కొర్రలు, సాములు, జొన్నలు యాటికి బోయనో / రాగి సంకటి కతే మర్సిపోతిమి"[2]

అంటూ రైతులు పండించే పంటలలో ఆహారపంటలు అదృశ్యమవుతున్న తీరును వ్యక్తం చేస్తున్నాడు. వేరుశెనగ పంట, రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు లాంటి తిండి గింజలను పండించే రైతులు ఎక్కడున్నారు. ఈ పంటలను రైతులు మరచిపోయే స్థితికి చేరుకున్నారని కవి వేదన. 'కసాయి కరువు' అనే కవితలో-

"నేలంతా పెనుమాకట్లా కాల్తాంది / నాలుగంటే నాలుగు చినుకులు రాల్లేదంటా
దిక్కులకు మొక్కితిమి, గంగజాతర జేస్తిమి / యాగాల్జేస్తే వర్సాలు కురిసేటట్లుంటే
సీమలో పల్లెకొగ ఇంద్రసేనారెడ్డి పుట్టకరాదా / మంత్రాలకు సింతకాయలు రాల్తాయా
యగ్నాలకు వానచినుకులు కురుస్తాయా / అంతా ఉత్తదని తేలిపాయ"[3]

అని సీమలో వర్షాల కోసం చేసే యగ్నాలు, పూజల గూర్చి కవి వ్యంగ్యంగా చిత్రించాడు. సీమలో ఎన్ని గంగజాతరలు చేసినా, దిక్కులకు మొక్కినా, యగ్నాలు చేసినా వర్షాలు రావని, ఇది కరువు ప్రాంతమనే అభిప్రాయాన్ని తెల్పుతున్నాడు. ఇదే కవితలో కరువు ప్రభావంవల్ల పశువులను రైతులు అమ్ముకుంటున్న దృశ్యాన్ని చెబుతూ-

"పసల బాధ సూడ్లాక / కాటి కంపుతాండాం / కసాయి కటికోళ్లు
కాళ్లు ఇరగ్గొట్టి / లారీల్లో కుక్కి / నగరాలకు తోలకపోతాంటే



Scanned with CamScanner

ISBN : 978-93-5300-753-9

తల్లిపేగు తెగినట్ల / మా కడుపుల్లో కల్లోలం / కండ్లల్లో సుడులు
నెత్తిమీద ఎండ / ఎర్రటి నిప్పులు చెరుగుతాంటే / రోడ్డు మీద లారీలు ఎల్లబారె
తలమీంద తువ్వాలు / కండ్లకు అడ్డంబడె"[4]

అని కరువు ప్రభావం వల్ల రైతులు తమ పశువులను కళేబాలకు అమ్ముకుంటున్నారు. పశువులకు సరైన మేత దొరక్క వాటిని రైతులు మేపుకోలేక కసాయి వాళ్ళకు పశువులను అమ్ముతున్నారు. వ్యవసాయం చేసే పశువులను అన్నదాతలు అమ్ముకున్నపుడు వారి దీనావస్థను చిత్రించాడు కవి.

బద్వేలి రమేశ్ 'కాకి రెక్కంత కరిమబ్బు కోసం' కవితలో–

"నోరాడించే మేత లేక / మాంసంగా మారే మూగజీవులు
మట్టిలో మెలకువ లేక / తూకమౌతున్న పంట విత్తనాలు
పల్లెలో బతుకు దారిలేక / వలసలైన నేలని నమ్మినవాళ్ళు
జవాబు దొరకని కరువు ఊరేగింపులో / భాగమైన రైతు జనాలు
ఎడారి పల్లెకి ఎప్పటిలా / మారని కరువు దృశ్యాలు"[5]

అని సీమలో రైతుల వలసపోతున్న దృశ్యాన్ని చిత్రించాడు. నేడు సీమలో చాలామంది రైతులు, ప్రజలు కరువు ప్రభావంతో ఉపాధి కోసం వలసలు పోతున్నారు.

గుత్తా హరిసర్వోత్తమనాయుడు 'స్వర్ణాంధ్రకు శవమెత్తు సంతకం' కవితలో–

"నాగేటిచాళ్లల్లో / తీగై సాగాల్సిన నేలబిడ్డ
పగిలిన బీళ్ళల్లో / ఎండిన మొక్కై విరుగుతున్నాడు
నీడనిస్తుందని / నీళ్ళుపోసి పెంచిన చెట్టే
వాడికి ఉరికంబమౌతున్నది / చీడకు విరుగుడనుకున్న
మోనోక్రోటోఫాస్ / పుడమి పుత్రునే మింగే / మిత్తవుతున్నది"[6]

అని సీమలోని రైతుల ఆత్మహత్యలను వారి విషాద దృశ్యాన్ని చిత్రించాడు. చాలామంది రైతులు అప్పుల బారిన పడి, అవి తీర్చలేక, వ్యవసాయం చేయలేక, సమస్యల సుడిగుండంలో పడి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

మల్లెల నరసింహమూర్తి 'బతుకు దిగులు బావి' కవితలో ఇలా అంటాడు–

"సందకాడయితానే సారాయికి సెవిపీకినట్లే / రెండు సినికులు రాల్తానే సేద్యం సేసి
సెనిక్కాయ పంట పెట్టే యసనం మాది / యా పొద్దూ యిత్తనాల కెల్లలా
పసలకు మేతకాలా / అట్ల మెరిసి ఇట్ల మాయమైపొయ్యే
మెరగడపూలు సీమలో సినుకులు / నీల్లులేని సేద్యం ధర్మరాజు జూదం ఒక్కటే
నిష్కారణంగా దుడ్లు ఏట్లో పోసొచ్చినట్లాయ / నిరుడు ఇట్లే పోయిన్నిరుడూ ఇట్లే
ఈసారి ఇంగా అద్దుమానం / సేతి కందింది నోటి కందకపాయ
ఏటేట ఏటి కెదురీతే"[7]

అని వేరుశెనగ పండించే రైతు జీవన వ్యథల్ని చిత్రించాడు. అనంతపురం జిల్లాలో వేరుశెనగ ప్రధాన పంట. రైతులు ప్రతి సంవత్సరం వేరుశెనగ విత్తనాలు వేయడం, పంట పండించడం,



Scanned with CamScanner

ISBN : 978-93-5300-753-9

చివరకు వర్షాలు రాక నష్టపోవటం ఇలా జరుగుతూనే ఉంటుంది. కవి అనంతపురం రైతు మాట్లాడే యాసలో వ్యక్తీకరించాడు.

జి.వెంకటకృష్ణ రైతు సమస్యలను, సీమ సంస్కృతిని తన కవిత్వంలో వ్యక్తం చేస్తున్నాడు. 'ఎన్నో ప్రశ్నలు- ఎంత విషాదం' కవితలో-

"అగ్ర నటనాయకుల / పోస్టర్లకు అతుక్కున్న / గతమా మా అభిమాన మానసం
ఆ నటవారసుల / కటౌట్లకు గొర్రెతలల హారాలై / మా వారసులు వేలాడుతున్న
వర్తమాన కళారసాభాస / చిత్రచలన విషాద తెరాట / సినిమాల కెక్కిన
యీ సీమ పౌరుషాలు / దృశ్యం దృశ్యం రాక్షసాలు / హీరో తొడలకొట్టే బాదిశే
గొంతుకోస్తే అరిస్తే / సౌండ్ ఎఫెక్ట్‌లో బాక్సాఫీసు బిడ్డలు
విలన్లు పలికిన యాసలో / మా సంస్కృతంతా వెకిలివేషాలు"[10]

అని సీమ ఫాక్షనిజాన్ని ఆధారం చేసుకొని సినిమా తీస్తున్న దృశ్యాన్ని చిత్రించాడు. సీమ సంస్కృతిని, ఇక్కడి జీవితాలను సినిమాలుగా తీయడం, హీరోలు తొడలు కొట్టడం, అభిమానులు హీరోలను పూజిస్తూ సినిమా విడుదల సమయంలో జంతుబలులు చేయడం లాంటి దృశ్యాలను కవిత్వీకరించాడు.

ఆకుల రఘురామయ్య 'పచ్చంగుండాలి ఆకులలా' అనే కవితలో-

"ఓట్లు తప్ప / నాట్లు తెలియని
పాలకుల దుర్విధాన సేద్యం / చేస్తోంది కనబడని కత్తిగాట్లు
రాజకీయ వ్యూహాల్లో / అధికారం ఒడిసి పట్టాలన్న తహతహ తప్ప
సేద్యానికి గౌరవస్థాయి కల్పించి / సాగుదారును స్థిమితపరిచే
అజెండా కానరాకపోవడం హృదయశల్యమే / ఎర్రకోట పైకెక్కి
మాటలు మోళిక్కించే నేతాగణం / అవసరమైన సాయం చేయడంలో శూన్యహస్తో"

అంటూ నేటి రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు చేస్తున్న అవకాశవాద రాజకీయాలను కవి ఎండగడుతున్నాడు.

రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ప్రాపంచిక దృక్పథంతో కవిత్వం రాస్తున్న కవి. 'పుట్టుమచ్చ' కవితలో-

"మాకు జీవితమంటే / హత్యకూ హత్యకూ మధ్య విరామమే
జీవనయాన మంటే / మరణం నుంచి మరణానికి ప్రయాణమే
మాకు / బతకడమంటే
చావును వాయిదా వేసుకోవడమే / పౌరుషమంటే / తాళిబొట్లు తెంచడమే"

అని సీమ ఫాక్షనిజాన్ని, ముఠాకక్షలు, హత్యారాజకీయాలను చెబుతున్నాడు. అలాగే,

"మేము బతకడమంటే / నిత్యం ఎదుటివాని చావు కోసం
నిరీక్షిస్తూ కూచోవడమేనా / నీటికీ కూటికీ
నిత్యం చేసే సమరంలో / టీవీ బాంబుల్ని కారు బాంబుల్ని
రేసు గుర్రాలుగా చేసుకొంటాం"[11]



Scanned with CamScanner

 ISBN : 978-93-5300-753-9

అని సీమలో జరిగే బాంబు దాడులు, హత్యలు, వర్గ కక్ష్యలు వీటివల్లనే మేము బతుకుతున్నామంటూ సీమ ముఠా నాయకుల అజ్ఞానాన్ని కవి వ్యక్తం చేస్తున్నాడు.

వి.చంద్రశేఖరశాస్త్రి 'సీమాంతర నేపథ్యం' కవితలో–

"హంద్రీ-నీవా నీళ్లను రాబట్టలేని కంత్రీలను / గాలేరు-నగరిని గాలి కొదిలేసిన గాడిదలను

వాటర్‌షెడ్లను విజయవంతం చేయలేని వాజమ్మలను / ఎప్పుడు నిలదీస్తాపు?"[12]

అంటూ కవి సీమలోని రాజకీయ నాయకులు, ప్రభుత్వాల వైఫల్యాలలను ఎత్తి చూపుతున్నాడు. సీమ వ్యవసాయానికి, ప్రజల దాహార్తిని తీర్చే హంద్రీ-నీవా, గాలేరు-నగరి లాంటి కాలువల నిర్మాణం ఆగిపోయిన సందర్భంలో ప్రభుత్వాలను నిలదీయాల్సిన అవసరం ఉందని కవిలీ్వకరించాడు.

యక్కలూరి శ్రీరాములు 'జలగండం' అనే దీర్ఘ కవితలో ఇలా అంటాడు–

"నాన్నా! / నీళ్ళు కావాలని చేతులు చాచితే

మా చేతుల్లో / రంగు రంగుల జెండాలు

ఉచితంగా ఉంచుతారు. / తెల్లచొక్కా తొడిగి

చేతిలో జెండా నాటుతాడొకడు / పసుపుచొక్కా తొడిగి

నెత్తిమీద జెండా ఎత్తుతాడొకడు / ఎర్రచొక్కా తొడిగి

గుండెలో సూటిగా జెండా గుచ్చుతాడొకడు / కాషాయ చొక్కా తొడిగి

కసాయి కంటె దారుణంగా / నిన్ను నిలువునా తగలేస్తాడొకడు

అన్ని జెండాలు చేతపట్టి / అన్ని అంగీలు తొడిగి

అదును కోసం వెతుకుతుంటాడొకడు"[13]

అంటూ సీమ ప్రాంతంలోని అన్ని రాజకీయ పార్టీలపై కవితాస్త్రాన్ని సంధించాడు. సీమలో రాజకీయ పార్టీలు, నాయకులు, ప్రభుత్వాలు చేసే అవకాశవాద రాజకీయాలు, ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించడంలో గల వైఫల్యాలను కవి ఎండగడుతున్నాడు.

జి.వెంకటకృష్ణ 'దున్నేకొద్దీ దుఃఖం' కవితలో ఇలా చెప్తాడు–

"నాగలి పట్టి నాలుగు తరాలుగా దున్నుతున్నకొద్దీ / పొద్దుకు చేరని బతుకు

వురితాడు పేనిన పత్తిపంట / పురుగు మందు తాపిన వుల్లిగడ్డ

బతుకులా బజారున పొలైన / రేటు పలకని టమోటా

గొంతు బిగించిన / వూడలు దిగని వేరుశెనగ

బోరులో పడ్డ బాల్యంలా / వుక్కిరి బిక్కిరి చేసి చంపుతున్నది / సేద్యం బతుకు"[14]

అని సీమ ప్రాంతంలోని పంటలు పండే రైతుల దీన వ్యథల్ని, గాథలను చెబుతున్నాడు. రైతులు ఏ పంటలు పండినా సరైన గిట్టుబాటు ధరలు లభించక, పెట్టుబడులు రాక, అప్పుల్లో కూరుకుపోయి నిత్యం సమస్యలతో సతమతమవుతున్న దృశ్యాలను మనం రాయలసీమ ప్రాంతంలో చూడవచ్చు. ప్రభుత్వాలు పరిష్కార మార్గాలు అన్వేషించి సీమ రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

రాయలసీమ ప్రాంతంలోని కరువు, రైతు సమస్యలు, ఆత్మహత్యలు, కులవృత్తులు, స్త్రీ, దళిత సమస్యలు, సామ్రాజ్యవాదం, తీవ్రవాదం, గ్లోబలైజేషన్, ఫాక్షనిజం, రాజకీయ నాయకులు,



Scanned with CamScanner

ISBN : 978-93-5300-753-9

ప్రభుత్వాల వైఫల్యాలు లాంటి అంశాలపై కవులు, రచయితలు కవిత్వం రాశారు. తమ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలపై ఆదరణ చూపిస్తూ వచన కవిత్వాన్ని సుసంపన్నం చేశారు.

**పాదసూచికలు:**

(1) సీమకవిత (కవితా సంకలనం)
(2) నిచ్చెనమెట్ల లోలకం (కవిత్వం), పుట 57
(3) నిచ్చెనమెట్ల లోలకం (కవిత్వం), పుట 71
(4) నిచ్చెనమెట్ల లోలకం (కవిత్వం), పుటలు 67, 68
(5) అనంత కవిత, పుటలు 44, 45
(6) అనంత కవిత, పుట 64
(7) అనంత కవిత, పుటలు 106, 107
(8) హంద్రీగానం (దీర్ఘ కవిత), పుటలు 35, 36
(9) అనంత కవితా స్వరాలు, పుట 46
(10) రెండు ప్రపంచాలు (కవిత్వం), పుట 6
(11) రెండు ప్రపంచాలు (కవిత్వం), పుట 7
(12) ఒక కత్తుల వంతెన (కవిత్వం), పుట 115
(13) జలగండం (దీర్ఘ కావ్యం), పుట 24
(14) దున్నేకొద్దీ దుఃఖం (కవిత్వం), పుట 26

**ఆధార గ్రంథాలు**


(1) చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం, రెండు ప్రపంచాలు (కవిత్వం), హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2012
(2) వెంకటకృష్ణ, జి. హంద్రీగానం (వచన కావ్యం), కర్నూలు: స్ఫూర్తి ప్రచురణలు, 2015
(3) వెంకటకృష్ణ, జి. దున్నేకొద్ది దుఃఖం (కవిత్వం), కర్నూలు: స్ఫూర్తి ప్రచురణలు, 2005
(4) చంద్రశేఖర శాస్త్రి, వి. ఒక కత్తుల వంతెన (కవిత్వం), అనంతపురం: వసంత ప్రచురణలు, 2008
(5) ప్రేంచంద్, జూపల్లి (సం.పా). అనంత కవిత (కవితా సంకలనం), అనంతపురము: జిల్లా సాంస్కృతిక మండలి ప్రచురణ, 2012
(6) ప్రేంచంద్, జూపల్లి. నిచ్చెనమెట్ల లోలకం (కవిత్వం), హైదరాబాద్: పాలపిట్ట బుక్స్, 2011
(7) శ్రీరాములు, యక్కలూరి, జలగండం (దీర్ఘ కావ్యం), అనంతపురం: ఆనంద్ మల్టికలర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, 2004
(8) నరసింహమూర్తి, మల్లెల. కుమారస్వామి, పిళ్ళా (సం.పా), అనంత కవితాస్వరాలు (కవిత్వం), అనంతపురం: సాహితీ స్రవంతి, 2015
(9) మిత్రజ్యోతి, సీమ కవిత (కవితా సంకలనం), ప్రొద్దుటూరు: మిత్రజ్యోతి ప్రచురణలు, 2001

సి.ఐ.ఐ.యల్ వారి జాతీయ సదస్సు

# వివిధ భాషా సాహిత్యాలు - సాంస్కృతిక పరివర్తన

## భావ వీణ ప్రత్యేక సంచిక

అంతర్జాతీయ తెలుగు సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక భాషాధ్యయన మాస పత్రిక

Vol. 13 ISSUE NO. 8 MONTHLY AUG 2017

ISSN NO. : 2456 - 4702




Scanned with CamScanner

# వివిధ భాషా సాహిత్యాలు సాంస్కృతిక పరివర్తన

## భావ వీణ ప్రత్యేక సంచిక

గౌరవ సంపాదకులు :

**రెవ.బ్రదర్ టి. బాలశౌరి**

ప్రిన్సిపాల్ :

వి.యస్. సెయింట్ జాన్స్ మాధ్యమిక ఉన్నత పాఠశాల, గన్నవరం

**డా॥ గుమ్మా సాంబశివరావు,**

వైస్ ప్రిన్సిపాల్, ఆంధ్రలయోలా కళాశాల, విజయవాడ

**డా॥ కొడాలి రాజేశ్వరి,**

అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్, వి.కె.ఆర్. కళాశాల, గన్నవరం

ప్రధాన సంపాదకులు :

**టి.వి. రమణ మూర్తి, కంకట సుబ్బారావు**

**డా॥ పి.వి.బి. సంజీవరావు**

సంపాదక మండలి :

**డా॥ యన్.వి. కృష్ణారావు**
**డా॥ఏ.వి. రమణ మూర్తి**
**డా॥ టి. సత్యనారాయణ**
**శ్రీ గొడవర్తి గోవిందయ్య**
**డా॥ బి. వెంకట స్వామి**
**డా॥ రూబి శశికళ**
**శ్రీ డి. శ్రీనివాసరావు**

సహాయ సంపాదకులు :

శ్రీ కె.యస్.యన్. రామానుజులు
శ్రీమతి డి. రమాదేవి, శ్రీమతి వాణి,
శ్రీమతి ఆది లక్ష్మీ, శ్రీమతి రోజ్‌మేరి గోల్డ్,
శ్రీ ఎ.తిరుపతి రెడ్డి, శ్రీ పివియన్ కిషోర్
శ్రీ మతి విజయ కుమారి,
శ్రీమతి సుమలత

తెలుగు ఉపాధ్యాయులు, వి.యస్. సెయింట్ జాన్స్ మాధ్యమికోన్నత, పాఠశాల

Scanned with CamScanner

# రాయలసీమ వచన కవిత్వం - సామాజిక పరివర్తన

జి.నాగేష్‌బాబు
పరిశోధక విద్యార్థి, తెలుగుశాఖ,
హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం,
సెల్.నం.97030 93351
Email : gknagababu786@gmail.com

సాహిత్యం సామాజిక జీవితానికి ప్రతిబింబం. సమాజానికి సాహిత్యానికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. సమాజంలో మార్పులు వచ్చినప్పుడల్లా సాహిత్యంలో మార్పులు వస్తాయి. సమాజానికి సాహిత్యం ప్రతినిధి వంటిది. ఒక కాలంలో ఉండే సామాజిక వ్యవస్థను ఆ కాలంలో వచ్చే సాహిత్యం ప్రతిబింబిస్తుంది. సమాజంలో జరిగే విభిన్న సంఘటనలను, మార్పులను గమనిస్తూ కవులు, రచయితలు ప్రతిస్పందిస్తారు. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యపరుస్తూ సమాజాన్ని మేల్కొల్పుతారు. సాహిత్యం ప్రజల ఆలోచనలను బహిర్గతం చేస్తూ ప్రజలను ఉద్యమబాట పట్టిస్తుంది.

## తెలుగు కవిత్వం - సామాజికత

తెలుగు సాహిత్యంలో ఆధునిక కవిత్వానికి విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. సమాజంలో సంభవించే ఏ మార్పు అయినా, సాహిత్యంలో వచ్చే ఏ వాదమైనా, ధోరణి అయినా ముందుగా కవిత్వంలో ప్రతిఫలిస్తుంది. సాహిత్యంలో మిగతా ప్రక్రియల కన్నా కవిత్వం శక్తిమంతమైన పాత్ర పోషిస్తుంది. కవులు, రచయితలు తాము నివసిస్తున్న సామాజిక వాతావరణంలో తమ చుట్టూ జరుగుతున్న సంఘటనలపట్ల, విషయాల పట్ల సామాజిక స్పృహను కలిగి ఉంటూ తమ రచనల్ని సమాజానికి అందిస్తారు. తెలుగు సాహిత్యంలో నాటి నుండి నేటి వరకు ఎన్నో విభిన్నమైన సామాజికాంశాలు చోటు చేసుకున్నాయి. "సమాజాన్ని గురించి చెప్పడమే సామాజికత. ప్రతి వ్యక్తీ ఎప్పుడూ, తనలో తాను జీవిస్తూ, సమాజంతో సన్నికర్ష పొందుతూ ఉంటాడు. వ్యక్తి సమాజాన్ని ప్రభావితం చేస్తాడు. సమాజం వ్యక్తికి కావలసిన విధంగా తయారు చేస్తుంది."[1] అందువల్ల సమాజం ఎప్పుడూ నిత్యం పరిణామశీలంగా ఉంటుంది. సామాజికతలోని అంశాలు కూడా నిరంతరం మార్పుకు లోనవుతూ సాహిత్యాన్ని ప్రభావితం చేస్తాయి.

## రాయలసీమ వచన కవిత్వం - సామాజిక పరివర్తన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి దక్షిణాన ఉన్న రాయలసీమ ప్రాంతానికి విశిష్టమైన సాహిత్య చరిత్ర, సంస్కృతులు ఉన్నాయి. పూర్వం 'దత్తమండలాలు'గా పిలువబడిన ఈ ప్రాంతం 1928 నాటికి 'రాయలసీమ'గా పేరు పొందింది. ప్రాచీన సాహిత్యం నుంచి నేటి ఆధునిక సాహిత్యం వరకు ఈ ప్రాంతం అనేక మంది కవులకు, రచయితలకు నిలయంగా ఉంది. చారిత్రకంగా ఈ ప్రాంతం పేరు ప్రఖ్యాతులు పొందినప్పటికీ, భౌగోళికంగా రాయలసీమ కరువు ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ ప్రాంతంలో తరచుగా కరువులు సంభవించడంతో విభిన్న సామాజికాంశాలు కనిపిస్తాయి. రాజకీయంగాను, ఆర్థికంగానూ, సామాజిక, సాంస్కృతిక రంగాలలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందవలసి ఉంది.

తెలుగు సాహిత్యానికి ఈ రాయలసీమ తనదైన పాత్రను పోషించింది. ప్రబంధాలు, శతకాలు, ఖండ, గేయ, ఆధ్యాత్మిక కావ్యాలు, అవధాన కవిత్వం, కథ, నవల, నాటకం, విమర్శ, జానపదం లాంటి ప్రక్రియలెన్నో వెలసిల్లాయి. 1970-80 దశకాల మధ్య వచన కవిత్వం కూడా విస్తృతంగా వెలువడుతోంది. రాయలసీమలోని విభిన్నమైన సామాజికాంశాలను ప్రస్తావించాల్సిన ఆవశ్యకత ఉంది. కరువు, ఆకలి, పేదరికమూ, కరువు వల్ల ఎండిపోయిన పొలాలు, చెరువులు, రైతుల ఆత్మహత్యలు, ప్రజల వలసలు, ఫ్యాక్షన్ హత్యలు, ముఠాలు, వర్గాల దోపిడీలు, ప్రపంచీకరణ ప్రభావం, రాజకీయ నాయకులు, ప్రభుత్వ సేవల వైఫల్యాలు, చేనేత కార్మికుల అవస్థలు, ఇంకిపోతున్న బోర్లు, బావులు, దళిత, స్త్రీ సమస్యలు లాంటి ఎన్నో అంశాలు ఈ ప్రాంతంలో కనబడతాయి.

రాయలసీమ కవులు ఈ ప్రాంతంలోని సమస్యల మీద కవిత్వం రాస్తూ అక్షరయుద్ధం చేస్తున్నారు. ఈ ప్రాంత కవులు కవిత్వం రాసినా, కథ, నవల, నాటకం రాసినా ప్రధానంగా కరువుకు సంబంధించిన సమస్యలనే ప్రస్తావిస్తుంటారు. రాయలసీమ ప్రాంతంలోని ప్రజలను కరువు ఎలా చిన్నాభిన్నం చేస్తుందో గమనించవచ్చు.

వేంపల్లి అబ్దుల్ ఖాదర్ 'ఎన్ని వొగాదులొచ్చినా' అనే కవితలో ఇలా అంటున్నాడు-

"సెనిక్కాయ్ సేద్దిం చేస్తి
మోటబాయిలో నీళ్ళున్నా
ఈ అడపాదడపా కరెంటుతో సొగం ఎండిపాయ
సొగంలో సొగం అగ్గి తెగులు నాకేస్తే
మిగిలిందేమో ఎలకల పాలైపాయ
ఉన్నోన్నీ లేనోన్నీ ఒకటి చెయ్యాలని

సట్టమొగటి పెట్రి
ఆ లెక్కన సీలింగులో బూమొచ్చు
సదునూ సదునూ చేస్తి
ఆరిద్దల కారితి అదునులో ఇత్తన మేసినా
ఆ సట్టు సవిట్నేల్లో ఏసిన గింజ
ఒగటైనా మొలకెత్తలా!
కొండ న్యాలిక్కి మొందేస్తే
ఉండే న్యాలికే ఊడిపాయ!
అడ్డంగా పణుకుంటి అడ్డమైనోడి కాళ్ళూ పడితి
సివర్కి సబ్సిడి మింద లోనచ్చు
'త్యేనె దీసెటోడు సెయ్యి నాకడా' అంద్రి
యాడ బొయ్యేది ఆడ కారిపోగా
పారుడు రోగంతో గోవు మాలచ్చి ఇంటికొచ్చ
ఒచ్చిన్రోజు తిరక్కనే కట్టుగుంజకు పగ్గం మిగల"[2]
కవి సీమ మాండలికంలో వ్యక్తపరిచిన కవిత ఇది. వేరుశెనగ పండించే రైతు జీవనవ్యధను, ప్రభుత్వ పథకాల వల్ల లబ్ది పొంది నష్టపోయిన ఒక రైతు ఆవేదనను యాసలో చిత్రించిన దృశ్యం కనపడుతుంది.
గోపిని కరుణాకర్ 'పొద్దున్నే వచ్చిన వాన' కవితలో చెబుతూ-
"సేద్దం జూదమై పోయిందిరా
మీ అమ్మ మెడలోని తాళిబొట్టు
పసుపు కొమ్మయింది
నీ చెల్లెలి చెవుల్లోని కమ్మలు జొన్నబెండులైనాయి
నీ తమ్ముడు బడి మాని
బట్టీలో కాలే ఇటికైపాయ
నువ్వేమో హొటల్లో ఎంగిలి కంచమైపోతివి
దేశానికి పట్టెడన్నం పెట్టిన మీ తాత
తుంటబీడీలు అడుక్కుంటా
బస్టాండులో బిచ్చగాడైపాయ
అన్నింటిని ఒడ్డి
నేను జూదంలో ఓడిన ధర్మరాజునై పోతిని"[3]
వ్యవసాయం చేసే రైతు కుటుంబ విషాద గాథ మనకు కనిపిస్తుంది. పంటలు పండించే సీమ రైతు ఆ పంటలు పండక, అప్పులు ఎక్కువై, తమకు ఉపాధి, తిండి లేక అప్పుల్లో కూరుకుపోయి కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమైన దృశ్యం కవి చిత్రించాడు. సీమలో ఇలాంటి కష్టాలను రైతులెందరో అనుభవిస్తున్నారు.
జూపల్లి ప్రేంచంద్ 'కొయ్యకాళ్ళు చిగిర్చేదాకా' కవితలో ఇలా అంటున్నాడు.
"నిజమే
మేము అపరిశుభ్రలం
మీ మురికి మూటలు మోసీ మోసీ గాడిదలమయ్యాం
మురికి వీధులు వాడలు ఊడ్చీ ఊడ్చీ చండాలుమయ్యాం
మీ సకల కళ్మలాన్నీ శుభ్రం చేసీ చేసీ అంటరానితనాన్ని సీటికుండగా మోస్తున్నాం
మా చమట చుక్కలతో తడచిన మీ పొలాలు పుష్పించి ఫలించాయే!
మీ పాదసేవకై మా చర్మాలను ఒలిచి మీ పాదాలను అలంకరించామే"[4]
అంటూ దళితుల జీవనం, వారి కులసమస్యను చిత్రించాడు. ఈ సమాజంలో దళితులను అంటరాని జాతులుగా వెలివేసి, వారిని బానిసలుగా చూసి, వారిచేత వెట్టిచాకిరి చేయించుకున్న అగ్రకుల విష సంస్కృతిని కవి ప్రశ్నిస్తున్నాడు.
టి.రాజారాం 'అతడే' దీర్ఘ కావ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కులవృత్తులతో జీవనోపాధిని పొందేవారి జీవిత గాథల్ని చిత్రించారు.
"మన పాదాలకు అద్భుత అందాల్ని
ఆవిష్కరించే అతడి స్వీయ ప్రతిభ
ప్రపంచీకరణ సమ్మెట దెబ్బకు
వొంగి పోయిన మేకు అయ్యింది
ఆధునికా పాదుకా ప్రపంచంలో
అతడికి అతడే వొక మూలనపడ్డ పనిముట్టు"[5]
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచీకరణ ప్రభావం వల్ల పల్లె నుంచి పట్నాల దాకా ఫుట్‌వేర్ షాపులు వచ్చి, చెప్పులు కుట్టేవారు తమ ఉపాధిని కోల్పోవలసి వచ్చిందని కవి చిత్రణ.
జూపల్లి ప్రేంచంద్ 'కదాకు' అనే కవితలో ఈ విధంగా చెబుతున్నాడు-
"తీగ చెనిక్కాయ అనిరి
ఏస్తిమి
గుత్తి చెనిక్కాయ అనిరి
ఏస్తిమి
తినేకి తిండిగింజలే కరువాయ
సజ్జలు యాటికి బోయనో
కొర్రలు, సాములు, జొన్నలు యాటికి బాయనో
రాగి సంగటి కతే మర్సిపోతిమి"[6]
ఈనాడు చాలా గ్రామాల్లో చిరుధాన్యాలను పండించే వారు కరువై పోయారు. పూర్వం మనం చిన్నప్పుడు జొన్న, సజ్జ రొట్టెలు, రాగిముద్దలు, కొర్ర అన్నం తినేవాళ్ళం. ఇప్పుడు వీటిని తినేవారు ఎవరు? కవి సమాజం ఎలా పరిణామం చెంది మనుషులు తినే ఆహారం ఏవిధంగా మరచిపోతున్నారో చిత్రించాడు.
వేంపల్లి అబ్దుల్ ఖాదర్ 'గోడలు లేవు ఈ జైలుకు' అనే కవితలో-
"కులాల కుళ్ళూ చిచ్చుల రొచ్చు
కారుణ్యం లేని
కక్షలూ కనికరం లేని శిక్షలు



Scanned with CamScanner

కసిబట్టిన క్రౌర్యం మూర్తీభవించే మూర్ఖత్వం
పొంచి చూచే నాటు బాంబులు
ఎఱ్ఱగా మాట్లాడే వేట కొడవళ్ళు
ఎగిరిపడే తలకాయలు
ఒరిగిపోయే మొండాలు
తరాల తరబడి కుళ్ళిన
నాగరికత నుంచి
ఎక్కడిదీ పాడు కంపు?
నెర్రలు చీలిన సీమ బృహద్ధమని భిత్తి మీద
ఏమిటీ చిత్రవర్ణ విధ్వంస రచన?"[7]

రాయలసీమలో ఫ్యాక్షన్, పగ, ప్రతీకారాలు అంటూ దాడులు చేస్తూ మనుషులను చంపే విష సంస్కృతిని కవి ప్రశ్నిస్తున్నాడు. సీమలో ఫ్యాక్షన్ ముసుగులో గొడవలు చేస్తూ, శత్రువుల మీద పగ, ప్రతీకారాలు పెంచుకుంటూ నరుక్కోవడం, బాంబుదాడులు, ముఠా, వర్గ దాడులు చేయడం, తరతరాల కుటుంబంలోని వారసులకు అది వ్యాపించడం లాంటి ఎన్నో సంఘటనలను చూస్తున్నాం. ఈ సీమలో ఫ్యాక్షన్ సంస్కృతి నశించాలని కవి ఆవేదన.

నందవరం కేశవరెడ్డి 'రుచులెరక్కనే' కవితలో ఇలా చెబుతున్నాడు-

"మట్టి సేండ్లో
గంపెడు పాడేస్తాండామా
దాని మొగాన ముంతెడు
గంజు పోస్తాండామా
గంజు పాడా యాట్నుంచొస్తాయ్
యా సేద్యగాని గాట పాట్నన్నా
కాడెద్దున్నాయా
వో పాడెనుము కాలబడిందా
యెద్దుల్లాకపాయ యెనుముల్లాకపాయ
ఆవుల్లాకపాయ దూడల్లాకపాయ
అట్లాంటప్పుడు
సేను మొగానికి
ప్యాడెక్కడిది గంజెక్కడిది
కాలం మారిందో
ల్యాక మనమే కాలాన్ని మార్చినామో?"[8]

అని సేద్యం చేసే రైతు జీవనాన్ని తెల్పుతున్నాడు. ఒకప్పుడు పొలాల్లోకి పశువుల ఎరువును తోలి పంటలు పండేవారు. నేడు ఎద్దులు, ఆవులు, దూడలు, ఎనుములు అన్నీ మేత లేక అమ్ముకోవాల్సి వచ్చింది. సేంద్రీయ ఎరువులు వాడే రైతులు తక్కువ అయినారు. కాలం ఎంత మార్పు వచ్చిందో అని కవి సంశయిస్తున్న దృశ్యంపై కవిత.

కెరె జగదీష్ 'మేఘాల సాక్షిగా' కవితలో చెబుతూ-

"ఇప్పుడు నా సీమలో
అన్నదాత ప్రశ్నార్థకమవుతున్నాడు
వ్యవసాయ వ్యసనానికి బానిసై
రుణాల ముళ్ళబాటలో
మహాప్రస్థానం సాగిస్తూ
కరువు రగిలించిన చితిమంటను
ఉన్మాదంతో కౌగిలించుకుంటున్నాడు?"[9]

అంటూ సీమలో రైతులు సేద్యంలో పంటలు పండక, అప్పులపాలై, కరువు వల్ల జీవనం గడవక ఆత్మహత్యలు చేసుకునే విషాద దృశ్యాలను కవి చిత్రించాడు.

జి.వెంకటకృష్ణ 'ఎన్నో ప్రశ్నలు - ఎంతో విషాదం' కవితలో-

"ఆ నటవారసుల
కటౌట్లకు గొర్రెతలల హారాలె
మా వారసులు వేలాడుతున్న
వర్తమాన కళారసాభాస
చిత్రచలన విషాద తెరాట
సినిమాల కెక్కిన
యీ సీమ పౌరుషాలు
దృశ్యం దృశ్యం రాక్షసాలు
హీరో తొడల కొట్టి బాదితే
గొంతు కొద్ద అరిస్తే
సౌండ్ ఎఫెక్ట్‌లో బాక్సాఫీసు బద్దలు
విలన్లు పలికిన యాసలో
మా సంస్కృతంతా వెకిలి వేషాలు"[10]

రాయలసీమ ఫ్యాక్షన్ కుటుంబాల మీద సినిమా తీసిన సందర్భాలను కవి గుర్తు చేస్తున్నాడు. సినిమాలు, హీరోలు మీద పిచ్చి అభిమానం పెంచుకుని అభిమానులు సినిమా విడుదల సమయాల్లో జంతు బలులు ఇవ్వడం మనం చూస్తున్నాం. అలాగే సీమ భాష, యాస, సంస్కృతిని సీమ ఫ్యాక్షన్ కుటుంబాల జీవితాలను, సినిమాగా తెర కెక్కించి ఇక్కడి సంస్కృతిని వెక్కిరించిన దృశ్యాన్ని కవి చిత్రించాడు.

'కపిలె బాన' కవితలో ఇలా అంటాడు-

"పొద్దు పొడిచింది మొదలు కాలం
బారెడెక్కెదాకా
నాగరికతలకు జీవజలాలను తోడి తోడి
పోసిన బాన తిత్తి
దాన్ని లాగే ఎద్దుల పెద్దల
ఒలిచిన తోలుతో చేసిన నీటి తిత్తి
కిర్రు కిర్రుమను గిలక గొంతుతో
గిలకను కాడిని కలిపే మోకు వూగుతో
కాడిని మోసే గిత్తల నడకతో
కపిల పాటలై అది వేసిన దరువూ
నెలలు నిండిని గర్భిణిలా
అది మోసిన బరువూ
ప్రసవమైన ప్రతిసారీ ఆనందాల
గలగల శ్రావ్యమై

కాలువల వెంబడి కేరింతలు ప్రవాహమై
పెరిగిన పచ్చని పైర్లను చేసెను"[11]

అంటూ కవి సీమలో కపిల తోలే విధానాన్ని సహజంగా స్వభావోక్తికంగా వర్ణించాడు. కపిలను తోలేటప్పుడు ఆ శ్రమ కనపడకుండా కపిల పాటలు పాడటం, కపిలను స్త్రీ సౌందర్యంతో పోలుస్తూ, సీమ జీవన సంస్కృతిలో భాగమైన కపిలను వర్ణించిన దృశ్యం ఇది.

రాధేయ 'సౌందర్య రాహిత్యం' కవితలో ఇలా చెబుతున్నాడు-

"నేనెక్కడికి వచ్చాను
నేనెక్కడున్నాను
ఒంటెద్దుల బండి లోంచి
నగరం నాగరికతలోకి దొర్లిపోయాక
నేను నా ఊరికే పరదేశినయ్యానా?
నా ఊరే నాకు పరాయిదై పోయిందా?
ఇప్పటికీ!
నా శ్వాస నా పల్లెది
నా ప్రాణం మాత్రం పట్నంది"[12]

అంటూ కవి నేటి సమాజంలో మనుషులు గ్రామాలను వదిలి పట్టణాలకు వలస పోయినవారిని గూర్చి చెప్పిన కవిత ఇది. బ్రతుకు తెరువు కోసం పల్లెలను వదిలి పట్టణాలకు రావడం వల్ల పల్లెలు తమ సంస్కృతినీ, కళలు, అందాలను కోల్పోతున్నాయి.

కెంగార మోహన్ 'రోలు... రోకలి... రోబో....' అనే కవితలో చెప్తూ-

"షడ్రుచులనిచ్చే రోలు
పాతాళంలో ఇల్లు కట్టుకున్నది
రుబ్బిన కొద్దీ రుచీ
మాయా మిక్సీ
ఎన్ని చేసినా, ఎంత తిప్పినా
రవ్వంత సంతృప్తి లేదిపుడు
దంపుడు బియ్యం బువ్వ
జొన్న సంగటి దెబ్బ
కొర్రగంజి
అనుభూతుల అనుమస్తిష్కంలోంచి
నిష్క్రమించలేదు.
అన్నమైనా, పప్పూ పచ్చడైనా
రోబో చేసే రోజొచ్చింది
ఆయువు క్షీణిస్తేనేం
ఆకలి తీరితే చాలు"[13]

ఆధునిక విజ్ఞానం పెరగడం వల్ల మనిషి కూడా యంత్రమవుతున్నాడు. మిక్సీలు, గ్రైండర్స్, కుక్కర్స్ లాంటి పరికరాలు రావడంవల్ల రోలు, రోకళ్ళు లాంటి పాత సామగ్రిని మూలన పడవేసే పరిస్థితి వచ్చింది. 'కంచంలోని బువ్వ' కవితలో-

"పొలంగట్ల సింగారం
అదృశ్యమైంది
అమ్మలక్కల పనిపాటలు
పాడె గట్టాయి
పల్లె పనుల్ని యంత్రాలు
మింగేశాయి.
కలుపు తీయడం
కోత కోయడం
కుప్పనూర్చడం యంత్రమే"[14]

అధునాతన యంత్రాలు రావడం వల్ల పల్లెల్లో కూలీలకు పని లేకుండా పోయింది. వ్యవసాయ పనిలో ప్రతి పనిని యంత్రమే చేసే పరిస్థితి వచ్చింది.

టి.హెచ్.నటరాజన్ 'పాడైపోయిన గూడు' కవితలో తన ఊరి జ్ఞాపకాలను ఇలా చెబుతున్నాడు-

"సంగటిముద్దా చింతచిగురు వాసన కొట్టే
మా వూరి పొలిమేర్రాయి
చిన్నప్పటి నా జ్ఞాపకాల కలికితురాయి
మిట్ట మధ్యాన్నం కాడ ఆవుల గంగప్ప
సద్ది 'చిక్కం' విప్పేదక్కడే
'మావిటింతల' కాడ గుట్టదిగే ఆవు గిట్టలకు
పాలపిట్టలు నేపథ్య స్వరాలు కూర్చేదక్కడే
కనుచూపు మేర కాలి నడకన
ఇస్కూలు కెల్లబారే చెప్పుల్లేని కాళ్ళు
'ముగ్రాల్ల దొంతి'కి చూపుల్నంటే కళ్ళ వాడిసెళ్ళు
చేతుల్లోని పుస్తకాలకు
చెమటంట కూడదని ప్రయాసలు
మా ఊరి జ్ఞాపకాలు
బాల్యం తేనెపట్టు నుండి రాలే తేనెబొట్లు"[15]

అంటూ కవి తన ఊరు, చిన్ననాటి జ్ఞాపకాలు, తన ఊరి అందాలు ఇలా ప్రతిఒక్క అంశాన్ని సహజ సుందరంగా కవిత్వీకరించాడు.

బద్వేలి రమేష్ 'కాకిరెక్కంత కరిమబ్బు కోసం' కవితలో-

"నోరాడించే మేత లేక
మాంసంగా మారే మూగజీవులు
మట్టిలో మెలకువ లేక
తూక మౌతున్న పంట విత్తనాలు
పల్లెలో బతుకు దారిలేక
వలసలైన నేలని నమ్మిన వాళ్ళు
జవాబు దొరకని కరువు ఊరేగింపులో
భాగమైన రైతు జనాలు
ఎడారి పల్లెకి ఎప్పటిలా



Scanned with CamScanner

మారని కరువు దృశ్యాలు[16]
అంటూ సీమలో ప్రజానికాన్ని, వ్యవసాయాన్ని కరువు ఎలా నాశనం చేస్తుందో కవి చిత్రించాడు. రైతులు, పశువులు, పల్లెటూళ్ళు, పొలాలు, తోటలు ఇలా అన్నీ కరువుబారిన పడవలసిందే.

యక్కలూరి శ్రీరాములు 'మూడు ఎడారులు ఏడు సముద్రాలు ఒకే ఒక్క అనంతపురం' కవితలో ఇలా అంటున్నాడు-

"ఎన్ని ఎడారులైనా ఏడు సముద్రాలైనా
ఒకే ఒక్క అనంతపురాన్ని చూసి సిగ్గుతో చిన్నబోతు
తలదించుకుంటాయ్.
ఆకాశంలో నీటిచుక్క కూడ వుండదు
పాతాళంలో కూడ తేమ ఆచూకీ దొరకదు
ఇక్కడ నీటి బిందువే అన్ని సమస్యల సింధువుల
మూలకారణ కేంద్రబిందువు[17]

అంటూ సీమలో అనంతపురం జిల్లా ప్రతి ఏటా కరువుకు గురౌతున్న విషయాన్ని చిత్రించాడు. జిల్లాలో వ్యవసాయ రంగానికి, తాగునీటికి కాలువల ద్వారా నీటి సదుపాయాన్ని కల్పించాల్సిన ప్రభుత్వాలు ఘోరంగా విఫలమౌతున్నాయి. రాజకీయ నాయకులు, ప్రభుత్వాలు అన్నీ కలిసి జిల్లా రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెట్టి వేస్తున్నాయి.

రాయలసీమ కవిత్వంలో కవులు విభిన్న సామాజిక, సాంస్కృతిక అంశాలను కవితా వస్తువులుగా స్వీకరించి రాయలసీమ ప్రజల గుండె చప్పుళ్ళను కవిత్వీకరించి అక్షరబద్ధం చేశారు. తరతరాలుగా ప్రకృతి వైపరీత్యాలతో పోరాటం చేస్తూ, తమ ఆత్మాభిమానాన్ని ఈ సీమ రైతులు నిలుపుకుంటున్నారు. కవులు, రచయితలు, మేధావులు, విమర్శకులు తమకు రావలసిన హక్కులు, నీటి వాటాలను, సీమ మౌలిక వసతుల గురించి ఉద్యమాలు, చర్చలు, సమావేశాలు నిర్వహిస్తూ ఈ సమీ ప్రజానీకాన్ని చైతన్యవంతం చేస్తున్నారు. రాజకీయ నాయకులు, అధికార పార్టీలు సీమ కోసం చేయవలసిన కృషి, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలలో వారు తీసుకురావలసిన సామాజిక పరివర్తనను కవులు, రచయితలు ఆశిస్తున్నారు.

పాదసూచికలు

(1) ఆధునిక కవిత్వంలో సామాజికత, మోనోగ్రాఫ్, పుట 14
(2) కిరణం, కవితాసంపుటి, పుటలు 42, 43
(3) సీమ కవిత, కవితా సంపుటి, పుటలు 50, 51
(4) అవేద, కవిత్వం, పుట 101
(5) అతడే, పుట 36
(6) నిచ్చెనమెట్ల లోలకం, కవిత్వం, పుట 57
(7) కిరణం, కవిత్వం, పుట 47
(8) కామాలే, కవిత్వం, పుటలు 44, 45
(9) సముద్రమంత గాయం, కవిత్వం, పుట 131
(10)హంద్రీగానం, కవిత్వం, పుటలు 35, 36
(11)లోగొంతుక, కవిత్వం, పుటలు 17, 18
(12)అవిశ్రాంతం, కవిత్వం, పుటలు 32, 33
(13)విన్యాసం, కవిత్వం, పుట 93
(14)పైదే, పుట 27
(15)అనంత కవితా సంకలనం 79, 80
(16)పైదే, పుటలు 44, 45
(17)పైదే, పుటలు 76, 77


ఆధార గ్రంథాలు

(1) రామమోహనరావు, అద్దేపల్లి. ఆధునిక కవిత్వంలో సామాజికత (మోనోగ్రాఫ్), హైదరాబాదు : తెలుగు అకాడమి, 2012.
(2) అబ్దుల్ ఖాదర్, వేంపల్లి. కిరణం (కవితా సంపుటి), హైదరాబాద్ : జయంతి పబ్లికేషన్స్, 2014.
(3) మిత్రజ్యోతి, సీమ కవిత (కవితా సంకలనం), ప్రొద్దుటూరు : మిత్రజ్యోతి ప్రచురణలు, 2001.
(4) ప్రేంచంద్, జూపల్లి. అవేద (కవిత్వం), అనంతపురం : వాయిస్ దళిత అధ్యయన వేదిక, 1999.
(5) ప్రేంచంద్, జూపల్లి. (సం.పా), అనంత కవిత (కవితా సంకలనం), అనంతపురం : జిల్లా సాంస్కృతిక మండలి ప్రచురణ, 2012.
(6) ప్రేంచంద్, జూపల్లి. నిచ్చెనమెట్ల లోలకం (కవిత్వం), హైదరాబాద్ : పాలపిట్ట బుక్స్, 2011.
(7) వెంకట కృష్ణ, జి. లోగొంతుక (కవిత్వం), కర్నూలు : స్ఫూర్తి ప్రచురణలు, 2000.
(8) వెంకట కృష్ణ, జి. హంద్రీగానం (వచన కవిత్వం), కర్నూలు : స్ఫూర్తి ప్రచురణలు, 2010.
(9) కేశవరెడ్డి, నందవరం. కామాలే (కవిత్వం), తాడిపత్రి : విజయ్ ప్రచురణలు, 2009.
(10) రాజారాం, టి. అతడే (దీర్ఘ కావ్యం), అనంతపురం : సాహితీ స్రవంతి, 2006.
(11) రాధేయ. అవిశ్రాంతం (కవిత్వం), అనంతపురం : స్పందన అనంత కవుల వేదిక ప్రచురణ : 2009
(12) మోహన్, కెంగార. విన్యాసం (కవిత్వం), హైదరాబాద్ : ప్రజాశక్తి ప్రింటింగ్ ప్రెస్, 2012.
(13) జగదీష్, కెరె. సముద్రమంత గాయం (కవిత్వం), రాయదుర్గం, కెరె & కెరె కంప్యూటర్స్, 2011.




Scanned with CamScanner

# సదస్సులలో పొందిన ప్రశంసా పత్రాలు

# S.V.K.P. & Dr. K.S. RAJU Arts & Science College

Recognised by UGC as "College with Potential for Excellence" Accredited by NAAC with Grade "A"

Penugonda. W.G.Dist A.P.

## INTERNATIONAL SEMINAR

దేశభాషలందు తెలుగు లెస్స

## CERTIFICATE

This is to Certify that Prof. / Dr. /Mrs. / Mr ......జి. నాగేష్ బాబు...... has participated and presented the paper entitled ......రాయలసీమ వచన కవిత్వం - ప్రాంతీయ అస్తిత్వం...... in the International Seminar "The glory and pomp of one thousand years old telugu literature (వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య వైభవం) organised by Dept. of Telugu, S.V.K.P. & Dr. K.S. Raju Arts & Science College, Penugonda in collaboration with Adikavi Nannaya University, Rajamahendravaram. During 2nd & 3rd April. 2018.

| | | |
|---|---|---|
| Dr. K.V.N.D. Vara Prasad | Dr. R. Rama Mohana Rao | Dr. N. Suryanarayana Raju |
| Convener, International Seminar<br>Asst. Professor, Dept. of Telugu<br>Adikavi Nannaya University | Director, International Seminar<br>Reader & H.O.D. Telugu | Principal & Chairman<br>International Seminar |

सत्यमेव जयते

# Central Institute of Indian Languages

Ministry of Human Resource Development, Department of Higher Education, Mysore.

## Certificate

*This is to certify that ~~Prof./Dr~~/Mr./Ms.* G. Nagesh Babu *has participated / submitted research paper in the* **NATIONAL SEMINAR** *On "Importance of Cultural Change in Other Languages" held on, 5th & 6th of August 2017 at* V.K.R DEGREE COLLEGE, *Gannavaram (AP). During the seminar his / her performance and intellectuals are appreciable.*

*Principal*

PRINCIPAL (FAC)
V.K.R. COLLEGE, BUDDHAVARAM

*Dr. C.V. Sivarama Krishna*

*Head, Centre for Lexicography, Creative writing & Folklore*

*CIIL, Mysore*

# శ్రీ విరక్తిగవి మఠం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కళ్యాణదుర్గం - 515761

కళ్యాణ భారతి (తెలుగు శాఖ), అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్

యు.జి.సి. ఆర్థిక సహాయంతో స్పందన సహకారంతో

జాతీయ సదస్సు

## ఆధునిక తెలుగు కవిత్వంలో ప్రాంతీయ అస్తిత్వం

ఫిబ్రవరి 2,3, తేదీలు 2017

ఆచార్య / డాక్టర్ / శ్రీ / శ్రీమతి ......జి. నగేష్ బాబు, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయము. (పరిశోధక విద్యార్థి)...... గారు

......హైదరాబాదు.......... జిల్లా / కళాశాల / విశ్వవిద్యాలయం నుండి విచ్చేసి రెండు రోజులు

జాతీయ సదస్సు లో పాల్గొన్నారు / పాల్గొని ......రాయలసీమ ఆధునిక కవిత్వం - ప్రాంతీయ అస్తిత్వం......

అనే అంశం పై పరిశోధన పత్రాన్ని సమర్పించారు.

డాక్టర్ అంకే శ్రీనివాసులు
సదస్సు సంచాలకులు

యస్. నిర్మల
శ్రీమతి యస్. నిర్మల
కార్యక్రమాధ్యక్షులు

# తెలుగు & అనువాద అధ్యయన శాఖ

## ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం - 517 426

యు.జి.సి. జాతీయ సదస్సు

సమకాలీన తెలుగు సాహిత్యం - సమాలోచనం (2000-2015)

13, 14 ఫిబ్రవరి 2017

# ధ్రువీకరణ పత్రం

ఆచార్య/డా./శ్రీ/శ్రీమతి ......జి. నాగేష్ బాబు...... గారు

తెలుగు & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం వారు 13, 14 ఫిబ్రవరి 2017 తేదీలలో నిర్వహించిన "సమకాలీన తెలుగు సాహిత్యం-సమాలోచనం (2000-2015)" అనే యు.జి.సి. జాతీయ సదస్సులో పాల్గొని, ......... "సమకాలీన రాయలసీమ వచనకవిత్వం - ప్రాంతీయ స్పృహ" ......... అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు/అధ్యక్షత వహించారు.

డా॥ యస్. చిన్నరెడ్డయ్య
శాఖాధ్యక్షులు

డా॥ భూక్యా తిరుపతి
సదస్సు సంచాలకులు

Dr. B. THIRUPATHI
Asst. Professor
Department of Telugu Language & ...